
రామాయణం

# రామాయణ రహస్య రత్నావళి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul | Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)


http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

T.T.D. Religious Publications Series No. 1019
Price :

## గ్రంథకర్త పరిచయం




శ్రీమాన్ వంగీపురం యజమాన దీక్షిత రంగస్వామి అయ్యంగారు 1-10-1899 సం॥లో వికారినామసంవత్సరం - పెరటాశినెల - మఘానక్షత్రంలో తిరుచానూరులో జన్మించారు. వీరు సదాచారసంపన్నులు. శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయ ఆచార్యపురుషులు. ఆ గుడి యాజమాన్య దీక్షితులు. మిరాశి మణేగారు

వృత్తి రీత్యా ఉపాధ్యాయులు. బాల్యము నుండి క్రమశిక్షణతో పెరిగినవారు. ఉపాధ్యాయుడుగా, పిల్లలకు చదువు, సంస్కారము మరియు క్రమశిక్షణ గరపెడువారు. పరమవైష్ణవ భక్తులు శ్రీమద్ శ్రీరంగరామానుజ మహాదేశికుల (కోళియాలంస్వామివారి) ప్రియశిష్యులు. ఉపాధ్యాయుడుగా ఉన్నప్పుడు పిల్లలకు నైతికవిలువల గురించి వాటి ఆవశ్యకతను గురించి కథల రూపంలో వివరించి వారి మనసులలో చిరస్థాయిగా నిలిచినవారు. వీరి మాతృభాష తమిళం అయినప్పటికీ, తమిళ, తెలుగు, ఇంగ్లీషు భాషలలో అనేక గ్రంథములు రచియించిరి. వీరు పాకాల పట్టణంలో సుమారు 30 సం॥లు ఉపాధ్యాయుడుగా పనిచేసి 1955వ సం॥లో పదవీవిరమణ సల్పి స్వగ్రామమైన తిరుచానూరులో స్థిరపడినారు. అప్పటినుంచి సంసారజీవితము గడపినప్పటికిని ఒకయతిగా నిష్కామకర్మతో, సదా భగవధ్యానము చేయుచూ తన శేషజీవితమును రాగద్వేషముల కతీతముగా ఒక ఆదర్శప్రాయ గృహస్థునిగా జీవితమును గడపినవారు.

వీరు 18-12-1982వ సం॥లో కీర్తిశేషులైనారు. వారు రచించిన "రామాయణ రహస్య రత్నావళి" అను గ్రంథమును శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సహకారముతో 1984వ సం॥లో వారి కనిష్ఠకుమారుడైన శ్రీ వి.వరదరాజన్ గ్రంథరూపముగా ప్రచురించారు.

Published by Sri M.G. Gopal, I.A.S., Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

# రామాయణ రహస్య రత్నావళి

వంగీపురం రంగస్వామి అయ్యంగారు

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# రామాయణ రహస్య రత్నావళి


రచయిత

**వంగీపురం రంగస్వామి అయ్యంగారు**



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2013**

# RAMAYANA RAHASYA RATNAVALI

*By*

**Vangeepuram Ranga Swamy Ayyamgar**

*Editor-in-Chief*

**Prof. Ravva Sri Hari**

T.T.D. Religious Publication Series No:1019
© All Rights Reserved

*First Edition : 2013*

*Copies:*

*Published by :*
**M.G. GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Office of the Editor- in- Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
***Tirumala Tirupati Devasthanams Press,***
Tirupati.

# ముందుమాట

మానవులు అనుష్ఠించదగిన అఖిలధర్మాలకు వేదమే మూలం. అట్టి వేదముయొక్క ప్రతిరూపమే రామాయణం. రామాయణం భారతీయ వాఙ్మయంలో ఆదికావ్యంగా గణుతి గాంచింది. కర్త వాల్మీకి మహర్షి. ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పురుషార్థాలను సాధించే ఉపాయాలను మానవాళికి పరమరమణీయంగా ఈ గ్రంథం బోధించింది.

పాడుకోటానికి అనువైన సులభసుందరశైలిలో ఇరవై నాల్గువేలశ్లోకాలతో మహర్షి శ్రీరామచరితాన్ని రచించాడు. ఇది బాల, అయోధ్యాది సప్తకాండలతో విలసిల్లుతుంది. గిరులు, ఝురులు మహీతలంలో ఉన్నంతకాలమూ రామాయణగాథ మానవాళికి ఆదర్శప్రాయమై ప్రచారంలో ఉంటుంది. ధర్మవిగ్రహుడూ, మర్యాదా పురుషోత్తముడూ అయిన శ్రీరామచంద్రప్రభుని కల్యాణగుణాలను మానవులు అనుసరించి తరించుట కొఱకు మునిపుంగవుడు రామాయణంలోని పలుఘట్టాలను పలురీతుల మనోజ్ఞంగా వర్ణించాడు.

వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణమును అధికరించి శ్రీమాన్ వంగీపురం రంగస్వామి అయ్యంగారు రామాయణ రహస్య రత్నావళి అనే పేరుతో ఈ రచనను వెలయించారు. ఇందులో నారద వాల్మీకి సంవాదము, శ్రీమద్రామాయణమహిమ, శ్రీరామావతారతత్త్వము మొదలైన సుమారు ముప్పైశీర్షికల క్రింద చేసిన విమర్శ సహృదయ హృదయావర్జక మనడంలో సందేహం లేదు. లక్ష్మణ, భరత, సుమంత్ర, గుహుల గుణశీలముల సమీక్ష, విభీషణాగమనము, విభీషణ శరణాగతి శ్లాఘా పాత్రంగా సాగింది. దీర్ఘ శరణాగతి గ్రంథముగా పేరొందిన రామాయణంలోని పలు సన్నివేశాలిందులో పరామర్శించబడ్డాయి.

ధర్మప్రచారమునకు రామాయణ భారత భాగవతాది గ్రంథ ప్రచురణం ప్రధాన సాధనమని విశ్వసించిన తి.తి.దేవస్థానములు ఈ రామాయణ రహస్య రత్నావళిని స్వీయ ప్రచురణగా స్వీకరించి ప్రకటిస్తున్నది. పాఠకులు ఆదరిస్తారని మా విశ్వాసం.

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# విషయసూచిక


| | |
|---|---|
| నారద వాల్మీకి సంవాదము | 1 |
| శ్రీమద్రామాయణ మహిమ | 36 |
| మంగళ శ్లోకము | 45 |
| శ్రీ రామావతార తత్త్వము | 51 |
| రామచంద్రుని దృఢసంకల్పము | 67 |
| జాబాలి మత ఖండన | 71 |
| గురుకుల వాసము | 78 |
| ఉపదేశములు | 85 |
| శ్రీ సీతాకళ్యాణము | 94 |
| సుమంత్రుడు | 108 |
| అరాజదోషకము | 130 |
| యౌవరాజ్య పట్టాభిషేకము | 140 |
| భరతుని శపథములు | 149 |
| సౌభ్రాత్రము | 166 |
| చిత్రకూటయాత్ర | 177 |
| గుహభరత సమాగమము | 180 |
| భరద్వాజుని విందు | 191 |
| లక్ష్మణుని కోపోపశమనము | 197 |
| భగవత్పారతంత్ర్యము | 203 |
| రాజనీతి | 207 |
| భరతుని లోకోపకారము | 214 |
| శ్రీరామ సేవాసంపద | 215 |
| లక్ష్మణుని పౌరుషవాదము | 224 |

లక్ష్మణ శరణాగతి 229
సుమిత్ర లక్ష్మణుని దీవించుట 234
భరతుని రామభక్తి 243
సీత లక్ష్మణుని దూషించుట 248
లక్ష్మణుడు రాముని శాంతింపజేయుట 258
సుగ్రీవుని కాలయాపనము 270
రామలక్ష్మణులు నాగపాశబద్ధులగుట 287
ఇంద్రజిత్తుతో మొదటియుద్ధము 297
ఇంద్రజిత్తుతో రెండవయుద్ధము 300
విభీషణాగమనము 320
మంత్రాలోచన 328
శరణాగత రక్షణము 338
విభీషణ శరణాగతి 345
అభయ ప్రదానము 356

**శ్రీరస్తు**
**శ్రీసీతాలక్ష్మణ భరత శత్రుఘ్నహనుమత్సమేత**
**రామచంద్రపరబ్రహ్మణే నమః**

# రామాయణ రహస్య రత్నావళి

## 1. నారద వాల్మీకి సంవాదము

భర్తృహరి సుభాషితములలో నీతిశతకములోని మూర్ఖపద్ధతిలో నాదిశ్లోకము :-

**శ్లో॥ బోద్ధారో మత్సరగ్రస్తాః ప్రభవస్స్మయదూషితాః ।**
**అబోధోవహతాశ్చాన్యే జీర్ణమంగే సుభాషితమ్ ॥**

మంచిమాటలు చెప్ప శక్తులగువారు అసూయాగ్రస్తులగుట చేతను, రాజులు గర్వాంధులుగ ఉండుటచేతను, సామాన్యజనులు సద్బోధలేనివారగుటయు, సద్విషయము విద్వాంసుల శరీరముననే వారితో నశించిపోవుటయు సంభవించును. ఇందువలన బోధింప నర్హులగువారు సామాన్యులకు తామె బోధించుట ధర్మమనియు, వారొకవేళ ధర్మము తప్పినను, ప్రభువులు కట్టుదిట్టములు చేసి వారి మూలమున ప్రజలకు హితబోధ లభించుటకు తోడ్పడవలెననియు, సద్విషయము లెల్లప్పుడు వ్యాపించుచుండవలెననియు ఏర్పడుచున్నది. కావుననే బ్రహ్మదేవుడు శ్రీరామచరితమును తాను వ్రాసి తన లోకంబున వ్యాపింపజేసి నారదాదుల కుపదేశించి నారదోపదేశమున వాల్మీకిచే ఈ లోకమునను మానసపుత్రుడగు నారదుని ఆచార్యునిగను, బ్రహ్మనిష్ఠాపరుండగు వాల్మీకిని శిష్యునిగను నిర్ణయించిన బ్రహ్మ శ్రీమద్రామాయణ ప్రభావంబెట్టిదని తలంచియుండునో!

శిష్యు డాచార్యుని వెదకుచుపోయి చిరకాల మతని కుచితరీతి శుశ్రూషాదులొనర్చి యతని కరుణాకటాక్షమునకు పాత్రుడయి యతని వలన విద్య గడించుట లోకన్యాయమై యుండ శిష్యుని ఆచార్యుడు వెదకి కొనివచ్చుట చోద్యముగ నున్నది. సామాన్యులగు గురుశిష్యులపట్ల యియ్యది యసంభవము కాని అద్వితీయులగు నారద వాల్మీకుల విషయమున అట్లగునా? ఇది యసాధారణ ధర్మము. బ్రహ్మవిద్యాప్రవచనము చేయువారు తమ ధర్మమును నిర్వర్తించుటలో దీక్షబూని సచ్ఛిష్యుల నన్వేషించుటయు తగునని తెల్లమగుచున్నది. శిష్యుని జ్ఞానపిపాస యెట్టిదో సదాచార్యుని ప్రశ్నించువిధముననే సువ్యక్తమగుచున్నది.

**శ్లో॥ కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్ ।**
**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ॥**

సత్యవాక్యో దృఢవ్రతః :– ఈ లోకమున ఇ క్కాలమున సకలకల్యాణ గుణోపేతుడును, వీరుడును, సకలధర్మంబుల నెఱింగినవాడును. స్వల్ప సహాయ మొనర్చినను గొప్పగ భావించువాడును, క్లిష్టపరిస్థితులయందును సత్యమునే పలుకువాడును, స్థిర సంకల్పము గలిగినవాడెవడు? 'అస్మిన్' (లోకే) 'సాంప్రతం' అనుటచే భూతకాలమును గురించి ప్రజలకు నమ్మకము తక్కువ అనియు, లోకాంతరములను గురించియు విశ్వాసము జనులకు లేదనియు తెలిపి ప్రత్యక్షమున సమకాలికుడగు మానవోత్తముని (పురుషోత్తముని) తెలుపుమని కోరెను. అనగా,

**శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥**

ఉత్తము డెట్లు వర్తించునో లోకులట్ల వర్తింతురు గావున 'మానవకోటి కాదర్శపురుషుం' డెవఁడు? అని ప్రశ్నించెను.



**శ్లో॥ చారిత్రేణ చ కో యుక్త స్సర్వభూతేషు కో హితః ।**
**విద్వాన్ కః క స్సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః ॥**

వర్ణాశ్రమధర్మానుష్ఠానపరు డెవడు? ప్రియాప్రియరహితుడై 'ఆత్మవ త్సర్వభూతాని యః పశ్యతి స పశ్యతి' అన్నట్లు తనవలె సకల ప్రాణులని భావించు వాడెవడు? 'సుహృదం సర్వభూతేషు' అనియు ప్రాణికోట్ల నెల్ల సుహృదయముతో చూచువా డెవడు? అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ' అని విభీషణుని విషయమై ఆడినమాట లాతనిసుహృదయమును చాటును. గుహునితో సమాగమము గలిగినపు డతనిని కౌగిలించుట ఉత్కృష్టనికృష్టభేద భావము లేని సర్వసమత్వమును విశదీకరించుచున్నది. "యాగతిర్యజ్ఞశీలానామ్" అని యజ్ఞశీలురవలె మోక్షముపొందవలెనని జటాయువునకు మోక్ష మిచ్చుటయు, శబరియాతిథ్యము గైకొనిన కారణమునను తన సర్వప్రాణుల యెడ గలిగిన సౌజన్యమును వెల్లడించును. సాధువులకు హిత మొనరించుట సహజము గాని తనకు మహాపకార మొనర్చిన రావణుని సైతము 'యది వా రావణ స్స్వయం' అని విభీషణాగమన సమయమున సుగ్రీవాది వానరు లతని కభయ మొసంగరా దని మున్మాటికి వాదించినను విభీషణుడు గాదు; రావణుడే స్వయముగ వచ్చినను నే నతనిని రక్షింతుననియె, 'విద్వాన్ కః' సకలవేద వేదాంగశాస్త్రములయం దారి తేరినవాడెవడు? అనగా జ్ఞానమునందే గాక అనుష్ఠానపర్యంతము సకల శాస్త్రప్రమాణముల నిరూపణము చేసి లోకులకెల్లరకు శాస్త్రములందు అత్యంతాదర గౌరవములు కలుగజేయు సకలవిధసత్కారములను సఫలముగ నిర్వర్తింపగల సమర్థు డెవడు? ఏ దివ్యమంగళ విగ్రహమును సందర్శించిన ఎంతకాలమున కేని తృప్తిగలుగదో యట్టి ప్రియదర్శను డెవడు? 'పుంసాం మోహనరూపాయ' అన్నట్లు పురుషులనేని మోహింపజేయువా డెవడు?

**శ్లో॥ ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః ।**
**కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే ॥**

'రమయతీతి రామః' ఎల్లరను రంజింపజేయువాడు రాముడు. రూపము చేతనేగాదు సకల సద్గుణములచేతను, సకలలోకములను మెప్పింప శక్తి గలవాడు. ఇంతటి సౌందర్యవంతుడు కాముకుడై, శృంగారరసాస్వాదన తత్పరుడై కాంతాలోకంబును వశ్యము చేయువాడేమో యని సందేహము వొడమ అవకాశము లేకుండుటకై 'ఆత్మవాన్ కః' మనస్సును తన స్వాధీన మందుంచుకొని యింద్రియముల నణంచి సాటిలేని ధైర్యముగల వాడెవడు? 'జితక్రోధః' బాహ్యాశత్రువులను దండింపననగా తన స్వధర్మనిర్వహణమున కనువగునంతమాత్రము కోరినప్పుడు కోపము దెచ్చుకొనుచు ఇతరసమయము లందద్దాని తలసూపనీయ కణచి స్వాధీనమందుంచుకొని అంతశ్శత్రువు లనంబడు కామక్రోధలోభ మోహ మదమాత్సర్యంబుల స్వభావముచేతను, శాస్త్రజన్య జ్ఞానముచేతను, గురూపదేశము వలనను, సజ్జనసాంగత్యము వలనను జయించి తన వ్యక్తిత్వమును వేనోళ్ల చాటగలిగినవాడెవడు? 'క్రోధమాహారయ తీవ్రం' క్రోధమును సక్రమముగ అవసరమగునంత తెచ్చుకొనువాడు. 'ద్యుతిమాన్' రూపముచే కాంతియుక్తుడగుటయే గాక ఆభిజాత్యము వలనను, దేవాంశసంభూతుం డగుటచేతను, సకలకళా కోవిదుం డగుటచేతను, స్వార్థ త్యాగియు, సకలప్రాణిహితైషుఁ డగుటవలనను, కాంతిమంతుడై దేదీప్యమానుడగువా డెవ్వడు? 'అనసూయకః' పరులగుణము లందు దోషబుద్ధిలేనివాడెవడు? సమరమున మరణము లేనివారయ్యు దేవత లెవరితో పోరలేక భయభ్రాంతులై గడగడ వడంకుదురో లేక ఎవనికి దేవతలు స్నేహితులయ్యు అతని బలపరాక్రమంబుల జూచి పిరికిపంద లగుదురో అట్టి ఉత్తము డెవడు?



వాల్మీకి వేసిన ప్రశ్నములు పదునాఱు. షోడశకళాపూర్ణు డెవడు? చంద్రుడు, పూర్ణచంద్రుడు. ఇట్లు పరిపూర్ణుడెవడని తెలియగోరి పదునాఱు ప్రశ్నలతో పురుషోత్తము డెవడని తెలియగోరెను. కావున శ్రీరామావతారము సంపూర్ణావతారమని స్పష్టమగుచున్నది. శ్రీరాము డిట్టివాడని సంపూర్ణముగ ఎఱిగియు తన యభిప్రాయము సమంజసమని దృఢపరచుకొన నుద్దేశించియు, భగవద్విషయ మాచార్యముఖముగ ఉపదేశము కావలెనను సంప్రదాయము ననుసరించియు వాల్మీకి నారదుని సంప్రశ్నము చేసెను.

**శ్లో॥ ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం వరం కౌతూహలం హి మే ।**
**మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతుమేవంవిధం నరమ్ ॥**

ఇట్లు వివరించబడిన గుణములు గల పురుషుడెవడని తెలిసికొన గోరెదను. ఇట్టి విషయము వినుటకు నాకు కుతూహలముగ నున్నది. ఇట్టి నరోత్తము డెవడని తెలుపుటకు సర్వవిధముల నీవ సమర్థుండవుగాని అన్యు డెవ్వండును గాడు. జ్ఞానసంపన్నులగువారు ఋషులు. వారిలో నీవు మిక్కిలి గొప్పవాడవు. బ్రహ్మదేవుని కుమారుండవు. నీ వెఱుంగని ధర్మములు లేవు. నీ యంత ధర్మ సూక్ష్మముల నెఱింగిన వారెవ్వరును లేరు. నా ప్రశ్నము సామాన్యముగ ఎల్ల రెఱింగిన విషయమును గూర్చినది కాదు. అనగా నిన్ను నే నాచార్యునిగ వరించి నిన్నీరీతి ప్రశ్నించుట లోకమునకే గొప్ప రహస్యమును వెలిబుచ్చుదువను దృఢమైన నమ్మకముతోను, నీ వాక్కును సకల లోక మాదరించునను సంపూర్ణవిశ్వాసముతోడను ఇట్లు ప్రశ్నించితినని యర్థము.

**శ్లో॥ శ్రుత్వా చైతత్ త్రిలోకజ్ఞో వాల్మీకేర్నారదో వచః ।**
**శ్రూయతామితి చామంత్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్ ॥**

వాల్మీకి ప్రశ్నములను విని త్రిలోకజ్ఞుడగు నారదుడిట్లనియె. త్రిలోకజ్ఞుడన భూః, భువః, సువర్లోకముల వృత్తాంతములు త్రికాలంబున నెఱింగినవాడు, బద్ధ, ముక్త, నిత్యులగు చేతనుల స్వరూపంబులు తెలిపినవాడు కనుక వాల్మీకి ప్రశ్న మిట్టిదని చక్కగ నెఱింగి తన తండ్రి పంపున తానుద్దేశించిన కార్యము ఫలించు సూచన గలిగినందునను, లోకహితంబగు కార్యము చేయుట కవకాశము గలిగినదిగదా యనియు, దైవప్రేరణ నిరర్థకముగా దను సత్యము వెల్లడి యయ్యెననియు, తాను సనత్కుమారుని మూలమున గ్రహించిన ఆత్మస్వరూప మిట్టిదని స్మరణకు వచ్చినందునను, దానిని లోకమున వ్యాపింపజేయుట కనుకూల పరిస్థితి యేర్పడినదనియు, వాల్మీకి వంటి సచ్ఛిష్యుడు లభించెననియు, సంతోషించి శిష్యుడేగదాయని తలచి 'శ్రుణు' వినుము అనక "శ్రూయతాం" వినుమా అనెను. శ్రద్ధాభక్తులుగల శిష్యులు సద్విషయము వినగోరి అడిగినచో గురువు లాదరముతో ప్రత్యుత్తర మియ్యవలెనను గురుధర్మము ననుష్ఠించి "కృపయా నిస్పృహో వదేత్" ప్రతిఫలముగోరక దయతో బోధింపవలెనను న్యాయమును పాటించి, సక్రమముగ సదుత్తరము నీ క్రింది విధమున నిచ్చెను.

**శ్లో॥ బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః ।**
**మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్త శ్రూయతాం నరః ॥**

నీచే వివరించబడిన గుణములలో ఒక్కొక్కటియు అనేకగుణంబుల సూచించును గావున ఇన్నియుంగలవాడీ మర్త్యలోకంబున నుండుటరుదు. అయ్యవి పరబ్రహ్మమునకే గలవు కాని నేను నా తండ్రిమూలమున తెలిసికొని నంత "మునే" మౌనముచే ఇంద్రియ నిగ్రహము గలిగి జ్ఞానము సంపాదించి యున్న నీవే పరమోత్కృష్టంబగు నరుని నెఱుంగం దగినవాడవు. కనుక 'వినుమా' యనెను. అనగా నీవు విననే ఆ పరమపురుషుని మాహాత్మ్యము లోకంబునకు సుబోధకంబగుట కానుకూల్య మేర్పడునని భావించి



నట్లూహించ వలెను. నారదుని వాక్యమువలన వాల్మీకియే తగు శిష్యుడని తెల్లమయ్యె.

ఇట్లు గురుశిష్యు లిరువురు పరస్పర గౌరవాదరములు గలవారగుట గురువునకు బోధించుట యందు కుతూహలమును, శిష్యునకు గ్రహించుట యందలి శ్రద్ధయు విస్పష్టమగుచున్నది. ఇట్టి పరిస్థితిలోనే విద్య సఫలమగునని గ్రహింపందగును.

ఇచ్చట వాల్మీకి పురుషోత్తము డెవడని, పరబ్రహ్మ స్వరూపు డెవడని మానవావతారమున ధర్మసంస్థాపనముచేయ నుద్భవించిన దైవస్వరూపుండెవ డని తెలియగోరి నారదుని ప్రశ్నించెను. అయ్యది యుక్తమా యని చర్చించు టవసరము. తెలియని విషయము నడిగి తెలిసికొనుట సహజము. శ్రీరాముని యట్టి సకలకల్యాణగుణంబులు గలవాడని తానూహించి అందలి సత్యాసత్యములు లోకము మెచ్చువిధమున సంశయవిచ్ఛేదముగావింప నవకాశము గల్గినందున నిట్లు ప్రశ్నించి యుండవచ్చును. ఏలన శ్రీరాముని గూర్చి వాల్మీకిమహర్షికి తెలియకపోలేదు.

**శ్లో॥ ఇతి సీతా చ రామశ్చ లక్ష్మణశ్చ కృతాంజలిః ।**
**అభిగమ్యాశ్రమం సర్వే వాల్మీకిమభివాదయన్ ॥**

సీతారామలక్ష్మణులు చిత్రకూటము చేరునపు డాశ్రమంబులు చూచుచు వాల్మీక్యాశ్రమంబు చేరి, వారు మునివరునిచే సత్కారము పొందినపుడు శ్రీరాముడు వినయపురస్సరంబుగ నమ్మునికి మ్రొక్కి తన వృత్తాంతమంతయు సవిస్తరంబుగ నివేదించెనని తెలియుచున్నది. భరతుడు చిత్రకూటమున రాముని దర్శింప వచ్చినపుడు వారి సమాగమ సందర్భమున జరిగినదెల్ల వాల్మీకి ప్రత్యక్షముగ జూచెను. తదుపరి శ్రీరాముడు పట్టాభిషిక్తుడగు కాలమున వాల్మీకి తమసానదీ తీరమున నాశ్రమము గల్పించుకొని వసించియుండిన వృత్తాంతము ఉత్తరకాండమున విస్పష్టమగుచున్నది. కనుక

శ్రీరాముడు పాలించుచుండిన కాలమున, "రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ కథాః । రామభూతం జగదభూద్రామే రాజ్యం ప్రశాసతి॥" అన్నట్లు ప్రజలందరు రాముని వేనోళ్ళ శ్లాఘించుచుండుటయు ప్రసిద్ధమే. అట్లుండ వాల్మీకి, రాముని మాహాత్మ్యం బెఱిగినవాడనుటకు సంశయము లేదు. కనుక శ్రీరాముడు పరమాత్మ స్వరూపుడని యెఱింగియు బ్రహ్మపుత్రుండగు నారదునివాక్కుచే ఆయథార్థము తెలియగోరి ప్రశ్నించెను. అయ్యది సర్వసమంజసమే.

**శ్లో॥ ఇక్ష్వాకువంశప్రభవో రామో నామ జనైః శ్రుతః ।**
**నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ ॥**

ఇక్ష్వాకువంశమున రాముడని ప్రసిద్ధిగాంచిన యాతడే నీచే వివరింపబడిన సకల కల్యాణ గుణపరిపూర్ణుడు. అతడు పామరజనుల సైతమెఱింగిన వాడును, ఒక్కవిధమైన స్వభావము గలవాడును గొప్ప వీర్యవంతుడును, తేజోవంతుడును, నిరతిశయానందము గలవాడును, సకల జగమును తన వశమున నుంచుకొనువాడును అగును.

ఉత్తమ క్షత్రియ వంశము లెన్నియో గలవు గదా! ఇక్ష్వాకు వంశమున అవతరింప నేమి కారణమనిన వైవస్వతమనువుయొక్క జ్యేష్ఠపుత్రుడు ఇక్ష్వాకు మహారాజు. అతడు మహావిష్ణువును గూర్చి బహుకాలము తపస్సుచేయన ద్దేవుండు ప్రత్యక్షమై వలయు వరము వేడుమనిన రాజు స్వామీ! నీ వీరూపున నాయింట నిత్యారాధన గైకొనుచుండుమని ప్రార్థించెను. "వల్లె" యని శ్రీహరి యర్చారూపమున శ్రీరంగనాథుడై ఇక్ష్వాకువంశమున నారాధింపబడు చుండుటం జేసి సూర్యవంశమని వ్యవహరింపబడుటకు మారుగా ఇక్ష్వాకువంశమని ప్రసిద్ధమయ్యెను. ఇంతటి సాత్త్వికవంశము వేరొండు లేని కారణమున మహావిష్ణువు శ్రీరాముడై ఇక్ష్వాకువంశమున బుట్టెను.



దానికి వన్నెదెచ్చెను. ఎట్లన వంశమను శబ్దమునకు వెదురని యర్థము గలదు. వెదు రల్పవస్తువైనను దానిలో ముత్యము లుండునను విధమును దేవతలముందర మానవు లల్పులయ్యు మానవులలో ముత్యమట్లు శ్రీరాము డవతరించె. 'అజాయమానో బహుధా విజాయతే' అన్నట్లును "పుట్టువెన్నడు నెఱుగని పొట్టివడుగు" అను వాక్యమును సార్థకము చేయునట్లును, జననమరణాదులు లేని దేవదేవుడు నానానామరూపంబులతో ఆ యా కాలంబున ఆ యా యుగంబున ధర్మసంస్థాపనార్థంబు సంభవించు చున్నాడు. అట్టి యవతారము లన్నింటిలో ఉత్కృష్టమగు శ్రీరామావతార మెత్తెను. ఇది భగవంతుని సౌశీల్యమును చాటుచున్నది. ఈ సౌశీల్యమె వాల్మీకి ప్రశ్నయందలి "గుణవాన్" అను పదమున కర్థము. "రమంతేఽస్మిన్ సర్వ జనా గుణై రితిరామః" అనగా సకలజనులు గుణములచే నితనియందు రమించుచున్నారని భావము. "గుణైర్దాస్య ముపాగతః" అని లక్ష్మణుడు 'ఇతని గుణములచే నితనికి దాసుడనైతి' నని చెప్పలేదా? "రామోనామ" రాముడను పేరెట్టిది? 'రమయతి సర్వాన్ గుణైరితి రామః ' తన గుణములచే నందఱను రమింపజేయువాడని అర్థము. "రామో రమయతాం వర" అనియు ఋషి వచనము గలదు. పరశురామునిచే నాశనము గావింపబడిన క్షత్రియవంశమును పునరుద్ధరించుటకు క్షత్రియుడే సమర్థుడు గావున క్షత్రియుడై జన్మించె. ''జనైశ్శ్రుతః'' జనులచే పొగడంబడినవాడని యర్థము.

అట్టి జగద్విఖ్యాతికి గారణమున్నది. అతి బాల్యముననే చేసిన తాటక సంహారము మొదలు రావణవధ పర్యంతము చేసిన కార్యము లొక్కొక్కటియు దీని యౌచిత్యమును జాటుచున్నది. 'నియతాత్మా' ఎన్నడొక విధమగు స్వభావముగలవాడు శిక్షిత మనస్కుడు, నిగృహీతాంతఃకరణుడు, నిర్మల చిత్తుడని భావము. 'మహావీర్యః' అచింత్యమగు వివిధ విచిత్రశక్తియుతుడు

"పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ" ఇతిశ్రుతేః "ద్యుతిమాన్" ప్రకాశవంతుడు, సహజకాంతిగలవాడు, స్వయం ప్రకాశకుడు. జ్ఞానముగదా స్వయంప్రకాశము. జ్ఞానస్వరూపుడు. 'విజ్ఞానఘన ఏవ ప్రజ్ఞాన ఘనః' అని శ్రుతి. 'ధృతిమాన్' ధృతిస్తు తుష్టిస్సంతోషః' అని వైజయంతి. 'ఆనందో బ్రహ్మ' యనిశ్రుతి కనుక నిరతిశయానందముగలవాడు. అనగా జ్ఞానానందమయుడు. వేయేల? పరమాత్ముడనియె భావము. 'వశీ' 'సర్వస్య వశీ సర్వస్యే శానః' అని శ్రుతి. ఇంద్రియములను స్వాధీనమందుంచుకొన్న వాడు హృషీకేశుడని యర్థము. సకల కల్యాణగుణాదులచేతను, నిరతిశయ బలవీర్యాదుల వలనను, సకల లోకంబులను తనవశమం దుంచుకొనిన వాడు. సర్వస్వామి – సర్వనియంత. 'కారణం తు ధ్యేయ' యని శ్రుతి. ధ్యేయుడగు భగవంతునకు జగత్కారణత్వము గలదు. కాన నిక జగత్సృష్టి కనుకూలములగు గుణములను చెప్పుచున్నాడు.

'బుద్ధిమాన్' 'యస్సర్వజ్ఞ స్ససర్వవిత్' అని శ్రుతి. ప్రశస్తమగు బుద్ధిసూక్ష్మము గలవాడు.

**శ్లో॥ శుశ్రూషాశ్రవణం చైవ గ్రహణం ధారణం తథా ।**
**ఊహాపోహార్థ విజ్ఞానం తత్త్వజ్ఞానం చ ధీగుణాః ॥**

అను బుద్ధిసూక్ష్మతను సూచించు సర్వశక్తులు గలవాడని భావము. 'నీతిమాన్' 'ధాతాయథాపూర్వమకల్పయత్' – ఏష సేతుర్విధరణ ఏషాంలోకా నామసంభేదాయ' యని శ్రుతి. వస్తువులు తమతమ యెల్లను మీరకుండునటు ఎల్లరాయిగానుండు వాడు. హద్దు దప్పనివాడు. నియమంబులనెల్ల సక్రమంబుగ పాటించువాడు. 'వాగ్మీ'. శోభనా వాగస్యాస్తీతి వాగ్మీ'. పరహితకరమగు మంచి వాక్కు. సకలలోక హితకరంబగు వాక్కు వేదము, సర్వవేద ప్రవర్తకుడు. 'యో వై బ్రహ్మాణం విదధాతి పూర్వం, యోవై వేదాగ్ంశ్చ



ప్రహిణోతి తస్మై' అని శ్వేతాశ్వతరోపనిషత్తు, 'శ్రీమాన్' శ్రీ యనిన లక్ష్మిగదా! శ్రియఃపతి, లక్ష్మీపతి, సకలలోక సకలైశ్వర్య ప్రదాయిని అగు లక్ష్మీవల్లభుడని అంతరార్థము. బాహ్యార్థము సకలైశ్వర్య సంపన్నుడని. శ్రీహరికి నిత్యవిభూతి, లీలావిభూతియను రెండు విభూతులు గలవు. నిత్యవిభూతి శ్రీవైకుంఠము లేక పరమపదము. లీలావిభూతి జగత్తు. ఈ రెంటికిని ప్రభువు గనుక ఉభయవిభూతి నాథుడని ప్రసిద్ధి, ఆ దేవదేవుని అవతారము గనుక లీలామానుష విగ్రహుడు శ్రీరాముడు. 'సర్వమిద మభ్యాత్త' యని శ్రుతి. శ్రీః అన న కాంతియని యర్థము. కనుక అతిశయమగు శోభతో గూడిన విగ్రహవిశిష్టుడు. 'శత్రునిబర్హణః' 'శత్రూన్ నాశయతి' శత్రువులను నాశమొందించువాడు. 'ఏష భూతపతిః', ఏషభూతపాలః' అని శ్రుతి. తన్ను దూషించువారు తనకెగ్గుసేయువారు, చేయనెంచువారు, తన్నెదిరించు వారినైనను క్షమించునుగాని తన్నాశ్రయించినవారిని దూషించిన సహింపడని భావము. తనభక్తుల శత్రువులే తన శత్రువులని పాటించువాడు. తన్నాశ్రయించిన సుగ్రీవుని శత్రువని గదా వాలిని సంహరించె. తన్నాశ్రయించిన విశ్వామిత్రుని శత్రువులని గదా తాటకను, సుబాహువును వధించె. తన కపకారము చేసినను తన్ను శరణుజొచ్చిన కారణమున కాకాసురుని రక్షించెను గాని, 'యది వా రావణ స్స్వయం' అని తన్నాశ్రయింపని కారణమున శత్రుత్వము పాటించి రావణుని వధించె.

ఇక 'విపులాంసో మహాబాహుః – మొదలు లక్ష్మీవాన్ శుభలక్షణః' అను పర్యంతము శరీరములోని అంగాంగంబుల సౌందర్యాది విషయముల సాముద్రిక శాస్త్రరీత్యా వర్ణించి పురుషోత్తమత్వమును 'లక్ష్మీవాన్' 'శుభలక్షణః' అను పదముల యర్థమును వివరించుచు దివ్యమంగళ విగ్రహమును వర్ణించి 'ప్రియ దర్శనః' అనుమాట యొక్క సత్యమును నిరూపించె. తదుపరి ఆశ్రిత రక్షకత్వమున కనుకూలములగు దివ్యకల్యాణగుణంబులు వివరింప బడుచున్నవి.

'ధర్మజ్ఞః' సకలవిధధర్మంబులలో ఉత్తమోత్తమంబగు శరణాగత రక్షణంబను పరమధర్మమును చక్కగ నెఱింగి అనుష్ఠించువాడు. 'అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ' సకల భూతముల కభయం బొసంగుటె నా ధర్మము. కావున నదియె నా వ్రతము, ధర్మము. 'ధర్మం చర' దర్మము నాచరింపు మనుశ్రుతి ననుసరించుచు 'సత్యసంధశ్చ' ఎట్టి యిక్కట్టులు గలిగినను 'సత్యం వద' అను మహావాక్యము నెన్నటికి మరువనివాడు నిజమగు ప్రతిజ్ఞ గలవాడు.

**కం. విడిచెదఁ బ్రాణములైనన్**
**విడిచెద నిన్నైనఁ దమ్మునిన్ విడిచెద నే**
**విడుతునె ప్రతిజ్ఞ నెందుం**
**బుడమి సురలతోడఁ బల్కి ముగ్ధా యెపుడున్. (అరణ్య)**

ఇయ్యది సత్యమని నిరూపించుటకు –

**శ్లో॥ ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది ।**
**పౌరుషే చాప్రతిద్వన్ద్వ శ్శరైనం జహి రావణిమ్ ॥**

అని ఇంద్రజిత్తును వధింప లక్ష్మణుడు చేసిన ప్రతిజ్ఞావాక్యముతగు నిదర్శనము. 'ప్రజానాం చ హితే రతః'– పరులకు హితముగూర్చుటయందే మనస్సుగలవాడు. దశరథుని యజ్ఞమున హవిర్భాగములు గైకొన నేతెంచిన బ్రహ్మాది దేవతలు 'త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా' అని లోకు లెల్లర క్షేమము కొఱకు నిన్ను ప్రోత్సహించుచున్నామనిరి, 'సమరే జహి రావణ' రావణుని యుద్ధమున జయింపు మనిరి. వారి ప్రార్థన నంగీకరించి –

**శ్లో॥ భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్ ।**
**సపుత్రపౌత్రం సామాత్యం సమిత్రజ్ఞాతిబాంధవమ్ ॥**



**శ్లో॥ హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్ ।**
**దశవర్ష సహస్రాణి దశవర్ష శతాని చ ।**
**వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథివీమిమామ్ ॥**

దేవతలారా! భయ ముడుగుడు. మీకు క్షేమముగలుగును. లోకహితార్థము యుద్ధమున బంధుమిత్రపుత్ర పౌత్రాది సకల పరివారముతో రావణుని పరిమార్చి యీ లోకమున పదునొకండువేల వత్సరములు ధర్మయుక్తంబుగ పుడమి పాలించుచు వసించెద నని చేసిన ప్రతిజ్ఞను పాటించి లోకంబున కాదర్శపురుషుడగువాడు. 'యశస్వీ'– అతులిత కీర్తియుతుడు. 'తస్యనామ మహద్యశః' అని శ్రుతి. అతని నామమే గొప్పకీర్తి. పూర్వపరిచయ మొకించుక లేకున్నను, శత్రుపక్షమునకు చేరినవాడైనను, ఘోరశత్రువైనను. తన్నాశ్రయించిన మాత్రమున నతని యందలి దోషము లెట్టివైనను లెక్కింపక వెంటనే పరమాప్తునిగ భావించి అభయ మిచ్చి రక్షించుటయందే బుద్ధి గలవాడని జగద్విఖ్యాతి చెందిన మహామహుడు. 'జ్ఞానసంపన్నః' 'య స్సర్వజ్ఞ స్ససర్వవిత్' అని శ్రుతి. అతనికి తెలియని విషయ మొందులేదు. 'అదినేర్తు నిదినేర్తు నని యేల చెప్పంగ నేరుపు లన్నియు నేన నేర్తు' అను వామనావతారమున వాక్రుచ్చినట్లు 'ఆధారం సర్వ విద్యానామ్' అని సకల విద్యల కాధారభూతుడై 'విద్వాన్ కః' అను ప్రశ్నకుత్తరమై, సకల విధ జ్ఞానాశ్రయుడైయున్న వాడని భావము. 'శుచిః'– బాల్యము నుండి సదాచార్యుడగు వసిష్ఠునివలన సకల కర్మములు కాలోచితముగ చేయ నేర్చి సక్రమముగ చేయుచుండువాడు. కనుక విశ్వామిత్రుని వెంటబోవుకాలమున వేకువజామున మునివరుండు–

**శ్లో॥ కౌసల్యా సుప్రజా రామ, పూర్వాసంధ్యా ప్రవర్తతే ।**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥**

కౌసల్యాదేవి సత్పుత్రుడవగు శ్రీరామా! తూర్పు దిక్కున ఉదయమగుచున్నది. నిద్ర చాలించి లెమ్ము. మానవోత్తమా! ప్రాతఃకాల వైదికకార్యముల నిర్వర్తింపుము అని ప్రార్థించె. నీవు విరాట్పురుషుడవైనను లోకసంగ్రహార్థము వర్ణాశ్రమ ధర్మానుసారము నీవీయవతారమున కనువగు విధమున ఇతరులకు మార్గదర్శివై నీ సంధ్యావందనాద్యనుష్ఠానములు సేయు మనెను. అట్లగుట బాహ్యాంతర శుచిత్వమును పొందెను. సదాచారసంపన్నుడు, పూర్వాచార పరాయణుడు. కాయిక వాచిక మానసిక పరిశుద్ధిగలవాడు, 'వశ్యః'– వశ్యుడు పరతంత్రుడు. ఆశ్రిత పరతంత్రుడు, పిత్రాదులకు పరతంత్రుడు. వేదశాస్త్రాదులకు వశ్యుడు. సుగ్రీవ విభీషణాదులపట్ల పారవశ్యమును కనబరచినవాడు. ఋషుల ప్రార్థనముల నంగీకరించి వారికి వశ్యుడై దుష్టసంహార సంకల్పముగొనినవాడు. 'సమాధిమాన్'– ఆశ్రిత రక్షణైక చింతా తత్పరుడై తన తత్త్వమును యోగమునందు దెలియువాడు. దర్భశయన సందర్భమున కార్యదీక్షగొని సముద్రుని వశము చేసికొన ప్రయత్నించినపుడీ విషయము విస్పష్టమగుచున్నది. 'ప్రజాపతినమః'– బ్రహ్మాదులకంటె సర్వోత్కృష్టు డయినను లోకరక్షణార్థము బ్రహ్మరుద్రుల సృష్టి లయంబులు గావింప నియమించి తాను జగద్రక్షణ కొఱకీ లోకమున విష్ణుడని యవతరించె, 'త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా' అను దేవతా ప్రార్థన లంగీకరించి శ్రీరామచంద్రుడై యవతరించెను. కావున నతడు ప్రజాపతి సన్నిభుడని చెప్పబడెను. 'శ్రీమాన్'–

**శ్లో॥ 'రాఘవత్వేఽభవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని ।**
**అన్యేషు చావతారేషు విష్ణోరేషానపాయినీ ॥**

అని విష్ణుపురాణమున నున్నట్లు జగద్రక్షణార్థము దండధరుడగు విష్ణునితో నవినాభావమున మెలంగుచు పురుషకారభూతయగు లోకమాత శ్రీమహాలక్ష్మి ఆయా యవతారమున కనుగుణముగ నవతరించుచు శ్రీరామావతారమున



సీతయై జన్మించి రావణవధకు కారణభూతురాలయ్యె. కావున సీతారూపమున నున్న లక్ష్మీసమేతుడైనవాడని యర్థము. 'ధాత' యన పోషకుడు, సాధుజన పోషకుడు. కావున భోగత్యాగముచేసి మునిజనసేవా పరతంత్రుడై వారియానతి చొప్పున సాధుజన కంటకులగు క్రూరరాక్షసుల వధించి దీనజన పోషకుడై ధర్మసంరక్షకుండయ్యె, 'రిపునిషూదనః',– శత్రుసంహారకుడు, సహజముగ సుగుణరాశియగుట శత్రువులు లేని వాడయ్యు ఆశ్రితబృంద శత్రువులను తన శత్రువులుగ పాటించి వారల నిర్మూలము గావించినవాడు. 'రక్షితా జీవలోకస్య'– సకల ప్రాణికోటిని సంరక్షించుటె ధర్మమని తలంచిన వాడు. స్వజనుల రక్షించుట మాత్రముగాక 'సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి'– ఎవడు నన్ను సర్వభూతముల స్నేహితుండని యెఱుంగునో అతడు శాంతిని పొందును అన్నట్లును, 'అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ' అని విభీషణ శరణాగతి సందర్భమున వాక్రుచ్చినట్లును ప్రాణికోట్లను కాపాడువాడని యర్థము.

'ధర్మస్య పరిరక్షితా'– సకలధర్మముల నాచరించి, పరులధర్మ లోపముల నవరించి యెల్లరను ధర్మాచరణులుగ జేయువాడు. వారి వారికి తగు ఉపాయముచే ధర్మబద్ధుల గావించువాడని భావము. రక్షితా స్వస్య ధర్మస్య– ఆర్త త్రాణ పరాయణుడును దీనజనపోషకుడు అగుట తన శరణాగతరక్షణ ధర్మమును రక్షించుకొనువాడు. "ధర్మోపదేశ సమయే, జనా స్సర్వేపి పండితాః, తదనుష్ఠానసమయే మునయోఽపి న పండితా" యనునట్లు స్వానుష్ఠానరహిత పరోపదేశ పాండిత్యపరుడు గాక, తా నాచరించి అన్యుల నాచరింపజేయు వాడు కావున 'రాముడు చేసినట్లు, కృష్ణుడు చెప్పినట్లు' అను లోకోక్తి వ్యాపించెను. 'స్వజనస్య చ రక్షితా'– లోకమున తమ కీర్తి వ్యాపించ వలెనను భావముతో ఇతరులపట్ల సుహృద్భావముతో మెలగుచు పరోపకార కృత్యము లొనరించు చున్నను

తమ కుటుంబములోని వారిని అనాదరణ చేయుటయు కొందఱి స్వభావము. కాని శ్రీరాము డెల్లప్పుడు తన బంధుమిత్రులను సైతము ప్రేమతో జూచువాడు. శరణాగతిచేసినవాడు తనవాడని భావించువాడు.

**శ్లో॥ మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన ।**
**దోషో యద్యపి తస్య స్యా త్సతామేతదగర్హితమ్ ॥**

మిత్రభావముతో తన్నాశ్రయించినవాని సకలదోషముల గణింపక రక్షించువాడని భావము. 'వధార్హ మపి కాకుస్థః కృపయా పర్యపాలయన్' వధింప దగినవాడైనను, కాకాసురుని శరణు జొచ్చినంత మాత్రమున దయతో మన్నించినవాడు. 'వేదవేదాంగతత్త్వజ్ఞః'– ఋగ్యజుస్సామాధర్వణ వేదములను షడంగములతో చక్కగ నెఱింగినవాడు. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను నవి వేదాంగములు. వేదములోని అకారాద్యక్షరములకు స్థానస్వరాదుల బోధించునది శిక్ష. శబ్దసాధుత్వమును దెలుపునది వ్యాకరణము. శ్లోకలక్షణముల విశదీక రించునది ఛందము. ఇట వర్ణాగమము, ఇట ప్రకృతిప్రత్యయములజూపి పదార్థముల వర్ణలోపము మున్నగు వాని నిర్ణయించునది నిరుక్తము. వేదోక్త కర్మానుష్ఠానక్రమము దెలుపునది కల్పము. వీని నన్నిటిని స్పష్టముగ నెఱింగి తదనుగుణముగ ననుష్ఠించువాడని భావము. 'ధనుర్వేద చ నిష్ఠితః'– ధనుస్సు నెత్తిపట్టుట, వింట నారిం గూర్చుట. మోపెట్టుట, బాణసంధానము చేయుట ఇత్యాదుల వివరించునదే ధనుర్వేదము.

**శ్లో॥ పవిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

అనునట్లు సాధురక్షణమను ఇష్టప్రాప్తి నుద్దేశించి యనిష్టవృత్తియగు దుష్ట నిగ్రహమునకు సాధనమగు ధనుస్సును ధరించుట క్షత్రియ ధర్మము. కావున



దానింగూర్చిన వేదమును చక్కగ నభ్యసించినవాడని యర్థము. ధనుర్వేదము, ఆయుర్వేదము, గాంధర్వవేదము, అర్థశాస్త్ర మనునవి నాలుగు ఉపవేదములు. వైదిక కర్మాచరణమునకు భంగముగ నుండు వ్యాధిని పరిహరించు విధమును జెప్పునది ఆయుర్వేదము. ధన్వంతరి, చరకుడు, సుశ్రుతుడు, వాగ్భటుడు మున్నగు వారీ వేదమును ప్రవచనముచేసిరి. నాట్యగీతంబులశాస్త్రమే గాంధర్వ వేదము. ఇది సామగానమున నుపయోగించును. దీనికే భరతశాస్త్ర మనిపేరు. చాణక్య కామందకాది నీతిశాస్త్రము అర్థశాస్త్రము, వైదిక కర్మానుష్ఠానమునకు వలయు ద్రవ్యము నార్జించుటయం దుపయోగించునది. సర్వ శాస్త్రార్థతత్త్వజ్ఞః– ముందు చెప్పిన శాస్త్రములు గాక ధర్మశాస్త్రము, పురాణము, న్యాయశాస్త్రము, మీమాంస అను నాలుగు ఉపాంగములు గలవు. ధర్మశాస్త్రము వేదపూర్వకాండ అర్థవివరణము. పురాణము వేదాంతార్థ వివరణము. న్యాయమీమాంసలు సకల ప్రమాణతత్త్వమును, వాక్యన్యాయమును కనుగొనుట కుపయోగించును. శ్రీరామచంద్రుడు నాలుగుపాంగముల నెఱిగినవాడు. స్మృతిమాన్– ఎఱిగిన శాస్త్రమును బాగుగ జ్ఞప్తియం దుంచుకొనువాడు. 'ప్రతిభానవాన్' మున్ను వినియున్నను, వినకున్నను, వ్యవహారసమయమున యుక్తికిం దగిన ప్రతియుక్తి అప్పటికప్పుడే తోచు బుద్ధిగలవాడు. 'సర్వలోకప్రియః'– సకలలోకములను ప్రేమించువాడు. ఇంతే గాక సర్వలోకములకు నతండు ప్రియుడు. 'రమయతీతి రామః' ఎల్లర రంజింపజేయువాడు. 'సోమవత్ప్రియదర్శనః'– ఆహ్లాదకరుడగు చంద్రుని వలె దర్శనమాత్రమున ఎల్లరను సంతోషపూరితుల జేయువాడు. 'గుణైర్దాస్యము పాగతః' అన్నట్లు కల్యాణగుణగణంబులచే ఎల్లర దాసులం జేసికొనువాడు. 'సాధుః'– మృదుమధురస్వభావుడు, సాత్వికనిధి. క్రోధమాహారయత్తీవ్రమ్' అని చెప్పినట్లు వలసినపుడు కోపముగొనువాడు. సాధారణముగ శాంతస్వభావు డని యర్థము.

అంతమాత్రమున నితరుల కెంతయు చులకనయగువాడుకాడు. 'అదీనాత్మా'– గంభీరస్వభావయుక్తుడు. 'సముద్రవత్ గాంభీర్యే' అని గాంభీర్యమున సాగరతుల్యుడు. చూచినమాత్రమున క్షాత్రతేజః పుంజ మనిపించుకొనువాడు. 'విచక్షణః'– ఉచిత వైదిక లౌకికక్రియ లందు కుశలుడు. 'సర్వదాభిగతస్సద్భి స్సముద్ర ఇవ సింధుభిః'– నదుల కన్నిటికిని సముద్రమెట్లు శరణ్యమో యట్లే రామచంద్రుడు సకల సత్పురుషుల కెల్ల విధముల నెల్లవేళల శరణ్యుడు.

**శ్లో॥ జ్ఞానవృద్ధైర్వయోవృద్ధై శ్శీలవృద్ధైశ్చ సజ్జనైః ।**
**కథయన్నాస్త వై నిత్యమస్త్రయోగ్యాంతరేష్వపి ॥**

అనగా సాము, గరిడీలు చేసి విలువిద్య నభ్యసించుచు విశ్రాంతికై యొకించుక సేపు సైత మొకచోట నిలిచినపుడును విశేషార్థములం దెలిసికొన నువ్విళ్లూరు చుండు జ్ఞానవృద్ధులు. వయోవృద్ధులు, శీలవృద్ధులు మున్నగు సత్పురుషులచే పరివేష్టింపబడి యుండువాడు. 'అపి' అను ఉపసర్గ ప్రయోగముచేత ఎట్టి చర్చకు నవకాశములేని సమయముననే సత్పురుషసంఘములలో మెలగు వాడనిన ఇతర సమయములలో నెట్లుండునో యూహించుకొనవలెను. నదులు కలియుటచే సముద్రమున కెట్టి లాభము గలుగక నదులకు మాత్రము గౌరవము హెచ్చునో అట్లే ఎట్టివారాశ్రయించుట వలనను రామునకు లేని గౌరవము గలుగదు గాని ఆశ్రితుల కెల్లవిధముల గౌరవము హెచ్చును. నదులు సముద్రమున గలియుట కెట్లు సమయమును వేచియుండవో అట్లు సత్పురుషు లెల్ల వేళల రాము నాశ్రయించుచుందురు. నదు లన్నిదిక్కులనుండి వచ్చి సముద్రములో గలియుచున్నను సముద్రము కలత నొందనట్లు శ్రీరాము డెప్పుడును మనస్సున నెట్టి చాంచల్యమును లేనివాడు. కావున చిత్రకూటమున నుండునపుడు జాబాలియను ఋషి నాస్తికవాదము చేసినను,



భరతుడు తనవలె మునివేషమున మరలి వచ్చి రాజ్యము పాలింపుమని ప్రార్థించినను, వసిష్ఠుడు నీతి నుపదేశించినను, తల్లులు దుఃఖించినను, రామునిమనస్సు మారలేదు. రత్నాకరసంసర్గముచే కొన్ని నదులలో కొన్ని రత్నములు లభించునట్లు శ్రీరాము నాశ్రయించుటచే ననేకు లనేకసద్గుణముల నతనివలన పొందిరి. ఎట్టివారైన నతనివలన విషయములు కనుగొందురేగాని యతని బోధింపలేరైరి. ఎంతటి గొప్పనదియైనను సముద్రములో గలసినంతనె దాని నామరూపములు మాయమగునట్లు ఎంతటి విద్వాంసుడైనను, జ్ఞానియైనను, యోగియైనను శ్రీరామచంద్రునెదుటికి వచ్చి నంతనె సూర్యునిముందట చంద్రుని వలె నగును. 'నదీనాం సాగరో గతిః' – నదుల కన్నిటికి సాగరమె పరమావధి యగునట్లు సకలజీవాత్మల కితడె యాశ్రయ భూతుడు. అనగా నితడే పరమాత్ముడు.

**శ్లో॥ ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరమ్ ।**
**సర్వదేవనమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి ॥**

అనగా అకాశమున మేఘరూపముననుండు జలము వర్షరూపమున భూమినిచేరి నదుల రూపమున సముద్రము నెట్లు చేరునో అట్లే ఏ దేవత నుపాసించినను, మ్రొక్కినను, అదియెల్ల శ్రీహరిని చేరును. అట్టి శ్రీ విష్ణువే శ్రీరాముడై యవతరించినందున నతడు 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్' అని తన్ను మానవునిగ భావించినను తత్త్వమెఱింగినవారు.

**శ్లో॥ భవాన్నారాయణో దేవః శ్రీమాన్ చక్రాయుధో విభుః॥**
**ఏకశృంగో వరాహస్త్వం భూతభవ్యసపత్నజిత్॥**

నీవు నారాయణుడవు. 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః'– అన్ని వస్తువులకు లోపలను, వెలుపలను వ్యాపించియుండువాడవు. 'మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ' అని అన్నిటియందు అంతర్యామివై

యుండువాడవు. జగత్సృష్ట్యాదు లొనర్చి క్రీడించువాడవు. నిత్యము లక్ష్మితో గూడియుండువాడవు. చక్రధరుడవు, సర్వవ్యాపకుడవు, 'వాసుదేవ స్సర్వం' ఒక కొమ్ముగల వరహావతారమెత్తినవాడవు. పూర్వము మధుకైటభాదులను, ఇక పుట్టునట్టి శిశుపాలాదులను జయించువాడవు.

**శ్లో॥ అక్షరం బ్రహ్మసత్యం చ మధ్యే చాంతే చ రాఘవ।**
**లోకానాం త్వం పరో ధర్మో విష్వక్సేనశ్చతుర్భుజః॥**

నీవు సర్వత్ర వ్యాపించి యుండువాడవు, నీవు బ్రహ్మశబ్దవాచ్యుడవు. వ్యత్యాసము లేనివాడవు. నీవు లోకముయొక్క సృష్టికి ముందును, మధ్యను, మహాప్రళయముననను నుండువాడవు. లోకమునకు సిద్ధరూపముననుండు ధర్మము సర్వస్వామిగ నుండువాడవు. 'మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ'– ఏకకాలమున చతుర్విధపురుషార్థము లిచ్చువాడవు. పురుషోత్తముడను భావము చక్కగ నెఱింగిన సత్పురుషు లెల్ల వేళల శ్రీరామునాశ్రయించుట సర్వసమంజసమె. అల్పులవలె గాక ఎట్టివా రెట్టివేళ తన్నాశ్రయించినను సుముఖుడై యుండువాడు.

'ఆర్యః'– రాజకుమారులు సాధారణముగ వినోదార్థము శృంగారకేళి సలుపుచు నటవిట గాయకులతో కాలము గడుపుదురుగదా! శ్రీరాముడెన్న డట్టి యనార్యపద్ధతి నవలంబించువాడు గాడు. సకల సద్గుణ గరిష్ఠులతో గోష్ఠిసలుపువాడు. తనవంటి యుత్తములతో సాంగత్యముచేయువాడు. అంతమాత్రమున నితరుల ననాదరణచేయు ననరాదు. 'సర్వసమః'– జాతి, వయస్సు, గుణము, సంపద, మొదలగు భేదములను గమనింపనివాడు. బాలురు, నిరుపేదలు, అల్పులు మున్నగువారు సైతము ఆశ్రయింపదగిన వాడు. ఎవరు వచ్చినను వారి యిష్టపరిపూర్తిచేయువాడు. గుహుడెఱుకలవాడై నను స్నేహభావమున నతని నాలింగనముచేసికొనెను గదా! శబరి స్త్రీయైనను,



బోయజాతి దైనను, ఆమె యిచ్చిన ఫలమూలాదుల నత్యంతాదరముతో స్వీకరించి యామెకు మోక్షమిచ్చెను.

**సర్వత్ర ఖలు దృశ్యంతే సాధవో ధర్మచారిణః।**
**శూరాశ్శరణ్యాస్సౌమిత్రే తిర్యగ్యోనిగతేష్వపి॥**

లక్ష్మణా! శూరులు, రక్షకులు, ధర్మానుష్ఠానపరులునగు సాధువులు అన్ని జాతులలోను, తిర్యగ్జాతులలోను గలరు.

**యా గతిర్యజ్ఞశీలానా మాహితాగ్నేశ్చ యా గతిః।**
**అపరావర్తినాం యా చ యా చ భూమిప్రదాయినామ్॥**
**మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్।**
**గృధ్రరాజ మహాసత్త్వ సంస్కృతశ్చ మయా వ్రజ॥**

సర్వదా యాగములుచేయుచుండు గృహస్థులకును, సర్వదా భగవద్ధ్యానముచేయు వానప్రస్థులకును, సన్న్యాసులకును లేక ముక్తులకును, భూదానము మొదలగు దానములు చేయువారికిని ఎట్టి పుణ్యలోకము గలుగునో, ఓ గృధ్రరాజా! గొప్ప పరాక్రమముగలవాడా! నాచే సంస్కరింప బడినవాడవై నా యాజ్ఞచే సర్వోత్తమమగు లోకమునకు బొమ్ము' అనెను. కనుక శ్రీరాముడు సర్వసముడని సిద్ధించును.

'సదైక ప్రియదర్శనః'– ఎల్లప్పు డెల్లరకు మనోజ్ఞమగు దర్శనమిచ్చువాడు. 'పుంసాం దృష్టిచిత్తాపహారిణం' అని పురుషుల మనసును సైత మపహరించువాడని ప్రసిద్ధి. ఇతని దర్శనమే సకల సంతాపహరమగును. ఒకపరి యితని దర్శించిన తనివితీరదు. మరల మరల నితని దర్శింప బుద్ధి పుట్టును, భగవద్దర్శనమునకు కాలనియమములేదు. జయవిజయులను ద్వారపాలకులు శ్రీవైకుంఠనాథుని దర్శనమున కడ్డుగలిగించిరనిగదా

సనకసనందనాదులు వారిని శపించిరి. నిరంతర మందస్మితవదను డగుట ప్రియదర్శను డనుట మిక్కిలి యొప్పును.

'స చ సర్వగుణోపేతః'– అనంతకల్యాణగుణపరిపూర్ణు డగుట అతని గుణముల వర్ణింప నసాధ్యము.

**శ్లో॥ ఇషుక్షయాన్నివర్తంతే, నాంతరిక్షక్షితిక్షయాత్।**
**మతిక్షయాన్నివర్తంతే, న గోవిందగుణక్షయాత్॥**

బాణములు లేకపోవుటచే విలుకాడు బాణములు ప్రయోగింపకున్నాడు కాని ఆకాశమున నెడములేకగాదు. అట్లే భగవంతుని స్తుతించువారు మనస్సునకు శక్తిలేక స్తోత్రము మానుదురుగాని, భగవంతునియందు గుణములు క్షీణించినందున కాదు. కొందరు భగవంతుడు నిర్గుణుడందురు. కావున అనిర్వచనీయుడందురు. ఆకాశమున నక్షత్రము లిన్నియున్నవని లెక్కింపనగునా? అందుచే నాకాశమున నక్షత్రములు లేవనవచ్చునా? అట్లే మన బుద్ధిబలము, వాగ్బలము, శరీరబలము అత్యల్పములు. కావున నంతకుమించిన కార్యములను మనము చేయలేము. ఆ కారణముచే భగవంతుని గుణరహితు డనుట తగదు. అసంఖ్యేయకల్యాణగుణ పరి పూర్ణు డని నమ్మవలయును.

'కౌసల్యానందవర్ధనః'– 'దశరథానందవర్ధనః' అని యేల చెప్పరాదు? అనిన 'మాతృదేవోభవ' 'పితృదేవోభవ' అని శ్రుతి. ఈ ప్రమాణము ననుసరించి తండ్రి కంటెను తల్లి యెక్కుడని తెల్లమగుచున్నది. ఏల? పుత్రుని కొరకు పడుపాట్లు తండ్రికంటె తల్లికెక్కువ. పుత్రునియందు తండ్రికంటె తల్లికెక్కువ ప్రీతి. తాననేక కష్టములకు లోనై కన్నపుత్రుని కంటినిరెప్పవలె నహోరాత్రములు గాచి పెంచుతల్లి కెక్కువ ప్రీతియన సందేహమేమి? ఇంతేగాదు. దశరథుని నూర్లకొలది భార్యలలో నెవ్వతె కీతడు జన్మించెనో



అతడు రాజ్యార్హు డగునో కాడో సందేహము గలుగకుండు నిమిత్తము కౌసల్యానంద వర్ధనుడనుట యుక్తము. దశరథున కితర పుత్రులవలన నానందము గలుగనగును. కౌసల్య కట్లుగాదు, ఏకపుత్రవిషయము. అమె నోములపంటయగుట ఆమె యానందము నభివృద్ధిచేయు వాడనుట సర్వసమంజసము. అట్లనుట మాత్రమున నతడు దశరథుని సంతోషపెట్టలేదనుట పొసగదు. 'రామోరతి కరః పితుః' అని యున్నది. దశరథునికంటె కౌసల్య తత్త్వమెఱింగినది. దశరథుడు కేవలము పామరమగు ప్రీతిని పాటించెను. శ్రీరాముని మహత్వము నెంతమాత్ర మెరుగడు' కావున విశ్వామిత్రుని పూజించి కోరినదాని నిత్తునని వాక్రుచ్చి శ్రీరాముని పంపుమని యడుగ దుఃఖ సాగరమున మునిగి వివేక శూన్యుడై వంశగౌరవము నేనియు పాటింపక 'ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః। న యుద్ధయోగ్య తామస్య పశ్యామి సహ రాక్షసైః॥ 'తామర పూవులవంటి నేత్రములుగల నా రామునకు పదునారేండ్లు నిండలేదు. రాక్షసులతో యుద్ధముచేయ నితనికి యోగ్యతలేదని తలంచుచున్నాననెను. 'అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్। వసిష్ఠోఽపి మహాతేజా యే చే మే తపసి స్థితాః॥

శ్రీరాముని నిజమగు పరాక్రమము నే నెరుగుదు. వసిష్ఠుడెరుగును. ఈ మును లెరుంగుదురు నీవెరుంగకున్న. అజ్ఞానముచే నీ వతని మాహాత్మ్యం బెరుంగవని స్పష్టముగ జెప్పెను. అంత వసిష్ఠుని వాక్యము విని తనకు రాగల చెడుగులగని విధిలేక సమ్మతించె. అత్తరి కౌసల్యాదేవి సంతోషముతో నిండు మనంబున శ్రీరాముని విశ్వామిత్రునివెంట నంపెను. కావున కాబోలు మార్గమున ప్రాతఃకాలమున శ్రీరాముని మేలుకొలుపునపుడు విశ్వామిత్రుడు 'కౌసల్యా సుప్రజా రామ' అని సంబోధించెను. సీతాదేవియు 'కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ' యనెను. కౌసల్యాపుత్రుడు విష్ణువేకాని బ్రహ్మాదులలో నెవ్వడుగాడు. 'నాహం నాహం న చాహం న చ భవతి

పునస్తాదృశో మాదృశేషు' నేనుగాను, నేనుగాను, అట్టివాడు మాలోలేదు, అని బ్రహ్మాదులు గజేంద్రుని మొరలు విని చెప్పిరి.

**గీ. విశ్వమయతలేమి వినియు నూరకయుండి**
**రంబుజాసనాదు లడ్డుపడక**
**విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు**
**భక్తియుతున కడ్డుపడఁ దలంచె.**

అన్నట్లు దేవతల కెల్లరకు శ్రేష్ఠుడై సర్వోత్కృష్టుడై సకల కల్యాణగుణ పరిపూర్ణు డగుటచే శ్రీహరికి సమానులు లేరనిన మించినవా రెవరు? అట్టి విష్ణువే పుత్రుడై యవతరింప కౌసల్యానోచిన నోము నేమనవచ్చును? కనుక 'కౌసల్యానందవర్ధనః' అనుట సర్వవిధముల నొప్పియున్నది.

'సముద్ర ఇవ గాంభీర్యే' యన సముద్రమునకు సాటియగు గాంభీర్యము గలవాడు. ఈ ప్రపంచములో నంతకంటె గంభీరమగు వస్తువెద్దియులేనందున గాంభీర్యమునకు సముద్రము ఉపమానముగ జెప్పబడియె. ఉపమేయంబున కుందగిన ఉపమానము గానందున నీచోపమయని చెప్పందగు. సముద్రము భూమికంటె పెక్కు రెట్లు పెద్దదగుటచే దానియందనేక గొప్ప పర్వతములును, తిమింగిలముకంటె గొప్ప ప్రాణులును, వెలలేని రత్నములును పగడములును ముత్యములును విశేషముగ నున్నను వాని యునికి తెలియజేయకుండునట్లు శ్రీరామచంద్రుడును తన మాహాత్మ్యం బిట్టిదని పరుల కెరుకపరచువాడుగాడు. సముద్రము చాల లోతైనను దానిలో మునిగి అమూల్యవస్తువుల దెచ్చు వారు లేరా? అట్లే దశరథునివలె రాముని మాహాత్మ్యం బెరుగనివారున్నను విశ్వామిత్ర వసిష్ఠాదులవలె జ్ఞానులు శ్రీరాముని మాహాత్మ్యం బెరింగి దానిం బ్రకాశింపంజేయ నవకాశములు గల్పించుకొనిరిగదా! సముద్రమెట్లు తిమింగిలమువంటి మహాసత్త్వముల కాశ్రయమగుటయేకాక చేపపిల్లలు



ఎండ్రకాయలు మొదలగు వానిని సైతము రక్షించునో యట్లే శ్రీరాముడు వసిష్ఠ విశ్వామిత్రాది మహర్షులనేగాక సామాన్యుల సైత మొక్క రీతిని రక్షించెను.

'ధైర్యేణ హిమవానివ'- పర్వతరాజమగు హిమాలయము పిడుగులు రాలినను, కుంభవృష్టిగ వర్షము సంభవించినను జడియక స్థిరముగ నుండునట్లు వ్యసనమున కెన్ని కారణములున్నను కొంచెమైనను వెనుదీయక సకల కష్టముల కోర్చి ధర్మనిర్వహణమె కర్తవ్యమని ధైర్యము వహించువాడు. స్థిరచిత్తుడు, మనోబల సమగ్రుడు, రాముడు.

**"గిరయో వర్షధారాభిర్హన్యమానానవివ్యధుః।**
**అభిభూయమానావ్యసనై ర్యథాऽధోక్షజచేతసః॥**

విష్ణువును స్మరించువారు, వ్యసనాభితప్తులైనను చలింపనట్లు వర్షధారలకు పర్వతము వ్యధనొందలేదు. విష్ణుస్మరణగల వారికట్టి శక్తియుండగా విష్ణువున కెట్టి స్థైర్యముండవలెను? సీతాపహరణానంతరము రాముడు దుఃఖింపలేదా యనిన హిమవత్పర్వతముయొక్క ఔన్నత్యము ననుసరించి దానిపై కప్పబడి యుండు మంచు కరిగినను పర్వత మెంతమాత్రము చలింపదో యట్టులే శ్రీరాముడు తా నాచరించు మానవ ధర్మము ననుసరించి లోక న్యాయముచే నట్లు శోక మభినయించెనే గాని అందుచే నతడెంతమాత్రము ధైర్యమువీడలేదు. లేకున్న జనస్థానమున ఖరదూషణాది పదునాల్గువేల రాక్షసులతో నొక్కడే యుద్ధము చేయంజాలునా? సీతాగ్నిప్రవేశము ననుమతించునా?

'విష్ణునా సదృశోవీర్యే'- పరాక్రమమున విష్ణుదేవునివంటి వాడని యర్థము. ఇతడెవరు? విష్ణువేగదా! అయిన నితని కితడే సాటి యన జెల్లునా? ఉపమేయముకంటె ఉపమానము భిన్నముగనుండవలయు గదా! 'గగనం

గగనాకారం సాగర స్సాగరోపమః' అన్నట్లు సాటిలేని వస్తువుల కవియేసాటి యనిచెప్పక వీలులేదుగదా! రాముడు విష్ణువునం దర్ధాంశము గావున పరత్వముకంటె నవతారము భిన్నమని చెప్పబడుచున్నది. 'స ఉ్రశ్రేయాన్ భవతి జాయమానః' పరత్వదశకంటె నవతారదశయం దెక్కువ శ్రేయోవంతుడగుచున్నాడు అని చెప్పుటవలనను అంశాంశులకు సామ్యము చెప్పుట యుక్తమె. మనుష్యులలో నతని కెవరు సాటిలేరు. ఇక దేవతలలోను వీర్యమున నతని కెవరు సాటిలే నందున 'విష్ణునా సదృశో వీర్యే' అనుట సర్వసమంజసము.

'కాలాగ్ని సదృశః క్రోధే'– శత్రుసంహార సమయమున ప్రళయకాలాగ్నివలె సకలమును దహించునట్టికోపము పూనును. ఉత్తరక్షణముననే సకల బాధల కోర్చునట్టి భూమికి తుల్యమగు సహనభావముగల ఘనుడు. ఐశ్వర్య యుక్తుడగుటయేగాక యీవియం దుత్తమశ్రేణికి జెందినట్టి కుబేరునివంటి త్యాగశీలుడు. వనవాసప్రయాణ సమయమున రాముని ఔదార్యత్యాగంబు లద్వితీయములు. సత్యమును సంపూర్ణముగ ననుష్ఠించుటలో ధర్మదేవతయేయన దగినవాడు. 'సత్యపరాక్రమం'– నిజమగు పరాక్రమముచే నెట్టి శత్రువునేని అవలీలగా జయింపగల వీరశిఖామణి.

ఇట్టి సకలసద్గుణోపేతుడగు శ్రీరాముని అభిషేకవార్త వినినంతనె పౌరులెల్ల రైకకంఠ్యముగ "ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీర మ్మహాబలమ్। గజేన మహతాయాన్తం రామం ఛత్రావృతాననమ్" అని పట్టాభిషేకకాలమున గొప్ప యేనుగు నెక్కి తెల్లనిగొడుగుచే నలంకరింపబడిన ముఖముతో ప్రకాశించు శ్రీరాముని దర్శనభాగ్యమున కువ్విళ్ళూరుచు మేఘంబులజూచి నృత్యముచేయు నెమళ్ళవలె ఆనందింప గోరుచున్నామనిరిగదా! లోకక్షేమమే తనక్షేమమేయనిభావించి ధర్మసంస్థాపనముచేయ నవతరించిన శ్రీరాముడే పరబ్రహ్మస్వరూపుడని



లోకంబున కెరిగింపబూని బ్రహ్మదేవుని పంపున నారదుడు వాల్మీకితో సంభాషించి శ్రీరామచరితమును 'పౌలస్త్యవధ'మను పేర వెల్లడింప నానతిచ్చెను.

'ధర్మస్య పరిరక్షితా'– ఉత్తముల మార్గమిదియని ధర్మమును మున్ను తా ననుష్ఠించి ఇతరులచే ననుష్ఠింపించియు ధర్మగ్లాని రానివిధమున ధర్మనిర్వహణము చేయువాడు. ధర్మమనుష్ఠించు వారినిప్పుడే రక్షించును. అధర్మ మాచరించువారికి వ్రణరోగికి శస్త్ర చికిత్సచేయునట్లు వ్యాధి యిత్యాదికష్టములచే పాపపరిహారములు కల్పించువారిని రక్షించును. మనకు కష్టములు సంభవించునపుడు దైవనిందచేయక అవి పాపపరిహారములని గ్రహించుటొప్పు.

'రక్షితా స్వస్య ధర్మస్య'– తన ధర్మము శరణాగతరక్షణము. దానిని చక్కగ నిర్వర్తించి వారివారి వర్ణాశ్రమ ధర్మములను రక్షించువాడు.

**శ్లో॥ ధర్మోపదేశసమయే జనాస్సర్వేపి పండితాః,**
**తదనుష్ఠానసమయే మునయోఽపి న పండితాః'.**

అన్నట్లు లోకములో నితరుల కుపదేశముచేయుటలో సామర్థ్య మెరింగించి స్వానుష్ఠాన రహితులుగ నుండువా రెక్కువ. రామచంద్రుడట్లుగాక బాల్యయౌవనాద్యవస్థల నెల్ల ధర్మములన్నింటిని నిర్వహించి చూపినందున' రాముడు చేసినట్లు, కృష్ణుడు చెప్పినట్లు' అనుసామెత వ్యాపించినది.

'స్వజనస్య చ రక్షితా' ఇతరులను గాపాడుట యనునది సామాన్యుల కంటెవిశేషశక్తి సంపన్నులమాట. అట్టివారిలో ఖ్యాతి లాభాదుల నుద్దేశించి యితరుల రక్షించి తమవారిని లక్ష్య పెట్టక రక్షింపకుండుటయు సంభవమే. కాని రామచంద్రుడట్లుగాక తన్నాశ్రయించిన శరణాగతులవలెనే స్వకీయుల సైతము రక్షించు స్వభావముగలవాడు.

'వేదవేదాంగతత్త్వజ్ఞః'- తెలియదగిన సకలధర్మముల దెలుపునది వేదము ఋగ్యజుస్సామాధర్వణములని వేదములు నాలుగు. వేదార్థజ్ఞానము గ్రహింప సహకరించునవి వేదాంగములు. ఇవి యారు, 1. వేదములోని అక్షరములకు స్థానస్వరాదుల బోధించునది శిక్ష. 2. వేదశబ్ద సాధుత్వమును దెలుపునది వ్యాకరణము. 3. పద్యలక్షణముల దెలుపునది ఛందము. 4. ఇట వర్ణాగమము, ఇట వర్ణలోపము ఇత్యాదుల నిర్ణయించునది నిరు క్తము. 5. వేదోక్త కర్మానుష్ఠాన కాలనిర్ణయము చేయునది జ్యోతిషము. 6. వేదోక్త కర్మానుష్ఠానక్రమమును దెలుపునది కల్పము.

'ధనుర్వేదే చ నిష్ఠితః'- క్షత్రియునకు లోక రక్షణార్థము ధనుర్ధారణ మవశ్యకర్తవ్యము. దానిం ధరించుట, నారిగూర్చుట, బాణసంధానము చేయుట, ప్రయోగోపసంహార క్రమము లెఱుగుట గొప్పవిషయము. కనుక దానిని వివరించునది ధనుర్వేదము. ఇయ్యది 1. ధనుర్వేదము, 2. ఆయుర్వేదము. 3. గాంధర్వవేదము. 4. అర్థశాస్త్రము అను వానిలో మొట్టమొదటిది. వైదికధర్మానుష్ఠానమునకు విరోధముగ రోగము వచ్చిన దానికి పరిహారము కల్పించునది ఆయుర్వేదము. ఇది ధన్వంతరి, చరక, సుశ్రుత, వాగ్భటాదికృతము. నాట్యగీత శాస్త్రము గాంధర్వవేదము. ఇది సామగానమున నుపయోగించును. భరతశాస్త్రాదులు, చాణక్య కామందకాది నీతి శాస్త్రము-అర్థశాస్త్రము వైదిక కర్మానుష్ఠానమునకై వలయు ద్రవ్యార్జన కుయోగించును.

**శ్లో॥ సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్।**
**సర్వలోకప్రియస్సాధురదీనాత్మా విచక్షణః॥**

'సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః'- ముందుచెప్పిన శాస్త్రములుగాక ఉపాంగములైన శాస్త్రములు: 1. ధర్మశాస్త్రము, 2. పురాణము, 3. న్యాయశాస్త్రము, 4. మీమాంసయని నాలుగు విధములు : 1. ధర్మశాస్త్రము :- వేదపూర్వకాండార్థ వివరణము, 2. పురాణము :- వేదాంతార్థ వివరణము, 3&4. న్యాయమీమాంసలు: - సకల పదార్థజ్ఞాన వివరణమున కుపయోగించును. ఇట్టి శాస్త్రార్థజ్ఞానసంపన్నులలో శ్రేష్ఠుడు. 'స్మృతిమాన్' శాస్త్రములు నేర్చినవా రెందరోకలరు గాని వాని నన్నింటిని సదా జ్ఞప్తి యందుంచుకొనుటయను అసాధారణ శక్తికలవాడు. 'ప్రతిభానవాన్' తానొకపరి వినిన విషయమునుగాని, వినని విషయమునుగాని వాదవ్యవహార కాలమున యుక్తికి దగిన ప్రతియుక్తి అప్పటి కప్పుడే తోచుబుద్ధివికాసము గలవాడు.



'సర్వలోకప్రియః' 'సర్వే లోకాః ప్రియా యస్య స సర్వలోకప్రియః' యనియు సర్వేషాం లోకానాం ప్రియః, అనియు నిర్వచనము లుండుటచే ఎవనికి లోకు లెల్లరు ప్రియులో వాడు లోకుల కందరికి ప్రియు డగును. ఇతనిని ప్రేమింపనివారు లేరనియే చెప్పనొప్పును. ఇత డుత్తమ పురుషశుభలక్షణములచేతను, కల్యాణగుణగణములచేతను, వేదవేదాంగశాస్త్రాదులలో అద్వితీయ ప్రజ్ఞావిశేషముచేతను, సర్వజన హృదయాపహారి అయ్యెననుట నిర్వివాదాంశము.

'సాధుః'- వేషాడంబర వాగాడంబరములు లేక నివురుగప్పిన నిప్పువలె అపకార శతములు గావించిన వారికేని ఉపకారమే చేయు స్వభావముగలవాడు. 'ఆదీనాత్మా'- సాధువనినంత మాత్రమున ఇతరుల కెంతమాత్రము చులకన దోచునట్టివాడుగాక గంభీర స్వభావుడు. దుఃఖ పరంపరలు సంభవించినను కలకలేని మనోభావము గలవాడు. 'విచక్షణః'- వైదిక లౌకిక క్రియాకలాపముల ఆయాకాలానుగుణముగ సఫలముగ నిర్వర్తింప సమర్థుడు.

**శ్లో॥ సర్వదాఽభిగతస్సద్భి స్సముద్ర ఇవ సింధుభిః।**
**ఆర్యస్సర్వసమశ్చైవ సదైకప్రిదర్శనః॥**

'సర్వదాభిగతస్సద్భిః'– గొప్పగొప్ప నదులు సముద్రమున జేరుటచే గౌరవము పొందునేగాని ఎన్నినదులెన్ని దిక్కులనుండి యెంత నీరుదెచ్చి తనలో జేర్చినను సముద్ర మెట్టికలత జెందనట్లే శస్త్రాభ్యాస కాలాది అభ్యంతరకాలములలో సైతము సత్పురుషులచే నాశ్రయింప బడి వారివారి సంశయాదుల నప్పటి కప్పుడే తీర్చి వారిని సంతోషపెట్టుచుండును. ఇట్లు వచ్చువారిలో వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులు, శీలవృద్ధు లనేకు లుందురు. ఇందులో గమనింపవలసిన విషయము జ్ఞానార్జనముచేయువారు చిన్నవారియొద్ద విద్యగ్రహింప వెనుదీయరాదు, వయోవృద్ధులు మనవద్ద విద్య గ్రహింప వచ్చిరిగదా యను అహంభావము విద్యావంతులకు నుండరాదని విస్పష్ట మగుచున్నది.

'ఆర్యః'– సర్వవిధముల పూజ్యుడును 'సర్వసమః'– బీదలని, ధనికులని, విద్వాంసులని, పామరులని ఆదరాతిశయములలో భేదభావములేనివాడని యర్థము, అంతమాత్రమున వారి వారి యంతస్థులకు మర్యాదలోటులేక వారు చిన్నబో కుండురీతిని మెలగువాడని యుర్థము. 'సదైకప్రియదర్శనః' కొందరు కొన్ని సమయములందు సుముఖులుగను, కొన్నివేళలం దితరులపట్ల విముఖులుగ నుండుటయు గలదు. అట్లుగాక శ్రీరాముడెల్ల వేళల నందరి కొకేవిధముగ చంద్రునివలె మనోహరుడుగనే యుండును.

**శ్లో॥ స చ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః।**
**సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ॥**

ఇంతకుముందు శ్రీరాముని సౌలభ్యము వివరింపబడినది. 'సర్వగుణోపేతః' అనుటచే రామచంద్రుని అఖిలకల్యాణగుణాకరత్వము. తెలుపబడుచున్నది.



**శ్లో॥ ఇషుక్షయాన్నివర్తంతే, నాంతరిక్షక్షితిక్షయాత్।**
**మతిక్షయాన్నివర్తంతే, న గోవిందగుణక్షయాత్॥**

అన్నట్లు విలుకాడు బాణములు ముగియుటచే బాణములు వేయుట నిలుపునుగాని ఆకాశమున నెడములేదనికాదుగదా! అట్లే భగవంతుని నుతించువాడు తన బుద్ధికందలేదని విరమించుకొనునేగాని భగవంతుని గుణము లిక లేవని కాదు, కనుక అనంతమగు భగవద్గుణముల లెక్కింప వీలులేదని కవి సంగ్రహించుచున్నాడు. ఇట్టివాడెవడోకాడు. పరమపావనియగు దితికి సాటి యనందగు కౌసల్యాదేవి యానందమును వృద్ధిచేయ నవతరించిన విష్ణుదేవుడే శ్రీరాముడు. 'యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' అను శ్రుతి మనోవాక్కులు భగవంతుని గుణగణముల వర్ణింపలేక విరమించుకొనిన వనికదా ప్రసిద్ధి. 'కౌసల్యానందవర్ధనః' అనుట కేమికారణమో విచారింతము. దశరథుడు యజ్ఞయాగాదులుచేసి లేకలేక దైవానుగ్రహమున బడసినపుత్రులలో జ్యేష్ఠుడు శ్రీరాముడు. దశరథుడు కాముకుడు. కైకేయిచేజిక్కి తన కనత్యదోషము రాకుండుటకై నిరపరాధియగు రాము నడవికి బంపెను. విశ్వామిత్రుడు రాముని పంపునట్లుకోరినంతనే తబ్బిబ్బులై రాముడు బాలుడని రాక్షసులతో యుద్ధముచేయలేడని రాముని పంపినవెంటనే తన ప్రాణము మేన నిలువదని ఆడినమాట తప్పుటకైనను సమ్మతించెను. కౌసల్యాదేవి దశరథున కంటె తనకు రాముని యందలి గారాబ మధికముగనున్నను మహర్షి యుద్దేశమును రాముని క్షేమమును గుర్తించి రాముని మునివెంట బంపుటకు సిద్ధముగనుండెను. అందువలన దశరథునికంటె ఆమె శ్రేష్ఠురాలని సూచించుటకై కవి కౌసల్యా నందవర్ధనుడని చెప్పెను. మఱియు దశరథున కనేక భార్యలు. వారిలో నెవరి పుత్రుడోయని సందేహము లేకుండుటకై ఏక పుత్రుని కలిగిన పట్ట మహిషి కుమారు డనియు సూచితము. అంత మాత్రమున రాముడు తండ్రి

యందు ప్రేమలేని వాడనరాదు. ఏలన 'రామో రతికరః పితుః' అనియు 'పితృశుశ్రూషణే రతః' అనియు తండ్రియం దెక్కువ మక్కువమాత్రము గాక శుశ్రూషయం దానందించువాడనియు తెల్లమగుచున్నది.

'సముద్ర ఇవ గాంభీర్యే' భగవంతువి గుణములనుబోల్చి చెప్పుటకు తగిన వస్తువులు లేనందున ఉన్న వానిలో గొప్పవగు వస్తువులనే యుదాహరింప నుపయోగింతుము. గాంభీర్యమనిన తనలోతు నితరులకు దెలియజేయనిది యని యర్థము. సముద్రము తనలోనున్న రత్నాదులను పర్వతములను గూఢముగ నుంచుకొని యుండునట్లు శ్రీరాముడు తన మహిమలను దెలియనీయక సామాన్యమానవునివలె నటించుచుండెను.

'ధైర్యేణ హిమవానివ'– సాధారణముగ నొక పర్వతముపై వర్షధారా పతన మెంతయున్నను ఆ పర్వతము చలించనట్లు దుఃఖపడవలసిన కారణము లెన్నియున్నను లేశమైనను కలతచెందని మనసుగలవాడని యర్థము. హిమవత్పర్వతము నుపమానముగ జెప్పుటలో నొక విశేషమేమన మహోన్నతమగు హిమవంతము మంచుగడ్డలతో నిండియుండుటచే సూర్యోష్ణముచే నొకవేళ పైనున్న మంచొకించుక కరగినను గ్రిందనుండు రాయి కరుగదు. అట్లే కొన్నివేళలందు రామచంద్రుడు చింతిలునట్లు గనబడినను నిజముగ నతడెంతమాత్రము చలించువాడు గాడని భావము.

**శ్లో॥ విష్ణునా సదృశో వీర్యే సోమవత్ప్రియదర్శనః।**
**కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః॥**

'విష్ణునా సదృశోవీర్యే'– రాముడు విష్ణువుయొక్క అర్ధాంశము. అట్లుండ నతనికతడేసాటి యనజెల్లునా? అనిన సముద్రమునకు సముద్రమేసాటి. ఆకాశమున కాకాశమేసాటి, అట్లు విష్ణుదేవుడు వీర్యమున నద్వితీయుడు. అతని యర్ధాంశమగు రామచంద్రు డతనికి సాటియనుటలో



ననౌచిత్యములేదు. "సుశ్రేయాన్ భవతి జాయమానః" అనగా పరత్వదశకంటె నవతారదశయం దెక్కువ శ్రేయోవంతు డగుచున్నాడని శ్రుతి. కనుక నంశాంశులకు సామ్యము యుక్తమే. దుర్వాసునిపై ప్రయోగించిన విష్ణుచక్రమున కెదురులేనట్లే కాకాసురునిపై ప్రయోగించిన దర్భపోచను బ్రహ్మాదులు వారింపలేరైరి.

'సోమవత్ప్రియదర్శనః'– ఏడ్చుచున్న బిడ్డకు చంద్రునిచూపినంతమాత్ర మున ఆ బిడ్డ యేడ్పుచాలించుట లోకానుభవమే. అంతేగాదు. ఆ బిడ్డను చంద్రుడు నవ్వించును. కావున దుఃఖనివృత్తియేకాక ఆహ్లాదము గలిగించుటయు చంద్రునికృత్యములు. అట్లే రామచంద్రుడు ప్రజల దుః ఖమును బోగొట్టుటయేగాక వారి కపరిమితానదము గూర్చును. వృద్ధిక్షయములుగల సోమునికంటె రామచంద్రునకు దుఃఖోపశమనాహ్లా దకరత్వములు నిత్యములైనవి.

'కాలాగ్ని సదృశః క్రోధే'– ఇంతకుముందు వీర్యమును ప్రియదర్శనత్వ మును వర్ణించి యిచ్చట శ్రీరాముని కోపమెట్టిదో వివరింపబడుచున్నది. చంద్రునివలె చల్లని ప్రభువునకు కోపమెట్లుకలుగును? ఏల కలుగును? అని ప్రశ్నించుట సమంజసమే. జగత్సృష్టిక్రమమున అగ్నినుండి నీరుత్పత్తియైనట్లును, ప్రళయకాలమున జలమునుండి అగ్నిపుట్టి అన్నిటిని దహించివేయుననియు చెప్పుదురు. చల్లని ప్రభువగు రామచంద్రునకు సహజముగ శాంతమే ప్రధాన గుణము. కాని సంహారము చేయునపుడు క్రోధము దెచ్చుకొనును. మనదేశములో లేని వస్తువు నితరదేశమునుండి తెచ్చుకొనునట్లు యుద్ధసమయమున క్రోధము దెచ్చుకొనును. అరణ్య ప్రవేశముచేయుచు ఋషుల కభయమిచ్చి దుష్టరాక్షస సంహార నిమిత్తము 'క్రోధమాహారయత్తీవ్రమ్' అని తూణీరమునుండి బాణమును ఎత్తుకొను

విధమున క్రోధము దెచ్చుకొనెననియున్నది. శ్రీరామునకు తనపట్ల అపరాధశతంబులు చేసినను కోపమురాదు. కాని తన యాశ్రితుల విషయమై అపరాధముచేసిన వారిని తన శత్రువులుగ భావించి సాధు పరిత్రాణ నిమిత్తము దుష్టసంహారముచేయును.

'క్షమయా పృథివీ సమః'– భూమిమీద మనమెట్టి యసహ్యకృత్యములు చేసినను, భూమిని యెంతలోతు త్రవ్వినను నచేతన మగుటచే అదియన్నిటిని సహించునట్లు 'న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా' తనకెంద రెన్ని యెగ్గులుచేసినను మనసులోనైన తలంపదు. కనుక ఓర్పులో రాముడు భూమివంటి వాడని చెప్పుదురు.

'ధనదేన సమస్త్యాగే'– ఉత్తరదిగధిపతియగు కుబేరుడు ఐశ్వర్యవం తుడగుటయే కాక గొప్ప త్యాగి. దానవీరుడని ప్రసిద్ధి. 'కృతేయుగే బలిర్దాతా త్రేతాయాం రఘునందనః ద్వాపరే సూర్యపుత్రశ్చ' యని ఆయా యుగమున దానవీరులని వీరికి కీర్తిగాని కుబేరునకు కాలనిర్ణయము లేనందున ఎల్లప్పు డతడు దాతృత్వమునకు ప్రసిద్ధు డని స్పష్టమగుచున్నది. రామచంద్రుడట్టి కుబేరునితో తులతూగు వాడని తెలియచున్నది.

'సత్యే ధర్మ ఇవాపరః'– నిత్యసత్యవ్రత మనుష్ఠించుటలో రెండవ ధర్మ దేవతయనదగినవాడు. సత్యవ్రతమునకు హరిశ్చంద్రుడుగదా సుప్రసిద్ధుడు అని సంశయము గలుగవచ్చును. కాని వీరిరువురిలో ఒక గొప్పగుణభేద మున్నది. హరిశ్చంద్రుడు తనకు సత్యవ్రతము భంగముగాకుండునట్లు మాత్రము వర్తించెను. రామచంద్రు డన్ననో తన నిత్యసత్యవ్రతమును గాపాడుకొనుటయే గాక తండ్రి కసత్యదోషము గలుగకుండునట్లు వర్తించెను. అ+పరధర్ముడు అనగా విష్ణువు యొక్క యుత్కృష్టగుణముగలవాడు, అకారవాచ్యుడు విష్ణువు. అకారమే నారాయణుని మొదటిపేరు. అతని



పరధర్మము లోకరక్షణము. దానినే తన పరధర్మమని యెంచినవాడు శ్రీరాముడు. కనుక నారాయణునకువలె నితనికి సత్యస్వరూపత్వ సత్యమయత్వ సత్యకామత్వ సత్యసంకల్పత్వములు గలవు. వేయేల? భగవంతు డితడేయని నిరూపింపబడుచున్నది. దీనిని వెల్లడిచేయుటకై నారదుడు సంగ్రహముగ రామకథను వాల్మీకిమహర్షి కుపదేశించి శ్రీమద్రామాయణము వ్రాయ పురికొల్పెను. అట్టి రామాయణ ప్రభావ మెట్టిదో పరిశీలింతము.

# శ్రీమద్రామాయణ మహిమ

వేదములోని కర్మకాండార్థమును మన్వాది ధర్మశాస్త్రములు వివరించును. ఇతిహాస పురాణములు వేదాంతార్థమును విశదీకరించును' 'యతో వా ఇమాని' అను విషయవాక్యము సృష్టి స్థితి లయముల కెద్ది మూలకారణమో అది బ్రహ్మమని చెప్పుచున్నది. జగజ్జన్మాదులకు కారణమగు పరబ్రహ్మము విష్ణువా లేక బ్రహ్మ రుద్రాదులా యను విచారణలో శ్రీమద్రామాయణము శ్రీరాముడై యవతరించిన విష్ణువే వేదాంతములలో చెప్పబడిన పరబ్రహ్మమని ఉద్ఘోషించుచున్నది. ఇందుకు కొన్ని ప్రమాణములుగలవు. అవి యేవియన: 1. ఉపక్రమము, 2. ఉపసంహారము, 3. అభ్యాసము, 4. అపూర్వత, 5. ఫలము, 6. అర్థవాదోత్పత్తి అనునవి.

1. ఉపక్రమములో 'కో న్వస్మిన్' మొదలు 'జాతరోషస్య సంయుగే' యనువరకు వాల్మీకి నారదుని వేదాంతములచే జెప్పబడిన సకలగుణ సంపన్ను డెవడని సామాన్యముగ ప్రశ్నచేసెను. ఇందుకు 'ఇక్ష్వాకు వంశప్రభవో' మున్నగు శ్లోకములచే రాముడుగ నవతరించిన విష్ణువే పరబ్రహ్మమని నారదుడు విశేషించి యుత్తరము చెప్పెను.

2. ఉపసంహారములో 'తవాహం పూర్వకేభావే' యిత్యాది శ్లోకములచే జగత్సృష్టికర్తయగు బ్రహ్మకును ఉత్పత్తి కారణమగుటచే విష్ణువే పరబ్రహ్మమని చెప్పబడినది.

3. అభ్యాసములో (రామాయణములో నచ్చటచ్చట) 'ఏతస్మిన్నంతరే విష్ణుః' ఇత్యాదిశ్లోకములచే జగత్కారణత్వము విష్ణువునకే చెప్పబడినది. 'త్వం గతిః పరమా దేవ' ఇత్యాదులచే సర్వరక్షకత్వము విష్ణువునకే చెప్పబడినది. 'తతో దేవర్షిగంధర్వా' అనుటచే దేవతలచేత గూడ పొగడ బడువాడు విష్ణువేయని తెల్లమగుచున్నది. 'అహం వేద్మి మహాత్మానం'



అనుటచే తపోబలము లేక పరబ్రహ్మము నరయుట సాధ్యముకాదని విశ్వామిత్రుని యభిప్రాయముగ దెలియుచున్నది. 'అవ్యక్తప్రభవోబ్రహ్మా' అనుటచే సర్వమూలకారణము విష్ణువునకేగలదని వసిష్ఠుని వాక్యమువలన నేర్పడుచున్నది. 'అధికం మేనిరే విష్ణుం' ఇత్యాదివాక్యములచే సర్వదేవతాధికత్వము విష్ణువునకేగలదని విశద మగుచున్నది. 'ఆకాశప్రభవోబ్రహ్మా' ఇత్యాదిశ్లోకములచే స్వయంప్రకాశత్వము, వ్యాపకత్వ మతనికే చెప్పబడియున్నది. 'అప్రమేయం హి తత్తేజః' అనుటచే అపరిమిత మహిమ అతని కున్నదని విశద మగుచున్నది. 'నివాస వృక్షస్సాధూనాం' అనుటచే జగదాధారకత్వ మితనికే గలదని యేర్పడుచున్నది.

'బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా' ఇత్యాది వాక్యములచే సర్వసంహారకు డితడే యనియు 'కిం వైష్ణవం వా కపిరూపమేత్య' యనుటచే నితని కనంత రూపములు గలవనియు విస్పష్టమగుచున్నది. 'వ్యక్తమేషమహాయోగీ' ఇత్యాది శ్లోకములచే పరమాత్మత్వము, శ్రియఃపతిత్వ మితనికే గలవని విశదమగుచున్నది. 'భవాన్నారాయణో దేవః' అనుటచే నారాయణ శబ్దవాచ్యుడు రామ రూపియగు విష్ణువే యని వివరింప బడుచున్నది.

4. అపూర్వత : ఇతర ప్రమాణములచే తెలిసికొనవీలులేని పదార్థము యొక్క స్వరూపమును దెలిసికొనుట అపూర్వత యనబడును. ప్రత్యక్ష, అనుమాన, ఆగమాదులవల్ల నిర్ధారణచేయుటకు వీలుకాని విష్ణుపరత్వమును శ్రీ మద్రామాయణము నిర్ధారణచేయుచున్నది. అందువలన అపూర్వత యను కారణము రామాయణములో నున్నదని తెలియుచున్నది.

5. ఫలము : భగవత్సాలోక్యాది ఫలము నిచ్చువాడు విష్ణువేయని యీ గ్రంథము తుదలో నేర్పడుచున్నది.

6. అర్థవాదోత్పత్తి : 'ఇమే ద్వే ధనుషీ శ్రేష్ఠే' అనుటచే నర్థవాదమును జెప్పి 'జృంభితం తద్ధనుః దృష్ట్వా శైవం విష్ణుపరాక్రమైః। అధికం మేనిరే విష్ణుం దేవా స్సర్షిగణాస్తదా' ఇత్యాది శ్లోకములచే బ్రహ్మాది దేవతలు మీమాంసాపూర్వకముగ విష్ణువే అధికుడని తెలిసికొనియుండుటచే ఉపపత్తి చెప్పబడినది.

'అజాయమానో బహుధా విజాయతే', 'యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత' ఇత్యాది వాక్యములచే నవతారములచే పరత్వమున కెంతమాత్రము భంగమురాదని యేర్పడుచున్నది.

'యా గతి ర్యజ్ఞశీలానాం' 'న చ పునరావర్తతే' 'మత్కృతే నిధనం' ఇత్యాది వాక్యములచే మోక్షప్రదత్వము విష్ణువునకు గలదని విశదమగుచున్నది. ఇట్లు ఉపక్రమము మొదలు ఆరు విధములుగ వేదాంతములో జెప్పబడిన పరతత్త్వము విష్ణువేయని శ్రీమద్రామాయణము ఘోషించుటచే అది వేదోపబృంహణ మని వాసిగాంచినది.

శ్రీమద్రామాయణము మహార్ణవ మనబడుచున్నది. అందులోని కాండములే జలము. ఏడుకాండములలో నేడు వ్యాహృతుల యర్థ మిమిడింపబడినది. బాలకాండమున 'ఓం భూః' అను వ్యాహృత్యర్థము కలదు.

**శ్లో॥ శ్రీవిష్ణోః ప్రథమే కాండే, జగజ్జననహేతుతా**
**ద్వితీయే స్థితిహేతుత్వం, తృతీయే మోక్షదాయితా**
**చతుర్థే గుణసంపత్తిః, పంచమే సర్వహంతృతా**
**షష్ఠే వేదాంతవేద్యత్వం, సప్తమే స్రష్టృహేతుతా**
**ఏవం విష్ణోః పరం తత్త్వం, రామాత్మేతి సునిశ్చితమ్,**

అనగా బాలకాండమున రామచంద్రుడుగ నవతరించిన విష్ణువే జగజ్జనన కారణ మనియు, అయోధ్యాకాండలో ప్రపంచస్థితి కాయనయే



కారణ మనియు, అరణ్యకాండములో నతడే మోక్షదాతయనియు, కిష్కింధాకాండములో నతని కల్యాణగుణాకరత్వమును, సుందరకాండములో ప్రళయ హేతుత్వమును, యుద్ధకాండమున నతనివేదాంతవేద్యత్వమును, ఉత్తరకాండములో నతని బ్రహ్మ జనకత్వమును చెప్పబడి శ్రీరామావతార మెత్తిన విష్ణువే పరతత్త్వ మని సునిశ్చిత మగుచున్నది.

ఇట్టి పరతత్త్వమును బొంద నుపాయ మెద్దియను ప్రశ్నకు వేదములలో చెప్పబడిన శరణాగతిని దెలుపుచు వాల్మీకి రామాయణములో ఉపక్రమము మొదలు ఉపసంహారమువరకు ఆయా యధికారులను, ఫలవిశేషములను దెలిపి శరణాగతిశాస్త్రమును విశదీకరించుచున్నాడు.

**శ్లో॥ అనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్**
**రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణం తథా**
**ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః॥**

అనగా ఒకవ్యక్తి యొకరి నాశ్రయింపబోవునపు డా యధికారి తన కనుకూలముగనుండునని నిశ్చయించి తనకు ప్రతికూలుడగువానిని వదలెదనని సంకల్పించి తానాశ్రయింపబోవువ్యక్తి తన్ను రక్షింపగలడని తప్పక రక్షించునని దానికిందగిన శక్తిసామర్థ్యంబులుగలవాడని దృఢమైన నమ్మకముగలిగి ఒక్క పర్యాయమైన నతని రక్షింపుమని వేడి తన యాత్మ నతని చరణారవిందములందు సమర్పించుట యను కృత్యము లనుష్ఠించుట సాంగభరసమర్పణముచేసినట్లగును. అట్టి శరణాగతుడగువాడు తన్ను దాను కాపాడుకొనలేకయు తన్నితరు లెవరును కాపాడ రనియు ననగా తా నకించనుడుగను, అనన్యగతికుడుగ నుండవలెను. ఇట్లు శరణాగతి ననుష్ఠించినవానినే గాక భగవంతు డతని భార్యాపుత్రాదులనుగూడ రక్షించును.

ఇట్టి శరణాగతియొక్క ఫలము భగత్కైంకర్యమే యనియు రామాయణము చాటుచున్నది. రామావతారమునకు మున్ను దేవతలెల్లరు విష్ణుదేవుని శరణుజొచ్చి భగవత్కైంకర్యమే ప్రధానఫలమని తలచి యప్సరసల గర్భములందు వానరులుగ బుట్టిరి. వీరి శరణాగతికి సామాన్యఫలము రావణవధ. కాని కైంకర్యమే ప్రధాన ఫలమనుట భరత లక్ష్మణాదుల వృత్తాంతములలో కనుగొన నగును.

ఇట్టి శరణాగతికి పురుషకారము (సిఫారసు) ముఖ్యము. పురుషకారము చేయువారికి కృప, పారతంత్ర్యము, అనన్యార్హత్వ మనునవి యుండవలెను. ఇట్టి గుణములతో నిండియున్న సీతాదేవి పురుషకారము వలననే కాకాసురుని తల నిలిచెను. అట్టి పురుషకారము లేనందున రావణుని తల తెగిపోయెను. సుగ్రీవాదుల పురుషకారమువలన విభీషణుడు భగవంతుని యనుగ్రహము నకు బాత్రు డయ్యెను. ఇట్లే హనుమంతుని పురుషకారమువలన సుగ్రీవునకు రాములవారితో నగ్నిసాక్షికమగు సఖ్యము కలిగెను. ఇట్లే రాక్షస స్త్రీలకు ప్రాణహాని హనుమంతునివలన తప్పిన కారణము సీతాదేవియొక్క పురుషకారము వలననే.

'అహమస్యావరోభ్రాతా', 'కురుష్వమామనుచరం' 'కృతార్థోహం' అను లక్ష్మణుని వాక్యములచే శరణాగతి చేయువానికి భగవచ్ఛేషత్వము ఫలమనియు, 'విలలాప సభామధ్యే' 'సర్వాత్మనా' ఇత్యాది శ్లోకములలో భరతుని యాచారము దెలిపి శరణాగతిచేయువారికి భగవత్పారతంత్ర్యము చెప్పి నట్లగుచున్నది.

'గచ్ఛతా మాతులకులమ్' ఇత్యాదులచే శత్రుఘ్నుని చరిత్రమును శరణాగతునకు భాగవత పారతంత్ర్యమును ఫలమగుచున్నదని తెలియుచున్నది. శరణాగతిచేయునట్టి యధికారికి అర్థపంచక జ్ఞానముండ వలెను. అవి యేవియన 1.ప్రాప్యమగు బ్రహ్మస్వరూపము, 2. ఆ



బ్రహ్మమునుబొందు జీవాత్మ స్వరూపము, 3. జీవాత్మ బ్రహ్మమును పొందుట కుపాయము, 4. ఆ యుపాయముచే పొందు ఫలమును, 5. అట్టి ఫలమును పొందనీయక విఘ్నముచేయు విరోధి స్వరూపమును తెలియవలెను. శ్రీమద్రామాయణములో శ్రీరామకథవలన బ్రహ్మ స్వరూపమును, లక్ష్మణాదుల వృత్తాంతమువలన జీవాత్మస్వరూపమును, దేవతలు, ఋషులు, విభీషణాదు ఇత్యాదు లనుష్ఠానముచే శరణాగతి యను ఉపాయస్వరూపమును, విభీషణాదుల వృత్తాంతముచే శరణాగతికి ఫలమగు భగవత్కైంకర్యమును తెలుపబడుచున్నవి.

బ్రహ్మ రుద్రాదులచే వరములు పొందిన రావణుడు నశించుటచే బ్రహ్మ రుద్రాదులకును, దశరథుని వృత్తాంతముచే తండ్రికిని, కాకాసురుని వృత్తాంతముచే మహాపతివ్రతయగు శచీదేవివంటి తల్లికిని, విభీషణుడు, ఇంద్రజిత్తు మొదలగువారి వృత్తాంతములచే సోదరులకును కుమారులకును రక్షించు శక్తిలేదని ముల్లోకములు తిరిగి వెదకినను శరణాగతరక్షకుడగు శ్రీరామచంద్రుడే పరమగతియని శ్రీమద్రామాయణము ఘోషించుచున్నది.

హనుమంతుని కృత్యములచే అర్థపంచకజ్ఞానము ఆచార్యునివలన లభించుననియు అట్టిజ్ఞానము పొందినవాడు కృతకృత్యుడై మృత్యువును ప్రియాతిథిగ భావించి దేహావసానకాలము నెదురుచూచుచుండును. 'శరైస్తు సంకులాంకృత్వా' అను శ్లోకములో సీతాదేవి చెప్పిన మాట చొప్పున ఆమె దృఢసంకల్పమును దెలుపు నట్లయినది.

ఇచ్చట లంకానగరము శరీర మనియు, రావణకుంభకర్ణాదులు అహంకార మమకారములనియు, ఇంద్రజిత్తు మొదలగువారు కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యములను అరిషడ్వర్గమనియు, విభీషణుడు వివేకమనియు, లంకలో చెరలోనుండు సీతాదేవి సంసారబంధమున

దగులుకొనిన జీవాత్మయనియు ఇట్టి చేతనుని యుద్ధరించు వా డాచార్యుడనియు అట్టి యాచార్యకృత్య మొనరించినవాడు హనుమంతుడనియు స్పష్టముగ దెలియుచున్నది.

అర్థపంచకజ్ఞానముగలవాడు రావణాదులవలె ధర్మముచేయక రామా దులవలె ధర్మమనుష్ఠింపవలెననియు నతడొక భగవత్సన్నిధిగలచోట వసించుట యుక్తమనియు కోసలదేశ ప్రజల వృత్తాంతముచే విశదమగు చున్నది.

సదా రహస్యత్రయములలో రెండవదియగు ద్వయమంత్రము అర్థయుక్తముగ నుచ్చరింపవలెననుట శ్రీభాష్యకారుల నియమనము. ఇట్టి ద్వయమంత్రార్థమును వివరించుటచే రామాయణమునకు దీర్ఘ శరణాగతి గ్రంథమని పేరు గలిగినది. ఇందులో బాలకాండమున 'శ్రీమత్' శబ్దార్థము, అయోధ్యా కాండములో శ్రీరామకల్యాణగుణములను వర్ణించి 'నారాయణ' శబ్దార్థము, ఆరణ్యకాండలో 'తేతం సోమ' ఇత్యాది శ్లోకములచే రాముని దివ్యమంగళ విగ్రహమును వర్ణించి 'చరణ' శబ్దార్థము, కిష్కంధ, సుందరకాండములలో "శరణు" శబ్దార్థము, యుద్ధకాండలో 'ప్రపద్యే' అను పదముయొక్క అర్థము, ఉత్తరకాండములో ముక్తిఫలము చెప్పుటచే నీ మంత్రము యొక్క ఉత్తర ఖండార్థము చెప్పబడినది.

'న మాతుః పరదైవతమ్' అను శాస్త్రార్థము ననుష్ఠించి 'కౌసల్యానంద వర్ధనుడను ఖ్యాతిచెందిన వాడు రామచంద్రుడు. శ్రీమద్రామాయణము 'న గాయత్ర్యాః పరం మంత్రమ్' అను మాటను సార్థకపరచి దానింజపింప ననర్హులనబడువారికి అద్దానిఫలము గలుగవలెనను సత్సంకల్పముతో రామాయణము నిత్యపారాయణ కత్యావశ్యకమని తెలుపుటకై గాయత్రీమంత్రము నిందు వివరించియున్నారు. బాలకాండమున జగత్తుయొక్కసృష్టి స్థితి లయములకు కారణభూతుడగు భగవంతుని స్వరూప



వర్ణనచే 'తత్సవితృ' శబ్దార్థము, అయోధ్యా కిష్కింధ కాండములలో రామగుణగణవర్ణనలచే 'వరేణ్య' శబ్దార్థము. అరణ్యకాండములో రాముని తేజోమయ శరీరవర్ణనముచే 'భర్గ' శబ్దార్థము, సుందరకాండములో శ్రీరాముని దివ్యమంగళ విగ్రహలక్షణ వర్ణనచే "దేవశబ్దార్థము, యుద్ధకాండములో శరణాగతిని చెప్పి 'ధీమహి' శబ్దార్థము, ఉత్తరకాండములో ముక్తిఫలమును దెలిపి గాయత్రిలో తృతీయపాదముయొక్క అర్థము దెలుపబడినది.

ఇట్టి యధికారి చార్వాక, బౌద్ధాదిమతములను దెలుప అసత్ శాస్త్రములను స్మరింపగూడదని జాబాలి, లక్ష్మణవచన ఖండనలచే విస్పష్టమగుచున్నది.

జ్ఞానులకును వ్యసనములు సంభవించుచున్నవి. కాని వారట్టి సందర్భములలో వైరాగ్యము గలిగియుండవలెననుట రామలక్ష్మణుల నాగపాశబంధము, హనుమంతుని బ్రహ్మాస్త్రబంధము, సీతాపహరణము, రాముని రాజ్యభ్రంశము మొదలగు వృత్తాంతములు వ్యక్తపరచుచున్నవి.

వేయేల? ఈ రామాయణమే ఇతర గ్రంథముల కెల్లవిధముల నాధారమనియు, దీనిలోలేని ధర్మము లితరగ్రంథములలో లేవనియు, శ్రీరామచరిత్రముననే వేదాంతార్థము లిమిడియున్నవనియు రామచంద్రుడు హనుమంతునిమాటలను శ్లాఘించుటలో వేదాంగమగు శిక్షార్థము, అశ్వమేధాది ప్రకరణములలో కల్ప సూత్రార్థము, 'న్యూనం వ్యాకరణంకృత్స్నమ్' ఇత్యాదిస్థలములలో వ్యాకరణ శాస్త్రార్థము, తెలుపబడి 'సీతాయాశ్చరితం మహత్' అనుటచే ఆమె పురుషకారస్వరూపమును, 'పౌలస్త్య వధమ్' అనుటచే ఎట్టి వంశస్థుడైనను ధర్మము దప్పిన జీవింపడనియు దెలుపుచు శృంగార, కారుణ్య, హాస్య, వీర, భయానక, బీభత్స, రౌద్ర, అద్భుత, శాంతాది నవరసములతో గూడి 'పాఠ్యే గేయే చ మధురమ్' అని పఠించుటకే గాక వీణాది వాద్యములతో శ్రుతిలయాన్వితమై

సప్తస్వరముల గూడి త్రిస్థానోచితమై మృదుమధురముగ పాడుట కత్యంతోపయుక్త మగు కావ్యము శ్రీమద్రామాయణమని విన్నవించుచు కీ. శే. ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావుగారి రామాయణ ప్రాశస్త్యవివరణ మిట్టిదని దెలుపుచున్నాను.

శా. శ్రీరామాయణ మంత్రశాస్త్రమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణ ధర్మతంత్రమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణ గృహ్యసూత్రమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణ ముక్తిశాస్త్రమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్

శా. శ్రీరామాయణ కావ్యరత్నమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణ సత్పురాణమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణ యోగశాస్త్రమునకున్ శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణమే నిధానము సుడీ! శ్రేయోర్థులౌ వారికిన్.

## 2 . శ్రీమద్రామాయణ మంగళ శ్లోకము

**శ్లో॥ "జయత్యాశ్రితసంత్రాసధ్వాంతవిధ్వంసనోదయః।**
**ప్రభావాన్ సీతయా దేవ్యా పరమవ్యోమభాస్కరః"॥**

నారదోపదేశముపొందిన వాల్మీకి మాధ్యాహ్నికస్నానమునకై భరద్వాజుడను శిష్యునితో తమసానదీతీరము చేరి యందలి ప్రకృతి సౌందర్యమును జూచుచుండగా నొకచోట క్రౌంచమిథునము శృంగారకేళి యం దానందించు సమయమున నొకబోయవాడా జంటలోని మగపక్షిని బాణముతో గొట్టి చంపెను. ఆడుపక్షి భర్తృవియోగదుఃఖ మనుభవింప వీలు లేక పరితపించు చుండుట గని మహర్షి శోకసంతప్తహృదయుడై బోయవాని నిట్లు శపించెను.

**శ్లో॥ "మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీస్సమాః।**
**యత్క్రౌంచమిథునాదేక మవధీః కామమోహితమ్॥**

అనగా 'ఓ వేటకాడా! రతిక్రీడాపరవశమైయున్న సమయమున ఆ మగ పక్షిని నిర్దయుడవై చంపినందున నీ విక చాలకాలము జీవింపవు'. ఈ శ్లోకము బోయవాని హృదయ కాఠిన్యమును, స్త్రీపక్షియొక్క వియోగ విలాపమును, జూచి శోకముతో నిండిన మునిమానసమునుండి అప్రయత్నముగ జారిన శాపమును దెలుపుచున్నదనుట స్థూలార్థము. కాని దీని విశేషార్థములను గమనింతము. 'మా' అనిన లక్ష్మీదేవి, 'నిషాదు' డనిన వాసస్థానముగ నుండువాడు. 'మా నిషాద' లక్ష్మీదేవికి వాసస్థానముగ నున్న 'శ్రీనివాసా' అని సంబోధించి నట్లగుచున్నది, సీతాదేవి విషయమున కామ మోహితుడై వివేక శూన్యుడైనవాడు రావణాసురుడు. సాధారణముగ కుటిలస్వభావులగు వారు రాక్షసులు. రావణమండోదరులలో కుటిలాత్ముడు

లోకకంటకుడైన రావణుని వధించుటచే జయముగలిగి చాల కాలము వర్ధిల్లుదువు గాక అని యర్థ మిచ్చుటచే నియ్యది శోకమువలన పుట్టిన శాపమైనను మంగళశ్లోక మనుటలో ఔచిత్య మున్నది. దీనిం గుర్తించిన వాల్మీకి ఇయ్యది ఛందోబద్ధముగ శ్లోకరూపమున నున్నందుల కాశ్చర్యపడుచు శిష్యునితో ముచ్చటించుచు ఆశ్రమము చేరి తదేకధ్యానముతో నుండగా బ్రహ్మదేవుడు సపరివారముగా విచ్చేసి వాల్మీకిచే సత్కరింపబడి. వాల్మీకీ! సందేహింపకుము.

**శ్లో॥ "మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ ।**
**రామస్య చరితం సర్వం కురు త్వమృషిసత్తమ ॥**

నా ప్రేరణమున సరస్వతి నీవాక్కున ఈ శ్లోకము పలికించినది. అది శ్లోకమే. నారదుడు నీ కుపదేశించిన రామచరితమును శ్లోకరూపమున విస్తరించి గ్రంథ రూపముగ జేయును.

**శ్లో॥ "తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః।**
**పురా యత్తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా"॥**

రామచరితమునందలి సకల విషయములు నిస్సందేహముగ యథార్థముగ అరచేతిలోని ఉసిరి కాయవలె స్పష్టముగ నుండునని యనుగ్రహించి అంతర్ధాన మయ్యెను.

మంగళశ్లోకార్థమును మరి యొకింత విచారింతము.

'కావ్యార్థసూచనంకైశ్చిన్నాంద్యామేవ నిరూప్యతే' అనుటచే కావ్యములోని ముఖ్యార్థసూచన నాందిశ్లోకముననే సూచింపబడియుండునను విషయము పరిశీలింతము.

'మా నిషాద' యనుటచే సీతాకల్యాణపర్యంతమగు బాలకాండము సూచితము, 'ప్రతిష్ఠాంత్వమగమ' అనుటచే పితృవాక్యపరిపాలనమను



ధర్మమును సక్రమముగ విషయాసక్తి యొకించుకేనియు లేక యనుష్ఠించి మానవ సమూహమున కాదర్శ ప్రాయుడై శాశ్వతకీర్తిగడించిన రామచరితాంశమును దెలుపు అయోధ్యాకాండము సూచితమగుచున్నది. 'శాశ్వతీస్సమాః' అనుటచే మునులకు తానిచ్చిన అభయ ప్రదానము పాటించు నిమిత్తము దుష్టరాక్షస సంహార సంకల్పమును, శరణాగత రక్షణ దీక్షయు దెలుపు అరణ్యకాండకథ సూచితము. "క్రౌంచమిథునాదేక మవధీః కామమోహితమ్" అను మాటలచే సుగ్రీవునిభార్య నపహరించిన వాలివధ గల కిష్కింధాకాండమును, ఈ పదములచేతనే పరస్పర విశ్లేషముచే నందులో ముఖ్యముగ రామునికంటె దుఃఖము నెక్కువగ ననుభవించు సీతాదేవి వృత్తాంతమును దెలుపు సుందరకాండమును మరియు ఈపదములచేతను కుటిల స్వభావముగల రాక్షసజాతిలోచేరిన రావణ మండోదరులలో కుటిలాత్ముడగు రావణునివధను దెలుపు యుద్ధకాండమును, వనములోని ఋషి పత్నులను జూడవలయునను నెపమున గలిగిన సీతారాముల వియోగమును దెలుపు ఉత్తరకాండకథయు సూచింపబడుచున్నవి. ఇట్లు శ్రీమద్రామాయణములోని సప్తకాండముల భావ మిందిమిడియుండుట చేతను లక్ష్మీపరమగు మకారముతో నారంభించుటచేతను లక్ష్మీ విశిష్టుడగు శ్రీనివాసాయని సంబోధనతో నుండుటచేతను. పెరియాళ్వారులు తనకు ప్రత్యక్షమైన లక్ష్మీనారాయణునకు పాడిన మంగళాశీర్వచనరూపమగు 'పల్లాండు' పాశురభావముతో నిండి యున్నందునను దీనినే రామాయణ బీజశ్లోకముగ నుంచుకొని రామాయణము వ్రాయుమని బ్రహ్మదేవుడు వాల్మీకి నాజ్ఞాపించుట సర్వవిధముల నొప్పియున్నది.

ఇంతియగాక మరియొక విశేషము ధ్వనించు చున్నది.

**శ్లో॥ "ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే।**
**తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి॥**

అను ముండకోపనిషద్వాక్యములచే పరమాత్మ జీవాత్మల పరస్పర సంశ్లేషానుభవమును ప్రకృతి యడ్డుపడి వారికి విశ్లేషము గలిగించుటయును, ఆ ప్రకృతి నాశమొందిన వారిరువురికి పునః సంశ్లేషసుఖానుభవము గలుగుచున్నదనియు స్పష్టమగుచున్నది. ఎట్లన నొక చెట్టుపై రెండు పక్షులున్నవి. ఒకటి ఆ వృక్షమునందలి ఫలముల ననుభవించును. రెండవది అట్లుగాక ఫలము ననుభవింపకుండును. ఇందలివృక్షమే ప్రకృతియనియు ఫలము లనుభవించునది జీవాత్మ యనియు, ఆ ఫలము లనుభవింపకుండునది పరమాత్మయనియు తెలియుచున్నది. ఇట్లే ప్రాణుల శరీరములే జీవాత్మ పరమాత్మల విశ్లేషకారణము లనియు ఆ శరీరములు నశించిన మరల జీవాత్మ పరమాత్మలకు సంశ్లేషసుఖానుభవము గలుగుచున్నదను విషయమునుకవి హృదయమున నుంచుకొనియుండినను ఉండవచ్చునని ఊహింపనగును. ఎట్లన క్రౌంచముల సంశ్లేషసుఖమును బోగొట్టిన బోయవాడే ప్రకృతి యనియు, వాని నాశమే జీవాత్మ పరమాత్మల సంశ్లేషానుభవమునకు గారణమగునని యూహించుట యుక్తమే. ఇచ్చట బోయవానిని శపించిన వాల్మీకి ఆచార్యస్థానము వహించి చిత్, అచిత్, ఈశ్వరుడను తత్త్వత్రయము నుపదేశించిన ట్లూహింపవచ్చు ననియు తోచుచున్నది. ఆళ్వారాచార్యులు పరమాత్మను పురుషుడుగను, జీవాత్మను స్త్రీగను భావించి వీరి సంభోగమే జీవ పరమాత్మల సంశ్లేషసుఖానుభవమని తమ్ము నాయికలుగను భగవంతుని నాయకునిగను భావించి పాశురము లనేకములు పాడియున్నారు. ఇష్టప్రాప్తికి అనిష్టనివృత్తి ముఖ్యమగుటచే జీవాత్మ పరమాత్మల సంభోగమను మంగళమునకు ప్రకృతి నాశమగుట మంగళకృత్యమే గనుక శాపరూపముగ వెలువడిన శ్లోకము మంగళశ్లోకముగ పరిణమించుట సర్వసమంజసమే.

అ+ఉ+మ్=ఓమ్ అను ప్రణవమేర్పడుచున్నది. అకారము విష్ణువును దెలుపును. ఉకారము చేతనులయం దపారదయగల పురుషకారభూత యగు



లక్ష్మీదేవిని తెలుపును. మకారము జీవాత్మను దెలుపును. అరణ్యమున ప్రవేశించునపుడు 'అగ్రతః ప్రయయౌ రామః సీతా మధ్యే సుమధ్యమా। పృష్ఠతస్తు ధనుష్పాణిః లక్ష్మణోనుజగామహ' అనుటచే జగత్కారణత్వమును జగద్రక్షణత్వమును గల రాముడుగ నవతరించిన విష్ణువును 'రమాసంబంధి రామః' అనుటచే లక్ష్మీ విశిష్టుడనియు దెలుపును. 'సుమధ్యమా' యనుటచే (సీ+ఉ) ప్రణవములోని రెండవయక్షరమగు 'ఉ' వర్ణమును దెలుపును. (మధ్యే) అనుటచే 'ఉ' వర్ణము రెండువర్ణముల మధ్యనుండుటను సూచించును. (సీతామధ్యే) అనుటచే లక్ష్మీపురుషకారత్వము సూచితము. 'లక్ష్మణః మనజ్ఞానే మన అవబోధనే' అని మకారముచే విస్పష్టమగు అసాధారణధర్మము సూచితము. 'ధనుష్పాణిః' అనుటచే కైంకర్యమును 'అనుజగామ' అనుటచే అహంకార మమకారములు త్యజించి అనుసరించుటయు సుస్పష్టమగుచున్నది. 'అనుజగామ' అను పదాంతమున నున్న 'మ' కారము ప్రణవములో మూడవయక్షరమును దెలుపును. ఇందువలన ప్రణవము మూడక్షరముల కూడికయగు ఒకే అక్షరమై లక్ష్మియొక్క పురుషకారముచే విష్ణువుచే జీవాత్మ ననుగ్రహించు నని తెలుపుచున్నది. 'ప్రణవస్సర్వ వేదేషు' అని సకల వేరసార మిందిమిడియున్నదనియు 'ఓం' కార స్వరూపుడే విష్ణువనియు నందు సీతాదేవి యగ్నిప్రవేశముచేసినపుడు బ్రహ్మదేవుడు, 'రామా! నీవే నారాయణుడవు, సీతాదేవియే లక్ష్మీదేవి యనుచు 'త్వం ఓంకారః' అనియు చెప్పియున్నాడు. కనుక భగవంతుడు ప్రణవస్వరూపుడనియు తెలియుచున్నది. వేదమంత్రముల నారంభించునపుడు 'హరిః ఓం' అని యుచ్చరించి ప్రారంభించుటయు కేశవాదినామము లుచ్చరించునపుడు ప్రణవపూర్వకముగ నుచ్చరించుటయు వాడుకలోనున్నది. 'ఓం తత్ సత్' అనునది భగవంతునినామమని కొంద రనుచుండ, వైదికకర్మలకు 'ఓం తత్ సత్' అని పేరనువారును గలరు.

భగవంతు డీమంత్రముతో బ్రాహ్మణులను, వేదములను, యజ్ఞములను సృజించెనందురు.

**శ్లో॥ "తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపః క్రియాః॥**
**ప్రవర్తంతే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్॥"**

బ్రహ్మవాదుల శాస్త్రోక్తమైన యజ్ఞము, దానము, తపస్సు అను క్రియలు సదా 'ఓం' అని చెప్పిన పిదపనే ప్రారంభింపబడును. శ్రీమన్నారాయణుడు సరస్వతిని బ్రహ్మముఖమున నుండనిచ్చి వేదముల నాతని త్రిముఖములనుండి వెలువరించెను. వేదోపబృంహణమగు శ్రీమద్రామాయణము బ్రహ్మవలన నారదుని కుపదేశింపబడి అ మ్మహర్షి మూలమున వాల్మీకి కుపదేశింప బడినది. బ్రహ్మదేవుని ప్రేరణమున సరస్వతి వాల్మీకిమహర్షి బోయవానిని శపించు నెపమున అ మ్మహర్షివాక్కున నీ మంగళశ్లోకము పలికించెను. స్థూలార్థమున క్రౌంచమిథునములో మగపక్షిని రతికేళిలో నుండుతరి బాణముతో గొట్టి చంపి నందున ఓ బోయవాడా! నీవు దీర్ఘకాలము జీవించియుండవని ఏర్పడినను "ఓ శ్రీనివాసా! రాక్షసమిథునమగు మండోదరీ రావణులలో మిక్కిలి కుటిలాత్ముడై క్రూరుడగు రావణుని సంహరించి యధర్మమును నాశ మొనర్చి ధర్మమును స్థాపించిన నీవు శాశ్వతముగ మంగళ మనుభవింతువు గాక యని యాశీర్వచన రూపమగు మంగళాచరణముచేసినందున నీ శ్లోకము మంగళశ్లోకముగ నుండుటకు ప్రణవమంత్రమువంటి ప్రభావము గలిగియున్నదని వేనోళ్ల శ్లాఘింపవచ్చును.



## 3. శ్రీరామావతారతత్త్వము

**శ్లో॥ రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే।**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః॥**

కృపాసముద్రుండగు శ్రీమన్నారాయణుడు శ్రీవైకుంఠమున పరవాసుదేవు డనియు సృష్టిస్థితిలయములకుం గారణ భూతుడై వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులను వ్యూహస్వరూపుడుఁగను, రామకృష్ణాది విభవావతారుడు గను, శ్రీరంగాదిక్షేత్రములలో అర్చారూపుడుగను, సకలభూతహృదయమున నంతర్యామిగను, పంచప్రకారంబుల దోచుచు జగద్రక్షణముచేయుచుండుట సర్వ జనవిదితమే. విభవావతారములలో శ్రీరామావతారము పరిపూర్ణావతార మగుచు "ఆచారప్రభవో ధర్మః" ఆచారము ధర్మమునకు మూల మనియు, నట్టి ధర్మమునకు ప్రభువు విష్ణువని "ధర్మస్య ప్రభురచ్యుతః" అను వాక్యమువలనను సుస్పష్టమగుచున్నది. ఆచారమనగా చక్కని నడవడి. అట్టి ధర్మానుష్ఠానము శ్రీరామునిచేతను, తనయంశమునకుం జెందిన భరతలక్ష్మణశత్రుఘ్నాదులచేతను పూర్ణముగ ననుష్ఠింపబడినందున శ్రీరామావతార తత్త్వమును వివరించుట ముఖ్యకర్తవ్యము.

విష్ణువు నాలుగుమూర్తులుగ నవతరింపనేలయని సందేహముగలుగ వచ్చును. అరువదివేలయేండ్లు రాజ్యపాలనముచేసిన దశరథుడు తనకు పుత్రోత్పత్తిలేదను చింతను గురువగు వసిష్ఠునకుం దెలుప న మ్మహర్షి నియమనము చొప్పున దశరథుడు *వేంకటాచలమున కరిగి తపస్సుచేసెను. బ్రహ్మాది దేవతలును వైకుంఠమున విష్ణుదేవునితో లోకకంటకుడగు రావణేశ్వరుని సంహరింప మానవావతారమెత్తవలెనని కోరగా నారాయణుడు వారి నంజనాద్రికేగి తాను దశరథునకిచ్చు వరమునకు నెదురుచూచునట్లా

* శ్రీవరాహపురాణములోని వృత్తాంతము.

జ్ఞాపించె. దశరథుడు తపస్సు చేయగా వైకుంఠనాథుడు వేంకటనాథుడై ప్రత్యక్షమై దశరథుని చూచి,

**శ్లో॥ యస్మాత్ ప్రీత్యా చతుశ్శ్లోకీ త్వయోక్తా మమ భూపతే।**
**తస్మాత్తు తవ పుత్రాశ్చ చత్వారోఽమితవిక్రమాః॥**
**శూరాశ్చ బలవంతశ్చ మత్తుల్యబలవిక్రమాః।**
**దత్తా రాజంస్త్వయాఽయోధ్యాం గత్వా యష్టవ్యమాదరాత్॥**

దశరథమహారాజా! ఏ నాలుగు శ్లోకములతో నన్ను స్తుతించి పుత్రోత్పత్తి గోరితివో అట్లే నావంటి శూరులును బలవంతులును పరాక్రమవంతులునగు నలుగురు పుత్రులు నీ కుద్భవింతురు. నీ వయోధ్యకేగి పుత్రకామేష్టి యాగముచేయుమని యనుగ్రహించె.

**శ్రీనివాసుడు బ్రహ్మాదులజూచి :-**

**"అథవా స దురాత్మా చ రావణో లోకకంటకః।**
**అచిరాత్తం వధిష్యామి సత్యమిత్యవధార్యతామ్॥"**

దేవతలారా! లోకకంటకుడగు రావణుని శీఘ్రముగ వధించెదనని వాక్రుచ్చెను.

అట్లే దశరథుడు పురముచేరి పుత్రకామేష్టి సలుపుచుండ హవిర్భాగము లకు వచ్చిన బ్రహ్మాదిదేవతలు విష్ణుదేవుని దర్శించి "త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా!" విష్ణుదేవా! లోకహితార్థము నిన్నిట్లు ప్రోత్సహించుచున్నాము.

**"రాజ్ఞో దశరథస్య త్వమయోధ్యాధిపతేః ప్రభోః॥**
**ధర్మజ్ఞస్య వదాన్యస్య మహర్షిసమతేజసః।**



**తస్య భార్యాసు తిసృషు హ్రీశ్రీకీర్త్యుపమాసు చ॥**
**విష్ణోః పుత్రత్వమాగచ్ఛ కృత్వాఽఽత్మానం చతుర్విధమ్।**

"ధర్మస్వరూపుడును దానవీరుడును ఋషితుల్యుడై తేజోవంతుడునైన అయోధ్యాధిపతియగు దశరథుని హ్రీ, శ్రీ, కీర్తులతో సమానురాండ్రగు ముగ్గురు భార్యలయందు నీ స్వరూపమును నాలుగంశములుగ భాగించుకొని పుత్రత్వము వహింపు" మనిరి. ఇంతియగాక "సమరే జహి రావణమ్" యుద్ధమున రావణుని చంపవలెననియు స్పష్టముగ గోరిరి. ఇందువలన నాలుగుమూర్తులుగ విష్ణు వవతరింపవలసిన కారణము దెలిసినది.

రామచంద్రుడు శుద్ధసత్త్వస్వరూపుడా? త్రిగుణాత్మకుడా? యను శంకకేమి పరిహారమో విచారింతము. ఇందు మొదటిపక్షమే గ్రాహ్యమందుమా? చిత్రకూటమున తండ్రి మరణవార్త వినినంతనే శ్రీరాముడు శోకసాగరమున మునిగి మూర్ఛపోవుటయేల? సీతాపహరణానంతర మతం డున్మత్తరాఘవుడై "మానుషః ప్రాకృతో యథా" యని యచేతనములగు వృక్షములను, నదిని, మృగ పక్షిజాలములను సీత యునికి చెప్పునట్లు ప్రశ్నించుటయు పాదుకలిచ్చి భరతుని వీడ్కొలుపు నపుడు తల్లులు తన్ను వీడిపోలేక దుఃఖింప రామచంద్రుడు "రుదన్ కుటీంస్వాం ప్రవివేశ రామః" దుఃఖాతిరేకంబున ఎలుగెత్తియేడ్చుచు తనకుటీరము లోనికి బోయె ననుటయు, సుగ్రీవపట్టాభిషేకానంతరము వర్షఋతువులో సీతావియోగదుఃఖ మనుభవించుటయు, కాలాతిక్రమణము నెంచక కామభోగముల ననుభవించుచునుండు సుగ్రీవునిపై కోపాతిరేకమున లక్ష్మణునితో

**"కురుష్వ సత్యం మయి వానరేశ్వర ప్రతిశ్రుతం ధర్మమవేక్ష్య శాశ్వతమ్।**
**మా వాలినం ప్రేత్య గతో యమక్షయం త్వమద్య పశ్యేర్మమ చోదితైశ్శరైః॥**

“స్థిరమగు ధర్మమునెరిగి నా విషయమై చేసిన ప్రతిజ్ఞను కాపాడుకొనుము. ఇపుడు నాచే విడువబడిన బాణములు తగిలి మృతిపొంది యమలోకమునకు బోయి వాలిని చూడవల”దని చెప్పు మనుటయు చూడ రాముడు సత్త్వరజో గుణములు గలవాడని చెప్పవలసియున్నది.

ఈ విషయము రామావతారమునకు పూర్వమే సూచింపబడుచున్న దనుట యెట్లు పొసగునో విమర్శింతము.

**భగవద్గీతలో నాల్గవయధ్యాయమున ఇరువదినాల్గవ శ్లోకమేమనగా:**

**శ్లో॥ బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా॥**

బ్రహ్మమును గురించి హోమముచేయునపుడు బ్రహ్మార్పణమగు హవిస్సు, అగ్ని, కర్త యన్నియు బ్రహ్మమని, దానిచే పొందబడునది బ్రహ్మమే యని తెలియుచున్నది. అట్లే దశరథుడు పుత్రకామేష్టిచేసినపుడు అగ్నినుండి వెడలిన మహాపురుషుడు, అతని చేతియందుండిన దివ్యపాయసపాత్రము, దానిలోని పాయస మన్నియు నవతరింపబోవు విష్ణువునే సూచించెను. ఎట్లన

**శ్లో॥ తతో వై యజమానస్య పావకాదతులప్రభమ్।**
**ప్రాదుర్భూతం మహద్భూతం మహావీర్యం మహాబలమ్॥**

**శ్లో॥ కృష్ణం రక్తాంబరధరం రక్తాక్షం దుందుభిస్వనమ్।**
**స్నిగ్ధహర్యక్షతనుజశ్మశ్రుప్రవరమూర్ధజమ్॥**
**శుభలక్షణసంపన్నం దివ్యాభరణభూషితమ్।**
**శైలశృంగసముత్సేధం దృప్తశార్దూలవిక్రమమ్।**
**దివాకరసమాకారం దీప్తానలశిఖోపమమ్।**
**తప్తజాంబూనదమయీం రాజతాంతపరిచ్ఛదామ్॥**
**దివ్యపాయససంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్।**
**ప్రగృహ్య విపులాం దోర్భ్యాం స్వయం మాయామయీమివ॥**



“మహద్భూతం” అనుటచే “ఏకో విష్ణుః మహద్భూతం” అని విష్ణుదేవు డొక్కడే మహద్భూతమని చెప్పబడును గాని యన్యులెవ్వరికి నయ్యది పొసగదు. ఇంతియ గాక ఆ మహాపురుషుని వర్ణించు విశేషణము లన్నియు పురుషోత్తముడగు విష్ణువునకే చెందినవి. ఆ మంగళవిగ్రహము యొక్క సౌందర్యము, గాంభీర్యము, బలపరాక్రమములు, సూర్యునివంటి తేజస్సు ఇవన్నియు జ్ఞానబలైశ్వర్యవీర్యశక్తి తేజసాదిషాడ్గుణ్య పరిపూర్ణుడగు విష్ణువునే, అవతరింప బోవు రామచంద్రునే స్పష్టముగ తెలుపుచున్నవి. ‘తప్తజాంబూనదమయీం రాజతాంత పరిచ్ఛదామ్, అనుటచే పుటము పెట్టిన స్వర్ణపాత్ర మనుట పసుపు రంగును, తెలుపును, ఎఱుపు, పసుపు మొదలగునవి రజోగుణమును సూచించును. తెలుపు సత్త్వగుణమును దెలుపును. మూత వెండితో చేయబడినదనుటచే, పాత్రలో పాయసస్వరూపిగ నుండువాడు రజోగుణముందెలుపు కార్యము లెన్ని చేసినను సత్త్వగుణమే ప్రధానముగ ప్రకాశించునట్టి సత్కర్మలే చేయునని తెలుపునట్లు గ్రహింపనగును.

శ్రీరాముడు మానవుడా దేవుడా యనిన ఈ యవతారములో మానవత్వము నెక్కువగ పాటించినను పరత్వమును ప్రకాశింప జేయు మహత్కార్యములును జరిగియున్నవి లోకాపవాదకథాభీతిని పాటించి రాముడు సీతాదేవి నగ్నిప్రవేశము చేయించిన సమయమున బ్రహ్మ, ఈశ్వరుడు, ఇంద్రుడు మున్నగువా రంతరిక్షముననుండి రాముని జూచి,

**‘కర్తా సర్వస్య లోకస్య శ్రేష్ఠో జ్ఞానవతాం వరః।**
**ఉపేక్షసే కథం సీతాం పతంతీం హవ్యవాహనే।**
**కథం దేవగణశ్రేష్ఠమాత్మానం నావబుధ్యసే॥**

ఓ రామచంద్రా! నీవు సకలలోకములను సృష్టించువాడవు. నీవు సర్వ శ్రేష్ఠుడవు. జ్ఞానవంతులలో ఉత్తముడవు. అగ్నిప్రవేశము చేయుచున్న సీతాదేవి

నెందు కిట్లుపేక్షించుచున్నావు? దేవతలందరిలో శ్రేష్ఠుడవని నిన్ను నీ వేల తెలిసికొనలేవు అని యడుగ రామచంద్రుడు,

**ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్।**
**యోహం యస్య యతశ్చాహం భగవాంస్తద్బ్రవీతు మే॥**

తన మహిమను దేవపూజ్యుడగు బ్రహ్మదేవునిచే చాటింపనెంచి 'నేను సామాన్య మానవుడను, దశరథుని కుమారుడనగు రాముడను పేరు గలవాడను. నా స్వరూప మెట్టిది? నే నెవరి కెట్టిసంబంధము గలవాడను? నేనీ లోకమున నేలపుట్టితిని? వీని నెల్ల నీవు నాకు విశదీకరింపుమనియె.

అంత బ్రహ్మదేవుడు:

**భవా న్నారాయణో దేవః శ్రీమాంశ్చక్రాయుధో విభుః।**
**ఏకశృంగో వరాహస్త్వం భూతభవ్యసపత్నజిత్॥**

నీవు నారాయణుడవు. అనగా 'అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారా యణస్థితః' అన్నిటిలోపలను వెలుపల నుండువాడవు. నిత్యము లక్ష్మీదేవితో గూడి యుండువాడవు. నీవు చక్రాయుధము ధరించినవాడవు, సర్వవ్యాపకుడవు. నీవు ఒకే కొమ్ముగల వరాహావతార మెత్తినవాడవు. పూర్వ ముండిన మధుకైటభాది రాక్షసులను, ఇకమీద పుట్టబోవు శిశుపాలాదులను జయించు వాడవు.

**అక్షరం బ్రహ్మసత్యం చ మధ్యే చాంతే చ రాఘవ।**
**లోకానాం త్వం పరో ధర్మః విష్వక్సేనశ్చతుర్భుజః॥**

నీవు సర్వవ్యాపకుడవు, నాశరహితుడవు, బ్రహ్మశబ్దవాచ్యుడవు. నీవు షడ్భావవికారములు లేనివాడవు. నీవు లోకముయొక్క సృష్టికిముందును మధ్యను అంతమగు మహాప్రళయకాలముననను ఉన్నవాడవు. లోకములో



సిద్ధరూపముగనున్న ధర్మము నీవే. నీవు సర్వస్వామివి. నిస్సమాభ్యధికుడవు. చతుర్భుజుండవు, నీ వేకకాలమున నాలుగు పురుషార్థము లివ్వంగలవాడవు.

**సీతా లక్ష్మీ ర్భవాన్విష్ణు ర్దేవః కృష్ణః ప్రజాపతిః।**
**వధార్థం రావణస్యేహ ప్రవిష్టో మానుషీం తనుమ్॥**

సీతాదేవి మహాలక్ష్మి, నీవు విష్ణుదేవుడవు. నీ వెల్లప్పుడు ప్రకాశించు వాడవు. కృష్ణావతార మెత్తబోవువాడవు నీవే. ప్రజాపతిశబ్దవాచ్యుడవు నీవే. రావణవధార్థము నీవు మనుష్యదేహములో ప్రవేశించితివి.

**శ్లో॥ తదిదం నః కృతం కార్యం త్వయా ధర్మభృతాం వర।**
**నిహతో రావణో రామ ప్రహృష్టో దివమాక్రమ॥**

రామచంద్రా! ధర్మానుష్ఠానపరులలో నుత్తముడా! నీవు మా కార్యమును పూర్తి చేసితివి. రావణుని వధించితివి. బహుకాలము సంతోషముతో భూమిని పాలించి వైకుంఠమునకు దయచేయుము అనెను. ఇట్టి పరత్వమును రామచంద్రుడెట్టిసమయములందు ప్రకాశపెట్టెనో వివరింతము.

విలంబి సంవత్సర చైత్ర శుక్ల నవమియం దవతరించిన రామచంద్రునకు సాధారణసంవత్సర చైత్రశుద్ధనవమికి పంద్రెండు వత్సరము లగును. సౌమ్య సంవత్సర మాఘబహుళచతుర్థినాడు తాటకవధ గావించె ననిన పదునొకండు వత్సరముల పదిమాసముల పదియవదినమున ఆ మహాకార్యము జరిగినదనిన నియ్యది సామాన్య మానవునకు సాధ్యమా యని యాలోచించిన రాముని అతిమానుషత్వము తెలియుచున్నదనుట కెట్టి సందియము లేదు. తమ్ముని భార్య నపహరించిన వాలిని చంపి తన్నాశ్రయించిన సుగ్రీవునకు సాయమొనర్చి తన యాశ్రితుల కష్టమే తన కష్టముగను, వారి శత్రువులే తన శత్రువులుగను భావించి, ధర్మసంస్థాపనము చేయ, నధర్మపరుల వధించుటయు పరమధర్మ మనుష్ఠించుటను

చాటుచున్నది. జనస్థానమున ఖరాదుల పదునాల్గువేల మందిని తా నొక్కడే ముహూర్తకాలమున సంహరించుటయు, లోకకంటకుడగు రావణుని వధించుటచే తన యవతారకృత్యమును పూర్తి గావించుకొనుటయు శ్రీరాముని పరత్వము ననేకవిధముల చాటును. ఇంతియగాక అహల్యా శాప విమోచనము, శివధనుర్భంగము, పరశురామ గర్వభంగము, సేతుబంధనము మొదలగునవియు నతని పరత్వమును వెల్లడించుచున్నవి.

సీతాన్వేషణము చేయుచుండు రామచంద్రుడు సీతాదేవికొరకు ప్రాణత్యాగము చేసిన జటాయువును జూచి లక్ష్మణునితో–

**శ్లో।। 'సర్వత్ర ఖలు దృశ్యంతే సాధవో ధర్మచారిణః।**
**శూరాశ్శరణ్యాస్సౌమిత్రే తిర్యగ్యోనిగతేష్వపి।।**

సుమిత్రానందనా! శూరులుగను, రక్షకులుగను, ధర్మానుష్ఠానపరులు గను నుండు సాధువులు జాతు లన్నిటిలోను, తిర్యగ్జాతులోను గలరని చెప్పెను. వేనవేలం డ్లనేక యాగయజ్ఞములం జేసి లేకలేక పుత్రుల బొందిన దశరథునికి రామునిచే నగ్నిసంస్కారప్రాప్తి లేకపోయెను. అడవులలో సంచరించుచుతన తండ్రికి స్నేహితుడని తెలిసి, తన భార్య కొరకు రావణునిచే చంపబడిన జటాయువున కగ్నిసంస్కారము చేయునపుడు రామచంద్రుడు,

**శ్లో।। 'యా గతిర్యజ్ఞశీలానా మాహితాగ్నేశ్చ యా గతిః।**
**అపరావర్తినాం యా చ యా చ భూమిప్రదాయినామ్।।**

**శ్లో।। మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్।**
**గృధ్రరాజ మహాసత్త్వ సంస్కృతశ్చ మయా వ్రజ।।**

సర్వదా యాగములు చేయుచుండు గృహస్థులకు, పంచాగ్నిమధ్యమున నుండి తపస్సుచేయు వానప్రస్థులకును సన్యాసులకును లేక ముక్తులకును భూదానాదులు చేయువారికిని ఎట్టి పుణ్యలోకము గలుగునో ఓగృధ్రరాజా! మహాపరాక్రమము గలవాడా! నీవు నాచే సంస్కరింపబడిన వాడవై, నాయాజ్ఞచే సర్వోత్తమమగు లోకమునకు బొమ్ము అని చెప్పెను.



నీచజాతియందు బుట్టిన గుహుని యెడ సౌభ్రాత్రము పాటించి యతనిని గౌగిలించుటయు శబరియొక్క తపస్సునకు, భక్తికి మెచ్చి యామె సమర్పించిన ఫలమూలాదుల స్వీకరించి యామెకు మోక్షమిచ్చుటయు అవతార పరిసమాప్తియం దయోధ్యలోని జంగమస్థావరాదుల కెల్ల మోక్షమిప్పించుటయు రాముని పరత్వమును వేనోళ్ల చాటుచున్నవి. ఇందువలన కేవలమానవత్వమే గాక పరత్వమును గలసియుండుటయు మానవత్వ మెక్కువగ పాటింపబడినను పరత్వమును ప్రకాశింపజేయుటయు శ్రీరామావతారముయొక్క అపూర్వవిశేషమని చెప్పక తప్పదు.

కృష్ణావతారమున భగవల్లీల లనేకవిధములుగ ప్రకటితములైనను, "గీతోపదేశము" సారతమము. దాని ననేకవిధములుగ రామచంద్రుడు తా ననుష్ఠించి ఆయా ప్రకరణములలో ఇతరుల కుపదేశించి వారివారి వివిధానుష్ఠాన ప్రక్రియలను దెలుపుచున్నాడనుట యెట్లో పరిశీలింతము.

పితృపైతామహప్రాప్తమగు రాజ్యభాగములో నొక్కొక్కరి కొక్కొక్క గ్రామము నిచ్చినను చాలునని బహురాయబారములు జరిపియు విఫలమనోరథు లగుటచే సామాద్యుపాయత్రయము నిష్ఫలమైనందున గత్యంతరము లేక చతుర్థోపాయమగు దండమే సాధనమని నిశ్చయించి భగవంతుడగు శ్రీకృష్ణుని సారథిగ బొంది ఉభయసేనలమధ్య రథము నిలుపునట్లుదేసి యిరుపక్షములను, ముఖ్యముగ శత్రుపక్షమును జూచి యందెల్లరు తాతలు, తండ్రులు, సోదరులు మామలు మొదలగువారు స్వజనులుగ నుండుటం గని వారి నెల్లర జంపి రాజ్యము పొందుటకంటె భిక్షమెత్తి జీవించుట మేలని కులముపెద్దలగు భీష్మాదులను, గురుజనులగు ద్రోణాదులను పుష్పములతో నర్చించుటకు మారు కరకు బాణములతో

చంపుటకంటెను దానం గలుగు వర్ణసాంకర్యమును, తన్మూలమగు పితృదేవతలకు పిండోదకములు లుప్తమగుటయు మున్నగు మహాపాతకముల కొడిగట్ట జాలనని యీ యుద్ధమును దలచినంతనె నోరెండుటయు, శరీరము కంపించుటయు, చర్మము దహింపబడుటయు, గాండీవము చేయిజారుటయు సంభవించుటచే 'న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవహ' అన్నట్లూరకుండి యుద్ధము చేయనను అర్జునునకు గలిగిన విషాదమునకు కార్పణ్య దోషము సంభవించుటయే కారణ మనియు నందురు. ఇట్లు దేహాత్మభ్రమయే కారణ మని యెరిగిన కృష్ణుడు దానిం బోగొట్ట కర్మజ్ఞాన భక్తియోగములును సత్త్వరజస్తమోగుణముల చేష్టితములను వివరించు గీతోపదేశముచేసి విశ్వరూప సందర్శనముచే నర్జునుని సందేహముల దీర్చి తన్ను శరణు జొచ్చుటె యుత్తమోత్తమ ధర్మమని, మోక్షసాధనంబని బోధించె. రామాయణములో నిట్టి పరిస్థితి యెట్లేర్పడెనో చూతము.

భరతుడు మేనమామయింటి కేగెను. అతని తల్లి కైకేయి రామపట్టాభిషేక సమయమున దశరథుని గోరిన వరములచే భరతునకు రాజ్యప్రాప్తియు, రామున కరణ్యవాసము నేర్పడెను. దశరథుడు మరణించెను. రాజులేని రాజ్యమెట్టి యథోగతి చెందునో యని వసిష్ఠుడు భరతుని పిలిపించెను. తండ్రి మరణవార్తయు, రాముని వనవాసమును, తన తల్లివరములవలన తనకు గలిగిన నపకీర్తియు తలచి తలచి భరతుడు పొందిన దుఃఖమును, దశరథుని సంస్కారాదుల యనంతరము వసిష్ఠుడు భరతుని పట్టము గట్టుకొమ్మనుట యినుమడింప జేసెను. 'విలలాప సభామధ్యే' అనుటచే భరతుని అపార దుఃఖము సుస్పష్ట మగుచున్నది. ఇది యట్లుండ కౌసల్య భరతుని జూచి 'నీ తల్లి నీకొరకు సంపాదించిన రాజ్యమును సుఖముగ ననుభవింపు' మనినంతనే భరతుడు చేసిన శపథములు రాలను కరగించును. భరతుడు రాముని తోడి తెచ్చుటకై పోవునపుడు గుహుడు తన్ను సందేహించి, రామున 'కపకారము చేయ వచ్చితివా' అని యడుగునపుడు భరతుడు చాల ఖిన్ను డయ్యెను. అచ్చటినుండి భరతుడు భరద్వాజాశ్రమమునకు బోయిన వెంటనే మహర్షి వసిష్ఠుని, భరతుని యుక్తముగ నాదరించి భరతుని జూచి, 'రాజ్యమేలువాడిట్లు వచ్చుట కేమి కారణము? నిన్ను జూడ నాకు సందియంబు గలుగుచున్నది. రాజ్యకాంక్షచే దానిని శాశ్వతముగ బడయ గోరి రామునియం దెట్టి కీడు తలంపవు గదా?' యనినంతనే భరతుడు గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్లు నిషాదుడగు గుహు డడిగినట్లే త్రికాలవేదియగు మహర్షియు నడిగినందున చాల దుఃఖించి భరతుడు వినయముతో 'దేవసముడగు మా యన్నను వనవాసమునుండి మరల్చి పిలుచుకొనివచ్చుట కేగుచున్నా' ననెను. రాముని వనగమన సమయమున తా నూరియందు లేకున్నను తన తల్లి వరము లడుగుటగాని దశరథు డా వరముల నిచ్చుటగాని యెరుంగని యాకాశము వంటి పవిత్రహృదయుడగు తన్నిట్లు పండితపామరలోకము నిందించుటచే 'సంభావితస్య చాకీర్తిర్మరణాదతి రిచ్యతే' అన్నట్లు ఆత్మగౌరవము గలవానికి అపకీర్తి మరణముకంటె హెచ్చయినదికదా! ఇట్టి లోకాపవాదదోషము తన్నంటకుండ జేయ దృఢసంకల్పము చేసికొని తన తల్లియు దండ్రియు చేసిన తప్పులను సవరించి తన వంశగౌరవమును గాపాడుకొన నెంచిన భరతుని పరిస్థితి యెట్లున్నదనిన అర్జునుని విషాదమును బోలియున్నదనవచ్చును. అచ్చటి ధర్మక్షేత్రము కురుక్షేత్రమనబడు యుద్ధరంగ మిచ్చట మానసక్షేత్రము. అచ్చటి బాహ్యయుద్ధమిచ్చటి అంతర్యుద్ధము. పాండవమధ్యముడగు అర్జునుడు కృష్ణసఖుడు, క్షత్రియుడు. ఇచ్చట శ్రీ రామభక్తి భరితుడగు భరతుడు సోదరుడు. రామునివాక్యము చొప్పున సాటిలేని సోదరుడు క్షత్రియుడే. కౌరవపాండవుల యుద్ధము ధర్మాధర్మముల యుద్ధము. ఇట భరతుని మానసక్షేత్రమున జరిగిన ధర్మాధర్మముల యుద్ధమే చిత్రకూటమున

నన్నదమ్ములకు జరిగిన వాదరూపమున సామాన్యవిశేషధర్మ పరిశీలన. అర్జుననిమాటలు విని కృష్ణుడు 'ప్రజ్ఞావాదాంశ్చ భాషసే' పండితుల మాటలను గూడ చెప్పుచున్నావు' అనెను. ఇట భరతుని వాక్యములును అతని ప్రజ్ఞను దెలుపునట్టివే. అట 'గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః' అని యుద్ధమున చావనున్న బంధుమిత్రాది స్వజనుల విషయము. ఇట తండ్రి మరణమును గూర్చి భరతుడు దుఃఖమున మునిగె నని రామచంద్రుడీ క్రింది విధముల దుఃఖోపశమనమును చేయుచున్నాడు.

**నాత్మనః కామకారోఽస్తి పురుషోఽయమనీశ్వరః।**
**ఇతశ్చేతరతశ్చైనం కృతాంతః పరికర్షతి॥**

జీవాత్మకు తాను గోరినట్లు చేయు శక్తిలేదు. ఏలన జీవుడు స్వతంత్రుడు గాడు, పరతంత్రుడు. ఒక ప్రదేశమునుండి యింకొక ప్రదేశమునకు మరియొక ప్రదేశము నుండి యీ ప్రదేశమునకును జీవుని తెచ్చువాడు సర్వస్వతంత్రుడగు ఆ పరమాత్మయే.

**ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥**

యంత్రముపై యెక్కించినటులుండు సకలప్రాణులను ఈశ్వరుడు తన మాయచే త్రిప్పుచు ప్రాణు లన్నింటిహృదయములం దున్నాడు.

**సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాస్సముచ్ఛ్రయాః।**
**సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితమ్॥**

కూడబెట్టిన ధనమునకు నాశమె పర్యవసానము. మిక్కిలి గొప్ప పదవిలో నుండు బ్రహ్మాదులకును అధికారసమాప్తిదశలో పదవినుండి క్రింద పడుట తప్పదు. ఎవనితో సంయోగ మానందముగ నుండునో అట్టి పుత్ర మిత్ర



కళత్రాదుల వియోగము నిశ్చయము. ఎట్టి పదవిలో నెంత సుఖ మనుభవించినను జీవితము మరణముననే ముగియును.

**యథా ఫలానాం పక్వానాం నాన్యత్ర పతనాద్భయమ్।**
**ఏవం నరస్య జాతస్య నాన్యత్ర మరణాద్భయమ్॥**

బాగుగా మాగిన పండ్లు క్రింద పడుట సహజము. అట్లే పుట్టినవానికి మరణము నొందుటకంటె వేరొక భయము లేదు.

గీతయు బోధించున దిదియే–

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి॥**

**(భగవద్గీత.2-27)**

పుట్టినవాడు గిట్టుట నిజము. చచ్చినవాడు మరల పుట్టుటయు నిశ్చయము. ఇట్లు పరిహారము లేనిదాని గూర్చి దుఃఖింప దగవు.

**శ్లో॥ ఆత్మాన మనుశోచ త్వం కిమన్యమనుశోచసి।**
**ఆయుస్తే హీయతే యస్య స్థితస్య చ గతస్య చ॥**

నీవు నిలుచున్నను కదలుచున్నను నీ యాయువు క్షీణించుచునే యుండును. నీ యాత్మనుగూర్చి నీవు శోకింపుము. ఇతరులను గురించి నీవు శోకింపవలదు.

**శ్లో॥ నందంత్యుదిత ఆదిత్యే నందంత్యస్తమితే రవౌ।**
**ఆత్మనో నావబుధ్యంతే మనుష్యా జీవితక్షయమ్॥**

సూర్యోదయము కాగానే ధనార్జనము చేయవచ్చునని సంతోషింతురు. సూర్యుడస్తమించినంతనె కామభోగము లనుభవింపవచ్చునని సంతోషింతురు

మానవులు. కాని క్షణ క్షణ మాయువు క్షీణించుచున్నదని యెరుగరు. బాగుగా జీవించియున్నపుడే పరలోకచింత గలిగి వర్తింపవలెనని భావము.

**శ్లో॥ యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహార్ణవే।**
**సమేత్య చ వ్యపేయాతాం కాలమాసాద్య కంచన॥**

సముద్రపుటలలచే వేరు వేరు దిక్కులనుండి కొట్టుకొని వచ్చిన కాష్ఠము లొకటిగ జేరి చూచుచుండగనే యవి చెదరి దిక్కున కొక్కటిగ బోవును.

**శ్లో॥ ఏవం భార్యాశ్చ పుత్రాశ్చ జ్ఞాతయశ్చ వసూని చ।**
**సమేత్య వ్యవధావంతి ధ్రువో హ్యేషాం వినాభవః॥**

ఇటులే భార్యలు, పుత్రులు, బంధువులు సంపాదించిన వస్తువులు ఒక సమయమున జేరియుండినను కాలానుసారముగ నొకరి కొకరు ఒకదానికొకటి సంబంధము వీడిపోవుట తప్పదు.

**శ్లో॥ ఏవం పూర్వైర్గతో మార్గః పితృపైతామహో ధ్రువః।**
**తమాపన్నః కథం శోచేద్యస్య నాస్తి వ్యతిక్రమః॥**

దారి నడచుచుండు కొందరిని జూచిన యొకడు 'నేనును మీ వెంట వచ్చెద'నని చెప్పి వారితో బోవునట్లే మన పూర్వికులు నడచిన మార్గముననే అనగా వారి ధర్మమార్గము ననుసరించుట యుక్తము గాని వారి వియోగమునకు చింతించుట తగదు.

**శ్లో॥ వయసః పతమానస్య స్రోతసో వాఽనివర్తినః।**
**ఆత్మా సుఖే నియోక్తవ్య స్సుఖభాజః ప్రజాః స్మృతాః॥**

తిరుగుబాటులేని కాల మొక ప్రవాహము వలె పోవుటచే ఆయువు క్షీణించుచుండగా పరలోకసుఖమునకు దారి యగు పరమధర్మము ననుష్ఠించుట యుక్తము. శాశ్వతానందమునకుం దగు ధర్మము ననుష్ఠించువారే మానవు లనబడుదురు.



భరతుని దృష్టిలో ధర్మమేదో, చేయవలసిన కర్మయేదో పరిశీలింతము.

శ్రీరాముడు తండ్రిమరణమునకు వగవంబనిలేదని. దేహమనిత్యమని, ఆత్మయే నిత్యమని దాని నుద్ధరించు ధర్మకర్మములే ఆచరణీయములని యుక్తియుక్తముగను, సహేతుకముగను చెప్పిన మాటలను విని భరతుడిట్లు వినయపూర్వకముగ విన్నవించుచున్నాడు.

**శ్లో॥ కో హి స్యాదీదృశో లోకే యాదృశస్త్వమరిందమ।**
**న త్వాం ప్రవ్యథయేద్దుఃఖం ప్రీతిర్వా న ప్రహర్షయేత్॥**

"అన్నా! నీవంటివాడు లోకమున నెవ్వడు గలడు? లోకమున జనులు శుభము రాగోరుదురు. వచ్చిన నుప్పొంగుదురు. కష్టము, దుఃఖము రాగోరరు. వచ్చిన వంతలపా లగుదురు, నీ వట్టివాడవు గావు. నిన్ను సుఖ దుఃఖములును, లాభాలాభములును, జయాపజయములును గదలింపలేవు. అనగా,

**శ్లో॥ దుఃఖేష్వనుద్విగ్నమనా స్సుఖేషు విగతస్పృహః।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే॥**

**(భగవద్గీత. 2-56)**

దుఃఖము గలిగినంతనే దైన్యము పొందవు. సుఖము చేకూరినంతనె విషయసుఖములం దాశగలవాడవు కావు.

**శ్లో॥ య స్సర్వత్రానభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥**

ఎవడు దేనియం దాశలేనివాడుగను, శుభాశుభములు గలిగిన నుదాసీనుడుగ నుండి రాగద్వేషముల జూపడో వాడే స్థిరబుద్ధి గలవాడు.

**శ్లో॥ యథా మృతస్తథా జీవన్ యథాఽసతి తథా సతి।**
**యస్యైష బుద్ధిలాభ స్స్యాత్పరితప్యేత కేన సః॥**

పామరులకు తాము చూడని వస్తువులపై గోరిక పుట్టదు. పండితులకు కానవచ్చు వస్తువులపైనను గోరిక కలుగదు. చచ్చినవారిపై కోప మెవరికి గలుగదు. జ్ఞానికి బ్రతికియుండువారిపైనను గోపము రాదు. కనుక మరణించిన తండ్రిని గూర్చియు నేను శోకింపలేదు.

**శ్లో॥ అమరోపమసత్వస్త్వం మహాత్మా సత్యసంగరః।**
**సర్వజ్ఞస్సర్వదర్శీ చ బుద్ధిమాంశ్చాసి రాఘవ॥**

నీవు దేవసమానుడవు, సత్వగుణసంపన్నుడవు, నిత్యసత్యవ్రతుడవు, మహానుభావుడవు; కుశాగ్రబుద్ధివి. ఇట్టి నీవు నిష్కారణముగ అడవులలో దుఃఖము లనుభవించుచుండ నేనెట్లు సహింతును? నీతో సీతా లక్ష్మణులును దుఃఖము లనుభవించుచున్నారే! ఇంతకంటెను శోకింపదగిన దేది కలదు? తాను చేసిన మహాపాపమునకు మరణదండన కర్హురాలగు నా తల్లిని ధర్మమునకు గట్టువడి చంపకున్నాను. ధర్మశాస్త్రమునకు మూలాధారమగు వంశమున బుట్టి ధర్మాధర్మముల నెరిగి గురూపదేశము పొంది ధార్మికుడని ప్రసిద్ధిగాంచియు కేవల మొక యాడుదానియందలి మోహముచే వివేకశూన్యుడై జ్యేష్ఠునకు రాజ్యము రానీయకుండచేసిన తండ్రినేమని చెప్పవలెను? గురునిందా పాతకమే కాని ప్రత్యక్షమగు లోకగర్హితమైన కార్యముచేసి నా కపకీర్తితెచ్చిన తండ్రిని మరణానంతరము దూషించి ద్వేషించి లాభమేమి? 'శత్రోరపి గుణా గ్రాహ్యా, దోషావాచ్యా గురోరపి' అను న్యాయము ననుసరించి చెప్పితిని.

**శ్లో॥ పితుర్హి యదతిక్రాంతం పుత్రో యస్సాధు మన్యతే।**
**తదపత్యం మతం లోకే విపరీతమతోఽ న్యథా॥**

తండ్రిచేసిన తప్పును సవరించుటకు యత్నించు పుత్రుడే పుత్రుడని, తండ్రికి వ్యతిరిక్తముగ నడచుకొనువాడు పుత్రుడుకాడని పెద్దలందురు కనుక తండ్రిచేసిన తప్పును సవరింప నీవు తగినవాడవు. నా ప్రార్థనము నంగీకరించి



అయోధ్యకు వచ్చి పట్టము గట్టుకొని తప్పుచేసిన తండ్రిని నరకమునుండి తప్పింపుము. నా తల్లిచేసిన యకృత్యమును మన్నింపుము. అపకీర్తి పాలబడిన నన్నుద్ధరింపుము నీ వియోగముచే వంది కుందుచున్న తల్లుల గాపాడుము. వశిష్ఠాది గురువుల సంతోషింపజేయుము. ప్రజాసామాన్యము నీ పరిపాలనా సంతోషము ననుభవించునట్లు గావింపుము. నీవు క్షత్రియుడవు.

**శ్లో॥ క్వ చారణ్యం క్వ చ క్షాత్రం క్వ జటాః క్వ చ పాలనమ్।**
**ఈదృశం వ్యాహతం కర్మ న భవాన్ కర్తుమర్హతి॥**

నీ కరణ్యావాస మెక్కడ? నీక్షత్రియధర్మమెక్కడ? జటలెక్కడ? రాజ్యపాలనమెక్కడ? ఇట్టి విపరీతకర్మ ననుష్ఠించుట నీకు దగినది కాదు. నగరవాసము, రాజ్యపాలన, దుష్టశిక్షణ, శిష్టరక్షణ నీ ధర్మము కాని తాపసవృత్తి నీ కులోచితధర్మముకాదు. నాలుగువర్ణముల వారిని హద్దు మీరనీయక కట్టుదిట్టములు చేసి గృహస్థుడ వై క్షత్రియధర్మము పాటింపుము. నాలుగాశ్రమముల లోను గార్హస్థ్యమే శ్రేష్ఠమని, తక్కిన మూడు దీని మీద నాధారపడినవని శాస్త్రము.

**శ్లో॥ యథా మాతరమాశ్రిత్య సర్వే జీవంతి జంతవః।**
**ఏవం గార్హస్థ్యమాశ్రిత్య వర్తంత ఇతరాశ్రమాః॥**

తల్లినాశ్రయించి ప్రాణులు బ్రతుకునట్లే యితరాశ్రమములు, గృహస్థాశ్రమము ననుసరించి వర్తించును. కావున అన్నా! నా ప్రార్థన నంగీకరించి మమ్మందర నుద్ధరింపుము. కాదేని నన్ను నీతో అరణ్యమున నుండనిమ్మనెను.

**రామచంద్రుని దృఢసంకల్పము**

భరతుని మృదుమధురమగు మాటలను విని రామచంద్రు డిట్లనెను, "భరతా! ధర్మనిష్ఠుడగు దశరథచక్రవర్తికిని, ధర్మస్వరూపుడగు కేకయరాజు

కూతురగు కైకేయికిని పుట్టినందున, వారికి తగినరీతిగా పల్కితివి. నాయందు నీకుగల దృఢభక్తికి మెచ్చితిని. కాని నా మాట లాలకింపుము. మన తండ్రి కాముకుడని, ధర్మము తప్పినవాడని, తప్పుచేసినాడని అంటివి. దశరథుడు నీ తల్లిని వివాహము చేసికొనుటకు ముందు కేకయరాజుతో, 'కైకకు బుట్టిన వానికే రాజ్యమిచ్చెద' నని చెప్పియున్నాడు. దానిని పాటించుట యొకటి. దేవాసురయుద్ధమున నీ తల్లి గావించిన యుపకృతికి రెండు వరములిచ్చెద ననెను. ఆ వరముల నామె యిప్పు డడిగెను. నీకు పట్టము గట్టవలె ననుటయు, న న్నరణ్యమునకు పొమ్మనుటయు ఆ రెండు వరములు. కావున నీ రెండు సందర్భములలో మన తండ్రి యిచ్చిన మాటల నతిక్రమించుటచే నతని కసత్య దోషము రాదా? అట్టి దోష మతనింజేరి యతనికి నరకము సంప్రాప్తమయ్యేనేని దానిని బోగొట్టుట మన ధర్మమగునా కాదా? తండ్రిచేసిన తప్పును సవరించువాడే పుత్రుడు. అట్లు చేయనివాడు పుత్రుడు కానేరడని నీ వంటివిగదా? తండ్రి చేసినది తప్పని భావించి యట్లంటివి. పరిశీలింపగా అతడు చేసినది ధర్మమని, అతనిమాటను పాటింపకుంటిమేని అతని కసత్యదోషము గలిగి నరకము ప్రాప్తమగునని తెలియుచున్నది.

**శ్లో॥ పున్నామ్నో నరకాద్యస్మాత్పితరం త్రాయతే సుతః।**
**తస్మాత్పుత్ర ఇతి ప్రోక్తః పితౄన్ యత్పాతి వా సుతః॥**

పుత్+త్రాయతే= పుత్రః– పున్నామనరకము నుండి రక్షించువాడు పుత్రుడని యర్థము. నే నరణ్యవాసము చేయకుండుటచేతను, నీవు రాజ్యపాలనము చేయకుండుటచేతను మన మిరువురము ధర్మము తప్పినవారమై తండ్రిని నరకమున ద్రోయువార మగుదుమే. మనకు పుత్రశబ్ద మెట్లన్వయించునో యోచింపుము. కనుక తండ్రిమాట చొప్పున నేను నా ధర్మమును, నీవు నీ ధర్మమును అనుష్ఠించి తీరవలెనని స్పష్టముగ నేర్పడుచున్నది.



('స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' అను గీతావాక్య మెట్లనుష్ఠింపబడుచున్నదో గుర్తింపనగును.)

నీవు నీ తల్లి చంపదగిన యట్టి తప్పు చేసినందున ఆమె వధ్యురాలని తల్లిగనుక ధర్మవిరుద్ధమని తలచి నీ వామెను చంపలేదని యంటివి. పుత్రుని క్షేమము గోరుట తప్పగునా? నీ మేలుకోరి తాను ముందడిగిన వరముల నిప్పు డిట్లడుగుట తప్పని యెట్లు చెప్పగలవు? వివాహమునకు మునుపే కన్యాశుల్కముగ ఈ రాజ్య మామెకీయబడినదే కదా? ఇందామెతప్పేమియు లేదు. కనుక నీ వామెయం దాగ్రహము చూపుట తగదు.

ఇక నీ వపకీర్తి ననుభవింపవచ్చెననుట యొకటి. నీవు చేయరాని పనిని చేసిన గదా నీ కపకీర్తిగలుగును? నీ వూరలేనపుడు నీకెంతమాత్రము తెలియక జరిగిన కార్యమునకు నీ తప్పిద మేమున్నది? మనసా వాచా కర్మణా నా వనవాసము నందుగాని నీకు రాజ్యము ప్రాప్తించుటలోగాని నీకెట్టిసంబంధము లేదు. కనుక 'పద్మపత్రమివాంభసా' యన్నట్లు ఇందెంతమాత్రము దోషముగాని అపకీర్తిగాని నిన్నంటదు. ఇంతియగాదు. నీ వెట్టివాడవని, నాయందును, ధర్మాచరణము నందును నీకున్నభక్తిశ్రద్ధ లిట్టివని, నీ వర్ధపరుడవు గావని ఋషితుల్యుడవని లోకమిప్పుడెరిగి లోకమున భక్తులకెల్ల నీవగ్రస్థానము వహించి శాశ్వతకీర్తి పొందబోవుచున్నావని 'మా శుచః' శోకముడుగుమని, 'మా శుచస్సంపదం దైవీ మభిజాతోఽసి' అనగా నీవు దైవసంపదలతో పుట్టినవాడవని అభయ మిచ్చినట్లు తెలియుచున్నది. 'స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభతే నరః ' తన తన కర్మయందు ఇష్టముగల మనుజుడు సిద్ధిని పొందును అనియు,

**శ్లో॥ యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥**

ప్రాణులయుత్పత్తి ఎవనిచేతనో, ఎవనిచే నంతయు వ్యాపింపబడినదో ఆ యీశ్వరుని (స్వకర్మణా) తనకు కర్తవ్యమగు కర్మచే నర్చించి మనుజుడు సిద్ధినిపొందును- అను భావమును బోధించునట్లును ధ్వనించుచున్నది.

భరతుడు చెప్పిన మాటలన్నియు సామాన్యధర్మమును దెలుపునవి యనియు విశేష ధర్మముల నతనికి బోధింపవలసిన సమయము వచ్చినదని యెరింగి భరతునియాక్షేపముల శాస్త్రసమ్మతముగ, యుక్తియుక్తముగ సహేతుకముగ నెదుర్కొని అతనిని ఒప్పించుట కిట్లు చెప్పెను. "భరతా! నీ వయోధ్యకు బోయి శత్రుఘ్నుని సహాయముతో వసిష్ఠాదులగూడి ప్రజారంజకముగ రాజ్యమేలుము. నేను సీతాలక్ష్మణులతో దండకారణ్యము ప్రవేశించెద.

**శ్లో॥ త్వం రాజా భరత భవ స్వయం నరాణాం**
**వన్యానామహమపి రాజరాణ్మృగాణామ్ ।**
**గచ్ఛ త్వం పురవరమద్య సంప్రహృష్టః**
**సంహృష్టస్త్వహమపి దండకాన్ ప్రవేక్ష్యే ॥**

భరతా! నీవు నగరమున మనుష్యులకు రాజువు కమ్ము. నేనరణ్యమున మృగములకెల్ల రాజుగా నుండెదను. నీవు రాజచిహ్నమగు శ్వేతచ్ఛత్రముచే నెండవానల బాధ లేకుండ ఉండుము. నే నరణ్యములోని వృక్షముల నీడ నాశ్రయించియుండెదను. పురమున బుద్ధిమంతుడగు శత్రుఘ్నుడు నీకు సాయము చేయును. నాకరణ్యమున లక్ష్మణుడు తోడునీడగ నుండును. 'పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ' అన్నట్లు మనము నలువురము పరస్పరసహాయమున మన తండ్రియొక్క మాటను సత్యముగావించి మన పుత్రధర్మము ననుష్ఠింతము. 'మా విషాదం' నీవు దుఃఖింపకుమని తమ్ముని నచ్చజెప్పి తన దృఢ సంకల్పమును విడువడయ్యె.



**జాబాలిమతఖండన**

భరత రామ సంవాదసమయమున నుండిన ఋషులలో నొక్కడగు జాబాలి రామచంద్రుని జూచి యిట్లనెను. "రాఘవా! నీవు మిక్కిలి బుద్ధిమంతుడవు. భరతు డిన్నివిధముల నిన్ను రమ్మని రాజ్యమేలుమని ప్రార్థించి నను వినకున్నావేల? ఈ లోకమున నొకప్రాణి యొంటరిగనే పుట్టును ఒంటరి గనే చచ్చును. తల్లియని, తండ్రియని, యన్నయని, తమ్ముడని, బంధువని చెప్పుటెల్ల సంకేతము గాని యొకరి కొకరి కేమి సంబంధమున్నది? ఎవరి కష్ట సుఖములు వారివేగాని ఒకరి వ్యాధిని, ముసలితనమును, దుఃఖమును ఇతరు లెంతమాత్రము గైకొనలేరు. ప్రయాణము చేయువారు దారిలో కనబడిన వారితో కొంతసేపు ముచ్చటించునట్లే సంసారమున మానవులు మెలగుటెల్ల. రేయింబవలు ద్రవ్యార్జనమునకై వినియోగించి సుఖము లనుభవింపని వారిని గూర్చి నాకు చింత. ప్రత్యక్షముగ నగపడు వస్తువుల జూచి యిష్టోపభోగము లనుభవించుట యుక్తము. పెద్దలరాజ్యము చేకూరినపుడు దానిని పాలింపనని యడవులలో దుఃఖములనుభవింపనేల? శ్రాద్ధములని. చచ్చినవారి ప్రీతికొరకని చేయు వైదికకార్యములు వృధాయనక తప్పదు. ఒకరికి బెట్టిన యన్నము దారి నడచు వారికొరకనిన వారి యాకలి దీరునా? అట్లే మనమితరులకు బెట్టునట్టి యన్నము చచ్చినవారికెట్లుచేరును? దానము చేయుము, దేవతల నారాధింపుము, యజ్ఞాదులు చేయుము- అనుటెల్ల ద్రవ్యార్జన కొరకు కల్పించి వ్రాయబడిన గ్రంథములే. ప్రత్యక్షమగు రాజ్యము పొంది రాజభోగముల విరివిగ ననుభవింపుము. పరోక్షమును నమ్మకుము. భరతుని కోరిక చొప్పున అయోధ్యకేగి రాజ్యము పాలింపుము".

రామచంద్రుడు జాబాలిమతమునిట్లు ఖండించెను. "బ్రాహ్మణుడవగు నీవిట్టి నాస్తికవాదముచేసి శాస్త్రవిహిత కర్మాచరణమును దూషించి ప్రత్యక్షమును నమ్మి ప్రత్యక్షఫలానుభవము పొంది పరోక్షమగువాని నెల్ల

కల్ల యని నిరాకరింప నుపదేశించుట వింతగనున్నది. నీ మాటలు వినువారి కింపుగనుండును కాని హిత మెంతమాత్రము కానేరవు. తాత్కాలికసుఖము నిచ్చునే కాని శాశ్వత సుఖము నియ్యజాలవు. నీ మార్గము ననుసరించు వాని కిహపరములు లేవు. ఇంతకాలము రామచంద్రు డాడితప్పనివాడని. నిత్యసత్యవ్రతుడని లోకమున కీర్తిపొందిన నాకు శాశ్వతాపకీర్తియు, నరకమును గలుగునట్టి మాటలు పలుకకుము.

**శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥**

**(భగవద్గీత, 3-21)**

ఉత్తము డెట్టికార్యము చేయునో జనసామాన్యమట్టికార్యమునే చేయును. వాడేది ప్రనూణమని చేయునో దాని నితరు లనువర్తింతురు.

**శ్లో॥ యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః॥**

నే నొకప్పుడు కర్మచేయకుంటినేని మానవు లందరు నా మార్గ మనుసరించి కర్మములు చేయక మానుదురు.

**శ్లో॥ ఉత్సీదేయురిమే లోకాః న కుర్యాం కర్మ చేదహమ్।**
**సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః॥**

నేను కర్మ చేయకుండిన కర్మమార్గముదెలియక జనులు చెడిపోవుదురు. ఇందువలన వర్ణసంకరమునకు కారణభూతుడనై ప్రజలను చెరచినవాడ నగుదును. అనుచు సత్యము తప్పరానిదని నిరూపించుచున్నాడు.

**శ్లో॥ సత్యమేవానృశంసం చ రాజవృత్తం సనాతనమ్।**
**తస్మాత్సత్యాత్మకం రాజ్యం సత్యే లోకః ప్రతిష్ఠితః॥**



భూతదయ నాధారముగ జేసికొనిన పురాతన ప్రభుత్వము సత్యము నాశ్రయించియే యుండును. అందుచే బ్రజలు సత్యమనుసరింతురు. సత్యము మీద నీ లోక మాధారపడి యున్నది.

**శ్లో॥ సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మా శ్రితా సదా।**
**సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్॥**

లోకనాథుడగు భగవంతుడు సత్యస్వరూపుడే. అట్టి సత్యమునే లక్ష్మి యెల్లప్పుడాశ్రయించి యున్నది. సమస్తమునకు సత్యమే మూలము. మోక్ష సాధనమునకు సత్యమునకు మించిన దేదియు లేదు.

**శ్లో॥ సత్యం చ ధర్మం చ పరాక్రమం చ**
**భూతానుకంపాం ప్రియవాదితాం చ।**
**ద్విజాతి దేవాతిథిపూజనం చ**
**పంథానమాహుస్త్రిదివస్య సంతః॥**

సత్యము, ధర్మము, పరాక్రమము, భూతదయ, ప్రియభాషణము. బ్రాహ్మణులను, దేవతలను, అతిథులను పూజించుట స్వర్గమునకు సాధనములని సత్పురుషులందురు. మా తండ్రి కైకేయీదేవికిచ్చిన వరములకు గట్టువడి ప్రాణసంకటమైనను నా వనవాసమున కియ్యకొనక తప్పినదికాదు. జ్యేష్ఠుని వదలి రెండవ కుమారునకు రాజ్యమియ్యకపోవుటకును మార్గములేదు. ఆనాడే నేను వనవాసము చేసెదనని ప్రతిజ్ఞచేసితిని. అట్టి ప్రతిజ్ఞను పాటించుట కంటె తండ్రిని ఉత్తమంబగు ధర్మమైన సత్యము నాచరించినవానిగ జేయుట కంటె నే జేయవలసిన కర్తవ్యమొందు గలదా? పితృవాక్యపరిపాలనమునకు సాటియగు ధర్మమేది గలదు?

శ్రాద్ధాదివైదిక కర్మలుచేయుట వెర్రితనమంటివి. ప్రత్యక్షమే ప్రమాణము పరోక్షము ప్రమాణము గాదంటివి. దీని యర్థమేమి? ప్రత్యక్షమగు శరీరమే

సత్యము. పరోక్షమగు ఆత్మ సత్యముగాదనినట్లే గ్రహింపవలెను. శరీరము వేరని. ఆత్మవేరని దేహ మనిత్యమని, ఆత్మ నిత్యమని స్థూలదృష్టికి గోచరమగునదెల్ల అశాశ్వతమని, నాశము పొందునని, సూక్ష్మదృష్టికే గోచరమగు ఆత్మస్వరూపము శాస్త్రముల ప్రమాణములచేతను, గురూపదేశముచేతను కనుగొనవలెనని చెప్పుచున్నాను. 'శాస్త్రాద్వేద్మి జనార్దనమ్' అని పరమాత్మస్వరూపము గూడ శాస్త్రములచేతనే యరయందగునని చెప్పక తప్పదు. సత్యము పాటింపనక్కరలేదంటివే?

**శ్లో॥ త్వత్తో జనాః పూర్వతరే వరాశ్చ**
**శుభాని కర్మాణి బహూని చక్రుః।**
**జిత్వా సదేమం చ పరం చ లోకం**
**తస్మాద్ద్విజాస్స్వస్తి హుతం కృతం చ॥**

నీకు పూర్వముండినవారును నీ కంటె శ్రేష్ఠులునునగు జనులనేకులు శుభకర్మము లనేకముల నాచరించి యిహపరలోకముల జయించి ఆకాశమున గ్రహనక్షత్రాదిరూపములతో వెలుగుచున్నారు. కావుననే ద్విజులు మంగళకరములగు యాగాదులను, తపోదానాదులను విరివిగ చేయుదురు.

**శ్లో॥ అసత్యసంధస్య సతశ్చలస్యాస్థిరచేతసః।**
**నైవ దేవా న పితరః ప్రతీచ్ఛంతీతి నశ్శ్రుతమ్॥**

మాటను పాటింపనివాడును, చపలబుద్ధి గలవాడును, మనసు నిలకడ లేనివాడును అగు నరుడు హవ్యకవ్యముల నొసగినను దేవతలుగాని పితృ దేవతలుగాని వానిని గ్రహింపరని మనము వినియున్నాము. కనుక దేహాత్మ భేదము ఆత్మపరమాత్మస్వరూపము తెలిసినవాడే శాస్త్రవిహితకర్మము లాచరించును. వేద మన్నిటికి ప్రమాణము. అట్టి వేదము నంగీకరింపని నీ చార్వాక మతము దూష్యము. దానింబట్టి శ్రాద్ధాది వైదిక కర్మముల నిరసించెడి నీ వాద మెంతమాత్రము చెల్లదని రూఢిగ వేదమతమును రామచంద్రుడు స్థాపించెను.



ఇట్లు చిత్రకూటమున జరిగిన భరత రామ సంవాదము కృష్ణార్జున సంవాదము వంటిదే కనుక కృష్ణావతారములో జరిగిన గీతోపదేశమే రామావతారమున జరిగిన దనుట కెంతమాత్రము సందియములేదు. కృష్ణావతారమున ఉపదేశము మాత్రమె జరిగినది. రామావతారములో రాముడు తాను బోధించిన స్వధర్మమగు క్షత్రియధర్మమును తాను అనుష్ఠించి తమ్ములచేతను అనుష్ఠింప జేసె ననుటచే "రాముడు చేసినట్లు, కృష్ణుడు చెప్పినట్లు అను లోకోక్తి పుట్టెను.

శ్రీరామావతార మొక విలక్షణావతార మనుటకు మరి యొక నిదర్శనము గలదు. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులను నలుగురు చేరిన యొక అవతారమిది. పాయసవిభాగమున భేదము లుండినను ఈ నలుగురిలో బలపరాక్రమాదులలో నెట్టి భేదము లేదు.

**శ్లో॥ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణం యదుచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**

పరిపూర్ణుడగు విష్ణ్వంశమున నే భాగమైనను పూర్ణమగునట్టిదే యని నిరూపించుటకు రామావతారమున నలుగురు మూర్తులుగ భగవంతుడవ తరించెనని తెలిసికొనుచు నీ సత్యమును కొంత పరిశీలింతము. ఈ నలుగురిలో రామచంద్రుని గూర్చి మనకెట్టి సందియము లేదు. లక్ష్మణుని ప్రభావము ఇంద్రజిత్తు సంహారముననే తెలియుచున్నది. ఉత్తరకాండమున రావణవధానంతరము రాముని ప్రస్తుతించునపుడు ఇంద్రజిత్తుయుద్ధమును గూర్చి యెక్కువగ జెప్పగా రామచంద్రుడాశ్చర్యపడి అగస్త్యాదులజూచి, "మహాశూరులును బలపరాక్రమోపేతులు నగు రావణ–కుంభకర్ణ మహోదర

మహాపార్శ్వాదు లుండగా ఇంద్రజిత్తును విశేషించి పొగడనేల యని యడుగగా, అగస్త్యు డింద్రజిత్తుప్రభావ మిట్టిదని వివరించి చెప్పెను. ఇందువలన నింద్రజిత్సంహారమున లక్ష్మణుడు చూపిన బలపరాక్రమములు దశరథునికి వేంకటాచలమున శ్రీనివాసుడు ప్రత్యక్షమై 'శూరాశ్చ బలవంతాశ్చ మత్తుల్యాఽమిత విక్రమా' యని యనుగ్రహించిన వాక్యమును సార్థకము చేసినది.

రామలక్ష్మణులు వనవాసముచేసిన పదునాలుగేండ్లు రాజ్యభారము వహించి చక్రవర్తిత్వమును గాపాడి సకలసామంతుల తన యధీనమున నుంచుకొని యుండిన భరతుని బలపరాక్రమము లెట్టివో యూహింపనగును. సీతాపహరణానంతరము రామచంద్రున కెట్టి సహాయము కావలసియున్నను సర్వసామంతుల సైన్యము లన్నిటిని పంపుటకు సంసిద్ధుడైయుండెనని సీతాదేవివాక్యము వలన స్పష్టమగుచున్నది.

**శ్లో॥ కచ్చిదక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః।**
**ధ్వజినీం మంత్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే॥**

భ్రాతృవత్సలుడగు భరతుడు నా కొరకు భయంకరమగు అక్షౌహిణీ సైన్యమును మంత్రుల కాపుదలక్రింద బంపునే అని సీతాదేవి హనుమంతునితో జెప్పెను. మరియు పట్టాభిషేకానంతరము రామచంద్రుడు రాజులందరిని జూచి, "వనవాసమున సీతాపహరణవార్త వినినంతనె భరతుని యాజ్ఞచొప్పున మీరెల్ల రట్లే సంసిద్ధులుగనుండిన మహిమాతిశయముచే నేను రావణుని సంహరించితి'నని చెప్పెను. ఇందువలన భరతుని శక్తి సామర్థ్యము లెట్టివో సుస్పష్టమగుచున్నది. లవణాసురధ్వంసము శత్రుఘ్నునిబలపరాక్రమంబుల వెల్లడించుచున్నది. కనుక రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలువురు బలపరాక్రమములందు సమానులే యని తెలియుచున్నది.



నిత్యవిభూతియందు ఆదిశేషుడు శయ్యగను, ఆసనముగను, ఛత్రముగను సర్వదేశ సర్వకాలములందు సేవ చేయునట్లే రామావతారమున లక్ష్మణుడుగ నవతరించి సకలవిధ కైంకర్యములు చేసెను. విష్ణువుయొక్క సుదర్శనుడే భరతు డనుటయు, పాంచజన్యమే శత్రుఘ్ను డనుటయును, లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఋగ్యజుస్సామవేదము లనుటయును శ్రీరాముని మహిమను వేనోళ్ళ చాటుచున్నవి.

# 4. గురుకులవాసము

శ్రీమన్నారాయణుడు భూలోకమున నవతరించి నిర్వహింపనున్న మహత్కార్యములకు మున్ముందుగ తగిన యనుకూలపరిస్థితి నేర్పరుప నారదు డేగి కొన్ని కార్యములు చేయును. అందువలన. కొందఱకు కొన్ని చిక్కు లేర్పడుటయు గలదు. కనుక నారదుడు కలహభోజనుడని సామాన్య జను లతని నిందింతురు. అట్లే విశ్వామిత్రుడు దుర్వాసుని వలె నెక్కువ కోపముగలవాడని ప్రసిద్ధమైనను శ్రీరామావతారమున విశ్వామిత్రుడు లోకహితార్థము వెనుక జరుగనున్న శ్రీరామవనవాసమునకు దుష్టశిక్షణకు శిష్టరక్షణకు పూర్వాంగముగ విభవమున శ్రీరామునకు తా నాచార్యుడై క్రమశిక్షణ యొసంగి అవతారకృత్యమునకు తోడ్పడిన విధమును పరిశీలింతము.

శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నులకు వసిష్ఠుల మూలమున ఉపనయనము. వేదవేదాంగాది సకల విద్యోపదేశము చేయించి ధనుర్వే దమునను చతురంగముల నుపయోగించు వైఖరి బోధింపంజేసి. యుక్తకాలమున గురుబాంధవ హితైషిణుల మంత్రులగూడి వివాహవిషయ ముగూర్చి దశరథుడు సంభాషించుచుండ ద్వారపాలకుని మూలమున విశ్వామిత్రుని రాక విని కడు సంభ్రమంబున వసిష్ఠాదుల మున్నిడుకొని వారిని యు క్తరీతి నెదుర్కొని పూజించి కుశలంబు అడిగి లోనికి దోడ్కొనివచ్చి ఉచితాసనంబున అమరజేయ, మహర్షి రాజును కుశల ప్రశ్నలడిగి పసిష్ఠాది మహర్షులతో ఉచితరీతి సంభాషించెను. అంత దశరథుడు చేమోడ్చి వినయముతో విశ్వామిత్రుని జూచి యిట్లనెను.

**శ్లో॥ యథాఽమృతస్య సంప్రాప్తిర్యథా వర్షమనూదకే,**
**యథా సదృశదారేషు పుత్రజన్మాప్రజస్య చ.**



**ప్రణష్టస్య యథా లాభో యథా హర్షో మహోదయే,**
**తథైవాగమనం మన్యే స్వాగతం తే మహామునే.**

అమృతము లభించుట, లేక మరణించినవాడు పునర్జీవితుడగుట, నీరులేని ప్రదేశమున మంచి వర్షము గురియుట, పుత్రులులేని వాని కెల్లవిధముల తనకు సమానురాండ్రగు భార్యలయందు పుత్రు లుదయించుట, నష్టమైన ధనము మరల లభించుట, పుత్రాదుల వివాహములు మొదలైన శుభకార్యములు జరుగుట మున్నగు సందర్భములలో నెట్టి సంతోషము గలుగునో అచింతితమగు మీ రాకచే నాకట్టి సంతోషము గలుగుచున్నది.

**శ్లో॥ కం చ తే పరమం కామం కరోమి కిము హర్షితః,**
**పాత్రభూతోఽసి మే బ్రహ్మ న్దిష్ట్యా ప్రాప్తోఽసి కౌశిక.**

బ్రహ్మర్షీ! నా యదృష్టవిశేషముచే నీ విచ్చటి కరుదెంచితివి. నీ కోరిక యెట్టిదో దానిని నే నెట్టు పూర్తిచేయవలెనో తెలుపుము. నా దానము గ్రహింప నీవే సర్వవిధముల నర్హుడవు.

**అద్యమే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్ ॥**

ఇప్పుడే నా జన్మ సఫలమైనది. నా జీవిత మిపుడే సార్థకమైనది. నీ రాకచే నా గృహ మొక పుణ్యక్షేత్రమైనది. నీవు నాపాలిటి దైవమని యెంచెదను. నీ కోరిక దీర్చుట నా ధర్మము. తప్పక చేయుదును, ఆనతిమ్ము అని ప్రార్థించెను. అంత గాధినందను డిట్లనెను.

**శ్లో॥ సదృశం రాజశార్దూల తవైతద్భువి నాన్యథా ।**
**మహావంశప్రసూతస్య వసిష్ఠవ్యపదేశినః॥**

రాజోత్తమా! సూర్యవంశమున బుట్టినవాడవు. బ్రహ్మమానసపుత్రుడగు పసిష్ఠుని కులగురువుగా బడసి యతనిచే శిక్షింపబడినవాడవు. నీ మాటలు

నీకే తగును గాని యితరులకు దగునా ? నీ వాడినమాట తప్పవని నిస్సంశయముగ నెరుగుదును. నే నొక యజ్ఞము చేయ నెంచియున్నాను. దానిని విఘ్నకారులగు మాయావులైన సుబాహు మారీచులను తాటకేయులు రక్తమాంసములు వర్షించి నాశము చేయుదురు.

**శ్లో॥ స్వపుత్రం రాజశార్దూల రామం సత్యపరాక్రమమ్,**
**కాకపక్షధరం శూరం జ్యేష్ఠం మే దాతుమర్హసి.**

రాజతిలకా!కమలముల నాశ్రయించు తుమ్మెదల వంటి ముంగురులు వ్రేలాడు కమలమువంటి ముఖము గలవానిని, నిజమగు పరాక్రమము, శౌర్యము గలవానిని, నీ జ్యేష్ఠకుమారుని రాముని నాకీయందగుదువనెను. ఆతడు బాలుడని రాత్రించరులతో మాయావులతో యుద్ధముచేయ శక్తి హీనుడని భావింపకుము.

**శ్లో॥ అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్ ॥**
**వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః ॥**

రాక్షసు లెంత బలముగలవారైనను ధర్మహీనులును, దురాచారముగల వారు నగుటచే 'రామో విగ్రహవాన్ ధర్మః' అని మూర్తీభవించిన ధర్మమే రాము డగుటచే అత డవలీలగ వారిని సంహరించును. ఇందు నీకెట్టిసందియ మక్కరలేదు.

(ఈ విశ్వామిత్రుని వాక్యము యుక్త మనుటకు దగిన నిదర్శనము గలదు. లంకనుండి తిరిగి వచ్చిన హనుమంతుడు రామచంద్రునితో రాక్షసుల గూర్చి చెప్పుచు, 'అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ రాక్షసానాం గృహే గృహే'– రాక్షసుల యిండ్లలో అగ్నిహోత్రములు, వేదాధ్యయనము కలవనినంతనే యట్టి వారి నెట్లు జయింప సాధ్యమని రామచంద్రుడు సందేహింప. ఇంగితజ్ఞుడగు



హనుమంతుడు వెంటనే, 'దయా సత్యం చ శౌచం చ రాక్షసానాం న విద్యతే'– దయ. సత్యము శౌచము రాక్షసులకు తెలియ వనెను. అప్పుడు రాముడు వారి నిక జయించినట్లే యని సంతోషించెనట! ఇందువలన మంత్రతంత్రములు, జపహోమములు. వేదాధ్యయనములు; అసత్యవాదులను, అశుచి యగు వారిని, దయాహీనులను, నీతి బాహ్యులను రక్షింపవు. తొలుత మేలు గలిగించినను తుదకు వినాశము గలిగించునని విస్పష్ట మగుచున్నది.)

(అహమ్) రాజభోగములను విడిచి,'దేహీ నిత్యమ్' దేహము నాశము గలదని, ఆత్మనాశము లేనిదని, ఆత్మ పరమాత్మసొత్తని, ఆ యాత్మను పరమాత్మ కర్పణము చేయవలెనని, తన్నిమిత్తము వైరాగ్యము పూని ఇంద్రియముల జయించి పెద్ద లనేకుల నాశ్రయించి జ్ఞానము సంపాదించి యోగ మవలంబించి నలుదిక్కుల వేనవేలేండ్లు ఘోరతపము లొనర్చి పుట్టుకచే నేర్పడిన క్షాత్రమును బోగొట్టుకొని, "బ్రహ్మతేజో బలం బలం' అని బ్రహ్మర్షి నై మోక్షకామేష్టి సలిపి నాల్గవ పురుషార్థమే కోరి నా తపఃఫలము నంతయు భగవదర్పణము చేయనెంచి లోకోద్ధారకుడగు నీ కుమారుని యజ్ఞరక్షణార్థము గొనిపోయి నీ వంశమునకే గాక దేవ ఋషి మానవాదు లందరి క్షేమమునకు ఆ మహాత్ముని సర్వవిధముల నుపయోగింప నెంచి వచ్చి నిన్ను యాచించు నట్టి నేను.(ఇక దశరథు డెట్టివాడో తెలుపుటకు నీవు రాజ్యభోగములం దాసక్తిగలిగి అర్థకామములం దెక్కువ మక్కువ గలిగిన వాడవై, కామక్రోధాదులకు జిక్కి సత్యమును, ధర్మమును పూర్ణముగ నెఱుగలేక శ్రీరాముడు కేవలము సామాన్య మానవుడని లేక లేక నీ వొనరించిన వ్రతనియమ యాగ యజ్ఞాదులైన నోములపంట యని అతనిపట్ల కేవలము పామరులట్ల పుత్రప్రీతిని మాత్రమే పాటించువాడవు అతని పరమాత్మతత్త్వము నెంతమాత్ర మెఱుగని వాడవు)

(మహాత్మానమ్) 'వేదాహమేతం పురుషం మహాంతమ్' అను శ్రుతి వాక్యము ననుసరించి అపరిచ్ఛిన్నమైన మహిమగలవాడు. జీవాత్మకు ఆత్మగనుండువాడు, అప్రాకృత దివ్యమంగళ విగ్రహము గలవాడు, సర్వభూతముల కభయమిచ్చువాడు, 'ఏతమ్' అనుటచే సౌలభ్యము గలవాడు, 'పురుషమ్' అనుటచే పరాక్రమము గలవాడు, 'తేజసాం హి న వయస్సమీక్ష్యతే' అన్నట్లు బాల్యమందును సింహపు కొదమవలె నిరతిశయమై భవము గలవాడు అనియు (రామం) ఋషులంద ఱెల్లవేళల నితని ధ్యానించుటచే అట్టి వారిని సైతము రమింప జేయువాడనియు (సత్యపరాక్రమమ్) ఎల్లప్పు డొక్కవిధముగ నుండు పరాక్రమము గలవాడని సత్యవ్రతముచేతనే శత్రువుల జయించువా డనియు,సుఖసుప్తః పరం తపః' తాను సుఖముగ నిద్రించు నపుడును శత్రువులకు భయము గలిగించువాడని, (వసిష్ఠోఽపి) స్వప్రయోజనార్థము వచ్చిన నే నొక్కడనేయిట్లు లేనివి కల్పించి చెప్పుచున్నానని నీకు సందేహము తోచవచ్చును. నీ కులగురువును నీ కత్యంతాప్తుడు నగు వసిష్ఠు నడుగుము. అత డెట్టి వాడందువా? అతడు బ్రహ్మకుమారుడు. యోగసిద్ధి పొందిన మహాజ్ఞాని (మహాతేజాః) బ్రహ్మతేజముతో సూర్యునివలె ప్రకాశించువాడు. ఇంతియ గాక నా కొకప్పుడు విరోధిగ నుండినవాడు. ఎవని నోటితో 'బ్రహ్మర్షి' యని పల్కినగాని నేను సమ్మతింపకుంటినో అట్టి వసిష్ఠుడు. 'సత్యం వద ధర్మం చర' అని నీకు బోధించి తా ననుష్ఠించి నీకు మార్గదర్శియైన వసిష్ఠుని అడుగుము (యే చేమే) 'తస్య ధీరాః పరిజానంతి యోనిమ్' అనునట్లు భగవంతుని యవతారరహస్యముల నెఱింగిన వామదేవాదుల నడుగుము. వారును నీ వారలని. తోచిన, (తపసి స్థితాః) దేహవ్యాపారములు విడచి సదా తప మొనర్చువారల వేర్వేఱుగ నడిగిన వారి మాటలువిని నామాటయొక్క యాథార్థ్యమును కనుంగొని రాముని నా వెంట బంపుము.

గుండె లవియునట్టి మాటలు చెవిని పడినంతనే దశరథుడు సింహాసనము నుండి క్రిందపడి మూర్ఛిల్లి కొంత సేపటికి తెలివితెచ్చుకొని,



**ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః,**
**న యుద్ధయోగ్యతామస్య పశ్యామి సహ రాక్షసైః.**

నా కుమారుడగు రామచంద్రునకు పదునారేండ్లకు తక్కువ. అనగా పండ్రెండవయేడు జరుగుచున్నది. కమలములవంటి నేత్రములు గల బాలుడు సూర్యాస్తమయమునకే నిద్రించువాడు. నిశాచరులతో యుద్ధము చేయ గలవాడు కాడు అనియె. ఈ ఆక్షేపములు వచ్చునని యూహించియే విశ్వామిత్రు డీ ప్రశ్నలకు ముందుగనే యుత్తరము లిచ్చినా డనవచ్చును. 'కాకపక్షధరమ్' అనినపుడే రాముని వయస్సు, బాల్యావస్థ నాకు తెలియనిది కాదనినట్లే. 'శూరమ్','సత్యపరాక్రమమ్' అనుటచే రాక్షసులతో యుద్ధము చేయునట్టి శక్తిసంపన్నుడేయని చెప్పినట్లగును. 'మహాత్మానం' అనుటచే 'అవజానంతి' మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్. విభవమున మానవావతారమెత్తిన భగవంతుని మహిమను సామాన్యు లెఱుగలేరన్నట్లు రాముని నీ పుత్రుడని నీ వెఱుంగుదువు గాని యతని యవతారరహస్యము, మహిమ,పరాక్రమము నీ వెఱుగ వనియు, 'అహం వేద్మి యనియు', వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః' అని కేవలము తపో నిష్ఠగలవారు మాత్రమే యతని నిజవైభవము నెఱుంగుదురని చెప్పెను. విశ్వామిత్రుడు తనతో నుండు రామచంద్రు దగ్నిచే చుట్టబడి రక్షింపబడు అమృతము వలె సురక్షితు డగునని యెంత చెప్పినను వినక దశరథుడు రావణుని, అతని యనుచరులగు సుబాహు మారీచుల మాయోపా యములను. బలపరాక్రమముల వివరించి,

**కథమప్యమరప్రఖ్యం సంగ్రామాణామకోవిదమ్,**
**బాలం మే తనయం బ్రహ్మన్ నైవ దాస్యామి పుత్రకమ్.**

ఓ బ్రాహ్మణుడా! దేవతలవలె చూపట్టుచు యుద్ధానుభవలేశ మేనియు లేని బాలుడైన నా కుమారుని నే నియ్యంజాల ననియె.

అంత ఎండు కట్టెలతో మండుచుండు అగ్నిలో ఆజ్యాహుతి జేసినట్లు పట్టరాని కోపముతో విశ్వామిత్రుడు దశరథుని వంక దిరిగి.

**యదీదం తే క్షమం రాజన్ గమిష్యామి యథాగతమ్,**
**మిథ్యాప్రతిజ్ఞః కాకుత్థ్స! సుఖీ భవ సబాంధవః.**

ఇట్లాడిన మాట తప్పుట నీకు న్యాయ మగునేని నేను వచ్చిన త్రోవను బోయెదను. కకుత్‌స్థవంశమున బుట్టినవాడా! ప్రతిజ్ఞాభంగము చేసికొని నీ బంధువులతో సుఖముగ నుండుము అనెను.

విశ్వామిత్రుని కోపమునకు భూమి గడగడ వణకెను. అంత వసిష్ఠుడు లేచి "రాజా! నీ విక్ష్వాకువంశమునబుట్టిన వాడవు. ప్రత్యక్షమైన ధర్మదేవతవు. ధైర్యముగలవాడవు. వ్రత నియమాదులు పాటించువాడవు. శ్రీమంతుడవు. 'న ధర్మం హాతు మర్హసి' ధర్మమును త్యజించుట నీకు దగదు. నీవు ధర్మాత్ముడ వని ముల్లోకము లెఱుగును. 'స్వధర్మం ప్రతిపద్యస్వ' నీవు నీ ధర్మము ననుష్ఠింపుము. 'నాధర్మం వోఢుమర్హసి'- ధర్మము తప్పకుము, (ఇచ్చుట గీతాచార్యు డర్జునునకు జేసిన యుపదేశవాక్యములు స్మరింప నగును). (1.'నియతం కురుకర్మ త్వం' నీవు నీకు నియమితమగు కర్మను చేయుము. 2.'స్వధర్మే నిధనం శ్రేయః' తన ధర్మము నిర్వహించుటలోనే మేలు గలుగును. 3.'పరధర్మో భయావహః' నీతండ్రి తాత లనుష్ఠించిన ధర్మము తప్పి యితర ధర్మ మనుష్ఠించుట భయమునకు గారణ మగును)' ఇచ్చట మనువు. ఇక్ష్వాకు మున్నగువా రనుష్ఠించిన సత్యవ్రతమును అనుష్ఠించి నీ వంశగౌరవమును పాటించి మేలు పొందుము. రాఘవా! మాటయిచ్చి తప్పుటవలన అశ్వమేధాది యజ్ఞముల ఫలమును, వాపీకూపతటాకాది నిర్మాణకృత్యముల ఫలమును, అన్నదానము, ఆరామ నిర్మాణమాదిగా గల సకల సత్కర్మముల ఫలము లన్నియు నశించును. రామున కస్త్రశస్త్రము లుపయోగింప దెలియదని విచారింపకుము. అమృత మెట్లగ్నిచక్రముచే రక్షింపబడునో యట్లు కౌశికుని వశమున నున్న రాముని కెట్టి సంకటము గలుగనేరదు. ఈ ప్రపంచములో ని మ్మహర్షి మూర్తీభవించిన ధర్మ మనియు, వీర్యవంతులలో నిత డగ్రగణ్యు డనియు. బుద్ధిమంతులలో నితడే మిన్న యనియు, తపస్సునకు స్థాన మితడే యనియు, ఇతనికి దెలియని విద్యగాని అస్త్రములుగాని ముల్లోకములలో నెవ్వనికి దెలియవని దృఢముగ నమ్ముము. ఇతడు స్వప్రయోజనార్థము రాలేదు. నీ కుమారునకు సాటిలేని శుభము లనేకము లొనగూర్ప వచ్చి నీ కుమారుని తనతో బంపు మనెను.



దశరథుడును శిరము మూర్కొని కౌగిలించి దీవించి మునివెంట రాముని పొమ్మనినంతనే లక్ష్మణుడును అన్న వెంట బయలు దేరెను.

## ఉపదేశములు

విశ్వామిత్రుడు ముందు నడువ ధనుర్బాణతూణీరద్వయముతో రామ చంద్రు డేగ నట్లే యన్నయడుగుజాడలం బడి లక్ష్మణుడు పయనమయ్యెను. ఇట్లు శుభసూచకములతో వా రొకటిన్నరయామడల దూరము నడచి సరయూనది దక్షిణతీరము జేరిరి. మహర్షి మృదుమధురముగ'రామచంద్రా: సంధ్యాకాలము రాకమునుపే నే నుపదేశించు 'బల', 'అతిబల' యను మంత్రముల గ్రహింపుము. దీనిని పఠించుటచే నీ కాకలిదప్పులుండవు. మార్గాయాసము గలుగదు. నీ దేహ కాంతి మారదు. నీవు నిద్రించునపుడుగాని యేమరుపాటున నుండినపుడుగాని రాక్షసులు నీకెట్టి కీడు చేయ జాలరు. బాహుబలమునను, బుద్ధి బలమునను నీకెవ్వ రీడు గానేరరు. నీకు ముల్లోకముల నిండునంత కీర్తి కలుగును. ఇవి బ్రహ్మచే నిర్మింపబడినవి. జ్ఞానము లన్నిటికి నివియె మూలకందమన నొప్పును అని నంతనే రామచంద్రుడు లక్ష్మణ సహితుడై శుచియై యాచమించి మునికి మ్రొక్కి

యంజలి గీలించి యుండగా కౌశికుడా మంత్రంబుల నత్యాదరముతో సుపదేశించెను. ఆ రాత్రి మెత్తని గడ్డిపఱపుపై విశ్వామిత్రుని ప్రక్క అతని బుజ్జగింపుల వినుచు నతనికి పరిచర్యలు సలిపి వారు సుఖముగ నిద్రించిరి.

## శ్రీరామ సుప్రభాతము

మరునా దరుణోదయకాలమున విశ్వామిత్రుడు నిద్రించుచుండు రామలక్ష్మణుల జూచి విభవమున, నేకాంతమున భగవదనుభవము ప్రాప్తించె నని సంతోషించుచు వారిని మేలుకొలుప నెంచి వారిని నిద్రించునపుడు నయనానందముగ తనివి దీర జూచి వారి తేజస్సున కబ్బుర మొంది వారు మేల్కొనినంతనే చూచి యానందింపదలచి యిట్టి పుణ్యమూర్తిని రామునిగన్న కౌసల్య సుకృత మెట్టిదోయని మైమఱచి మృదుమధురముగ.

**కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే,**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.**

రామా।‘పుంసాం మోహనరూపాయ’ అన్నట్లు పురుషులనేని మోహింపజేయు సౌందర్యలావణ్యములు గల నిన్ను గన్న కౌసల్య సుప్రజయైనది. ‘కౌసల్యా శుశుభే తేన పుత్రేణామితతేజసా’–తేజోరాశివగు నిన్నుగని కౌసల్య గొప్ప కాంతిగలదయ్యెగదా! నీవంటి సుగుణనిధిని గన్న నీతల్లి సుప్రజయని సుప్రసిద్ధి పొందినది. ‘దాశరథే’ యనరాదా? ‘రాఘవా’ యనరాదా? యనిన దశరథునకు నలుగురు పుత్రు లగుటచే వారిలో నెవ్వరని తెలియుట కొఱకో, పట్టమహిషికి దగినట్టి సర్వశ్రేష్ఠుడని తెలుపుటకో, తన రాకచే జన్మము తరించినట్లును, వేడినదానిని తప్పకిత్తునని చెప్పి‘న రామం నేతు మర్హసి’– రాముని నీవు తోడ్కొనిపోవం దగదనియు, ‘నైవదాస్యా మి పుత్రకమ్’ నీకు నాకుమారునియ్యం జాల ననియు చెప్పి కేవలము పుత్రప్రేమనుమాత్రము పాటించి రాముని పరత్వము నణుమాత్ర



మెఱుగజాలని దశరథుని పుత్రుడని చెప్పుట కిష్టపడక పుత్రుని పంపుమనిన తోడనే నిండుమనస్సుతో రక్షాబంధముచేసి రాముని కత్యంత శుభంబు లొడగూడు నని నిశ్శంకతో రాముని తన వెంట బంపిన కైసల్యను బొగడుచు రాముని మేలుకొలుపుట సర్వవిధముల నొప్పియున్నది. వేదము సైతము ‘మాతృదేవో భవ’ ‘పితృదేవో భవ’ అనుటచే అగ్రస్థానము తల్లికియ్య బడియుండుటచేతను ‘పితు శ్శతగుణం మాత’ యని తండ్రికంటె తల్లి నూఱింతలు హెచ్చని స్మృతివాక్య ముండుటచేతను‘మాతా పుత్రస్య భూయాంసి కర్మణ్యారభత’ యన్నట్లు పుత్రునకు సమస్తకార్యములు చేయుట కారంభించునది తల్లియే గనుకను ‘కౌసల్యాసుప్రజా రామ’ యనుట సర్వవిధముల శ్లాఘ్యమైనది.

‘పూర్వా సంధ్యా ప్రవర్తతే’– లోకబాంధవు డనబడు సూర్యుడుదయిం చుటచే తూర్పుదిక్కున కెంత గౌరవము గలిగెనో యట్లే నీ యవతారముచే నీ తల్లి కట్టి గౌరవము గలిగెను. రాత్రి యంతయు చీకట్లు క్రమ్మి చోరులు రాక్షసులు లోకమున కుపద్రవములు గలిగించుచుండగా సూర్యోదయము కాగా వారెల్లమూలలకు ఎట్లు పరుగెత్తుదురో యట్లే నీయవతారమునకు పూర్వము దేహబల వరబలగర్వముచే విఱ్ఱవీగుచు సాధువుల హింసించుచుండినవా రిక రూపుమాసి పోవుదురు. సూర్యునిగన్న పూర్వదిక్కెట్లు వాసిగాంచెనో యట్లే నీ గుణాతిశయములచే నీతల్లి కానందము వర్ధిల్లి నీవు ‘కౌసల్యానందవర్ధను డగుదువు’.

గాఢాంధకారమగు రాత్రి యంతరించి సూర్యోదయము కానుండుట జూడ లోకము నావరించియున్న తమోగుణము, అజ్ఞానము నీవు మేల్కొనుటచే నంతమొంది నీ సాత్త్వికగుణమే సర్వత్రనిండి జ్ఞానోదయము గలిగించి లోకకల్యాణము చేకూర్చుననితెలియుచున్నది. సూర్యుడెట్లు

మందేహాది రాక్షసుల నిరసింపనున్నాడో నీవు నట్లే దేవ ఋషివర్గమున కపకార మొనర్చు రాక్షసుల నాశ మొందింతువని లోక మెదురుచూచు చున్నది.

**అద్య మే సఫలం జన్మ సుప్రభాతా చ మే నిశా,**
**యదున్నిద్రాబ్జపత్రాక్షం విష్ణోర్ద్రక్ష్యామ్యహం ముఖమ్.**

వికసించిన కమలమువంటి ముఖముగల విష్ణువును సందర్శించు భాగ్య మెంతోకాలమున కిప్పుడు తటస్థించినందున ఇప్పుడు నా జన్మము సఫలమైనది. నా రాత్రియు తెల్లవాఱినది. నిద్రించునపుడు నీ ముఖారవిందలక్ష్మిని సేవించితిని. ఇక నీవు మేల్కొనునపుడు నీ సౌందర్యలక్ష్మిని సేవింప గోరుచున్నాను.ఏకాంతమున క్షణక్షణమును నీ సేవ లన్నిటిని దర్శింపనెంచికదా నిన్ను వెంటగొని వచ్చితిని.నీవు లోకారాధ్యుడవు.'నిమేషసే భవేద్రాత్రిరున్మేషస్తే భవేద్దివా' నీవు కనుమూసిన రాత్రియు, నీవు కన్ను తెఱచిన పగలు నగును గదా!

('ఉత్తిష్ఠనరశార్దూల')పెద్దపులి నిద్రించునపుడు కుందేలు, జింక మొదలగు క్షుద్రజంతువులు విచ్చలవిడిగా సంచరించుటయును, పులి లేచినంతనే యా జంతువులు మూల కొక్కటి చొప్పున పరుగిడు నటులే నీవు నిద్రించుచున్నావని తలచి రాక్షసులు విచ్చలవిడిగా సంచరింతురు. నీవు మేల్కొనినంతనే వారు పలాయన మగుదురు. ఓ పురుషశ్రేష్ఠా! క్షీరసముద్ర మున శేషశాయివై యోగనిద్రయం దుండిన నీవు ధర్మసంస్థాపనార్థము, 'ఆత్మానం మానుషం మన్యే' యని మానవభావము వహించియున్నందున మానవధర్మమును పాటించి బ్రాహ్మ ముహూర్తమున మేల్కొనవలెనని ప్రార్థించు చున్నాను.'యద్యదాచరతిశ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః- ఉత్తముడెట్లు చేయునో తక్కినవారట్లే చేయుదురు. కనుక సకలధర్మములననుష్ఠించి లోకమునకు మార్గదర్శియగు నీవు ఉషఃకాల కృత్యముల నిర్వహింపలెమ్ము, ఆశ్రితరక్షణమే స్వధర్మ మగుటచే నీకు దీర్ఘకాలము నిద్రింప నవకాశ మెక్కడిది? కనుక రామచంద్రా! లెమ్ము.



'కర్తవ్యం దైవమాహ్నికమ్'- దేవునిచే విహితమైన నిత్యకర్మమునుజేయ వలయును.సకాలమున సంధ్యావందనము చేయవలెను. ఆహ్నికంబు లనగా పగలు చేయవలసిన కర్మలు దేవతర్పణము, ఋషితర్పణముమొద లగునవి. ఏ కర్మవలనను నీకు గావలసిన దేదియు లేకున్నను లోకసంగ్రహార్థము నీవు చేయవలెనని భావము.అటుగాక పరమపురుషా! నిన్ను పూజింప నెంచిన నా పూజలు నీవు మేల్కొని గైకొనుము. నీపరోక్షమున సాత్త్వికత్యాగముచేసి నీకర్పణము చేయుచుండిన నిత్యకర్మలను ప్రత్యక్షమున నీకర్పించి కృతకృత్యుడ నయ్యెదను. కనుక మేలుకొనుము అని విశ్వామిత్రుడు శ్రీ రాముని మేల్కొలిపిన నీ సుప్రభాతమునే శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమున దొలుత సుచ్చరించుట వాడుకలోనున్నది.

## స్త్రీవధ

ఇట్లు విశ్వామిత్రుడు సౌమ్య సంవత్సర మాఘబహుళద్వితీయ రామలక్ష్మణులను యజ్ఞరక్షణార్థము వెంటబెట్టుకొని పోయి ఆ రాత్రి సరయూతీరమున నిద్రించి మఱునా డుదయమున సుప్రభాతము చెప్పి వారల మేల్కొలిపి ప్రాతఃకాలకృత్యము లొనర్చి బహుళ తృతీయ గంగాసరయూ సంగమస్థలమున గడపి చతుర్థినాడు తాటకావనము ప్రవేశించెను. మహర్షి రామచంద్రున కాప్రదేశమును నిర్జనముగ జేసిన తాటకవృత్తాంతమును జెప్పి దానిని వధింప నియమించెను. రాముడు తొలుత స్త్రీవధ చేయుట పాడియగునా యని సందేహించుట గని విశ్వామిత్రుడు-

**న హితే స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ,**
**చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా.**

పురుషోత్తమా। సామాన్యధర్మము ననుసరించి స్త్రీవధ మహాపాతకము అనుట నిజమే,కాని కంటకురాలగు ఈ రక్కసిచేయు వినాశ మింతింతయని చెప్ప సలవిగాదు. నాలుగుజాతులవారిని రక్షించు నిమిత్త మిట్టి కట్టిడిని చంపుటయే రాజధర్మము.

**నృశంసమనృశంసం వా ప్రజారక్షణకారణాత్,**
**పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సతామ్,**
**రాజ్యభారనియుక్తానా మేష ధర్మస్సనాతనః.**

క్రూరకార్య మైనను, క్రూరముకాని కార్యమైనను, పాపకార్యమే యైనను, గొప్ప అపవాదము గలిగించు కార్యమైనను ప్రజల రక్షించుమిత్తము రాజు చేయ వలసినవిధ్యుక్త ధర్మము. ప్రభుత్వము చేయు వారికిది పురాతనమైన ధర్మము.

ఇచ్చట తాతలను, తండ్రులను గురువులను, అన్నదమ్ములను, బంధు మిత్రాదులను చంపుట మహాపాతక మనియు, నట్టి వారిని చంపుటకంటె భిక్షమెత్తి యైనను బ్రదుకనెంచెద ననిన అర్జునునకు కృష్ణుడు–

**స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి,**
**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే.**

పశువధ పాతకమే యగును గాని యాగమున పశువధ ధర్మమగును గదా! ఇట్టి ధర్మయుద్ధముకంటె క్షత్రియునకు శ్రేయస్కరమగునది వేరేదియు లేదు.

**యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్,**
**సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్.**



అప్రయత్నముగ లభించినదియు, తెఱవబడిన స్వర్గద్వారమువంటి డియునగు ఇట్టి ధర్మయుద్ధము పుణ్యముచేసిన క్షత్రియులకే లభించును అని చెప్పుట స్మరింప నగును. కేవల మధర్మమే చేయువారు స్త్రీలైనను చంపవచ్చును. ఇది నే చెప్పునది కాదు. ఇట్టి ధర్మ సందేహము గలిగినపుడు శిష్టాచారమున్నదా?

ఇంతకు మున్నెవరైన నిట్లు చేసి యున్నారా యని విమర్శింపనగును. పూర్వము ప్రపంచమునెల్ల పాడుచేయ బూనిస మంథరయను దానిని విరోచనుని కూతును ఇంద్రుడు చంపినది వినియున్నాము. తొల్లి భృగుపత్నియగు శుక్రుని తల్లి లోకమున నింద్రుడు లేకుండ జేయుదునని ఘోరకృత్యమున కొడిగట్టగా దానిని విష్ణువు చంపె ననుట లోకమెఱుగును. ఇంక ననేకులు మహాత్ములచే అధర్మపరాయణలగు స్త్రీలు వధింపబడిరి అని ధర్మసందేహము తీఱిన వెంటనే రామచంద్రుడు తాటకను వధించి యింద్రాదిదేవతల యొక్కయు, ఋషుల యొక్కయు మన్ననల బడసెను. దేవతలు ప్రార్థింప విశ్వామిత్రుడు రామచంద్రునకు సకలాస్త్రముల నుపదేశించి అనగా నస్త్రమంత్రముల నుపదేశించగా నా యస్త్రదేవతలు తేజోమయశరీరులై వచ్చి రామునకు మ్రొక్కి రాము ననుమతంబున నెప్పుడేని రామునాజ్ఞ పాటింతుమని వాక్రుచ్చి యతని కంజలి గీలించి యంతర్ధాన మయిరి. మఱల రాముని ప్రార్థన నంగీకరించి విశ్వామిత్రు డతని కుపసంహార మంత్రముల నుపదేశించెను. ఆ మంత్ర దేవతలును ప్రత్యక్షమై స్మరించిన మాత్రమున దాముసేవ చేతుమని వాక్రుచ్చి రామునకు నమస్కరించి వెడలిరి.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో సిద్ధాశ్రమము చేరి వారిం జూచి 'నేడు పంచమి. నేడు మొదలాఱహోరాత్రములు యజ్ఞము చేయుదును. మీరతి జాగరూకతతో యజ్ఞము కాపాడవలె'నని యాజ్ఞాపించి దీక్షవహించె. అట్లే రామలక్ష్మణులు పంచమి మొదలు దశమిపర్యంతము యజ్ఞము రక్షించి

సిద్ధాశ్రమవాసులగు మునులచే పొగడ్తనంది విశ్వామిత్రుని మెప్పు పొంది గురుకులవాసమున పొందిన అస్త్రశస్త్రముల నాచార్యుని జన్నము గాచుటయందే ప్రథమముగ నుపయోగించి ఆచార్యశుశ్రూషలు సలిపి, గురుం ప్రకాశయేద్ధీమాన్' అను న్యాయము ననుసరించి గురువునకు మించిన శిష్యులని వాసిగాంచిరి. సిద్ధాశ్రమ మందలి ఋషులతో విశ్వామిత్రుడు రామలక్ష్మణులం దోడ్కొని మిథిలకు బోవుచు మార్గమున తన వంశచరిత్రమును, గంగాప్రభావమును సగర చక్రవర్తి వృత్తాంతమును, సగరపుత్రుల నుద్ధరింప భగీరథుడు గావించిన మహా ప్రయత్నమును వర్ణించెను. గౌతమాశ్రమమున విశ్వామిత్రుని ప్రేరణమున రాము డహల్యకు శాప విముక్తి నొసగి యామెను బూజించుటయు, నామె రామలక్ష్మణుల బూజించుటయు, మిథిలలో శతానందుడు తన తల్లి శాపవిముక్తికి సంతోషించి ఆచార్య వైభవ మిట్టిదని విశ్వామిత్ర చరిత్రములు రామలక్ష్మణులకు జెప్పి తన కృతజ్ఞతను జూపుటయు, గురుకులవాస సాఫల్యము చాటుచున్నవి.

ఆచార్యస్థానము వహించి, విశ్వామిత్రుడు విశ్వమునకు మిత్రుడైన విధము నొకపరి సింహావలోకనముచేసి చూతము. క్షత్రియుడై పుట్టి వసిష్ఠుని బ్రహ్మ తేజోబలమును గని పూనికతో నలుదెసల వేలకొలది వత్సరములు తపం బొనర్చి బ్రహ్మర్షి యగుట యొకటి. కేవలము రాజసగుణప్రధానుడు సైతము సాత్త్విక గుణముచే బ్రహ్మర్షి యగుటయు సాధ్యమని లోకమున కెఱిగించుట గొప్ప విషయము. అట్టి బ్రహ్మర్షిత్వము పొందినను విభవమున భగవంతున కాచార్యత్వము వహించు నెపమున తన సకల విద్యల నతని కర్పణముచేసి దుష్ట శిక్షణము శిష్ట రక్షణము భగవంతుని యవతార కృత్యము లని యెఱింగి తాటకవధ రామునిచే చేయించుటయు శిష్టరక్ష ణమున కహల్యాశాపవిమోచన మతనివలన గావించుటయు లోకక్షేమార్థమే



యగును. ద్రవిడదేశమున సుప్రసిద్ధుడగు కంబరను మహాకవి రాముని జూచి విశ్వామిత్రుడు చెప్పినట్లీరీతి వ్రాసియున్నాడు. 'ఉన్ కైవణ్ణ మంగు కండేన్ కాల్వణ్ణమింగు కండేన్' అనగా రామచంద్రా! లోకములో నందరు చేతితో ననుగ్రహము చేయుటయు, పాదముతో నిగ్రహము చూపుటయు గలదు. నీ వందుకు వ్యతిరిక్తముగ ననుష్ఠించితివి. చేతితో తాటకను వధించి లోకహితము గోరి యా రక్కసిపట్ల నిగ్రహము చూపితివి. పాదముతో గౌతమాశ్రమమున శాపముచే భస్మశాయినియై రూపుగోల్పోయిన యహల్యకు శాపవిముక్తి గల్పించి యామె పూర్వరూపమును పొంది నిర్దోషియై మఱల గౌతముని గూడియుండున ట్లనుగ్రహించితివి. నీయసదృశమగు మహిమ నెవరు వర్ణింపగలరు? దశరథుడు తన కుమారుల వివాహ విషయమై యాలోచించు తఱి యచ్చటి కేతెంచి యజ్ఞరక్షణ నెపంబున రాముని దోడ్కొనిపోవుట జూడ రామచంద్రునకు విద్యాపూర్తి కాలేదని యట్లుకాకమునుపు వివాహము చేయదగదని చెప్పినట్లున్నది. రాబోవు వనవాసమునకు, రావణాదుల సంహారమునకు, ఋషుల సంరక్షణమునకు గావలసిన క్రమశిక్షణ యొసగదలచి తాను రామునివెంట గొనిపోయెననియు చెప్పనగును. రాముని యసాధారణ బలపరాక్రమములు, ధైర్యము, బుద్ధిసూక్ష్మత, భూతదయ, ఆచార్యభక్తి, మునిజన సేవ మున్నగు సుగుణముల జాట శివధనుర్భంగము గావించి వీర్యశుల్కముచే రాముడు సీతాదేవిని వివాహ మాడునట్లును ప్రస్తావవశమున భరత లక్ష్మణ శత్రుఘ్నులకుగూడ వివాహము చేయించుట మున్నగు విషయములం జూడ రావణాదుల వధచే లోకము నిష్కంటక మగుటకును, దేవఋషి మానవసమూహము సుఖము పొంది లోకమున ధర్మము సుస్థిరముగ నెలకొల్పుట మున్నగు కృత్యములకు దోడ్పడి విశ్వామిత్రుడు రామునకు గురుకులవాసము చేయించి లోకమునకు మిత్రుడయ్యెనని చెప్పనొప్పును.

## 5. శ్రీ సీతాకల్యాణము

లోకములో పురుషునకు గాని, స్త్రీకి గాని తల్లిదండ్రులు యుక్తమగు సంబంధము కుదిర్చి వివాహము చేయించుట వాడుక. సీతారాముల కల్యాణమట్లు జరుగలేదు. యాగసంరక్షణార్థము శ్రీరాముని వెంట గొనిపోయిన విశ్వామిత్రుడు రామునిచే తాటకాసుబాహువుల వధ గావించి యజ్ఞసం రక్షణము చేయించుకొని అహల్యాదేవికి శాపవిముక్తిని గలిగించి మిథిలలో జనకునివద్ద నిత్యపూజలోనున్న శివధనుర్భంగము చేయించి గురుకులవాసాంతమున శిష్యునికీర్తి ప్రతాపములు లోకమున వ్యాపింపజేసి లోకకల్యాణమునకు పునాది వేయించినట్లు శ్రీ సీతారాముల వివాహమునకు మూలకారణు డయ్యె. ఇందులోననేక ధర్మసూక్ష్మము లిమిడియున్నవి. 'కన్యాపితృత్వం ఖలు దుఃఖభాజనమ్' అని యుక్త వయస్సు వచ్చిన కన్యయొక్క తండ్రిమనసు పొందు దుఃఖ మిట్టిదని చెప్పతరముగాదు. సామాన్యునకే యిట్లుండ, అయోనిజయగు సీతకు దగిన వరుడు కుల శీల వృత్తములలో మాత్రమేగాక బలపరాక్రమములందునను సమానుడుగ నుందవలెను గదా! ధనుర్భంగమయిన వెంటనే జనకుడు విశ్వామిత్రుని జూచి–

**భగవన్ దృష్టవీర్యో మే రామో దశరథత్మాజః,**
**అత్యద్భుతమచింత్యం చ న తర్కితమిదం మయా.**

మునిపుంగవా! దశరథ పుత్రుడగు రామచంద్రుని వీర్యమిట్టిదని చెవులార వినియుంటిని. ఇప్పు డిచ్చట నా కన్నులార జూచితిని. ఇది యాశ్చర్యము, అసాధ్యము. మనసున నూహింపను వీలుకానిది.

**జనకానాం కులే కీర్తిమాహరిష్యతి మే సుతా,**
**సీతా భర్తారమాసాద్య రామం దశరథాత్మజమ్.**

దశరథాత్మజుడగు శ్రీరాముని భర్తగా బడసి నా కూతురగు సీతాదేవి మా జనకవంశమునకే(21 తరముల వారికి) గొప్ప కీర్తిని తెచ్చుచున్నది.



"కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః" అనగా జనకవంశపు వారు కర్మనిష్ఠులని సుప్రసిద్ధము గదా!

**అనంతం బత మే విత్తం యస్య మే నాస్తి కించన,**
**మిథిలాయాం ప్రదీప్తాయాం న మే కించిత్ప్రదహ్యతే.**

నాకు విశేషధనమున్నది. కాని దానిలో 'నాది' యనదగిన దేదియులేదు. అట్లే మిథిల కాలుచున్నను దానిలో నాదేదియు గాలలేదు. (అనగా ఆత్మ నాశ రహితమైనది. అదియే నేను. నాదియనున దదియే. ఆత్మజ్ఞానము గలవానికి దేనివలనను నష్టమనుమాట లేదు. (మే సుతా) అనుటచే నా సంబంధము వలన నామె కన్ని విషయములు తెలియును. (సీతా) లోకములోని కన్యలవంటిదా? కాదు, మానవగర్భమునందు జనింపక నాగలి చాలున లభించినందున భూపుత్రి యనుటయు దేవతా సంబంధము గలది యనుట. (దశరథాత్మజమ్) దశరథుని కుమారు డనుటచే 'కన్యా వరయతే రూపం, మాతా విత్తం, పితా శ్రుతమ్, బాంధవాశ్శీలమిచ్ఛంతి, సూపాన్నమిత రే జనా' జనకుడు కోరినట్లు గొప్ప కులశీలములు విద్యాప్రావీణ్యము గలవా డనియు, (రామమ్) రాముని అనగా ''రమయతీతి రామః' రూపసౌందర్యాదులచే రమింపజేయువాడగుట 'కన్యా వరయతే రూపమ్' అని సీతాదేవి కత్యంత మనోహరు డనియు,(భర్తారమ్) అనుటచే సకల విధైశ్వర్యములచే పరిపూర్ణుడై సర్వ విధముల భరింప శక్తి సంపన్ను డనుటయు. ''విత్తమిచ్ఛంతి మాతరః''అనితల్లి కోరిక నెరవేర్చిన వాడనుటయు, నట్టి సర్వ శుభలక్షణ లక్షితు డగు రాముని (ఆసాద్య) భర్తగా పొంది (జనకానాం) కర్మజ్ఞానానుష్ఠానపరులైన మావంశీయులగు జనకుల (కులే) కులమునందు (కీర్తిం) 'కులంతారయతే తాత సప్తసప్త చ సప్తచ'అను ప్రమాణము చొప్పున నిరువది యొక్క తరములవారిని తరింపజేసి శాశ్వతకీర్తిని తెచ్చినది.

**మమ సత్యప్రతిజ్ఞా చ వీర్యశుల్కేతి కౌశిక,**
**సీతా ప్రాణైర్బహుమతా దేయా రామాయ మే సుతా.**

సీత వీర్యశుల్కయని, నేను చేసిన ప్రతిజ్ఞ సఫలమయ్యెను. నాప్రాణముకంటె నాకు ప్రియమగు భూజాతను సకలసద్గుణోపేతుడగు రామచంద్రునకిచ్చెదను. ఇచ్చట నొక్క విషయ మూహించినను తప్పుకాదని చెప్పవచ్చును. జనకు డప్పుడే ఉదకధారాపూర్వకముగ సీతను రామునకియ్య నుద్యుక్తుడయ్యెనేమో యని యింగితజ్ఞుడగు రామచంద్రుడు కనుంగొని జనకునితో, “నాతండ్రి గుర్వాజ్ఞ పాటింపుమని యనుజ్ఞ యొసగెను. అందుచే మహర్షి ‘వత్స రామ ధనుః పశ్య’ అనినంతనె ధనువును జూచితిని. మీ యాజ్ఞయగునేని దానినిచేత ముట్టెద, దానినెత్తి కదల్చెద. అంతియగాదు. మీ సెలవుగొని మోపెట్టుటకు యత్నించెద నంటిని, రాజును, మునియు నట్లే కానిమ్మనిరి. ఎక్కువెట్టి నారిం గూర్చి లాగినంతనె యది విఱిగెను. ఇంతవఱకు గుర్వాజ్ఞ పాటించితిని. వివాహవిషయము తండ్రియిష్టము. అత డంగీకరించి చేయించిన చేసికొందును. *ఆయన మెచ్చి యెవతెను వివాహము చేయునో యట్టి ధర్మపత్ని సంగీకరించి వివాహమాడి యామెయందు గాఢ ప్రేమగలిగి యుందును” అని చెప్పగా విశ్వామిత్రుడు రాముని ధర్మమార్గము నభినందించి జనకునితో చెప్ప నా రాజు వెంటనే మంత్రులమూలమున పెండ్లిపత్రికల నిచ్చి జరిగిన విషయము లన్నిటిని తానే స్వయముగ చెప్పినట్లు దశరథునకు దెలిపి నంతనె శీఘ్రముగ వసిష్ఠాదులతో సపరివారముగ దశరథుడు మిథిలకు వివాహసన్నాహములతో వచ్చెను.

---

* ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి।
గుణాద్రూపగుణాచ్చాపి ప్రీతిర్భూయోఽ భ్యవర్ధత॥(అయో. 77స.శ్లో. 26)
తండ్రిగూర్చిన యిల్లా లగుటచే సీత రామున కత్యంత ప్రియురాలై నది. ఇంతేగాక ఆమె రూపగుణాభిజాత్యములు ఇందుకు కారణములైనవి.



**దిష్ట్యా ప్రాప్తో మహాతేజా వసిష్ఠో భగవానృషిః,**
**సహ సర్వైర్ద్విజశ్రేష్ఠై ర్దేవైరివ శతక్రతుః.**

దేవతలతో గూడిన ఇంద్రునివలె నుండువాడును, గొప్ప తేజస్సు గల పూజ్యుడగు వసిష్ఠమహర్షి అనేకబ్రాహ్మణోత్తముల గూడి నా యదృష్టవశమున నిచటికి వచ్చియున్నాడు అనుటచే మహాత్ముల రాకవలన జనకునకు గల సంతోష మిట్టిదని తెలియుచున్నది.

**దిష్ట్యా మే నిర్జితా విఘ్నా దిష్ట్యా మే పూజితం కులమ్,**
**రాఘవైస్సహ సంబంధా ద్వీర్యశ్రేష్ఠైర్మహాత్మభిః.**

నా భాగ్యవశమున కన్యాప్రదాన ప్రతిబంధకములు తొలగినవి. పరాక్రమముచే గొప్పవారును. మహాత్ములు నగు రఘువంశీయులతో సంబంధము చేయుటచే నా కులము గౌరవము పొందెను. ఇందుచే జనకునకు అనిష్టనివృత్తియు. ఇష్టప్రాప్తియు, గొప్పవంశముతో సంబంధము వలన తనకేగాక తన కులమునకే చాల గౌరవము గలిగినదను సంతోషము స్పష్ట మగుచున్నది. వియ్యమందవలసిన విధాన మిందు వివరింపబడుచున్నది.

**కులం ధన్యమిదం మన్యే యేషాం నో మునిపుంగవౌ,**
**సదృశం కులసంబంధం యదాజ్ఞాపయతస్స్వయమ్.**

మునిశ్రేష్ఠులగు (బ్రహ్మర్షులగు) వసిష్ఠ విశ్వామిత్రు లాజ్ఞాపించుటచే మా కనురూపమగు ఇక్ష్వాకువంశముతో సంబంధము మా కులమునకు పరమపవిత్రత గల్పించినది. వియ్యంకు లొప్పుట మాత్రమే గాక శ్రేష్ఠు లంగీకరించుటయు వివాహ విషయమున గమనింపదగినదని తెలియుచున్నది.

వివాహ మండపమున వసిష్ఠులవారు జనకమహారాజును జూచి కన్యా దానము చేయవలసిన మహూర్తము వచ్చినదని చెప్పినంతనే మహాధార్మి కుడగు జనకుడు–

**కః స్థితః ప్రతిహారో మే కస్యాజ్ఞా సంప్రతీక్షతే**
**స్వగృహే కో విచారోఽస్తి యథా రాజ్యమిదం తవ.**

"మహాత్మా! మీరింకను త్వరితముగ వచ్చియుండవచ్చునే. మిమ్మాటంక పఱచువా రెవరు? ఎవరి యాజ్ఞను మీ రెదురుచూడవలెను? మీ రాజ్యము మీ కెటులో నా రాజ్యమును మీకట్టిదే యగును. ఇట్లుండ నాయిల్లు మీయిల్లు గనుక మీరెవరి నేమని యడుగవలెను? మీ యిష్టానుసారము ఋషులగూడి కార్యములు చేయు" డని సర్వవస్త్రాభరణాలంకృతయగు సీతాదేవిని అగ్నిముందర రాముని కెదురుగా నిలిపి వసిష్ఠుదు హోమముచేసిన వెంటనే రామునిజూచి–

**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ,**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా.**

నా కూతురైన యీ సీతాదేవి నీకు సహధర్మచారిణి యగును. ఆమెను పరిగ్రహింవుము. నీకు మంగళం బగు. ఆమె చేతిని నీ చేతితో పట్టుకొనుము."

'ఇయం' 'ఈ' నీ కిప్పుడు ప్రత్యక్షముగ నీ ముందఱ కనబడునది. రూపలావణ్యాదులలో వర్ణింప నలవిగానిది. 'పుంసాంమోహనరూపాయ' అని పురుషులు సైతము నిన్నుజూచి మోహించునట్టి భువన మోహనరూపము గల వాడవని ప్రసిద్ధిచెందిన నీకుందగినట్టి, నిన్ను మించునట్టిదియగు 'సీతా'. సీత యన నాగటిచాలు. అందు బుట్టినందున సీతయని పిలువంబడునది.



భూమియం దవతరించినందున అయోనిజ యగుటచే ఆభిజాత్యమున సాటిలేనిదని యర్థము. 'ఇయం సీతా' విశ్వామిత్రుని యాశ్రమమునుండి వచ్చి ధనుస్సును విఱచుటచే అప్పటినుండి ఎప్పుడు చూతుమాయని నీ వవిరతము కోరుచుండిన సీత యీమెయే. కాపువాని కృషిని ఫలింపజే యునది నాగటిచాలుకదా! అట్లే నీ కృషిని ఫలింపజేయునది యీ కన్యయే. ఈమె లేక నీ యవతారమే వృథయగునుగదా! 'సీతాయాశ్చరితం మహత్. నీ చరిత్రమునుమించిన మహిమగల చరిత్రగలది, కానున్నదీ సీత. 'మమాపి తద్భూతికరం ప్రవక్ష్యతే మహానుభావం చరితం నిబోధత'– నాకును శ్రేయస్కరముగను గొప్ప మాహాత్మ్యముగల సీత యొక్క చరిత్రము చెప్పబడుచున్నది. ఆ చరిత్రమును వినుడు' అని నీవే యనవలసివచ్చునట్టి ప్రభావముగలదీ సీత. తటుక్కున తళుక్కుమని మెఱుపు మెఱసినపుడు అవయవమైన కాంతిమాత్రము కనబడునేగాని అవయవియగు మెఱుపు కానరాదుగదా! అట్లే మెఱుపుదీగవంటి సీతను జూడగా ఆ కాంతిచే రామచంద్రుని కన్నులు మిఱుమిట్లుగొనగా అతడామెను గుర్తింపలేకున్నాడని యెఱింగి యీ సీతయని జనకుడు చూపినట్లగును. రామచంద్రుడు సీతను గూర్చి వినినప్పటినుండి ఎడతెగక ఆమెనే మనస్సున భావించుచుండుటచే 'ప్రాసాదే సా, పథి పథి చ సా పృష్ఠత స్సా. పుర స్సా–మేడయందును ప్రతి మార్గ మందును, వెనుకను, ముందటను ఆమెయే కనబడుచుండినదని రామచంద్రుని భావనాప్రకర్షము తెలిపినట్లగుచున్నది. 'ఏషసేతుర్విధరణ' అని శ్రుతి. సేతు వనగా దాటించునది. పురుషకారము చేసి లక్ష్మీదేవి చేతనుల సంసారసాగరమును దాటించును. 'రాఘవత్వేఽభవత్సీతా' యని విష్ణుపురాణోక్తి ననుసరించి లక్ష్మీదేవియే రామావతారమున సీతగ అవతరించిన దగుటచే నెందరినో రామబాణమునకు గురికాకుండునట్లు చేయునదియని ధ్వనింపజేసినట్లగును.

'అనర్ఘ మపి మాణిక్యం హేమాశ్రయమపేక్షతే'– రామా! నీవు నీలమేఘ శ్యాముడవు. ఇంద్రనీలమణివంటివాడవే. స్వతః నీకున్న మహిమగొప్పదే. కాని బంగారములో పొదిగిన ఇంద్రనీలమణివలె ఈ సీతను పెండ్లాడి సీతా రాముడను పేరుపొంది యీమెవలన నీ మహిమను పెక్కురెట్లు హెచ్చు గావించు కొనుము. నీ సకల కల్యాణగుణము లీమెవలన లోకమున వ్యాపించును. నీ కీర్తి ప్రతిష్ఠలు ప్రకాశింప నవతరించిన దీ సీతయని చెప్పుటయగును.

కల్యాణమండపము నలువైపుల నిలువుటద్దములచే నలంకరింపబడి యున్నది. అన్నిటియందును సీతయొక్క రూపము ప్రతిఫలించుచున్నది. వాని నన్నిటిని జూచి వాని సౌందర్యమునందే మనసు నిలిపి భ్రమించి యుండు రామునకు నిజమగు సీత యీయది యని గుర్తించు నిమిత్తము 'ఈ సీత' అని నట్లగును. భూమియం దవతరించినందున నీమె తల్లిలేని బిడ్డయని, యీమెయం దత్యంతానురాగము గలిగి వర్తించి తన కొఱతల జెప్పుకొనుటకు తల్లిలేదే యని మిక్కిలి కరుణించి యామెను లాలింపుమని చెప్పుటకై 'ఈ సీత'యని గుర్తించె ననుటయు ఒప్పియున్నది.

భూమి మనమెంతలోతు త్రవ్వినను, భూగర్భముననున్న లోహాదుల గ్రహించినను, భూమిని మనము మలమూత్ర విసర్జనాదులచే అపరిశుద్ధము చేసినను ఓర్చి, భూమి యనగా నోర్పు అని భావింపదగి నట్లుండుటచే భూజాతయగు సీతయు మిక్కిలి యోర్పుగలిగి 'క్షమయా పృథివీ సమః' అను నీ గొప్ప ఓర్పునకుం దగినట్టిదేయని నట్లును భావింపనగును. ఇక ముందు రాగల సకలకష్టముల కోర్చుననియు సూచన.

రామా! ఎవరికొఱ కొక్క సంవత్సరకాలము మిథిలానగరము రాజులం దతిచే ముట్టడింపబడి నే ననేక కష్టముల ననుభవించితినో అట్టి వీర్య



శుల్కయగునట్టిది ఈ సీత. వీర్యముచే శివధనుర్భంగము గావించి నన్ను సత్య ప్రతిజ్ఞునిగ జేసిన నీవే ఎవతెను పొందదగినవాడవని లోకమునకు చాటించితివో యట్టిది కదా యీ సీత.

'మమ సుతా' నా కూతు రనుటచే వివాహమునకు మొట్టమొదట గమనింప వలసిన ఆభిజాత్యము గలది. ఆదినుండి సదాచారమునకును, సౌశీల్యమునకును సచ్చరిత్రమునకును ప్రసిద్ధిగాంచిన మా వంశ సంబంధముగలది. నీకు బుట్టినది కాదుగదా యందువా? 'మహతా తపసా రామః' అనియెట్లు మీ తండ్రి దశరథుడు వ్రత నియమోపవాసాదులతో తపస్సు లనేకములు చేసి నిన్ను పుత్రునిగా పొందెనో యట్లే నేను జేసిన గొప్ప తపస్సునకు ఫలముగ ఈమె నాకు లభించినది. కన్నబిడ్డలకంటె పెంపుడు బిడ్డయందుగల గారాబ మిట్టిదని చెప్పదరముగాదు. 'జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా' జనకకులమున బుట్టినదేగాక అమృతము పంచునపుడు వచ్చిన విష్ణుమాయయే యీ రూపమున నవతరించినదని గుర్తింపుము. మా వంశజులు ప్రజలను తండ్రివలె యోగక్షేమభారము వహించి ప్రతిఫలముగోరక రక్షించుటంబట్టి జనకు లనియే ప్రసిద్ధిగాంచిన మా యింటిబిడ్డ యగుట సహజమగు కారుణ్యమే మూర్తీభవించి యుండు నట్టిదని తెలిసికొనుము. 'పుత్రాచ్ఛతగుణం పుత్రీ'–కొడుకుకంటె కూతురు నూఱంతలు మేలనియున్నదిగదా! అట్టి పుత్రుని బడసితినని సగర్వముగ జెప్పుకొను భాగ్యముగలవాడనని, యట్టిది నా కూతురని, నీ వంశ గౌరవమునకు దగినదని గుర్తింపుడు. అహంకార మమకారములు పరిహరణీయములని శాస్త్రములు ఘోషించుచున్నవే మరి నా కూతురని గర్వింపదగునా యందువేమో? ఒకడు తన తండ్రిని, వంశమును, గురువును, జన్మభూమిని, జననిని ఎంత పొగడినను అయ్యది సాత్త్వికాహంకార మగును. అది శాస్త్రసమ్మతమే యగునని గ్రహింపుము.

'సహధర్మచరీ తవ'-ఈమె నాయెడ యెట్లు వర్తించునో యను సందేహము వలదు. కామభోగమునకు మాత్ర ముపయోగపడునేమో యను శంకవలదు. నీ వే ధర్మము నాచరించిన నామెయు దాని ననుసరించునదేగాని యన్యముగ వర్తించదు. 'సమానోధర్మః సహధర్మః తం చరతీతి సహధర్మచరీ' నీ మనో భావ మెఱింగి నీ యాజ్ఞ చొప్పున నీ వనుష్ఠించు సకల ధర్మములను లోపలేశము లేక యనుష్ఠించి నీకు తోడ్పడునట్టిదని దృఢముగ నమ్ముము, 'రామో రతికరః పితుః' అని నీవెల్లప్పుడు నీ తండ్రి వాక్యమును పాటించు వాడవని ప్రసిద్ధిగాంచినట్లే యీామెయు నిప్పుడు నే నాడునట్టి యీ మాటను పరిపూర్ణముగ పాటించి పుట్టినింటికిని మెట్టినింటికిని కీర్తి తెచ్చునది. 'కట్టియిచ్చిన యన్నము, చెప్పిపెట్టిన మాట' యెన్నాళ్ళుండునందువా? తాటకవధ, కౌశికమఖ రక్షణము, అహల్యాశాప విమోచనము, శివధనుర్భం గము మున్నగు కార్యములచే నీ పరత్వము నే నెఱుంగుదు. నీవు విష్ణువే. ఈమె లక్ష్మి. నీవిప్పుడు మానవ రూపమున రాముడను నామముతో వెలయుచున్నావు. నీ యవతార కార్య నిర్వహణకు తోడ్పడ నీమె సీతగ నవతరించినది. లోక కల్యాణము నుద్దేశించి నీతో కల్యాణముచేసికొన సిద్ధముగ నున్నది. *ప్రాజాపత్య వివాహమున నీ సహధర్మచారిణి యనుట యుక్తమే. వివాహమున ధర్మే చ అర్థే చ కామే చ నాతిచరితవ్యా' యని కన్యా దాత చెప్పగా 'నాతిచరామి' అతిక్రమింపనని వరుడు అగ్నిసాక్షికముగ ప్రమాణము చేయుచున్నాడు.

ప్రతీచ్ఛ చైనామ్-ఈమెను పరిగ్రహింపుము. 'దదామి' అనరాదా?- ఇచ్చుచున్నాననరాదా ? ఎవరి సొత్తు లెవరి కిచ్చుట యను ప్రశ్న పచ్చునే. లక్ష్మీ నారాయణుల కవినాభావసంబంధమున్నదే. అట్లుండ నా సొత్తును నాకిచ్చుటకు నీవధికారి వగుదువా ? అని రాముడు భావించునేమో యని

* వివాహము లెన్నివిధములను ప్రశంస ముందు వివరింపబడును.



జనకుడు "రామచంద్రా! నీ పరత్వము వసిష్ఠ విశ్వామిత్రాది ఋషులకు వలె నాకు దెలియును గాని రాజులమగు మన మెట్లాచరింతుమో ప్రజలట్లే యాచరింతురు గాన లోకమున కాదర్శముగ, సర్వలోక సమ్మతముగ, శాస్త్రవిధి ననుసరించి నాచే పెంచబడిన కారణమున నా కూతురని నేను భావించుటంబట్టి కన్యాదాతయగు నేను కన్యాదానము చేయుటయు, నీవు పరిగ్రహించుటయు యుక్తము గావున నీమెను నీ విప్పుడు పరిగ్రహింపు' మనెను.

'భద్రం తే' "ఈ కన్యను నేను పరిగ్రహించినందున నీకు కన్యాదాన ఫలమును, కన్యాపితృత్వభారము తీరుటయు, సత్యప్రతిజ్ఞుడవైతివను సంతోషమును గలుగును. ఈ కన్యకును నావంటి వీరుడు భర్తయయ్యెనను తృప్తియు గలుగునుగాని యందుచే నాకేమిలాభ" మందువా? నాలుగా శ్రమములలో ఉత్తమమగు గృహస్థాశ్రమము స్వీకరించిన వాడ వగుదువు. దార సంగ్రహం ఋభయతారక మగును. సుపుత్రప్రాప్తిచే వంశాభివృద్ధియు పితృదేవతలకు ప్రీతియు లభించును. ఈమెతో గూడి ధర్మము లాచరించుటచే నీ కీర్తి ప్రతిష్ఠలు సర్వత్ర వ్యాపించును. నీ కిహపరసుఖము లొనగూడును. నీ వీమెతోఁజేరి శ్రీరాముడ వనియు, సీతారాముడ వనియు లోకులచే బిలువబడుదువు. నేను కేవలము రాజమాత్రుడను గాను. రాజర్షియని పేరు పొందినవాడను, నా తపశ్శక్తిచే మీ యిద్దఱి దాంపత్యమువలన మీకు రాగల సకల దృష్టిదోషములు వారింతును. మీ కిరువురకు అవిరళసుఖా నుభవము, శాశ్వతకీర్తియు సంప్రాప్త మగును. ఒక వేళ రామచంద్రుడు గాంధర్వరాక్షసపద్ధతిని వివాహమాడునేమో యనిశంకించి జనకుడు 'పాణిం గృహ్ణీష్వ పాణినా'అనెను, ఈమె చేతిని నీ చేతితో పట్టుకొమ్ము. ఆమె నా చేతిని పట్టుకొనరాదా యందువా? సీతకన్య, ముగ్ధ, లజ్జపడు చున్నది. అని సన్నికల్లు త్రొక్కించునపుడు పాదముపట్టుకొనవలెను. ఇప్పుడు చేతినే

పట్టుకొమ్ము. శివుని విల్లే కఠినము. దానిని విఱచిన నీ చేయి యెంత కఠినమో! ఈమె బాల; సుకుమారి. కావున మెల్లగ పట్టుకొనుము. 'పాణి గ్రహణసంస్కారః సవర్ణా సూపదిశ్యతే'– వధూవరు లొకేవర్ణము వా రగుటంజేసి పాణిగ్రహణమే విధింపబడినది. *ఈమెహస్తస్పర్శవలన నీ తాపముదీరును. నీ యవతారకృత్యమునకు తోడ్పడ విశ్వామిత్రుడు నీ కస్త్రశస్త్రములిచ్చెను. ఇక రావణాదుల సంహరింప మూలకారణంబగు సీతను నే నిచ్చెదను. సహధర్మచారిణి యెట్లుండుననుటను గొంత వివరించెదను. "సుఖభావా. సువచనా, సువ్రతా. సుఖదర్శనా, అనన్యచిత్తా, సుముఖీ, భర్తుః సా ధర్మచారిణీ"– భర్తను సంతోషపెట్టు తలంపుగలది, మంచిమాటలాడునది. భర్త మేలుకొఱకు వ్రతము లాచరించునది, భర్తను ప్రేమతో జూచునది, భర్తకంటె వేఱొకనియందు మనసులేనిది, చిరునవ్వుముఖము గలది, భర్తయే దైవమని యెంచునది సహధర్మచారిణి యగును.

**పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా**
**ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మంత్రపూతం జలం తదా.**

రామచంద్రా! పతిశుశ్రూషయే పరమధర్మమని యెంచునదియు. మహాభాగ్యశాలినియు. నీడవలె ని న్నెల్లవేళల ననుసరించునదియు నగు సీతను నీ కిదే ఉదకధారాపూర్వకముగ నొసగుచున్నానని రామచంద్రుని హస్తమునందు జనకమహారాజు మంత్రములచే పవిత్రములైన ఉదకధారల విడిచెను.

**ఆర్తార్తే ముదితే హృష్టా ప్రోషితే మలినా కృశా,**
**మృతే మ్రియేత యా నారీ శాస్త్రజ్ఞేయా పతివ్రతా.**

*తం దృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం గుణావహమ్, బభూవ హృష్టా వై దేహీ భర్తారం పరిషస్వజే॥

రాక్షసులతో యుద్ధముచేసి పడిన గాసి, గాయములు పోవ సీత భర్తను కౌగిలించు కొనెను.



భర్త శోకించునపుడు శోకించునదియు. సంతసింపగా సంతసించునది యు, భర్త దేశాంతర మేగినపుడు మలిన వస్త్రముతో కృశించియుండు నదియు, మరణించిన తానును మరణించునదియు నగు స్త్రీ పతివ్రత. ఇట్లు సీతాకల్యాణమహోత్సవము జరిగినపుడు దేవదుందుభులు మ్రోయించిరి. దేవతలు పూలవాన గురియించిరి. ఇంద్రాదుల భయము తీరినట్లే. రావణాదుల సంహారమునకు అంకురార్పణము చేసియైనది జనకుడు లక్ష్మణున కూర్మిళను, భరతునకు మాండవిని. శత్రుఘ్నునకు శ్రుతకీర్తి నిచ్చి పాణిగ్రహణమహోత్సవము గావించెను. ఇచ్చట నొక సందేహము గలుగవచ్చును, భరతుడు లక్ష్మణునకంటె పెద్దవాడు గదా! లక్ష్మణునకు ముందు, భరతునకు వెనుక వివాహము చేయవచ్చునా యనుట.

**పితృవ్యపుత్రే సాపత్నే పరనారీసుతేషు వా**
**వివాహదానయజ్ఞాదౌ పరివేదో న దూషణమ్.**

పినతండ్రి కొడుకులు. సవతుల కుమారులు, ఇతరస్త్రీ కొడుకులు వీరిలో వివాహము, దానము యజ్ఞాదులయందు ముందు చిన్నవాడు గ్రహించుట దోషము గానేరదు. జనకు డిట్లు నలుగురు రాజకుమారులకు కన్యల ధారవోసి, "మీ రెల్లరు సదాచారసంపన్నులుగ నుండు" డని దీవించె. అగ్నిసాక్షికముగ, శాస్త్రసమ్మతముగ రామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు వివాహము జరిగెను. దేవతలు పూలవాస గురియించిరి. దేవదుందుభులు ధ్వనించెను.

**శ్రీ సీతావివాహవిషయవిమర్శనము :**

మనుధర్మశాస్త్రము ననుసరించి వివాహము లెనిమిది విధములు. అవి యేవి? 1. బ్రాహ్మము, 2. దైవము, 3. ప్రాజాపత్యము, 4. ఆర్షము, 5. ఆసురము. 6. గాంధర్వము. 7. రాక్షసము, 8. పైశాచము. వీనిలో సీతావివాహ మేతరగతికి చేరినదని ప్రశ్న.

1. వేదాధ్యయనము చేసిన బ్రహ్మచారిని, సదాచారపరుని స్వయముగ రప్పించి కన్యాదానము చేయుట బ్రాహ్మ మనబడును. జనకుడు రాముని రప్పించి సీతనిచ్చినవాడు కాడు. కనుక నీ వివాహము బ్రాహ్మముగాదు.

2. యజ్ఞమున నధ్వర్యము చేయు ఋత్విజునకు కన్య నిచ్చుట దైవ వివాహమగును. జనకుని యజ్ఞమున రామచంద్రుడు ఋత్విజుడు గాడు. కావున నియ్యది దైవవివాహము గాదు.

3. ఒక ఆవు, ఎద్దును గాని; రెండావులు రెండెడ్లనుగాని పుచ్చుకొని కన్యనిచ్చుట ఆర్షవివాహ మగును. ఈ వివాహమున నట్టి దానము చేయబడలేదు. కనుక నిది ఆర్షవివాహము గాదు.

4. వరుని మూలమున నేదియు గ్రహింపక మీరిరువురు గలిసి ధర్మ మనుష్ఠింపుడని కన్యాదానముచేయుట ప్రాజాపత్యవివాహమనబడును. కనుక సీతావివాహ మట్టిదియు గాదు.

5. బంధువులకును, కన్యకును ధనమిచ్చి పరుడు వివాహమాడుట అసురవివాహ మగును. అట్టి ప్రశంస లేనందున నియ్యది అసురవివా హముగాదు.

6. కామోద్రేకమున స్త్రీపురుష లంగీకరించి కలియుట గాంధర్వ వివాహము. ఇందు మంత్రమున కవకాశమే లేదు. కనుక సీతావివాహము గాంధర్వము గాదు.

7. కన్య యొక్క బంధువుల సమ్మతి లేక వారితో పోరాడి బలాత్కారముగ కన్యను దీసికొని పోవుట రాక్షసవివాహము. ఇది యట్టిది కాదు.

8. నిద్రచేతనో, మద్యపానముచేతనో మైమరచి యున్నదాని సంగమించుట పైశాచమనబడును. ఇది నీచమైనది. కనుక సీతావివాహ మున కిదియెంత మాత్రము సంబంధము లేనిది.



ఇట్లీ యెనిమిది విధములలో జేరకున్న సీతారాములవివాహ మశాస్త్రీయమా? అట్లగుచో శ్రీ సీతారాము లాదర్శ స్త్రీపురుషులనుట విరుద్ధముగదా అనుటకీ క్రింది ప్రమాణముల జూతము.

'సహ ధర్మం చరత ఇతి ప్రాజాపత్యః' అనునది ఆశ్వలాయనసూక్తి. గౌతముడు, 'సంయోగమంత్రః ప్రాజాపత్యే సహధర్మం చర్యతామ్' అని వచించెను, బోధాయనవాక్యము, 'ఆచ్ఛాద్యాలంకృత్యైషా సహధర్మం చర్యతా మితి ప్రాజాపత్యః',మనువు 'సహోభౌ చరతాం ధర్మ' మని చెప్పియుండుటం బట్టి సహధర్మచారిత్వము ప్రాజాపత్యవివాహమునకు ప్రధానాంశము.

'సహధర్మచరీ తవ' యను జనకుని వాక్యముచే సుస్పష్టమగుచున్నది. పై వాక్యముల ననుసరించి సీతావివాహము ప్రాజాపత్యమేయని సిద్ధించుచు న్నది. ప్రాజాపత్యము మొదలు ఆసురమువఱకు గల యైదు విధములలో ప్రాజాపత్య గాంధర్వరాక్షసములు ధర్మయుక్తములు, గాంధర్వరాక్షసములు గానిచో సర్వవర్ణములవారికి ప్రాజాపత్యము సాధారణధర్మమగుటచే క్షత్రియులకు ప్రాజాపత్య వివాహము శాస్త్రసమ్మతమయినట్టిదే యని స్పష్టమగుచున్నది. క్షత్రియులకు గాంధర్వరాక్షసములే ముఖ్యములనుట నిజమే.కాని సీతారాముల పట్ల ఆ రెండును చెల్లవు గావున వీరి వివాహము ప్రాజాపత్యమే,శాస్త్రసమ్మతమే యని నిర్ధారింపబడుచున్నది.

ఇచ్చట మఱియొక సందేహము రావచ్చును. కన్యాదాత వరునివలన నెట్టి శుల్కము గ్రహింపరాదని శాస్త్రవిధిగ నున్నదే. మఱి జనకుడు 'సీత వీర్యశుల్క' యని యెట్లు చాటించెను ? రామచంద్రు డట్టి శుల్కమునిచ్చి యేల సీతను వివాహమాడెను ? జనకుడు వీర్యశుల్క ప్రతిజ్ఞచేసి పొందిన స్వలాభమేమి? అసాధారణ కన్యయగు సీతకు దగిన వరు డసాధారణశక్తి సామర్థ్యములు గలవాడుగ నుండవలెను గదా! సామాన్య పురుషుడు క్షత్రియుడను సామాన్య రాజకుమారున కామె నిచ్చుట కొప్పునా? 'నారీణా

ముత్తమాం వధూ’ అను నుత్తమోత్తమకన్యకు దగిన పురుషోత్తము డెవడని పరీక్షించి కన్యను, లోకమును, పెద్దలను, శ్రేష్ఠులను మెప్పించి యొప్పించి జగదేకవీరున కిచ్చుటచే ఆ కన్యకామణి కీర్తి ప్రతిష్ఠలకు దగిన కార్యమని లోకకల్యాణమునకు దగు కొలంది తాను తోడ్పడినట్లగుటచే వీర్యమును శుల్కముగ జనకుడు చాటినది సర్వజన సమ్మతమే యని శ్లాఘింప నగును.

ఇట్లు పెండ్లియైన మఱునా డుదయము విశ్వామిత్రుడు దశరథుని సమ్మతి పొంది జనకుని వీడుకొని. రామలక్ష్మణభరతశ్రతుఘ్నులను, సీతోర్మిళామాండవీశ్రుతకీర్తులను పరిపూర్ణానుగ్రహముతో దీవించి ఉత్తరదిక్కుగా హిమాచలమునకు బోయెను. ఇట్లు విశ్వామిత్రుడు శ్రీ సీతాకల్యాణమునకు దోడ్పడి లోకకల్యాణము గావించెనని చెప్పనగును.

## సుమంత్రుడు

శ్రీమద్రామాయణమున ధశరథుని సచివోత్తముడును సారథియు నగు సుమంత్రు డొక పవిత్ర వ్యక్తి. వసిష్ఠుని వలె రామావతార మెదురుచూచుచు రఘువంశమువారికి సేవచేయుచు విభవమున రామచంద్రుని పరత్త్వమును గుర్తించి యాతని దర్శనము, కైంకర్యమే ప్రధానలక్ష్యములుగ భావించిన భాగవతశ్రేష్ఠుడు. పుత్రకామేష్టిచేయ సంకల్పించిన దశరథున కేకాంతమున

**సనత్కుమారో భగవాన్ పూర్వం కథితవాన్ కథామ్,**
**ఋషీణాం సన్నిధౌ రాజన్ తవ పుత్రాగమం ప్రతి.**

రాజోత్తమా। పూర్వము ఋషి సంఘంబున సనత్కుమారుడు“విభండక పుత్రుడు ఋష్యశృంగుడు అంగదేశపు రాజగు రోమపాదుని కూతురగు శాంతను వివామాడి రోమపాదుని యింటనుండును. దశరథుడు తన స్నేహితుడగు రోమపాదుని అడిగి శాంతాసమేతుడగు ఋష్యశృంగునితోడి



తెచ్చి వసిష్ఠ ననుమతంబున ఋష్యశృంగుని పురోహితుడుగా వరించి పుత్ర కామేష్టిచేసి పుత్రులం బడయునని తొల్లి కృతయుగంబున జెప్పినట్లు” వింటిని. కనుక నీవట్లు చేయుమని చెప్పగా దశరథు డట్లే వసిష్ఠుని యనుజ్ఞపొంది తానే ఋష్యశృంగుని తోడ్కొనివచ్చి పుత్రకామేష్టి చేసి పుత్రుల బడసె.

సుమంత్రుడు వృద్ధుడు. దశరథుని యాంతరంగికు డనుట

**తం తు పూర్వోదితం వృద్ధం ద్వారస్థా రాజసమ్మతమ్,**
**న శేకురభిసంరోద్ధుం రాజ్ఞః ప్రియచికీర్షవః.**

వసిష్ఠుడు తనరాకను రాజునకు దెలుపునట్లు మంత్రిసత్తము డగు సుమంత్రు నాజ్ఞాపింప నతడు రాజహితంకరుడని అంతఃపురము ప్రవేశింప రాజాజ్ఞ పొందినవాడని ద్వారపాలకు లతని కడ్డుచేయరైరి. అప్పటి రాజు యొక్క దురవస్థ తెలియనందున నెప్పటి చొప్పున సుమంత్రుడు“మహారాజా!

**ఇంద్రమస్యాం తు వేళాయామభితుష్టావ మాతలిః,**
**సోఽజయద్దానవాన్ సర్వాంస్తథా త్వాం బోధయామ్యహమ్.**

ఇంద్రుని సారథియగు మాతలి యిట్టి సమయమున దేవేంద్రుని స్తుతించి మేలుకొలుపగా నతడు తన శత్రువులగు దానవులను జయించెను. అట్లే యింద్రతుల్యుడ వగు నిన్ను నీ సారథియగు నేను మేలుకొలుపగా లేచి నీ శత్రువు లెల్లర జయింపుము. సాంగోపాంగంబుగ వేదము బోధించుటచే బ్రహ్మ సృష్ట్యాదుల నిర్వర్తించునట్లు నీవు చేయవలసిన రాజకార్యములందు నేను బోధించుటచే మేల్కొనుము.

**ఉదతిష్ఠత రామస్య సమగ్రమభిషేచనమ్,**
**పౌరజానపదైశ్చాపి నైగమైశ్చ కృతాంజలిః,**

**స్వయం వసిష్ఠో భగవాన్ బ్రాహ్మణైస్సహ తిష్ఠతి,**
**క్షిప్రమాజ్ఞాప్యతాం రాజన్ రాఘవస్యాభిషేచనమ్.**

రాజా! సకల సంభారములు సమకూర్పబడినవి. పురజనులును పల్లె పట్టుల జనులును. వర్తకులును చేమోడ్చి తన్ను గొలువ భగవంతుడగు వసిష్ఠుడు బ్రాహ్మణ సమూహముతో కాచుకొని యున్నాడు. రాముని పట్టాభిషేకమున కాజ్ఞ యొసంగుము. నేను లేకున్ననేమి ? కార్యము జరుపరాదా యందువా ?

**యథా హ్యపాలాః పశవో యథా సేనా హ్యనాయకా,**
**యథా చంద్రం వినా రాత్రిర్యథా గావో వినా వృషమ్**
**ఏవం హి భవితా రాష్ట్రం యత్ర రాజా న దృశ్యతే.**

కాపరి లేని పశువులవలెను, నాయకుడు లేని సేనవలెను, చంద్రుదులేని రాత్రి వలెను, వృషభములేని యావువలెను, రాజు కనపడని రాజ్యము కళా విహీనమగును, కావున జనులకు దర్శనమిమ్ము' అని ప్రభాతవేళ సుమం త్రుడు రాజును మేల్కొలిపెను. ఇందు సుమంత్రుని రాజభక్తి వెల్లడి యగుచున్నది.

## ఏకాంతసేవ

కైకపంపున రాజాజ్ఞ యనియే భావించి సుమంత్రుడు రాముని గొని తెచ్చుటకై రామమందిరముచేరి నిరభ్యంతరముగ నంతఃపురము ప్రవేశింప దగినవాడయ్యు కావలివారిచే తన రాక రామున కెఱింగింప న మ్మహాత్ముడును తన తండ్రి కత్యంతాప్తు డగుట తనకు నట్లే యని భావించువాడు గావున సీతతో తా నేకాంతమున నున్నచోటి కతని రప్పించె. ఇచ్చట రామచంద్రుడు నిత్యవిభూతి యందువలె లీలావిభూతియందును పరమభాగవతోత్తము డగు సుమంత్రునకు సీతాసమేతుడై హేమపర్యంకంబున నిచ్చిన యేకాంతసేవ అపూర్వమును, అద్వితీయము నైనదని వివరింపబడుచున్నది.



**తం వైశ్రవణసంకాశ ముపవిష్టం స్వలంకృతమ్,**
**దదర్శ సూతః పర్యంకే సౌవర్ణే సోత్తరచ్ఛదే,**
**వరాహరుధిరాభేణ శుచినా చ సుగంధినా,**
**అనులిప్తం పరార్ధ్యేన చందనేన పరంతపమ్,**
**స్థితయా పార్శ్వతశ్చాపి వాలవ్యజనహస్తయా,**
**ఉపేతం సీతయా భూయ శ్చిత్రయా శశినం యథా.**
**తం తపంత మివాదిత్య ముపపన్నం స్వతేజసా,**
**వవందే వరదం వందీ వినయజ్ఞో వినీతవత్.**

తళ తళమని మెఱయుచున్న మేలి బంగారు మంచముమీద పట్టాభిషేక మహోత్సవమునకు దగిన వస్త్రాభరణములతోను పందినెత్తురువంటి ఎరుపురంగు గలిగి కుంకుమపువ్వు విశేషముగ జేర్చబడిన మిక్కిలి సువాసనగల చందనపు మైపూతతోను సకలైశ్వర్య సంపన్నుడగు కుబేరునివలె ప్రకాశించుచు ప్రక్కన తేజోరాశివలె చేతికంకణముల మనోహర ధ్వనితో వింజామర వీచుచుండు సీతాసమేతుడై చైత్రమాస పూర్ణిమనాడు చిత్రా నక్షత్రముతో గూడిన నిండుచంద్రునివలె ప్రకాశించుచుండు రామచంద్రుని సుమంత్రుడు దర్శించెను. నిజదేహకాంతిచే సూర్యునివలె ప్రకాశించుచు ఆశ్రితవరప్రదాత యగు రామచంద్రునకు వినయము నెఱపురీతి నెఱింగినవా డగుట సుమంత్రుడు ప్రాతఃకాలమున సుప్రభాతము చెప్పి వినయముమీఱ సాష్టాంగదండప్రణామము గావించెను. మనోవాక్కాయములతో ననగా రామచంద్రుని ప్రభావము మనమున చింతించి వాక్కుతో సుప్రభాతము చెప్పి కరచరణాదులతో వినయముచూపి 'శేషశాయికి మ్రొక్కు శిరము శిర' మని ఉత్తమాంగమును రామచంద్రుని పాదములు సోక నమస్కరించి రామచంద్రుని పరిపూర్ణానుగ్రహమునకు పాత్రు డయ్యె. ఇట్లు 'కమలాక్షు నర్చించు కరములు కరములు' అను పద్యము చొప్పున ననుష్ఠించి

భగవత్సేవచేయు విధాన మెఱిగించు విధమున ప్రవర్తించె. ఇట్టి రామచంద్రుని సీతాదేవితో నేకాంతమున కన్నుల గఱవు దీర దర్శించు భాగ్యము దశరథునకుగాని, కౌసల్యాదేవికిగాని, వసిష్ఠునకుగాని అబ్బినదికాదు. ఇట్టి యసాధారణ దర్శన మొక్క సమంత్రునకే లభ్యమైనందున అతనిభాగ్య మిట్టిదని వర్ణింప నలవిగాదు.

## సుమంత్రుడు కైకను దూఱుట

రామచంద్రుడు సీతాలక్ష్మణులతో సెలవు పుచ్చుకొనుటకై దశరథుని కడకు బోయెను. సుమంత్రుడు రాముని రాకను రాజున కెఱింగించిన వెంటనే రాజు సుమంత్రుని మూలమున తనభార్యలు మున్నూటయే బదిమందిని రప్పించె. సీతా రామలక్ష్మణులను లోనికి రమ్మనెను. దశరథుడు రాము డరణ్యమునకు బోవనున్నాడని పరిపరి విధముల పరితపింప రామచంద్రుడు–

**న మే తథా పార్థివ ధీయతే మనో**
**మహత్సు కామేషు న చాత్మనః ప్రియే,**
**యథా నిదేశే తవ శిష్టసమ్మతే**
**వ్యపైతు దుఃఖం తవ మత్కృతేఽనఘ.**

రాజా! బుద్ధిమంతులు మెచ్చునట్టి నీ యాజ్ఞను శిరసావహించుటకంటె సకల సుఖములను, మఱి సీతను, ప్రాణములను నేను ముఖ్యమని భావింప నొల్లను. అనఘా! నాకు వనవాసము వలన దుఃఖములు గలుగునని నీ వెంతమాత్రము నా కొఱకు దుఃఖింపవలదని దృఢమగు ప్రతిజ్ఞచేసిన తోడనే దశరథుడు దుఃఖసాగరమున మునిగి మూర్ఛిల్లెను. రాజపత్నులందఱు నొక్కటియై గొప్ప రోదనము చేసిరి. 'రుదన్ సుమంత్రోఽపి జగామ మూర్ఛాం హాహాకృతం తత్ర బభూవ సర్వమ్' అప్పుడు పరమభాగవతోత్తము డగు



సుమంత్రుడు గూడ మూర్ఛితు డయ్యె కాని కైక యొక్కతెమాత్ర మఱు మాత్రము చలించినదికాదు.

సుమంత్రు డంత దశరథుని మనసు విఱుగజేసిన ఆ క్రూరురాలగు కైకేయిని రోషావేశమున కండ్లెఱ్ఱవడ పండ్లు పట పటం గొఱికి

'పతిఘ్నీం త్వామహం మన్యే కులఘ్నీమపి చాంతతః॥
నీవు పతిని చంపుదానవు. పతిని మాత్రము గాదు. కులమునే నాశ మొందించు దానవని నాకు దోచెడిని.

**మావమంస్థా దశరథం భర్తారం వరదం పతిమ్,**
**భర్తురిచ్ఛా హి నారీణాం పుత్రకోట్యా విశిష్యతే.**

దశరథుడు లోకు లెల్లరను పోషించువాడు. కోరిన కోరికల నిచ్చువాడు. నీకు పరమగతియగు పతి. అట్టివాని నవమానింపకుము. కోటి పుత్రుల కంటెను పతి ననుసరించుటయే స్త్రీలకు పరమధర్మము.

**అభిజాతం హి తే మన్యే యథా మాతుస్తథైవ చ,**
**న హి నింబాత్ స్రవేత్ క్షౌద్రం లోకే నిగదితం వచః.**

వేపచెట్టున కెంత పాలు పోసి పెంచినను అది తియ్యనిపండ్ల నిచ్చునా? దాని నుండి తేనె స్రవింప దనుట నిజమే, ఆట్లే యెట్టి కులములో బుట్టిన నేమి ? నీ తల్లి దుష్టురాలని ప్రసిద్ధి. అట్టి కడుపులో బుట్టిన నీవు నట్లే యున్నావని తెలియుచున్నది. నీ తల్లి యెట్టిదో వినుము.

"ఒక మహనీయుని వరప్రసాదముచే నీ తండ్రి సకల జంతు పక్షి క్రిమి కీటకాదుల శబ్దముల కర్థము గ్రహింప శక్తుడై యుండె. ఆత డొక సమయమున పడుకటింటి పాన్పుక్రింద జృంభ మను నొక తెగ చీమ పలికిన పలుకు విని పలుమాఱు నవ్వెను. అంత నీ తల్లి నీ తండ్రిని జూచి తన్నాతడు పరిహసించె నని తలచి, 'రాజా! నీవిప్పుడు పలుమాఱు

నవ్వినందుల కేమి కారణమో చెప్పవలయునని కోరెను. అప్పుడు రాజు, “దేవీ! నే నిప్పు డా విషయుము చెప్పినచో నాకు మరణము తప్ప” దనెను. అంత నీ తల్లి ధర్మాత్ముడగు కేకయరాజును జూచి, ‘నీ వెట్టిగతి పట్టినను సరే. నా కా విషయము చెప్పిననే నీవు నన్ను పరిహసింప లేదని నమ్ముదు’ ననెను. చేయునదిలేక నీ తండ్రి తన కా విద్య బోధించిన గురువుతో జరిగిన వృత్తాంతమును జెప్పగా నాతడు ‘రాజా! నీ భార్య చచ్చినను, నిన్ను విడిచినను లెక్క పెట్టకుము. ఆ ప్రాణి చెప్పిన సంగతి నీ వామెతో జెప్పరా’ దనెను. గుణవంతుడగు నీ తండ్రి నీ తల్లి కా విషయము చెప్పక ఆమెను త్రోసిపుచ్చి సుఖముగ నుండెను.

**సత్యశ్చాద్య ప్రవాదోఽయం లౌకికః ప్రతిభాతి మే**
**పితౄన్ సమనుజాయంతే నరా మాతరమంగనాః.**

తండ్రివంటి గుణములు కొడుకులును, తల్లివంటి గుణములు కూతులును పొందుదురను సామెత నిజమని నా కిప్పుడు స్పష్టమగుచున్నది.

**నైవం భవ గృహాణేదం యదాహ వసుధాఽధిపః,**
**భర్తురిచ్ఛాముపాస్వేహ జనస్యాస్య గతిర్భవ.**

ఇట్లు గాకుము. నామాట చొప్పున వర్తింపుము. రామునకు పట్టము గట్టుటే నీ భర్త కిష్టము. దాని ననుసరించి రామునకు పట్టము గట్టి యతని పనవాసముచే దుఃఖాంబుధి మునుంగుచుండు జనుల నుద్ధరింపుము, జ్యేష్ఠునకే పట్టముగట్టునట్టి నీ కులాచారమునకు భంగము గావింపకుము. శాశ్వతమైన అపకీర్తిపాలు గాకుము. రాజు నీ కిచ్చిన వరము వమ్ము చేయడు. ఇట్లు గాకున్న వేరొక విధమున భరతుని సన్మానించు’ నని సుమంత్రుడు కోపముతోను, సాంత్వనవచనములతో నెన్ని విధముల నడుగుకొన్నను గైకేయి మనసు మెత్తపడ దయ్యె; ముఖము తేటపడదయ్యె.



## శ్రీరామ సుమంత్ర సంవాదము

దశరథునాజ్ఞచే సుమంత్రుడు సీతారామలక్ష్మణులను రథమున నెక్కించుకొని గంగాతీరము వఱకు బోయెను. గంగను దాటుటకు ముందు శ్రీరామునకును సుమంత్రునకును జరిగిన సంవాద మెట్టిదో పరిశీలింతము.

సుమంత్రుడు : (అంజలిబద్ధుడై) నేనేమి చేయవలయును?

రామచంద్రుడు: (మనసార తన కుడిచేతితో సుమంత్రుని భుజముదాకి)

సుమంత్రా! నీవు త్వరగా రాజుకడకు బొమ్ము, మేము అరణ్యమునకు బోయెదము. ఇంతవఱకు మమ్ము రథమున గొనివచ్చితివి. మునుపటి కంటె రాజును మిక్కిలి జాగరూకతతో కాచియుండుము.

సుమంత్రుడు: (దుఃఖముతో) రామచంద్రా! సీతతోను లక్ష్మణునితోను మీరడవిలో వాసము చేయుట లోకములో నొక్కనికైనను సమ్మతమగునది కాదు.

**న మన్యే బ్రహ్మచర్యేఽస్తి స్వధీతే వా ఫలోదయః,**
**మార్దవార్జవయోర్వాఽపి త్వాం చేద్వ్యసనమాగతమ్.**

నీ వంటి ఉత్తమున కిట్టి వ్యసనము గలుగుటచే బ్రహ్మచర్యమునకు గాని, వేదాధ్యయనము చేయుటకుగాని, దయాగుణముతో నిండియుండు టకు గాని, వంచన లేక నిష్కాపట్యముతో నుండుటకుగాని ప్రయోజన మెంతమాత్రము లేదని తలచుచున్నాను. నీవు పితృవాక్యపరిపాలనా ధర్మ మనుష్ఠించి ముల్లోకముల జయించి గొప్ప కీర్తి పొందగలవు. కాని.

**వయం ఖలు హతా రామ యే త్వయాఽప్యుపవంచితాః,**
**కైకేయ్యా వశమేష్యామః పాపాయా దుఃఖభాగినః.**

నీ యభిషేకముచే నెంతో సంతోష మనుభవింతుమని తలచిన మమ్ము మోసపుచ్చినది కైకమాత్రమని యెంచితిమి. నీవును నీ వెంట వచ్చిన

పురజనులు నిద్రించుతఱి వారిని వంచించితివి. పాపబుద్ధిగల కైకవశమున జిక్కి వంతలపాలగు మా దురవస్థ చెప్ప నలవిగాదు.(అని చెప్పి ప్రాణసమానుడగు రాముని విడిచియుండ నేరక సుమంత్రుడు గొంతెత్తి రోదనము చేసి కన్నీరు దుడుచుకొని యాచమించి యుండుటం గని), రామచంద్రుడు:

**ఇక్ష్వాకూణాం త్వయా తుల్యం సుహృదం నోపలక్షయే,**
**యథా దశరథో రాజా మాం న శోచేత్తథా కురు.**

సుమంత్రా! ఇక్ష్వాకువంశపువారమగు మాకు నీవంటి స్నేహితుని నేను జూడలేదు. నా వనవాసము వలన రాజు దుఃఖపడకుండుట కేమి చేయవలెనో దానినే చేయుము.

**అదృష్టదుఃఖం రాజానం వృద్ధమార్యం జితేంద్రియమ్,**
**భూయాస్త్వమభివాద్యైవ మమ హేతోరిదం వచః.**

నాకు బదులుగ, మా తండ్రికి సాష్టాంగ దండప్రణామ మాచరింపుము. రా జిదివఱకు దుఃఖ మెరుగడు. వృద్ధుడు. జితేంద్రియుడు.

**నైవాహమనుశోచామి లక్ష్మణో న చ మైథిలీ,**
**అయోధ్యాయాశ్చ్యుతాశ్చేతి వనే వత్స్యామహేతి చ .**

అయోధ్యను విడిచి రావలసివచ్చెనే, అడవిలో సుండవలసివచ్చెనే. అని నేను శంకింప నుము. లక్ష్మణుడు శోకింప దనుము. సీతయు శోకింప దనుము. శీఘ్రముగ పదునాలుగేండ్లు గడపి వచ్చి యతని పాదపూజ గావింతు మనుము. మా తల్లుల అందఱి క్షేమ మడిగితి మనుము. రాజుతో భరతుని రప్పించి పట్టముగట్టు మనుము. భరతుని జూచి నా మాటగా నీవు ధర్మ మనుసరించి పాలింపుము; నీ తల్లి కైకేయి నెట్లు గౌరవింతువో యట్లే తక్కిన తల్లులను గౌరవింపుము. విశేషించి నా తల్లి శోకముదుగునట్లు ఆమెపట్ల వర్తింపు మనుము.



సుమంత్రుడు: రామచంద్రా! నీయందలి నెయ్యమున భయము మాని నే నేమి చెప్పుదునో యాలకింపుము. నే నట్లు సేవాధర్మము తప్పిన ట్లగపడినను నీ యంతరంగభక్తుడ నగుటచే నన్ను క్షమింపుము. నీ యెడ బాటుచే పుత్రుని వీడి కందికుందుచున్నట్టి యయోధ్యకు నీవులేక నేనెట్లు పోగలను? రథములో నీవుండుటను జూచిన పశుపక్ష్యాదులు నీవు లేని రథమును జూచి దుఃఖాతిశయమున బ్రద్దలగునేమో? నీవు లేని రథమును నేను తోలుకొనిపోగా పురజనులు సారథిమాత్రము మిగులునట్లు నాశము గావింపబడిన సైన్యమును జూచునట్లు దుఃఖములో మునుగుదురు గదా! నీవు దూరదేశమున నుండగా సదా నీ మంగళవిగ్రహమునే ధ్యానించుచు జనులాహారనిద్రలు మాని వారి పాలిటి సర్వ రక్షకుడవగు నిన్నే కలవరించుచుందురు. నీ వడవికి బయలుదేఱినపుడు జనులు గుండెలవియునట్లు చేసిన రోదనము నీవే వినియున్నావు. నీవు లేక మఱలిన నన్ను జూచి యెట్టి రోదనము చేయుదురో యూహింపుము.

**అహం కిం చాపి వక్ష్యామి దేవీం తవ సుతో మయా,**
**నీతోఽసౌ మాతులకులం సంతాపం మా కృథా ఇతి.**

నే నయోధ్య చేరినంతనే నీ తల్లి 'నా ముద్దు బిడ్డ డేడి? అతని నెందు వదలివచ్చితి వని యడిగిన నే నేమని బదులు చెప్పుదును? మేనమామ యింట వదలి వచ్చితిని నీ వేదువకు మందునా? నిజము పలికిన నీ తల్లి ప్రాణము విడుచునే. అబద్ధమాడదగునా? ఆహా ! ఎట్టి పరిస్థితి తటస్థించినది. ఆయ్యా! ఊరికి మరలి పోయినగదా యీ మాట ? నిన్ను, సీతను, లక్ష్మణుని యెక్కించి తోలినందున నీ గుఱ్ఱములు క్రమముగా నడచినవి. మీరు ముువ్వురు లేని రథమును బూన్చి నే నెట్లు తోలినను ఈ యశ్వములు పురమువైపు మరలవే.

**తన్న శక్ష్యామ్యహం గంతు మయోధ్యాం త్వదృతేఽనఘ**
**వనవాసానుయానాయ మామనుజ్ఞాతుమర్హసి.**

**యది మే యాచమానస్య త్యాగమేవ కరిష్యసి,**
**సరథోఽగ్నిం ప్రవేక్ష్యామి త్యక్తమాత్ర ఇహ త్వయా.**

నీవు లేక అయోధ్యకు బోవజాలను, నీతో వనవాసము చేయగోరు నా కనుజ్ఞ యిమ్ము. నా ప్రార్థన నంగీకరింపక నన్ను దిగవిడిచితివేని నే నీరథముతో అగ్నిప్రవేశము చేసెదను.

రామచంద్రా! నీ సేవను గోరియే నే నీ వంశమున సూతవృత్తి న వలంబించి యున్నాను. నీవు పట్టము గట్టికొని రాజ్యము పాలింపగా నీకు సారథిగను, మంత్రిగనుండి సదా నీ సేవయంచే కాలము గడుపనెంచితిని. తా నొకటి తలచిన దైవ మొకటి తలచునని నీ పట్టాభిషేకమున కిప్పుడు భంగము గలిగి నీకు వనవాసము ప్రాప్తమైనందున నిట్టి స్థితిలో నీతో నరణ్యమున వసించి నీకు సేవచేయకుంటినేని నా జన్మము వృథయని తలచెదను. నీవు నా కారాధ్యదైవము. నీ యారాధనమే నా జన్మకృత్యము. ఆరాధ్యదైవ మొకచోట, ఆరాధకు డొకచోట ఉండుటెట్లు ? నీ యారాధనములేని జన్మము నాకేల? నీవు న న్నరణ్యమున నుండనీయ కుంటివేని అగ్నిలో బడి నీ ప్రీతికొఱకని యెంచి దేహము చాలింతును.

అరణ్యములో నీవు నాకేమి చేయగలవందువా? నీ తపస్సునకు భంగ మొనర్చు క్రూర మృగాదుల వధించెద. కుశకంటకాదులచే నీ పాదములకు బాధకలుగకుండ ఈ రథమును నీ కొఱ కుపయోగించుచుందును.

**తవ శుశ్రూషణం మూర్ధ్నా కరిష్యామి వనే వసన్,**
**అయోధ్యాం దేవలోకం వా సర్వథా ప్రజహామ్యహమ్.**

నేను వనమున వసించుచు నీ శుశ్రూషాదులు శిరసా వహించి చేయుదును, నీ సేవ లేనంతట అయోధ్యయే కాదు దేవలోకమైనను నాకవసరము లేదు. ఈ పాపాత్ముడు దేవలోకము ప్రవేశింపలేకుండునట్లు



నీ సేవాధనము గోల్పోయి యయోధ్య ప్రవేశింప నే నొల్లను. నేనే కాదు. ఈ యశ్వములును వనమున నీ సేవచేసి మోక్షము పొందగలవు. నీయాశ్ర యముచే చరాచరము లన్నియు మోక్షము పొందునను సారము తేల్చినట్లగును.

ఇచ్చట సుమంత్రుని రామభక్తి సామాన్యము గాదని తెల్లమగుచున్నది.

**"ఏవం వర్షసహస్రాణాం శతం వాఽహం త్వయా సహ,**
**వ్యతిక్రమం న వేత్స్యామి స్వర్గోఽపి న హి మే మతః".**

ఇట్లు నీతోడ వేలకొలది సంవత్సరములు గడచినను ఇంతకాలము గడచిన దని నాకు తెలియదు. నిన్ను విడిచి స్వర్గములో నుండుటకైనను నేను కోరను అను సీతాదేవి వాక్యమును–

**"న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే ,**
**ఐశ్వర్యం వాఽపి లోకానాం కామయే న త్వయా వినా" .**

రామా! నీవు లేక నేను దేవలోకవాసమును గోరను. నీ కైంకర్యము లేని మోక్షసామ్రాజ్య మైనను నేను కోరను. నీవు లేక త్రిలోకాధి పత్యమును గాని నేను గోరను. (అనన్యప్రయోజనత్వము చెప్పబడుచున్నది)– అను లక్ష్మణుని సేవాపరాయణత్వమును జ్ఞప్తికి వచ్చుచున్నది. ఇందువలన సుమంత్రుని అసాధారణ రామసేవాపరాయణత్వము వెల్లడి యగుచున్నది.

మఱియు సుమంత్రు డిట్లు ప్రార్థించుచున్నాడు "రామచంద్రా! నీతో నుండిన ఈ పదునాలుగేండ్లకాల మొక్క త్రుటిలో గడచిపోవును. నిన్ను వీడినచో క్షణ మొక యుగ మగును. వనములో నీకు శుశ్రూషలు గావించి వనవాస కాలము గడచినంతనే నిన్నీరథమున నయోధ్యకు గొంపోవగోరెదను.

**"భృత్యవత్సల తిష్ఠంతం భర్తృపుత్రగతే పథి,**
**భక్తం భృత్యం స్థితం స్థిత్యాం త్వం న మాం హాతుమర్హసి.**

రామా! నీవు సేవకజనమందారుడవు. నేను నా స్వామి కుమారుడగు నీ పాదకమలసేవయం దాసక్తిగలవాడను. నేను నీకు దాసుడను, భక్తుడను. నీయం దపరిమితానురాగము గలవాడను. నిన్ను విడిచి యొకక్షణమైనను ఉండలేనివాడను. నీ సేవ చేయుటకుం దగిన యన్ని యాకారములు నాకు లేవు. నన్నుద్ధరింప నీవే సర్వవిధముల శక్తుడవు. నీవు దయాసముద్రుడవు. భక్తుల రక్షించువాడవు. నన్ను దిగనాడకుము.

**భక్తం చ భజమానం చ తవాస్మీతి చ వాదినమ్,**
**త్రీనేతాన్ విషమప్రాయాన్ విషమేష్వపి న త్యజేత్.**

భక్తుని, సేవించుచుండువానిని, నేను నీవాడను అను, నీ ముగ్గురిని యెట్టి కష్టస్థితియందున్నను రక్షింపక విడువరాదనుట శాస్త్రము. కనుక నన్నుద్ధరింపుమని పరిపరివిధముల యాచించు సుమంత్రునితో రామచంద్రుడు–

**జానామి పరమాం భక్తిం మయి తే భర్తృవత్సల,**
**శృణు చాపి యదర్థం త్వాం ప్రేషయామి పురీమితః.**

స్వామిభక్తిపరాయణుడా! నీకు నాయం దసమానభక్తి గలదని నే నెఱుగుదును. నీ చిత్తవృత్తి యిట్టిదని నాకు దెలియనిది కాదు. ని న్నిపుడు పురమునకు మరలి పొమ్మనుటకు కారణముల వివరించెద. నీవు పురమునకు మరలి పోగానే నా పినతల్లి కైక నేను నిజముగ నడవికి బోయితినని నమ్మును. అంతట రాజు బొంకలేదని యతనిమాట సత్యమే యని యామె సంతోషించును. భరతుడు రాజ్యమేలగా ఆమె సంతోషించవలెననుట నాకోరిక. నీవు నా ప్రియము కొఱకును, మా తండ్రి ప్రియముకొఱకును మరలి పొమ్ము. నా తండ్రిని నేను సత్యప్రతిజ్ఞునిగా జేసితినను తృప్తిగల్గును.



వీరినిట్లు సంతోష పెట్టుటే నాకు ప్రియము.(ఇందుచే ఏవై దికకార్యము చేయునపుడును భగవదాజ్ఞయా, భగవత్ప్రీత్యర్థం అని సంకల్పించుకొనుట యాచారమైనది.) బండి లాగు గుఱ్ఱముయొక్క కనులకిరువైపులనుండు సాధనద్వయము (గంతలు) గుఱ్ఱమును ఋజుమార్గముననే పోవునట్లు చేయుననుట సర్వజనవిదితమే. అట్లే మానవుడు నిజమార్గావలంబి యగు నిమిత్తము ఇట్టి సంకల్పము విధింపబడియున్నది. ఎట్లన భగవదాజ్ఞచే నే నీ కార్యమునకు బూనుకొందునను జ్ఞానముగలవా డెన్నడైన అకార్యము చేయునా? నే నీకార్యమును భగవత్ప్రీతికొఱకు చేయుదునను వాడెట్లు చేయరాని కార్యమును చేయును? అతడొక కార్యమును చేయుటకు మునుపే దీనిచే భగవత్సాధనకు ప్రీతి కలుగునా యని తన్నుతాను ప్రశ్నించుకొనును. అందువల్ల నతడ కార్యములు భగవంతున కప్రీతినే కలిగించునని భయపడి యకృత్యము చేయ నిరాకరించును. కనుక రామచంద్రుడు సుమంత్రుని భక్తికి మెచ్చెనే గాని యతని కిష్టమున్నను లేకున్నను తన యాజ్ఞయనియు తన ప్రీతి కొఱకనియు సుమంత్రుని మరలి యయోధ్యకు బోవ నాజ్ఞాపించె. సుమంత్రుడుత్తమ భక్తుడు. సేవకు దగులచే రామునాజ్ఞ శిరసావహించె. సుమంత్రుని వృత్తాంతమునుండి గ్రహింపవలసిన విషయములేవో పరిశీలింతము. సుమంత్రుని రాజభక్తి యనన్యాదృశము. ఆ భక్త్యతిశయమే నిండు సభలో రాజున కెక్కువ మక్కువ గూర్చు భార్యయగు కైకేయి నందఱముందఱ ములుకుల వంటి పలుకులతో ఎత్తిపొడిచె. అతడు రాజహితకరుడ గుటచేతను, ధర్మ మనుష్ఠించువాడు గనుకను సాంత్వనవచనములతో గై కేయిని రామపట్టాభిషేకమున కియ్యకొనుమని విశ్వ ప్రయత్నము గావించె, గంగాతీరమున రాముడు మరలి యయోధ్యకు బొమ్మని నపుడు సుమంత్రుని హృదయవేదన యాతని భగవద్వియోగసంతాపమును జాటుచున్నది.)

## సుమంత్రు డయోధ్యకు బోవుట

సీతారామలక్ష్మణులు గంగ దక్షిణతీరముచేరి కనుచూపుమేర గడచు నంత వఱకు వారిని జూచుచుండి గుహుడు సుమంత్రుని గూడి రామునిగు ణముల బొగడుచు శృంగబేరపురము. చేరె. గుహుని చారులమూలమున రామాదులు భరద్వాజాశ్రమము చేరి, యందుండి చిత్రకూటము చేరిరను వృత్తాంతము విని, సుమంత్రుడు గుహునియొద్ద సెలవుగైకొని *శృంగిబేరపురమునుండి బయలుదేఱి మూడవనాటిసాయంకాల మయోధ్యజేరి కళావిహీనమగు ఆ పట్టణమును గాంచెను. రథమును జూచిన జనులు రాముని వృత్తాంత మడుగ 'అతడు గంగానదిని దాటి పోయెను' అని సుమంత్రుడు చెప్పినంతనే జనులు చాల దుఃఖించిరి. సుమంత్రుడును దుఃఖము సహింపలేక మొగము మాటు చేసికొని రాజగృహము జొచ్చె. సారథిని చూచినంతనే దశరథుడు, రామాయని శోకముచే మూర్ఛిల్లెను. కౌసల్యయు సుమిత్రయు నాతని లేవనెత్తి 'నాథ! ఇతరులకు వీలుకాని వనగమనముచేసిన మన రామచంద్రుని వద్ద నుండి వచ్చిన దూతయగు సుమంత్రునితో మాటాడవేల'? అని యతని కనేక శుశ్రూషలు గావింప తెలివి పొంది దశరథుడు. 'సూతా! మిక్కిలి సుకుమారు డగు రాముడేమి తినెను? ఎచ్చట బరుండెను? ఏమేమి చెప్పెను? ఆ వనితా రత్నమగు సీత యేమి చెప్పెను? లక్ష్మణు డేమనెను ? అని యడుగ సుమంత్రుడిట్లు చెప్పెను.

"మహారాజా : నీ ప్రాణతుల్యుడగు రామచంద్రుడు,'సుమంత్రా! నా తండ్రి యాత్మవిదుడు, నా కొఱకు నీ వాతనిపాదములు రెంటికిని శిరముతోడ

*చైత్రశుద్ధపంచమి దినము వనవాసప్రయాణము. సప్తమివఱకు సుమంత్రుడు రామాదులతో నుండెను. దశమినాడు సారథి యయోధ్య జేరె. ఆనాడే శ్రీ రాముడు చిత్రకూటము జేరెను.



మరల మరల నమస్కరింపుము. నన్ను గూర్చి చింతింపకుమనుము. తక్కిన వారెల్లరకు నా నమస్కారములు చెప్పి వారి యారోగ్యమును విచారించితి ననుము. నా తల్లి కౌసల్యాదేవికి ప్రత్యేకముగ నా నమస్కారము లర్పించి నా వియోగ దుఃఖముచే తండ్రిని అనాదరణచేయక అతనియం దెప్పటి కంటె నధికముగ నాదరములు గనబఱచి యతని కెల్లవేళల శుశ్రూషాదులు చక్కగ నిర్వర్తించు మనుము. సతికి పతియే గతియని. దేవసమానునిగ నాతని భావించి యతిథి పూజ గావించి ధన్యురాలగునట్లు విన్నవింపుము. సవతియని తన కెగ్గు చేసెనని కైకేయిని నిందింపక ఆమె రాజమాతయని గౌరవించునట్లు హెచ్చరింపుము. భరతుడు చిన్నవాడని యెంచక రాజనువిషయము జ్ఞప్తికి దెచ్చుకొని యతనితో మిక్కిలి గౌరవాదరములు గనబఱచునట్లు చెప్పుము. భరతునితో నిట్లనుము: "నీవు రాజును గౌరవించి యతని యాజ్ఞ శిరసావహించి యువరాజుగ వర్తించి రాజుయొక్క మెప్పు పొందుము. నీ తల్లి నెట్లాదరింతువో యట్లే తక్కిన తల్లుల నాదరింపుము. నా తల్లి తన కొడుకు దగ్గఱలేడని వగచుచుండును. నీ తల్లివలె నామెను బూజించి సంతోషింపజేయుము.

'లక్ష్మణుడు మాత్రము కోపముతో నిట్లనెను. "సూతా! కేవల మాడు దాని మాటలు విని కాముకుడై మాతండ్రి గొప్ప యకృత్యమే చేసినాడు. రాముడు ధర్మవర్తనుడు. అతని నడవికి బంపవలసినంత కారణ మేమున్నది? కైకేయివరములను నెపమున మా తండ్రి గొప్ప నేరము చేసిన వాడయ్యె. అందుచే నే నాతని తండ్రియని భావింప నొల్లను. అతడు ధర్మము తప్పి ప్రవర్తించినాడు. నాకు తోబుట్టువు, స్వామియు, తండ్రియు, సకల విధబంధువును రామచంద్రుడే. సకలలోకప్రియుడగు రాము నడవికి బంపినందున భరతుని కొక్కనికి దప్ప నీ చర్య లోకగర్హితము గాకేమి? లోకు లందఱితో విరోధించి యాత డెట్లు రాజ్య మేలగలడు?"

"మహారాజా! సీతాదేవి శోకముతో నిండి నిరానందముగ నున్నది. ఆ సాధ్వి ఎవరినిగాని పల్లెత్తుమాట యనినదికాదు. కాని మాటిమాటికి రాముని వంక ముఖము త్రిప్పి కన్నీరు గార్చినది. నేను రథమును మరల్చి నపుడా మెబొటబొట కన్నీరు గార్చినది."

దశరథుని జూచి సుమంత్రుడు, 'రాజా : గంగాతీరమున గుహుడు దెచ్చిన. మఱ్ఱిపాలతో రామలక్ష్మణులు జడలు ధరించి ప్రయాణమగునపుడు వారితో పోలేక నే ననేకవిధముల పరితపించితిని గాని చేయునది లేక మరలి వచ్చితిని. చెట్లు చేమలుసైత మీ ప్రాంతమున రామవియోగశోకమున పూలతో లతలతో చిగుళ్లతో నెండిపోయినవి. జలాశయములలో నీళ్ళింకుచున్నవి. తామరలు నీట మునింగినవి. ఉద్యానవనములలో విలాసార్థము సంచరించువారు లేరు. ఎచ్చట జూచినను స్త్రీపురుషులు గుమికూడి మనపాలిటి తండ్రివలె శుభాశుభములందు మనతో కలసి మెలసి సుఖదుఃఖములు పంచుకొను రామచంద్రుడు లేనిచోట నివసించుచున్నామే యింతకంటె దుర్భరస్థితి యుండునా? యని వాపోవుచు' వస్త్రాభరణా ద్యలంకారములు మాని శోకసాగరమున మునిగియున్నారు. ఏనుగులు. గుఱ్ఱములు. పశువులును కన్నీరు గార్చుచు మేతలు మాని శోకించుచున్నవి. పక్షులు చెట్లయందు గూర్చుండి శ్రావ్యముగ పాడుటలేదు: మంగళవాద్యధ్వను లెచ్చటను వినబడవు. అనినంతనే దశరథుడు 'సుమంత్రా! కైక యిట్టి వరము లడిగినపుడు నేను పెద్దలనుగాని. నీ వంటి మంత్రులనుగాని. స్నేహితులనుగాని యాలోచన యడుగలేదు. అందుచే నా కీ దుర్దశ ప్రాప్తమైనది. సూతా! నన్ను రామునొద్దకు గొంపొమ్ము, నే నాతని జూడక క్షణమైన జీవించియుండలేను. హా రామా! హా లక్ష్మణా! హా సీతా!' యని మూర్ఛిల్లె. అంత కౌసల్య శుశ్రూషాదులచే నతని నోదార్చె. సుమంత్రుని జూచి.



**నయ మాం యత్ర కాకుత్స్థ స్సీతా యత్ర చ లక్ష్మణః,**
**తాన్ వినా క్షణమప్యత్ర జీవితుం నోత్సహే హ్యహమ్.**

సూతా : సీతారామలక్ష్మణు లెచ్చట నున్నారో యచ్చటి కిప్పుడే నన్ను గొనిపొమ్ము, వారిని విడిచి నే నిక క్షణమైనను జీవించలేను. రథము నిప్పుడే త్రిప్పుము. నీవు న న్నచ్చటికి గొంపోవకుందువేని నేను యమపురము చేరుదును అని చెప్పిన కౌసల్యను జూచి సుమంత్రుడు చేమోడ్చి, 'అమ్మా! రాముడు నిన్ను విడిచినందుకు దుఃఖమును, రామునకేమి కీడు మూడునోయని మోహమును వదలుము. రాముడు వనమున సుఖముగ నున్నాడు. లక్ష్మణుడు జితేంద్రియుడై యన్నపాదములకు పూజచేయుచు పరలోకప్రాప్తికి దారితీయు చున్నాడు.

**విజనేఽపి వనే సీతా వాసం ప్రాప్య గృహేష్వివ**
**విస్రంభం లభతేఽభీతా రామే సన్న్యస్తమానసా.**

రామునియందే మనసుగల సీతాదేవి వనమందును ఇంటిలో నుండునట్లే భయలేశము లేక రామునియం దత్యంతానురాగము చూపుచున్నది.

ఇచ్చట వనవాస ప్రయాణ సమయమున వనవాసక్లేశము లిట్టివని చెప్పి తనతో రావలదని చెప్పిన భర్త కప్పుడు,

**'సుఖం వనే నివత్స్యామి యథైవ భవనే పితుః,**
**అచింతయంతీ త్రీన్లోకాన్ చింతయంతీ పతివ్రతమ్.**

ముల్లోకములలోని సుఖముల లక్ష్యపెట్టక పతిశ్రూషచేయుచు తండ్రియింటిలో సుఖముగ నుందు నట్లే నీతో నడవిలో సుఖముగ నుండెదను అనినమాట నామె పాటించుచున్నదని చెప్పినట్లు గ్రహింపదగును.

సీత మున్ను నగరసమీప ఉద్యానములలో విహరించినట్లే విజనమగు వనమునను వేడుకతో సంచరించుచున్నది.

* రామునియందే మనసును ప్రాణములనుంచి యుండుటచే వనము నయోధ్యగనే భావించియుండును. మార్గమున గ్రామములనో, పట్టణములనో, నదులనో, వృక్షములనో చూచినపుడెల్ల నది యేమి యిది యేమి యని రాము నైనను లక్ష్మణునైనను అడిగి తెలిసికొనును.

**ఇదమేవ స్మరామ్యస్యా స్సహసైవోపజల్పితమ్,**
**కైకేయీసంశ్రితం వాక్యం నేదానీం ప్రతిభాతి మా,**
**ధ్వంసయిత్వా తు తద్వాక్యం ప్రమాదాత్పర్యుపస్థితమ్,**
**హ్లాదనం వచనం సూతో దేవ్యా మధురమబ్రవీత్.**

గంగను దాటి పోవునపుడు కైకను గూర్చి సీతచెప్పిన మాటలు కొన్నిజ్ఞప్తికి రాగా నవి కౌసల్య కింపుగా నుండునని తలచి మరల నాలోచించి

---

*1. మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥
నాయందు మనసుగలవాడ వగుము, నాభక్తుడవు కమ్ము. నన్ను పూజింపుము. నన్ను నమస్కరింపుము. ఇటులు నన్నే గతిగ నమ్మి మనసు నాయంచే యుంచిన నన్నే పొందగలవు. (భ.గీ.అ.9, శ్లో-34.)

2. మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ॥
నాయందే మనసు గలవారును. నాయందే ప్రాణముగలవారును, నా కథలనే చెప్పుకొనువారును, నా గుణకీర్తనము చేయువారును అగు భక్తులు సదా సంతోషింతురు, ఆనందింతురు. (భ-గీ.అ.10.శ్లో.9.)

3. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥
బుద్ధిని, మనసును నాయందుంచిన, నాయందే ఉందువు-సందేహము లేదు. (భ.గీ.అ.12,శ్లో-8.)



యవి నా కిప్పుడు ప్రాణాంతకములగు నని యెంచి చెప్పరాదని నిశ్చయించి యా మాట లేవియో జ్ఞప్తికి రాలేదని చెప్పి సీతాదేవి శీతవాతాతపములచే నెట్టిమార్పు చెందక నిండుచంద్రునివంటి ముఖకాంతితో, కమలములవంటి నేత్రములు, కరములు, పాదములతో ఎప్పటియట్ల ప్రకాశించుచు ఘల్లు ఘల్లు మనిశబ్దించు అందియలతోను ఆమెకు ప్రేమగూర్చు తక్కిన యాభరణములతోను ప్రకాశించుచున్నది.

**గజం వా వీక్ష్య సింహం వా వ్యాఘ్రం వా వనమాశ్రితా।**
**నాహారయతి సంత్రాసం బాహూ రామస్య సంశ్రితా॥**

రాముని బాహువులను రక్షకముగా గొని సీతాదేవి అడవియందలి భయంకరములగు గజ సింహ వ్యాఘ్రాదుల జూచి కొంచెమైనను భయపడదు. (ఇందువలన భగవదాశ్రయముగల వారెన్నడు భయపడరు. 'న వాసుదేవభక్తానా మశుభం విద్యతే క్వచిత్' వాసుదేవుడే జగద్రక్షకుడని యతనియందు భక్తి నెరపువా డెన్నడు ఎట్టి కష్టముపాలుగాడని విస్పష్టమగుచున్నది.) అమ్మా! సీతారామలక్ష్మణులు పురమువిడిచి యరణ్యమున పలుకష్టము లనుభవించుచున్నారనిగాని, రాజు వారి నట్టి దుర్గతిపాలు చేసెననిగాని, నీవిట్లు పుత్రు నెడబాసియుండవలసివచ్చెనే యని గాని యెంత మాత్రము దుఃఖింపకుము. పితృవాక్య పరిపాలనముచే రామచంద్రుడును. పతివ్రతాధర్మము ననుష్ఠించుటచే సీతాదేవియు, భ్రాతృ భక్తిచే నిండి కైంకర్యమే మోక్షమని బ్రహ్మచర్యవ్రతము నెరపుచుండు లక్ష్మణుడును లోకమున శాశ్వతకీర్తి సంపాదించి ఋషులవలె సర్వసంగపరిత్యాగముచేసి యిహపరములకు తగురీతిని వర్తించుచున్నారని చెప్పు. నా మాటలు విని దుఃఖ ముడుగుము అని యెన్ని విధముల నోదార్చినను కౌసల్య 'నా ముద్దుబిడ్డా! రామా! రాఘవా!' యని యరచుచుండె.

ఇచ్చట సుమంత్రుని దౌత్య మెట్టిదో పరిశీలింతము. రామచంద్రుడు గంగాతీరమున సుమంత్రునితో ఎవ రెవరితో నెట్లు చెప్పునట్లాజ్ఞాపించెనో యట్లే వారివారితో చెప్పుటయేగాక దేశకాలము లెరింగి దుఃఖమున మునుగు కౌసల్యా దశరథుల కెట్టి అధైర్యముగాని కలిగింపక ధైర్యము దిటవు కొల్పునట్లు సందేహము వీడునట్లును సందేశములను జెప్పుట శ్లాఘ్యము. అంతియగాదు. సీతాదేవి కైకనుగూర్చి ఏమోచెప్పెనని ప్రారంభించి యింతలో తానట్లు చెప్పిన కౌసల్యకెట్టి ప్రాణసంకటము గలుగునోయని యూహించి తానావిషయమును మరచినట్లు సవరించుకొనిన విధము ఉత్తమ దౌత్య నిర్వహణమును వెల్లడించుచున్నది.

ఇచ్చట దూతయొక్క లక్షణ మెట్లుండవలెనని హనుమంతుడు తలచెనో స్మరింతము. హనుమంతుడు లంకను చేరి సముద్రమును దాటుటకై యెత్తిన గొప్ప రూపముతో సీతాదేవిని వెదకుటకు సాధ్యము కాదని రావణునికంట బడకుండ తనకార్యమును నిర్వహించుటకై తాను చిన్న రూపమును గైకొనవలెనని నిశ్చయించు సందర్భమున నిట్లనెను.

**భూతాశ్చార్థా విపద్యంతే దేశకాలవిరోధితాః।**
**విక్లబం దూతమాసాద్య తమస్సూర్యోదయే యథా॥**
**అర్థానర్థాంతరే బుద్ధిర్నిశ్చితాపి న శోభతే।**
**ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః॥**

ఒక కార్యమును చేయుటకు మునుపే దానినెట్లు చేయవలెనని వివేకముతో సాధక బాధకముల నాలోచించిచేయుట యుక్తము. మంచి యుపాయములచే నించు మించుగా సఫలమైనట్లుండు కార్యములు గూడ నవివేకియగు దూత నుపయోగించుటచే దేశకాలవిరోధములచే సూర్యోదయముచే నశింపబడు చీకట్లవలె వినాశమొందును. రాజు



బుద్ధిమంతులగు మంత్రులతో నాలోచించి నిశ్చయించినట్టి కార్యములు గూడ వివేకహీనులగు దూతలపాలబడి చెడుటయే గాక యజమానున కప్రతిష్ఠ గలిగించును. ఏలన తమ్ము పండితులుగా భావించు మూర్ఖులగు దూతలు కార్యహాని కలిగింతు రనుట నిజము.

సుమంత్రుడు దశరథునకు మంత్రిగను, సారథిగను, స్నేహితుడుగను, శ్రేయోభిలాషిగను నుండి రామచంద్రునకు పరమభక్తుడై, దాసుడై, భృత్యుడై, పరమభాగవతుండిట్లుండునని తన యనుష్ఠానముచే నితరులకు మార్గదర్శియయ్యెనని ముమ్మాటికి శ్లాఘింపనగును.

# అరాజకదోషము

దుందుంభి సంవత్సరము చైత్రశుద్ధ దశమి శ్రీరామాదులు చిత్రకూటము చేరిరి. ఆ దినము సాయంకాలము సుమంత్రు డయోధ్యకు చేరెను. ఆనాటి యర్ధరాత్రమున దశరథుడు రామవియోగ దుఃఖమున మరణించెను. కౌసల్యాదుల విలాపములతో ఏకాదశినాడు మృతకళేబరమును తైలద్రోణియం దుంచునప్పటికి సాయంతన మయ్యెను. ఆ రాత్రియు ఆక్రందనాదులతో గడచెను. ద్వాదశినాటి యుదయమున.

**మార్కండేయోఽథ మౌద్గల్యో వామదేవశ్చ కాశ్యపః।**
**కాత్యాయనో గౌతమశ్చ జాబాలిశ్చ మహాయశాః॥**

మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, మిక్కిలి కీర్తిమంతుడగు జాబాలియు మంత్రులతోడ జేరి రాజపురోహితాగ్రేసరుడగు వసిష్ఠుని జూచి వేరు వేరుగా 'పుత్ర శోకముచే మన రాజు మరణించుటం జేసి యీ రాత్రి నూరు సంవత్సరములవలె అతికష్టమున గడచినది. రాజు స్వర్గస్థుడాయెను.' రామచంద్రు దరణ్యమున కేగెను. లక్ష్మణుడు నతని వెంబడించె. పరంతపులగు భరత శత్రుఘ్నులు కేకయదేశమున అతిరమణీయమగు రాజగృహమను పట్టణమున మాతామహుని యింటనున్నారు. రాజులేని రాజ్యము నాశ మొందకుండుటకై ఇక్ష్వాకు వంశస్థులలో నొకరిని రాజుగా నేర్పాటు చేయవలెను. రాజు లేని రాజ్యమున పర్జన్యదేవత ఉరుములు మెరుపులతో మేఘముల మూలమున అమృతతుల్యమగు వర్షమును భూమిమీద వర్షింపడు. ఏల యనిన-

**అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః।**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః॥**



**కర్మబ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్।**
**తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్॥**

అన్నము వలన ప్రజలు పుట్టుచున్నారు. ధాన్యాదుల రూపమగు అన్నము వానవలన గలుగుచున్నది. అట్టి వర్షము దేవతా ప్రీతికరమగు యజ్ఞము (ఆరాధనము) వలన గురియుచున్నది. అట్టి యజ్ఞము బ్రహ్మముచే (ప్రకృతి పరిణామ రూపమున శరీరముచే, గలిగినదిగ దెలిపికొనుము, బ్రహ్మ (ఆశరీరము) అక్షరమని చెప్పబడు జీవాత్మ వలన గలిగిన దనియు దెలిసికొనుము. కనుక నంతట నుండు శరీరము సదా యజ్ఞమందే యున్నదని అనగా యజ్ఞమున కాధారమైనదని గ్రహింపుము. ఇట్టి జగచ్చక్రము ననుసరించుటే ధర్మమని దాని ననుసరింపకుండుటే నరకమునకు మార్గమని ప్రజలకు హితము బోధింపజేయు రాజులేని రాజ్యమున ధర్మనాశమగుటచే సకాలమున వర్షము గురియక పాడిపంటలు లేక, అన్నపానాదులకు కొరత యేర్పడునని భావము. ఇట్లే ఆండాళ్ అను గోదాదేవి అనుగ్రహించిన 'తిరుప్పావై' యను గ్రంథమున 'తీజ్గిన్టినాడెల్లామ్ తింగళ్ ముమ్మారి పెయ్‌దు' అనగా-దేశమంతట ధర్మమనుష్ఠింపబడుటచే నెలకు మూడు పర్యాయములు వానలు కురియుటచే దేశమందంతట ధన ధాన్య సమృద్ధియు, పాడిపంటల యుత్పత్తిచే ప్రజ లాయురారోగ్యైశ్వర్యములతో సంతోషింతురని చెప్పబడినది. ఇట్టి సకల ధర్మాచరణముల సక్రమముగ జరిపించు రాజు లేనిచో రాజ్యము పలుకష్టములకు లోనగుననుట సూచితము.

**నారాజకే జనపదే బీజముష్టిః ప్రకీర్యతే।**
**నారాజకే పితుః పుత్రో భార్యా వా వర్తతే వశే॥**

కష్టపడి పైరుచేసినను, కోతకోసిన ధాన్యమును దొంగల పాలు గాక భద్రముగ నింటికి గొనిపోవ నేరమను భయముచే కాపులు విత్తనము చల్లరు. నీతి మార్గము దప్పినవారు దండింపబడుదురను భయము లేకుండుటం

బట్టి పుత్రులు తండ్రుల కణగిమణగి యుండరు. స్త్రీలు తమతమ భర్తలననుసరించి యుండరు.

**నారాజకే ధనం చాస్తి నాస్తి భార్యాఽప్యరాజకే।**
**ఇదమత్యాహితం చాన్య త్కుత స్సత్యమరాజకే॥**

రాజులేని రాజ్యమున మగవారి కిది నాధనమని యిది నా భార్యయని నిశ్చింతగ చెప్పుకొన వీలులేదు. ఏ సమయమున నెట్టి దుర్మార్గుడు ధనమునే యపహరించునో, భార్యనే యపహరించునో యెవ్వడెరుగును? ఒకరి సొత్తు నపహరించు వానిని, ఒకని భార్య నపహరించువానిని దండించు వారుండరు గనుక దేశమున సత్య మనుమాటయు నుండదు. ఇక శౌచ మెక్కడిది? ఆచార మెక్కడిది?

**నారాజకే జనపదే కారయంతి సభాం నరాః।**
**ఉద్యానాని చ రమ్యాణి హృష్టాః పుణ్యగృహాణి చ॥**

భూమిని పాలించు రాజులేనందున ఎవరి యిష్టానుసారము వారు దౌర్జన్యముగ ప్రవేశించి చెట్లు చేమల నరకివేయుదురను భయముచే ఉద్యానవనములు పెట్టి వృద్ధిచేయరు. నీచులు బలాత్కారముగ బ్రవేశించి యపరిశుద్ధము చేయుదురను భయముచే దేవాలయములు నిర్మింపరు. దిగులు, విచారము గలుగుటచే మనసు కుదురుపాటు చెందని కారణమున జనులు సద్విషయముల గూర్చి చర్చించుటకై సభలు జరుపరు. అట్లు జరిపినను దుష్టులచే ఆ సభలు విఘ్నములు గావింపబడి శాంతవాతావరణముతో ముగియవు.

**నారాజకే జనపదే మహాయజ్ఞేషు యజ్వనః।**
**బ్రాహ్మణా వసుసంపన్నా విసృజంత్యాప్తదక్షిణాః॥**

రాజు లేని రాజ్యమున సొంతముగ జరుగునను నమ్మక మెంత మాత్రము లేనందున బ్రాహ్మణులు యజ్ఞాదులు చేయ బూనుకొనరు. యాగాది క్రతువు



లొకవేళ వారు చేసినను తాము ధనవంతులయ్యు నాప్తదక్షిణలు విరివిగ నియ్యగలిగియు తాము ధనికులని దెలిసినంత కొల్లగొట్టుదురను భయముచే భూరి దక్షిణల నొసంగరు. ఇట్టి యాగాదులు దేశక్షేమమునకని భావించువారు అరుదు.

**నారాజకే జనపదే ప్రభూతనటనర్తకాః।**
**ఉత్సవాశ్చ సమాజాశ్చ వర్ధంతే రాష్ట్రవర్ధనాః॥**

ఆరాజకమగు దేశమున ప్రోత్సహించువారును, పోషకులు లేని కారణమున భరత నాట్యముతోను, నృత్యగీత వాద్యములతోను జనాకర్షకమగు దేవోత్సవములును పుణ్య తీర్థయాత్రలును రాష్ట్రాభివృద్ధికరములైనను వర్ధిల్లవు. అనగా కళాపోషకులు లేక కళలు నశించునను భావము తెలియుచున్నది.

**నారాజకే జనపదే సిద్ధార్థా వ్యవహారిణః।**
**కథాభిరనురజ్యంతే కథాశీలాః కథాప్రియైః॥**

రాజు లేని రాజ్యమున దాయభాగాది వ్యవహారములను గాని, క్రయ విక్రయాదుల వలన జీవించువారికి గలుగు చిక్కులను గాని, లంచగొండితనము లేక న్యాయముగ పరిష్కరించువారు లేకుండుటంబట్టి ప్రజ లనేక కష్టములకు లోనుగావలసియుండును. ఇతిహాస పురాణకథలు రసవంతముగ జెప్పగలవారును, అట్టి కథలు వినుటయం దత్యంతాదరము గలవారును, అట్టి కథలకు దగిన పారితోషకము లిచ్చి కథల జెప్పించెడివారు లేనందున వారి వారి కోరిక లీడేరకుండును. ఇట్టి సత్కథా కాలక్షేపములు విరివిగ జరుగుచుండు రాజ్యములోని ప్రజలు నీతి నియమములు పాటించి, సదాచారపరాయణు లగుటచే రాజ్యమున శాంతి ప్రబలియుండుననుట సిద్ధించుచున్నది,

**నారాజకే జనపదే ఉద్యానాని సమాగతాః।**
**సాయాహ్నే క్రీడితుం యాంతి కుమార్యో హేమభూషితాః॥**

పాలకుడు లేని దేశమున చోరుల భయము వలన యువతీమణులు బంగారు నగలతో సింగారించుకొని చెలికత్తెల గూడి సాయంకాలమున ఉద్యానవనములలో వినోదార్థము విహరింప సాహసింపరు. కాముకులగు యౌవన దంపతులు వాహనముల నెక్కి పురము వెడలి పుష్పాపచయము చేయుచు సమీపమున నున్న వనములందు విహరింపరు.

**నారాజకే జనపదే ధనవంతస్సురక్షితాః।**
**శేరతే వివృతద్వారాః కృషిగోరక్షజీవినః॥**

**కృషిగోరక్షవాణిజ్యం వైశ్యం కర్మస్వభావజమ్ భగవద్గీత-18.44**

పైరుపెట్టుట, పశువులనుగాపాడుట, క్రయవిక్రయ రూపమగు వ్యాపారము చేయుట వైశ్యుల స్వభావసిద్ధమగు కర్మయగుటచే ఆ విధముగ విశేషధన మార్జించిన వైశ్యులు చోరభయముచే రాత్రులందు వాకిళ్ళు తెరచి నిద్రింపరు.

ఇందువలన నిర్భయముగ రాత్రులందు వాకిళ్ళు తెరచి జనులు పూర్వము నిద్రించుచుండిరని తెలియుచున్నది. అట్టి కాల మొకటి యుండెనా యను సందేహము గలుగవచ్చును. మన దేశ చరిత్రముననే అట్టి పాలకులు మనదేశమం దుండిరని చదివియున్నాము. గ్రామమున నొక దొంగతనము జరిగిన ఆ నష్టము గ్రామాధికారి కట్టవలెనని రాజాజ్ఞయట. అందు కొరకు గ్రామాధికారి రాత్రిపూట గ్రామ తలారిని గ్రామము చుట్టు తిరుగునట్లును, చౌర్యము జరిగిన దానిని గనిపెట్టునట్లును కట్టుదిట్టములు చేయుచుండెనని తెలియుచున్నది.

రాజు లేని నగరమున దీర్ఘమగు దంతములు గల అరువది సంవత్సరముల వయస్సుగల యేనుగులు ఘంటాశబ్దములతో రాజమార్గమున సంచరింపవు. ఏనుగు లుండుట దేశసంపదను, పాలకులయధికారమును గౌరవమును జాటును. అస్త్రశస్త్రాభ్యాసములు చేయువారు చేతులతో తివియు అల్లె త్రాటి చప్పుడు వినబడదు. ఇందువలన అట్టి వీరులు సైతము పలు చిక్కులకు లోనై నిశ్చింతతో తమ తమ అభ్యాసములు సలుపరని తెలియుచున్నది. ఆ కాలమున ధనుర్బాణములే ముఖ్యములగు ఆయుధములని యేర్పడుచున్నది. దేశ సంరక్షణ కొరకట్టి అభ్యాసము లావశ్యకములని సూచితము.



**నారాజకే జనపదే వణిజో దూరగామినః।**
**గచ్ఛంతి క్షేమమధ్వానం బహుపణ్యసమాచితాః॥**

ప్రజల సుఖ జీవనమున కుపయోగములగు వస్తువులన్నియు నొక్కచోటనే లభింపవు. సరకులను దూరదేశములకు గొంపోవుట ముఖ్యము. ఆ కాలమున నిప్పటి వలె రైలు మార్గములు లేవు. రాచబాటలలోను. ఇతర మార్గములలోను బేహారులు సరకులు గొంపోవుట వాడుక. అట్టి వారు సురక్షితముగ గమ్యస్థానములు చేరరు. మార్గమున దొంగలచే దోపిడిపాలై దెబ్బలు తినవలసియుండును. జితేంద్రియులగు సన్న్యాసులు ఒంటరిగ తిరుగుచు నెచ్చట ప్రొద్దుగ్రుంకునో యచ్చటనే పండుకొనవలసినవారైనను అన్నము పెట్టువారు గలచోటి కరుగవలసి వచ్చుటచే నెమ్మదిగ పరమాత్మను స్మరించుచు సంచరింప వీలుకాదు.

**నారాజకే జనపదే యోగక్షేమం ప్రవర్తతే।**
**న చాప్యరాజకే సేనా శత్రూన్విషహతే యుధి॥**

యోగమనగా లేనివస్తువుల సంపాదించుట, క్షేమమనగా సంపాదించిన వస్తువులను గాపాడుకొనుట. రాజు లేని రాజ్యమున ఈ రెండును దుర్లభాలు. తగిన సేనా నాయకుడు లేనందున శత్రువుల నెదుర్కొనిన సైన్యము వారిచే

పరాభవింపబడును. ప్రజలు మిక్కిలి సంతోషముతో ఉత్తమాశ్వములను, రథములను, నితర వాహనముల నెక్కి వారి వారి యిష్టానుసారము సంచరించుటకు, చోరభయమువలన సాహసింపరు.

**నారాజకే జనపదే నరాశ్శాస్త్రవిశారదాః।**
**సంవదంతోఽవతిష్ఠంతే వనేషూపవనేషు చ॥**

అరాజకరాష్ట్రమున సకల శాస్త్ర విద్యాపారంగతులు మునులుండు వనములకు బోయి శాస్త్ర చర్చలు చేయనెంచియు, దుష్టజనులకు భయపడి విరమించుకొందురు.

**నారాజకే జనపదే మాల్యమోదకదక్షిణాః।**
**దేవతాభ్యర్చనార్థాయ కల్ప్యంతే నియతైర్జనైః॥**

సంరక్షకుడు లేనందున ప్రజలు దేవతార్చనము కొరకు పూలమాలలు నైవేద్య వస్తువులు కానుకలు గొని దేవాలయముల కేగ వెరతురు.

**యథాహ్యనుదకా నద్యో యథా వాఽప్యతృణం వనమ్।**
**అగోపాలా యథా గావః తథా రాష్ట్రమరాజకమ్॥**

నీళ్లులేని యేళ్లును, పచ్చికలేని వనమును, కాపరిలేని గోవులును ప్రకాశింపకుండునట్లే రాజు లేని రాజ్యమును ప్రకాశింపదు,

**ధ్వజో రథస్య ప్రజ్ఞానం ధూమో జ్ఞానం విభావసోః।**
**తేషాం యో నో ధ్వజో రాజా స దేవత్వమితో గతః॥**

రథమునకు పతాకమే ప్రకాశమగు చిహ్నము. అగ్నికి పొగ ప్రకాశమగు గురుతు. అట్లే మనకందరకు రాజు రక్షకుడగు గురుతు. అట్టి రాజిప్పుడు మనల వీడి స్వర్గస్థు డాయెను.

**నారాజకే జనపదే స్వకం భవతి కస్యచిత్।**
**మత్స్యా ఇవ నరా నిత్యం భక్షయంతి పరస్పరమ్॥**



రాజు లేని రాజ్యమున ఇది నా సొత్తని యెవరును చెప్పలేరు. బలవంతులదే సొత్తు. పెద్ద చేపలు చిన్న చేపలను మ్రింగుట తెలిసినవిషయమే. అట్లే మానవులలోను బలవంతులు బలహీనుల జంపుదురు.

**యే హి సంభిన్నమర్యాదా నాస్తికాశ్ఛిన్నసంశయాః।**
**తేఽపి భావాయ కల్పంతే రాజదండనిపీడితాః॥**

శాస్త్రముల ననుసరించి వాదించుట మాని, దేవుడు లేడని వాదించు నాస్తికులు తమ్ము దండించు రాజు లేడని నిస్సందేహముగ నిర్భయముగ తమ దుష్ప్రచారము విచ్చలవిడిగ సాగింతురు.

**యథా దృష్టిశ్శరీరస్య నిత్యమేవ ప్రవర్తతే।**
**తథా నరేంద్రో రాష్ట్రస్య ప్రభవస్సత్యధర్మయోః॥**

కన్నులు శరీరమునకు క్రమమగు మార్గమునుజూపి చెడుమార్గమునుండి తప్పించి శరీరమునకు సుఖము గలిగించును. అట్లే రాజ్యములోని ప్రజలకు రాజు సాధు సమ్మతమును, శాస్త్రసమ్మతమునగు సత్యము ధర్మము తప్పని సన్మార్గమును తన యనుష్ఠానము చేతను న్యాయశాస్త్రము చొప్పునను బోధించువాడు; ఆచరింప జేయువాడు.

**రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులమ్।**
**రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణామ్॥**

రాజు లేనిచో సత్య మనుష్ఠింపబడదు, అందుచే రాజే సత్యమగును. గొప్ప రాజు లేనిచో ధర్మ మనుష్ఠింపబడదు. అందుచే రాజే ధర్మమగును. గొప్ప కులమున బుట్టినవారి కా గౌరవమిచ్చువాడు రాజే. తల్లియెట్లు తన బిడ్డల కొరతనెల్ల దీర్చునో రాజట్లు తన ప్రజల యభీష్టముల నిచ్చును. కావున రాజు తల్లివంటివా డనుట యుక్తమే. తండ్రి తన బిడ్డల పురోభివృద్ధి

ననుసరించి యెట్టి కట్టుదిట్టములతో బిడ్డల రక్షించుచు, వారిని సన్మార్గమున ప్రవర్తింపజేయునో యట్లే రాజు తన రాజ్యమందలి ప్రజల పురోభివృద్ధికి తగు కార్యములు చేసి వారిని సన్మార్గావలంబకులుగ జేయుటచే రాజు తండ్రికి సమానుడని చెప్పుట సమంజసమే. ప్రియము హితమను రెండింటిని గూర్చి విచారింతము. అప్పటి కప్పుడు సంతోషపరచుట, ప్రియముగూర్చుట యగును. అప్పటికి ప్రియమైనను వెనుక స్థిరమగు మేలు గూర్చునది హితము గావించుట యగును. కనుక రాజు ప్రజల కప్పుడు ప్రియముగాకున్నను వెనుకటి మేలును గోరి చేయు కార్యములు హితకరములగును. ప్రజాశ్రేయోభిలాషియే రాజు.

**వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః।**
**ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి॥**

ప్రజలకు దుఃఖము గలిగినపుడు రామచంద్రుడు మిక్కిలి దుఃఖించును, వారికి పుత్రోత్సవాది శుభము లొనగూడినపుడు తండ్రివలె మిక్కిలి సంతోషించును అని రాముని పట్టాభిషేకమును గూర్చి దశరథుడు ప్రశంసించినపుడు ప్రజలిట్లుచెప్పిరి. ఇందువలన రాజు ప్రజల యోగక్షేమములను గమనించుటచే నతడే సర్వకాల సర్వావస్థలయందును తానే ప్రజలని, ప్రజలే తానని భావించి తనకును ప్రజలకు నణుమాత్రము భేదము పాటింపడు.

**యమో వైశ్రవణశ్శక్రో వరుణశ్చ మహాబలః।**
**విశేష్యంతే నరేంద్రేణ వృత్తేన మహతా తతః॥**

దక్షిణ దిగధిపతి యగు యముడు దండనము మాత్రమే చేయును, ఉత్తర దిగధిపతియగు కుబేరుడు ధనము మాత్రమిచ్చును. తూర్పుదిక్కునకు అధిపతియగు ఇంద్రుడు పాలనము మాత్రము సేయును. పశ్చిమదిక్కునకు



అధిపతియగు వరుణుడు సదాచారము మాత్రము గుదుర్చును. రాజన్ననో, యమాదులగు నలువురు చేయు కార్యములను తా నొక్కడే చేసి పరాక్రమముతో మెరయు శ్లాఘ్యమగు నడవడియే భూషణములుగా గలవాడై లోకము పొగడునట్లు ప్రజారక్షణ చేయుచు పాలించి యీ నలుగురు దేవతలను మించిన వాడనబడును.

**అహో తమ ఇవేదం స్యాన్న ప్రజ్ఞాయేత కించన।**
**రాజా చేన్న భవేల్లోకే విభజన్ సాధ్వసాధునీ॥**

ఇది తగును ఇది తగదని వేరువేరుగ విభజించి పద్ధతుల నేర్పరచి సాధువులను రక్షించి దుష్టులను శిక్షించి సక్రమముగ పాలించు రాజులేని పక్షమున లోకమంతయు అజ్ఞానాంధకారమున మునుగును.

**జీవత్యపి మహారాజే తవైవ వచనం వయమ్।**
**నాతిక్రమామహే సర్వే వేలాం ప్రాప్యేవ సాగరః॥**

మహారాజు జీవించియుండినపుడు, 'మేము చెలియలికట్టను సముద్రము దాటకుండునట్లు నీ యాజ్ఞను మీరక వర్తించు చుంటిమి. ఇక రాజు గతించిన పిదపను నట్లే వర్తింతుమని చెప్పనేల?'

**స నస్సమీక్ష్య ద్విజవర్యవృత్తం నృపం వినా రాజ్యమరణ్యభూతమ్।**
**కుమారమిక్ష్వాకుసుతం వదాన్యం త్వమేవ రాజానమిహాభిషించ॥**

విప్రోత్తమా! ఇట్టి పరిస్థితిలో రాజును స్థాపించుట మన ధర్మమనియు, రాజు లేనంతట రాజ్య మడవివంటిదే యనియు, అరాజకదోషమువలని వినాశముల గుర్తించియు ఇక్ష్వాకు సంతతిలో నొకని రాజుగ నభిషేకింపుమని ప్రార్థించిరి. వారల మాటచొప్పున వసిష్ఠుడు మంత్రులతో నాలోచించి రాజే భరతునకు రాజ్యమిచ్చియుండుటంజేసి భరత శత్రుఘ్నుల దోడ్కొని వచ్చుటకై దూతల బంపెను.

## యౌవరాజ్య పట్టాభిషేకము

**పురా భ్రాతః పితానస్యః మాతరం తే సముద్వహన్।**
**మాతామహే సమాశ్రౌషీద్రాజ్యశుల్కమనుత్తమమ్॥**

చిత్రకూటమున భరతుడు రామచంద్రుని మరలివచ్చి పట్టాభిషేకము చేసికొని అయోధ్యనేలుమని ప్రార్థించినపుడు రాముడిట్లు చెప్పెను, 'భరతా! మనతండ్రి నీ తల్లిని వివాహమాడుటకు ముందు నీ మాతామహుడగు కేకయరాజు తన కూతునకు బుట్టు కుమారునకు రాజ్యాభిషేకము చేయవలెనని కోరగా నట్టి కన్యాశుల్కమున కొప్పుకొని నీ తల్లిని వివామామాడెను.' (వాల్మీకి శ్రీరాముని మూలమున నప్పు డచ్చుట నీ విషయమును బయలుపరచెనే గాని వే రెచ్చుటను నీ ప్రశంస చేయలేదు) దీనిని గురించి యొకింత పరిశీలింతము.

ఎన్ని యసత్యములు పలికియైన నొక్క పెండ్లి చేయించుట ముఖ్యమను లోకోక్తి ననుసరించి వివాహకాలమున చెప్పు మాటలకు ప్రాముఖ్యమియ్యం బనిలేదందుమా? ఇది సామాన్యుల మాట. రఘువంశమునకును, కేకయ రాజవంశమునకును గలుగు వివాహసంబంధములోని మాటను కన్యాశుల్కవిషయమును చులుకనచేయుట యుక్తముగాదు. ఎట్టిసందర్భమునగాని ఏ కారణమును బట్టిగాని తండ్రిమాట వమ్ము గాకూడదు. పితృవాక్య పరిపాలకుడగు రామచంద్రుడెట్లు యువరాజ్యపట్టాభిషేకమున కొప్పుకొనెను? దశరథుడేల తన వాగ్దానము పాటింపకుండెను? వసిష్ఠుడు, సుమంత్రుడు మున్నగు వారలకీ విషయము

గమనిక: ఆ కాలమున రాజుల కెట్టి ప్రాధాన్యముండెనో వారెట్లు ప్రజాహిత కార్యములే చేసిరో యట్లే ఇప్పటి ప్రజాప్రభుత్వసంస్థలును ప్రభుత్వములోఉన్నత స్థానము లలంకరించు వారును కేంద్ర రాష్ట్ర శాసనసభలలోని వారును అల్ప సంఖ్యాకుల కష్టముల గుర్తించి దేశౌన్నత్యమే ముఖ్యమని యెంచి శక్తి వంచన లేక పాటుపడుట ధర్మమని గుర్తింపనగును.



తెలియకుండునా? తెలిసి వారెట్లు నమ్మతించిరి? కైకేయి వివాహమునకు పూర్వమే జరిగియుండు నిర్ణయము విడిచి వరముల ప్రశంస చేయవలసిన యగత్యమేమి? యను ప్రశ్నలు రావచ్చును. యువరాజ్యపట్టాభిషేకమున కంగీకరించిన వారి కీర్తి కెట్టి లోటురాని విధమును పరిశీలింతము.

కైకేయీ దశరథుల వివాహవిషయము గనుక రామచంద్రునకీ కన్యాశుల్క విషయమును దశరథు డేదో యొక తరుణమున చెప్పియండ వలెను. వివాహమునకుగాను చెప్పెడు మాటలనట్లే పాటింప నక్కరలేదను విషయము కేకయ రాజునకు తెలియనిది కాదు. అట్లు తెలిసియుండిన తన కూతునకు పుట్టు కుమారునకు రాజ్యము వచ్చునను నమ్మకము లేదని కేకయరాజు తన కూతును దశరథున కిచ్చి యుండ డనియే చెప్పవలెను. అదియు గాక అప్పటికే దశరథునకు పట్టమహిషియగు కౌసల్యాదేవి యుండుటంబట్టి యామె కుమారునకే పట్టము సిద్ధమని తెలియదా? అట్లు తెలిసియు పుత్రికనేల దశరథున కిచ్చెను? దశరథుడు సత్యసంధు డనియు మహావంశసంభూతుడని మాట తప్పడని కైకేయి కుమారునకు తప్పక రాజ్యమిచ్చునని నమ్మి కన్యాదానముచేసినాడన వలెను. అట్లయినచో నొకేరాజ్యము నిరువుర కిచ్చుటయెట్లు? అని పర్యాలోచించి చూచిన దశరథు డయోధ్యారాజ్యమునే యిచ్చెదనని చెప్పియుండుటకు వీలులేదు. కౌసల్యాతనయుని దాసుడుగ గైకేయి సుతుడుండ నక్కరలేదని యతనికి వేరొక రాజ్యమునిచ్చి గౌరవించెదనని చెప్పియుండ నొప్పును. ఈ రహస్యము నెరిగినవా డగుటచే రామచంద్రుడు యువరాజ్యపట్టాభిషేకమున కొప్పుకొని యుండవలెను. ఈ కారణమును బట్టియే వసిష్ఠుడు సుమంత్రుడు మున్నగు వారు అందుకు సమ్మతించియుండవలెను. కైకేయియు చిరకాలమునకు ముందు జరిగిన కన్యాశుల్కవిషయమును మరచినదని చెప్పవచ్చును. అటు గానిచో సన్నిహితముగ జరిగిన దేవాసుర సమర సమయమున నిచ్చిన

వరద్వయము నడుగ మరచినందున మంథర వరముల విషయమును జ్ఞప్తికితేవలసి వచ్చెనుగదా! మరియొకపక్షమేమనిన * వివాహకాలమున చెప్పిన మాట కంటెను వరద్వయ మిచ్చిన సమయము చాల ముఖ్యమైనందున వీనిచే దశరథుని బంధించెనని చెప్పవచ్చును.

శ్రీరామ యౌవరాజ్య పట్టాభిషేక ప్రయత్నము సర్వసమంజస మనుట కనేక ప్రబలకారణములు గలవు. మొదటిది శ్రీరాముడు దశరథుని కుమారులలో జ్యేష్ఠుడు. అతడు పట్టమహిషియగు కౌసల్యానందనుడు. లోకమున జ్యేష్ఠ కుమారుడే రాజగుట యాచారము. ధర్మ మార్గమునే యనుసరించు ఇక్ష్వాకు వంశమువారి పారంపర్యానుభవము నట్టిదే. నిండు సభలో దశరథుడు–

**వృద్ధికామో హి లోకస్య సర్వభూతానుకంపనః।**
**మత్తః ప్రియతరో లోకే పర్జన్య ఇవ వృష్టిమాన్॥**

లోకము యొక్కయభివృద్ధిని కోరువాడును, అందరియెడ దయగలవాడును అగు నా కుమారుడు రామచంద్రుడు వర్షించుచుండు మేఘము వంటివాడు. లోకులయెడ నాకంటె నెక్కువ ప్రీతిపాటించువాడు. (వృద్ధికామః, అనుటచే అపూర్వమగు ఐశ్వర్యమునిచ్చు వాడనియర్థము 'పర్జన్య ఇవ వృష్టిమాన్' అనుటచే నతడు ప్రజల సకలవిధతాపముల బోగొట్టువాడనియు, దాతృత్వమునకు ప్రసిద్ధుడనియు సూచితము.)

'యౌవరాజ్యేనియోక్తాస్మి ప్రీతఃపురుషపుంగవమ్' పురుష శ్రేష్ఠుడగు నా పెద్దకుమారునకు రాజ్యాభిషేకము చేసెదను అనినతోడనే ప్రజలు

*ఉద్వాహకాలే రతిసంప్రయోగ ప్రాణాత్యయే సర్వధనాపహారే।
విప్రస్య చార్థేప్యనృతం వదేయుః పంచానృతాన్యాహురపాతకాని॥

వివాహకాలముననును, ప్రాణ విత్త మానభంగ సమయములందును, బ్రాహ్మణుని రక్షించుట యందును బొంకుట దోషముకాదు.



**ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీరం మహాబలమ్।**
**గజేన మహతాఽఽయాంతం రామం ఛత్రావృతాననమ్॥**

గొప్ప బలముగలవాడును, నిడుదలగు భుజములు గలవాడును, రఘు వంశ శ్రేష్ఠుడునగు రామచంద్రుని శత్రుంజయ మనుపట్టపుటేనుగుమీద గూర్చుండ తెల్లనిగొడుగుచే మరుగు పరచబడిన ముఖముగలవానిని మే మందరము చూడగోరుచున్నాము.

**తం దేవదేవోపమమాత్మజం తే సర్వస్య లోకస్య హితే నివిష్టమ్।**
**హితాయ నః క్షిప్రముదారజుష్టం ముదాఽభిషేక్తుం వరద త్వమర్హసి॥**

మా యిష్టార్థముల నిచ్చు దశరథుడా! విష్ణువునకు సాటిగ నుండువాడును. సకల లోకమునకు మేలు చేయుటలో జాగరూకుడుగనుండువాడును, ఔదార్యము గలవాడునగు నీ పుత్రునకు మా మేలు కొరకు శీఘ్రముగ సంతోషముతో పట్టాభిషేకము చేయుము అనిరి. ఇందువలన దశరథుని న్యాయసమ్మతమగు కోరిక మాత్రమే గాక ప్రజాభిప్రాయప్రాశస్త్యమును వెల్లడియగుచున్నది.

**విప్రోషితశ్చ భరతో యావదేవ పురాదితః।**
**తావదేవాభిషేకస్తే ప్రాప్తకాలో మతో మమ॥**

రాము డీ విషయమును గూర్చి యింత తొందర యేల యనునో యని యూహించి దశరథుడు తనకు గలిగిన * దుస్స్వప్నముచే దనకు మరణము సమీపించుచుండుటను జ్యోతిశ్శాస్త్రజ్ఞులు చెప్పిరనియు నుడివి 'చలాహి ప్రాణినాం మతిః' తనకు బుద్ధి నిలకడ లేక మారునేమో యని

*స్వప్నములు రెండు విధములు. పైత్య వికారాదులచే వచ్చు కలలు ఫలింపవు' దైవనిర్ణయమును సూచించు కలలును గలవు. అవి తప్పక ఫలించును. దశరథుని స్వప్నము. భరతునిస్వప్నము, సుందరకాండములోని త్రిజటాస్వప్నము ఫలించినవని గుర్తింపవలెను.

తన్ను శంకించి రామచంద్రా! భరతుడిప్పుడు దూరదేశమున నున్నాడు. అతడు వచ్చునంతలో నీ యువరాజ్యాభిషేకము జరుగుట యుక్తమనియు దోచుచున్నది.

(ఇచ్చట దశరథునకు గొప్ప సందేహము పొడమినది. భరతుడు వచ్చిన తర్వాత భరతునివలననో కైకేయివలననో కేకయురాజు వలననో కార్యభంగమగునను తలంపు పుట్టినది). కాని దాని నిట్లు చెప్పుచున్నాడు.

**కామం ఖలు సతాం వృత్తే భ్రాతా తే భరతస్థితః।**
**జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః॥**

'రామా! నీ తమ్ముడు భరతుడు నీవలె సత్పురుషులమార్గ మనుసరించువాడు. 'పితృసమో జ్యేష్ఠః' అని నిన్ను తండ్రివలె గౌరవించువాడు. నీ యడుగు జాడల నడచువాడు, ధర్మస్వభావుడు గనుక జ్యేష్ఠుడే రాజ్యమున కర్హుడని తెలిసినవాడు. అతడు దయావంతుడు గావున రాజ్యమునకై నీతోడను నాతోడను విరసము చూపువాడు గాడు.' అతడు జితేంద్రియుడు. కేవలము రాజ్యసుఖమే గొప్పదని యెంత మాత్రము తలచువాడు గాడు.

'కింతు చిత్తం మనుష్యాణా మనిత్యమితి మే మతిః'. అయినను * మానవుల చిత్తమొక్క రీతిగ నుండక క్షణక్షణమునకు మారును. (ఎన్ని ధర్మోపదేశములు చేసినను అర్జునుడు 'చంచలం హి మనః కృష్ణ' కృష్ణ! నామనసు నిలకడ లేక చలించుచున్న దనెను గదా). కనుక భరతుడెంత ధర్మస్వభావుడైనను బుద్ధియొక వేళ మారవచ్చును. అతడెట్టివాడైనను కైకేయి

* రాముని పట్టాభిషేక వార్త జెప్పిన మంథరకు కపట బుద్ధిలేని కైకేయి యాభరణ మొకటి యిచ్చి మరి యొకటి యిత్తునని వాగ్దానముచేసి చాల సంతోషించినట్టికైక మనసును మంథర మార్చినందున నితరుల దుర్బోధన మెట్టి మార్పునైనను గలిగించునని తెలుపుచున్నది.



భరతుని మనసును మార్చునేమో. కేకయురాజు భేదభావము గలిగింపవచ్చును. ఇన్ని సంకటముల కవకాశమియ్యక భరతుడు వచ్చుటకుమునుపే పట్టము గట్టుకొనుము. కార్యము ముగిసిన తర్వాత భరతుడిక కలహించి ఫలములేదని యూరకుండును. ఇట్లు దశరథుడు పలు విధములుగ జెప్పి భరతునకు ప్రత్యేక రాజ్యమిచ్చి తన ప్రతిజ్ఞ చెల్లించుకొందునని మాటయిచ్చినందున రామచంద్రుడు యువరాజ్యపట్టాభిషేకమునకు సమ్మతించెను.

ఇట్టి రాజ్య సుఖానుభవము గూడ తన యాశ్రితుల యంతరంగులకొరకే యనుట రామచంద్రుడిట్లు నిరూపించుచున్నాడు.

**లక్ష్మణేమాం మయా సార్ధం ప్రశాధి త్వం వసుంధరామ్।**
**ద్వితీయం మేఽన్తరాత్మానం త్వామియం శ్రీరుపస్థితా॥**

**సౌమిత్రే భుజ్క్ష్వ భోగాంస్త్వమిష్టాన్ రాజ్యఫలాని చ।**
**జీవితం చ హి రాజ్యం చ త్వదర్థమభికామయే॥**

లక్ష్మణా! ఈ భూమినంతయు నాతోగూడి పరిపాలింపుము. నీవు నాకు రెండవ ప్రాణము. ఇప్పుడు నిన్నీ రాజ్యలక్ష్మి వరించినది. నాతో గలసి నీవీ రాజ్యప్రాప్తిచే పొందగల యమూల్యమగు రత్నాభరణాదుల నీ యిష్టము చొప్పున ననుభవింపు మనెను. (కర్తృత్వము విషయ సంబంధము దేహమునకు గలిగినను సుఖదుఃఖానుభవములు జీవునకేయని స్పష్టమగుచున్నది. రాజ్యము నాకు లభించినను దాని సుఖము ననుభవించువారు నీ యట్టి నా ప్రాణతుల్యులే, ఇది రామచంద్రుని మనో భావమును దెలుపుచున్నది, శ్రీకృష్ణుడును 'మమప్రాణాహి పాండవాః' పాండవులు నా ప్రాణములేయని చెప్ప లేదా?) ఇంతియగాక లక్ష్మణా! నా ప్రాణధారణమును, రాజ్యపాలనమును నీ కొరకే నేను కోరుచున్నాను.

(స్వార్థపరత్వ మణుమాత్రము లేక ఆశ్రిత రక్షణ సుఖాను భవమే తనదని భావించు పరమాత్మ భావము వెల్లడియగుచున్నది) ఈ వాక్యముల వలన రామచంద్రుడు లక్ష్మణ పక్షపాతియా? అతనికి భరత శత్రుఘ్నుల పట్ల ద్వేషభావమా యనిన నట్లుగాదు. తనకు ప్రాప్తమగు అయోధ్యా రాజ్యాధిపత్యముచే రానున్న ఫలములను లక్ష్మణు డనుభవించునట్లే కైకేయీ కన్యాదాన కాలమున దశరథుడు చేసిన వాగ్దానము చొప్పున భరతునకు రాగల రాజ్యభోగములను శత్రుఘ్నుడనుభవించునని తాత్పర్యము,

ఇక కైకేయి వరము లడుగనేల? కన్యాశుల్కముగ జేసిన వాగ్దానము ననుసరించి దశరథుని భరతునకు రాజ్యమిచ్చునట్లు అడుగరాదాయను ప్రశ్నకేమి సమాధాన మనిన అట్లడిగి యుండిన దశరథుడు భరతునకొక ప్రత్యేక రాజ్యమిచ్చి తన మాట వమ్ముగాకుండ జేయును. వరముల నడుగు నెపమున అయోధ్యా రాజ్యమునే భరతుని కిచ్చున ట్లడుగుట కవకాశము కలిగినది. అట్లు లభించిన రాజ్యమును భరతుడు రాముని వలన నెట్టి యిక్కట్లు లేక విష్కంటకముగ ననుభవింప రాము నరణ్యమునకు బంపున ట్లడుగుటకును వీలు కలిగెను. కనుక కైకేయి తన కోరిక యీడేరుటకు తగిన యుపాయ మాలోచించి మంథర ప్రేరణమున వరద్వయము నడిగెను.

మంథర రామపట్టాభిషేక వార్తను కైకేయికి దెలిపినపుడు కైకేయి మనోభావ మెట్లుండెనో చూతము. ఆమెకు రామునియందుండిన ప్రేమ యెట్టిది? గౌరవ మెట్టిది?

**ధర్మజ్ఞో గురుభిర్దాంతః కృతజ్ఞస్సత్యవాక్ఛుచిః।**
**రామో రాజ్ఞస్సుతో జ్యేష్ఠో యౌవరాజ్యమతోఽర్హతి॥**

కైక మంథరతో మంథరా! రామచంద్రుడు ధర్మమనుష్ఠించువాడు గురువువలన క్రమశిక్షణము చక్కగ బొందినవాడు. చేసినమేలు మరువనివాడు, సత్యమే పలుకువాడు, త్రికరణ శుద్ధిగలవాడు, ఆతడే రాజుయొక్క జ్యేష్ఠ కుమారుడు. కావున నతడే యౌవరాజ్యపట్టాభిషేకమునకు తగినవాడు.



**యథా మే భరతో మాన్యస్తథా భూయోఽపి రాఘవః।**
**కౌసల్యాతోఽతిరిక్తం చ సోఽనుశుశ్రూషతే హి మామ్॥**

రాముడు తన తల్లి కెట్లు సేవచేయునో యంతకంటె నెక్కువగ నాకు శుశ్రూషచేయువా డగుటచే నేను భరతునికంటె నతని నెక్కువ మన్నింపవలసియున్నది.

**భ్రాతౄన్ భృత్యాంశ్చ దీర్ఘాయుః పితృవత్పాలయిష్యతి।**
**సంతప్యసే కథం కుబ్జే శ్రుత్వా రామాభిషేచనమ్॥**

అతడు తమ్ములను సేవకులను తండ్రివలె గాపాడును. అట్టి గొప్ప గుణములుగల రాముని యభిషేకవార్తవిని సంకటపడ నేలనే? గూనిదానా! నీ యాకార మెంత వక్రమో బుద్ధియు నంత వక్రముగ నున్నదే.

**భరతశ్చాపి రామస్య ధ్రువం వర్షశతాత్పరమ్।**
**పితృపైతామహం రాజ్య మవాప్తా పురుషర్షభః॥**

**సా త్వమభ్యుదయే ప్రాప్తే వర్తమానే చ మంథరే।**
**భవిష్యతి చ కల్యాణే కిమర్థం పరితప్యసే॥**

రాముడు దీర్ఘాయువుగా నూరేండ్లు పాలించినను అతని వెనుక నా కుమారునకు వంశపరంపరగా వచ్చు పెద్దల రాజ్యము తప్పక వచ్చును. ఇట్లు ఇప్పుడు శ్రీరాముని యభిషేక మహోత్సవమును, కొంతకాలమునకు భరతుని పట్టాభిషేకమును రాగలదు. మంగళము లిట్లు వరుసగ వచ్చుట కవకాశముండగా నీవు చింతింపనేల యనెను. ఇట్టి శుద్ధాంతరంగముగల

కైకను శ్రీరామయౌవరాజ్యాభిషేక భంగమునకు హేతువగునట్లు గావించిన మంథర దుర్బోధన 'భ్రమర కీటక న్యాయ' వర్తన మనియే యొప్పుకొన వలసియున్నది.

భరతుని ప్రార్థన నంగీకరింపని రామచంద్రుడు పాదుకా పట్టాభిషేకమున కెట్లొప్పుకొనెనని యడుగవచ్చును. భరతుని భ్రాతృ భక్త్యతిశయము వలన పాదుకల నొసంగినను తాను తండ్రిని సత్యసంధునిగ జేయుటయే గాక తాను దృఢవ్రతుడని చాటించినట్లును, భరతుని న్యాయవర్తనము వెల్లడియగుటకును రాముడు పాదుకా పట్టాభిషేకమున కొప్పుకొనుట యుక్తమే. పాదుకల మున్నిడుకొని వానిపేర పాలన సాగించిన భరతున కదియె యప్పటి యౌవరాజ్యాభిషేక మనియు చెప్పవచ్చును. శ్రీరామపట్టాభిషేకసమయమున లక్ష్మణు డంగీకరింపక పోవుటచే రామచంద్రుడు భరతునకే యౌవరాజ్యాభిషేకము చేయించెననుటను క్రిందిశ్లోకము స్పష్టీకరించుచున్నది.

**సర్వాత్మనా పర్యనునీయమానో యదా న సౌమిత్రి రుపైతి యోగమ్।**
**నియుజ్యమానోఽపి చ యౌవరాజ్యే తతోఽభ్యషించద్భరతం మహాత్మా॥**

ఇట్లు యౌవరాజ్యాభిషేక విషయమున దశరథునకుగాని వసిష్ఠాదులకుగాని రామచంద్రునకుగాని కైకేయికిగాని దోషలేశము లేదవి గుర్తించుచు శ్రీరాముడు పాదుకాపట్టాభిషేకమున కంగీకరించుటయు నాతని కీర్తిప్రతిష్ఠల వేనోళ్ళ జాటుచున్నవని తన పట్టాభిషేక సమయమున భరతుని యువరాజుగ నభిషేకించుట సర్వోత్కృష్ట మగుచున్నదని సుస్పష్టమగు చున్నది. కన్యాశుల్కము ధనరూపముగను వీర్యరూపముగ నుండుటయేగాక రాజ్యరూపముగ నున్నదనుటయు 'రాజ్యశుల్క మనుత్తమమ్' అనుటచే నయ్యది యుత్తమోత్తమమగు కన్యాశుల్కమనియు తెలియుచున్నది.



# భరతుని శపథములు

**భరతాయ పరం నమోఽస్తు తస్మై ప్రథమోదాహరణాయ భక్తిభాజామ్।**
**యదుపజ్ఞమశేషతః పృథివ్యాం ప్రథితౌ రాఘవపాదుకాప్రభావః॥**
**(పాదుకాసహస్రము)**

శ్రీరామభక్తిభరితుడే భరతుడు. అతడు భగవత్పారతంత్ర్యమును పాటించి జీవాత్మ పరమాత్మయెడ నెట్టి శేషత్వధర్మము నిర్వర్తింప వలెనో తన యనుష్ఠానముచే లోకమున కాదర్శపురుషు డయ్యె. దశరథుని మరణానంతరము వసిష్ఠుడు పంపిన దూతల సందేశమువిని అయోధ్యకు మరలివచ్చిన భరతుడు సీతారామలక్ష్మణుల వనవాసగమనమును తండ్రి లోకాంతరగతు డగుటయు విని దుర్భర శోకక్రోధములచే తల్లిని పలువిధముల నిందించి పుత్రవియోగదుఃఖము ననుభవించు కౌసల్యాదేవిని చూడబోయెను. అప్పు డామె భరతుని జూచి

**ఇదం తే రాజ్యకామస్య రాజ్యం ప్రాప్తమకంటకమ్।**
**సంప్రాప్తం బత కైకేయ్యా శీఘ్రం క్రూరేణ కర్మణా॥**

'రాజ్యమున కువ్విళ్లూరుచున్న నీకు నీతల్లి ఒకరి బాధ యెంతమాత్రము లేని రాజ్య మిచ్చినది. ఎంతటి క్రూరకార్యమునకైన నొడిగట్టు నీ తల్లి వలన నింత శీఘ్రకాలమున నీకీ రాజ్యము లభించినది. భర్తలేని దానికి పుత్రుడే దిక్కు, అందుచే నే నగ్నిహోత్రమును, నీ తండ్రి కళేబరమును గొని సుమిత్రంగూడి రామచంద్రు డుండుచోటి కేగెదను. నీవు సకలైశ్వర్యములతో నిండియున్న రాజ్యము నీ తల్లి నీ కిప్పించినందున సుఖముగ నేలు మనియె. ఇట్టి ములుకులవంటి పలుకులు చెవి సోకినంతనే భరతుడు పిడుగుపడిన వృక్షమువలె నేలబడి మూర్ఛిల్లెను. కొంతసేపటి కతడు తెలివినొంది కౌసల్యనుజూచి చేమోడ్పి 'తల్లీ పట్టాభిషేకవిషయముగాని రామచంద్రుని

వనవాసవిషయముగాని నే నెంత మాత్ర మెరుగను. నీకు మాయన్నయెడ నేనెట్లు ప్రవర్తింతునో తెలియదా? అట్లు నేను శ్రీరాముని వనవాసమునకు సమ్మతించిన వాడ నగుదునేని ఈ పాపాత్ములకు గలుగుదుర్గతులు నాకు గలుగుగాక యని యీ క్రిందిశపథముల జేసి తన నిర్దోషిత్వమును చాటుకొనెను.'

**కృతా శాస్త్రానుగా బుద్ధి ర్మాభూత్తస్య కదాచన।**
**సత్యసంధస్సతాం శ్రేష్ఠో యస్యాఽర్యోఽనుమతే గతః॥**

**(2-75-21)**

సత్యసంధుడును సత్పురుషులలో శ్రేష్ఠుడు నగు రామచంద్రుని యరణ్యావాసమున కెవడు సమ్మతించెనో వాడు గురువుమూలమున విధినిషేధ ములను (చేయదగినవి, చేయదగనివి) దెలుపు శాస్త్రము ననుసరించు బుద్ధిని గోల్పోవును గాక. (అనగా తానట్లు రాముని యరణ్యావాసమున కొప్పుకొని యుండిన తనకట్టి శాస్త్రజన్యజ్ఞానము నశించుగాక యనినట్లు భావింపనగును. ఇట్లే ప్రతిపాపదోషమును గూర్చి చెప్పినాడని యెంచవలె.)

**ప్రేష్యం పాపీయసాం యాతు సూర్యం చ ప్రతి మేహతు।**
**హంతు పాదేన గాం సుప్తాం యస్యాఽర్యోఽనుమతే గతః ః**

శ్రీరాము డడవికి బోవ సమ్మతించినవాడు, నీచజాతివానికి సేవ చేసినవాడును, సూర్యున కెదురుగ గూర్చుండి మలమూత్రములు విసర్జించువాడును, నిద్రించుచుండు గోవును కాలితో తన్నినవాడును ఎట్టి పాపఫల మనుభవించునో యట్టి దురవస్థను బొందుగాక.

**కారయిత్వా మహత్కర్మ భర్తా భృత్యమనర్థకమ్।**
**అధర్మో యోఽస్య సోఽస్యాస్తు యస్యాఽర్యోఽనుమతే గతః॥**



ఎవడు రాము డడవికి బోవ సమ్మతించెనో వాడు భృత్యునిచే విశేషముగ పనిచేయించుకొని వానికి కూలి యీయని యజమాను డే పాపమునకు బోవునో యా పాపమునకు బోవుగాక.

**పరిపాలయమానస్య రాజ్ఞో భూతాని పుత్రవత్।**
**తతస్తం ద్రుహ్యతాం పాపం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

శ్రీరామవనవాసమునకు సమ్మతించినవాడు, ప్రజలనెల్లర తన బిడ్డలవలె గాపాడుచుండు రాజునకు ద్రోహము చేసిన వాడే పాపఫలము లనుభవించునో యట్టి ఫలము లనుభవించు గాక.

**బలిషడ్భాగముద్ధృత్య నృపస్యారక్షతః ప్రజాః।**
**అధర్మో యోఽస్య సోఽస్యాస్తు యస్యాఽర్యోఽనుమతే గతః॥**

పండిన పంటలో ఆరవభాగము పన్నుగ బుచ్చుకొనియు, బ్రజలను రక్షింపని రాజెట్టిద్గుతి చెందునో రాము డరణ్యమునకేగ సమ్మతించినవా డట్టి పాపము పొందును గాక.

**సంశ్రుత్య చ తపస్విభ్య స్సత్రే వై యజ్ఞదక్షిణామ్।**
**తాం విప్రలపతాం పాపం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

యాగములో వ్రతోపవాసశీలురగు ఋత్విక్కులకు విశేషముగ దక్షిణ లిచ్చునట్లు * ప్రతిజ్ఞచేసి తుదకు మోసము చేసినవా డే పాప మనుభవించునో శ్రీరాము డరణ్యమునకు బోవ సమ్మతించినవా డట్టిపాప మనుభవించుగాక.

* ఒకరికొక వస్తువిచ్చెదనని చెప్పి యీయకుండుట దోషము. సామాన్యులు గాక వ్రతోపవాస నియమములు పాటించువారికి చేసిన ప్రతిజ్ఞ విఫలము చేయుట గొప్ప తప్పు. ఇతర విషయములలో గాక వైదికకర్మలయందట్లు మోసముచేయుట మిక్కిలి గొప్ప పాపము. ధనాభావముచే గాక ధనముండియు నిచ్చెదని చెప్పి నే నీయననుట ప్రాయశ్చిత్తమే లేని మహాపాతకమని తెలియునది.

**హస్త్యశ్వరథసంబాధే యుద్ధే శస్త్రసమాకులే।**
**మా స్మ కార్షీత్సతాం ధర్మం యస్యాఽ ర్యోఽ నుమతే గతః॥**

పూర్వకాల పద్ధతిచొప్పున రథములు గజములు అశ్వములు పదాతులతో గూడి వీరులతో నిండినట్టి యుద్ధభూమిలో పోరుసాగుచుండ శత్రువులకు వీపు జూపి యుద్ధభూమినుండి పలాయితుడగువా డెట్టిదుర్గతి పాలగునో రామునరణ్యవాస మనుమతించిన వాడట్టిపాపము ననుభవించును. (యుద్ధభూమిలో చచ్చుటచే వీరస్వర్గము నొందుటయో యుద్ధముచేసి శత్రువును జయించుటయో వీరుని లక్షణమని గుర్తింపవలెను).

(ఇంతియ గాక యుద్ధభూమిలో ఇరుపక్షములవారు అభిముఖులై సమాన యుద్ధ పరికరములు గలిగి యుద్ధకాల నియమముల చక్కగ పాటించి తమ శక్తిసామర్థ్యములజూపి విజయము పొందుట ప్రాచీనపద్ధతి. తొలినాటి రామరావణయుద్ధమున రథమును గుఱ్ఱములను సారథిని ధనుస్సును గోల్పోయిన రావణాసురుని జూచి రామచంద్రుడు 'నీవు లంకకేగి శ్రమపరిహారముచేసికొని సకలసన్నాహములతో రేపు యుద్ధమునకు రమ్మనిన మాట యుగాంతరము లెన్నియైనను మరవదగునా? మాయావులగు సుబాహు మారీచుల వలె శత్రువున కెదురుగ నిలువక మోసకృత్యములు చేసినట్లు క్షణములో ప్రపంచమును భస్మము చేయుదుమని విఱ్ఱవీగు ఈ కాలపు వీరుల యధర్మయుద్ధము గాదు.')

**ఉపదిష్టం సుసూక్ష్మార్థం శాస్త్రం యత్నేన ధీమతా ।**
**స నాశయతు దుష్టాత్మా యస్యాఽ ర్యోఽ నుమతే గతః॥**

శ్రీరాముని వనగమనమునకు సమ్మతించిన వాడు మిక్కిలి బుద్ధిమంతుడగు సదాచార్యుడు మిగుల ప్రయాసతో నుపదేశించినవియు పరలోక సాధకములగు రహస్యము లనేకములతో గూడి పరతత్త్వమును



పరమ హితమును పరమ పురుషార్థమునగు వేదాంతశాస్త్రమును మరచిపోవుగాక. (ఇందు వలన సదాచార్యుని వెదకి అతనికి శుశ్రూషాదులుచేసి అతని కృపకు పాత్రుడై తత్త్వహితపురుషార్థములను వెల్లడించు రహస్యము లనేకములను గ్రహించి సదా సద్గురుస్మరణ చేయుచు ఆ రహస్యార్థముల మరువక పఠనమననాదులచే జ్ఞప్తియందుంచుకొనుట ధర్మమని యెరుంగునది.)

**మా చ తం వ్యూఢబాహ్వంసం చంద్రార్కసమతేజసమ్।**
**మా ద్రాక్షీద్రాజ్యస్థ మాసీనం యస్యాఽ ర్యోఽ నుమతే గతః॥**

బాగుగా బలిసిన భుజములును భుజశిరస్సులును గలిగి సూర్యచంద్రుల వంటి తేజోవంతుడును రాజ్యమును బడసి సింహాసనమున గూర్చుండి యుండువాడునగు శ్రీరామునియొక్క వనవాసము నంగీకరించినవాడు * చూడలేకపోవునుగాక, (రాముని చూడలేకపోవుట యంతహీనస్థితిని దెల్పునా? ఇందుకు సమాధానము, సుమంత్రుడు రామచంద్రుని కైకేయీ దశరథుల కడకు దోడ్కొని పోవునపుడు ప్రజ లాతని జూచి 'యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి। నిందితస్స వసేల్లోకే స్వాత్మాఽ ప్యేనం విగర్హతే॥')

దర్శనమాత్రముననే పరిపూర్ణానందస్వరూపమగు మోక్షము నిచ్చునట్టి రామచంద్రుని ఎవడు చూడడో అందు వలననే యెవనిని రాముడు దృష్టింపడో రాముని కటాక్షమునకు పాత్రుడు గాక అట్టి వాడు యావజ్జీవము లోకములో నిందితుడై యుండుటే గాక తన యంతఃకరణము చేతనే సదా నిందింపబడుచుండును అనిరి. అనగా భగవత్కటాక్షము పొందుటకై భగవదాజ్ఞయని భగవత్ప్రీతికొరకు సకలవిధముల ప్రయత్నించువాడే ధన్యజీవియని తెలియునది.

**గాశ్చ స్పృశతు పాదేన గురూ న్పరివదే త్స్వయమ్।**
**మిత్రే ద్రుహ్యేత సోఽత్యంతం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

గోవును. గర్వముచేత కాల దాకెడువాడును, అహంకారముతో గురువును తానే నిందించువాడును, తన్ను పూర్ణముగ నమ్మిన స్నేహితున కెగ్గుతలంచువాడును ఎట్టి దుర్గతి పొందునో రామ వనవాసమున కంగీకరించిన వాడట్టి దుర్గతిని పొందునుగాక.

**విశ్వాసాత్కథితం కించి త్పరివాదం మిథః క్వచిత్।**
**వివృణోతు స దుష్టాత్మా యస్యాఽర్యోఽనుమతే గతః॥**

రాము నడవికి బంపుట కిష్టపడినవాడు, తన్నొకడు పరిపూర్ణముగ నమ్మి ఒక యపవాదమును రహస్యముగ జెప్పగా దానిని లోకుల కందరకు దెలుపు వాడెట్టి పాప మనుభవించునో యట్టిపాపము ననుభవించును గాక. (స్నేహభావమున్నపుడు చెప్పిన రహస్యములను విరోధమేర్పడినను చెప్పుట పాతకమని గుర్తింపనగును.)

**అకర్తా హ్యకృతజ్ఞశ్చ త్యక్తాఽత్మా నిరపత్రపః।**
**లోకే భవతు విద్వేష్యో యస్యాఽర్యోఽనుమతే గతః॥**

తానుపొందిన ఉపకారమునకు ప్రత్యుపకారము చేయనివాడును, తన కితరులు చేసినమేలు మరచువాడును, సత్పురుషసంఘమునకు దూరుడగువాడును, ఉరివేసికొనుట మొదలగు కార్యములచే నాత్మహత్య చేసికొనువాడును, గొప్ప పాపకార్యముచేసి దాని పరిహారమునకు ప్రాయశ్చిత్తము చేసికొనని వాడును, లోకులందరిచే ద్వేషింప బడువాడును ఎట్టిపాపఫల మనుభవించునో అట్టి పాపఫలమును రామచంద్రుని వనవాసమున కంగీకరించినవా డనుభవించును

**పుత్రదారైశ్చ భృత్యైశ్చ స్వగృహే పరివారితః।**
**స ఏకో మృష్టమశ్నాతు యస్యాఽర్యోఽనుమతే గతః॥**



తనయింటిలోని తన భార్యాపుత్రులును సేవకులును చూచుచుండగా వారికి సామాన్యమైన భోజనమిచ్చి తానుమాత్రము భక్ష్యభోజ్యములతో భుజించువా డెట్టి పాపమున బోవునో అట్టిపాపమున రాముని వనగమనమున కంగీకరించినవాడు పోవుగాక. (మధురపదార్థము అనగా రుచ్యములగు వస్తువులను ఇష్టమిత్రుల గూడి భుజింపవలెను గాని తా నొక్కడే భుజించుట పాపమని సూచితము.)

**అప్రాప్య సదృశాన్ దారాననపత్యః ప్రమీయతామ్।**
**అనవాప్య క్రియాం ధర్మ్యాం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

కులశీలములందు తనకు సమానురాలుగ నుండు పత్నిని పొంది అగ్నిహోత్రాదులు చేయక తన కులము నుద్ధరించు పుత్రుల బడయక మరణించువా డెట్టిగతిని పొందునో రామవనవాసమున కంగీకరించిన వా డట్టిగతిని పొందును. (ఇందువలన అగ్నిసాక్షికముగ ధర్మపత్నిని స్వీకరించి ఆమెవలన పుత్రుల బొందుట యిహపరసాధక మనియు, కేవల భోగమునకు మాత్ర ముపయోగమగు నీచ స్త్రీ సంబంధము సర్వదా నింద్యము, నిషేధమని తెలియునది.)

**రాజస్త్రీబాలవృద్ధానాం వధే యత్పాపముచ్యతే।**
**భృత్యత్యాగే చ యత్పాపం తత్పాపం ప్రతిపద్యతామ్॥**

రాజస్త్రీలను బాలురను వృద్ధులను జంపినవాడును, చిరకాలము సేవచేయుచుండిన సేవకుని హఠాత్తుగా నివర్తించినవాడు ఎట్టిగతికి బోవునో రామవనవాసమున కియ్యకొనినవా డట్టి గతికి బోవును. (ఇందుచే ఇతరుల చంపుట పాతకము కాదని యెంచరాదు. విశేషించి వీరిని వధింపరాదని, యుద్ధసమయము నందును ఇట్టివారిని వధింపరాదని యర్థము. శివాజి తన సైనికుల కిట్టి నిబంధనముల గావించి స్త్రీ బాలవృద్ధులను మత గ్రంథమును దేవాలయములను నాశము చేయరాదనెనని చదివియున్నాము.

సేవకుల నివర్తిచేయుటలో ననేకవిషయము లాలోచింపకున్న యజమానున కనర్థము వాటిల్లుననుట సూచితము.)

**లాక్షయా మధుమాంసేన లోహేన చ విషేణ చ।**
**సదైవ బిభృయాద్భృత్యా న్యస్యాఽర్యోఽనుమతే గతః॥**

లక్క, మద్యము, మాంసము, లోహములు, విషపుదినుసులు విక్రయించి సంపాదించిన ధనముతో కుటుంబమును పోషించువా డేపాపము ననుభవించునో ఆ పాపమును రాముని యరణ్యవాసమున కంగీకరించినవాడు పొందునుగాక. (ఇచట 'లాక్షా లవణ మాంసాని వర్జనీయాని విక్రయే' అను స్మృతివాక్యము ననుసరించి లక్క, ఉప్పు, మాంసము మొదలగు వానిని విక్రయించి జీవించుట దోషమని తెలియుచున్నది.)

**సంగ్రామే సముపోఢే స్మ శత్రుపక్షభయంకరే।**
**పలాయమానో వధ్యేత యస్యాఽర్యోఽనుమతే గతః॥**

యుద్ధములేని కాలమున రాజుయొక్క పోషణలో నుండి భోజనాదిసకలసుఖము లనుభవించి యుద్ధము సమీపించునపుడు భయపడి పరుగెత్తగా ఆ పిరికిపంద నెట్లు చంపవలెనో యట్లే రామవనవాసము నామోదించినవాడును చంపబడునుగాక. (యుద్ధము చేయవలసినవాడు తన ధర్మము తప్పి ప్రవర్తించినచో తప్పక వధ్యుడే. వాడే సమయఘాతుకుడు. వాడుండియు చచ్చినవానితో సమానుడేయని తెలియుచున్నది.)

**కపాలపాణిః పృథివీమటతాం చీరసంవృతః।**
**భిక్షమాణో యథోన్మత్తో యస్యాఽర్యోఽనుమతే గతః॥**

దేహబలము బుద్ధిబలము గలిగియు కపాలము చేతబూని చింపిరి గుడ్డలు కట్టుకొని పిచ్చివానివలె నటించుచు భిక్షమెత్తుకొని లోకమున



తిరుగువాడెట్టిగతిని పొందునో శ్రీరాముని వనగమనవార్త తెలిసినవాడట్టిగతిని పొందునుగాక. (అనఁగా శక్తివంచన చేయువాడు మహాపాపి యని తెలియుచున్నది.)

**పానే ప్రసక్తో భవతు స్త్రీష్వక్షేషు చ నిత్యశః।**
**కామక్రోధాభిభూతస్తు యస్యాఽర్యోఽనుమతే గతః॥**

కామ క్రోధములకు జిక్కి, మద్యపానము చేయుచు, జూదమాడుచు స్త్రీలోలుడగు వాడెట్టి పాపఫల మనుభవించునో రాముని వనవాసమునకు సమ్మతించిన వాడట్టి పాపఫలము ననుభవించునుగాక.

**'త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః।**
**కామక్రోధ స్తథా లోభః తస్మా దేతత్త్రయం త్యజేత్'॥**

అను గీతావాక్యము చొప్పున కామక్రోధలోభములు మూడును నరకద్వారములు. ఇవి శరీరమును ఆత్మను నాశనము చేయునవి. వానికి వశము గాకుండుటయే మోక్షసాధకమని తెలియుచున్నది. అధర్మకామాసక్తుడై రావణుడు మరణించె. రాజ్యలోభముచే కౌరవులు నశించిరి. క్రోధావేశముచే హిరణ్యకశిపుడు చచ్చెను. సాంఖ్యయోగమున గీతాచార్యుడు విషయధ్యానమే వినాశహేతువని యిట్లు వాక్రుచ్చియున్నాడు.

**ధ్యాయతో విషయాన్ పుంస స్సంగస్తేషూపజాయతే।**
**సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే॥**

**క్రోధాద్భవతి సంమోహ స్సంమోహాత్స్మృతివిభ్రమః।**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి॥**

ఇంద్రియముల మూలమున మానవుడు శబ్దస్పర్శరూప రసగంధాదులచే నాకర్షింపబడి విషయసుఖముల ధ్యానించుటచే ఆశపుట్టుచున్నది. ఆశ

ముదిరి కామము గలుగును. కామాతురునకు కోరిక యీడేరకున్న కోపము పుట్టును. కోపమువలన మోహము గలుగును. (అనగా కార్యాకార్య వివేకము శూన్యమగును. మోహమువలన శాస్త్రజ్ఞానము తప్పిపోవును, స్మృతి తప్పుటచే బుద్ధి చెడును. (ఆత్మజ్ఞానార్థము లోపించును.) అందువలన పురుషు డిహపరసుఖములు తప్పి వినాశ మొందుటచే దీనిని 'నరకపదసోపాన' మని చెప్పిన నేమి?)

**మా స్మ ధర్మే మనో భూయాదధర్మం సు నిషేవతామ్।**
**అపాత్రవర్షీ భవతు యస్యాఽర్యోఽనుమతే గతః॥**

శ్రీరాముని వనవాసము నంగీకరించినవాడు ధర్మకార్యములు చేయుటలో ఆసక్తుడు గాక అధర్మమునే చేయుటలో బుద్ధిగలవాడగుచు శ్రోత్రియులగు సత్పాత్రలకు దానమియ్యక, దానమున కెంతమాత్రము పాత్రులుగాని వారికి విశేష దానము లిచ్చునట్టి వాని దుర్గతిని పొందును గాక.

**సంచితాన్యస్య విత్తాని వివిధాని సహస్రశః।**
**దస్యుభి ర్విప్రలుప్యంతాం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

రామచంద్రుని వనగమనమున కియ్యకొనినవా డనేకవిధముల సంపాదించి సేకరించిన ధనధాన్యాది సర్వస్వము దొంగలపాలగును గాక.

**ఉభే సంధ్యే శయానస్య యత్పాపం పరికల్ప్యతే।**
**తచ్చ పాపం భవేత్తస్య యస్యాఽర్యోఽనుమతే గతః॥**

సూర్యోదయ సూర్యాస్తమయ కాలములలో ఎవడు ఆయా సంధ్యాకాలములలో జేయవలసిన సంధ్యా వందనాదులు మాని నిద్రించునో అట్టివాని పాపఫలములను రామవనవాసమున కామోదించిన వా డనుభవించునుగాక.



**యదగ్నిదాయకే పాపం యత్పాపం గురుతల్పగే।**
**మిత్రద్రోహే చ యత్పాపం తత్పాపం ప్రతిపద్యతామ్॥**

ఎవడు రాము డడవికి బోవ సమ్మతించెనో వాడు కాపురముండు ఇంటికి నిప్పు పెట్టినవాడు, విద్యా బోధకుడగు గురువుయొక్క పత్నిని గూడిన నీచుడు, చిరకాలముగ నమ్మియున్న స్నేహితునకు ద్రోహము చేయువాడు ఎట్టి నరకబాధలు పొందునో అట్టి బాధల ననుభవించు గాక. ("ఆశ్రమే వా వనే వాపి గ్రామేవా నగరే పురే అగ్నిం సముత్సృజేన్మోహా త్తం విద్యాత్ బ్రహ్మఘాతుకమ్॥" ఆశ్రమములకు, వనములకు, గ్రామములకు, పట్టణములకు, ఇండ్లకు నిప్పు పెట్టినవాడు, బ్రహ్మహత్యాదోషము ననుభవించును. గురుపత్నిని గూడినవానికి కుక్కజన్మము, క్రిమిజన్మము గలిగి కడపట వాడు నరకబాధ లనుభవించును.)

**దేవతానాం పితౄణాం చ మాతాపిత్రోస్తథైవ చ।**
**మా స్మ కార్షీత్ స శుశ్రూషాం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

మానవుడు అగ్నిహోత్రాదులచే దేవతలను, తర్పణశ్రాద్ధాదులచే పితరులను, శుశ్రూషాదులచే జీవించియుండు జననీ జనకులను బూజింపవలెను. అట్లుచేయకుండుట గొప్ప దోషము, రాముని వనవాసమున కంగీకరించిన వా డట్టిదోషము పొందుగాక.

**"దేవకార్యమకృత్వా తు పితృకార్యమథాపి వా।**
**అనిర్వాప్య నరో హ్యశ్నన్ మృతో జాయతి వాయసః॥**

(ప్రతిదినము దేవతార్చనము చేయనివాడును, పితృ దినములందు పితృ కార్యములు చేయని వాడును. ఆయా కార్యములు చేయక భుజించినచో వాడు తప్పక కాకిజన్మ నెత్తును. 'యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః'-దైవప్రీతి కొరకు చేయు కార్యమే యజ్ఞము. ఈ లోకమున యజ్ఞార్థమైన కర్మకంటెను వేరు కర్మబంధము సంసారహేతువు.)

**'దేవాన్ భావయతాఽనేన తే దేవా భావయంతు వః।**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ'॥**

ఆరాధనరూపమగు యజ్ఞము చేయుడు. అంతట దేవతలు తృప్తిచెంది మీకు కావలసిన వర్షము కురిపించి మీ కోరికల నెరవేర్తురు. ఇట్లు దేవతలును మీరును పరస్పరము వృద్ధి చేసికొనిన, మానవులగు మీ కభీష్టము లన్నియు సిద్ధించును. ప్రతిదినము దేవ ఋషి పితృతర్పణములు చేయవలెను. వాని వలన సకల సుఖములు గలుగును. మరణించిన పితరులకు పిండోదకము లిచ్చిన మాత్రమున చాలదు. జీవించియుండు తల్లి దండ్రులకు శుశ్రూషలు చేయుట ముఖ్యము. వారి ననాదరించుట వలన నెట్టి దేవ కార్యములును ఫలించవు. భారతమున కౌశికుడను బ్రాహ్మణుడు మాతా పితృ శుశ్రూషలు మానినాడని తెలిపి పతివ్రత యొకతె ఆ బ్రాహ్మణుని మిథిలానగరమున మాంసవిక్రయముచేయు ధర్మవ్యాధునికడకు బొమ్మనెను. కౌశికుడు ధర్మవ్యాధుని మాతా పితృ శుశ్రూషాదుల జూచి బుద్ధి తెచ్చుకొని, తల్లిదండ్రుల సేవ చేసి సుఖించెననియున్నది. కావున బ్రతికియున్న జననీజనకుల కన్నపానాదు లీయక వారి మరణానంతరము లోకులు మెచ్చుకొనుటకై చేయు వ్యయము నిరుపయోగమని గుర్తించుట ముఖ్యము.

**సతాం లోకాత్సతాం కీర్త్యాత్ సజ్జుష్టా త్కర్మణస్తథా।**
**భ్రశ్యతు క్షిప్రమద్యైవ యస్యాఽర్యోఽనుమతే గతః॥**

శ్రీరాముని వనవాసమున కొప్పుకొనిన వాడు సత్పురుషుల సంఘమునకు దూరుడగును గాక. వాడు వారిపొగడ్తలకు పాత్రుడు గాకుండుగాక. వారు చేయు సత్కర్మలను వాడు చేయకుండునుగాక. (సత్సాంగత్యముచే దురాశ లలవడ వనియు, దానివలన వివేకము గలుగుననియు, అందువలన మనోనైర్మల్యము స్థిరబుద్ధి యలవడు ననియు అట్టివాడు జీవన్ముక్తు డగుననియు శంకరాచార్యులవారు బోధించి యున్నారు.)



**అపాస్య మాతృశుశ్రూషామనర్థే సోఽవతిష్ఠతామ్।**
**దీర్ఘబాహుర్మహావక్షా యస్యాఽర్యోఽనుమతే గతః॥**

నిడుదలగు బాహువులును, విశాలమగు వక్షఃస్థలముగల పూజ్యుడగు రామచంద్రు డరణ్యమునకు బోవ సమ్మతించిన వాడు తల్లికి శుశ్రూషలు చేయక అసత్కార్యములే చేయుచుండువాని పాపము ననుభవించునుగాక. (మాతృదేవోభవ అనుశ్రుతి చెప్పున కంటికగపడు ప్రత్యక్ష దైవము తల్లియే. అట్టితల్లికి శుశ్రూషాదులుచేసి ఆమెను సంతోష పెట్టువాడే పుత్రుడు. కనుక వాల్మీకి, కౌసల్యానందవర్ధనః అని కైకేయ్యానందవర్ధనః అని, సుమిత్రానందవర్ధనః' అని రామచంద్రుని భరతుని లక్ష్మణుని శత్రుఘ్నుని మాటిమాటికి జెప్పుచుండును. జనని స్వర్గలోకముకంటెను ముఖ్యమని తెలియుచున్నది.)

**బహుపుత్రో దరిద్రశ్చ జ్వరరోగసమన్వితః।**
**స భూయాత్సతతం క్లేశీ యస్యాఽర్యోఽనుమతే గతః॥**

అట్టి పాపమున కొడిగట్టినవాడు బిడ్డ లనేకులు గలిగి దరిద్రుడై సదా జ్వరముచేతను, ఇతర రోగములచేతను పీడింపబడిన వాడగునుగాక. (కలిమి గలిగి పుత్రులు లేకున్న దుఃఖము. బిడ్డలెక్కువ మందియుండి ఖర్చుకుదగిన ధనము లేకున్న అదియంతకంటెను కష్టము. జ్వరము మొదలగు వ్యాధిబాధలుండి ధనమున్నను బిడ్డలున్నను సుఖముగలుగదు. ఆలోచించిచూడ ఆరోగ్యమునకు మించిన భాగ్యము లేదని యొప్పు కొనవలసి యున్నది.)

**ఆశామాశంసమానానాం దీనానామూర్ధ్వచక్షుషామ్।**
**అర్థినాం వితథాం కుర్యాద్యస్యాఽర్యోఽనుమతే గతః॥**

ఒక డైశ్వర్యవంతుడై ఉన్నతాసమున గూర్చుండి యున్నాడు. యాచకు డొకడు దీనుడై ఆ ధనికుని కన్నెత్తిచూచుచు కొండంత యాశతో నుండగా

వాని కాశాభంగము చేయువాని పాపమును రాముని వనవాసమునకు సమ్మతించినవా డనుభవించుగాక.

**మాయయా రమతాం నిత్యం పరుషః పిశునోఽశుచిః।**
**రాజ్ఞో భీతస్త్వధర్మాత్మా యస్యాఽర్యోఽనుమతే గతః॥**

శ్రీరాముని వనవాసమున కిష్టపడినవాడు మాయలమారియు, కఠినముగ మాట్లాడు వాడును, తప్పుడుపనులే చేయువాడును, అనాచారవంతుడై న్యాయము దప్పి నడచుచు ఏవేళయెట్టి రాజదండన విధింపబడునో యని భయపడి దాగియుండువాడును పిసినారియు నగునుగాక. (సత్పురుషుల కపకారము చేయుట వలన అధర్మబుద్ధియు రాజనీతి నుల్లంఘించి ప్రవర్తించుటయు ఎల్లపు డితరులను ప్రభుత్వమును మోసపుచ్చియే జీవించుచు దుఃఖమునే యనుభవించునని తెలియుచున్నది.)

**ఋతుస్నాతాం సతీం భార్యామృతుకాలానురోధినీమ్।**
**అతివర్తేత దుష్టాత్మా యస్యాఽర్యోఽనుమతే గతః॥**

ఋతుస్నానము చేసి తనవద్దనేయుండు పతివ్రతయగు భార్యతన్ను జేరరాగా ఉపేక్షించువాని పాపమును రాముడడవికి బోవనిష్టపడిన వా డనుభవించుగాక.

**ధర్మదారాన్ పరిత్యజ్య పరదారాన్ నిషేవతామ్।**
**త్యక్తధర్మరతిర్మూఢో యస్యాఽర్యోఽనుమతే గతః॥**

రామవనవాసమునకు సమ్మతించినవాడు శాస్త్రసమ్మతముగ వివాహమాడిన ధర్మపత్నిని విడిచి ధర్మానుష్ఠానము చేయక ఇతరుల భార్యలతో గూడినవాని గతిని బొందును గాక. (ఇచ్చట భరతుడు కైకేయిని రామచంద్రుని యరణ్యవాసమునకు గారణము లడుగుచు 'కచ్చిన్న



పరదారాన్వా రాజపుత్రోఽభిమన్యతే కస్మాత్స దండకారణ్యే భ్రూణహేవ వివాసితః॥ రాజపుత్ర శ్రేష్ఠుడగు రాముడు పరస్త్రీలను గోరలేదుకదా! ఇట్లుండగా నెందు కితని శ్రుతాధ్యయన సంపన్నుని జంపిన వానివలె దండకారణ్యమునకు బంపిరి? (ఏకశాఖాధ్యాయి శ్రోత్రియుడని' సకల శాఖల నభ్యసించినవాడు భ్రూణుడని గుర్తించునది) అని యడుగ గైకేయి భరతునితో నిట్లు చెప్పెను. 'న రామః పరదారాంశ్చ చక్షుర్భ్యామపి పశ్యతి' రాముడు పరులభార్యలను కన్నెత్తియైన జూడడు. ఇందు రాముని ఏకపత్నీ వ్రతానుష్ఠానము వెల్లడియగుచున్నది. ఇక లక్ష్మణుడు భార్యనువిడిచి సీతారాములకు సేవచేయ నరణ్యమునకు బోయినపుడెన్ని పర్యాయములు రామచంద్రుడు లేనిసమయములో లక్ష్మణుడు సీతాదేవికి కావలి యుండెను? మరణసమయమున మారీచుడు రాముని గొంతెత్తి హా లక్ష్మణా హా సీతా యని యరచినపుడు రామున కేదో ఆపదవచ్చినదని లక్ష్మణునతని సహాయమునకు బొమ్మనిచెప్పి యతడు పోకుండినపుడు సీత తన్ను పొందవలెనను దురాశచే నతడు రాముని సహాయార్థము పోలేదని కఠి నోక్తులాడగా లక్ష్మణు డాకర్ణకఠోరములగు వాగ్బాణముల కోర్వక సీతను విడిచిపోయెను. ఋశ్యమూక పర్వతమున సుగ్రీవుడు సీతాదేవి యాభరణములు రామచంద్రున కిచ్చినపుడు రాముడు తమ్మునిజూచి 'లక్ష్మణా! ఇవి నీ వదినె ధరించియుండినవేనా' యని యడుగ లక్ష్మణుడు 'నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే, నూపురేత్వభిజానామి నిత్యం పాదాభివందనాత్'॥ సీతాదేవియొక్క భుజకీర్తులు నాకు దెలియవు. ఆమె కుండలములను నేను చూచినదిలేదు. ప్రతిదినమామె పాదములకు నమస్కారము చేయుచుండుటవలన అందెలుమాత్రము నాకు బాగుగ దెలియుననియెను. ఇది లక్ష్మణుని జితేంద్రియత్వమును సుమిత్రయాజ్ఞ చొప్పున నాతడు సీతను దల్లిగనే భావించి పాదపూజ చేయుచుండె నని

స్పష్టపరచుచున్నది. పరస్త్రీని తల్లివలె జూచుట ఉత్తమపురుషుని లక్షణమని తెలియుచున్నది.

**విప్రలుప్తప్రజా తస్య దుష్కృతం బ్రాహ్మణస్య యత్।**
**తదేవ ప్రతిపద్యేత యస్యాఽర్యోఽనుమతే గతః॥**

శ్రీరామ వనవాసమున కంగీకరించువాడు సంతానము లేనట్టి బ్రాహ్మణుని పాపముననుభవించుగాక. (సంతానహీనుడు పితృఋణము దీర్చుకొన లేనివాడగుటచే పాపము చేసినవాడగునని సూచితము.)

**పానీయదూషకే పాపం తథైవ విషదాయకే।**
**యత్తదేకస్స లభతాం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

రామచంద్రుని యరణ్యవాసమున కంగీకరించిన వాడు బహు జనుల కుపయోగమగు త్రాగు నీటిని యశుభ్రపరచిన వాడును, విషము పెట్టి చంపువాడు నెట్టిపాప మనుభవించునో యట్టి పాపమనుభవించు గాక. (నీరు లేనిచోట నీరుగలుగుటకు దగు ఉపాయములుగనిపెట్టి పానీయమగు జలముదెచ్చుట గొప్ప కార్యము, ఇప్పుడు చెన్నపట్టణమునకు త్రాగు నీరు కృష్ణానదినుండి తెచ్చుటకు ప్రయత్నము లిందుకు సాక్షి. ఉన్న శుభ్రమగు నీటిని మలమూత్ర విసర్జనాదుల వలనను, ఇతరవిధముల చేతను మురికి చేయుట మహాపాతకము. కేవలము ధనమున కాశపడి యాహార పానీయములలో విషము పెట్టి యితరులను జంపుట యెట్టి ఘోరపాపమో యూహించునది.)

**బ్రాహ్మణాయోద్యతాం పూజాం విహంతు కలుషేంద్రియః।**
**బాలవత్సాం చ గాం దోగ్ధుం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

రామవనగమనము నంగీకరించినవాడు బ్రాహ్మణునకు జేయనిశ్చయించిన సన్మానమును చెరచినవాడును, ఈని పది దినములైననుగానట్టి యావుల బితికి పాలు గ్రహించినవాడు ఎట్టి పాప మనుభవించునో యట్టిగొప్ప పాప మనుభవించునుగాక.



**తృష్ణార్తం సతి పానీయే విప్రలంభేన యోజయేత్।**
**లభేత తస్య యత్పాపం యస్యాఽర్యోఽనుమతే గతః॥**

ఒకడు దప్పిగొని నీరడుగగా నింటిలో మంచినీ రుండియు నేదో యొక నెపముపెట్టి లేదనువాడును. ఒకవేళ యిచ్చినను ఉప్పునీటి నిచ్చువాడును పొందు పాపమును రాము డడవికి బోవ సమ్మతించినవాడు పొందునుగాక (ఆకలి సమయమున నన్నముపెట్టుట, దప్పిగొనిన వానికి మంచినీరిచ్చుట గొప్ప సుకృతమని యెంచవలెను.)

**భక్త్యా వివదమానేషు మార్గమాశ్రిత్య పశ్యతః।**
**తస్య పాపేన యుజ్యేత యస్యాఽర్యోఽనుమతే గతః॥**

ఇరువు రేదో యొకవిషయమున కలహించి తన్నుమధ్యస్థుడుగా నుండి న్యాయపరిష్కారము చేయ గోరగా నొకనియందు స్నేహభావమెక్కువ జూపి యతనికిమాత్రము లాభముండు విధమున పరిష్కారము చేయువా డెట్టి నరకము పొందునో శ్రీరాముని యరణ్యవాసమున కంగీకరించిన వాడట్టి నరకబాధ యనుభవించును గాక. (చిత్తూరు జిల్లాకోర్టు కట్టడముపైన ఒక మనుష్యుడు కండ్లు కట్టబడి చేతిలో తూనికత్రాసు నుంచుకొను నట్లొక ప్రతిమ యుండెడిది. దాని భావమేమి? వాది ప్రతివాదు లెవరని వారు తనకు జేరినవారా కారా యని విచారింపక వస్తువులను గుండుతో సరితూగునట్లు తూచువిధమున నిష్పక్షపాత బుద్ధితో న్యాయాన్యాయములు విమర్శించి వివాదపరిష్కారము చేయు స్థలము న్యాయస్థానమని సూచన. మధ్యస్థు డొక్కడే యైనను నిష్పక్షపాతబుద్ధితో వివాద పరిష్కారముచేయుట ధర్మమని గ్రహించునది.)

## సౌభ్రాత్రము

**భరతాయ పరం నమోఽస్తు తస్మై ప్రథమోదాహరణాయ భక్తిభాజామ్।**
**యదుపజ్ఞమశేషతః పృథివ్యాం ప్రథితో రాఘవపాదుకాప్రభావః॥**
**పాదుకాసహస్రము.**

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులలో రామునకు వయః క్రమముననేగాక సుగుణాదులలోను రెండవాడనియు, జీవాత్మకు పరమాత్మ స్వామియగుటచే పరమాత్మకు జీవాత్మ పరతంత్రుడుగ నుండుటె స్వరూపమని యనుష్ఠించి చూపినవాడు భరతుడే.

**'మాం మదీయం చ నిఖిలం చేతనాచేతనాత్మకమ్।**
**స్వకైంకర్యోపకరణం వరద స్వీకురు స్వయమ్'॥**

నన్ను నాది యని చెప్పదగిన చేతనాచేతనవస్తువు లన్నిటిని నీకైంకర్యోపకరణములుగ స్వీకరింపు మను ప్రార్థనను సార్థకముగ నిర్వర్తించిన ధన్యతముడు భరతుడు. అతని సౌభ్రాత్రమును, భగవత్పారతంత్ర్యమును, ధర్మాచరణమును నిరుపమానములు.

**కింను కార్యం హతస్యేహ మమ రాజ్యేన శోచతః।**
**విహీనస్యాథ పిత్రా చ భ్రాత్రా పితృసమేన చ॥**

దశరథున కంతక్రియలు చేసి తాను సంపాదించి పెట్టిన రాజ్యము గైకొనుమని చెప్పిన కైకేయితో భరతుడు, దేవతుల్యుడగు తండ్రిని, తండ్రివంటివాడగు రామచంద్రుని విడిచి యనాథుడనై నిర్భాగ్యుడనగు నాకు రాజ్యమేల? యనెను. దీనిభావమేమి? 'పితృదేవోభవ' అను వేదవాక్యమును, 'పితృసమో జ్యేష్ఠః' అను శాస్త్రమును పాటించి రాజ్యమువలన లభించు సుఖము, తండ్రివలనను భ్రాతవలనను గలుగు సుఖమున కెంతమాత్రము సాటి గానేరదని యుద్ఘోషించినట్లే.



**న తు కామం కరిష్యామి తవాహం పాపనిశ్చయే।**
**త్వయా వ్యసనమారబ్ధం జీవితాంతకరం మమ॥**

మావంశమునను నీ తండ్రివంశమునను జ్యేష్ఠుడే రాజగుట ధర్మమని యెరిగియు కేవల మర్థమే పరమార్థమని, రాజ్యసుఖమే మోక్షతుల్యమని భ్రమించి చేయరాని యకృత్యమును జేసి నీ పుట్టినింటికిని మెట్టినింటికిని గర్భమున బుట్టినందున నెడతెగని యపకీర్తిని నాకు దెచ్చి పెట్టి మాతృధర్మ మనుష్ఠించినట్లు రాజ్యము స్వీకరింపుమనెడు నీ దుస్సంకల్పము నెరవేరకుండునట్లు చేయుటే గాదు.

**ఏష త్విదానీమేవాహ మప్రియార్థం తవానఘమ్।**
**నివర్తయిష్యామి వనాద్భ్రాతరం స్వజనప్రియమ్॥**
**నివర్తయిత్వా రామం చ తస్యాహం దీప్తతేజసః।**
**దాసభూతో భవిష్యామి సుస్థితేనాంతరాత్మనా॥**

నీ కప్రియమునే చేసెదను. పుణ్యాత్ముడును బంధుజనప్రియుడునగు అన్నను వనమునుండి మరల్చి తోడ్కొని వచ్చెదను. అంతియేగాదు. సూర్యునివలె ప్రకాశించు రామచంద్రునకు రాజ్యాభిషేకము చేయించి అందుచే త్రికరణశుద్ధి పొంది స్థిరముగ నాతని దాసుడనై నా భగవత్పారతంత్ర్యమును మనసార పాటించి ధన్యజీవి నయ్యెదను.

**కౌసల్యాం ధర్మసంయుక్తాం వియుక్తాం పాపనిశ్చయే।**
**కృత్వా కం ప్రాప్స్యసే త్వద్య లోకం నిరయగామిని॥**

ధర్మమునందే దృష్టిగలిగి సత్పురుషులచే సుతింపబడు సదాచార సంపన్నయగు కౌసల్యాదేవికి పుత్రవియోగము గలిగించి నీ వెట్లు సుఖించి యుత్తమ లోకము పొందగలవు. తప్పక నరకమే నీకు సంప్రాప్త మగును.

***అంగప్రత్యంగజః పుత్రో హృదయాచ్చాపి జాయతే।**
**తస్మాత్ప్రియతమో మాతుః ప్రియత్వాన్నతు బాంధవః॥**

తల్లియొక్క ముఖము, కంఠము, వక్షము, కుక్షి, హస్తములు పాదములను అంగములనుండియు, నేత్రము, నాసిక, వ్రేలు మొదలగు ఉపాంగముల నుండియు మాత్రమేగాక జీవాత్మస్థానమును అనురాగస్థానమునగు హృదయము నుండియు పుత్రుడుద్భవించుటచే నౌరసపుత్రు డనబడును. అందుచే సోదరులవంటి రక్తసంబంధబంధువులును దల్లికి గుమారునివలె ప్రియతములు గానేరరు. కనుక తల్లికి పుత్రవియోగదుఃఖము భరింపరానిది, నీవు కౌసల్యా సుమిత్రలకు పుత్రవియోగ దుఃఖమును గలిగించితివి. ఇదెట్లు సహింపరానిదనుట కొక దృష్టాంతము గలదు.

పూర్వమొక సమయమున సకలధర్మములనెరిగి దేవతలచే పూజింపబడు కామధేను వాకాశమార్గమున బోవుచుండెను. అప్పుడు మిట్టమధ్యాహ్నము. కాపువా డొకడు రెండెద్దులను గట్టి మడక దున్నుచుండెను. ఆ యెద్దు నాగటి బరువుచే మెడలు వ్రేలవైచి నేల గూలి మూర్ఛిల్లినవి. అవి కామధేను వంశమున బుట్టినవి గావున దానికి బుత్రులగును. వాని కష్టము జూచి సహింపరాని దుఃఖముచే కామధేనువు కన్నీరు గార్చినది. అప్పుడు క్రిందుగ బోవుచున్న యింద్రుని మీద దాని బాష్పములు పడినవి. దాని కమ్మని వాసనచే నింద్రుడుపైన జూడగా గామధేను వేద్చుటం గని యామె యొద్దకు బోయి చేమోడ్చి 'తల్లీ! నీ వందరికిని మేలు గూర్చుదానవే. నీ కెవరు కీడుచేసిరి? అని యడిగెను. అప్పుడు కామధేనువు 'దేవరాజా! మీవారెవ్వరు నా కెట్టికీడు చేయలేదు, భూమిమీద నా సుతులు పడుపాట్లను జూచి చింతించుచున్నాను. కర్షకుడు మండుటెండలో చాలినంత మేపులేక చిక్కియున్న

* 'అంగాదంగాత్సంభవసి హృదయాదధిజాయసే ఆత్మా వై పుత్రనామాసి' అను శ్రుతిని వివరించినట్లగుచున్నది.



నా కొడుకులకు పెట్టుబాధల జూచి సహింపలేక దుఃఖించుచున్నాననియె. బహుపుత్రుల గన్న కామధేనువు రెండెద్లకష్టము జూచి సహింపనేరకున్న నేకైకపుత్రుని వియోగమును కౌసల్య సహింపసాధ్యమా? కేవలము స్వలాభము స్వసుఖమును గోరి సకలనీతి ధర్మశాస్త్రవిరుద్ధమగు పాపకార్యము చేసిన నీ కెట్టి ప్రాయశ్చిత్తమును లేదు. నీ కుభయలోక సుఖములును గలుగవు. నేను మా యన్నను గొనివచ్చి రాజ్యాభిషేకము చేయించి యతనిచరణదాసుడనై యతని కైంకర్యము చేయుచు నా యపకీర్తిని పోగొట్టుకొనెద ననియె. (భరతుడనేక విధముల తల్లిని నిందించుట యుక్తమా? యను సంశయము గలుగవచ్చును. మన శరీరములో ననేక అంగములును ఉపాంగములును గలవు. వీనిలో దేని కెట్టి యపాయము గలిగినను శరీరమంతటికి ఆ బాధ తప్పదు. ఒక వేళ యొక అంగమునకో ప్రత్యంగమునకో చికిత్సచేయ వీలు గాక ఆ యంగ ముండినను ప్రాణహాని తటస్థించునని తోచినపక్షమున నేమి చేయవలెను? ఆ దుష్టాంగమును ఖండించి శేషాంగమునకు చికిత్స చేయవలెననుట సర్వజనవిదితమే. అట్లే తల్లియైనను తండ్రియైనను మరెట్టియాప్తులైనను ధర్మవిరుద్ధముగ నపకీర్తికరమగు ప్రవర్తన గలిగియుండినచో వారిని త్యజించుటయో, వారి పాపమునకు దగిన శాస్త్రసమ్మతమును, లోకసమ్మతమునగు ప్రాయశ్చిత్తము గావించి ఆ దోషము పోగొట్టుకొనుట ధర్మమని యొప్పుకొనక తప్పదని తెలియుచున్నది.)

అపరక్రియలు ముగిసి భరత శత్రుఘ్నులున్న గదికి తూర్పువాకిట నున్న మంథరను జూచి ద్వారపాలకులు దానివలననే రామాదుల కరణ్యవాస మేర్పడినదని శత్రుఘ్నునితో జెప్ప నాత డాకుబ్జను పడ ద్రోసి కోపముతో నీడ్చుట జూచి కైక భరతుని సహాయ మడిగినందున భరతుడు తమ్ముని జూచి యిట్లనెను.

**అవధ్యాస్సర్వభూతానాం ప్రమదాః క్షమ్యతామితి॥**

**హన్యామహమిమాం పాపాం కైకేయీం దుష్టచారిణీమ్।**
**యది మాం ధార్మికో రామో నాసూయేన్మాతృఘాతకమ్॥**

**ఇమామపి హతాం కుబ్జాం యది జానాతి రాఘవః।**
**త్వాం చ మాం చ హి ధర్మాత్మా నాభిభాషిష్యతే ధ్రువమ్॥**

తమ్ముడా! ప్రాణు లన్నిటిలోను స్త్రీలు చంపదగని వారుగదా! ఓర్చియుండుము. రాముడు ధార్మికుడు, అతనికి భయపడి యూరకున్నాను గాని యీ పాపాత్మురాలగు కైకను నేనే చంపియుందును. స్త్రీవధయే మహాపాతక మనిన మాతృవధ యెట్టిపాతక మగునో యూహింపుము. మనమీ కుబ్జను జంపితిమని వినినంతనే ధర్మమే మూర్తీభవించి యున్న రామచంద్రుడు నీతోగాని నాతోగాని యెంతమాత్రము మాటలాడడు. ఇది నిశ్చయమని గ్రహింపుము.

(ఇందు వలన ధర్మానుష్ఠానమున రాముడెట్టివాడో తలచి భరతుడు భయపడెనో తన కెట్టి యపకీర్తి కలిగించి వధ్యురాలే యని తనకు దోచినపుడు గైకేయికి ప్రాణహాని కలిగింప సాహసింపలేదో భగవత్ప్రీతి కొరకు కార్యములు చేయవలెనని భగవదప్రీతికరములగు కార్యములు సర్వదా వర్జనీయములని చాటించుట గుర్తింపదగినది.)

వసిష్ఠుడు, రాజులు, మంత్రులు, పౌరశ్రేష్ఠులు, విప్రవరులు, పండితులు గూడిన సభకు భరతుని రప్పించి మృదుమధుర వాక్కుతో నతనిం జూచి

**తాత రాజా దశరథ స్స్వర్గతో ధర్మమాచరన్।**
**ధనధాన్యవతీం స్ఫీతాం ప్రదాయ పృథివీం తవ॥**

**రామస్తథా సత్యధృతి స్సతాం ధర్మమనుస్మరన్।**
**నాజహ్యాత్పితురాదేశం శశీ జ్యోత్స్నామివోదితః॥**



**పిత్రా భ్రాతా చ తే దత్తం రాజ్యం నిహతకంటకమ్।**
**తద్భుంక్ష్వ ముదితామాత్యః క్షిప్రమేవాభిషేచయ॥**

నాయనా! నీ తండ్రి ధర్మముదప్పక భూమిని పాలించి ధనధాన్యసమృద్ధమగు రాజ్యమును నీ కిచ్చి స్వర్గమునకు బోయెను. అట్లే నిత్యసత్యవ్రతుడగు రామచంద్రుడును సత్పురుషులమార్గము ననుసరించి యుదయించిన *చంద్రుడు వెన్నెలను విడువని విధమున పితృవాక్య పరిపాలనాధర్మ మనుష్ఠించి యరణ్యమున కేగెను. ఇట్లు తండ్రిచేతను సోదరునిచేతను నిష్కంటకముగ నీ కొసంగబడిన రాజ్యమును సంతోషించు మంత్రుల గూడి శీఘ్రముగ పరిగ్రహించి పట్టాభిషిక్తుడవు కమ్ము అనెను. (వసిష్ఠుడు భరతుని మనసున నుదయింపగల సందేహముల పరిష్కరించుచున్నాడని గ్రహింపవలయును, చట్టము చొప్పున గాని ప్రజాభిప్రాయమునుబట్టిగాని మంత్రుల యంగీకారమును బట్టిగాని రాజ్యస్వీకారము తప్పుగాదని సుస్పష్టము గావించెను.)

**తచ్ఛ్రుత్వా భరతో వాక్యం శోకేనాభిపరిప్లుతః।**
**జగామ మనసా రామం ధర్మజ్ఞో ధర్మకాంక్షయా॥**

వసిష్ఠునివాక్యము వినిన భరతుడు జ్యేష్ఠుడే రాజ్యార్హుడను ధర్మము నెరిగిన వాడగుటచే జ్యేష్ఠుననుసరించుటయను ధర్మము నెరపుటయం దాసక్తి గలిగి శోకమున మునిగినవాడై అట్టి దోషమునకు ప్రాయశ్చిత్తముగ రాముని స్మరించెను. (సకల ధర్మముల నెరిగి యుపదేశించునట్టి యాచార్యుడే అధర్మ

* చంద్రుని వెన్నెల వలె ననుటచే చంద్రునకు వెన్నెలతో నుండుట యెట్లు అవినాభావసంబంధమోయట్లేరామచంద్రునకు పితృవాక్యపరిపాలనానుష్ఠాన మని వార్యమైనదని, సహజ స్వభావమని తెలుపుచు రామచంద్రుని మరల్చి పిలుచుకొని వచ్చుట చంద్రుని వెన్నెలను ప్రత్యేకింప జూచుటవంటిదే యని ధ్వనింప జేసినట్లగుచున్నది.

మనుష్ఠింపుమని చెప్పినట్లే గ్రహించి అది తనకు నచ్చనందున దుఃఖసాగరమున మునింగె. తాను లేని సమయమున దశరథుడు మరణించెనే యని దుఃఖించుచుండు భరతునకు సకల ధర్మములు న్యాయాన్యాయములు రాజకులాచారములు చక్కగ తెలిసిన వసిష్ఠుడట్టి మాట చెప్పినందుకు దుఃఖమతిశయించెను. (ధర్మకాంక్షయా) అధర్మమగు తన రాజ్యాభిషేకమును గూర్చి విని సహింపక రామచంద్రుని రాజ్యాభిషేకమును ధర్మమును గోరి (జగామ మనసా రామం) రాముని స్మరించెను. వసిష్ఠునివంటి గురూత్తముని యాజ్ఞలేక వాక్యమును బాటింపక వీలులేనందుకు క్షమింపుమని రాముని ప్రార్థించె ననియు గ్రహింపదగును. ఇచ్చట రాజ్యపాలనము చేయుట యను సామాన్యధర్మము కంటెను రామచంద్రునకు పరతంత్రుడై సేవ చేయుట యుత్తమ మని తలచెనని తెలియును.)

**స బాష్పకలయా వాచా కలహంసస్వరో యువా।**
**విలలాప సభామధ్యే జగర్హే చ పురోహితమ్॥**

యువకుడగు భరతుడు ధర్మవిరుద్ధమగు మాటలు వినవలసివచ్చెనే యను దుఃఖమున బాష్పపూరిత నయనములతోను డగ్గుత్తికపడిన కంఠముతోను నిండు సభలో పురోహితుడగు వసిష్ఠుని నిందించుచు రాజహంస వంటి గొంతెత్తి యేడ్చెను. (బాష్పకలయా- దుఃఖాతిశయముచే కన్నుల నీరు నిండ (వాచా) అస్పష్టమగు మాటలచే (కలహంస స్వరః) రాజహంసవంటి గంభీరస్వరముతో గూడినవాడై (యువా) యుక్తవయస్కుడయ్యు భోగాభిరుచితో నిండియుండవలసిన వాడైనను తుచ్ఛభోగముల నేవగించి, భగవత్పారతంత్ర్యధర్మవిరుద్ధమగు దానిని తిరస్కరించి (విలలాప) ఏడ్చెను. (పురోహితం) కులమునకు రాగల మేలును గోరువానిని-ఆహా! మా కులమునకెట్టి మేలు గలిగించు మాటలాడితివయ్యా-యని యెత్తిపొడిచినట్లు (సభామధ్యే) ఎల్లర సమక్షమున 'నియమాతిక్రమం రహసి బోధయేత్' నియమమును దప్పుటను రహస్యమున బోధింపవలెనను హద్దును దాటి (జగర్హే) ఆచార్యా! రహస్యమున ధర్మము నుపదేశించి సభలో నధర్మము బోధించుటయా యని దూరినట్లగును. ఆచార్య దూషణము తప్పే. కాని యాచార్యుడు పూర్వాచారమునకు లోకన్యాయమునకు విరుద్ధమగు మాటలు చెప్పునేని ఆతనిని నిందించుట తప్పని భావింపరాదని తెలియుచున్నది. అతడు నిండు సభలో నధర్మము చేయుమనినపుడు బదులు చెప్పక రహస్యసమయముకొరకు వేచియుండ వీలుకాదు. ఊరకుండినచో నతని మాట నంగీకరించి రాజ్యస్వీకారమొప్పుకొనినట్లగును. అందుచే భరతుడట్లు వసిష్ఠుని నిందించుటలోని రహస్యమెరిగిన వసిష్ఠునకు సమ్మతమే గాక భరతుని దృఢాధ్యవసాయమును మెచ్చుకొనినట్లే భావింపనగుననియు చెప్పవచ్చును. 'గురుం ప్రకాశయేద్ధీమాన్' అని ధర్మానుష్ఠానమున గురువునుమించి ముందడుగు వేయు బుద్ధిమంతుడును జ్ఞానవైరాగ్యనిధియు నగు సచ్ఛిష్యుడు తన కీర్తిప్రతిష్ఠల నినుమడింపజేసెనని వసిష్ఠుడు గర్వపడెననియు చెప్పవచ్చును.)



**చరితబ్రహ్మచర్యస్య విద్యాస్నాతస్య ధీమతః।**
**ధర్మే ప్రయతమానస్య కో రాజ్యం మద్విధో హరేత్॥**

బ్రహ్మచర్యమున గురుకులవాసముచేసి సాంగవేదాధ్యయనము చేసి బుద్ధిమంతు డగుటచే దాని యర్థమును గ్రహించి తదనుగుణముగ ధర్మానుష్ఠానము చేసి స్నాతకవ్రతము జరిపి నీతి నియమముల జక్కగ బాటించు రామచంద్రమూర్తియొక్క రాజ్యమును శాస్త్రమునకు లోబడియుండు నావంటివా డెట్లు అపహరించును? (ఒకరిసొత్తు నొకరు అపహరింపరాదు, సామాన్యుల సొత్తుకంటె సత్పురుషుల సొత్తున కెక్కువ మర్యాదగలదు. సకలధర్మములు దెలిసి తానట్లె యనుష్ఠించు ఉత్తమపురుషుడును చలింపని మనసుతో నాయా కాలాను గుణములగు

ధర్మముల జక్కగ బాటించువాడు నగు రామచంద్రుని సొత్తగు రాజ్యముపై సద్గురుశిష్యుడును, శాస్త్రవశ్యుడు నగు నావంటివా డేకారణమును బట్టిగాని ఆక్రమింపరాదని నొక్కిచెప్పినాడని భావము.)

**కథం దశరథాజ్జాతో భవే(ద్రాజ్యాపహారకః।**
**రాజ్యం చాహం చ రామస్య ధర్మం వక్తుమిహార్హసి॥**

న్యాయవర్తనకును ధర్మపరిపాలనమునకును ప్రసిద్ధిచెందిన దశరథుని కుమారుడుగ బుట్టిన నే నెట్లు ఇతరునిరాజ్యము నపహరింతును? రాజ్యమే కాదు; రాజ్యమువలె నేనును రామునిసొత్తే. ఇట్టి విషయమున ధర్మమే పలుకదగుదువుకాని వేరుకాదు. (గట్టునవేసిన చేపవలె రాముడడవికి బోయిన వెంటనే ప్రాణము విడిచిన దిశదిక్కులను వ్యాపించిన గొప్పకీర్తితో గూడిన దశరథ మహారాజునకు బుట్టిన నేనెట్లు ధర్మవిరుద్ధముగ శ్రీరాముని రాజ్యము నపహరింతును? ఈ రాజ్యమెట్లతని సొత్తగునో నేను నతని సొత్తునుగానా? సర్వశేషియగు రామచంద్రునకు నేను సర్వ విధముల శేషభూతుడనే. శేషి సర్వస్వామియగు. సకల శేషవస్తువుల నతడేలును గాని యొక శేషవస్తువు మరియొక శేషవస్తువును ఏలునా? అట్లేలగలిగినచో రాజ్యమే నన్నేలవచ్చునే. (రాజ్యంచాహం చ రామస్య) రాజ్యమెట్లు పరతంత్రమగునో నేనును రామపరతంత్రుడ నగుదును గాని స్వతంత్రుడనెన్నటికి గాను. లోకములో కన్నతండ్రిని తిరస్కరించి రాజ్యమేలువారు నుండవచ్చును. కాని నన్నట్టివానిగా భావింపనగునా? (ఇహ) నా విషయమున మొదటినుండి నా స్వభావమిట్టిదని తెలిసియుండి (ధర్మం) పాలింపందగువాడు వీడు. పాలింపబడదగినది యిది యను ధర్మమును జెప్పవలెను కాని యొక వస్తువు మరి యొక వస్తువును బాలింపదగు నను అధర్మమును చెప్పదగదని భావము. ఒక రత్నమును ఒక పెట్టెలో నుంచినపుడాపెట్టె రక్షించునది కాదా? దానిలోని రత్నము రక్షింపబడునదికాదా యనిన ఆ విషయమును వివరింతము.



రత్నమెట్లు రక్షింపదగినవస్తువో పెట్టెయునట్లే రక్షింపదగినవస్తువేగాని రక్షించు స్వాతంత్ర్యము దానికి లేదు. పెట్టెలో రక్షింపబడు వస్తువు రత్నము. ఆ పెట్టెకు బీగము వేసి భద్రపరచుస్వామి యొకడుండవలెను గాని పెట్టెయే స్వతంత్రించి రత్నమును రక్షించుటలేదు. ఈ రెండింటిని తగు విధమున నుపయోగించు స్వామి యొకడు గలడు. అతని యిష్టము చొప్పున నీ రెండు నుపయోగింపబడును గాన నాకును రాజ్యమునకును రక్షకుడు, నియామకుడు రామచంద్రుడే యను న్యాయము నొప్పుకొని, (ధర్మం వక్తుమర్హసి) అతని నియమనమే యనుష్ఠింపదగినది. కాని మనము స్వతంత్రించి మనయిష్టము చొప్పున చేయరాదను ధర్మమునే బోధింపవలెనని వాదించెను. ఇంత వరకు భరతుడు తన పారతంత్ర్యమును జెప్పి యిక రామచంద్రుని రాజ్యార్హత యెట్టిదో చెప్పుచున్నాడు.

**జ్యేష్ఠ శ్రేష్ఠశ్చ ధర్మాత్మా దిలీపనహుషోపమః।**
**లబ్ధుమర్హతి కాకుత్స్థో రాజ్యం దశరథో యథా॥**

మా యన్న రామచంద్రుడు నాకు బెద్దవాడు, కల్యాణగుణపరిపూర్ణు డగుటచే సర్వశ్రేష్ఠుడు. అతనికి ధర్మమార్గమొక్కటే కనబడును. క్షత్రియులలో సూర్యవంశమని చంద్రవంశమని రెండు గలవు. ఆ రెండు వంశములలో ధర్మరతులని యెవరు కీర్తిపొందిరో యట్టి కీర్తిపొందినవాడు మా యన్న. కనుక సర్వవిధముల నతడే దశరథునివలె నీ రాజ్యమును పొంద దగినవాడు. ('ఏండ్లు మీరినవాడావృద్ధుడు' అను సామెత చొప్పున కేవలము వయస్సునందు పెద్దవాడగుటయేకాదు. అతని సుగుణములు సాటిలేనివి. అతడు మూర్తీభవించిన ధర్మదేవతయేయని దృఢముగ జెప్పగలను. అతని కతడేసాటి. కాని లోకన్యాయమున గొప్పకీర్తి పొందిన చక్రవర్తులలో దిలీపునకును నహుషునకును సాటియని చెప్పవచ్చును. మేము కన్నులార జూచినది దశరథుని పాలనమే. అతని బలపరాక్రమములు, బుద్ధిసూక్ష్మత.

ధర్మానుష్ఠానము దశదిక్కుల వ్యాపించినవి. అట్టి మహారాజునకు వెనుక రాజ్యమునకు రావలసిన వా డన్నివిధములను రామచంద్రుడేయని నిస్సంశయముగ చెప్పినాడు భరతుడు.)

**అనార్యజుష్టమస్వర్గ్యం కుర్యాం పాపమహం యది।**
**ఇక్ష్వాకూణామహం లోకే భవేయం కులపాంసనః॥**

ఇట్టి సత్పురుషులు మెచ్చనట్టిదియు, నరకప్రాప్తికి మూలమునగు పాపమును జేసితినేని ఇక్ష్వాకు వంశమున కిదివరలో సర్వత్ర వ్యాపించిన సత్కీర్తిని మంటగలపిన కులనాశకుడ నగుదును. (దీనిం జూడ భగవద్గీతలో కృష్ణుడు పార్థునకు జెప్పిన వాక్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. 'అనార్యజుష్టమస్వర్గ్యం అకీర్తికర మర్జున' అప్రయత్నముగ సంభవించిన ధర్మయుద్ధమును కర్మనాచరింపకుంటివేని సత్పురుషులేవగించునట్టిదియు నరకమున ద్రోయునదియు శాశ్వతాపకీర్తి దెచ్చునదియు నగు అధర్మముచేసినవాడ వగుదువు. ఇచ్చట రాజ్యపాలన సాగవలెనను తలంపుతో వసిష్ఠులు చెప్పినమాట యధర్మమని దాని ననుష్ఠించిన లోకనింద్యమును, కులనాశనమును. అపకీర్తి కాస్పదము, వంశనాశ మొనర్చిన వాడ నగుదు ననిన భగవత్పరతంత్రుడగు భరతు డనుష్ఠించిన విశేషధర్మము తెలియుచున్నది.)

**యద్ధి మాత్రా కృతం పాపం నాహం తదపి రోచయే।**
**ఇహస్థో వనదుర్గస్థం నమస్యామి కృతాంజలిః॥**

**రామమేవానుగచ్ఛామి రాజా స ద్విపదాం వరః।**
**త్రయాణామపి లోకానాం రాజ్యమర్హతి రాఘవః॥**

నా తల్లి చేసిన పాపము నే నెంత మాత్రము నొల్లను. నే నిచ్చటినుండియే చొరరాని యరణ్య ప్రదేశముననుండు రామచంద్రున కంజలిగీలించి



నమస్కరించి సర్వపాపపరిహారమగు శరణాగతిని గావించి మరల ప్రత్యక్షమున దాని ననుష్ఠింతును. నేను రామునే యనుసరించుచుండెదను. రాముడే రాజుగాని మరెవ్వరు అర్హులు గారు. అతడీరాజ్యమునే కాదు. ముల్లోకముల నేల గలవా'డనెను.

రాముని మరల్చి తోడ్కొని వచ్చుటకు తగిన సన్నాహము లన్నియు గావింపబడుట జూచి వసిష్ఠాదు లందరు చాల సంతోషించిరి.

## చిత్రకూటయాత్ర

భరతుడు చతురంగబలసమేతుడై వసిష్ఠాది ఋషులతోను. సుమంత్రాది మంత్రులతోను, కౌసల్యాదులైన తల్లులతోను, పౌరులతోను చేసిన చిత్రకూట యాత్ర ప్రపంచమున అపూర్వమును అద్వితీయమును మహాపవిత్రము నగునది. ఇందులో మొట్టమొదట గమనింపదగినది–

**కైకేయీ చ సుమిత్రా చ కౌసల్యా చ యశస్వినీ।**
**రామానయనసంహృష్టా యయుర్యానేన భాస్వతా॥**

కైకేయి, సుమిత్ర, కీర్తిమంతురాలగు కౌసల్యయు శ్రీరాముని పిలుచుకొని వచ్చుటలో సంతోషముతో వేర్వేరు వాహనముల నెక్కి పోయిరి. (కనిష్ఠురాలగు కైకేయిని మున్ముందుగ చెప్పవలసిన కారణ మేమనిన ఆమె తాను రామునిపట్ల చేసిన యపచార మిట్టిదని మంథర దుర్బోధ తలకెక్కినందున గుర్తింపలేకుండినది. భరతుడు తనతల్లి చేసిన మహాపరాధము తనకు తీరని యపకీర్తి తెచ్చినందులకు హృదయవేదనతో తల్లిని దూరిన విధమును వసిష్ఠునంతటి గురువును సభలో నిందించుటయు రాముని మరల్చితెచ్చుట యొక్కటే ప్రతిక్రియయని చాటించి తన సత్యసంధత్వమును, జితేంద్రియత్వమును, వైరాగ్యాతిశయమును దెలిపి సకల పాపపరిహారమగు చిత్రకూటయాత్రకు బయలుదేరునప్పుడు కైకేయికి గలిగిన హృదయపరివర్తన

మెట్టిదో తాను జేసిన యకృత్యమునుగూర్చి యామెకు గలిగిన పశ్చాత్తాప మెట్టిదో యీసందర్భమున నామె మున్మందుగ బయలుదేరుటలో సువ్యక్తమగుచున్నదని తెలియునది.

భరతునితో ప్రయాణము చేయుచుండిన జనులు సీతారామలక్ష్మణుల జూచు కోరికతో సంతోషముతో సంభాషించుచు రామచంద్రు నిట్లు నుతించిరి.

**మేఘశ్యామం మహాబాహుం స్థిరసత్త్వం దృఢవ్రతమ్।**
**కదా ద్రక్ష్యామహే రామం జగతశ్శోకనాశనమ్॥**

మేఘమువంటి శ్యామలవర్ణము గలవాడును, దీర్ఘముగను దృఢముగను గుండ్రములగు భుజములు గలవాడును, స్థిరమగు వ్యవసాయము గలవాడును, చలనము లేని కార్యదీక్షగలవాడును, లోకముయొక్క దుఃఖమును పోగొట్టువాడునగు రామచంద్రుని మన మెప్పుడు చూతుమో? ('మేఘశ్యామం' శ్యామల వర్ణముచే మేఘమువంటి సుందరాకారముగలవాడు. అతనిని చూచినంత మాత్రమున జనులు సంతోషముతో నిండి మేఘమును జూచిన నెమళ్ళవలె నానందింతురు. సూర్యుని కిరణములచే తపింపచేయబడిన వారి తాపమును మేఘమెట్లు శాంతింప జేయునో యట్లే దీనుల దైన్యమును తాపమును బోగొట్టి సంతోషింప జేయువాడు. 'మహాబాహుం' అజానుబాహువనుట పురుషశ్రేష్ఠుడనుటను చాటును. నిడుదలైన భుజములు గలవా డనుటచే ఆశ్రితులయొక్క, శత్రువుల నిర్మూలించి వారిని రక్షించువాడని యర్థము. దాన మిచ్చుటను దెలుపునది నిడుపగు బాహువు. కనుక దానవీరు డనియు స్పష్టమగుచున్నది. స్థిరసత్త్వం' ఒక కార్యమునకు పూనుకొనిన సఫలముగ సాంతముగ జేయువాడు. ఆశ్రితులపట్ల స్థిరమగు బుద్ధితో వారల నుద్ధరించుటకై సర్వవిధముల



తోడ్పడువాడు. తన యాశ్రితులే తనకు విరోధులైనను మనసున కలకలేనివాడు 'దృఢవ్రతమ్' ఎట్టి కారణముచేగాని తన సంకల్పము విడువనివాడు. ఆశ్రితుల రక్షింప సంకల్పించినపు డెట్టి యాంతరంగికులు (భార్యయైనను) దాని కడ్డువచ్చిన లక్ష్యము చేయడు.)

'రామం' మనోజ్ఞుడగు రామచంద్రుని 'కదా ద్రక్ష్యామః' ఎప్పుడు చూతుమో! అతని వియోగము ననుభవించి సహింపలేక అతని దర్శన భాగ్యమున కువ్విళ్లూరుచున్నారని తెలియుచున్నది. ఇట్లే జీవాత్మలు పరమాత్మతో సంయోగ మెప్పుడు గలుగునో యని యెదురు చూడవలెనని గుర్తింపవలెను. 'జగత శ్శోకనాశనమ్' లోకములోని వారి కనేక కారణములచే శోక మేర్పడును. ఎవ రెవరి కెట్టి శోక మేర్పడినను దానిని పోగొట్టజాలినవా డతడే. అన్యు డెవ్వడును గాడు. 'అహం త్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి మాశుచః' అని కృష్ణావతారమున జెప్పిన దానిని పూర్ణముగ ననుష్ఠించిన అవతారమూర్తి రామచంద్రుడు. 'అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ' ఎవ డొక్క పర్యాయము 'నేను నీవాడ. ననునో వాని పాపము లన్నిటిని పోగొట్టి వాని కభయ మిత్తును. ఇదియే నా వ్రతమనినవాడు రామచంద్రుడు. కనుక భరతాదు లందరు 'మేము నీవారము' అని కదా రామదర్శనము గోరి బయలుదేరిరి.

**దృష్ట ఏవ హి నశ్శోకమపనేష్యతి రాఘవః।**
**తమస్సర్వస్య లోకస్య సముద్యన్నివ భాస్కరః॥**

సూర్యు డుదయించుటవలన లోకము నావరించియున్న అంధకారము తొలగును. అట్లే రాముడు మనకు కనబడినంత మాత్రముననే మన శోకము లన్నిటి నతడు పోగొట్టును. దృష్ట ఏవ' చూడబడినంతనే అతడు మమ్ము జూచి మందహాసము చేయనక్కరలేదు. కడగంటజూచుచు సంభాషింప

నక్కరలేదు. మే మతని దయను బొంద నెట్టి ప్రయత్నము చేయనక్కరలేదు. అతడు మాకు దూరమున గనబడినచాలును. మా శోకము లన్నియు వెంటనే నశించును. 'సముద్యన్నివభాస్కరః' దూరమున నుదయించు సూర్యుడు 'సర్వస్య లోకస్య తమ ఇవ' లోకమంతటను వ్యాపించియున్న చీకటిని పోగొట్టుట సర్వజననిదితమే. అట్లే సూర్యవంశమున నుదయించిన భాస్కరతుల్యప్రతాపము, ప్రభావము, ప్రకాశము గల రామచంద్రుడు మా శోకము లన్నిటిని పోగొట్టుననియర్థము.

## గుహ భరత సమాగమము

భరతుడు వచ్చుటను జూచి శృంగిబేరపురాధిపతియగు గుహుడు తన పరివారముతో–

**యథా తు ఖలు దుర్బుద్ధిర్భరత స్స్వయమాగతః।**
**స ఏష హి మహాకాయః కోవిదారధ్వజో రథే॥**

'సముద్రము పొంగినట్టు వచ్చుచున్న సేనను జూచితిరా? పర్వతమువంటి గొప్పరథము నలంకరించు ధ్వజమున, కోవిదారవృక్ష మగపడుచున్నది. ఇది ఇక్ష్వాకువంశస్థుల టెక్కెము. దీని నుపయోగించు దశరథుడు మృతు డయ్యెను. రామచంద్రు డడవి కేగెను. కనుక నీ ధ్వజముతోవచ్చువా డెవడోగాడు. తల్లిచేసిన వంచన చాలక నిష్కంటకముగ రాజ్యమునేలు తలంపుతో రాముని కెగ్గుచేయు దుర్బుద్ధితో గూడిన భరతుడు తానే వచ్చుచున్నాడు.

**భర్తా చైవ సఖా చైవ రామో దాశరథిర్మమ।**
**తస్యార్థకామాస్సన్నద్ధా గంగాఽనూపే ప్రతిష్ఠత॥**

నాకు రాముడే ప్రభువు. అతడే నాకు పరమమిత్రుడు. భర్తనుగాచుట భృత్యుని ధర్మము. మిత్రుని గాచుటయు నట్టిదే. ఇట్టి నా స్వధర్మమును



చేయకుండుటచే కృత్యాకరణదోషమును, అకృత్యకరణదోషమును నాకు వాటిల్లును. రాముని క్షేమము కొరకు మీ రెల్లరు గంగాతీరమున నాహారపదార్థాలు సేకరించుకొని యుద్ధసన్నద్ధులై యుండుడు.

అచ్చట సుమంత్రుడు సమయజ్ఞు డగుట గుహుడు రామభక్తు డనియు నాతని సహాయమున గార్యములు సఫల మగుననియు నతనికి దర్శన మియ్యందగునని చెప్ప భరతుననుజ్ఞ బొంది గుహుడు భరతుని జేరి

**నిష్కుటశ్చైవ దేశోఽయం వంచితాశ్చాపి తే వయమ్।**
**నివేదయామస్తే సర్వే స్వకే దాసకులే వస॥**
**ఆశంసే స్వాశితా సేనా వత్స్యతీమాం విభావరీమ్।**
**అర్చితో వివిధైః కామై శ్శ్వస్ససైన్యో గమిష్యసి॥**

'ఈ ప్రదేశము నీ రాజ్యమున కుద్యానవనము వంటిది. మీరాక ముందుగ దెలియనందున మోసపోతిమి. మిమ్మెదుర్కొనివచ్చి స్వాగత మీయలేక పోతిమి, నీవు నీదాసులమగు మాయింట నుండుము. మీ సేనయంతయు లెస్సగ భుజించి యీ రాత్రి యిచ్చటనుండి రేపు పయనము గావచ్చునని మా ప్రార్థన' యనెను. భరతు డంత సంతోషముతో

**ఊర్జితః ఖలు తే కామః కృతో మమ గురోస్సఖే।**
**యో మే త్వమీదృశీం సేనా మేకోఽభ్యర్చితుమిచ్ఛసి॥**

'మా యన్నకు స్నేహితుడ వగుటచే నీవు నాకు జ్యేష్ఠభ్రాతవంటివాడవే. నీవొక్కడవే యింత పెద్ద సైన్యమున కాతిథ్యమియ్యం గోరెదవు. 'అన్నరసమునకంటె నాదరణరస మెక్కువ యన్నట్లు నీ మాటలే మా కాతిథ్య మిచ్చినంత సంతోషము గలిగించుచున్నవి. భరద్వాజాశ్రమమున కేది మార్గము? ఈ గంగానదిని దాటుట కష్టమని తోచుచున్నదనెను. తనపరివారముతో తానాకార్యము చేయించెదనని చెప్పి గుహుడు భరతుని జూచి,'

**కచ్చిన్న దుష్టో వ్రజసి రామస్యా క్లిష్టకర్మణః।**
**ఇయం తే మహతీ సేనా శంకాం జనయతీవ మే॥**

'రామచంద్రు డెవ్వరికి నెట్టి కీడు తలంచని పరమపావనుడే. అతని కెట్టి కీడు చేయదలంపకున్నావా? ఈ నీ గొప్పసేనను జూచినంతనే నామనసున గొప్పసందేహము పుట్టుచున్నది' యనెను. ఆకాశమును మురికిచేయ నెంచి యెవడైన నెట్టిమలినమును వేసినను వానిచేతులు మలినమగునేగాని యాకాశమును మలినము చేయ వీలుకాదుగదా! అట్లే భరతుని మీద నెవరెట్టిదోష మెత్తి చెప్పినను నిర్మలాంతఃకరణుడగు భరతు డెంతమాత్రము కోపము చెందక–

**మాభూత్స కాలో యత్కష్టం న మాం శంకితుమర్హసి।**
**రాఘవస్స హి మే భ్రాతా జ్యేష్ఠః పితృసమో మతః॥**
**తం నివర్తయితుం యామి కాకుత్స్థం వనవాసినమ్।**
**బుద్ధిరన్యా న తే కార్యా గుహ సత్యం బ్రవీమి తే॥**

'గుహా! అట్టి కష్టకాలము రాకుందుగాక, నన్ను నీవెంతమాత్రము శంకింపం దగదు. రాముడు నాకు జ్యేష్ఠ భ్రాతయగుటచే తండ్రికి సమానుడని తలంతును. వనమున వసించుచుండు మావంశశ్రేష్ఠుని పిలుచుకొనివచ్చుటకై పోవుచున్నాడను. నీవు వేరువిధముగ దలంపకుము. గుహా! నేను సత్యమునే పలుకుచున్నానని దృఢముగ నమ్ముమ'నెను. ఈ మాటలు చెవిని బడగానే గుహుడు సంతోష మతిశయింప,

**ధన్యస్త్వం న త్వయా తుల్యం పశ్యామి జగతీతలే।**
**అయాత్నాదాగతం రాజ్యం యస్త్వం త్యక్తుమిహేచ్ఛసి॥**
**శాశ్వతీ ఖలు తే కీర్తి ర్లోకాననుచరిష్యతి।**
**యస్త్వం కృచ్ఛ్రగతం రామం ప్రత్యానయితుమిచ్ఛసి॥**



'ఆహా! ప్రయత్న మెంతమాత్రము లేక లభించిన రాజ్యలక్ష్మిని విడిచి పెట్టుట కీలోకమున నెవడు గోరును? నీవే ధన్యుడవు. ఈ జగమున నీకు సాటివా రెవ్వరు లేరు. నీకీర్తి శాశ్వతముగ నిలుచునుగాక. అడవిపాలయి కష్టములు పడుచుండు రామచంద్రుని మరల్చి తోడ్కొని రాగోరుచున్నావు. అట్టి సత్కార్యముచేసి కీర్తిగాంచిన వా డెవ్వడును లేడు' అనెను.

ఇంతలో రాత్రియయ్యెను. భరతుడు రామునిగూర్చిన చింతతో తపించుచుండుట గాంచి గుహుడు.

**ఆచచక్షేఽథ సద్భావం లక్ష్మణస్య మహాత్మనః।**
**భరతాయాప్రమేయాయ గుహో గహనగోచరః॥**

లక్ష్మణున కన్న యందలి భక్త్యతిశయ మిట్టిదని నిరూపింప దలచి లక్ష్మణుడు ధనుర్ధరుడై సీతారాముల గాచియుండ నే నతనితో నిట్లంటిని.

**ఉచితోఽయం జనస్సర్వో దుఃఖానాం త్వం సుఖోచితః।**
**ధర్మాత్మంస్తస్య గుప్త్యర్థం జాగరిష్యామహే వయమ్॥**
**నహి రామాత్ప్రియతరో మమాస్తి భువి కశ్చన।**
**మోత్సుకోభూర్బ్రవీమ్యేతదప్యసత్యం తవాగ్రతః॥**

'లక్ష్మణా! మే మందరము దుఃఖానుభవమునకు దగినవారమే. నీవన్ననో సుఖమునకే తగినవాడవు. ధర్మస్వరూపుడైన రాముని రక్షింప మేమందరము మేటుకొనియుండెదము. నీవు సుఖముగ నిద్రింపుము. ఈ లోకమున రామచంద్రునికంటె ప్రియతరమగువాడు నా కొక్కడును లేడు. ఆతనియం దనన్య భక్తి కలదు. ఇది నిజమని సత్యముపై ప్రమాణముచేసి చెప్పెదను.

**అస్య ప్రసాదాదాశంసే లోకేఽస్మిన్ సుమహద్యశః।**
**ధర్మావాప్తిం చ విపులామర్థావాప్తిం చ కేవలామ్॥**

'ఈ మహానుభావుని దయచేతనే లోకమున గొప్పకీర్తియు పరలోక సాధనమగు ధర్మమును మరియు న్యాయముగ నార్జించిన విత్తమును పొందగోరుచున్నాడను. కనుక నట్టి పరమపురుష నుపేక్షింతునా? నిశ్చింతగ నిద్రింపు'మ నినంత నాతడు–

**కథం దాశరథౌ భూమౌ శయానే సహ సీతయా।**
**శక్యా నిద్రా మయా లబ్ధుం జీవితం వా సుఖాని వా॥**

ఇంద్రసమానుడగు దశరథమహారాజు కడుపునబుట్టిన రామచంద్రుడు జానకితో నేలమీద పరుండి యుండగా ప్రాణము ధరించియుండుటే కష్టముగనుండు నాకు నిద్ర యెట్లువచ్చును? ఎట్టి సుఖమును బొందశక్యమా?

**అతిక్రాంతమతిక్రాంత మనవాప్య మనోరథమ్।**
**రాజ్యే రామమనిక్షిప్య పితా మే వినశిష్యతి॥**

**సిద్ధార్థాః పితరం వృత్తం తస్మిన్ కాలే హ్యుపస్థితే।**
**ప్రేతకార్యేషు సర్వేషు సంస్కరిష్యంతి భూమిపమ్॥**

మించిపోయినది మించిపోయినది. ఆహా! మాతండ్రి తన ప్రాణసమానుడగు రాముని రాజ్యమునందు నెలకొల్పక తన కోరిక యీడేరకయే మరణించెనే. అట్టి చరమదశయందు తండ్రిచెంత నుండి యతని కగ్నిసంస్కారాదు లొనర్చు భరత శత్రుఘ్నులే ధన్యులు. అంతటి భాగ్యములేని మే మాతని పుత్రులమని చెప్పుకొనుటెట్లు?

**అపి సత్యప్రతిజ్ఞేన సార్ధం కుశలినా వయమ్।**
**నివృత్తే సమయే హ్యస్మిన్ సుఖితాః ప్రవిశేమహి॥**

పదునాలుగేండ్ల వనవాసకాలము గడచి యరణ్యవాసప్రతిజ్ఞ చెల్లించుకొని క్షేమముగ నున్న రామచంద్రునితో సుఖముగ నయోధ్యకు మరివత్తుమా? అని యిట్లు మేము సంభాషించుచుండ ఆ రాత్రి గడచినది. మరునా డుదయము రామలక్ష్మణులు జడలు దాల్చి నా సాయమున గంగానది దాటి చని'ర నెను.



ఇట్టి యప్రియమైన మాటను విని సహింపలేక భరతుడు మూర్ఛిల్లెను. శత్రుఘ్ను డన్నను గౌగిలించి గొంతెత్తి రోదనము చేయ భరతుని తల్లులచ్చటికి వచ్చిరి. కౌసల్యాదేవి భరతుని కౌగిలించుకొని.

**వత్సలా స్వం యథా వత్సముపగూహ్య తపస్వినీ।**
**పరిపప్రచ్ఛ భరతం రుదంతీ శోకలాలసా॥**

**పుత్ర వ్యాధిర్న తే కచ్చిచ్ఛరీరం పరిబాధతే।**
**అద్య రాజకులస్యాస్య త్వదధీనం చ జీవితమ్॥**

దూడయం దత్యంత ప్రీతిగల యావు దూడ నెట్లోయట్లే శోకించుచుండు కౌసల్య భరతునిజూచి 'నాయనా! రామవిరహ వేదనారోగము నిన్ను బాధించుచున్నదా? ఇప్పుడీ పవిత్రవంశములోని మా యెల్లరప్రాణములు నీ యధీనమున నున్నవి. పాలముంచిన నీటముంచిన నీవేగతి. వనములోనుండు రామలక్ష్మణులగూర్చి యశుభవార్త యెవ్వరేని వినిపించిరా? యని పరి పరి విధములనోదార్చిన రామమాతనే తన మాతగ దలచిన భరతు డట్లేమి లేదని చెప్పి గుహుని జూచి.

**భ్రాతా మే క్వావసద్రాత్రౌ క్వ సీతా క్వ చ లక్ష్మణః।**
**అస్వపచ్ఛయనే కస్మిన్ కిం భుక్త్వా గుహ శంస మే॥**

'గుహా! నా జ్యేష్ఠుడు రాత్రి యెచ్చట నిద్రించెను? సీతాదేవి యెచ్చట శయనించెను? లక్ష్మణు డెచ్చట నుండెను? వారేమి భుజించిరో, యెచ్చట నిద్రించిరో నాకు జెప్పు' మనెను. (భరతుడు మూర్ఛిల్లినపు డచ్చటనే యుండిన కైకేయి యతని నోదార్చలేదు. ఏల? తనతల్లి చేసిన

భగవదపచారమునకు తగిన ప్రాయశ్చిత్త మింకను జరుగనందున నామె నతడే యంగీకరింపకుండి యుండవచ్చును. భరతుడు శపథములు చేసినప్పటినుండి కౌసల్య కతనియం దాదర మినుమడించెను. భరతుని చిత్రకూటయాత్ర సఫలమగుట కతనిక్షేమమే ప్రధానము. ఇన్ని కారణముల బట్టి కౌసల్య భరతుని కౌగిలించుకొని యోదార్చుట శ్లాఘ్యముగ నున్నది.)

**అన్నముచ్చావచం భక్షాః ఫలాని వివిధాని చ।**
**రామాయాభ్యవహారార్థం బహు చోపహృతం మయా॥**

**తత్సర్వం ప్రత్యనుజ్ఞాసీద్రామస్సత్యపరాక్రమః।**
***న తు తత్ప్రత్యగృహ్ణాత్ సః క్షత్రధర్మమనుస్మరన్॥**

అంత గుహుడు 'నేను రామునికొరకు వివిధములైన అన్నమును భక్ష్యభోజ్యలేహ్యచోష్యములను రకరకములగు ఫలములను సమకూర్చి గొనిపోయితిని. కాని సత్యపరాక్రముడగు రాముడు క్షత్రియధర్మము ననుసరించి దాన మిచ్చుటే కర్తవ్యము గాని ప్రతిగ్రహించుట ధర్మవిరుద్ధమను న్యాయము చొప్పున దేనిని స్వీకరింపదయ్యె.'

**లక్ష్మణేన సమానీతం పీత్వా వారి మహాయశాః।**
**ఔపవాస్యం తదాఽకార్షీద్రాఘవస్సహ సీతయా॥**
***తతస్తు జలశేషేణ లక్ష్మణోఽప్యకరోత్తదా।**
**వాగ్యతాస్తే త్రయస్సంధ్యాం సముపాసత సంహితాః॥**

లక్ష్మణుడు దెచ్చిన నీరము ద్రావి గొప్పకీర్తిమంతుడగు రఘూత్తముడు సీతతో గూడి యుపవాసముండెను. రాముడు త్రావగా మిగిలిన జలమును లక్ష్మణుడు పానముచేసెను అంత నా మువ్వురు సంధ్యాసమయమున జేయవలసిన పూజాదు లనగా సంధ్యావందనము చేసిరి. (ఇచ్చట హీనజాతివాడయ్యును పరమ భక్తాగ్రేసరుడగు గుహుడు సమర్పించిన



యాహార పదార్థములను శబరీవిరాధుల న్యాయముచొప్పున స్వీకరింపకుండుట న్యాయమా యను ప్రశ్న వచ్చును. మాతాపితృ బంధుమిత్రవియోగ దుఃఖముతో నుండుటంజేసి స్వీకరింపకుండి యుండవచ్చును. అదియునుంగాక పవిత్ర గంగాతీరమగుటచే క్షేత్రోపవాస మనుష్ఠించుటం జేసి గుహు డిచ్చిన యాహారాదులను రాముడు స్వీకరింప లేదనుటయు నొప్పును. * లక్ష్మణుడు రాముడు త్రావగామిగిలిన జలమును పానముచేయవచ్చునా? అరణ్యమునకు తన్నువెంట గొనిపోవుట కిష్టపడని రామచంద్రునితో సీతాదేవి 'ఈర్ష్యారోషౌ బహిష్కృత్య భుక్త శేషమివోదకమ్' అగ్రాహ్యమగు భుక్తశేషమగు నీటినివలె నాయందు నీ కుదయించు ఈర్ష్యను కోపమును పరిత్యజింపుమనెనుగదా అని యడుగవచ్చును.) అదిసామాన్యుల విషయము. పురుషులు దేవోచ్ఛిష్టము, గురూచ్ఛిష్టము, జ్యేష్ఠభ్రాతయుచ్ఛిష్టము. స్త్రీలు భర్తయుచ్ఛిష్టమును గ్రహించుట దోషముగాదు. 'పితుర్జ్యేష్ఠస్య చ భ్రాతురుచ్ఛిష్టం భోక్తవ్య' మనున్యాయము ననుసరించి లక్ష్మణుడు రాముడు త్రావ మిగిలిన తీర్థమును స్వీకరించెనని తెలియునది. *ఇచ్చట ముప్వు రనుటచే సీతాదేవియు సంధ్య గావించినట్లున్నదే. స్త్రీలు సంధ్యవార్చుట కలదాయని సందేహము గలుగును. ఇట్లే సుందరకాండమున సీతాదేవనిగూర్చి హనుమంతు డిట్లనుకొనెను. 'సంధ్యాకాలమనాశ్యామా ధ్రువమేవ్యతి జానకీ! నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ॥ రామపత్నియగు సీతాదేవి సంధ్య నుపాసించుటయందు నాసక్తి గలది. ప్రతిదినము సంధ్య నుపాసించు నిమిత్త మామె మంచినీరు గల యీ నదికి నిశ్చయముగ వచ్చుననియె.'

ఇందు వలన పూర్వ యుగములలో స్త్రీలు సంధ్యావందవాదు లొనర్చి రనియు, స్మృతికర్తలు దానిని కలియుగమున నిషేధించిరనియు వారు మంగళ సూత్రము యజ్ఞోపవీతధారణకు సమానమని యొప్పుకొనరైరి యని తెలియుచున్నది.)

జలపానానంతరము సీతారాములు లక్ష్మణునిచే నేర్పరుపబడిన దర్భశయ్యపై బరుండిరి. లక్ష్మణుడు రాముని పాదములు గడిగి సీతచేతికి నీరందిచ్చి దూరమున ధనుర్ధరుడై కన్నుమూయక రామునిచుట్టును గాపుదలగా తిరుగుచుండెను.

**తతస్త్వహం చోత్తమబాణచాపధృత్ స్థితోఽభవం తత్ర స యత్ర లక్ష్మణః।**
**అతంద్రిభిర్జ్ఞాతిభిరాత్తకార్ముకై ర్మహేంద్రకల్పం పరిపాలయంస్తదా॥**

నేను నిద్రించు రామునకు లక్ష్మణు డేమికీడుచేయునోయని సందేహించి యుత్తమబాణములను విల్లును దాల్చి మాటిమాటికి లక్ష్మణుడున్నచోట్ల నెల్ల నతనివెంట దిరుగుచుంటిని. నా బంధువులు నన్ను జాగరూకతతో గొలుచుచుండ నేను ఇంద్రసమానుడగు రామచంద్రుని రక్షించుచుంటిని.

(ఇచ్చట లక్ష్మణు డన్నకెట్లు భక్తితో పాదసేవ చేసెనో, అతడు వదినె నెట్లు గౌరవించుచుండెనో స్పష్టమగుచున్నది. అహోరాత్రములు నిద్రాహారములు లేక సీతారాముల గొలుచు లక్ష్మణుడును పుట్టుకచే దాయాది యగుటచే నొక దాయాది యూరువెడల గొట్టెనే. మరియొక దాయాది ఎప్పుడేమి కీడుచేయునో యని సందేహించి గుహుడట్లు లక్ష్మణుని వెన్నంటి చనుచు ఆ రాత్రి తన నాథుని రక్షించెను. ఇచట భక్తుల చిత్తవృత్తి యిట్టిదని తెల్లమగుచున్నది. స్వామిసేవాపరాయణు లగువారు స్వామి యెట్టి శక్తిమంతుడైనను స్వామి కేవేళ నేమి కీడు మూడునో యను చింతచే తమవంటి భక్తులనేని సందేహింతు రని యేర్పడుచున్నది.)

రాముడు సీతతో పవ్వళించియుండిన గారచెట్టిదియే యని గుహుడు చూపినంతనే భరతు డాతురముతో నచ్చటి కేగి తల్లుల కచ్చోటు చూపి 'ఆహా! సార్వభౌముని జ్యేష్ఠకుమారుడగు నా యన్న సుఖమునకే తగినవాడుగాని కష్టమున కెంతమాత్రము దగినవాడు గాడు. విదేహరాజు



కూతురును, దశరథ చక్రవర్తి కోడలును, రాముని ధర్మపత్నియునగు జానకి యిట్టి కరకు నేలపై పవ్వళించెనా? ఇచ్చట నామె యాభరణములు రాతియం దరుగుటచే బంగారు రేణువు లచ్చటచ్చట నగపడుచున్నవి. ఆమె పట్టుచీర పోగు లచ్చటచ్చట అగపడుచున్నవి.'

**మన్యే భర్తుః సుఖా శయ్యా యేన బాలా తపస్వినీ।**
**సుకుమారీ సతీ దుఃఖం న విజానాతి మైథిలీ॥**

మిక్కిలి యౌవనవంతురాలును సుఖమునకే తగినట్టిదియు, దుఃఖమే యెరుగనట్టిదియు నగు పతివ్రతాతిలకమగు సీతకు భర్తతోడి శయ్యయే అదియెట్టిదైనను సుఖము గూర్చునది యని తెలియుచున్నది.

**హా హంతాస్మి నృశంసోఽహం యత్సభార్యః కృతే మమ।**
**ఈదృశీం రాఘవశ్శయ్యా మధిశేతే హ్యనాథవత్॥**

అయ్యో! నే నెంత పాపాత్ముడను? ఎట్టినీచుడను? ఇట్టి కరకునేలపై రామచంద్రుడు తన భార్యతో పరుండునట్లు చేసిన ఘాతుకుడను నేనే గదా? తలచినకొలది కడుపు భగ్గుమని మండిపోవుచున్నదే.

**సార్వభౌమకులే జాత స్సర్వలోకస్య సంమతః।**
**సర్వలోకప్రియస్త్యక్త్వా రాజ్యం సుఖమనుత్తమమ్॥**

**కథమిందీవరశ్యామో రక్తాక్షః ప్రియదర్శనః।**
**సుఖభాగీ న దుఃఖార్హః శయితో భువి రాఘవః॥**

**ధన్యః ఖలు మహాభాగో లక్ష్మణశ్శుభలక్షణః।**
**భ్రాతరం విషమే కాలే యో రామ మనువర్తతే॥**

**సిద్ధార్థా ఖలు వైదేహ్యా పతిం యాఽనుగతా వనమ్।**
**వయం సంశయితాస్సర్వే హీనాస్తేన మహాత్మనా॥**

రామచంద్రుడు చక్రవర్తుల కులమున బుట్టినవాడు. సకల లోక సమ్మతుడు. ఎల్లర కెల్లవేళల ప్రీతి గూర్చువాడు. సకల సుఖముల నొసగు రాజ్యలక్ష్మిని వదలి ఆ నల్లగలువవంటి దేహచ్ఛాయ గలవాడు. ఎర్రని తామరల వంటి కనులు గలవాడు. చంద్రునివలె సర్వ జన మనోరంజకుడు కష్టమున కెంతమాత్రము తగనివాడు. సుఖముకొరకే పుట్టినవాడు ఇట్టి కరకునేలమీద బరుండెనే. సకల శుభలక్షణములు గలిగి రామకైంకర్యమే సంపదయని తలచువాడగు లక్ష్మణు డిట్టి కష్టస్థితిలో నున్నను వీడక యతని కహోరాత్రములు శుశ్రూషాదు లొనర్చుటచే నతడే ధన్యజీవి. లోకమున స్త్రీలు సుఖమునే గోరుచు కష్టకాలమున భర్తను నిందింతురు. అట్లు గాక యడవిలో నైనను భర్తతో నుండుటయే సుఖమని యెంచి సకల సుఖములువీడి వనమునను భర్తృశుశ్రూష చేయుచున్నదే! ఆమెకంటెను పుణ్యముచేసినవా రెవరు గలరు?

**అద్య ప్రభృతి భూమౌ తు శయిష్యేఽహం తృణేషు వా।**
**ఫలమూలాశనో నిత్యం జటాచీరాణి ధారయన్॥**

**తస్యార్థముత్తరం కాలం నివత్స్యామి సుఖం వనే।**
**తం ప్రతిశ్రవమాముచ్య నాస్య మిథ్యా భవిష్యతి॥**

**వసంతం భ్రాతురర్థాయ శత్రుఘ్నో మాఽనువత్స్యతి।**
**లక్ష్మణేన సహ త్వార్యో హ్యయోధ్యాం పాలయిష్యతి॥**

**అభిషేక్ష్యంతి కాకుత్స్థమయోధ్యాయాం ద్విజాతయః।**
**అపి మే దేవతాః కుర్యురిమం సత్యం మనోరథమ్॥**

ఇది మొదలు నేను నేలమీదనో, గడ్డిమీదనో పరుండెదను. నేను ఫలములనో, గడ్డిదినుసులనో భుజింతును. నేను జడలు ధరించి నారచీరలు గట్టుకొనియుందును. ఇది వరకు గడచినది పోను మిగిలిన



వనవాసకాలమును రాముని కొరకు నే నడవియందు గడపెదను. ఇందువలన రాముని ప్రతిజ్ఞయు చెల్లినట్లగును. శత్రుఘ్నుడు నాతో నాకు సహాయముగ వసించును. లక్ష్మణునితో గూడి రామచంద్రు డయోధ్యకు బోగా బ్రాహ్మణు లతనికి పట్టాభిషేకము చేయుదురు. నా యిష్టదేవతలు నాయీ కోరికను సఫలము చేయుదురు గాక!

**ప్రసాద్యమానశ్శిరసా మయా స్వయం**
**బహుప్రకారం యది నాభిపత్స్యతే।**
**తతోఽనువత్స్యామి చిరాయ రాఘవం**
**వనే వసన్నార్హతి మాముపేక్షితమ్॥**

ఇట్లే నేను శిరసాప్రణామములుచేసి ప్రార్థించినను రాముడు ప్రసన్నుడు కాడేని నే నతడుండునంతకాల మతనితో వనముననే యుండి యతని ననువర్తించుచుందును. తమ్ముడును దాసుడు నగు నన్ను రాము డంగీకరింపకపోడు.

## భరద్వాజుని విందు

గుహుని సహాయమున భరతుడు పరివారముతో గంగానదిని దాటి భరద్వాజాశ్రమమునకు క్రోసుదూరమున సైన్యమును నిలిపి తాను పట్టువస్త్రములు ధరించి పురోహితుడగు వసిష్ఠుని మున్నిడుకొని మంత్రులతో దేవుగురువగు బృహస్పతికి కుమారుడగు భరద్వాజమహర్షిని సమీపించెను. వసిష్ఠుని జూచి నంతనే భరద్వాజుడు శిష్యులతో అర్ఘ్యము దెమ్మనిచెప్పుచు ఆసనమునుండిలేచెను. ఇంతలో వచ్చిన వసిష్ఠుని, అతని వెనుకనే వచ్చి నమస్కరించిన భరతుని పెద్దపిన్నవరుస ననుసరించి. ఆర్ఘ్యపాద్యములు, ఫలములు సమర్పించి భరతా! నీ సేనలకు, ధనాగారములకు, స్నేహితులకు కుశలమాయని యడిగెను. వసిష్ఠుడును భరతుడును మహర్షిని జూచి

'మీయగ్నిహోత్రములు క్రమముగ జరుగుచున్నవా? మీ దేహము లారోగ్యములా? మీ యాశ్రమమందలి పక్షులకును జింకలకును గుశలమా? మీశిష్యులు క్షేమమా? మీ యాశ్రమవృక్షములు వర్ధిల్లుచున్నవా' యని యడిగిరి. భరద్వాజుడు 'అన్నిటను క్షేమమే' యని చెప్పి శ్రీరామునందలి ప్రేమాతిశయమున–

**కిమిహాగమనే కార్యం తవ రాజ్యం ప్రశాసతః।**
**ఏతదాచక్ష్వ మే సర్వం న హి మే శుధ్యతే మనః॥**

భరతా! రాజ్యమును పాలించుచుండు నీ విప్పు డిచ్చటికేల వచ్చితివి? నీనడవడియందు నాకు దోషము గానవచ్చుచున్నది. కారణము తెలియనందున నామనసున చింతపుట్టుచున్నది. నాకంతయు వివరింపుము.

**నియుక్తః స్త్రీనియుక్తేన పిత్రా యోఽసౌ మహాయశాః।**
**వనవాసీ భవేతీహ సమాః కిల చతుర్దశ॥**
**కచ్చిన్న తస్యా పాపస్య పాపం కర్తుమిహేచ్ఛసి।**
**అకంటకం భోక్తుమనా రాజ్యం తస్యానుజస్య చ॥**

నీ తండ్రి దశరథుడు కేవల మాడుదానికి లోనై నీవు పదునాలుగేండ్లు వనమున వసింపు మనినంతనె భార్యతోను తమ్మునితోను అడవికేగిన ధర్మాత్ముడగు రామునకును అతని తమ్మునకును నిరాటంకముగ రాజ్యమేలదలచి యెట్టికీడు తలపవు కదా? అని యడిగినంతనే. భరతుడు దుఃఖముతో గన్నీరు గార్చుచు గద్గదస్వరముతో–

**హతోఽస్మి యది మామేవం భగవానపి మన్యతే।**
**మత్తో న దోషమాశంకే నైవం మామనుశాధి హి॥**

ఆహా! భూతభవిష్యద్వర్తమానముల నెరిగిన భగవంతుడవగు నీవే నిర్దోషినగు నన్ను దోషియని యెంచిన నా జన్మము వ్యర్థముగాకేమి? నే



నెన్ని పర్యాయములు పర్యాలోచించినను దోషలేశము నా యందగ పడదను నా మాట నమ్ముము. నేను మాయన్నపాదములకు మ్రొక్కి యతనిని మరల్చి తెచ్చుటకై చనుచున్నానని నమ్ముము. వసిష్ఠాది ఋషులును భరతుని యందనుగ్రహ ముంచవలెనని ప్రార్థించ భరద్వాజుడు ప్రసన్నుడై–

**'త్వయ్యేతత్పురుషవ్యాఘ్ర యుక్తం రాఘవవంశజే।**
**గురువృత్తిర్దమశ్చైవ సాధూనాం చానుయాయితా॥**
**జానే చైతన్మనస్థం తే దృఢీకరణమస్త్వితి।**
**అపృచ్ఛం త్వాం తథాఽత్యర్థం కీర్తిం సమభివర్ధయన్॥**

పురుషశ్రేష్ఠా! జ్యేష్ఠుని యనుసరించుట, యింద్రియముల నణచియుంచుట, సాధువులమార్గము ననుసరించుట మున్నగునవి రఘువంశసంభూతు డవగు నీకే తగును. నీచిత్తవృత్తి నా మనసున కిట్టిదని తెలియును గాని నీ కా సంకల్పము దృఢ మగుటకును, జ్యేష్ఠునియందు నీకు గల భక్తి యిట్టిదని లోకమున నీ కీర్తి వ్యాపించునిమిత్త మిట్లంటిని. నీ యన్న చిత్రకూటపర్వతమున నున్నాడు. నీవీ రాత్రి యిచ్చట నుండి నా యాతిథ్యము గైకొని రేపటిదినము. పొమ్మ'నెను. భరతుడంత భరద్వాజుని జూచి మహాత్మా! మీ వంటి తపోధను లిచ్చు అర్ఘ్యపాద్యాదులే మా కతిథిసత్కార మని చెప్పినను మహర్షి, భరతా! నా కోరిక నీడేరనిమ్మని చెప్పగా భరతు డందుల కంగీకరించెను.

భరద్వాజుడు అగ్నిహోత్రములున్న గృహము సొచ్చి యాచమించి శుచియై తూర్పుమొగమై చేమోడ్చి–

**'ఆహ్వయే విశ్వకర్మాణ మహం త్వష్టారమేవ చ।**
**ఆతిథ్యం కర్తుమిచ్ఛామి తత్ర మే సంవిధీతాయమ్॥'**

**ఆహ్వయే లోకపాలాన్ త్రీన్ దేవాన్ శక్రముఖాంస్తథా।**
**ఆతిథ్యం కర్తుమిచ్ఛామి తత్ర మే సంవిధీయతామ్॥'**

నేను గృహనిర్మాణము చేయు విశ్వకర్మను పిలుచుచున్నాను. నీవును త్వష్టయు వచ్చి నేను రాజునకు నతని సైన్యమునకు నియ్య దలచిన నాతిథ్యమునకు దగిన వసతిగృహముల నెల్ల తగురీతిని నిర్మించవలెను. ఇట్లే యమవరుణ కుబేరులు మున్నగు దిక్పాలురను, దేవేంద్రుడాదిగా గల దేవతల బిలుచుచున్నాను. మీరు తూర్పు పడమర దిక్కులకు పారు నదుల నిచ్చటికి రప్పింపుడు.'

కుబేరుని చైత్రరథమను నుద్యానవన మిచ్చటికి వచ్చుగాక. చంద్రు డిచ్చట భక్ష్య భోజ్య లేహ్య చోష్యములు నానావిధములుగ సమకూర్చుగాక. చంద్రుడు ఓషధీశుడు గనుక వింతవింత పూలమాలికలు. సురమొదలైన పానద్రవ్యములను పలువిధములగు మాంసముల నొసంగుగాక. దేవ గంధర్వజాతులయిన విశ్వావసువును, హాహాహూహులు. దేవతాప్సరసలు, గంధర్వాప్సరసలు. నాట్యమునకై ఘృతాచి, విశ్వాచి. యలంబుస, నాగదంత యనువారును వత్తురుగాక యనెను. పూలవాన గురిసెను. ఎచ్చట జూచినను మేడలు. అశ్వశాలలు, గజశాలలు, నిర్మింపబడినవి. వారివారి యంతస్థులకు దగిన ఆసనములు, శయ్యలు వివిధములుగ నుండెను.

భరద్వాజు నాహ్వానమున భరతుడు వసిష్ఠాదులతోను, మంత్రులతోను వేంటి భవనమును ప్రవేశించి యందుండిన సింహాసనమున రామచంద్రుడున్నట్లు భావించి యతనికి నమస్కరించి మంత్రులు గూర్చుండ దగిన యాసనమున గూర్చుండెను. మంత్రులు పురోహితులు వరుసచొప్పున గూర్చుండిరి. బ్రహ్మ, యింద్రుడు పంపగా నప్సరసలు వేనవేలుగా దివ్యవస్త్ర భూషణములతో నలంకరించుకొని వచ్చిరి. నారదుడు. తుంబురుడు, గోపుడు భరతునిముందట పాడిరి. అప్సరసలు నాట్యమాడిరి. భరద్వాజుని యాజ్ఞచే వృక్షములు స్త్రీ రూపమున భరతుని పరివారమున కన్నివిధముల నాహార పానీయముల విరివిగ నిచ్చినవి. ఒక్కొక్కపురుషున కేడెనిమిది మంది స్త్రీలు



చేరి సకలవిధోపచారములు చేసిరి. ఏనుగులు గుఱ్ఱములు, కంచరగాడిదలు. ఒంటెలు మొదలగు వానికి తగినట్టియాహారము లనేకము లియ్యబడెను. ఆ రాత్రి యెల్లరు మృష్టాన్నభోజనములతో సంగీతనాట్యములతో సంతోషముగ కాలము గడపిరి. భరద్వాజునాజ్ఞబొంది దేవతాస్త్రీలు, దేవతలు, అప్సరసలు వారివారి పట్టులకుంబోయిరి. భరద్వాజుడు చూపిన మార్గమున భరతుడు సపరివారముగ చిత్రకూటమునకు బయలువెడలెను.

**రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్।**
**అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్॥**

వనవాసమున తల్లి, తండ్రి స్వదేశము జ్ఞప్తికి వచ్చిన, మనఃక్లేశ ముదయించునను తలంపుతో నట్లురాకుండు నిమిత్తము సుమిత్ర లక్ష్మణునకు జెప్పిన వాక్య మర్థయుక్తమైనది. రాముడే నీకు తండ్రియని, సీతాదేవియే తల్లియని, అరణ్యమే రాము దుండుటచే నయోధ్యయగునని చెప్పిన మాట లిప్పుడు స్మరింపదగినవి. 'యాయోధ్యేఽ త్యపరాజితేతి విదితా నాకం పరేణస్థితా' అనునది శ్రీవైకుంఠము, అదియే నిత్యవిభూతి. లీలావిభూతిలో నారాయణుడు శ్రీరాముడుగ నవతరించిన కాలమున చిత్రకూట ప్రాంతమే శ్రీవైకుంఠ మనవచ్చును. ఆ ప్రాంతపు స్థలజల రామణీయకముల గూర్చి రామచంద్రుడు సీతాదేవితో,

**దర్శనం చిత్రకూటస్య మందాకిన్యాశ్చ శోభనే।**
**అధికం పురవాసాచ్చ మన్యే చ తవ దర్శనాత్॥**

కళ్యాణీ! ఈ చిత్రకూట మేకాంతమైన భోగస్థాన మగుటచే నా కిచ్చటివాస మయోధ్యావాసము కంటె హెచ్చుగనున్నది. అట్లే యీ మందాకినీ నదిని చూచుటచే నాకు గలుగు సంతోషము నిన్ను జూచుటకంటె నధికమని తోచుచున్నది. ఈ చిత్రకూటమును జూచి భరతుడు శత్రుఘ్నునితో

**అతిమాత్రమయం దేశో మనోజ్ఞః ప్రతిభాతి మా।**
**తాపసానాం నివాసోఽయం వ్యక్తం స్వర్గపథో యథా॥**

తమ్ముడా! ఈ ప్రదేశమంత రమణీయముగ నున్నదో చూడుము. ఇది నా మనసు నాకర్షించినది. ఇది స్వర్గమార్గమే యనునట్లున్నది. ఇది తాపసులు నివసించు ప్రదేశమని తెలియుచున్నదనెను. (భరతుడు అయోధ్య మొదలు చిత్రకూటము వరకు నిర్మించినదే అర్చిరాదిమార్గ మనియు, మందాకిని నదియే ప్రకృతిమండలపు సరిహద్దుగనుండు విరజానది. దానిని దాటిన దేశము ప్రాకృత వైకుంఠలోకము. ఆ నదిని దాటించి కొనిపోయిన గుహాదులే మోక్షమునకు పోవువారిని పూలమాలలతోను, దివ్యవస్త్రాభరణములతోను నలంకరించి సుస్వాగత మొసగి భగవత్సన్నిధానమునకు గొంపోవు ఆతివాహకు లనియు చెప్పనొప్పును.)

# లక్ష్మణుని కోపోపశమనము

రామచంద్రుడు చిత్రకూటప్రాంతపు సౌందర్యమును మెచ్చుచు సీతతో–

**త్వం పౌరజనవద్వ్యాలా నయోధ్యామివ పర్వతమ్।**
**మన్యస్వ వనితే నిత్యం సరయూవదిమాం నదీమ్॥**

ప్రియా! ఈ యడవిమృగముల నయోధ్యాపురజను లని, యీ రమణీయమగు చిత్రకూట పర్వతమునే యయోధ్య యని, యీ మందాకినీ నదినే సరయూనది యని భావింపుము. అప్పుడే నీ కయోధ్యను వదలిన దుఃఖము, అచ్చటిప్రజలను వదలివచ్చిన చింత, ఆ సరయూనదిని గూర్చిన క్లేశముశమించును. సుఖదుఃఖములకు మనసే కారణమగునుగాని వస్తుసముదాయము గాదు, కనుక నిట్టి హృదయ పరివర్తనమే దుఃఖోపశమనమే గాక సంతోషదాయకము నగును.

**లక్ష్మణశ్చాపి ధర్మాత్మా మన్నిదేశే వ్యవస్థితః।**
**త్వం చానుకూలా వైదేహి ప్రీతిం జనయథో మమ॥**

వైదేహీ! ధర్మాత్ముడగు లక్ష్మణుడు నా యాజ్ఞను పాటించుచుండ నీవు నాయందత్యంత ప్రేమతో నాకన్ని విధముల ననుకూలముగ వర్తించుచుండ నిక నేను గోరం దగిన దేదియు లేదు అని ప్రకృతి సౌందర్యము నామెకు జూపుచు నామెతో రుచ్యములైన భోజ్యవస్తువుల స్వీకరించుచుండ నొక గొప్ప సైన్యము వచ్చుటం జేసి ధూళియు ధ్వనియు మిన్నుముట్ట జంతుజాలము లన్నియు బెదరి చెదరి దిక్కులకు పరుగెత్తుచుండుట గని రాముడు లక్ష్మణునితో,

**రాజా వా రాజమాత్రో వా మృగయామటతే వనే।**
**అన్యద్వా శ్వాపదం కించిత్ సౌమిత్రే జ్ఞాతుమర్హసి॥**

లక్ష్మణా! ఈ వనమున నెవడేని రాజో, రాజసమానుడో వేటాడుచున్నాడో లేక యేదేని ఈ యరణ్యమున ఘాతుకమృగమేదో సంచరించుచుండవలెను. దీని సత్య మెట్టిదో శీఘ్రముగ దెలుపు మనియె. అంత లక్ష్మణు డొక్క పూచిన వృక్షమునెక్కి నలుదెసలు చూచి యుత్తరమున మహాసైన్య మొక్కటి వచ్చుచుండుటను జూచి చెట్టునుండియే రామచంద్రునితో–

**అగ్నిం సంశమయత్వార్య స్సీతా చ భజతాం గుహామ్।**
**సజ్యం కురుష్వ చాపం చ శరాంశ్చ కవచం తథా॥**

ఒక గొప్ప సేన వచ్చుచున్నదని తెలిపి 'అన్నా! అగ్నిని శమింపజేయుము. సీతాదేవిని గుహలోనికి బొమ్మనుము, విల్లెక్కుపెట్టుము. బాణములను కవచములను గయికొనుము' అనెను. అప్పుడు రాముడు 'లక్ష్మణా! ఆ సైన్య మెవ్వనిదిగా నుండునో కనుగొనుమనినంత లక్ష్మణుడు కోపముచే కనులతోనే కాల్చువానివలె.'

**సంపన్నం రాజ్యమిచ్ఛంస్తు వ్యక్తం ప్రాప్యాభిషేచనమ్।**
**ఆవాం హంతుం సమభ్యేతి కైకేయ్యా భరతస్సుతః॥**

అన్నా! కైకకొడుకు భరతుడు రాజ్యము పొంది యయోధ్యలో పట్టాభిషిక్తుడై నిష్కంటకముగ రాజ్యమేల నెంచి మనలను చంపుటకై వచ్చుచున్నాడు. అతడని నీ కెట్లు తెలియునందువా? కాంచన వృక్షము టెక్కెముగాగల సైన్యము వచ్చుచున్నది.

**యన్నిమిత్తం భవా న్రాజ్యాచ్చ్యుతో రాఘవ శాశ్వతాత్।**
**సంప్రాప్తోఽయమరిర్వీర భరతో వధ్య ఏవ మే॥**

ఎవని నిమిత్తము నీవు శాశ్వతమగు రాజ్యమును వదల వలసివచ్చెనో అట్టి పగవాడగు భరతు డిదె వచ్చుచున్నాడు. వీడు నాకు వధ్యుడే.



**భరతస్య వధే దోషం నాహం పశ్యామి రాఘవ।**
**పూర్వాపకారిణాం త్యాగే న హ్యధర్మో విధీయతే॥**

రఘునందనా! భరతుని వధించుటలో దోష మేమియు గానరాదు. మునుపే మనకు కీడు గావించిన వాడుగనుక నట్టివాని వధించుట యధర్మమని శాస్త్రము విధించలేదుగదా! ధర్మము తప్పినవీనిని వధించి నీవీ భూమిని పాలింపుము.

**కైకేయీం చ వధిష్యామి సానుబంధాం సబాంధవామ్।**
**కలుషేణాద్య మహతా మేదినీ పరిముచ్యతామ్॥**

కాముకురాలును, రాజ్యమే ధర్మముకంటె ముఖ్యమని యెంచిన నీచురాలగు కైకేయిని, దానికి బోధించిన మంథరతోగూడ వధించెదను. ఈ గొప్ప పాపమునుండి విడివడి భూమి శాశ్వతముగ ప్రకాశించుగాక. (ఇచ్చటలక్ష్మణుడు భరతుని పట్ల కనబరచు ద్వేషమంతయు రాముని యందలి ప్రేమాతిశయముననే. అతిస్నేహము పాపశంకి యనున్యాయమే ఇది యని గ్రహించునది.)

లక్ష్మణుని పట్టరాని కోపమును జూచి రామచంద్రుడు

**కిమత్ర ధనుషా కార్యమసినా వా సచర్మణా।**
**మహేష్వాసే మహాప్రాజ్ఞే భరతే స్వయమాగతే॥**

లక్ష్మణా! భరతుడు గొప్పవిలుకాడు. అతడు చాలబుద్ధిమంతుడు. ఇతరుల ప్రేరణలేక తానే నన్ను పిలుచుకొని పోవనెంచి వచ్చుచుండగా మనకు వింటితో గాని, కత్తితో కఠారితోగాని పనియేమి?

**పితుస్సత్యం ప్రతిశ్రుత్య హత్వా భరతమాగతమ్।**
**కిం కరిష్యామి రాజ్యేన సాపవాదేన లక్ష్మణ॥**

తమ్ముడా! తండ్రిమాట వమ్ము గావింపనని ప్రతిజ్ఞచేసిన నన్ను జూచుటకు వచ్చుచున్న భరతుని చంపి తమ్ముని జంపినవాడని యపకీర్తిని సంపాదించి యీ రాజ్యముతో నేనేమి చేయవలెను?

**యద్ద్రవ్యం బాంధవానాం వా మిత్రాణాం వా క్షయే భవేత్।**
**నాహం తత్ప్రతిగృహ్ణీయాం భక్షాన్విషకృతానివ॥**

బంధుమిత్రుల వినాశముచే నే ద్రవ్యము లభించునో యది విషముతో గలసిన భక్ష్యమని యెంచి దాని నెంత మాత్రము స్వీకరింపను.

**ధర్మమర్థం చ కామం చ పృథివీం చాపి లక్ష్మణ।**
**ఇచ్ఛామి భవతామర్థే ఏతత్ప్రతిశృణోమి తే॥**

సుమిత్రానందనా! ధర్మార్థకామములను గాని, రాజ్యమునుగాని మీకొరకు నేను గోరుచున్నానేగాని నాకొర కెంతమాత్రముగాదు. ఇందు నీ కెట్టి సందేహ మున్నను బ్రతిజ్ఞచేసి చెప్పెదను.

**భ్రాతౄణాం సంగ్రహార్థం చ సుఖార్థం చాపి లక్ష్మణ।**
**రాజ్యమప్యహమిచ్ఛామి సత్యేనాయుధమాలభే॥**

నా సోదరుల సుఖముకొరకు వారు ఇష్టోపభోగము లనుభవించు నిమిత్తమే రాజ్యమునైనను గోరుదునుగాని నాకొరకెంతమాత్రము గాదని నా యాయుధమును ముట్టి శపథము చేసెదను. (ఇచ్చటరాముని ధర్మస్వరూపమును జితేంద్రియత్వమును ఆశాపాశ లేశము లేకుండుటయు దృఢసంకల్పమునుజూడ ధర్మక్షేత్రమగు కురుక్షేత్రమున యుద్ధభూమిలో ఉభయసేనల మధ్య నిలిచి యిరుపక్షముల సైన్యమునుజూచి పరపక్షములోని వారును స్వజను లగుటగని యర్జునుడు "న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే। న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ



కింనోరాజ్యేన గోవింద కిం భోగై ర్జీవితేన వా 'స్వజనం హి కథం హత్వా సుఖిన స్స్యామ' అనుట జ్ఞప్తికి వచ్చును.)

**నేయం మమ మహీ సౌమ్య దుర్లభా సాగరాంబరా।**
**న హీచ్ఛేయమధర్మేణ శక్రత్వమపి లక్ష్మణ॥**

లక్ష్మణా! సముద్రముచే చుట్టబడిన నీ లోకమునంతయు సంపాదింపగలను. అధర్మము ననుసరించి ఇంద్రపదవినైనను గోరనని తెలియుము.

**యద్వినా భరతం త్వాం చ శత్రుఘ్నం చాపి మానద।**
**భవేన్మమ సుఖం కించిద్భస్మ తత్కురుతాం శిఖీ॥**

మానదా! నా యాంతరంగికులగు భరతుడు నీవు శత్రుఘ్నుడు అనుభవింపని సుఖ మెట్టిదైనను దాని నగ్నిదేవుడు భస్మము చేయుగాక.

**మన్యేఽహమాగతోఽయోధ్యాం భరతో భ్రాతృవత్సలః।**
**మమ ప్రాణాత్ప్రియతరః కులధర్మమనుస్మరన్॥**

అన్నదమ్ములయం దెక్కువ మక్కువగలవాడును, నాకు ప్రాణముకంటె ప్రియుడునగు భరతుడు కులధర్మమగు పితృశుశ్రూషాదుల నిమిత్త మయోధ్యకు వచ్చియుండును. పితృవాక్యము చొప్పున నే నరణ్యమునకు వచ్చినమాట విని శోకముతో నిండినవాడై మనల జూడవచ్చుచున్నాడు.

**విప్రియం కృతపూర్వం తే భరతేన కదా ను కిమ్।**
**ఈదృశం వా భయం తేఽద్య భరతం యోఽత్ర శంకసే॥**

లక్ష్మణా! భరతు డెన్నడైన నింతకుముందు నీ కప్రియము గావించి యున్నాడా? ఇట్టి భయము గలిగించు మాటలను పలికియున్నాడా? అతని గూర్చి నీ కిట్టి సందేహమేల?

**న హి తే నిష్ఠురం వాచ్యో భరతో నాప్రియం వచః।**
**అహం హ్యప్రియముక్తస్స్యాం భరతస్యాప్రియే కృతే॥**

నీవు భరతునిగూర్చి యెట్టి యప్రియ వచనముగాని, పరుష వచనముగాని పలుకదగదు. నీ వతని గూర్చి యప్రియముగ మాటలాడిన నవి నన్నుగూర్చి మాటలాడినట్లే. (ఇచ్చట రామచంద్రునకు భరతునియం దెట్టి ప్రీతి 'విశ్వాసము గౌరవము గలదో యతని ననిన మాట తన్ననట్లే యనుటలో నెంత భావ మిమిడియున్నదో గుర్తింపవలెను. లక్ష్మణుడు భరతుని విషయమై యాడిన పరుష వచములు విని యెంతమాత్రము సహింపలేక నింక నట్టిమాటలాడరాదని శాసించునట్లే గ్రహింపవలెను.)

**కథం ను పుత్రాః పితరం హన్యుః కస్యాంచిదాపది।**
**భ్రాతా వా భ్రాతరం హన్యా త్సౌమిత్రే ప్రాణమాత్మనః॥**

ఎట్టి యాపద సంభవించినను ప్రాణతుల్యుడగు తండ్రిని చంపునట్టి పుత్రుడును, ప్రాణసమానుడగు తోబుట్టువును జంపునట్టి తమ్ముడు నెందైన గలడా? (ఇచ్చట దశరథుడు రాము నరణ్యమునకు బంపినాడని కోపించి ప్రజ్ఞలేక లక్ష్మణుడు 'న శోభార్థ విమౌ బాహూ న ధనుర్భూషణాయ మే। నాసిరా బంధనార్థాయ న శరాః స్తమ్భహేతవః। అమిత్రదమనార్థం మే సర్వమేతచ్చతుష్టయమ్॥ నా కీ భుజము లలంకారమునకు గాదు. ఈ విల్లు నా కందము గూర్చునది కాదు. నా యీ ఖడ్గము నడుమునుండి యలంకారార్థము వ్రేలుచుండునది కాదు. ఈ బాణములును భూషణములు గావు. ఇవన్నియు శత్రువినాశముకొర కేర్పడినవే" అనగా ధర్మము దప్పిన దశరథుడును వధింపదగినవాడనిన మాటను జ్ఞప్తికి దెచ్చుకొని ఇప్పుడు భరతుని జంపవలెనను మాటతో జేర్చి యిట్టి పాపకార్యములు చేయదగవని ఖండించుచున్నాడని తెలియునది.)



**యది రాజ్యస్య హేతోస్త్వమిమాం వాచం ప్రభాషసే।**
**వక్ష్యామి భరతం దృష్ట్వా రాజ్యమస్మై ప్రదీయతామ్॥**

**ఉచ్యమానోఽపి భరతో మయా లక్ష్మణ తత్త్వతః।**
**రాజ్యమస్మై ప్రయచ్ఛేతి బాఢమిత్యేవ వక్ష్యతి॥**

నీవు రాజ్యము నపేక్షించి యిట్లు చెప్పుపక్షమున భరతునిజూచి 'భరతా! రాజ్యమును లక్ష్మణున కిచ్చివేయుమని యొక మాట యనినంతనే మంచిది, అట్లే చేసెదనని తప్పక చెప్పును.' (ఇచ్చట నిత్య శుశ్రూషణ చేయుచున్నను లక్ష్మణునియందు కంటె రామచంద్రునకు భరతునియం దెంత గౌరవమో నమ్మకమో విస్పష్టమగుచున్నది. అందుచే గదా సుగ్రీవునితో 'న సర్వే భ్రాతర స్తాత భవంతి భరతోపమాః' లోకమున భరతునకు సాటి సోదరుడు లేడని చెప్పిన మాటయొక్క అంతరార్థ మిట్టిదని తెలియుచున్నది.)

ధర్మస్వరూపుడగు తన యన్నచెప్పిన మాటలు వినినంతనే లక్ష్మణుడు మిక్కిలి లజ్జతో నంగముల ముడుచుకొని తలవంచియుండుట గని రామచంద్రుడును లక్ష్మణుని యభిప్రాయముతో గలసికొని దశరథుడే తమ్ము జూడ వచ్చెనని తలచి తమ్ముని చెట్టునుండి దిగునట్లాజ్ఞాపింప లక్ష్మణు డట్లుచేసి వినయముతో రాముని ప్రక్కన నిలుచుండెను. ఇట్లు రామచంద్రుడు లక్ష్మణుని కోపోపశమనము గావించెను.

## భగవత్పారతంత్ర్యము

చిత్రకూటముచేరి దూరముగ సైన్యమును నిలిపి పాదచారియై భరతుడు రామదర్శన లాలసుడై శత్రుఘ్నునితో 'సౌమ్యా! సీతారామలక్ష్మణులను వసిష్ఠ ననుమతంబున మన మెల్లరము పాదచారులమై వెదకవలయును.

క్షత్రియులు ప్రతిజ్ఞ చేయునపుడు శస్త్రములు ముట్టిచేయుట యాచార మని తెలియుచున్నది.

**యావన్న రామం ద్రక్ష్యామి లక్ష్మణం వా మహాబలమ్।**
**వైదేహీం వా మహాభాగాం న మే శాంతిర్భవిష్యతి॥**

స్వరూపముచేతనే మనసు రంజింపజేసెడి రామచంద్రుని, మహాబలుడగు లక్ష్మణుని, మహాభాగ్యవతి యగు సీతాదేవిని చూచునంతవరకు నా మనసు కుదుటబడదు.

**యావన్న చంద్రసంకాశం ద్రక్ష్యామి శుభమాననమ్।**
**భ్రాతుః పద్మపలాశాక్షం న మే శాంతిర్భవిష్యతి॥**

చంద్రునివంటి యాహ్లాదకరమగు ముఖముగలవాడును, తామరరేకులవంటి యందమును విశాలములు నగు నేత్రములుగల అన్నను జూచునంత దనుక నా కాత్మశాంతి గలుగదు.

**యావన్న చరణౌ భ్రాతుః పార్థివవ్యంజనాన్వితౌ।**
**శిరసా ధారయిష్యామి న మే శాంతిర్భవిష్యతి॥**

ధ్వజము, అరవిందము, అంకుశము, వజ్రము అమృతకలశము మున్నగు మహారాజ చిహ్నములు గల రామచంద్రుని పాదద్వయము నా శిరసు నలంకరించునంతవరకు నాకు రామవిరహతాపము శమింపదు.

**యావన్న రాజ్యే రాజ్యార్హః పితృపైతామహే స్థితః।**
**అభిషేకజలక్లిన్నో న మే శాంతిర్భవిష్యతి॥**

సర్వవిధముల రాజ్యపాలనకు దగిన మన యన్న మన తాతముత్తాతలు పాలించిన రాజ్యమును సింహాసనమున గూర్చుండి పట్టాభిషిక్తుడై కిరీటముతో ప్రకాశించుటను జూచునంతవరకు నాకు దుఃఖోపశమన మెంతమాత్రము గాదు (ఇచ్చట జీవాత్మ పరమాత్మ దర్శనము నెట్లు గోరవలెనో సూచింపబడియున్నది. భగవత్పరతంత్రు డెట్లు తన్ను దాను మరచి



సకలవిధభోగములు త్యజించి జితేంద్రియుడై నియమముల బాటించి గురూపదేశము పొంది తన్ను తను జేరిన సకల చరాచరవస్తువులను భగవత్కైంకర్యమున కుపయుక్తము లగునట్లు చేయవలెనో వివరింపబడి యున్నది. మోక్షము పొందుట యనగా భగవత్సాలోక్యము, సామీప్యము, సారూప్యము సాయుజ్యము పొందుట యని ప్రసిద్ధముగదా! ఇచ్చట శేషపర్యంకమున లక్ష్మీవిశిష్టుడైన శ్రీమన్నారాయణుని, వైకుంఠనాథుని సేవించునట్లే శేషాంశావతారుడగు లక్ష్మణునితో నుండు సీతారాముల సేవించుట యని గ్రహించునది. ఇందు మొదటి శ్లోకభావమును విమర్శించి చూచిన భగవద్దర్శనమునకు భగవంతుడుండు లోకమును జేరుట మొదటిమెట్టు. రెండవది భగవత్సామీప్యము, భగవంతుని దివ్యమంగళవిగ్రహమున నాయాయంగములను సేవింప నతని సమీపించుట ముఖ్యమని తెలియుచున్నది. ఇది రెండవ శ్లోకభావమున ధ్వనించును. మూడవ శ్లోకమున భగవత్కైంకర్యము చేయవలెననిన భగవంతుని స్వరూపము పొందవలెననుట గమనింపవలెను, అందుచే భగవదారాధనము చేయుటకుముం దీ పాపభూయిష్ఠమగు మలిన దేహమును భస్మము చేసినట్లును భగవంతుని పాదారవిందమునుండి స్రవించు గంగోదకముచే పునః దివ్యదేహము పొంది భగవంతుని గొలుచుట ధర్మమని తెలియుచున్నది. భరతుడు జటావల్కలములు ధరించి రామునివంటి స్వరూపము పొందియుండెనని అనగా సారూప్యము గలవాడయ్యెనని భగవత్సేవకు యోగ్యత కల్పించుకొనెనని యెరుగునది. నాల్గవ శ్లోకమున పట్టాభిషిక్తుడైన రాముని సేవింపగోరుట సాయుజ్యముపొందుట యనదగును. ఏలన సాయుజ్యము పొంది తాను గోరినట్లెల్ల భగవంతునకు కైంకర్యము చేయనర్హుడగుననుట సూచితము.)

**సిద్ధార్థః ఖలు సౌమిత్రిర్యశ్చంద్రవిమలోపమమ్।**
**ముఖం పశ్యతి రామస్య రాజీవాక్షం మహాద్యుతి॥**

రామునియొక్క చంద్రునివంటి నిర్మలమగు ముఖమును, తామరలవంటి కన్నులు గలవాని సౌందర్యమును కన్నులార గని యానందించు భాగ్యశాలియగు లక్ష్మణుని జీవితమే సార్థకమైనది.

**కృతకృత్యా మహాభాగా వైదేహీ జనకాత్మజా।**
**భర్తారం సాగరాంతాయాః పృథివ్యా యాఽనుగచ్ఛతి॥**

సముద్రముచే చుట్టబడిన భూమండలమున కంతయు నధిపతియగురాముని వెంబడించిన విదేహరాజతనయ యగు సీతాదేవి మహా భాగ్యశాలిని. ఆమెయే కృతకృత్యురాలు.

చిత్రకూట పర్వతమును జూచి భరతుడు-

**సుభగశ్చిత్రకూటోఽసౌ గిరిరాజోపమో గిరిః।**
**యస్మిన్ వసతి కాకుత్స్థః కుబేర ఇవ నందనే॥**

ఉత్తర దిగధిపతియగు కుబేరుడు తన పట్టణము విడిచి చైత్రరథమను నుద్యానవనమున వసించునట్లే ఇక్ష్వాకువంశస్థుడగు రామచంద్రుడు అయోధ్యయనెడు తన జన్మభూమిని వదలి చిత్రకూట ప్రాంతమున వసించుచున్నాడు. అందుచే నీ పర్వతము గిరిరా జనం బడు హిమవత్పర్వతమునకు సాటియై మిక్కిలి భాగ్యవంతమైనది. ('నంద యతీతి నందనం' చైత్రరథము సంతోషింపజేయునది. ఈ ప్రాంతము ప్రకృతి సౌందర్యముతో నిండినది. కాని యిచ్చట రామచంద్రుడు వసించుటచే దీని మహిమ హిమవత్పర్వతముయొక్క మహిమను బోలినదైనది. మరియొక విధముగను జెప్పవచ్చును. 'గిరిరాజోపమో గిరిః' శ్రీవైకుంఠమున నుండు విష్ణుదేవుడు శ్రీనివాసుడై వెలసిన కతమున వేంకటాచలమని ప్రసిద్ధి చెందిన పర్వత శ్రేష్ఠమువలె రాముని వాసముచే నీ పర్వతమునకు ప్రాశస్త్యమేర్పడిన దనవచ్చును. 'కుబేర ఇవ సందనే' కు=భూమి లేక జగత్తు, బేరం=శరీరం అనగా "యస్య పృథివీ శరీరం" ఎవనికి పృథివి శరీరమో వాడు. "జగత్సర్వం శరీరం తే" ఈ లోకమంతయు నీ శరీరమై నిత్యవిభూతి యగు వైకుంఠమును వదలి లీలావిభూతి యగు జగత్తున వెలసిన నీవు నీ స్వస్థానమగు అయోధ్యను వదలి యీ వనప్రాంతమున వసింప సంకల్పించిన ఇచ్చటి వాసమును మిక్కిలి భోగ్యముగ నెంచువాడవని తెలియుచున్నది.)



## రాజనీతి

దూరమునుండి పొగవచ్చుటను జూచి యది రామాశ్రమముగ నుండ నోపునని తలచి భరతుడు తల్లులను పిలుచుకొనిరమ్మని వసిష్ఠునకు జెప్పి తాను తమ్మునితోను గుహ సుమంత్రులతోను రామాశ్రమమునకు బోయి.

**నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుమ్।**
**ఉటజే రామమాసీనం జటామండలధారిణమ్॥**

జడలుదాల్చి నారచీరలు గట్టుకొని అగ్నివలె ప్రకాశించు నాతని కొంతసేపు తేరిచూచి తన యన్నయే యని తెలిసికొని

**మన్నిమిత్తమిదం దుఃఖం ప్రాప్తో రామస్సుఖోచితః।**
**ధిగ్జీవితం నృశంసస్య మమ లోకవిగర్హితమ్॥**

"ఆహా! సుఖమునకే తగినవాడగు మా యన్న రామచంద్రుడు నా నిమిత్త మిట్టి దుఃఖము ననుభవించుచున్నాడు. ఇట్లు క్రూరాత్ముడనగు నేను లోకనిందితుడను గదా! ఛీ! నా జీవిత మేటికి?" అని విలపించుచు భరతు డన్నపాదములమీద బడనెంచి 'ఆర్యా!' యని నేలపై బడెను. శత్రుఘ్నుడును శోకించుచు రాముని పాదములకు మ్రొక్కెను. అంత రామచంద్రుడు భరత శత్రుఘ్నులను కౌగిలించుకొని కన్నీరు విడిచెను.

**తత స్సుమంత్రేణ గుహేన చైవ సమీయతౌ రాజసుతావరణ్యే।**
**దివాకరశ్చైవ నిశాకరశ్చ యథాంబరే శుక్రబృహస్పతిభ్యామ్॥**
**వనౌకసస్తేఽపి సమీక్ష్య సర్వేఽప్యశ్రూణ్యముంచన్ ప్రవిహాయ హర్షమ్॥**

అంత రామలక్ష్మణులా యరణ్యమున చంద్రసూర్యులు బృహస్పతితోను శుక్రునితోను జేరునట్లు సుమంత్రునితోను గుహునితోను జేరిరి. ఆ యడవిలోని ఋషులు గూడ రాజపుత్రుల సమాగమము జూచి కుంది కన్నీరు గార్చిరి. శ్రీరాముడు జటావల్కలములతో సూర్యునివలె ప్రకాశించుచు భరతుని చేతుల నెత్తి రొమ్మున జేర్చి శిరము మూర్కొని లజ్జితుడైన తమ్ముని యీడ్చి తొడ మీద గూర్చుండబెట్టుకొని విశదముగ నిట్లు కుశలప్రశ్నము గావించెను. (అయోధ్యాకాండములోని 100వ సర్గమునకు కచ్చిత్సర్గమని పేరు. ఇందలి కొన్ని శ్లోకములు భారతమున సభాపర్వమునందలి కొన్ని శ్లోకములను బోలియుండుటచే వ్యాసమహర్షి ఆదికావ్యమగు శ్రీరామాయణమునుండి సంగ్రహించియుండవచ్చు ననుట యుక్తమే. ఇందువలననే రామచంద్రుడు భరతునకు తెలియని రాజనీతిని బోధించెనని చెప్పనొప్పదు. దానిని జ్ఞప్తికి దెచ్చెనని యూహింపవలెను.)

**“క్వ ను తేఽభూ త్పితా తాత యదరణ్యం త్వమాగతః।**
**న హి త్వం జీవతస్తస్య వనమాగంతుమర్హసి॥”**

నాయనా! తండ్రి జీవించి యున్నాడా? అతడు జీవించియుండగా నీవేల యిచ్చటికి వచ్చితివి? నీ వతనికి శుశ్రూషలు క్రమముగ జేయుచున్నావు గదా! అతడేమైన రుగ్మతతో నున్నాడని నాకు దెలుపవచ్చితివా? వేదవేదాంగవేత్తయు, పరమ ధర్మానుష్ఠానపరుడునగు మన కులగురువగు వసిష్ఠుని మునుపటివలె పూజించుచున్నావు గదా?

**సా తాత కచ్చిత్కౌసల్యా సుమిత్రా చ ప్రజావతీ।**
**సుఖినీ కచ్చిదార్యా చ దేవీ నందతి కైకయీ॥**



నా వియోగముచే కుందుచుండు నా తల్లి కౌసల్యాదేవికి కుశలమా? జ్యేష్ఠానువర్తనమను గొప్పగుణముగల సుపుత్రులం గన్న సుమిత్రాదేవి సౌఖ్యముగ నున్నదా? పూజ్యురాలగు నీతల్లి రాజ్యప్రాప్తిచే సంతోషించుచున్నదా? వినయ సంపన్నుడును, గొప్ప వంశమున బుట్టినవాడును, సకల వేదవేదాంగ శాస్త్రములు చక్కగ నెరింగినవాడును, అసూయ లేనివాడును అగు వసిష్ఠుని యుపదేశముల చక్కగ వివరించువాడు నగు పురోహితుని సుయజ్ఞుని పూజించుచున్నావా?

**కచ్చిద్దేవాన్ పితౄన్ మాతౄర్గురూన్ పితృసమానపి।**
**వృద్ధాంశ్చ తాత వైద్యాంశ్చ బ్రాహ్మణాంశ్చాభిమన్యసే॥**

నాయనా! నీవు దేవతలను, పితృదేవతలను, తల్లులను, తండ్రులను, గురువులను, తండ్రితో సమానులగు జ్ఞాతులను, వయసు చెల్లినవారిని విద్వాంసులను, బ్రాహ్మణులను పూజలతోను, వైదిక కర్మలతోను, శుశ్రూషాదులతోను, దానాదులతోను, నమస్కారములతోను తృప్తిపరచుచున్నావా?

**కచ్చిదాత్మసమాశ్శూరా శ్రుతవంతో జితేంద్రియాః।**
**కులీనాశ్చేంగితజ్ఞాశ్చ కృతాస్తే తాత మంత్రిణః॥**

నాయనా! నీకు సమానమగు శౌర్యమును, అర్థనీతిశాస్త్రజ్ఞానమును, వైరాగ్యమును, అభిజాత్యమును, నితరుల జూచినంతనే వారి మనసు నరయంగల శక్తియు, మంత్రాలోచనము చేసిన విషయమును కార్యసిద్ధి యగునంత దనుక దానిని రహస్యముగ నుంచుకొనదగిన మంత్రులను నీవు కలిగియున్నావు గదా? నీవు నిద్రాసక్తుడవు గాక వృథా కాలహరణము చేయక పనుల నప్పుడే చేసి ముగించుచున్నావు గదా?

**ఏకోఽప్యమాత్యో మేధావీ శూరో దక్షో విచక్షణః।**
**రాజానం రాజమాత్రం వా ప్రాపయేన్మహతీం శ్రియమ్॥**

మూర్ఖులగు మంత్రు లెందరున్న నేమి ప్రయోజనము? బుద్ధిమంతుడునుశూరుడును. గార్యనిర్వాహక శక్తిగలవాడును, నీతిశాస్త్రజ్ఞుడునగు మంత్రి యొక్క డుండిన రాజునకుగాని, రాజసమానుడగు వానికిగాని గొప్ప సంపదను గలిగించును. నీవు మన తాతముత్తాతలనాటినుండి యుండునట్టివారును, క్రమముగ కొలువుచేయుచుండువారు నగు మంత్రులనే గొప్ప కార్యములు చేయుటకు నియమించుచున్నావా? నీవు ప్రజలను మిక్కిలి తీవ్రముగ దండింపవు గదా?

**ఉపాయకుశలం వైద్యం భృత్యసందూషణే రతమ్।**
**శూరమైశ్వర్యకామం చ యో న హంతి న వధ్యతే॥**

సామదానభేద దండోపాయములందు సమర్థుడును, చెడునీతిని బోధించు విద్యయందు నిపుణుడును. అంతరంగమున భృత్యులపై నేరములు మోపి తొలగించువాడును, రాజదండనకు భయపడనివాడును, రాజును దొలగించి ప్రభుత్వమునే స్వాధీనము చేసికొననెంచువాడు నగు నీచుని రాజు వధింపకున్నచో వాడు రాజును తప్పక వధించును. అట్టి నీచు డెవడు నీయొద్ద లేడుగదా?

**బలవంతశ్చ కచ్చిత్తే ముఖ్యా యుద్ధవిశారదాః।**
**ధృష్టా పదానా విక్రాంతాస్త్వయా సత్కృత్య మానితాః॥**

నీచే ధనముచేతను, గౌరవాదులచేతను సంతుష్టులై, బలపరాక్రమములు గలిగి వ్యవహారమునందు నిపుణులై, ఆయా సమయములకు దగినట్లు సేనల నడపుచు సమయానుకూలముగ సేనలను వ్యూహములుగ బన్నుచు శత్రుసైన్యముల లోటుగని పరపక్షసైన్యముల భేదింప జాలినవారు నీకు ముఖ్యసేనాధిపతులుగా నున్నారా? వారిని నీవు బహువిధముల సత్కరించి నీయందు త్రికరణశుద్ధి గలిగి వర్తించున్నట్లు ప్రసన్నుల జేసికొనుచున్నావా?



**కాలాతిక్రమణాచ్చైవ భక్తవేతనయోర్భృతాః।**
**భర్తుః కుప్యంతి దుష్యంతి సోఽనర్థస్సుమహాన్ స్మృతః॥**

నీవు నీ సేవకకోటికి నియమితకాలమున జీతమును బత్తెము నిచ్చి వారిని సంతోషపెట్టుదువు గదా! అట్లు లేనిచో వారు నీ యెడ కోపము పూని నిన్ను దూషించుచుందురు. అందువలన వారికి నీయందు ప్రేమ తగ్గును. మంచి సమయమున వారు పనిచేయనందున నష్టకష్టములు వాటిల్లును. నీవందుకు తావీయక సకాలమున వారికి వేతనము లిచ్చుచున్నావు గదా!

**కచ్చిజ్జానపదో విద్వాన్ దక్షిణః ప్రతిభానవాన్।**
**యథోక్తవాదీ దూతస్తే కృతో భరత పండితః॥**

విదేశమున బుట్టినవానిని దూతగా నియమించినచో వానికి మనదేశమందు భక్తియుండదు. అందువలన వాడు నిష్కపటముగ పనిచేయడు. మనదేశమున బుట్టినవానిని నియమించినచో వాడు రాజభక్తి దేశభక్తిగలిగి పరిశుద్ధమనస్కుడై రాజు చెప్పినమాట నతిక్రమింపక సమయస్ఫూర్తిగలిగి పైపైయుక్తులచే కార్యమును సాధించును. అట్టివానినే దూతగ బెట్టుకొని యున్నావుగదా?

**కచ్చిదష్టాదశాన్యేషు స్వపక్షే దశ పంచ చ।**
**త్రిభి స్త్రిభి రవిజ్ఞాతై ర్వేత్సి తీర్థాని చారకైః॥**

శత్రుపక్షములోనుండ 18 తీర్థములయొక్క న్యాయాన్యాయ ప్రవర్తనలను, స్వపక్షములోని 15 తీర్థములయొక్క న్యాయాన్యాయ ప్రవర్తనలను ఒక్కొక్కరికి దెలియకుండు ముగ్గురేసి గూఢచారులనుబంపి వారిమూలమున వీరి గుణాతిశయములను తెలిసికొనుచున్నావా? (తీర్థములనిన-1. మంత్రి, 2. పురోహితుడు 3. యువరాజు 4. సేనాపతి,

5. దౌవారికుడు, 6. అంతర్వంశికులు, 7. కారాగారాధిపతి, 8. అర్థసంచయకరుడు, 9. కార్యనియోజకుడు, 10. ప్రాడ్వివాకుడు, 11. సేనానాయకుడు, 12. నగరాధ్యక్షుడు, 13. కర్మాంతికుడు, 14. సభ్యుడు, 15. ధర్మాధ్యక్షుడు, 16. దండపాణి, 17. దుర్గపాలుడు, 18. రాష్ట్రాంతపాలుడు, వీరిపనులెవ్వి? 1. మంత్రి– ఆలోచన చెప్పువాడు, 2. పురోహితుడు, Private Secretary 3. యువరాజు, Prince, 4. సేనాపతి సేనల కన్నిటికధిపతి, Commander-in-Chief, 5. దౌవారికుడు, ద్వారపాలకులయందు మేటి, 6. అంతర్వంశికుడు– అంతఃపుర కార్యనిర్వాహకుడు, Palace Controller, 7. కారాగారాధిపతి– చెరసాలకధిపతి, Superintendant of Jails, 8. అర్థసంచయకరుడు– ధనము రాబట్టువాడు Revenue Officer or Collector, 9. కార్యనియోజకుడు– రాజాజ్ఞలను వెల్లడించువాడు, Broad Casting Officer, 10. ప్రాడ్వివాకుడు– న్యాయస్థానమున న్యాయవిచారణచేయు అధికారి, Judge, 11. సేనానాయకుడు–సేనయందలి భటులకు జీతము బత్తెముల విచారించువాడు, 12. నగరాధ్యక్షుడు– రాత్రులందు నగరద్వార ప్రాకారముల రక్షించువాడు, 13. కర్మాంతికుడు– కార్యాంతమున రాజాజ్ఞననుసరించి సేనలో జేరని జీతగాండ్రకు జీతము పంచువాడు, Accountant General, 14. సభ్యుడు– ప్రతిదినము సభ నలంకరించుట, రాజు మంత్రి మొదలగు వారి యాసనముల నేర్పరచుట, సభ్యులను రప్పించుట, అసభ్యులను నిరోధించుట, సభలో శబ్దము లేకుండ జేయుట, సభా రక్షకుల నియమించుట యీ యధికారములుగలవాడు 15. ధర్మాధ్యక్షుడు– దాయభాగాది వివాదముల విచారించి పరిశోధించి ధర్మశాస్త్ర ప్రకారము పరిష్కరించువాడు Munsiff, 16. దండపాలుడు– జారులను చోరులను ఇతరాపరాధములు చేసిన వారిని దండించువాడు.



17. దుర్గపాలుడు– కోట, గిరి దుర్గము జలదుర్గము వనదుర్గము మున్నగువానిని కాపాడువాడు, Magistrate, 18. రాష్ట్రాంతపాలుడు– రాష్ట్రమును శత్రువు లాక్రమింపకుండ సరిహద్దుల సర్వదా రక్షించు వారిపై అధికారి. ఈ పదునెనమండ్రుగురు తీర్థులనబడుదురు. స్వపక్షమున నెల్లప్పుడు దగ్గరనుండి మొదటి ముగ్గురుదప్ప తక్కినవారి కొక్కొరికి ముగ్గురు గూఢచారుల నియమించి వారి వర్తనములను కనుగొనవలెననియు, శత్రుపక్షమున పదునెనమండ్రుగుర మీద నిట్టి గూఢచారుల నియమించి వారి వర్తనలను గమనించుచుండుట చాల ముఖ్యమని తెలియుచున్నది.)

**కచ్చిదర్థం చ ధర్మం చ కామం చ జయతాం వర।**
**విభజ్య కాలే కాలజ్ఞ సర్వా వరద సేవసే॥**

కాల విభాగములను చక్కగ తెలిసినవాడా! ధర్మమునకు నర్థమునకు కామమునకు తగిన కాలము నుపయోగించి ఒకదాని కొకటి విరోధము గల్పింపకున్నావుగదా? నీచే పరాజితులైప శత్రువుల మరలివచ్చినపుడు వారు శక్తిహీనులని యుదాసీనత లేక వారి నెచ్చరికతో గుర్తించి యుందువుగదా?

**కచ్చిత్తే సఫలా వేదాః కచ్చిత్తే సఫలాః క్రియాః।**
**కచ్చిత్తే సఫలా దారాః కచ్చిత్తే సఫలం శ్రుతమ్॥**

వేదోక్తములగు అగ్నిహోత్రాది కర్మలను సక్రమముగజేసి నీవు చదివిన వేదశాస్త్రములను సఫలము చేసికొనుచున్నావా? నీవు ధర్మము ననుసరించి యార్జించిన ధనము శాస్త్రసమ్మతమగు దానభోగముల కుపయోగపడు చున్నదా? నీ భార్యలు రతి పుత్రాదులచే సార్థకులుగనున్నారా? నీవు నేర్పిన శాస్త్రములు నీ శీల వృత్తాదులచే సఫలమగుచున్నవి కదా?

**కచ్చిత్స్వాదుకృతం భోజ్యమేకో నాశ్నాసి రాఘవ।**
**కచ్చిదాశం సమానేభ్యో మిత్రేభ్య స్సంప్రయచ్ఛసి॥**

రఘువంశతిలకా! మధురమైన ఆహారమును నీ వొక్కడవే భుజింపకుండ ఉన్నావా? ధనమును కోరిన మిత్రులకు ధనమిచ్చుచున్నావు గదా?

**రాజా తు ధర్మేణ హి పాలయిత్వా**
**మహామతిర్దండధరః ప్రజానామ్।**
**అవాప్య కృత్స్నాం వసుధాం యథావ**
**దితశ్చ్యుతస్స్వర్గముపైతి విద్వాన్॥**

ప్రజల యొక్క న్యాయాన్యాయములను తెలిసికొని వారికి దండన విధించుచుండు గొప్ప బుద్ధిగల (దేహాత్మ భేదమును దెలిసికొనిన) రాజు ధర్మ పరిపాలనముచేసి న్యాయముగ భూమినంతయు బడసి సుఖించి స్వర్గమును పొందును.

## భరతుని లోకోపకారము

భరతుడు మేనమామ యింటి నుండి వచ్చిన దాదిగ తన తండ్రి మరణము, సీతారామ లక్ష్మణుల వనవాస కారణము దెలిసి కోపశోకములు పెనగొన తల్లిని దూరిన విషయము, కౌసల్యాదేవితో రాముని వనవాసమును గూర్చి తన కేమియు దెలియదని చేసిన శపథములు, నిండు సభలో పట్టము గట్టుకొమ్మనిన వసిష్ఠుని ఎల్లర సమక్షమున నిందించుట, రాముని మరల్పనెంచి చేసిన చిత్రకూట యాత్ర, గుహుని సందేహమును బోగొట్టుట, భరద్వాజుని సంశయము నివృత్తిజేయుట, రాముని మరలివచ్చి రాజ్య మేలుమని పరిపరి విధముల ప్రార్థించుట మున్నగు విషయములు భరతుని శుద్ధాంతరంగమును వెల్లడి చేయును. వసిష్ఠాదులు గురు వాక్యము ప్రబలమని, ఆచరణీయమని చెప్పగా రామచంద్రుడు గురువున కంటె తల్లితండ్రు లెక్కువయని, వారిలోను తల్లి మాటకంటె తండ్రిమాట యవశ్య



మాచరించుట విధియనుట అతని మనోదార్ఢ్యమును వేనోళ్ళ చాటును. భరతుడు ప్రజలను రామచంద్రుని మరలిరమ్మనిచెప్ప ప్రోత్సహించుట, అయ్యది విఫలమగుట, ప్రజలు రామునిమార్గమే శ్లాఘ్యమని ఉత్తమ ధర్మమని చెప్పుటచే భరతుడు గత్యంతరములేక మణి పాదుకలు రాముడు ధరించి యిచ్చునట్లు ప్రార్థింప నత దందుల కియ్యకొని అట్లే చేయ భరతుడు ఉపాయము లన్నిటి కంటెను శరణాగతియే సర్వోత్తమమని ఫలప్రదమని చాటించి తా ననుష్ఠించి రామపాదుకలను శిరసావహించి సింహాసనమున నుంచి పట్టముగట్టి తా ననవరత మా పాదుకలనే పూజించుచు, సకల విషయములా రామపాదుకలకే విన్నవించుచు, రామచంద్రుని పునరాగమనము నిరీక్షించు చుండుట, జీవాత్మ పరమాత్మ యెడ మెలగవలసిన విధానమును విస్పష్టము గావించుచున్నది. ఆ పాదుకలప్రభావము నెరిగియే మన దేవాలయములలో శ్రీశఠారి (శఠగోపురము) ఆశ్రితుల శిరమునలంకరింప జేయుటయను నాచారము వ్యాపించినదనవచ్చును. 'సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే' అని సకల లోకములకు పరమ గతియగు శరణాగతవత్సలుడు శ్రీరాముడేయని విభీషణుని వాక్యము వలనను శ్రీరాముని పాదములను ముఖ్యముగ వాని కాధారమగు పాదుకలే జీవాత్మ చేరవలసిన గమ్యస్థానమనియే అందున కవియే ఉపాయమునుగూడ నగునని లోకమునకు చాటి తా నుద్ధరింపబడి సకలజీవకోటి నుద్ధరించి మార్గదర్శియైనవాడు భగవత్పరతంత్రుడగు భరతుడేయని లోక మెరుగవలసి యున్నది.

## శ్రీరామ సేవాసంపద

శ్రీ మద్రామాయణమున సుమిత్రానందనుడగు లక్ష్మణుని శ్రీరామ సేనా సంపద అద్వితీయమైనది. మొలకెత్తినది మొదలుకొని మిక్కిలి

పరిమళించునది తులసి. అందుచే నది పురుషోత్తముడగు విష్ణుదేవు నర్చించుటకు ముఖ్యసాధనము. లక్ష్మణుని జీవితమునట్టిదే. 'రామకైంకర్య లక్ష్మణ సంపద్యుక్తత్వా ల్లక్ష్మణః' అని కదా లక్ష్మణశబ్దమునకు రామునికైంకర్యమే కర్తవ్యమనుల క్షణముతో గూడిన నైశ్వర్యవంతు డతడే యని క్రింది వాక్యములు నిరూపించుచున్నవి.

**బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః।**
**రామస్య లోకరామస్య భ్రాతుర్జ్యేష్ఠస్య నిత్యశః॥**

**సర్వప్రియకరస్తస్య రామస్యాపి శరీరతః।**
**లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః॥**

**న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః।**
**మృష్టమన్నముపానీత మశ్నాతి న హి తం వినా॥**

**యదా హి హయమారూఢో మృగయాం యాతి రాఘవః।**
**తదైనం ప్రష్ఠతోఽభ్యేతి సధనుః పరిపాలయన్॥**

శైశవమునుండి తనకు పెద్దన్నయు, లోకమునంతయు సంతోషింపజేయువాడునగు రామచంద్రునియెడ మిక్కిలి నెయ్యము జూపుచు నతని సేవయే గొప్ప యైశ్వర్య మని భావించెడివాడు లక్ష్మణుడు. రామచంద్రునకు తనశరీరము కంటెను ఎక్కువ ప్రియముగూర్చుచు నతని వెలుపలి ప్రాణమేయన దగినవాడు లక్ష్మణుడు. కౌసల్యాదేవి స్వర్ణమయమగు పాత్రమున మృష్టాన్నము దెచ్చి కుడువుమని యెంత యత్నించినను రాముడు లక్ష్మణుడు లేక దానిని స్వీకరింపడు. ఇట్లే తల్లి తన్ను తొట్లలో నుంచి యెన్ని జోలపాటలు పాడినను లక్ష్మణుడు ప్రక్కన లేకున్న రాముడు నిద్రింపడు. రామచంద్రుడు గుఱ్ఱమునెక్కి వేటాడబోయినచో లక్ష్మణు డతనికాపుదలకొరకు ధనువును ధరించి యతని వెన్నంటి పోవువాడు. వేయేల! వీ రిరువురకు అవినాభావసంబంధమని చెప్పక తప్పదు.



లక్ష్మణు డెవరు? ఆదిశేషుని అంశమే కదా! ఆదిశేషుడన నేమి? మొదటిసేవకుడని యర్థము. ఎవరికి? విష్ణుదేవునకు, ఎట్లు? శెన్డాల్‌కుదైయాం ఇరుందాల్ శింగాసనమాం– అనంతుడను సర్పరాజే ఆదిశేషుడు. నిత్య విభూతి యందు భగవంతు డాసీనుడైన ఆదిశేషు డతనికి సింహాసనముగను, బయలుదేరిన గొడుగుగను, శయనించునపుడు శయ్యగను, నిరంతర మనాదికాలము నుండి సేవచేయువాడు. శ్రీరామావతారమున ఆదిశేషుడే లక్ష్మణుడై యవతరించి రామసేనాపరాయణు డయ్యె. కృష్ణావతారమున బలరాముడుగ నవతరించి కృష్ణునియన్నయై అతనికి సర్వవిధముల తోడ్పడెను. ఈ కలియుగమున శేషాద్రియను పర్వతరూపమున శ్రీనివాసునకు వాసస్థానముగ నేర్పడియున్నాడు. లక్ష్మీదేవి ఆయాయవతారమున కనుగుణముగ సీతయని, రుక్మిణియని యవతరించునట్లు ఆదిశేషుడును విష్ణుసేవాపరాయణు డగుచున్నాడు.

విశ్వామిత్రుడు రాముని తన వెంట బంపునట్లడిగెను. లక్ష్మణుడు తన్ను బిలువలేదని యూరకుండెనా? రాముడు లేని చోటు తనకు గాదని సర్వకాల సర్వావస్థలయం దతని సేవ చేయుచుండెను. విశ్వామిత్రుడు 'బల, అతిబల' యను మంత్రములనుగాని, అస్త్రముల ప్రయోగోప సంహారములుగాని రామున కుపదేశించెనని యున్నదేకాని లక్ష్మణునకు నుపదేశించినట్లు చెప్పబడలేదు. లక్ష్మణుడా మంత్రములను అస్త్రములను గ్రహింపలేదని భావముగాదు. రాము డేమేమి చేసెనో, ఏమేమి నేర్చెనో అన్నియు లక్ష్మణుడును చేసెనని, నేర్చెనని నమ్మవలెను.

యువరాజ పట్టాభిషేకము చేసికొమ్మని దశరథుడు చెప్పినంతనే శ్రీరాముడు కౌసల్యాదేవిని చూడ బోయినపుడు అచ్చట అంజలిబద్ధుడై నిలుచుండిన లక్ష్మణుని గని రామచంద్రుడు చిరునవ్వుతో నిట్లనియె.

**లక్ష్మణేమాం మయా సార్ధం ప్రశాధి త్వం వసుంధరామ్।**
**ద్వితీయం మేఽ౦తరాత్మానం త్వామియం శ్రీరుపస్థితా॥**

**సౌమిత్రే భుంక్ష్వ భోగాంస్త్వమిష్టాన్ రాజ్యఫలాని చ।**
**జీవితం చ హి రాజ్యం చ త్వదర్థమభికామయే॥**

"లక్ష్మణా! ఈ భూమండలమును నాతో గలసి నీవు నాకు సహాయుడవైయుండి పాలింపుము. నీవు నాకు రెండవ ప్రాణముగావున నిన్నీ రాజ్యలక్ష్మి వరించినది. నన్ను వరించినపుడు నిన్ను వరించినట్లేగదా? నీ విక సకలభోగములను, ఇష్టార్థములను, వెలలేని వస్త్రాభరణాదులను సంతృప్తిగ ననుభవింపుము. నా జీవితమును, నా రాజ్యమును ఇతర భోగములను నీ కొరకే నేను కోరుచున్నాను".

రామచంద్రుడు తాను వేరని లక్ష్మణుడు వేరని యెంత మాత్రము తలచినవాడు కాడు. 'విద్ధి మాం ఋషిభిస్తుల్యం' అని తన్ను జితేంద్రియుడగు ఋషియని తెలిసికొమ్మనెను. 'నాహమర్థపరో దేవి' తల్లీ! నే నర్థపరుడను గాను. 'కేవలం ధర్మమాస్థితమ్' ధర్మమునే యాచరించువాడననియు తెలియుమని కైకతో చెప్పినప్పుడే అతని నిస్సంగత్వమును నిశ్చలతత్త్వమును సుస్పష్ట మగుచున్నది. ఇప్పుడు లక్ష్మణునితో చెప్పిన మాట లతని వైరాగ్యమునేగాక ఆశ్రిత వాత్సల్యమును, వారు తనకు ప్రాణతుల్యులనుటను వెల్లడించుచున్నవి. విశేషార్థమేమనిన పరమాత్మకు జీవాత్మసుఖానుభవమే ప్రియమని తెల్లమగుచున్నది.

లోకమున తమ బిడ్డల సుఖమే, సంతోషమే తమ సుఖమును సంతోషము నగునని తల్లిదండ్రులు భావించుట సహజమే. అట్లే జీవాత్మలపట్ల పరమాత్మకు నగునని భావింపవలెను. 'మమ ప్రాణా హి పాండవాః' అను కృష్ణుని వచనమును నిట్టిదే యని తెలియదగును.



లక్ష్మణుడు జితేంద్రియుడును, వైరాగ్యనిధియు, నిష్కామ కర్మానుష్ఠానము చేయు భగవత్సేవకుడు నగునని యప్పటి యతని మౌనమే తెలుపుచున్నది.

పట్టాభిషేక భంగము గలిగినపుడు రాముడు వనవాసము చేయవలెనని తండ్రి యాజ్ఞయని వినినతోడనే లక్ష్మణుని యాగ్రహ మెంత తీవ్రముగ నుండెనో యీ క్రింది విషయములు వివరించును. లక్ష్మణు డన్నతో నిట్లనెను.

**గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః।**
**ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్॥**

అన్నా! పూజ్యుడగు గురువైనను (తండ్రియైనను) గర్వించి యిది తగును ఇది తగదని తెలియక తప్పుదారిని త్రొక్కనేని అతనిని దండించుట ధర్మమే, మరల నతడు కౌసల్యతో–

**అనురక్తోఽస్మి భావేన భ్రాతరం దేవి తత్త్వతః।**
**సత్యేన ధనుషా చైవ దత్తేనేష్టేన తే శపే॥**

"అమ్మా! నిన్ను నా తల్లిగనే భావించి చెప్పుచున్నాను. నేను భరతునివలె దాయాదినే రామచంద్రునకు. అయినను నే నతనియం దాంతరంగిక ప్రేమగలవాడను, నేను సత్యము మీదను, ఇష్టదేవతార్చనముమీదను, దానము సాక్షిగను, ధనువు మీదను శపథము చేసెదను."

**దీప్తమగ్నిమరణ్యం వా యది రామః ప్రవేక్ష్యతి।**
**ప్రవిష్టం తత్ర మాం దేవి త్వం పూర్వమవధారయ॥**

"రామచంద్రుడు మండెడు మంటలో దుముక నెంచినను, అడవిలో ప్రవేశింపనెంచినను, న న్నతనికన్న ముందు ప్రవేశించువానినిగ నెరుగుము". లక్ష్మణుని కోపమును గుర్తించి రామచంద్రు డిట్లనెను.

**తవ లక్ష్మణ జానామి మయి స్నేహమనుత్తమమ్।**
**విక్రమం చైవ సత్త్వం చ తేజశ్చ సుదురాసదమ్॥**

"లక్ష్మణా! నీకు నాయందెట్టి స్నేహము గలదో నే నెరుగుదును. నీ బలము సాటిలేనిది. నీ పరాక్రమ మెదురులేనిది. నీ ప్రభావమెందునను గానరానిది. నీ వనుమాటలెల్ల నాయందు నీకు గల గాఢానురాగమునే వెల్లడించుచున్నవి. కాని తండ్రిని చంపియైనను రాజ్యమును నా కిచ్చెదనంటివే, అది ధర్మవిరుద్ధమైనది. ఎట్లందువా వినుము."

**ధర్మో హి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్।**
**ధర్మసంశ్రితమేతచ్చ పితుర్వచనముత్తమమ్॥**

లోకమున పురుషార్థములు నాలుగింటిలో ధర్మమే యుత్తమమైనది. దానియందే సత్యము నెలకొనియున్నది. ఇప్పుడు నే ననుష్ఠింప నిశ్చయించిన పితృవాక్యపరిపాలనమును ధర్మము నాశ్రయించినట్టిదే. ఎవరిమాట పాటింపవలెనని సంశయము గలిగినపుడు తండ్రిమాట పాటించుటే యుత్తమ ధర్మమని తెలియుము.

**తదేనాం విసృజానార్యాం క్షత్రధర్మాశ్రితాం మతిమ్।**
**ధర్మమాశ్రయ మా తైక్ష్ణ్యం మద్బుద్ధిరనుగమ్యతామ్॥**

కేవల మర్థము నాశ్రయించి అధర్మమగు క్షత్రధర్మమును పాటింపకుము. ధర్మమునే యనుసరింపుము. ఇట్టి క్రౌర్యమును వదలుము. నీకు జ్యేష్ఠుడనగు నా మార్గ మవలంబించి శ్రేష్ఠుడవు కమ్ము.

**యస్మింస్తు సర్వే స్యురసన్నివిష్టా ధర్మో యతస్స్యాత్తదుపక్రమేత।**
**ద్వేష్యో భవత్యర్థపరో హి లోకే కామాత్మతా ఖల్వపి న ప్రశస్తా॥**

ఏ కార్యము చేయుటవలన ధరార్థకామములను మూడు పురుషార్థములు సిద్ధింపవో అట్టి కార్యము చేయరాదు. అర్థకామములు లోపించినను ధర్మము



సిద్ధించునట్టి కార్యమునే చేయవలెను. లోకములో ధనమునే కోరువాడు బహుజనులచే ద్వేషింపబడును. కేవలము కామమునే గోరుటయు ప్రశస్తము గానేరదు.

**గురుశ్చ రాజా చ పితా చ వృద్ధః క్రోధా త్ప్రహర్షా ద్యది వాఽపి కామాత్।**
**యద్వ్యాదిశేత్ కార్యమవేక్ష్య ధర్మం కస్తం న కుర్యాదనృశంసవృత్తిః॥**

అతడు మన కాచార్యుడును రాజును, తండ్రియు, వృద్ధుడునగువాడు అతడు కోపముననో సంతోషముననో కామముచేతనో తన ప్రతిజ్ఞను పాటింపవలెనను ధర్మము ననుసరించి యేదేని యొక కార్యమున నియోగించునేని క్రూర స్వభావములేనివా డెవడు చేయడు?

"నే నట్టి క్రూరుడను గాను. ఇన్ని యాకారములలో పూజ్యుడగు తండ్రిమాట చొప్పున భరతుని రాజ్యమేలుమని చెప్పి నే నరణ్యమునకు బోయి యతనిమాట చొప్పున వర్తించెదను. తండ్రియాజ్ఞ యెట్టిదని విమర్శించుట మన కెంతమాత్రము తగదు. ఇందువలన పెనునష్టమేదియు లేదు. ఇట్టి నామాట ననుసరించి నీవును ప్రవర్తింపు" మని తమ్మునకు హితోపదేశము చేసినాడు రామచంద్రుడు.

కైకేయివలన నిట్టి కష్టములు గలిగినవని యామెమీద లక్ష్మణుడు కోపించుచున్నాడని యూహించి రామచంద్రు డీ రీతి తత్త్వోపదేశము చేయుచున్నాడు.

**కైకేయ్యాః ప్రతిపత్తిర్హి కథం స్యాన్మమ పీడనే।**
**యది భావో న దైవోఽయం కృతాంతవిహితో భవేత్॥**

"లక్ష్మణా! కైకేయి నన్ను మిక్కిలి ప్రేమించునట్టిదే. ఆమె నాకిచ్చిన రాజ్యమును మరల నీయకుండునట్లుచేసి అంతటితో నుండక నన్ను

వనవాసము చేయునట్లు నియమించెనే. తటాలున ఆమెబుద్ధినిమార్చి అంతటి ప్రేమ నింతటి విరోధముగ పరిణమింపజేసినది దైవమనియే చెప్పవలసియున్నది.

**కథం ప్రకృతిసంపన్నా రాజపుత్రీ తథాగుణా।**
**బ్రూయాత్సా ప్రాకృతేవ స్త్రీ మత్పీడాం భర్తృసన్నిధౌ॥**

ఆమె మెత్తని స్వభావము గలది. కులము కొలది గుణమన్నట్లామె గొప్పవంశమున బుట్టినది. కేవలము సర్వసామాన్యయగు స్త్రీవలె భర్తయెదుట నిష్ఠురముగ బలికి నన్ను బాధింపజూచునా? ఇందుకు దైవమే కారణ మనవలెను.

**సుఖదుఃఖే భయక్రోధౌ లాభాలాభౌ భవాభవౌ।**
**యచ్చ కించిత్తథాభూతం నను దైవస్య కర్మ తత్॥**

ప్రపంచమే కార్యకారణసంబంధము గలది. కారణములేని కార్య మెట్లుండును? 'యత్ర ధూమః తత్ర వహ్నిః' ఎచ్చట ధూమమున్నదో అచ్చట అగ్ని యున్నదనుట సిద్ధము. అట్లే సుఖదుఃఖములు, కోపము, భయము, శాంతి, లాభనష్టములు, చావు పుట్టుకలు మొదలగు కారణము లూహింప నలవిగాని వన్నియు దైవకార్యము లనియే గ్రహింపవలెను.

**ఋషయోఽప్యుగ్రతపసో దైవేనాభిప్రపీడితాః।**
**ఉత్సృజ్య నియమాం స్తీవ్రాన్ భ్రశ్యంతే కామమన్యుభిః॥**

పంచాగ్నిమధ్యమున నుగ్రతపస్సు చేయు మహర్షులు సైతము దైవనియోగముచే వ్రతోపవాస నియమతపస్సులను వీడి కామాసక్తులై స్త్రీసంగముచే ఋషిత్వము గోలుపోయినవా రగుచున్నారు.

**అసంకల్పితమేవేహ యదకస్మాత్ ప్రవర్తతే।**
**నివర్త్యారంభమారబ్ధం నను దైవస్య కర్మ తత్॥**



ఈ లోకమున సదుద్దేశముతో నారంభించిన కార్యములు భంగ మగుటయు, ఎన్నడును మనసున నూహింపని కార్యము లకస్మాత్తుగ సంభవించుటయు చూచుచున్నాము. వీని కన్నింటికి కారణము దైవమే.

**ఏతయా తత్త్వయా బుద్ధ్యా సంస్తభ్యాత్మానమాత్మనా।**
**వ్యాహతేఽప్యభిషేకే మే పరితాపో న విద్యతే॥**

ఇప్పుడు నే నుపదేశించుబుద్ధి యథార్థమగునట్టిది. ఇతరుల యుపదేశము వలనను నా స్వానుభవమువలనను గ్రహించినది. దైవమే అన్నిటికి గారణమని మనుష్యమాత్రులు నిమిత్తమాత్రులని గ్రహింపవలెను. ఈ పట్టాభిషేక భంగమునకు కైక కారణమని, తండ్రికారణమని యెంచి నీవు వారిపై నాగ్రహపడెదవు. వారినట్టికార్యమునకు పురికొల్పినది దైవమేయని గ్రహింపు' మనెను.

## లక్ష్మణుని పౌరుషవాదము

రామచంద్రు డిట్టి క్లిష్టసమయమునను ధర్మము తప్పననుటకు సంతోషము, మిక్కిలి సుకుమారుడిట్టి వనవాసకష్టములనను భవింపవలసి వచ్చెనే యని దుఃఖము లక్ష్మణుని మనసును గలచివైచెను, కైక చేసిన కుట్రను దలచి కోపముగొని లక్ష్మణు డన్నతో–

**లోకవిద్విష్టమారబ్ధం త్వదన్యస్యాభిషేచనమ్।**
**నోత్సహే సహితుం వీర తత్ర మే క్షంతుమర్హసి॥**

"వీరాగ్రణీ! జ్యేష్ఠుడును శ్రేష్ఠుడును అగు నిన్నువిడచి పిన్నవారికి పట్టము గట్టుట లోకము నిందింపదగినకార్యము. వా రిద్దరీ కార్యము చేయబూనిరి. ఇది నాకు సహింప శక్యముగానిది. ఇట్లు నీతో నేకీభవింపజాలనందుకు నన్ను మన్నింపుము."

**మనసాఽపి కథం కామం కుర్యాస్త్వం కామవృత్తయోః।**
**తయోస్త్వహితయోర్నిత్యం శత్రోః పిత్రభిధానయోః॥**

కేవలము కామమునకుం జిక్కి నీకు కీడే కోరుచు తలిదండ్రులను పేరు పెట్టుకొనియుండు నీ పగవారు కోరరానిది కోరగా దానిని నెరవేర్పవలెనను తలంపు నీ కెట్లుగలిగె? అదియు దైవకృతమే యందువా? నాకట్లు తోచలేదు.

**విక్లబో వీర్యహీనో య స్స దైవమనువర్తతే।**
**వీరాస్సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే॥**

పిరికివాడు, పరాక్రమములేనివాడు అన్ని విషయములలోను దైవమును అనువర్తించుచున్నాడు. ధీరులును, పరాక్రమవంతులు నగు వారు దైవము నాశ్రయింపరు.



**దైవం పురుషకారేణ యస్సమర్థః ప్రబాధితుమ్।**
**న దైవేన విపన్నార్థః పురుషస్సోఽవసీదతి॥**

తన పౌరుషముచే నెవడు దైవమును బాధింప సమర్థుడో అట్టి వాడెన్నడు దైవమునే నమ్మి తన కార్యమును చెరచుకొని దుఃఖింపడు.

**అద్య మత్పౌరుషహతం దైవం ద్రక్ష్యంతి వై జనాః।**
**యద్దైవాదాహతం తేఽద్య దృష్టం రాజ్యాభిషేచనమ్॥**

ఏ దైవముచే నీ పట్టాభిషేకము భంగమాయెనని నీవు తలచెదవో ఆ దైవ మిప్పుడు నా పౌరుషముచే ప్రతిహతమగుటను జనులు చూడగలరు.

**న శోభార్థావిమౌ బాహూ న ధనుర్భూషణాయ మే।**
**నాసిరాబంధనార్థాయ న శరాః స్తంభహేతవః॥**
**అమిత్రదమనార్థం మే సర్వమేతచ్చతుష్టయమ్॥**

నా కీ బాహువు లలంకారము కొరకు గాదు. ఈ ధనువు నా కందము కొరకు గాదు. ఈ నా ఖడ్గము మొలలో నలంకారమునకు గట్టుకొనినది కాదు. ఈ బాణములు తూణీరమున గదలకుండుటకుగాదు, ఈ నాలుగును నా శత్రువుల నాశనముచేయు సాధనములుగ నున్నవి.

**అద్య మేఽస్త్రప్రభావస్య ప్రభావః ప్రభవిష్యతి।**
**రాజ్ఞశ్చాప్రభుతాం కర్తుం ప్రభుత్వం చ తవ ప్రభో॥**

అన్నా! నా యస్త్రబల మెట్టిదో యిప్పుడు చూతువుగాక! ఈ ముహూర్తముననే దశరథుని ప్రభుత్వము దప్పించి దానిని నీ కిప్పుడే యర్పింతును.

**బ్రవీహి కోఽద్యైవ మయా వియుజ్యతాం**
**తవాసుహృత్ప్రాణయశస్సుహృజ్జనైః।**

**యథా తవేయం వసుధావశే భవేత్**
**తథైవ మాం శాధి తవాస్మి కింకరః॥**

అన్నా! నేను నీ సేవకుడును. నా కెట్టి స్వాతంత్ర్యమును లేదు. నీ యాజ్ఞ పాటించుటే నా ధర్మము. ఏ విధముగ నీకు రాజ్యము లభించునో నీవే చెప్పుము. అట్లు చేయునపు డెవ డడ్డము వచ్చునో వానిని వధించెదను. వాని కీర్తిని రూపుమాపెదను. వాని స్నేహితుల నందరిని పారదోలెదను. నా కాజ్ఞయిమ్ము' అనెను. అంత రామచంద్రుడు లక్ష్మణుని కనుగొనలనుండి జారుచున్న కన్నీళ్ళను తనచేతితో మెల్లగ తుడిచి మెత్తనిమాటలతో నతని నోదార్చి 'ఉవాచ పిత్ర్యే వచనే వ్యవస్థితం నిబోధ మామేవహి సౌమ్య సత్ప థే'

'నాయనా! నీ వెప్పుడు మెత్తనిమాటలాడువాడవే. నీ కిట్టి కోపమేల వచ్చెను? నీ వెంత వాదించినను నేను తండ్రిమాట చొప్పుననే వర్తింప నిశ్చయించితి నని తెలిసికొను' మనెను.

(అయోధ్యాకాండమున22–23 సర్గలలో రామలక్ష్మణుల సంవాదము ధర్మాధర్మముల విశదీకరించును. లక్ష్మణుడు కోపాతిరేకమున దశరథుడును కైకయు ధర్మము తప్పిరని, దశరథుడు కామపరవశుడై కైకకు లొంగి వంశాచారవిరుద్ధముగ జ్యేష్ఠుని వదలి కనిష్ఠునకు రాజ్యమీయం దగదని, అట్టి యధర్మవర్తనుడగు తండ్రి తండ్రికాడని, అతడు రామచంద్రునకు శత్రువని, అందువలన రామదాసుడగు తనకును శత్రువేయని, ఆ శత్రువును జంపుట దోషముకాదని, ధర్మమే యని చెప్పి రామునియందు కైకకుండిన సద్బుద్ధి మారుటకు దైవమే కారణమని, దైవవశమున జరుగు సంఘటనల నట్లని నమ్మిశిరసావహించుటే ధర్మమని రాముడాడినమాటల నొప్పుకొనక క్షమింపవేడుచు లక్ష్మణుడు పౌరుషమే దైవముకంటె బలీయమని తీవ్రముగ వాదించెను. అతని కీ క్రిందివాక్యము లాధారములు.)



**తపసా రూపసౌభాగ్యం రత్నాని వివిధాని చ।**
**ప్రాప్యతే కర్మణా సర్వం న దైవాదకృతాత్మనా॥**

**సర్వం పురుషకారేణ కృతేనేహోపలభ్యతే।**
**జ్యోతీంషి త్రిదశా నాగాః యక్షాశ్చంద్రార్కమారుతాః।**
**సర్వే పురుషకారేణ మానుషా దేవతాం గతాః॥**

తపస్సుచే సుందర రూపము, సౌభాగ్యము, వివిధ రత్నములు (అనగా సకలైశ్వర్యములు) గలుగుచున్నవి. కర్మముచేతనే సకలము చేకూరును గాని దైవమిచ్చునని యూరకుండు వాని కేదియు లభింపదు, సూర్యచంద్రాదులు, దేవతలు, నాగులు, యక్షులు, మారుతములు మున్నగు వారు మానవులుగ నుండి దేవత్వము పొందినవారు. వారు పురుషకారముచేతనే యట్టి పదవులను బొందిరి, కనుక పురుషప్రయత్నముచే సాధింపరానిదేదియులేదని లక్ష్మణుడు వాదించెను. ఇట్లు దైవపౌరుషములకు పరస్పర విరోధమువచ్చినట్లగ పడుచున్నది. పురుషకార మెంతమాత్రము లేక దైవమేదియు నియ్యదనుట సత్యదూరము గాదు. కేవలము పురుషప్రయత్నవే సకల కార్యసాఫల్యమిచ్చుననుటయు నిజము గాదు. అన్నియు నుండినను దైవానుగ్రహము కూడ నుండవలయుననుటయు ముమ్మాటికి సత్యమే. ఒక పనిని సఫలము చేయుటకీ రెండు నావశ్యకములని యొప్పుకొనక తప్పదు. భగవద్గీతలో–

**అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్।**
**వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్॥ (18–14)**

ఒక కార్యము సఫలమగుటకు అదిష్ఠానము (శరీరము) కర్త, కరణములు, చేష్టలు, దైవము అను నైదు నుండవలెనను కృష్ణవాక్యము నిచ్చట స్మరింపనగును. ఈ పట్టాభిషేకవిషయమున వీనిలో నేది లోపించినదో

చూతము. దశరథుడు కర్త. అతనియాజ్ఞ పాటించువారు సుమంత్రాదులు. ముహూర్తనిర్ణయము చేసినవాడు వసిష్ఠభగవానుడు. త్రికరణశుద్ధిగ చేసిన ప్రయత్న మనుట కెట్టి సందేహములేదు. కార్యకలాపముల నిర్వహించు సమర్థు లిందరని చెప్పనలవికాదు. పెక్కు కార్యములును జరిగినవి. కాని దైవానుగ్రహ మొక్కటిలేని కారణమున నియ్యది భగ్నమయ్యెను. ఇది యెల్లర హృదయమున నెల్లప్పు డుండవలసిన విషయము, రామచంద్రుడు 'తండ్రిమాట చొప్పుననే వర్తింతును. అదియే యుత్తమ ధర్మమని' యేల చెప్పెనో విచారింతము.

లక్ష్మణుని పూర్వపక్షమునకు మునుపే సమాధానము చెప్పినను అతని సందేహము తొలగలేదని గ్రహించి శ్రీరాముడు మరల తన సిద్ధాంతము స్థిరపరచుచున్నాడు.

**జీవతో వాక్యకరణాత్ ప్రత్యబ్దం భూరిభోజనాత్।**
**గయాయాం పిండదానాచ్చ త్రిభిః పుత్రస్య పుత్రతా॥**

తండ్రి జీవించియుండునపు డాతని మాట చొప్పున వర్తించుటయు, యేటేట తండ్రికి గొప్ప యన్నదానముతో శ్రాద్ధము చేయుటయు, గయలో పిండ మొసగుటయు అనెడి యీ మూడు కార్యములు చేయుటచేతనే పుత్రుడు పుత్రు డనబడును. ఈ సత్యమును, శాస్త్రార్థమును వెల్లడి చేయుటకే రామచంద్రు డిట్లు చెప్పెనని గ్రహింపవలెను.

## లక్ష్మణ శరణాగతి

శ్రీరాముడు కౌసల్యాదేవి యనుజ్ఞబడసి సీతాదేవియొద్ద సెలవు పుచ్చుకొనివచ్చుట కేగినపుడు సీతారాములకు జరిగిన తీవ్ర వాదోప వాదముల నచ్చటనే యుండి వినుచుండిన లక్ష్మణుడు తనలో, ఆహా! ఏమియాశ్చర్యము! తన కర్ధాంగియు, పతియే గతియని నమ్మినసతియగు సీతాదేవిని తనవెంటదోడ్కొని పోవ నిష్టపడక చాల సేపటికి బహు విధములుగ ధర్మపత్ని వాదించి నిష్ఠురోక్తులాడిన తర్వాత రామచంద్రుడామె రాకకు విధిలేక సమ్మతించెనే! నేనేమిచేయుదు ననియు చాల దుఃఖించి కన్నుల నీరు గ్రమ్మగా నిట్లు శరణాగతి చేసెను.

**స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః।**
**సీతామువాచాతియశా రాఘవం చ మహావ్రతమ్॥**

ఉపాయాంతర మేదియు లేనందున గొప్పకీర్తిమంతుడగు లక్ష్మణుడు అన్న పాదములను గట్టిగ బట్టుకొని సీతాదేవిని తొలుతజూచి పిదప ఆశ్రిత రక్షణమను గొప్పవ్రతము గల రామచంద్రుని గాంచెననుటలో లక్ష్మణు డనుష్ఠించిన శరణాగతి యిహపర సాధకమగునని తెలియుచున్నది. (నాల్గవపురుషార్థమగు మోక్షమును బొందుటకేకాక ఐహికవిషయముల లోను గత్యంతరము లేని సందర్భమున శరణాగతియే ఫలసాధనమగునని యిందువలన సుస్పష్టమగుచున్నది. శరణాగతి కంగములైదు. 1. ఆనుకూల్యస్య సంకల్పము, శ్రీరామసేవాసంకల్పమే. 2. ప్రాతికూల్యస్య వర్జనమ్ భగవత్కైంకర్యమునకు అవరోధము గలిగించునట్టివి. 'పరిత్యక్తా మయా లంకా రత్నాని చ ధనాని చ' అని విభీషణుడన్నట్లు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' యని స్వర్గ సుఖముకంటె హెచ్చగు మాతృసేవను తన జన్మభూమియగు అయోధ్యను విడిచి 'రత్నాని చ ధనాని

చ' అనిన సకలభోగ భాగ్యంబుల వీడి భగవత్సేవయే ప్రధానమని శ్రీరామ కైంకర్యమే తనకర్తవ్యమని యెంచినందున లక్ష్మణుడు ప్రాతికూల్యవర్జనము చేసినాడన వలెను. 3. 'రక్షిష్యతీతి విశ్వాసః' తన్నుగాపాడునను దృఢమైననమ్మకము. దీనినే మహావిశ్వాస మందురు. రాముడే తన్నుద్ధరించువాడను నమ్మకము 4. 'గోప్తృత్వవరణమ్' నన్ను రక్షింపుమని యడుగుట నన్ను నీ వెంట నరణ్యమునకు వచ్చునట్లనుజ్ఞ యిమ్మనుటను సూచించును. 5. కార్పణ్యము. ఇందు రెండు విషయము లిమిడియున్నవి. అనన్యగతికత్వము. అనగా నీవు తప్ప నన్నుకాపాడువా రెవరును లేరని భావము. ఆకించిన్యము– నన్నుకాపాడుకొను శక్తి నాకులేదు, సర్వవిధముల నశక్తుడను. నన్నుకాపాడువారు ఇతరు లెవ్వరు లేరు అని తనయాత్మను రాముని చరణార విందములందు సమర్పించెననుట భరన్యాసమగును. ఆత్మనిక్షేపమనుటయు నిదియే. ఇందుకు ముఖ్యమగునది పురుషకారము. అట్టి పురుషకారభూత సీతాదేవియే. ఆమె తన్నాశ్రయించిన లక్ష్మణుని (జీవాత్మను) రక్షింపుమని పరమాత్మయగు తనభర్తకుచెప్పి కార్యసాఫల్యము గలిగించునది. 'శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః, అనునది ద్వయమంత్ర మనబడును. ఈ శ్లోకము పూర్వార్ధముచే ద్వయమంత్రముయొక్క పూర్వార్ధమున జెప్పబడిన శరణాగతి స్వరూపము చెప్పబడినది. ఉత్తరార్ధములో నీ మంత్రముయొక్క ఉత్తర ఖండములో జెప్పబడిన ఫలప్రాప్తి చేతనుడు శరణాగతి చేయునపుడు. ఈశ్వరుడు పరిగ్రహించునపుడు అవశ్యముగనుండు పురుషకార స్వరూపము చెప్పబడినది. ఈ విధముగ నీ శ్లోకము లక్ష్మణుడుచేసిన శరణాగతిని తెలుపుచున్నదనుట సంప్రదాయార్థము.')

**న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే।**
**ఐశ్వర్యం వాఽపి లోకానాం కామయే న త్వయా వినా॥**



లక్ష్మణుడు రామచంద్రుని వనగమనము నంగీకరింప కున్నను రాముడు పోవ నుద్యుక్తు డగుటను గని యంజలిబద్ధుడై తన్నువిడిచి పోరాదని వెంటగొని పోవలెనని యాచించుచు, ''అన్నా! నీవులేక నేను పరమపదమునకు బోవుటయుగోరను. అనగా నీకైంకర్యములేని దెట్టిస్థానమునైనను గోర" నని దృఢముగ చెప్పుచున్నాడు. (విశిష్టాద్వైత సంప్రదాయమున శ్రీవైకుంఠమునను భగవత్సేవయే యానంద మనుట ముఖ్యాంశము) కైవల్యముగాని అంతకంటె తక్కువయగు బ్రహ్మాపదవినిగాని నేను గోరను, ఇట్లనినను మెత్తనిమాటలతో నోదార్చి విడిచి పోవనెంచిన రామచంద్రునిజూచి లక్ష్మణుడు–

**అనుజ్ఞాతశ్చ భవతా పూర్వమేవ యదస్మ్యహమ్।**
**కిమిదానీం పునరిదం క్రియతే మే నివారణమ్॥**

అన్నా! అభిషేక సంభారముల విడిచి యరణ్యావాస ప్రయాణ సన్నాహములు గావింపుమని చెప్పునపుడు నన్ను నీవెంట గొనిపోవ నంగీకరించితివే. ప్రయాణమునకు సిద్ధముగనుండు నన్నిప్పుడేల వద్దనుచున్నావు? ఏ యపరాధము చేసినందున నీ విప్పుడు నా రాకను నిషేధించుచున్నావోయని సందేహము గలుగుచున్నది యనినంతనె రామచంద్రుడు జాలినొంది యిట్లనెను.

**స్నిగ్ధో ధర్మరతో వీర స్సతతం సత్పథే స్థితః।**
**ప్రియః ప్రాణసమో వశ్యో భ్రాతా చాపి సఖా చ మే॥**

'లక్ష్మణా! నీవు నాకత్యంత ప్రేమపాత్రుడవు. ధర్మమాచరించువాడవు. వీరుడవు. సన్మార్గమునందే వర్తించువాడవు. ప్రాణతుల్యుడగు ప్రియుడవు. నాయాజ్ఞ శిరసావహించు వాడవు. నా సోదరుడవు. ఉత్తమస్నేహితుడవు. ఇట్టి నిన్ను నేనేల విడిచిపోవ నెంచుట? నీయందెట్టి దోషము వలనగాదు.

మన తల్లుల మేలు దలచి నీవు నాకు బదులుగా వారికి శుశ్రూషాదులు చేయుదు వని. లక్ష్మణుడును మాటలనేర్పరిగావున అన్నను మెప్పింప యుక్తియుక్తముగ సమాధానము చెప్పి.

**కురుష్వ మామనుచరం వైధర్మ్యం నేహ విద్యతే।**
**కృతార్థోఽహం భవిష్యామి తవ చార్థః ప్రకల్పతే॥**

'అన్నా! నేను నీకెల్ల విధముల పరతంత్రుడను. నన్ను నీభృత్యునిగ జేసికొని నీ వెంట గొనిపొమ్ము. ఇందెట్టి దోషమును గలుగదు, నీ కైంకర్యమే యెల్లప్పుడు గోరుచుండు నా కోరిక యీడేరును. నీకు నే ననేక విధములుగను సహకరింతును.'

**భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే।**
**అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చ తే॥**

రామచంద్రా! నీవు పర్వత ప్రదేశమున సీతాదేవితో సుఖముగ విహరించుచుండవచ్చును. నేను మీరు మేలుకొని యుండునపుడు ఫలమూలాదులు దెచ్చి యిచ్చి మీయాజ్ఞల బాటింతును. మీరు నిద్రించునపుడు మృగముల వలనగాని, క్రూరుల వలనగాని యెట్టికీడు వాటిల్లకుండ మిమ్ము కాపాడుచుండెదను.

('కురుష్వ మా మనుచరం' నీవు శేషివి (స్వామివి); నేనుశేషభూతుడను. (సేవకుడను) 'మా మనుచరం కురుష్వ' నన్ను నీ దాసునిమైనదాస్యమును నాస్వధర్మ నిర్వర్తించుట కనుజ్ఞయిమ్ము. నేను నీ వెంటరాకుంటినేని నేను ధర్మము తప్పినవాడ నగుదును. నేను నీ సొత్తును. యజమానుడు తన సొత్తును తన యిష్టము చొప్పున నుపయోగించి సంతోషించిననే ఆ సొత్తున కుపయోగము. నేను కృతార్థుడనై ధన్యుడ నగుదును. లేనిచో నా జీవితము విఫలమగును. అహోరాత్రములు నీ కైంకర్యమే నా కాచరణీయము.



అందువలననే భగవదారాధనకాలమున ఆత్మాత్మీయం సర్వం, భగవన్, నిత్యకింకరత్వాయ స్వీకురు. ఓ భగవంతుడా! నన్నును నాకుచెందిన చేతనాచేతనవస్తువు లన్నిటిని నీ యారాధనోపకరణములుగ పరిగ్రహింపుని ప్రార్థించుచున్నాము. ఈ శ్లోకములో ఉపాయ, ఉపేయస్వరూపములు చెప్పబడినవి. ఉపేయము (పొందవలసినది) ఉపాయము (పొందవలసిన విధము-భక్తి-ప్రపత్తి మొదలగునవి ఆరాధనరూపమగు కైంకర్యమే ఉపాయమని యర్థము. 'భవాంస్తు సహ వై దేహ్యా' అను శ్లోకమున లక్ష్మీ సమేతుడగు భగవంతుడు నారాయణుడే ఉపాస్యదేవతయని చేతనుడు సర్వకాల సర్వావస్థలలోను భగవత్కైంకర్యము చేసియే కృతార్థుడు గావలెనని తెలియుచున్నది. ఆండాళ్ దివ్యసూక్తియగు తిరుప్పావైలో 'ఉనక్కేనామాట్చెయ్‌వోమ్' నీకే మేము కైంకర్యము చేసెదమని చెప్పబడియున్నది.)

## సుమిత్ర లక్ష్మణుని దీవించుట

ప్రయాణమునకు ముందు సీతారామలక్ష్మణులు దశరథునకు మ్రొక్కి కౌసల్యాదేవికిని మ్రొక్కిరి. లక్ష్మణుడు కౌసల్యకు మ్రొక్కిన పిదప తనతల్లి సుమిత్రాదేవి పాదములం బట్టుకొని నమస్కరించెను. అంత నామె కన్నీరుగార్చి కుమారునిశిరము మూర్కొని యిట్లు హితోపదేశము చేసి దీవించెను.

**సృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తస్సుహృజ్జనే।**
**రామే ప్రమాదం మా కార్షీః పుత్ర భ్రాతరి గచ్ఛతి॥**

నాయనా! లోకసంరక్షణార్థము కౌసల్యాదేవి కడుపున శ్రీరాము డుదయించునట్లే, సకల సుహృజ్జనులలో శ్రేష్ఠుడగు నతనికి సహాయముగ నతనియం దనురాగముతో మెలగి యతని కెల్ల విధముల సేవ చేయ నీవు నా కడుపున బుట్టితివి. నీ వన్నతో పోవునపుడు, రాముడు సీతను గూడి పుష్పించిన వనమున సంచరించునపుడు అజాగ్రత్తగ నుండకుము. అతని కెట్టి కీడు రానీయక హెచ్చరికతో నుండుము. నీ వాతని గమన సౌందర్య మనుభవించుచు మైమరచి అజాగరూకుడవు గాకుము.

**వ్యసనీ వా సమృద్ధో వా గతిరేష తవానఘ।**
**ఏష లోకే సతాం ధర్మో యజ్జ్యేష్ఠవశగో భవేత్॥**

లక్ష్మణా! రామచంద్రు డిప్పుడు రాజ్యభ్రష్టుడై ఐశ్వర్యహీనుడై యున్నాడని భావింపకుము. అతడు సింహాసనమున నున్నను, వనమున నున్నను, భాగ్యవంతుడుగనున్నను, దరిద్రుడుగనున్నను అతడే నీకు శరణమను మాట మరువకుము. అతడెట్లున్న నీకేమి? అతనియందు భక్తి గలిగి యతని కైంకర్యమే యానందమని నీకే తెలియును. లోకమున చిన్నవాడు పెద్దవాని యధీనమున నుండవలెననుట సత్పురుషుల ధర్మము.



**ఇదం హి వృత్తముచితం కులస్యాస్య సనాతనమ్।**
**దానం దీక్షా చ యజ్ఞేషు తనుత్యాగో మృధేషు చ॥**

ఇక రఘువంశము యొక్క సనాతన ధర్మమును కనిష్ఠుడు జ్యేష్ఠుని వశమున నుండుట యనునది. లోకమున సత్పాత్రదానము చేయుట, యజ్ఞాదులు చేయ దీక్షవహించుట, తన స్వామి కొరకు యుద్ధమున ప్రాణము విడుచుట యిత్యాదు లన్నియు మీ పూర్వికు లనుష్ఠించినవే. నీవు రాముని కొరకే దానము చేయుము. అతని కొరకే యజ్ఞ దీక్ష వహింపుము. రాముని కొరకు నీ ప్రాణమునైన నర్పింపుము. ఇట్లు సుమిత్ర మాటిమాటికి లక్ష్మణుని పొమ్ము పొమ్మని త్వరపరచి యతడు తన్ను, దశరథుని, అయోధ్యను తలచికొని చింతించు నేమో యని సందేహించి యిట్లనెను.

**రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్।**
**అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్॥**

నాయనా! రాముని దశరథుడని యెరుగుము. సీతయే నేనని తలంపుము. అడవియే నీ జన్మభూమియగు అయోధ్యయని అరయుము, సుఖముగ బోయి రమ్ము. (రామాయణములోని స్త్రీలలో నుత్తమశ్రేణి కలంకారమగునది సుమిత్రాదేవి. ప్రపంచమున సవతుల పోరాట మెట్టిదో తెలియనివారు లేరు ఇట్లుండ తన సవతి కొడుకగు రామచంద్రునకు సేవచేయుటే నీ స్వధర్మమని తన కుమారునకు బోధించిన సుమిత్ర శ్రీరాముని పరతత్త్వ మెట్లెరిగియున్నదని గుర్తించుట మన కర్తవ్యము. 'రామం దశరథం విద్ధి' అనుటలో రహస్యమేమి? దశమనగా కొరుకునది. పాములను గొరికితినునది గరుత్మంతుడు. రథమనగా తేరు లేక వాహనమని యర్థము. దశరథుడనగా గరుత్మంతుడు వాహనముగా గల విష్ణువని యెరుగుము. రాముని దశరథుడని తెలియు మనుటలో రాముడు గరుడవాహనారూఢు

డగు విష్ణువే యని తెలిసికొమ్ము. నీవు శేషాంశమున నవతరించినవాడవు. నీవే విష్ణుదేవునకు మొదటి సేవకుడవు. ఈ యవతారమున నీ స్వామియగు రామునకు సేవ చేయుమని బోధించిన ట్లగుచున్నది. 'మాం విద్ధి జనకాత్మజామ్' జ్యేష్ఠభ్రాతా పితృసమః'– అన్న తండ్రితో సమానుడని యర్థము కదా! అన్న భార్య తల్లితో సమానమని సిద్ధించును. అందుచే నామె నీకు పూజ్యురాలు. నేను శరీరసంబంధముగ నీకు తల్లిని. సోపాధికమాతనైన నన్ను బూజించియు నా వలన నీ కెట్టి లాభమును గలుగదు. నిరుపాధికమాత సీత (లక్ష్మీదేవి). ఆమె కొక నమస్కారము చేసిన నామె నిన్నుద్ధరించును. ఆమె పురుషకారభూతురాలు. ఆమె వలన రాముని పరిపూర్ణానుగ్రహము నీవు పొందగలవు అని చెప్పినట్లే– 'అయోధ్యా మటవీం విద్ధి' అనుటలో విశేషమేమి? 'న హి తద్భవితా రాష్ట్రం యత్ర రామో న భూపతిః। తద్వనం భవితా రాష్ట్రం యత్ర రామో నివత్స్యతి' అని వసిష్ఠుడు చెప్పిన మాటను సుమిత్ర చెప్పినట్లుగను భావింపవచ్చును, రాముడు రాజుకాని ప్రదేశము రాజ్యమనిపించుకొనదు. రామచంద్రుడు వసించుటచేతనే యడవి రాజ్యమని చెప్పదగును. కనుక నీ వీ యయోధ్యను విడిచి వచ్చితినే యని చింతింప నక్కరలేదు. ఈ మాట లక్ష్మణుడే రామునితో చెప్పియున్నాడు. ఏమని? అన్నా! నీవు లేక శ్రీవైకుంఠమైన నాకక్కరలేదు. భగవత్కైంకర్యము గోరువారికి ఇతరములు రుచింపవని తెలియుచున్నది. ఇట్లు తత్త్వార్థ ముపదేశించి దీవించి కుమారుని అరణ్యవాసమునకు పురికొల్పి ప్రోత్సహించినది సుమిత్రాదేవి యొక్కతెయే కదా! లక్ష్మణు డామెను అనుజ్ఞ యడుగుటకు ముందే యామె యిట్టి యుపదేశము చేసెనే. ఇట్లే శత్రుఘ్నుడు భరతునియెడ వర్తించుటలోను సుమిత్రకు పరిపూర్ణాంగీకారమున్నదని చెప్ప నక్కరలేదు.)

గుహుడు లక్ష్మణుని జూచి మిత్రమా! నీవు సుఖమునకే తగిన వాడవు. నీ కొరకు కేర్పరచిన శయ్యయందు పవ్వళింపుము.



**న హి రామాత్ప్రియతరో మమాస్తి భువి కశ్చన।**
**బ్రవీమ్యేతదహం సత్యం సత్యేనైవ చ తే శపే॥**

నా కీ లోకమున రామునికంటె ప్రియతము డెవడును లేదు. ఆయన యందు నా కనన్యభక్తి కలదు. ఇది సత్యమని నమ్ముము. సత్యము మీద ప్రమాణముచేసి చెప్పెదను.

**సోఽహం ప్రియతమం రామం శయానం సహ సీతయా।**
**రక్షిష్యామి ధనుష్పాణి స్సర్వతో జ్ఞాతిభిస్సహ॥**

సీతాదేవితో పరుండి నిద్రించుచున్న నా గారాము స్నేహితుడగు రామచంద్రుని నేను ధనుర్ధరులైన నా జ్ఞాతివర్గముతో గూడి రక్షించెదను అనినంత లక్ష్మణుడు గుహునితో నిట్లనెను.

**కథం దాశరథౌ భూమౌ శయానే సహ సీతయా।**
**శక్యా నిద్రా మయా లబ్ధుం జీవితం వా సుఖాని వా॥**

"మిత్రుడా! దశరథచక్రవర్తి నోముల పంటయగు రామచంద్రుడు మిక్కిలి సుకుమారియగు సీతతో కరకునేల మీద పరుండియుండగా, నే నెంత యత్నించినను కనులుమూయ సాధ్యమా? ప్రాణము ధరింప నలవియా? ఇక సుఖమెట్లు గలుగును?"

**కౌసల్యా చైవ రాజా చ తథైవ జననీ మమ।**
**నాశంసే యది జీవంతి సర్వే తే శర్వరీమిమామ్॥**

రామవియోగ దుఃఖాతిశయమున కౌసల్యయు, రాజును, నా తల్లియు బ్రతికియుందురని యెంచలేను. ఒక వేళ యీ రాత్రి మాత్రము జీవించి యుందురేమో!

**అపి సత్యప్రతిజ్ఞేన సార్ధం కుశలినా వయమ్।**
**నివృత్తవనవాసేఽస్మిన్నయోధ్యాం ప్రవిశేమహి॥**

ప్రతిజ్ఞ చొప్పున అరణ్యవాసము గడపి దశరథుడు జీవించియుండగా మేము క్షేమముగ మరలివచ్చి యయోధ్య ప్రవేశింతుమా! యనెను. (ఇందు వలన గుహుని యనన్యభక్తి, లక్ష్మణుని రామకైంకర్యసంపద యందలి దృఢాధ్యవసాయము వెల్లడియగుచున్నవి.)

సుమంత్రుడు మరలివచ్చిననాడే సీతారామలక్ష్మణుల మొదటి యేకాంత వనవాసదినము. ఆ రాత్రి రామచంద్రుడు లక్ష్మణునితో సుమిత్రానందనా! లోకమున ధర్మార్థముల వీడి కామము నాశ్రయించువారు దశరథునివలె వంతల పాలగుదురని, కైకేయి రాజమాతయగుటచే కౌసల్యా సుమిత్రల నొప్పించునని తలచి లక్ష్మణుని మరునా డుదయము అయోధ్యకు మరలిపోయి కౌసల్యాసుమిత్రలను ఓదార్చుచు వారికి శుశ్రూషాదులు తనకు మారుగ జేయుచుండు మనినంతనే లక్ష్మణుడు ఖిన్నుడై,

**న చ సీతా త్వయా హీనా న చాహమపి రాఘవ।**
**ముహూర్తమపి జీవావో జలాన్మత్స్యావివోద్ధృతౌ॥**

నీట నుండు చేపలను బయటవేసిన నవి చచ్చుట నిజము. అట్లే నిన్ను విడిచి సీతయొక క్షణమైన జీవించి యుండదు. నేను నిన్ను వదలి యొక్క క్షణమైనను బ్రతికి యుండను. నా కొకవేళ తండ్రిని, శత్రుఘ్నుని, తల్లిని చూడవలెనను బుద్ధిపుట్టునేమో యని శంకింతువా వినుము.

**న హి తాతం న శత్రుఘ్నం న సుమిత్రాం పరంతప।**
**ద్రష్టుమిచ్ఛేయమద్యాహం స్వర్గం వాఽపి త్వయా వినా॥**

అన్నా! నిన్ను విడిచి నేను తండ్రిని గాని, శత్రుఘ్నుని గాని, నా తల్లి సుమిత్రాదేవిని గాని, స్వర్గలోకమును గాని కన్నెత్తి చూడగోరనని నిస్సంశయముగ నమ్ముము. ('చలా హి ప్రాణినాం మతిః' మానవుల మనసు చంచలస్వభావము గలది. నిమిషనిమిషమునకు మార్పులు



పొందుచుండునని రామచంద్రుడు లక్ష్మణుని మనసు నప్పు డప్పుడు చలించినదేమో యని పరీక్షించుచున్నాడనవలెను. కాని లక్ష్మణుని మనః స్థైర్యము సాటిలేనిది. రామకైంకర్య సంపద తప్ప వేరొకదానిని గోరదు.)

సుమంత్రుడు సీతారామలక్ష్మణులను గంగా తీరమున వదలి మరలి వచ్చి దశరథునితో రాముని సందేశమును వివరించి లక్ష్మణుడు కోపముతో నిట్టూర్పులు విడుచుచు చెప్పిన మాటల నిట్లు చెప్పెను.

**రాజ్ఞా తు ఖలు కైకేయ్యా లఘుత్వాశ్రిత్యశాసనమ్।**
**కృతం కార్యమకార్యం వా వయం యేనాభిపీడితాః॥**

తన సవతి కొడుకులమైన మమ్ము వ్యసనముపాలు చేయనెంచిన కైకేయి యొక్క నీచమగు ఆజ్ఞను గొప్పగ నెంచి చేయరాని చెడ్డ కార్యమును రాజు చేసినవా డయ్యెను. అందుచే మే మిప్పుడు పీడింపబడినవార మగుచున్నాము.

**అహం తావన్మహారాజే పితృత్వం నోపలక్షయే।**
**భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవః॥**

నాకింక రాజునందు తండ్రియను బుద్ధియు నశించినది. నాకు సోదరు డనిన రామచంద్రుడే. భర్త యనినను నాతడే. సకలవిధ బంధువును నాకు రాఘవుడే. నాకు తండ్రియు నాతడే.

**సర్వప్రజాభిరామం హి రామం ప్రవ్రాజ్య ధార్మికమ్।**
**సర్వలోకం విరుధ్యేమం కథం రాజా భవిష్యసి॥**

నా మాటగా రాజును నీ విట్లడుగుము. సకలజనుల మనోభిరాముని, ధర్మమునే యాచరించు శ్రేష్ఠుని, సకలలోకమునకు మేలే గోరువానిని విడిచి ప్రజలనందరిని విరోధించుకొని నీవు రాజనిపించుకొనుటెట్లు? (పై విషయము సుమంత్రుడు రాముని గంగాతీరమున విడిచి మరలి వచ్చునపుడు

లక్ష్మణుడు సుమంత్రునితో చెప్పినట్లున్నది. కాని సుమంత్రుడు మరలివచ్చి దశరథునితో రాముని సందేశము నివేదించునపుడే యీ విషయములు గలవు. వాల్మీకి పద్ధతి యెట్లనిన కొన్ని సందర్భములలో జరిగిన విషయ మా సందర్భముననే చెప్పక వేరొక సందర్భమున చెప్పుటయు గలదు. ఇట్లే కాకాసురవృత్తాంతము చిత్రకూటమున జరిగినట్లు సుందరకాండలో సీతాదేవి హనుమంతున కానవాలిచ్చు సందర్భముననే చెప్పియున్నది. లక్ష్మణుడు ప్రతివిషయమును మనసున నుంచుకొనక అప్పటికప్పుడే బహిరంగపరచు స్వభావము గలవాడనియు అధర్మాచరణము నెంత మాత్రము సహింపడనియు అట్లు ధర్మము దప్పినవారు తల్లిదండ్రులైనను వారి యెదుట ఆ విషయముల నప్పటి కప్పుడే విమర్శించి అధర్మమిది యని నొక్కి చెప్పువాడనియు తెలియుచున్నది. అతడు కొన్ని సమయములలో కోపముచే మిక్కిలి తీవ్రముగ వాదించుటెల్ల అతనికి శ్రీరామచంద్రునియందు గల అసాధారణ భక్తినే చాటించును. అతడు తల్లిదండ్రులను, అన్నదమ్ములను, భార్యను, బంధువులను, స్నేహితులను విడచినను విడచునే కాని, రామచంద్రునొక్క క్షణమైనను వీడియుండడని తెలియుచున్నది.)

'పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్। రత్నాని ధనధాన్యాని క్షేత్రాణి చ గృహాణి చ। సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్। లోకవిక్రాంతచరణౌ శరణం తే వ్రజం విభో॥'
అనికదా పరమైకాంతులగు భక్తుల లక్షణము! ఎవరినైనను దేనినైనను త్యజించి భగవత్సేవచేయుటలో లక్ష్మణునకు సాటి యెవరు?

లక్ష్మణుడు చిత్రకూటమున ఆశ్రమ మేర్పాటుచేసి సీతారాముల కింపు గూర్చెను. మరల వారు పంచవటి చేరగా రామచంద్రుడొక రమణీయ స్థలమున నాశ్రమము. నిర్మింప నాజ్ఞాపించినందున లక్ష్మణు డొక చక్కని పర్ణశాల నిర్మించెను. అంత నాతడు గోదావరిలో స్నానము చేసి వాస్తు పూజచేసి శాంతి క్రియల నిర్వర్తించి అన్నకాయాశ్రమమును జూపెను. సీతాసమేతుడై రాముడా యాశ్రమమును జూచి చాల సంతోషించి-



**సుసంహృష్టః పరిష్వజ్య బాహుభ్యాం లక్ష్మణం తదా।**
**అతిస్నిగ్ధం చ గాఢం చ వచనం చేదమబ్రవీత్॥**

ప్రీతి పురస్సరముగ బార సాచి లక్ష్మణుని గాఢాలింగనము చేసికొని యిట్లనెను.

**ప్రీతోఽస్మి తే మహత్కర్మ త్వయా కృతమిదం ప్రభో।**
**ప్రదేయో యన్నిమిత్తం తే పరిష్వంగో మయా కృతః॥**

లక్ష్మణా! నీవు చేసిన మహత్కార్యమునకు నీయందత్యంత ప్రీతిగల వాడనైతిని. అందుకు పారితోషికముగ నిన్ను కౌగిలించుకొంటిని.

**భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ।**
**త్వయా పుత్రేణ ధర్మాత్మా న సంవృత్తః పితా మమ॥**

తమ్ముడా! నా యభిప్రాయ మెరిగి నాకు చేయవలసిన ఏర్పాటులన్నియు చేసి ధర్మము చక్కగ నెరిగి పున్నామ నరకమునుండి తండ్రిని తప్పించు పుత్రుడవగు నీ వుండుటం జేసి ధర్మాత్ముడగు నా తండ్రి మరణించలేదు. జీవించియున్నాడనియే తలంచెదను. (ఇచ్చట లక్ష్మణుడు రాజకుమారుడే యైనను గృహ నిర్మాణక్రమము నెరిగి అత్యల్పకాలమున అన్నిపనులకుతగు వసతులుగల రమణీయమగు పర్ణశాల నిర్మించుట యాతని గృహ నిర్మాణ చాతుర్యమును చాటుచున్నది. 'భావజ్ఞేన' అనుటచే రాముని నోటితో పలుకని యనేక విషయములను ఋషులతో సంభాషించుటకు, అగ్ని కార్యములు చేయుటకు, దేవ పూజలు గావించుటకు, ధనుర్బాణతూణీరముల నుంచుటకు వసతులే గాక సీతారాము లేకాంతమున నుండుటకు దగిన యేర్పాటులు కూడ చేసి యుండెనని తెలియనగును. 'కృతజ్ఞేన' లేక లేక

దశరథునకు బుట్టినవాడగుటచే 'రాజాత' ని గ్రహ బలముల కనుగుణముగ నెట్టి గృహము నాదరముతో నిర్మింపజేసెనో యట్టి విషయముల స్మరించి చేసినవాడును, 'ధర్మజ్ఞేన' తనకు స్వామి యగుట నెరిగి రామచంద్రున కెట్లు సుఖము గూర్చునో యట్టి విధమున నిర్మించినవాడును, 'త్వయా పుత్రేణ' నా కభిమతము నొడగూర్పలేనందున దుఃఖించు తండ్రి యభిమతము ననుసరించి యతని వలన నాకు గలుగదగిన సౌఖ్యముల నొడ గూర్చువాడును. 'ధర్మాత్మా' నాకెల్ల విధముల సుఖములందిచ్చి తన వెనుక నట్టి సుఖములు నా కొనగూర్ప నిన్ను నిలిపి ధర్మాత్ము డయ్యెను. 'మమ పితా' (రామునకే తండ్రియా! లక్ష్మణునకుగాదా యను భావముగాదు.) నా సుఖములనే చేయుచుండినవాడు. నా క్షేమంకరుడు. 'న సంవృత్తః' మృతుడుగాడు అనగా నతనిచే నే ననుభవింప దగిన సుఖము లన్నియు నీ వలన ననుభవించుచున్నాను గనుక నీవే తండ్రిస్థానములో నున్నావని భావము. 'అహం సర్వం కరిష్యామి' అనిన నీ సంకల్పము నెరవేరుచున్నది. ఇందు రామచంద్రునకు లక్ష్మణుని యందలి యనుగ్రహ మెట్టిదో వెల్లడి యగుచున్నది.)

# భరతుని రామభక్తి

సీతారామలక్ష్మణులు పంచవటియందుండ హేమంతఋతువువచ్చెను. ఒకనాడు వేకువజామున వారు గోదావరిలో స్నానము చేయ నేగుచుండగా లక్ష్మణుడు ఋతువర్ణనముచేయుచు రామచంద్రునితో నిట్లనెను.

**అస్మింస్తు పురుషవ్యాఘ్రః కాలే దుఃఖసమన్వితః।**
**తపశ్చరతి ధర్మాత్మా త్వద్భక్త్యా భరతః పురే॥**

అన్నా! ఇట్టి అతిశీతలమగు కాలమున నీ యెడబాటుచే కంది కుందుచున్న ధర్మస్వభావుడగు పురుషశ్రేష్ఠుడు భరతుడు నీయందలి భక్త్యతిశయముచే అయోధ్యలో తపస్సు చేయుచున్నాడు.

**త్యక్త్వా రాజ్యం చ మానం చ భోగాంశ్చ వివిధాన్ బహూన్।**
**తపస్వీ నియతాహారః శేతే శీతే మహీతలే॥**

అతడు చేతికందిన రాజ్యమును, తాను రాజను నభిమానమును వదలి రకరకములగు సకలసుఖములను వీడి జటాపల్కలములు దాల్చి ఋషియై కఠినమగు ఆహారనియమముల పాటించుచు మంచముగాని మెత్తని పరుపులుగాని లేక ఆరుబయల నేలమీద పరుండుచు ని న్ననవరతము ధ్యానించుచున్నాడు.

**సోఽపి వేళామిమాం నూనమభిషేకార్థముద్యతః।**
**వృతః ప్రకృతిభిర్నిత్యం ప్రయాతి నరయూనదీమ్॥**

ప్రతిదిన మత డీవేళకే లేచి ఆప్తజనుల గూడి స్నానమునకై సరయూనది కేగుననుట నిశ్చయము.

**అత్యంతసుఖసంవృద్ధ స్సుకుమారస్సుఖోచితః।**
**కథం న్వపరరాత్రేషు నరయూమవగాహతే॥**

అతడు తండ్రిచేతను నీచేత అత్యంత ముపలాలితు డగుటచే మిక్కిలి గోముగ పెరిగినవాడు. సుకుమారుడు, సుఖమునకే తగినవాడు. అట్టివాడీ చలిలో నెట్లు సరయూనదిలో మునుగునో!

**పద్మపత్రేక్షణో వీర శ్యామో నిరుదరో మహాన్।**
**ధర్మజ్ఞస్సత్యవాదీ చ హ్రీనిషేధో జితేంద్రియః॥**

భరతుడు తామరరేకులవంటి విశాలములు అందము లగు కన్నులు గలవాడు, ఎట్టి శత్రువునైనను జయింపగల వీరశిఖామణి, చామనిచాయ గలవాడు. సన్నని నడుము గలవాడు. గొప్ప బుద్ధి గలవాడు, ధర్మముల చక్కగ నెరిగినవాడు, నిత్యసత్యవ్రతుడు, నిషిద్ధకార్యములయందు లజ్జగలవాడు, పరస్త్రీలను కన్నెత్తియైన చూడని యింద్రియజయము గలవాడు.

**ప్రియాభిభాషీ మధురో దీర్ఘబాహురరిందమః।**
**సంత్యజ్య వివిధాన్ భోగానార్యం సర్వాత్మనా శ్రితః॥**

అతడు ప్రియముగను మృదువుగను మధురముగను మాటలాడువాడు, పొడవైన భుజములు గలవాడు, శత్రుపీడ నడంచువాడు, సకల సుఖముల వదలి పూజ్యుడవగు నిన్నే సర్వవిధముల ననుసరించువాడు.

**జితస్స్వర్గ స్తవ భ్రాత్రా భరతేన మహాత్మనా।**
**వనస్థమపి తాపస్యే యస్త్వామనువిధీయతే॥**

నీ తమ్ముడు భరతుడు మహాత్ము డగుటచే వనములో నున్నను తపోవృత్తిలో నిన్నే యనుసరించి తత్ఫలితముగ స్వర్గము జయించినవా డయ్యె.

(లక్ష్మణుడు, చిత్రకూటమున భరతుడు సైన్యసమేతుడై వచ్చినపుడాతడు రామచంద్రున కెగ్గుచేయ నెంచి వచ్చినాడని భావించి యుద్రేకమున భరతుని



దూషించి చంపెదనని చెప్పినాడు. శాంత వాతావరణమున మనశ్శాంతితో నున్న లక్ష్మణుడు హేమంతఋతువున వేకువజామున రామచంద్రునితో నతని ప్రీతికొరకు (భగవత్ప్రీత్యర్థం) భరతుని గుణగణముల నిజస్థితిని చెప్పుచున్నాడు. భరతునివైరాగ్యమును, జితేంద్రియత్వమును, ధర్మస్వభావమును, సత్యసంధత్వమును పురుషోత్తముడగురామచంద్రునే సర్వవిధముల ననుసరించుచున్నాడనుటను, ఆతడు మహాత్ముడనుటను లక్ష్మణుని నోటిగుండ వినుట భరతుని చక్కగ నరయుటయగును. లక్ష్మణుడు తనకు రామవిరహతాపము లేనందున హేమంతఋతువు చలి యిట్టిదని కనుగొనెను. భరతుని తనవలె ననుకొనెను. భరతుని రామవిరహతాప మతనిని దహించుచుండెను. 'ఉపతప్తోదకానద్యః' రామవిరహతాపముచే నదులయందు నీళ్ళుకూడ క్రాగినవయ్యెను. అందుచే భరతునకు సరయూనదిలో మునుగుట వలన 'శైత్యబాధ' యనునది పొసగదు.)

'జితస్స్వర్గస్తవభ్రాత్రా భరతేన మహాత్మనా' అను నపుడు మహాత్ముడగు నీ తమ్ముడు భరతుడు స్వర్గప్రాప్తి తప్పక పొందుననుట సామాన్య విషయము. ఇనుపసంకెళ్లట్టివో బంగారుసంకెళ్లట్టివే. రెండును బంధకములే. పుణ్యపాపములు రెండును మోక్షవిరోధులే. స్వర్గసుఖము మోక్షము గానేరదు. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' స్వర్గసుఖము పరిమితి గలది, సంపాదించిన పుణ్యమెంతో అంతే స్వర్గసుఖము. ఆ పుణ్యము సమాప్తికాగా భూలోకమునకు రావలసినదే. 'యద్గత్వా ననివర్తంతే తద్ధామ పరమం మమ' అని యే చోటు చేరిన మరల జన్మ మెత్త నక్కరలేదో యా చోటే మోక్షము. అదియే పరమపదము. అట్టి నిరతిశయానందమే మోక్షము. కనుక రామచంద్రా! భరతుడు సదా నీతోనుండి యానంద మనుభవించు మోక్షమున కర్హుడు. కేవల మల్పకాలసుఖమునిచ్చు స్వర్గము నత దతిక్రమించిన మహాత్ముడనెను.

**న పిత్ర్యమనువర్తంతే మాతృకం ద్విపదా ఇతి।**
**ఖ్యాతో లోకప్రవాదోఽయం భరతేనాన్యథా కృతః॥**

లోకమున 'ధన్యా పితృముఖీ కన్యా. ధన్యో మాతృముఖస్సుతః' అని తండ్రిని బోలిన కూతురు, తల్లినిబోలిన కొడుకు ధన్యులని చెప్పుట వాడుక. పురుషులు తల్లిస్వభావము ననుసరింతురేగాని తండ్రి స్వభావము ననుసరింప రను న్యాయము భరతుని విషయమున వ్యతిరిక్తమైనది.

**భర్తా దశరథో యస్యా స్సాధుశ్చ భరతస్సుతః।**
**కథంను సాఽంబా కైకేయీ తాదృశీ క్రూరశీలినీ॥**

ఎవతెకు భర్త దశరథుడో, ఎవతెకు భరతుడు కుమారుడో అట్టి కైకేయి కిట్టి క్రూరస్వభావ మెట్లు గలిగెను? అనినంతనె రామచంద్రు డామెను దూషించుట కోర్వక యిట్లనెను.

**న తేఽంబా మధ్యమా తాత గర్హితవ్యా కథంచన।**
**తామేవేక్ష్వాకునాథస్య భరతస్య కథాం కురు॥**

నాయనా! మన నడిమితల్లియగు కైకేయీదేవిని నిందింపకుము. ఇక్ష్వాకునాథుడగు భరతుని విషయమునే చెప్పుము.

**నిశ్చితాఽపి హి మే బుద్ధిర్వనవాసే దృఢవ్రతా।**
**భరతస్నేహసంతప్తా బాలిశీక్రియతే పునః॥**

**సంస్మరామ్యస్య వాక్యాని ప్రియాణి మధురాణి చ।**
**హృద్యాన్యమృతకల్పాని మనఃప్రహ్లాదనాని చ॥**

**కదా న్వహం సమేష్యామి భరతేన మహాత్మనా।**
**శత్రుఘ్నేన చ వీరేణ త్వయా చ రఘునందన॥**



వనవాసమున దృఢవ్రతుడ నైనను భరతునియందలి ప్రీత్యతిశయముచే పామరులకువలె నాకును దుఃఖము కలుగుచున్నది. అతని ప్రియముగను మధురముగను మనోరంజకముగను సంతోషదాయకముగను అమృతమువంటివిగను నుండు మాటలను మాటిమాటికి స్మరించెదను. రాఘవా! మహాత్ముడగు భరతునితోను శత్రుఘ్నునితోను నీతోను సీతతోను గూడి సంతోషముతోనుండు టెన్నడో యని చింతించుచు గోదావరినదికి స్నానమునకు బోయెను.

(ఇందువలన భరతునియందెట్టి గౌరవభావము, ప్రేమ రామునకుగలదో నలుగురు భ్రాతలును కలసి యుండుటయం దతనికి గల మక్కువ యెట్టిదో వ్యక్తమగుచున్నది. లక్ష్మణు డెంత ప్రాణసముడుగనున్నను తల్లిదండ్రులను సోదరులను దూషించిన సైపక వెంటనే సవరించుస్వభావము గలవాడు రామచంద్రు డనియు, లక్ష్మణునకును భరతునియందు గౌరవము పూర్ణముగ నున్న దనియు తెలియుచున్నది.)

## సీత లక్ష్మణుని దూషించుట

రావణుని ప్రేరణమున మారీచుడు మాయామృగరూపము దాల్చి రామాశ్రమసమీపమున సీతాదేవి పూలు గోయుచుండ ఆమె మనసు నాకర్షించువిధమున అనేకవిధముల నాడుచు, పరుగిడుచు, పచ్చిక మేయుచు సంచరింప ఆమె సంతోషముతో రామలక్ష్మణులను రమ్మని పిలచెను. వారును వేగముగ వచ్చి యా వింతమృగమును జూచిరి.

**తమేవైనమహం మన్యే మారీచం రాక్షసం మృగమ్।**
**చరంతో మృగయాం హృష్టాః పాపేనోపాధినా వనే॥**
**అనేన నిహతా రాజన్ రాజానః కామరూపిణా॥**

**అస్య మాయావిదో మాయామృగరూపమిదం కృతమ్।**
**భానుమత్పురుషవ్యాఘ్ర గంధర్వపురసన్నిభమ్॥**

**మృగో హ్యేవంవిధో రత్నవిచిత్రో నాస్తి రాఘవ।**
**జగత్యాం జగతీనాథ మాయైషా హి న సంశయః॥**

"రాఘవా! తాటకాపుత్రుడగు మారీచుడను రాక్షసుడే మృగరూపమున వచ్చినాడని తలచెదను. కామరూపియగు ఆ రాక్షసాధముడు సంతోషముతో వేటకైవచ్చిన రాజులను చంపినాడు. అతడు మాయావి. అతని మాయయే యిట్టికాంతులనీను మృగరూపము పొందినది. పురుషతిలకా! ఈ మృగరూపము గంధర్వనగరమువలె తోచునే కాని నిజమైనదికాదు. జగన్నాథా! లోకమున నెచ్చట నిట్టి రత్నములతో ప్రకాశించు మృగము కానరాదు. కావున నిది మాయయే. ఇందెంతమాత్రము సంశయము లేదు." ఇంతలో సీతాదేవి భర్తను జూచి ఆర్యపుత్రా!

**అహో రూపమహో లక్ష్మీస్స్వరసంపచ్చ శోభనా।**
**మృగోఽద్భుతో విచిత్రాంగో హృదయం హరతీవ మే॥**



ఆహా! ఎట్టిరూపము! ఎట్టికాంతి! ఎట్టి కంఠస్వరము! దీని అవయవముల సొగసెట్టిది? విచిత్రములగు అంగములుగల యీ జింక నా మనసు నాకర్షించుచున్నది. మన వనవాసకాలము గడచినంతనే మనము మన రాజ్యమునకు మరలిపోయినపు డిది మన యంతఃపురమున కలంకారమగును.

**భరతస్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో।**
**మృగరూపమిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి॥**

అప్పు డిది యయోధ్యలో భరతునకును, నా యత్తలకును, నీకును, నాకును మిక్కిలి యాశ్చర్యము గలిగించును. ఇది జీవించియుండునట్లే పట్టువడిన నా కాడుకొనుట కుపయోగించును. లేనిచో దీని యందమైన మృదువైన చర్మము నీతో నేను కూర్చుండుట కుపయోగించును. రాముడును సీతాదేవిమాటలు విని లక్ష్మణునితో నిట్లనెను.

**న వనే నందనోద్దేశే న చైత్రరథసంశ్రయే।**
**కుతః పృథివ్యాం సౌమిత్రే యోఽస్య కశ్చిత్సమో మృగః॥**

దేవేంద్రుని నందనవనమునగాని, కుబేరుని చైత్రరథమను రమణీయోద్యానవనమునగాని, మరి ప్రపంచములో నెచ్చటగాని దీనికి సమానమగు జింక కానరాదు. సీతయొక్క మనసు దీనియందే యున్నది.

**అప్రమత్తేన తే భావ్య మాశ్రమస్థేన సీతయా।**
**యావత్పృషత మేకేన సాయకేన నిహన్మ్యహమ్॥**
**హత్వైతచ్చర్మ చాదాయ శీఘ్రమేష్యామి లక్ష్మణ॥**

లక్ష్మణా! నే నొక్కబాణమున దీనిని జంపి దీని చర్మమును దెచ్చెదను. నీ వంతవరకు సీతకొర కాశ్రమముననే యుండి ఎంతమాత్ర మేమరక సీతను గాచి యుండుము. నేను జింకచర్మమును దీసికొని శీఘ్రముగ వత్తును.

రాము డా మృగమును వెంబడించి దానినిబట్ట నసాధ్యమని బాణముతో గొట్టి దానిని చంపునపుడది తాటిచెట్టంత యెత్తున కెగిరి నేల గూలునపుడు తన రాక్షసమాయచే రామునికంఠధ్వని ననుసరించి 'హా సీతా! హా లక్ష్మణా!. యని యరచి ప్రాణము వదలెను. "లక్ష్మణుని మాట నిజమే. ఇప్పుడే సీతా లక్ష్మణులేమి భయపడుదురో' యని రాముడు మరలిరా దొడగెను.

ఇంతలో సీతాదేవి లక్ష్మణునితో నిట్లు చెప్పెను.

**న హి మే హృదయం స్థానే జీవితం వావతిష్ఠతి।**
**క్రోశతః పరమార్తస్య శ్రుతశ్శబ్దో మయా భృశమ్॥**
**ఆక్రందమానం తు వనే భ్రాతరం త్రాతుమర్హసి।**
**తం క్షిప్రమభిధావ త్వం భ్రాతరం శరణైషిణమ్।**
**రక్షసాం వశమాపన్నం సింహానామివ గోవృషమ్॥**

మిక్కిలి యాపదలో నున్న మీ యన్నయొక్క గొప్ప యరపుశబ్దము వింటివి. నామనసు చెదరిపోవుచున్నది. నా ప్రాణములు నిలువవు, అడవిలో దిక్కులేక యాక్రందించుచున్న మీ యన్నను గాపాడుము. సింహముల సమూహములో జిక్కిన వృషభము వలె రక్షకులు లేక సాయ మపేక్షించుచున్న నీ యన్నయొద్దకు శీఘ్రముగ పరుగిడుము. ఇట్లామె యెంత చెప్పినను సోదరుని యాజ్ఞయని కదలకుండు లక్ష్మణుని జూచి సీత,

**సౌమిత్రే మిత్రరూపేణ భ్రాతుస్త్వమసి శత్రువత్।**
**యస్త్వమస్యామవస్థాయాం భ్రాతరం నాభిపత్స్యసే॥**
**ఇచ్ఛసి త్వం వినశ్యంతం రామం లక్ష్మణ మత్కృతే।**
**లోభాన్ మమ కృతే నూనం నానుగచ్ఛసి రాఘవమ్॥**
**వ్యసనం తే ప్రియం మన్యే స్నేహో భ్రాతరి నాస్తి తే।**
**తేన తిష్ఠసి విస్రబ్ధ స్తమపశ్యన్ మహాద్యుతిమ్॥**



**కిం హి సంశయమాపన్నే తస్మిన్నిహ మయా భవేత్।**
**కర్తవ్యమిహ తిష్ఠంత్యా యత్ప్రధానస్త్వమాగతః॥**

"లక్ష్మణా! ఇట్టి దురవస్థలో నున్న యన్నను గాపాడ పోవకున్నావే. ఇందువలన నీవు పైకిమాత్రము మైత్రిపాటించుచున్న శత్రువే యనవలెను. నీవు నాయం దాశచే రాముడు నశింపవలెనని గోరెదవు. నాయందలి దురాశచేతను నీవు రామునిదుఃస్థితి యెట్టిదో కనుగొన బోవకున్నావనుట నిజము. ఇప్పు డతనికి సంభవించిన యాపద నీకు ప్రియమనియు, అతనియందు నీ కెంతమాత్రము స్నేహభావముగాని, సోదరభావముగాని లేదని నాకు తెలియుచున్నది. ఆ కారణమున నీ వా తేజోనిధి కెట్టి యాపద కలిగినను పోయి చూడకున్నావు. అతని ప్రాణమునకే హానికలిగినదేమో యని శంకింపవలసిన స్థితిలో నీ విచ్చటనుండి నన్ను కాపాడుటేమి? నీ వదవి కతనితో వచ్చినకారణమేమి? అతనిని సంరక్షింపవలెనని గదా! అట్టి ధర్మము నీవు పాటించుచున్నావా?

(ఇచ్చట సుమిత్రాదేవి వనవాసప్రయాణ సమయమున లక్ష్మణునితో చెప్పిన వాక్యముల స్మరింపవలెను. 'రామే ప్రమాదం మాకార్షీః' రామున కెట్టి యాపదయైన సంభవింపకుండ చూచుకొమ్ము. రామం దశరథం విద్ధి--జనకాత్మజాం మాం విద్ధి' అనెనే. తండ్రివంటి రామునేల రక్షింపవు? మీ తల్లి స్థానమున నన్ను దలతువేని నా యాజ్ఞ నేల పాటింపవు? ప్రాణాపాయ సమయమున నాతని రక్షింపనివాడు మిత్రుడా? సోదరుడా? నీ పయోముఖవిషకుంభత్వ మిప్పుడు బయటపడినది' అని సీతాదేవిచెప్పినట్లు భావింపవచ్చును.) ఇట్లు చెప్పి కన్నీరు గార్చుచున్న సీతాదేవితో లక్ష్మణుడు.

**దేవి దేవమనుష్యేషు గంధర్వేషు పతత్రిషు।**
**రాక్షసేషు పిశాచేషు కిన్నరేషు మృగేషు చ॥**

**దానవేషు చ ఘోరేషు న స విద్యేత శోభనే।**
**యో రామం ప్రతియుధ్యేత సమరే వాసవోపమ్॥**
**హృదయం నిర్వృతం తేఽస్తు సంతాపస్త్యజ్యతామయమ్।**
**ఆగమిష్యతి తే భర్తా శీఘ్రం హత్వా మృగోత్తమమ్॥**

'తల్లీ! వజ్రాయుధుడగు దేవేంద్రున కుద్దియగు రామునితో యుద్ధము చేసి గెలువగలవాడు మానవులలోగాని గంధర్వులలోగాని పక్షులలోగాని రాక్షసులలోగాని పిశాచములలోగాని కిన్నరులలోగాని మృగములలోగాని దానవులలోగాని లేరని దృఢముగ నమ్ముము. మా యన్న వింతమృగమును జంపి శీఘ్రముగనే వచ్చును.'

**కృతవైరాశ్చ వైదేహి వయమేతైర్నిశాచరైః।**
**ఖరస్య నిధనాదేవ జనస్థానవధం ప్రతి॥**

'వైదేహీ! జనస్థానమున రామచంద్రుడు ఖరుని వధించినప్పటినుండి రాక్షసులు మనపై వైరము పూని మన కెగ్గుసేయ దలచి మనల వేఱుచేయుట కెన్నియో మోసములు పన్నుచున్నారు. మా యన్న గొంతవలె నీవు వినిన యార్తధ్వనియు రాక్షసమోసమే యని యెరుంగు' మనియె.

సత్యవాదియగు లక్ష్మణు డట్లుచెప్పగా కోపావేశమున సీత మిక్కిలి కఠినముగ నిట్లు పలికెను.

**అనార్యాకరుణారంభ నృశంస కులపాంసన ॥**

**అహం తవ ప్రియం మన్యే రామస్య వ్యసనం మహత్ ।**
**రామస్య వ్యసనం దృష్ట్వా తేనైతాని ప్రభాషసే ॥**

**నైతచ్చిత్రం సపత్నేషు పాపం లక్ష్మణ యద్భవేత్ ।**
**త్వద్విధేషు నృశంసేషు నిత్యం ప్రచ్ఛన్నచారిషు ॥**



**సుదుష్ట స్త్వం వనే రామ మేకమేకోఽనుగచ్ఛసి ।**
**మమ హేతోః ప్రతిచ్ఛన్నః ప్రయుక్తో భరతేన వా ॥**

**తన్న సిధ్యతి సౌమిత్రే తవ వా భరతస్య వా ।**
**కథమిందీవరశ్యామం పద్మపత్రనిభేక్షణమ్ ॥**

**ఉపసంశ్రిత్య భర్తారం కామయేయం పృథగ్జనమ్ ।**
**సమక్షం తవ సౌమిత్రే ప్రాణాంస్త్యక్ష్యే న సంశయః ।**
**రామం వినా క్షణమపి న హి జీవామి భూతలే ॥**

నీ వార్యజాతియందు పుట్ట నర్హుడ వెంతమాత్రముకాదు. వారి కుండ వలసిన దయ నీయందున్నదా? అందుకు విరుద్ధమగు క్రూరత్వమున్నది. గొప్పకులమున కపకీర్తి దెచ్చితివి. రామునకట్టి గొప్ప విపత్తు సంభవించుట నీ కిష్ట మనియె తలచెదను. అతనికిట్టి వ్యసనము గలుగుటను జూచియు సహాయము చేయక ఇట్టిమాట లాడుదువా? దాయాదుల కిట్టి చెడుతలంపుండుట చిత్రము గాదు. పైకి మిత్రభావము జూపి కపటబుద్ధితో మెలగు నీవంటివారి కిది సహజమే. నీవు మిక్కిలి దుష్టుడవు. నీవు స్వయముగనో భరతుని ప్రేరణముననో నాయందు దురభిప్రాయముతో నందఱను వీడి యేకాంతమున రాము నొక్కని వెంబడించి వనమునకు వచ్చితివి. ఇందు నీ కోరిక గాని భరతుని కోరికగాని నెఱవేరదు. నీలమేఘశ్యాముడును, తామరరేకులవంటి కన్నులు గల వాడు నగు రామచంద్రుని భర్తగా పొంది యితరపురుషులనెట్లు కామింతును? ఇప్పుడే నీ యెదుట నా ప్రాణము విడిచెదను. రాముడు లేక యొక్క క్షణ కాలమునైన నీ లోకమున జీవించియుండను.

గగుర్పాటు పుట్టించు కఠినోక్తులను వినియు జితేంద్రియుడగు లక్ష్మణుడు కదలక అంజలిబద్ధుడై సీతాదేవితో నిట్లనెను.

**ఉత్తరం నోత్సహే వక్తుం దైవతం భవతీ మమ ।**
**వాక్య మప్రతిరూపం తు న చిత్రం స్త్రీషు మైథిలి ।**
**స్వభావస్త్వేష నారీణా మేవం లోకేషు దృశ్యతే ॥**

**విముక్తధర్మాశ్చపలా స్తీక్ష్ణాభేదకరా స్త్రియః ।**
**న సహే హీదృశం వాక్యం వైదేహి జనకాత్మజే ॥**

**శ్రోత్రయోరుభయోర్మే౽ద్య తప్తనారాచసన్నిభమ్ ।**
**ఉపశృణ్వంతు మే సర్వే సాక్షిభూతా వనేచరాః ॥**

**న్యాయవాదీ యథాన్యాయ ముక్తో౽హం పరుషం త్వయా ।**
**ధిక్త్వామద్య ప్రణశ్య త్వం యన్మామేవం విశంకసే ॥**

**స్త్రీత్వం దుష్టం స్వభావేన గురువాక్యే వ్యవస్థితమ్ ।**
**గమిష్యే యత్ర కాకుత్స్థ స్స్వస్తి తే౽స్తు వరాననే ॥**

**రక్షంతు త్వాం విశాలాక్షి సమగ్రా వనదేవతాః ।**
**నిమిత్తాని హి ఘోరాణి యాని ప్రాదుర్భవంతి మే ।**
**అపి త్వాం సహ రామేణ పశ్యేయం పునరాగతః ॥**

'నీకు నేను బదులు చెప్ప నిష్టపడను. నీవు నాపాలిట దేవతవు. మైథిలీ! ఇట్టి యనుచితపు మాటలాడుట స్త్రీలకు స్వభావమే. వారి యిష్టము చొప్పున వర్తింపని పురుషుల నిట్లు నిందించుట లోకమునం దంతట జూచినదే. స్త్రీలు ధర్మము వదలినవారు. బుద్ధినిలుకడ లేనివారు. ఎంతటి క్రూరకార్యమునకైన వెనుదీయరు. వారు దయాహీనలై భేదబుద్ధి గలిగించి యెట్టి స్నేహితుల కేని విరోధము పుట్టింతురు. వైదేహీ! నీవు సకలధర్మజ్ఞానవైరాగ్యనిధియగు జనకుని కూతురవే. నీ కిట్లాడుట తగునా? నీ మాటలు నా చెవులకు నిప్పున గాల్చిన నారసమువలె నున్నవి. ఈ



మాట నే నెంతమాత్రము సహింపజాలను. న్యాయము పలికిన న న్నెట్లన్యాయముగ నిందించితివో యీ వనచరదేవతలు సాక్షులై విందురు గాక. అన్నయాజ్ఞను పాటించు నన్ను శంకించు నీ విప్పుడే పాడైపొమ్ము. నే నిప్పుడే మాయన్నయొద్దకు బోయెదను. స్త్రీస్వభావమే దుష్టమైనది. నీకు శుభమగుగాక, నిన్నీ వనదేవతలు రక్షింతురు గాక. నాకు భయంకరసూచనలు గానవచ్చుచున్నవి. నేను రామునితో గూడి మరలివచ్చి నిన్ను చూతునోగదా. (చూడనేమో).

ఇట్టి యుక్తవచనములు పలికిన లక్ష్మణునితో కన్నీరు గార్చుచు సీత వినరానిమాట లిట్లనెను.

**గోదావరీం ప్రవేక్ష్యామి వినా రామేణ లక్ష్మణ ।**
**అబంధిష్యే౽థవా త్యక్ష్యే విషమే దేహమాత్మనః ॥**

**పిబామ్యహం విషం తీక్ష్ణం ప్రవేక్ష్యామి హుతాశనమ్ ।**
**న త్వహం రాఘువాదన్యం పదా౽పి పురుషం స్పృశే ॥**

"లక్ష్మణా! రాముడు లేనంతట నేను గోదావరినదిలో ప్రవేశింతును. లేదా ఉరిబోసికొనియెదను. ఒడుదొడుకైన యెత్తు నుండి పడియైనను ప్రాణము విడుతును. అటుగాకున్న విషముద్రాగి ప్రాణము వదలెదను. లేదా మండుచున్న యగ్నిలో నుఱికెదను గాని ప్రాణముతో నుండను. రాముని విడిచి అన్యపురుషుని పాదముతో నైనను స్పృశింపను".

**ఇతి లక్ష్మణ మాక్రుశ్య సీతా దుఃఖసమన్వితా ।**
**పాణిభ్యాం రుదతీ దుఃఖాదుదరం ప్రజఘాన హ ॥**

ఇట్లు లక్ష్మణుని నిందించి సీత దుఃఖమతిశయింప నేడ్చుచు చేతులతో కడుపుమీద గొట్టుకొనుచుండెను. లక్ష్మణు డెంత యోదార్చినను సీత బదులు చెప్పలేదు.

**తతస్తు సీతామభివాద్య లక్ష్మణః**
**కృతాంజలిః కించిదభిప్రణమ్య చ।**
**అన్వీక్షమాణో బహుశశ్చ మైథిలీం**
**జగామ రామస్య సమీపమాత్మవాన్ ॥**

అంత లక్ష్మణుడు సీత కభివాదన మొనర్చి యంజలి జోడించి నమస్కరించి యామె నొంటరిగా విడిచిపోవుటెట్లని మాటిమాటి కామెను జూచుచు రాముని సన్నిధానమునకు పోయి చేరెను.

(ఈ సీతాలక్ష్మణసంవాదము మిక్కిలి గుర్తింపదగినది. సింహావలోకనమున నేర్పడు విషయములెవ్వి? మాయామృగమును జూచినవెంటనే లక్ష్మణు డది మారీచుని మాయయని స్పష్టముగ జెప్పుట యతని దూరదృష్టిని విషయముల బరిష్కరించి గుట్టునరయు శక్తిని, తన స్వామి కేసమయమున దేనివలన నెట్టి కీడువచ్చునో యను జాగరూకతయు, బాహ్యాలంకారములకు మోసపోకుండు జితేంద్రియత్వమును చాటును. అట్లయినచో సీతాదేవి యభిప్రాయముతో నేకీభవించి యా మృగమువెంట బోయిన రామచంద్రుని వారింపరాదా యనిన ఆ మృగమును సీత కావలెనని పట్టిన పట్టును రామచంద్రు డడ్డుపెట్ట నిష్టపడలేదు. అది మారీచునికృతమే యైనను నా రాక్షసుని వధించుటయు ధర్మమని తనకు నితరులకు మేలని భావించుట యొకటి. ఎవరిచే నెట్టిమోసము గావింపబడినను తనకు గీడు రాదని, వచ్చినకష్టమును తొలగించుకొనుశక్తి తనకున్న దనుట రెండవకారణము. మారీచుని కంఠధ్వని విని భయపడిన సీతాదేవిమాటలు అన్న యాజ్ఞకంటె ముఖ్యమని లక్ష్మణుడు భావింపలేదు. జనస్థానమున పదునాల్గు వేల రాక్షసుల రాము డొక్కడే వధించుటను జూచిన సీతాదేవి మారీచుని విషయములో రామునకు ప్రాణహాని సంభవించునని యేల భయపడె ననవచ్చును. యుద్ధములో జయమెప్పు డొకపక్షమునకే గలుగుననుట యసంభము.



ప్రత్యక్షముగ నొక్కమారీచుడే వచ్చెనని తలచినను దూరమున మరల నితర రాక్షసులు వానికి సాయమొనర్ప రాముడు శత్రుమధ్యమున జిక్కి సహాయ మపేక్షించుచున్నాడేమో యనియు భావించియుండవచ్చును. స్త్రీకి చపలబుద్ధి కనుక నామె రాముని పరాక్రమము నప్పుడు సందేహించియు నుండవచ్చును. నిజముగ రామచంద్రునకు ప్రాణాపాయము గలిగెనని తలచినందున నట్టి సమయమున నతనిసహాయార్థము లక్ష్మణుడు పోలేదను చింత కోపముగ మారి యట్టి కఠినోక్తు లాడనిచ్చె ననవలయును. మానవభావమే ముఖ్యముగ పాటించిన సీతారాములు మానవులకట్టి పరిస్థితిలో మానసికముగ గలుగు బహుమార్పుల నిట్లు ప్రకటించి రనవచ్చును. ఆపదలో మానవుల వివేకము నశించి బుద్ధి పరిపరివిధముల బోవునని తెలియుచున్నది. ఎట్టి కలుష మెఱుగని నిర్మలాంతఃకరణుడగు లక్ష్మణునకిది యొక యగ్నిపరీక్ష యనవచ్చును. సీత కాపద రావచ్చునను భయముగల లక్ష్మణుడేల యచ్చోటు విడిచి పోవలెనందుమా? సీతపలికిన పలుకు లతని నచ్చట నుండనీయలేదు. స్త్రీలసాహస మెట్లయినను పరిణమించును. ఆమె చెప్పినట్లు ప్రాణత్యాగమే చేయునేమో యను భయముచే నత డాచోటు వదలి పోవలసివచ్చెను. అట్లు పోయినను గొంత దూరమున నొక పొదచాటున నుండరాదా యందుమా? రాముడు వచ్చి తన్నచ్చట జూచిన నేమనును? సీత తాను బంపిన లక్ష్మణు డచ్చటికి రాలేదా యని రామునడిగిన నతడు రాలేదనిన సీత తాను సందేహించినది నిజమే. ద్రోహపుతలంపుతో నుండు వాని నిక క్షణమైన నుంచుకొనరాదని రామునితో వాదించియుండును. ఇట్లేది చేసినను సీతారాములు తన్ను సందేహింప నవకాశ మేర్పడునని తలచి ఋజు మార్గము చొప్పున రామచంద్రుడున్న చోటికే పోయెను. సేవకత్వమున నున్న చిక్కు లిన్నివిధములని తెలియుచున్నది. నష్టకష్టము లున్నను ఋజుమార్గావలంబనమె శ్రేయస్కరమని లక్ష్మణునివృత్తాంతము తెలుపుచున్నది.)

## లక్ష్మణుడు రాముని శాంతింపజేయుట

రామలక్ష్మణులు పర్ణశాలలో సీతను గానక యామెను వెదకుచు బోవ రామచంద్రుడు దుఃఖసాగరమున మునిగి యున్మత్తునివలె చెట్లు చేమలను, మృగపక్షులను, నదీనదములను, ప్రస్రవణపర్వతమును జూచి, 'నాప్రియురాలగు సీతను జూచితిరా? ఆమె యెందున్నది? ఎవరామెనెత్తుకొని యే మార్గమున బోయిరి? ఆమె నే రాక్షసుడైన భక్షించుటను జూచితిరా యని పరిపరి విధముల నడుగుచు, బదులేమియు రానందున మిక్కిలి కోపించి లక్ష్మణునితో–

**సుఘోరహృదయైస్సౌమ్య రాక్షసైః కామరూపిభిః ।**
**హృతా మృతా వా సీతా సా భక్షితా వా తపస్వినీ ।**
**న ధర్మస్త్రాయతే సీతాం హ్రియమాణాం మహావనే ॥**

"సౌమ్యా! భయంకరాకారులును క్రూరులును కామరూపులు నగు రాక్షసు లామెను అపహరించిరో, చంపిరో, భక్షించిరో తెలియకున్నది. ఈ యరణ్యమున నామెను గొనిపోవుచుండగా నెవరైన నామెను గాపాడిరో? ఆపదలో ధర్మము గాపాడునందురే. అట్టి ధర్మమైన నామెను రక్షింపదయ్యెనే.

**కర్తారమపి లోకానాం శూరం కరుణవేదినమ్।**
**అజ్ఞానాదవమన్యేరన్ సర్వభూతాని లక్ష్మణ ॥**

**మృదుం లోకహితే యుక్తం దాంతం కరుణవేదినమ్ ।**
**నిర్వీర్య ఇతి మన్యంతే నూనం మాం త్రిదశేశ్వరాః ॥**

లక్ష్మణా! సకలలోకముల సృష్టించువాడైనను, శూరుడేయైనను, దయాగుణము గలవా డగుచో నట్టి వాని శక్తి సామర్థ్యముల నెఱుగక సకల ప్రాణు లతని నవమానించును. లోకక్షేమము గోరి మెత్తని స్వభావము గలిగి దయాపరుడనగు నన్ను దేవత లెల్లరు వీర్యములేనివానిగ తలచుచున్నారు. ఇది నిజము.



**మాం ప్రాప్య హి గుణో దోష స్సంవృత్తః పశ్య లక్ష్మణ।**
**అద్యైవ సర్వభూతానాం రక్షసామభవాయ చ ॥**

లక్ష్మణా! నిర్భాగ్యుడనగు నన్ను బొందినందున ఉత్తమంబగు దయాగుణము సైతము దోషముగ నెన్నబడుచున్నది. రాక్షసులకును వారి సంబంధము గల ప్రాణులకెల్లను వినాశము గలుగు నిమిత్తమే నాయందలి గుణము దోషమైనది.

**యథా జరా యథా మృత్యుర్యథా కాలో యథా విధిః ।**
**నిత్యం న ప్రతిహన్యంతే సర్వభూతేషు లక్ష్మణ ॥**

**తథా హం క్రోధసంయుక్తో న నివార్యోఽస్మి సర్వథా।**

**పురేవ మే చారుదతీ మనిందితాం దిశంతి సీతాం యది నాద్య మైథిలీమ్।**
**సదేవగంధర్వమనుష్యపన్నగం జగత్సశైలం పరివర్తయామ్యహమ్ ॥**

వింట సర్పమువంటి తీక్ష్ణబాణము సంధించి ప్రళయకాలరుద్రుని వలె రోషావేశంబున రామచంద్రు డిట్లనియె. 'లక్ష్మణా! లోకమున ప్రాణులెట్లు ముసలితనమును, చావును, కాలమును, అదృష్టమును వారింపజాలవో యట్లే కుపితుడ నగు నన్నెవ్వరు వారింప లేరు. ముందుండినట్లే అందము గులుకు పలువరుస గల సర్వాంగసుందరి యగు మిథిలాధిపతి కూతురగు సీతను నాకు దెచ్చి యియ్యకున్న దేవగంధర్వ మానవ నాగులతో గూడి పర్వతములతో వెలయు నీ ప్రపంచమును నాశన మొందింతును అనియె.

అంత లక్ష్మణుడు ముందెన్నడు రాముడిట్టి కోపము పూనినవాడుగాడే యని భయపడి నోరెండగా అంజలిబద్ధుడై అన్నతో నిట్లనెను.

**పురా భూత్వా మృదుర్దాంత స్సర్వభూతహితే రతః ।**
**న క్రోధవశమాపన్నః ప్రకృతిం హాతుమర్హసి ॥**

'అన్నా! నీవు సకల ప్రాణులను రక్షింప నెంచి వానిమేలుగోరు మిక్కిలి మృదుస్వభావుడవును, జితేంద్రియుడవును నగుదువే. నీ స్వభావమునే మార్చుకొని యిట్టి కోపము పూను టుచితమా?

**యుక్తదండా హి మృదవః ప్రశాంతా వసుధాధిపాః ।**
**సదా త్వం సర్వభూతానాం శరణ్యః పరమా గతిః ॥**

కరుణగలవారును, శాంతచిత్తులు నగు రాజులు అపరాధమునకు దగిన శిక్షను విధింతురు. నీ వెల్లప్పుడు సకలభూతములకు రక్షకుడగు వాడవు. నీవే పరమగతివి.

(ఈ శ్లోకము యొక్క ఉత్తరార్ధము తత్త్వ ముపదేశించుచున్నది. ఎట్టి యాపదవచ్చినను ఎట్టివారినిగాని ఎట్టిసమయమునను గాపాడగలవాడవు నీవే. నిన్ను శరణు జొచ్చి నిన్నే పొందుట యుత్తమపురుషార్థము. ఇట శ్రీరాముని సర్వశరణ్యత్వమును సర్వ ప్రాప్యత్వమును వెల్లడి యగుచున్నది.)

**శీలేన సామ్నా వినయేన సీతాం నయేన న ప్రాప్స్యసి చేన్నరేంద్ర ।**
**తతస్సముత్సాదయ హేమపుంఖైర్మహేంద్రవజ్రప్రతిమై శ్శరౌఘైః ॥**

రాజా! నీ సచ్చరిత్రము చేతను, సాధువాదముచేతను, వినయముచేతను, నయముచేతను నీవు సీతను బడయకుంటివేని బంగారుచే రంగారు తీక్ష్ణములైనమొనలు గల దేవేంద్రుని వజ్రాయుధమువంటి బాణపరంపరలచే నీవు తలచిన కార్యము చేయదగును.

ఇట్లెంత యోదార్చినను దుఃఖములో మునిగియున్న రామచంద్రుని జూచి యతని పాదద్వయమును బట్టుకొని,



**మహతా తపసా రామ మహతా చాపి కర్మణా ।**
**రాజ్ఞా దశరథేనాసి లబ్ధోఽమృతమివామరైః ॥**

**తవ చైవ గుణైర్బద్ధస్త్వద్వియోగాన్మహీపతిః ।**
**రాజా దేవత్వమాపన్నో భరతస్య యథా శ్రుతమ్ ॥**

"రామా! మన తండ్రి దశరథుడు పూర్వజన్మముననేగాక యీజన్మమునను గొప్ప తపస్సులు వ్రతములు అశ్వమేధములుచేసి దేవతలు గొప్ప పూనికతో అమృతము పొందినట్లు నిన్ను పొందెను. నీ కల్యాణగుణములచే బద్ధుడైన మహారాజు నీ వియోగము సహింపక మరణించెనని యెల్లరసమక్షమున భరతుడు చెప్పెనుగదా!

(శ్రీరాముని అమృతముతో బోల్చుట మిక్కిలి యొప్పియున్నది. అమృతమునకు దానివలన నేమి ప్రయోజనము? దాని గ్రోలు దేవతలకే లాభము, రామచంద్రా! అట్లు ప్రయోజనము నుద్దేశించి నీవవతరింపలేదు సాధువుల రక్షణార్థము నీ వవతరించితివి, అట్టి సర్వలోకశరణ్యుడవగు నీవు సకలలోకముల నాశముచేయు టెట్లుపొసగును? అమృతమననేమి? మరణము తప్పించునది; కలిగించునదికాదు. అట్లే నీవు రక్షించువాడవు. నీవు లోకనాశమెట్లు గావింపదగును? అమృతము దేవతల రక్షించి రాక్షసుల నాశమొందించి నట్లే నీవు దేవతలను, ఋషులను, నితరులను రక్షింప, రాక్షసనాశము గావింప నవతరించినవాడవగుట నిన్ను అమృతమునకు సాటిగ జెప్పుట సర్వసమంజసము, తండ్రి నిన్ను సత్యము, శాంతము, దయ, జితేంద్రియత్వము గలవానిగ నెంచి సంతోషించెనే. నీ విట్లు లోకోపద్రవము గలిగించిన నతని కుపద్రవము గలిగించినవాడవగుదువే. ఆలోచింపుము.

**యది దుఃఖమిదం ప్రాప్తం కాకుత్స్థ న సహిష్యసే ।**
**ప్రాకృతశ్చాల్పసత్త్వశ్చ ఇతరః కస్సహిష్యతి ॥**

**దుఃఖితో హి భవాన్ లోకాంస్తేజసా యది ధక్ష్యతే ।**
**ఆర్తాః ప్రజా నరవ్యాఘ్ర క్వ ను యాస్యంతి నిర్వృతిమ్ ॥**

మిక్కిలి యుత్తమమగు కాకుత్థ్సవంశమున బుట్టినయ ప్రాకృతుడ వగు నీవు నీకు సంప్రాప్తమైన దుఃఖమును సహింపజాలవేని యల్ప బలుడగు సామాన్యుడెట్లు సహించును? ఇట్లు దుఃఖితుడవైన నీవు నీ తేజస్సుతో లోకమును దహింతువేని పురుషోత్తమా! మిక్కిలి దుఃఖముపాలైన దీనులు నిన్ను విడిచి యెచ్చటికిబోయి యూరట జెందగలరు?

లోకమున నిట్లు సుఖదుఃఖములనుభవించుట సహజము, ఎట్లంటివేని,

**లోకస్వభావ ఏవైష యయాతిర్నహుషాత్మజః ।**
**గతశ్శక్రేణ సాలోక్యమనయస్తం తమస్పృశత్ ॥**

**మహర్షిర్యో వసిష్ఠస్తు యః పితుర్నః పురోహితః ।**
**అహ్నా పుత్రశతం జజ్ఞే తథైవాస్య పునర్హతమ్ ॥**

**యౌ ధర్మౌ జగతాం నేత్రౌ యత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**ఆదిత్యచంద్రౌ గ్రహణమభ్యుపేతౌ మహాబలౌ ॥**

నహుషుని కమారుడగు యయాతి అనేకపుణ్యకార్యములు చేసి స్వర్గము పొందెను. అతడు గర్వపడి స్థానభ్రష్టుడై మర్త్యలోకమునకు రావలసి వచ్చెను. మన తండ్రికి పురోహితుడగు వసిష్ఠమహర్షి యొక్క నూర్గురుపుత్రు లొక్కనాడే విశ్వామిత్రునిచే మరణించిరి. ఎవరు వస్తువుల స్వరూపములు తెలియునట్లు చేయుటవలన లోకమునకు కన్నులని చెప్పబడుదురో, ఎవరి యందు జగము నెలకొనియున్నదో యట్టి గొప్ప బలవంతులగు చంద్ర సూర్యులకు సైతము గ్రహణబాధ తప్పినది కాదు. ఇంద్రాది దేవతలయందును నయానయముల ననుసరించి వచ్చు సుఖదుఃఖములుండుట సహజము. కావున నీవిప్పు డిందుకు చింతింపందగవు.



**అదృష్టగుణదోషాణా మధృతానాం చ కర్మణామ్ ।**
**నాంతరేణ క్రియాం తేషాం ఫలమిష్టం ప్రవర్తతే ॥**

మనము పూర్వము చేసిన కర్మము లిట్టివని, వాని వలన గలుగు ఫలము లివియని కన్నులారా జూచి తెలిసికొనలేము. వానివలన మనమిప్పు డనుభవించు సుఖదుఃఖముల జూచి యిట్టి ఫలములిచ్చునట్టి కర్మములే చేసియుంటిమని యూహింపవలెను.

**బుద్ధిశ్చ తే మహాప్రాజ్ఞ దేవైరపి దురన్వయా ।**
**శోకేనాభిప్రసుప్తం తే జ్ఞానం సంబోధయామ్యహమ్ ॥**

బృహస్పతివంటివాడును నీకు బోధింపగలడా? నీ బుద్ధి దేవతల కైన నూహింప సాధ్యమా? నీవే యిట్టి విషయములు మున్ను నాకు బోధించి యున్నావు. ఇప్పుడు దుఃఖముచే నీ బుద్ధి నివురుగప్పిన నిప్పువలె నుండుటచే నే నిప్పు డీ విషయము నీ జ్ఞప్తికి దెచ్చుచున్నాను గాని వేరుకాదు.

**కిం తే సర్వవినాశేన కృతేన పురుషర్షభ ।**
**తమేవ త్వం రిపుం పాపం విజ్ఞాయోద్ధరుమర్హసి ॥**

సర్వవినాశము చేసి నీ కేమి కావలసియున్నది? ఏ కలుషాత్ముడు నీ కిట్టి కష్టము గలిగించెనో వాని దెలిసికొని వానినే నాశము చేయుము' అనెను.

(ఇచ్చట నొక సందేహము రావచ్చును. కనిష్ఠుడు జ్యేష్ఠున కుపదేశము చేయదగునా యనుట. సామాన్యధర్మ మనుసరించి సామాన్యవిషయమున నట్లు చేయం దగదనుట నిశ్చయము, సర్వభూతనాశమేర్పడు నట్టిస్థితిలో కోపము పూనియున్న వాని వివేకము సైతము అడుగంటియుండునపుడు కనిష్ఠుడైనను వినయముతో నప్పటి కర్తవ్యమిద్దియని యుక్తియుక్తముగ జెప్పి

యొప్పించి ఆవదబోగొట్టుట ధర్మమే. హనుమంతుని చంపునట్లు రావణు డాజ్ఞాపించి నపుడు విభీషణుడు దూతను జంపుట లోకవిరుద్ధమని రాజధర్మభంగమునకు గారణమని యంగవిహీనమో ముండనమో యవమానించుటయో చేయదగును గాని వధింపరాదని రావణనకు ఉదేశించుట ధర్మమే. "ప్రమాదో ధీమతా మపి" యని గొప్ప బుద్ధిమంతు లును కొన్ని వేళల పొరపాటు చేయుట సంభవమే, అట్టి సమయమున సమయస్ఫూర్తితో బుద్ధిమంతులగు కనిష్ఠులైనను విపత్తును దప్పింపవలెనని యిందువలన దెలియుచున్నది. 'యుక్తియుక్తం వచో గ్రాహ్యం బాలాదపి సుభాషితమ్" సహేతుకముగ నుండు మాటలు పిన్నవానినోట వచ్చినను గ్రహింపదగునను నీతివాక్యము నిచ్చుట స్మరింపదగును.)

కబంధునిచే జిక్కినపుడు రాముని జూచి లక్ష్మణుడు-

**మయైకేన వినిర్ముక్తః పరిముంచస్వ రాఘవ ।**
**మాం హి భూతబలిం దత్త్వా పలాయస్వ యథాసుఖమ్ ॥**

**అధిగంతాஉసి వైదేహీ మచిరేణేతి మే మతిః ।**
**ప్రతిలభ్య చ కాకుత్స్థ పితృపైతామహీం మహీమ్ ॥**

**తత్ర మాం రామరాజ్యస్థః స్మర్తుమర్హసి సర్వదా ।**

అన్నా! ఈ రాక్షసునకు నన్ను బలి యిచ్చి నీ వైనను సుఖముగా దప్పించుకొని దూరముగ పరుగెత్తిపొమ్ము. నీ వొక్కడవైనను తప్పించు కొనిన మేలు గదా! నీ వతిశీఘ్రకాలముననే సీతాదేవిని పొందగలవని నాకు దోచుచున్నది. నీవు మన పూర్వులరాజ్యమును బొంది సకలసుఖముల ననుభవించుచు న న్నెల్లప్పుడు తలచుచుండుము' అనెను.

ఇందు లక్ష్మణుని యద్వితీయగు త్యాగబుద్ధియు, రాముని క్షేమమే తనకు ఫలమని, యతని సంతోషమే తాను కోరవలసినదని, అందుకు తన



ప్రాణ మర్పించుటకంటే వేరొండు సేవ లేదని, తన్నాతడు మనసున స్మరించిన చాలునని, యుత్తమనేవాధర్మమును పాటించుట స్పష్టమగు చున్నది.

కబంధుడు చెప్పిన మార్గమున ఋశ్యమూక పర్వత ప్రాంతమున రామలక్ష్మణులు పోవుచుండ సుగ్రీవుడు పంపగా హనుమంతుడు' సన్న్యాసిరూపముతో రామలక్ష్మణుల జూచి వారితో మాట్లాడిన వైఖరినిబట్టి రామచంద్రు డా హనుమంతుడు గొప్ప విద్వాంసుడని, వేదవేత్తయని, వ్యాకరణవేత్తయని తెలిసి యతనితో తమవృత్తాంతమును తా నాతని గుణములచే నాతని దాసుడైన విధమును ( గుణైర్దాస్యముపాగతః) చెప్పి.

**అహం చైవ హి రామశ్చ సుగ్రీవం శరణం గతౌ ॥**

**ఏష దత్త్వా చ విత్తాని ప్రాప్య చానుత్తమం యశః ।**
**లోకనాథః పురా భూత్వా సుగ్రీవం నాథమిచ్ఛతి ॥**

**పితా యస్య పురా హ్యాసీచ్ఛరణ్యో ధర్మవత్సలః ।**
**తస్య పుత్రశ్శరణ్యశ్చ సుగ్రీవం శరణం గతః॥**

**సర్వలోకస్య ధర్మాత్మా శరణ్యశ్శరణం పురా ।**
**గురుర్మే రాఘవ స్సోஉయం సుగ్రీవం శరణం గతః॥**

**యస్య ప్రసాదే సతతం ప్రసీదేయురిమాః ప్రజాః ।**
**స రామో వానరేంద్రస్య ప్రసాదమభికాంక్షతే ॥**

**శోకాభిభూతే రామే తు శోకార్తే శరణం గతే ।**
**కర్తుమర్హతి సుగ్రీవః ప్రసాదం హరియూథపః ॥**

నేనును రామచంద్రుడును సుగ్రీవుని శరణు జొచ్చితిమి. ఈ యన ఘుడు విశేషధనము నిచ్చి మిక్కిలి గొప్ప కీర్తిని పొందినవాడు. మున్ను లోకమునకే నాథుడుగా నుండినవాడు, ఇప్పుడు సుగ్రీవుని తనకు నాథుడుగ

గోరుచున్నాడు. ఎవని తండ్రి దశరథమహారాజు ధర్మవత్సలుడై యనేకులకు శరణ్యుడుగ నుండెనో యట్టివాని కుమారు డితరులకు శరణ్యు డయ్యు సుగ్రీవుని శరణు జొచ్చుచున్నాడు. పూర్వము సకలలోకములకు రక్షకుడై యుండిన ధర్మాత్ముడగు నా యన్న రాఘవు డిప్పుడు సుగ్రీవుని శరణు బొందినవాడయ్యె. ఎవని యనుగ్రహమున ప్రజలెల్లరు పురుషార్థములనెల్ల బొంది ప్రసన్నులుగ నుందురో అట్టి రామచంద్రు డిప్పుడు వానరరాజగు సుగ్రీవునిప్రసాద మపేక్షించుచున్నాడు. ఇట్లు శోకనిమగ్నుడై శోకించుచున్న రామునియెడ వానరలోకనాథుడగు సుగ్రీవుడు అనుగ్రహించవలెను.

(ఇచ్చట ఒక అసాధారణవిషయము గమనింపదగినది. 'సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే' అని సకలప్రాణులకు పరమగతియగు రామచంద్రుడు కేవల మొక వానరరాజును శరణు వేడుటయా అనిన లోకోత్తరపురుషులకును కారణాంతరములచే కాలప్రవాహమున నిట్టి పరిస్థితు లేర్పడునని, అప్పటి స్థితిలో సర్వ సామాన్యుల సాయ మపేక్షింపక తప్పదని, అట్లు చేయకున్న కార్యహాని యేర్పడును గనుక సముద్రములో మునుగువారు అలవచ్చినపు డణగియుండవలెనని లేకున్న ఆ యలతో కొట్టుకొనిపోవుదురని తెలియుచున్నది. ఇచ్చట 'దేశకాలే ప్రతీక్షస్వ క్షమమాణః ప్రియాప్రియే! సుఖదుఃఖసహఃకాలే సుగ్రీవవశగో భవ' యను హితోపదేశము యొక్క ప్రభావమును గుర్తించుట ముఖ్యము. దేశకాలముల ననుసరించి ప్రియాప్రియములు సహించి కాలానుసారముగ సుఖదుః ఖములను ద్వంద్వముల ననుభవించి తమకంటె తక్కువవారితోను యుక్తియుక్తముగ మెలగుట బుద్ధిమంతుల లక్షణ మని కార్యసాధకమని తెలియందగునని యేర్పడుచున్నది.)

ఋశ్యమూకమున సుగ్రీవుడు తాను గుహలో దాచియుంచిన ఆభరణముల మూటను దెచ్చి చూపినపుడు రామచంద్రుడు దానినెత్తి



ఆదరముతో రొమ్మున జేర్చి నిట్టూర్పులతో కన్నుల నీరు గార్చును. లక్ష్మణుని జూచి–

**పశ్య లక్ష్మణ వైదేహ్యా సంత్యక్తం హ్రియమాణయా ।**
**ఉత్తరీయమిదం భూమౌ శరీరాద్భూషణాని చ ॥**

**శాద్వలిన్యాం ధ్రువం భూమ్యాం సీతయా హ్రియమాణయా ।**
**ఉత్సృష్టం భూషణమిదం తథారూపం హి దృశ్యతే ॥**

లక్ష్మణా! రావణునిచే గొంపోవబడుచుండిన సీత తన శరీరము నుండి తీసిన యుత్తరీయమును. దానిలో మూటగట్టబడిన భూషణములను చూడుము. వీనిని చూడగా నామె పచ్చికమీద నీ మూటను జారవిడిచినదని చెప్పవలెను. ఏలందువా? 'ఇవి దెబ్బదినక మునుపుండినట్లే యున్నవి' యని నంతనే లక్ష్మణుడు.

**నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే ।**
**నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్ ॥**

'అన్నా! నేను నా వదినెయొక్క బాహుపురుల నెఱుగను. ఆమెకుండలము లెట్టివో నాకు దెలియవు. ప్రతిదినము నే నామెపాదములకు మ్రొక్కు చుండుటచే నామెయందె లివియని మాత్రము గుర్తు పట్టగలననెను.

(ఇట్టి యస్ఖలిత బ్రహ్మచారి యనదగు జితేంద్రియుడగు లక్ష్మణుని చెప్పరాని విధమున సీతాదేవి నిందించినందున ఆమె భర్తృవియోగదుఃఖ మనుభవింపవలసివచ్చె ననియు, సాధువులను నిష్కారణముగ దూఱుట పాతక మనియు ఎఱుంగునది.)

సుగ్రీవపట్టాభిషేకానంతరము రామలక్ష్మణులు ప్రస్రవణపర్వతమున వసించుచుండ వర్షాకాలము వచ్చినది. పగటిపూట సీతావిరహతా

పోద్దీపనకరమగు వస్తువుల జూచియు, రాత్రులం దుదయపర్వత ప్రాంతమున దోచు చంద్రుని గనినంతనే ప్రియురాలి యెడబాటు సహింపలేక శోకించు రామచంద్రుని జూచి లక్ష్మణుడు–

**అలం వీర వ్యథాం గత్వా న త్వం శోచితుమర్హసి ।**
**శోచితో వ్యవసీదంతి సర్వార్థా విదితం హి తే ॥**

వీరా! దుఃఖించుట చాలును, నీవు శోకింప దగవు. ఎప్పుడును దుఃఖించుచుండువా డేకార్యమును సాధింపలేడు. ఇది నీకు తెలిసినవిషయమే.

**భవాన్ క్రియాపరో లోకే భవాన్ దైవపరాయణః ।**
**ఆస్తికో ధర్మశీలశ్చ వ్యవసాయీ చ రాఘవ ॥**

లోకములో అందఱికంటెను నీవు పురుషప్రయత్న మెక్కువ చేయువాడవు. కార్యసాధనకు ముఖ్యమగు దైవభక్తియు నీకు గలదు. నీ వాస్తికుడవు. ధర్మస్వరూపుడవు. పూనికతో పనిచేయువాడవు.

**శరత్కాలం ప్రతీక్షస్వ ప్రావృట్కాలోఽయమాగత ః ।**
**తతస్సరాష్ట్రం సగణం రావణం త్వం వధిష్యసి ॥**

**అహం తు ఖలు తే వీర్యం ప్రసుప్తం ప్రతిబోధయే ।**
**దీప్తైరాహుతిభిః కాలే భస్మచ్ఛన్నమివానలమ్ ।**

ఇప్పుడు వర్షాకాలము వచ్చినది. శరత్కాలము నెదురు చూడుము. అప్పుడు నీవు రావణుని, వాని సైన్యమును, బంధువులను వధింతువు. నివురు గప్పిన నిప్పును ఆహుతులు చేసి జ్వలింపజేయునట్లు నిదురించుచున్న నీ వీర్యమును మేలుకొలుపుచున్నాను అనినంతనే రామచంద్రుడు లక్ష్మణునితో–

**వాచ్యం యదనురక్తేన స్నిగ్ధేన చ హితేన చ ।**
**సత్యవిక్రమయుక్తేన తదుక్తం లక్ష్మణ త్వయా ॥**



**ఏష శోకః పరిత్యక్త స్సర్వకార్యావసాదకః ।**
**విక్రమేష్వప్రతిహతం తేజః ప్రోత్సాహయామ్యహమ్ ॥**

'లక్ష్మణా! నీవు సత్యపరాక్రముడును హితుడును ప్రేమంకరుడును, చెప్పవలసిన యుక్తమగు మాటలు చెప్పితివి. సకల కార్యభంగకరమైన ఈ శోకమును విడిచి యెదురులేని పరాక్రమమును వెలయజేయు తేజస్సును పురి కొల్పెదను. నీ మాటల చొప్పున వర్తించెద ననియెను.

(సముద్రము సమీపమున గల భూప్రదేశము యొక్క శీతోష్ణములను సమవరచునట్లు లక్ష్మణుడు బుద్ధిబలముచేతను, సమయస్ఫూర్తి చేతను, ధైర్యసాహసముల చేతను బలపరాక్రమముల చేతను శ్రీరాముని దుఃఖమును, కోపమును శాంతింపజేయుచు అనవరతము రామసేవాపరతంత్రుడై యుండుటను గమనింపవలెను).

## సుగ్రీవుని కాలయాపనము

వర్షఋతువు గడచి శరదృతువు వచ్చినది. సుగ్రీవుడు భోగాసక్తుడై సీతాన్వేషణకార్యములు చేయకుండుటచే రామచంద్రుడు కోపము పూని లక్ష్మణునితో–

**ప్రియావిహీనే దుఃఖార్తే హృతరాజ్యే వివాసితే ।**
**కృపాం న కురుతే రాజా సుగ్రీవో మయి లక్ష్మణ ॥**

**అనాథో హృతరాజ్యోఽయం రావణేన చ ధర్షితః ।**
**దీనో దూరగృహః కామీ మాం చైవ శరణం గతః ॥**

లక్ష్మణా! రాజ్యభ్రష్టుడనై వనవాసము చేయుచు భార్యను పోగొట్టుకొని దుఃఖించుచుండు నాయందు సుగ్రీవు డెంతమాత్రము దయజూపువాడు కాడయ్యె. 'దిక్కు లేక రాజ్యహీనుడై యిల్లు విడిచి చాల దూరము వచ్చిన కాముకుడగు రాముడు రావణునిచే పీడింపబడినవాడై మిక్కిలి దీనుడై నన్ను శరణు పొందినవాడయ్యె నని తనలో ననుకొనుచున్నాడు. నీవు కిష్కింధకు బోయి మూర్ఖుడగు సుగ్రీవునితో నిట్లని నేను చెప్పినట్లుగా చెప్పుము.

**ఆర్థినాముపపన్నానాం పూర్వం చాప్యుపకారిణామ్ ।**
**ఆశాం సంశ్రుత్య యో హంతి స లోకే పురుషాధమః ॥**

ఎవ డొకనివలన ఉపకారము పొంది తన్నాశ్రయించినవాని కుపకారము చేయునట్లు ప్రతిజ్ఞచేసి యాశ కలిగించి తన పని ముగిసినంతనే తా నతనికి జేయవలసిన కార్యమును జేయడో వా డీ లోకమున నధము డగును.

**శుభం వా యది వా పాపం యో హి వాక్యముదీరితమ్ ।**
**సత్యేన పరిగృహ్ణాతి స వీరః పురుషోత్తమః ॥**



ఎవడు మంచిదిగ నుండినను చెడ్డదిగ నుండినను చేసెదనని చెప్పిన మాట చొప్పున చేసితీరునో వాడే వీరుడు, పురుషశ్రేష్ఠుడు.

**కృతార్థా హ్యకృతార్థానాం మిత్రాణాం న భవంతి యే ।**
**తాన్ మృతానపి క్రవ్యాదాః కృతఘ్నాన్నోపభుంజతే ॥**

ఒకరిచే నుపకారము పొంది తమ పనిని పూర్తి చేయించుకొని ఆ స్నేహితులు తమ పని పూర్తికానందున దుఃఖించుచుండగా వారికి ప్రత్యుపకారము చేయకుందురో వారు బ్రతికియుండునపుడు సత్పురుషులు వారిని కన్నెత్తి యైనను చూడకుందురు. అట్టి వారు చచ్చినను మాంసమునే తిని జీవించు మృగములు, పక్షులు గూడ వారి మాంసమును తినవు. ('కృతఘ్నే నాస్తి నిష్కృతిః' అని యెట్టి పాపకార్యమునకు గాని పరిహారము గలదు కాని చేసిన మేలు మఱచిన కృతఘ్నున కెట్టి పరిహారము లేదని, వాని మాంసమును కుక్కలు సైతము తినవనుట 'నాడీజంఘునివృత్తాంత మున') తెలియుచున్నది. పురుష తిలకా! నా కడపటిమాటగ నిట్లనుము.

**కురుష్వ సత్యం మయి వానరేశ్వర**
**ప్రతిశ్రుతం ధర్మమవేక్ష్య శాశ్వతమ్ ।**
**మా వాలినం ప్రేత్య గతో యమక్షయం**
**త్వమద్య పశ్యేర్మమ చోదిత శ్శరైః ॥**

'వానరరాజా! స్థిరమగు ధర్మము నెఱింగి నావిషయమై చేసిన ప్రతిజ్ఞను తప్పక నెరవేర్చుము. అట్లు చేయకుంటివేని నా బాణములకు జిక్కి యిప్పుడే యమలోకము జేరి వాలిని జూతువు' అనినంతనే అన్న మనసు నెఱిగిన లక్ష్మణుడు–

**న ధారయే కోపముదీర్ణవేగం నిహన్మి సుగ్రీవమసత్యమద్య ।**
**హరిప్రవీరైస్సహ వాలిపుత్రో నరేంద్రపత్న్యా విచయం కరోతు ॥**

అన్నా! నాకు పట్టరాని కోపము వచ్చుచున్నది. ఇప్పుడే సుగ్రీవుని వధించెదను. వాడు సత్యము దప్పినవాడు. వానరోత్తములు అంగదుని మున్నిడుకొని సీతాదేవిని వెదకుదురుగాక' యని కోపముతో ధనుర్ధరుడై బయలుదేఱిన లక్ష్మణుని జూచి రామచంద్రు డిట్లనెను.

**న హి వై త్వద్విధో లోకే పాపమేవం సమాచరేత్ ।**
**పాపమార్యేణ యో హంతి స వీరః పురుషోత్తమః ॥**

నీవంటి బుద్ధిమంతు డెవ డీలోకమున నిట్టి మిత్రవధగావించును? దాని నెవడు వివేకముచే పరిహరించునో వాడే వీరుడు, వాడే పురుషోత్తముడు.

**సామోపహితయా వాచా రూక్షాణి పరివర్జయన్ ।**
**వక్తుమర్హసి సుగ్రీవం వ్యతీతం కాలపర్యయే ॥**

'లక్ష్మణా! కోపముడిగి చల్లగ మాటలాడుము. వానిని చంపదగిన దోష మేమియు లేదు. వాడు నిర్ణయించుకొన్న గడువు మీరె ననుట అంత పెద్ద నేరము గాదు' అనినంతనె లక్ష్మణు డన్నమాటలచే గొంత శాంతము వహించి తాను సుగ్రీవునితో సంభాషింపవలసిన విధానము నాలోచించియు అన్నయొక్క కామక్రోధముల స్మరించి మరల ఆగ్రహము పూని కిష్కింధకు వెలుపల తన్ను చూచి వృక్షములను, శిలలను ఆయుధములుగ ధరించిన వానరుల జూడ నినుమడించిన రోషముతో వచ్చుటను గనిన యంగదుడు భయపడి నిలిచినంత, లక్ష్మణుడు వానితో,

**సుగ్రీవః కథ్యతాం వత్స మమాగమన మిత్యుత ।**
**ఏష రామానుజః ప్రాప్త స్త్వత్సకాశమరిందమః ॥**
**భ్రాతుర్వ్యసనసంతప్తో ద్వారి తిష్ఠతి లక్ష్మణః।**
**తస్య వాక్యే యది రుచిః క్రియతాం సాధు వానర ॥**
**ఇత్యుక్త్వా శీఘ్రమాగచ్ఛ వత్స వాక్యమరిందమ ః**



'బాలా! నేను వచ్చియున్నానని సుగ్రీవునితో నిట్లు చెప్పుము' అన్న వాకిట నిలిచియున్నాడు. వెంటనే నీ వతనియొద్దకుబోయి వచ్చినకారణ మేమని యడుగుటయో లేక అతని నిచ్చటికి రప్పించి మాటలాడుటయో యేది యుక్తమో యట్లు చేయుమని చెప్పి శీఘ్రముగ నిచ్చటికి రమ్ము' అనెను. అంగదుడు తల్లికిని తండ్రికిని పినతల్లియగు రుమకును మ్రొక్కి వినయముతో లక్ష్మణుని రాక తండ్రి కెఱింగించెను. మధుపానమత్తుడై యొడలెఱుగని సుగ్రీవుని నానరులు కిలకిలారావములతో మేల్కొలిపిరి. అతని మంత్రు లిరువురు (ప్లక్షుడు, ప్రభావుడు) సుగ్రీవునితో,

**సత్యసంధౌ మహాభాగౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ ॥**
**వయస్యభావం సంప్రాప్తౌ రాజ్యార్హౌ రాజ్యదాయినౌ।**
**తయోరేకో ధనుష్పాణిర్ద్వారి తిష్ఠతి లక్ష్మణః ॥**
**లక్ష్మణేన సకాశం తే ప్రేషితస్త్వరయాఽనఘ ।**
**సోఽయం రోషపరీతాక్షో ద్వారి తిష్ఠతి వీర్యవాన్ ॥**

**గచ్ఛ శీఘ్రం మహారాజ రోషో హ్యస్య నివర్త్యతామ్ ।**
**యదాహ రామో ధర్మాత్మా తత్కురుష్వ సమాహితః ॥**
**రాజంస్తిష్ఠస్వ సమయే భవ సత్యప్రతిశ్రవః ॥**

'మహారాజా! మహాత్ములగు రామలక్ష్మణులు సత్యసంధులు. వారు నీతో సఖ్యము చేసికొన్నవారు. రాజ్యము పాలింపదగువారు. నీకు రాజ్యము నిచ్చిన వారు. వారిలో నొకడగు లక్ష్మణుడు ధనువు ధరించి వాకిట నున్నవాడు. అతనితో నీవు శీఘ్రముగ మాటలాడుము. మహావీరుడగు నాతడు కోపముతో ద్వారముకడ నున్నాడు. నీవు పోయి యతని కోపము శాంతించునట్లు చేయుము. నీవు రాముని కెట్టి ప్రతిజ్ఞ చేసితివో దానినట్లే చెల్లింపుము. నీవు సత్యప్రతిజ్ఞుడ వగుము అనిరి.

ఇంతలో లక్ష్మణుడు ధనుష్టంకారము చేసెను. ఆ శబ్దము సుగ్రీవుని హృదయపుటమును భేదించినది. అంత నా వానరరాజు భయపడి తారను జూచి 'ప్రియా! ఇప్పుడు లక్ష్మణుని కోపమును శాంతింపజేయుట నీవంతు. ఆవల నేను వచ్చి యతనితో సంభాషించెద ననినంతనె తార ముందుగబోయి లక్ష్మణునితో–

**కిం కోపమూలం మనుజేంద్రపుత్ర కస్తే న సంతిష్ఠతి వాఙ్నిదేశే ।**
**కశ్శుష్కవృక్షం వనమాపతంతం దవాగ్నిమాసీదతి నిర్విశంకః ॥**

'రాజకుమారా! నీ కోపమున కేమి కారణము? నీయాజ్ఞను మీరినవా డెవడు? ఎండినచెట్లుగల వనములో నలుప్రక్కల వ్యాపించియుండు కార్చిచ్చులో పడుట కెవడు సాహసించెను? ఇట్లు తార చెప్పిన నిష్కపట వాక్యము విని లక్ష్మణు డామెతో–

**కిమయం కామవృత్తస్తే లుప్తధర్మార్థసంగ్రహః ।**
**భర్తా భర్తృహితే యుక్తే న చైనమవబుధ్యసే ॥**

**న చింతయతి రాజ్యార్థం నాస్మాన్ శోకపరాయణాన్।**
**సామాత్యపరిషత్తారే పానమేవోపసేవతే ॥**

**న హి ధర్మార్థసిద్ధ్యర్థం పానమేవం ప్రశస్యతే ।**
**పానాదర్థశ్చ ధర్మశ్చ కామశ్చ పరిహీయతే ॥**

**ధర్మలోపో మహాంస్తావత్కృతే హ్యప్రతికుర్వతః ।**
**అర్థలోపశ్చ మిత్రస్య నాశే గుణవతో మహాన్ ॥**

**మిత్రం హ్యర్థగుణశ్రేష్ఠం సత్యధర్మపరాయణమ్ ।**
**తద్ద్వయం తు పరిత్యక్తం న తు ధర్మే వ్యవస్థితమ్ ॥**

తారా! నీవు భర్తయొక్క హితమునందే యాసక్తురాల వగుట యిప్పటి విషయ మేమో నీకు దెలియదు. నీ భర్తయగు సుగ్రీవుడు కామమునందే మునిగి ధర్మమును అర్థమును సంగ్రహింపకున్నాడు. అతడు రాచకార్యము లనుగాని శోకముచే బాధింపబడు మమ్ము గాని గమనింపడు. ఇతడెల్లప్పుడ మంత్రులతోగూడి మద్యపానము చేయుచుండును. ధర్మమును అర్థమును గోరువా డెప్పుడు మద్యపానాసక్తు డగుట కొనియాడదగినదికాదు. మద్యపానము ధర్మమును అర్థమును నాశముచేయుటేగాక కాలక్రమమున కామమును నశింపజేయును. ఉపకారముచేసినవానికి ప్రత్యుపకారము చేయుకుండుట గొప్ప ధర్మలోపమగును. అట్లు ప్రత్యుపకారము లభింప నందున మిత్రుడు నాశ మొందినచో అర్థకామములకే హాని కలుగును. సత్యసంధుడును, ధర్మపరిపాలకుడునగు మిత్రు డర్థకామములకంటె శ్రేష్ఠుడు. అట్టి యత్తమమిత్రుని త్యజించుటవలన సుగ్రీవు డర్థకామములను పోగొట్టుకొనినవాడే, ధర్మము విడిచినవాడే యగును. అట్లతడు నడచుకొనగా మేమేమి చేయవలెనో నీ వెఱుగుదువు గదా! నీవే చెప్పుము అనెను. అప్పుడు తార లక్ష్మణుని జూచి–



**న కోపకాలః క్షితిపాలపుత్ర న చాతికోపస్స్వజనే విధేయః ।**
**త్వదర్థకామస్య జనస్య తస్య ప్రమాదమప్యర్హసి వీర సోఢుమ్ ॥**

రాజకుమారా! సుగ్రీవు డిప్పుడు కామపరవశుడై యుండుటచే నతని మీద గోపముచూపుట కిది సమయముగాదు. వీ డెవడోగాడు. మీరు మిత్రుడుగ నంగీకరించినందున మీవాడే. స్వజనునిపై నిట్టి కోపము చూపుట యుక్తము కాదు. మీ కార్యమందే యాసక్తుడైనవాడు. ఇట్టివాడేమో కామమునకు జిక్కెనని, అందుచే మీ కార్యమున కించుక యాలస్య మయ్యెనని యోర్చుకొనుము.

**కోపం కథం నామ గుణప్రకృష్టః కుమార కుర్యాదపకృష్టసత్త్వే ।**
**క స్త్వద్విధః కోపవశం హి గచ్ఛేత్సత్త్వావరుద్ధస్తపసః ప్రసూతిః ॥**

కుమారా! వీర్యాదిగుణములయందు నధికుడగువాడు తనకంటె బలహీనుడగువానిపట్ల కోపముపూనుట యుక్తముగాదు. వ్యవసాయముతో గూడినవాడై శాంతిరూపమగు తపస్సున కాశ్రయమైన నీవంటి మహా పురుషుడు కోపమునకు వశుడగుట యెట్లొప్పును? కోపము పూనుట నాతప్పిదమనుచున్నావు గాని అందులకు కారణమేమో తెలియకున్నావే యందువా?

**జానామి రోషం హరివీరబంధో**
**ర్జానామి కార్యస్య చ కాలసంగమ్ ।**
**జానామి కార్యం త్వయి యత్కృతం న**
**స్తచ్చాపి జానామి యదత్ర కార్యమ్ ॥**

**తచ్చాపి జానామి యథాఽవిషహ్యం బలం నరశ్రేష్ఠ శరీరజస్య ।**
**జానామి యస్మింశ్చ జనేఽవబద్ధం కామేన సుగ్రీవమసక్తమద్య ॥**

**న కామతంత్రే తవ బుద్ధిరస్తి త్వం వై యథామన్యువశం ప్రసన్నః ॥**
**న దేశకాలౌ హి న చార్థధర్మా వవేక్షతే కామరతిర్మనుష్యః ॥**

**తం కామవృత్తం మమ సన్నికృష్టం**
**కామాభియోగాచ్చ నివృత్తలజ్జమ్ ।**
**క్షమస్వ తావత్పరవీరహంత**
**స్త్వద్భ్రాతరం వానరవంశనాథమ్ ॥**

**మహర్షయో ధర్మతపోఽభిరామాః కామానుకామాః ప్రతిబద్ధమోహాః ।**
**అయం ప్రకృత్యా చపలః కపిస్తు కథం న సజ్జేత సుఖేషు రాజా ॥**

ఆ కోపకారణము నాకు దెలియును.సుగ్రీవుని ప్రియసఖుడగు రాముని కేల యిట్టికోపము గలిగెనో నే నెఱుగుదును. సీతాదేవిని వెదకుటయందు సుగ్రీవుడు కాలతామసము చేసినదియు నాకు దెలియును. నీవు మాకెట్టి మహోపకారము చేసితివో యదియు నాకు దెలియనిదికాదు. అందుకు మేమేమి ప్రత్యుపకారము చేయవలెనో నాకు దెలియును. పురుషశ్రేష్ఠా! శరీరమున బుట్టు కామమున కెట్టి బలము గలదో నే నెఱుగుదును. ఇప్పుడు సుగ్రీవు డెవరియం దెట్టి కామముగలిగి యున్నారో నే నెఱుగుదును. నీ కోపమును జూడగా నీకు మావలె కామతంత్రములగు రతిక్రీడలయందెట్టి జ్ఞానములేదని తోచుచున్నది.



“ కామాసక్తుడగువాడు దేశమును, కాలమును, ధర్మమును, అర్థమును దేనిని పాటింపడు. లక్ష్మణా! నన్నుం గూడి కామపరవశుడై లజ్జ వీడి యున్న నీ సోదరుడు వానరవంశనాథుడగు సుగ్రీవుని క్షమింపుము. ధర్మము ననుష్ఠించి తపమునే గోరు మహర్షులు సైతము కామినులం గూడి కాలబద్ధులై మోహాంధులగుచుండ స్వభావముననే చపలచిత్తుడగు వానరరాజు కామభోగములం దాసక్తుడు గాకుండునా? ఇట్లు లక్ష్మణుని శాంతింప జేసి తార యతని నంతఃపురములోనికి గొనిపోయెను.

అచ్చట రుమను గాఢాలింగనము చేసికొని యుత్తమాసనమున గూర్చుండి యుండిన సుగ్రీవుని చూచినంతనె లక్ష్మణుడు కోపము పూనెను. సుగ్రీవుడు లేచి నిలుచుండ లక్ష్మణు డతనితో–

**సత్త్వాభిజనసంపన్న స్సానుక్రోశో జితేంద్రియః ।**
**కృతజ్ఞస్సత్యవాదీ చ రాజా లోకే మహీయతే ॥**

**యస్తు రాజా స్థితోఽధర్మే మిత్రాణాముపకారిణామ్ ।**
**మిథ్యా ప్రతిజ్ఞాం కురుతే కో నృశంసతరస్తతః ॥**

**పూర్వం కృతార్థో మిత్రాణాం న తత్ప్రతికరోతి యః ।**
**కృతఘ్నస్సర్వభూతానాం స వధ్యః ప్లవగేశ్వర ॥**

**గీతోఽయం బ్రహ్మణా శ్లోక స్సర్వలోకసమస్కృతః ।**
**దృష్ట్వా కృతఘ్నం క్రుద్ధేన తం నిబోధ ప్లవంగమ ॥**

**బ్రహ్మఘ్నే చ సురాపే చ చోరే భగ్నవ్రతే తథా ।**
**నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః ॥**

**అనార్యస్త్వం కృతఘ్నశ్చ మిథ్యావాదీ చ వానర ।**
**పూర్వం కృతార్థో రామస్య న తత్ప్రతికరోషి యత్ ॥**

**నను నామ కృతార్థేన త్వయా రామస్య వానర ।**
**సీతాయా మార్గణే యత్నః కర్తవ్యః కృతమిచ్ఛతా ॥**

"బలవంతుడును, సద్వంశమున బుట్టినవాడును, దీనులయెడ కరుణగల వాడను. ఇంద్రియములను జయించినవాడును, చేసిన మేలు మఱువనివాడును. నిజము పలుకువాడును అగు రాజు లోకమున మిక్కిలి కొనియాడబడును, ఏ రాజు ధర్మము విడిచి మునుపు తన కుపకారముచేసిన మిత్రులకు జెప్పినట్లు నడచు కొనడో యట్టిరాజు కంటె నీచుడీ లోకమున లేడు. తన కుపకారము చేసినవారికి ప్రత్యుపకారము చేయనివాడు కృతఘ్ను డగును. వానరరాజా! అట్టి వాడెల్ల ప్రాణులచే వధింపదగిన వాడగును. పూర్వము సర్వలోక పూజ్యుడగు స్వాయంభువమనువు కృతఘ్నుని గూర్చి చెప్పిన శ్లోకము వినుము.

'బ్రహ్మహత్య చేసిన వానికి, సురాపానముచేసిన వానికి దొంగిలించిన వానికి, వ్రతభంగము (గురుభక్తి, గురుశుశ్రూషాదులు చేయకుండుట, గురుపత్నితో గూడుట) చేసికొనినవానికి ప్రాయశ్చిత్తము విధింపబడియున్నది గాని చేసిన మేలు మఱచిన వానికెట్టి ప్రాయశ్చిత్తమును విధింపబడలేదు. ఓ వానరా! నీవు రామునిచే నీ కార్యము చేయించుకొంటివి. అతని కార్యము చేయించెదనని చేయక పోతివి. నీ వయోగ్యుడవు. అసత్యము పలికినవాడవు.



చేసిన మేలు మఱచిన వాడవు. ప్రతిజ్ఞ దప్పినవాడవు. రామునిచే నుపకారము పొంది యతని పత్నియగు సీతాదేవిని వెదకుటకై యెట్టి ప్రయత్నము చేయనివాడవు.

**న త్వం గ్రామ్యేషు భోగేషు సక్తో మిథ్యాప్రతిశ్రవః ।**
**న త్వాం రామో విజానీతే సర్పం మండూకరావిణమ్ ॥**

**మహాభాగేన రామేణ పాపః కరుణవేదినా ।**
**హరీణాం ప్రాపితో రాజ్యం త్వం దురాత్మా మహాత్మనా ॥**

**న చ సంకుచితః పంథా యేన వాలీ హతో గతః ।**
**సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలిపథమన్వగాః ॥**

సర్పము కప్పను సమీపమునకు రప్పించుటకై కప్పవలె అఱచి కప్ప వచ్చిన తోడనె దానిని మ్రింగును. అట్లు కప్పవలె శబ్దించు పామువలె సత్యము పాటించునట్లు నటించిన నిన్ను రాము డెఱుగక నమ్మెను. నీ విప్పుడు గ్రామ్యసుఖములకు జిక్కి యతనికి జేసిన ప్రతిజ్ఞ వమ్ము గావించితివి. మహాభాగుడును, 'కరుణామయుడును' మహాత్ముడునగు రాముడు దురాత్ముడవగు నీకీ వానర రాజ్య మిప్పించెను. వాలి వధింపబడి యే మార్గమున బోయెనో యా మార్గ మిప్పు డట్లే యున్నదని తెలియుము. నీ ప్రతిజ్ఞను నెఱవేర్పుము. వాలి పోయిర మార్గమున బోకుము' అనెను.

ఇట్లు పలికిన లక్ష్మణుని జూచి తార–

**రామప్రసాదాత్కీర్తిం చ కపిరాజ్యం చ శాశ్వతమ్ ।**
**ప్రాప్తవానిహ సుగ్రీవో రుమాం మాం చ పరంతప ॥**

**సుదుఃఖం శయితః పూర్వం ప్రాప్యేదం సుఖముత్తమమ్ ।**
**ప్రాప్తకాలం న జానీతే విశ్వామిత్రో యథా మునిః ॥**

**ఘృతాచ్యాం కిల సంసక్తో దశవర్షాణి లక్ష్మణ ।**
**అహోఽమన్యత ధర్మాత్మా విశ్వామిత్రో మహామునిః ॥**

'పరంతపా! రామునియనుగ్రహము వలననే సుగ్రీవుడు గొప్ప కీర్తిని, శాశ్వతమగు వానరరాజ్యమును, తన భార్యయగు రుమను, నన్నును, పొందినవాడయ్యె. మునుపు చాల దుఃఖము ననుభవించి యిప్పు డిట్టి యుత్తమం బగు సుఖము పొంది విశ్వామిత్రుని వలె కాలము వచ్చినదని యెఱగడు. పూర్వము మేనకతో గూడి విశ్వామిత్రుడు పది వత్సరముల నొక పగలుగా దలచెను గదా! అట్టి మహర్షుల విషయ మట్లుండ చపలచిత్తుడగు సుగ్రీవు డిట్లు కామవరవశు డగుటను గూర్చి చెప్పనేల? నీ వతనిని క్షమింపవలెను.

**ప్రసాదయే త్వాం ధర్మజ్ఞ సుగ్రీవార్థే సమాహితా ।**
**మహాన్ రోషసముత్పన్న స్సంరంభస్త్యజ్యతామయమ్ ॥**

**రుమాం మాం కపిరాజ్యం చ ధనధాన్యవసూని చ ।**
**రామప్రియార్థం సుగ్రీవ స్త్యజేదితి మతిర్మమ ॥**

లక్ష్మణా! నీవు ధర్మములనెల్ల దెలిసినవాడవు. నేను సుగ్రీవుని కొఱకు నిన్ను ప్రసన్నునిగా జేయ జూచుచున్నాను. మిక్కుటమగు రోషము వలన బుట్టిన నీ తొందరపాటును విడువుము. రామచంద్రునకు ప్రీతి కలిగించు నిమిత్తము సుగ్రీవుడు వానరరాజ్యమును, రుమను, నన్ను, ధనధాన్యాది వస్తు సంచయమును విడిచి పెట్టునని నాకు దోచుచున్నది.

(ఇచ్చుట భగవదాజ్ఞ చొప్పున భగవంతుని ప్రీతి కొఱకు సర్వస్వత్యాగము చేయుట యుత్తమని స్వధర్మమని తెలియుచున్నది. ఇందు కాదర్శ పురుషుడు రామచంద్రుడే. ఎట్లన నరణ్యమున ఋషులందఱు రాక్షసబాధ దీర్పుమని ప్రార్థించినపు డట్లే చేసెదనని ప్రతిజ్ఞచేసిన రామచంద్రునితో సీతాదేవి, 'వినా



వైరం చ రౌద్రతా' -- నీతో వైరము పూనకుండు రాక్షసుల నందఱిని వధింతు ననుట యుక్తము గాదని వాదించినపుడు రామచంద్రుడు తన దృఢసంకల్పము నామె కిట్లు తెలిపెను.

**అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్ ।**
**న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః ॥**

అనగా 'ఆత్మానం సర్వదా రక్షేద్దారైరపి ధనైరపి' భార్యను, ధనమును విడిచి పెట్టియైనను తనప్రాణమును కాపాడుకొనవలెనని శాస్త్రము. అట్లుండినను నేను ప్రాణము విడుతును. నా వెలుపలిప్రాణమగు లక్ష్మణుని విడుతును. అర్ధాంగి వగు నిన్ను విడుతును. సాధారణమగువానికైన నే నిచ్చినమాటను విడువను. బ్రహ్మజ్ఞానసంపన్నులగువారిని రక్షించెదనని చేసిన ప్రతిజ్ఞ నెంతమాత్రము విడువనని చెప్పెను గదా! అశ్రితుల రక్షించుట ధర్మము. ఆశ్రితుల విరోధులే తన విరోధు లగుదురు. కనుక తనతో రాక్షసులు వైరము పూనుకున్నను తన్నాశ్రయించిన ఋషులను బాధించినందున రాక్షసులు వధ్యులేయనుట రామచంద్రుని సిద్ధాంతము. అట్లే యిచ్చుట తాత్కాలికముగ నైనను సుగ్రీవునాశ్రయించిన రామచంద్రుని శత్రువగు రావణేశ్వరుని తన శత్రువుగనే భావించి యతనిని వధింప సర్వసన్నాహములు సుగ్రీవుడు గావించుచున్నాడు. ఇప్పుడు నీ యుగ్రస్వరూపమును జూచుచుండు సుగ్రీవునిపత్నులు భయపడియున్నారు గనుక నీ విప్పుడు ప్రసన్నుండగుము అనెను.

తార యొక్క సహేతుకమగు మాట విని లక్ష్మణు దుత్తము డగుట క్షణములో కోపము విడిచి ప్రసన్ను డగుటను జూచి భయమును కామ వికారమును వదలిన సుగ్రీవుడు వినయముతో లక్ష్మణుని జూచి.

**ప్రనష్టా శ్రీశ్చ కీర్తిశ్చ కపిరాజ్యం చ శాశ్వతమ్ ।**
**రామప్రసాదాత్సౌమిత్రే పునఃప్రాప్త మిదం మయా ॥**

**క శ్శక్తస్తస్య దేవస్య ఖ్యాతస్య స్వేన కర్మణా ।**
**తాదృశం విక్రమం వీర ప్రతికర్తుమరిందమ ॥**

**సహాయకృత్యం కిం తస్య యేన సప్త మహాద్రుమాః ।**
**శైలశ్చ వసుధా చైవ బాణేనైకేన దారితాః ॥**

**అనుయాత్రాం నరేంద్రస్య కరిష్యేఽహం నరర్షభ ।**
**గచ్ఛతో రావణం హంతుం వైరిణం సపురస్సరమ్ ॥**

"సుమిత్రానందనా! నన్ను విడిచిపోయిన నైశ్వర్యము, కీర్తి, శాశ్వతమగు వానరరాజ్యము శ్రీరాముని యనుగ్రహము వలననే మరల నాకు ప్రాప్తమైనవి. వీరా! అరిందమా? వాలివధ యను తన పరాక్రమముచే గొప్ప కీర్తి గడించిన రామచంద్రుని కట్టి పరాక్రమము జూపి ప్రత్యుపకారము చేయ శక్తు డెవ డున్నాడు? ఒక్క బాణముచేతనే సప్తమహావృక్షములను, పర్వతమును, భూమిని భేదించినట్టి గొప్ప వీరునకు సహాయముచేయ నొక్క డేల? పురుష తిలకా! అతని సైన్యమును వధింప రామచంద్రు డేగుచుండ నే నతనివెంట బోవలసినవాడనే కాని అతనికి సహాయము చేయునంతటివాడనా?

**యది కించిదతిక్రాంతం విశ్వాసాత్ప్రణయేన వా ।**
**ప్రేష్యస్య క్షమితవ్యం మే న కశ్చిన్నాపరాధ్యతి ॥**

స్నేహితుని దండింప దను నమ్మకముతోనో, అతనియందలి ప్రేమాతి శయముననే నే నొకింత క్రమముదప్పి ప్రవర్తించియుండిన నన్ను మన్నింప వలెను. లోకమున నేర మొనర్పనివా డెవడును లేడు.

(ఇచ్చట రావణాదుల వధను గూర్చి సీతాదేవికి హనుమంతుడు దెలిపి మున్ను సీతను హింసించిన రాక్షసస్త్రీలను హింసింపగోరిన యాంజనేయు నితో సీతాదేవి,



**పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ ।**
**కార్యం కరుణమార్యేణ స కశ్చిన్నాపరాధ్యతి ॥**

అనగా ఓ వానరా! నీ మాటల చొప్పున నపరాధము చేసినవారైనను నా మాట చొప్పున యోగ్యులుగ నున్నను వారిని రక్షించుట కర్తవ్యము. యోగ్యులను వారి యోగ్యతయే రక్షించును. పాపము చేసినవారిని దయ తలచి రక్షించుట యుత్తమధర్మమగును. ఈ లోకమున నపరాధము చేయనివారు లేరు.

ఈ రెండు పక్షములలో నొక్క భేద మున్నది. సుగ్రీవుడు తన్ను రక్షించునట్లు తానే వేడుకొనుచున్నాడు. రాక్షస స్త్రీల కొఱకు పురుషకార భూతయు, దయాస్వరూపిణియగు సీతాదేవి వారడుగకయే రక్షించుచున్నది. 'సకృదేవ ప్రపన్నాయ' అనుచోట రామచంద్రు డొక్క పర్యాయమైన "నేను నీ దాసుడ" నని చెప్పువారినే రక్షించును. సీతాదేవి వారు కోరకున్నను రక్షించునని ఆశ్రితరక్షకత్వమునే గాక అనాశ్రితరక్షకత్వము గూడ దయాదే వి (సీతాదేవి నిర్వర్తించుచున్నదని తెలియుచున్నది.)

ఇట్లు తన తప్పు నొప్పుకొని క్షమింపవేడిన సుగ్రీవునితో లక్ష్మణుడు,

**సర్వథా హి మమ భ్రాతా సనాథో వానరేశ్వర ।**
**త్వయా నాథేన సుగ్రీవ ప్రశ్రితేన విశేషతః ॥**

వానరరాజా! నా సోదరుడు తనయందు వినయసంపన్నుడైన నిన్ను నాథునిగ బొందినందున సర్వవిధముల నాథుడు గలవాడయ్యెను.

**యస్తే ప్రభావ స్సుగ్రీవ యచ్చ తే శౌచమార్జవమ్ ।**
**అర్హస్త్వం కపిరాజ్యస్య శ్రియం భోక్తుమనుత్తమామ్ ॥**

సుగ్రీవా! నీ ప్రభావము, శౌచము, ఋజుత్వము మొదలగు సద్గుణము లను జూడగా సర్వోత్తమమగు వానరరాజ్యలక్ష్మి ననుభవించుటకు నీవే యర్హుడ వని చెప్పదగును.

**సహాయేన చ సుగ్రీవ త్వయా రామః ప్రతాపవాన్ ।**
**వధిష్యతి రణే శత్రూనచిరాన్నాత్ర సంశయః ॥**

**ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య సంగ్రామేష్వనివర్తినః ।**
**ఉపపన్నం చ యుక్తం చ సుగ్రీవ తవ భాషితమ్ ॥**

**దోషజ్ఞస్సతి సామర్థ్యే కోఽన్యో భాషితుమర్హతి ।**
**వర్జయిత్వా మమ జ్యేష్ఠం త్వాం చ వానరసత్తమ ॥**

**సదృశశ్చాసి రామస్య విక్రమేణ బలేన చ ।**
**సహాయో దైవతైర్దత్త శ్చిరాయ హరిపుంగవ ॥**

**కింతు శీఘ్రమితో వీర నిష్క్రామ త్వం మయా సహ ।**
**సాంత్వయ స్వవయస్యం త్వం భార్యాహరణకర్శితమ్ ॥**

**యచ్చ శోకాభిభూతస్య శ్రుత్వా రామస్య భాషితమ్ ।**
**మయా త్వం పరుషాణ్యుక్త స్తచ్చ త్వం క్షంతుమర్హసి ॥**

అట్టి నీవు సహాయము చేయగా ప్రతావశాలియగు రామచంద్రుడు శత్రువుల నతిశీఘ్రముగ వధించును. ఇందెంతమాత్రము సందేహములేదు. సకలధర్మముల నెఱిగినవాడును, చేసినమేలును మఱువనివాడును, యుద్ధమునందు నెనుదీయనివాడును, చెప్పదగిన మాటలే నీ వాడిన మాటలు, వానరోత్తమా! నిగ్రహానుగ్రహశక్తి కలిగియున్నను తనదోషమును తానొప్పుకొనువాడు నీవును మా యన్నయు దక్క మఱి యెవ్వడున్నాడు? కపిసత్తమా! నీవు బలము నందును, బలపరాక్రమములందును రామునికి సాటివాడవు. ఇంత కాలమునకు దేవతలు నిన్ను సహాయునిగ మాకు జూపిరి. లేనియెడ మాకు దిక్కెవరు? వీరా! నీవు నాతో శీఘ్రముగ వెడలివచ్చి భార్యావియోగదుఃఖమును అతి తీవ్రముగ అనుభవించుచున్న నీ స్నేహితుని



ఊరడింపుము. రాముని దుఃఖమును నతని దైన్యపు మాటలను విని సహింపలేక నిన్ను నేను పరుషముగ పలికితిని, అందుకు నీవు నన్ను క్షమింపుము అనెను.

(ఉత్తము డెట్టి కోపమును శీఘ్రముగ యుక్తమగు మాటలు వినుటచే విడిచి పెట్టునని లక్ష్మణుని ప్రవర్తనవలన తెలియుచున్నది. ఏదో యొక కారణముచే కోపము గలిగినను ఇతరులయందలి సద్గుణములను దుర్గుణములుగ నెంచరాదని 'స్వదోష పరదోషవిత్' అని రామచంద్రు డితరులదోషమునే గాక తనదోషము నెఱుగునని ప్రసిద్ధము. ఇచ్చట లక్ష్మణుని మాటలవలన సుగ్రీవునకు నట్టి గొప్ప గుణము గలదని విస్పష్టమగుచున్నది. తమ తప్పు లెఱిగి యొప్పుకొనువారే మహాత్ము లనబడదురు. 'గుణములచే నే నతనిదాసుడ నైతి' నని లక్ష్మణుడు చెప్పియున్నాడుగదా! ఒకేవిధమైన గుణములుగలవారే స్నేహితు లగుదురని రామసుగ్రీవుల స్నేహమట్టిదగుటచే వారి వృత్తాంత మాదర్శప్రాయముగ నున్నది. హితము నభిలషించువారే స్నేహితులగుదురు. అట్టివారు దుఃఖమనుభవించునపుడు వారి మిత్రులు వారి నోదార్చుట స్నేహధర్మమని వీరిరువురి సంభాషణము తెలుపుచున్నది.)

సముద్రునిపై రామచంద్రునకు వచ్చిన కోపమును లక్ష్మణుడు శాంతింప జేయుట.

మూడహోరాత్రములు నియమముతో రామచంద్రుడు సముద్రుని ప్రార్థించి విఫలుడై కోపించి లక్ష్మణునితో–

**ప్రశమశ్చ క్షమా చైవ ఆర్జవం ప్రియవాదితా ।**
**అసామర్థ్యం ఫలంత్యేతే నిర్గుణేషు సతాం గుణాః ॥**

**ఆత్మప్రశంసినం దుష్టం ధృష్టం విపరిధావకమ్ ।**
**సర్వత్రోత్సృష్టదండం చ లోకస్సత్కురుతే నరమ్ ॥**

**న సామ్నా శక్యతే కీర్తి ర్న సామ్నా శక్యతే యశః ।**
**ప్రాప్తుం లక్ష్మణ లోకేఽ స్మిన్ జయో వా రణమూర్ధని ॥**

"లక్ష్మణా! కోపములేకుండుట, అపరాధముసైచుట, త్రికరణశుద్ధికలిగి యుండుట. ప్రియవచనము లాడుట మొదలగు సత్పురుషుల యుత్తమ గుణములు గుణహీనులయెడ జూపినచో వారు వారిని యసమర్థు లందురు. తన్ను తాను పొగడుకొనువానిని, దుష్టుని, వంచకుని, నిర్దయుని, ఎల్లర తరుమగొట్టు వానిని, మంచి చెడుగులు విచారింపక ఎల్లర నొక్క రీతిగ దండించువానిని గౌరవింతురు గాని శమదమాది గుణములు గలవారిని నీచులు గౌరవించరు. లక్ష్మణా! ఈ లోకమున సామముచే బలవంతుడను కీర్తిరాదు. సామోపాయము ననుష్ఠించిన బలపరాక్రమవంతు డను యశమును గలుగదు. రణరంగమున సామముచే జయమును గలుగదు. నీచులపట్ల దండోపాయమే సఫల మగును. అని చెప్పుచు రామచంద్రుడు కోపావేశముచే–

**తతస్తు తం రాఘవముగ్రవేగం ప్రకర్షమాణం ధనురప్రమేయమ్ ।**
**సౌమిత్రిరుత్పత్య సముచ్ఛ్వసంతం మా మేతి చోక్త్వా ధనురాలలంబే ॥**

నిట్టూర్పులు విడుచుచు ఉగ్రబాణములు ప్రయోగింప ఉద్యుక్తుండ గుట జూచి యిక నాలసించిన లోకమున కనర్థము వాటిల్లునని తలచి లక్ష్మణుడు ధనువును పట్టుకొనెను.

(లక్ష్మణుడు శ్రీరామసేవానిరతుడు. అన్న దైన్యమునొందినపు డతనికి ధైర్యము చెప్పును. అన్నకు కోపము వచ్చువేళ దాని నుచితరీతిని శాంత పరచును. అన్నయొక్క నిగ్రహానుగ్రహములు వ్యర్థము కావని తెలిపినవా డగుటచే ఆయా సందర్భములకు తగినరీతిని మెలగుచు లోకమున కెట్టి కీడు వాటిల్లకుండ, శ్రీరాముని కీర్తిప్రతిష్ఠల కెట్టి భంగము రానీయక



జాగరూకుడై వర్తించుచుండువాడు. సీతావిరహతాపముచే నలయు రామచంద్రునకు లక్ష్మణుడు చల్లని నీటితో నిండిన జలాశయమువలె తాపోపశాంతి కల్గించును. ఇట్లేమఱక నెల్లవేళల అన్న కతి భక్తిశ్రద్ధలతో సేవ చేయువాడు లక్ష్మణుడని యెఱుంగవలయు.)

## రామలక్ష్మణులు నాగపాశబద్ధు లగుట

రాత్రి యుద్ధమున రామలక్ష్మణులు మాయావి యగు ఇంద్రజిత్తుచే సర్పమయమగు బాణములచే బంధింపబడి ప్రజ్ఞతప్పినవారైరి. అంత వానరులు దుఃఖముతో నిండినవారైరి. విభీషణుడు మాయామోహనివారణ మగు మంత్రముచే నభిమంత్రించిన నీటితో సుగ్రీవుని కన్నులను దుడిచెను. విభీషణుడు సుగ్రీవునితో–

**న కాలః కపిరాజేంద్ర వైక్లబ్యమనువర్తితుమ్ ।**
**అతిస్నేహోఽ ప్యకాలేఽ స్మిన్ మరణాయోపకల్పతే ॥**

**తస్మాదుత్సృజ్య వైక్లబ్యం సర్వకార్యవినాశనమ్ ।**
**హితం రామ పురోగాణాం సైన్యానామనుచింత్యతామ్ ॥**

**అథవా రక్ష్యతాం రామో యావత్సంజ్ఞావిపర్యయః ।**
**లబ్ధసంజ్ఞౌ హి కాకుత్స్థౌ భయం నో వ్యపనేష్యతః ॥**

**తస్మాదాశ్వాసయాఽ త్మానం బలం చాశ్వాసయ స్వకమ్ ।**
**యావత్కార్యాణి సర్వాణి పునస్సంస్థాపయామ్యహమ్ ॥**

"'వానరరాజా! అధైర్యపడుట కిది సమయముగాదు. అతి స్నేహము పాటించుటకు ఇది తరుణము గానేరదు. అట్లు చేయుటయు మరణమునకు కారణ మగును. కనుక సకలకార్యవినాశకరమగు దైన్యము వీడుము. ఇక రాముని కేది హిత మొనర్చునో, యతని సైన్యమున కేది మేలొనగూర్చునో

ఆ కార్యమును చేయుము. రాముడు ప్రజ్ఞతెచ్చుకొనునంతవఱ కాతని గాపాడుము. కకుత్స్థవంశస్థులగు రామలక్ష్మణులు మూర్ఛదేఱి మన భయమును పోగొట్టుదురు. నేను నా కార్యములను నిర్వర్తించుకొనునంత వఱకు నీవు నీ సైన్యము దిటవు దెచ్చుకొనవలెను అనెను. కొంతసేపటికి రాముడు మూర్ఛదేఱి దురవస్థలో నున్న తమ్ముని జూచి–

**కిం ను మే సీతయా కార్యం కిం కార్యం జీవితేన వా ।**
**శయానం యోఽద్య పశ్యామి భ్రాతరం యుధి నిర్జితమ్ ॥**

**శక్యా సీతాసమా నారీ మర్త్యలోకే విచిన్వతా ।**
**న లక్ష్మణసమో భ్రాతా సచివస్సాంపరాయికః ॥**

నా కిక సీతతో నేమి పని? నా జీవితముతో పని యేమి? ఆహా! యుద్ధములో జయింపబడి కళావిహీనుడై నేల బడియుండు తమ్ముని జూచు దౌర్భాగ్యము గలిగెనే! లోకమున వెదకి చూడగా సీతవంటి స్త్రీని పొంద వచ్చును. కాని సహాయుడును, యుద్ధవీరుడు నగు లక్ష్మణుని వంటి తమ్ముని నే నెందును గానలేను.

**కిన్ను వక్ష్యామి కౌసల్యాం మాతరం కిన్ను కైకయీమ్ ।**
**కథ మంబాం సుమిత్రాం చ పుత్రదర్శనలాలసామ్ ॥**

**వివత్సాం వేపమానాం చ క్రోశంతీం కురరీమివ ।**
**కథమాశ్వాసయిష్యామి యది యాస్యామి తం వినా ॥**

**కథం వక్ష్యామి శత్రుఘ్నం భరతం చ యశస్వినమ్ ।**
**ఇహైవ దేహం త్యక్ష్యామి న హి జీవితుముత్సహే ॥**

---

గుణములచే లభించు ప్రసిద్ధికి కీర్తి యనియు, దానముచే గలిగిన ఖ్యాతికి యశస్సు అని పేరు.



నే నయోధ్యకు బోయి తల్లి కౌసల్యాదేవి కేమని చెప్పుదును? కైకేయి కేమి చెప్పుదును? కుమారుని జూడ నువ్విళ్ళూరుచుండు సుమిత్రాదేవి దూడ లేని యావువలె నాక్రోశించుచుండ నామె నెట్లోదార్పగలను? శత్రుఘ్నున కేమి బదులు చెప్పుదును? కీర్తిమంతుడగు భరతున కేమి సమాధానము చెప్పుదును? నా కిక బ్రదుకుపై నాశలేదు. ఇప్పుడే ప్రాణము నిచ్చుటనే విడిచెదను అని యేడ్చుచు లక్ష్మణునివంక జూచి–

**త్వం నిత్యం సవిషణ్ణం మామాశ్వాసయసి లక్ష్మణ ।**
**గతాసుర్నాద్య శక్నోషి మామార్తమభిభాషితుమ్ ॥**

**యేనాద్య నిహతా యుద్ధే రాక్షసా వినిపాతితాః ।**
**తస్యామేవ క్షితౌ వీర స్స శేతే నిహతః పరైః ॥**

**యథైవ మాం వనం యాంత మనుయాతో మహాద్యుతిః ।**
**అహమప్యనుయాస్యామి తథైవైనం యమక్షయమ్ ॥**

**ఇష్టబంధుజనో నిత్యం మాం చ నిత్యమనువ్రతః ।**
**ఇమామద్య గతోఽవస్థాం మమానార్యస్య దుర్నయైః ॥**

**సురుష్టేనాపి వీరేణ లక్ష్మణేన న సంస్మరే ।**
**పురుషం విప్రియం వాపి శ్రావితం న కదాచన ॥**

"లక్ష్మణా! నే నెప్పుడు దుఃఖితుడనైనను నీవు నన్నోదార్చుచుందువే. ఇప్పుడు నీవు ప్రాణము గోల్పోవ నే నెంత దుఃఖించుచున్నను మాటాడ లేకున్నావు. ఎవనిచే నిప్పుడు రాక్షసులు యుద్ధమున గూలిరో ఆ వీరు డిప్పుడు శత్రువులచే హతుడై యా యుద్ధభూమిలో పరుండి యున్నాడు. గొప్ప కాంతితో గూడిన లక్ష్మణు డెట్లు వనమునకు నన్ననుసరించి వచ్చెనో అట్లే నే నతని ననుసరించి యమునియొద్దకు బోయెదను. ఈ లక్ష్మణు

డెల్లప్పుడు బంధుజనులయెడ ప్రీతితో మెలగువాడు. అతడు నియమముతో న న్ననుసరించి వర్తించును. ఇట్టి వా డిప్పుడు నా యనార్య కార్యములచే నిట్టి దుర్గతిని బొందెను. వీరుడగు లక్ష్మణు డెంత కోపము పూనినను నాతో నెట్టి పరుష వాక్యముగాని యప్రియమగు మాటనుగాని చెప్పినట్లు నేను వినియుండలేదు.

**విససర్జైకవేగేన పంచబాణశతాని యః ।**
**ఇష్వస్త్రేష్వధికస్తస్మా త్కార్తవీర్యాచ్చ లక్ష్మణః ॥**

**యన్మయా న కృతో రాజా రాక్షసానాం విభీషణః ।**
**తచ్చ మిథ్యా ప్రలప్తం మాం ప్రధక్ష్యతి న సంశయః ॥**

వేయి భుజములుగల కార్తవీర్యార్జును డొక్కమాటే నూఱు బాణములు ప్రయోగింప గలిగినను రెండే భుజములు గలిగియున్నను బాణప్రయోగ మునం దతని నోడింప జాలువాడు లక్ష్మణుడు. విభీషణుని రాక్షసరాజుగ జేసెదనని చేసిన నా ప్రతిజ్ఞ భంగమై నన్ను దహించుననుట నిస్సందేహము" అని పరిపరి విధములుగ శోకించినాడు రామచంద్రుడు.

(ఇచ్చట రామలక్ష్మణులు మూర్ఛిల్లుటయను గొప్ప విపత్తు సంభవించి నపుడు మహాపరాక్రమవంతులగు సుగ్రీవాదులును దుఃఖసాగరమున మునిగి యుండు తఱి వివేకశాలియగు విభీషణు డెట్లు వారి మనోదౌర్బల్యమును పోగొట్టి కార్యసాధనకు పురికొల్పెనో, మిత్రత్వము నెట్లు పాటించెనో, యుత్తమ మిత్రులెట్లు క్లిష్టసమయమున నొకరికొకరు తోడ్పడుదురో గుర్తించుట ముఖ్యము. లక్ష్మణుని జూచి రాముడాడిన వాక్యముల వలన లక్ష్మణుని యెడ రామున కెట్టి ప్రీతి, విశ్వాసము, సౌభ్రాత్రముండెనో తెలియుచున్నది. లక్ష్మణుని శ్రీరామ సేవాసంపద యెట్టిదో రామచంద్రుని వలననే వెల్లడియగు చున్నది. అన్నమాట లక్ష్మణు డెట్లు మీఱక ప్రవర్తించెననుట కింతకంటె గొప్ప నిదర్శన మేదికలదు? రామచంద్రుడు తన వెంట పిలుచుకొనివచ్చిన తమ్ముని పోగొట్టుకొనుట కంటె మించిన కష్టము, దుఃఖము వేరొండులేదని యుత్తమ గుణములతో తన్నెల్లప్పు డతి భక్తితో కొలుచుచుండు లక్ష్మణునివంటి సోదరుని మరణమునకు మించిన కష్టము సీతాదేవిని పోగొట్టుకొనుట వలన గూడ సంభవింపలేదని వగచెను. కార్తవీర్యుని మించిన పరాక్రమము గలవాడు లక్ష్మణు డనుటచే రామచంద్రుడు లక్ష్మణున కసాధ్య మెద్దియు లేదని దృఢముగ నమ్మియుండెనని తెల్లమగుచున్నది.)



సుగ్రీవుడు తన మామయగు సుషేణుని, రామలక్ష్మణులను, కొందఱు వానరులను దీసికొని కిష్కంధకు బొమ్మనినంతనే ఆ సుషేణుడు క్షీరసముద్రమున నున్న చంద్రము, ద్రోణము అను పర్వతములలో దేవతలు త్తమమూలికల నుంచియున్నా రనియు, వానిని దెచ్చుటకై హనుమంతుని వేగ బొమ్మనుమని చెప్పునంతలో గొప్ప కాంతితో ప్రకాశించు గరుత్మంతుడు రాగా సర్పము లన్నియు పాఱిపోయినవి. గరుత్మంతుడు రామలక్ష్మణుల నాపాదమస్తకము తడవి నంతనే వారు వజ్రకాయులై చేమోడ్చి గరుత్మంతుని సంస్తుతించి తమ కృతజ్ఞతను దెలుపగా నాతడు వారల కౌగిలించుకొని మీ యాపద యిట్టిదని విని మిమ్మీ నాగపాశము నుండి విడిపింపవచ్చి విడిపించితిని, మీరు జాగరూకతతో యుద్ధము చేసి జయము పొందుడని చెప్పి మరల వారిని కౌగిలించుకొని ప్రదక్షిణముచేసి యెగసి పోయెను.

వానరవీరుడగు నీలునిచే రావణుని సేనాధిపతియగు ప్రహస్తుడు హతు డగుటను విని శోకకోపములు పెనగొనగా రావణుడు స్వయముగ మహా వీరులతో రణరంగమునకు వచ్చెను. విభీషణుడు రామచంద్రునకు వచ్చిన వీరు లెవరో, యెట్టివారో చెప్పెను. లంకాధిపతి రాక్షసవీరుల నా యా స్థలములందుండి యుద్ధముచేయ నియమించి తాను సూర్యుని వలె ప్రకాశించుచు బాణ వర్షము గురిపించి వానరుల నొప్పింప వారు దీనులై

రామచంద్రు నాశ్రయింప నతడు ధనువు ధరించి యుద్ధమునకు బోవు సమయమున లక్ష్మణు డన్నకు మ్రొక్కి వినయముతో నిట్లు చెప్పెను.

**కామమార్యస్సుపర్యాప్తో వధాయాస్య దురాత్మనః ।**
**విధమిష్యామ్యహం నీచ మనుజానీహి మాం ప్రభో ॥**

"ప్రభూ! పరదారాపహారియగు ఈ దుర్బుద్ధిని వధించుటకు మీరెంతయు దగినవారే. కాని యిట్టి నీచునితో ఎదుట నిలిచి యుద్ధము చేయుట మీకు దగ దని నా భావము. నేను వీనిని వధింపగలను, వధించెదను. మీ యాజ్ఞలేక నే నెట్టి కార్యమును చేయదగదు. నాకు సర్వ స్వామియగు మీరు నా కనుజ్ఞయిండు' అని ప్రార్థించెను. అంత రామచంద్రుడు–

**గచ్ఛ యత్నపరశ్చాపి భవ లక్ష్మణ సంయుగే ।**
**రావణో హి మహావీర్యో రణేఽద్భుతపరాక్రమః ॥**

**త్రైలోక్యేనాపి సంక్రుద్ధో దుష్ప్రసహ్యో న సంశయః ॥**

**తస్య చ్ఛిద్రాణి మార్గస్య స్వచ్ఛిద్రాణి చ లక్షయ ।**
**చక్షుషా ధనుషా యత్నా ద్రక్షాఽత్మానం నమాహితః ॥**

లక్ష్మణా! రావణు డెట్టి నీచుడైనను నీవు యుద్ధమున జాగరూకతతో నుండుము, పొమ్ము, రావణుడు మహావీరుడు, యుద్ధమున అద్భుతమగు పరాక్రమము జూపువాడు. అత డలిగెనేని ముల్లోకము లెత్తివచ్చినను అతని నెదుర్కొన వీలుకాదు. అతని లోపము లెట్టివో వెదకి కనుగొనుము. నీవు లోపము లేకుండ వర్తింపుము. లోప మొకవేళ యున్నను దానిని కప్పిపుచ్చి ధనువుచే నిన్ను రక్షించుకొనుము' అని చెప్ప, లక్ష్మణు డన్నను గౌగిలించుకొని ప్రదక్షిణముచేసి నమస్కరించి బయలువెడలెను. ఇంతలో రావణుడు



హనుమంతుని మూర్ఛిల్లం జేసి నీలునితో యుద్ధము చేయ నాతడు రూపము హ్రస్వ మొనర్చి,

**ధ్వజాగ్రే ధనుషశ్చాగ్రే కిరీటాగ్రే చ తం హరిమ్ ।**
**లక్ష్మణో ఽథ హనూమాంశ్చ దృష్ట్వా రామశ్చ విస్మితాః ॥**

రావణుని ధ్వజాగ్రమునుండి ధనువుమొనకును, నచ్చట నుండి కిరీటాగ్రమునకు, లాఘవముగ దూకుటను గాంచి లక్ష్మణుడు, హను మంతుడు, రామచంద్రు డాశ్చర్యపడిరి, అగ్నేయాస్త్రమువలన నీలుడు నేలబడి మూర్ఛిల్ల రావణుడు లక్ష్మణునిమీది కురవడించెను, అప్పుడు లక్ష్మణుడు రావణుని జూచి–

**అభ్యేహి మామేవ నిశాచరేంద్ర న వానరాంస్త్వం ప్రతియోద్ధుమర్హః ॥**

'రాక్షసరాజా! నీవు వానరులతో యుద్ధముచేయ దగవు. నాతో యుద్ధమునకు రమ్ము అనినంత రావణుడు కోపముతో–

**దిష్ట్యాఽసి మే రాఘవ దృష్టిమార్గం**
**ప్రాప్తోంఽతగామీ విపరీతబుద్ధిః ।**
**అస్మిన్ క్షణే యాస్యసి మృత్యుదేశం**
**సంసాద్యమానో మమ బాణజాలైః ॥**

'రాఘవా! నీకు నాశమొందుకాలము సమీపించినందున నిట్టి విపరీతబుద్ధి పుట్టినది. అందుచే నీవు నా కదృష్టవశమున నా కంట బడితివి. ఈ క్షణమే నా బాణసమూహములచే నిన్ను యమపురికిం బంపెదను' అనెను. అందుకు లక్ష్మణుడు–

**రాజన్న గర్జంతి మహాప్రభావాః**
**వికత్థసే పాపకృతాం వరిష్ఠ**

**జానామి వీర్యం తవ రాక్షసేంద్ర**
**బలం ప్రతాపం చ పరాక్రమం చ ॥**
**అవస్థితోఽహం శరచాపపాణి ।**
**రాగచ్ఛ కిం మోఘవికత్థనేన ॥**

రాజా! గొప్ప ప్రభావము గలవారిట్లు గర్జింపరు. పాపిష్ఠులలో అగ్రగణ్యుడా! నిన్ను నీవే పొగడుకొనుచున్నావు. ఓ రాక్షసరాజా! విజనప్రదేశమున నొంటరిగా నున్న స్త్రీని భిక్షుకుని వేషమున అపహరించి తెచ్చిన నీ వీర్యము, బలపరాక్రమములు, ప్రతాపము నే నెఱుగుదును? నేను ధనుర్బాణముల ధరించి వచ్చియున్నాడను. వృథా మాటలేల? యుద్ధమునకు రమ్ము' అనెను. రావణ లక్ష్మణు లిరువు రనేక తీక్ష్ణ బాణములతో ఒకరి నొకరు నొప్పించుకొనగా రావణు డలిగి బ్రహ్మదేవు డిచ్చిన శక్తిని లక్ష్మణునిపై బ్రయోగించెను. లక్ష్మణు డద్దాని వారింప యత్నించినను అది యతని రొమ్మున నాటినంతనే లక్ష్మణుడు నేలబడి మూర్ఛిల్లెను. రావణు డతని తన బాహువులచే నెత్త బోయెను.

**హిమవాన్మందరో మేరు స్త్రైలోక్యం వా సహామరైః ।**
**శక్యం భుజాభ్యాముద్ధర్తుం న సంఖ్యే భరతానుజః ॥**

**శక్త్యా బ్రాహ్మ్యా హి సౌమిత్రి స్తాడితస్తు స్తనాంతరే ।**
**విష్ణోరచింత్యం స్వం భాగ మాత్మానం ప్రత్యనుస్మరత్ ॥**

**తతో దానవదర్పఘ్నం సౌమిత్రిం దేవకంటకః ।**
**తం పీడయిత్వా బాహుభ్యాం న ప్రభుర్లంఘనేఽభవత్ ॥**
**అథైనం వైష్ణవం భాగం మానుషం దేహమాస్థితమ్ ॥**

పర్వతరాజగు హిమవంతమునుగాని, మందరపర్వతమునుగాని, మేరు పర్వతమునుగాని, దేవతలతో గూడిన ముల్లోకములనుగాని భుజబలముచే



నెత్త సాధ్యమగునుగాని రణరంగమున భరతుని తమ్ముడగు లక్ష్మణుని ఎత్తుటకు వీలుకాదు. బ్రహ్మసంబంధమగు శక్త్యాయుధము తన్ను రొమ్మున గాడినంతనే యిట్టిదట్టిదని చింతింపనలవిగాని విష్ణ్వంశమగు స్వరూపమును లక్ష్మణుడు స్మరించెను. అంత దేవకంటకుడగు రావణుడు దానవగర్వమును నాశము చేయు మానవరూపములో నున్న వైష్ణవభాగమగు లక్ష్మణుని బాహువులచే పీడించి యత్నించినను లేవనెత్త జాలడయ్యె.

**అథ వాయుసుతః క్రుద్ధో రావణం సమభిద్రవత్ ।**
**ఆజఘానోరసి క్రుద్ధో వజ్రకల్పేన ముష్టినా ॥**

**తేన ముష్టిప్రహారేణ రావణో రాక్షసేశ్వరః ।**
**జానుభ్యామపతద్భూమౌ చచాల చ పపాత చ ॥**

తరువాత హనుమంతుడు కోపించి వజ్రము వంటి తన ముష్టితో రావణుని రొమ్మున నొక్క గ్రుద్దు గ్రుద్దెను, ఆ దెబ్బకు రావణుడు మోకాళ్లపై బడి మూర్ఛిల్లినవాడయ్యె.

**హనూమానపి తేజస్వీ లక్ష్మణం రావణార్దితమ్ ।**
**ఆనయద్రాఘవాభ్యాశం బాహుభ్యాం పరిగృహ్య తమ్ ॥**
**తం పీడయిత్వా బాహుభ్యాం న ప్రభుర్లంఘనేఽభవత్**

**వాయుసూనోస్సుహృత్త్వేన భక్త్యా పరమయా చసః ।**
**శత్రూణామప్రకంప్యోఽపి లఘుత్వమగమత్కపేః ॥**

రావణునిచే కొట్టుబడి మూర్ఛిల్లిన లక్ష్మణుని తేజోవంతుడగు హనుమంతుడు రామచంద్రునియొద్దకు చేతులతోనెత్తి తెచ్చెను. లక్ష్మణుడు శత్రువులకు గదలింపను గూడ నలవిగాని వాడయినను స్నేహభావము చేతను, మిక్కిలి భక్తిగలవా డగుటచేతను హనుమంతునకు తేలిక యయ్యెను.

('ధైర్యేణ హిమవా నివ' అని ధీరుల కుపమానముగ జెప్పబడునది హిమాలయము. ఎట్టి గాలివానకేనియు చలింపనిది, లోకములో నన్ని పర్వత ములకంటె నెత్తైనది. దాని నెత్తుటకు దగిన శక్తి గలవారు రావణుడు. కైలాసమును గదల్చినవాడు. సముద్రములలో నుత్తమమగు క్షీరసముద్రమును గలచిపుచ్చినది మందర పర్వతము. దానిని సులభముగ నెత్తగలవాడు రావణుడు. పర్వతములలో శ్రేష్ఠమనబడు మేరుపర్వతమును అతడవలీలగ నెత్తజాలువాడు. కాని అట్టి బలవంతులలో మేటియగువానికి మానవుడగు లక్ష్మణునెత్తుటకు వీలుగాకుండె ననుటలో నేదో గొప్ప విశేషమున్నదని యెంచవలెను. విష్ణుదేవుని యనంత కల్యాణగుణములలో సౌలభ్య మొక్కటి. భక్తులపట్లతడు సులభు డగుట నిజము. శత్రులయెడ నట్లగునా? విష్ణ్వంశమే కదా లక్ష్మణుడు. అతనియం దెంతమాత్రము భక్తి లేని ద్వేషులకు తన ప్రభావమును తెలిపెను. రాముని చతుర్భాగము నుద్ధరింపలేని రావణుడు రాముని యుద్ధమున గెలుచుట యెట్లు? రాబోవు అపజయమును సూచించుట కిది యొక నిదర్శన మగుటయే గాక తనను మించిన బలాఢ్యు డెవడను రావణుని గర్వమును భంగపఱచినట్లును గ్రహింపనగును. భక్తిమూలమున భగవంతుని వశపఱచుకొన వీలగునుగాని విరోధముచే నతని సాధింప నెవరికిని వీలుగాదని సుస్పష్టమగుచున్నది.

## ఇంద్రజిత్తుతో మొదటి యుద్ధము

రావణు డతికాయుని యుద్ధమునకు బంపగా వాని యమోఘ బాణవర్షమునకు వానరువీరు లెల్లరు భయపడుట గాంచి లక్ష్మణు డతనితో దివ్యాస్త్ర ప్రయోగము చేసి యుద్ధ మొనర్చినను అతనిని జయింపరాని సందర్భమున వాయుదేవుని ప్రేరణమున లక్ష్మణు డతనిపై బ్రహ్మాస్త్రము ప్రయోగించి యతనిని వధించెను. ఈ వృత్తాంతము దెలిసిన రావణు డంతః పురమున శోకించుచుండ నింద్రజిత్తు తండ్రి కభయమిచ్చి యుద్ధమునకు బయలుదేరి అభిచారహోమము చేసినంత అగ్నినుండి ధనువును బాణములును రథమును అశ్వమును సారథిని బ్రహ్మాస్త్రమునుపొంది ఆకాశమున నంతర్హితుడై హనుమంతుని. సుగ్రీవుని, అంగదుని, గంధమాదనుని, జాంబవదాదు లెల్లరను మిక్కిలి నొప్పించెను. రాముడు లక్ష్మణుని జూచి తమ్ముడా! వీనితో యుద్ధము చేయుట కష్టము. వీని బాణపాతముల కోర్చియుండుము అనునంతలో ఇంద్రజిత్తు వీరిరువురను మూర్ఛిల్ల జేసెను. విభీషణుడు చాల చింతించి వెదకి జాంబవంతుని కనుంగొనగా, నతడు హనుమంతుడు జీవించియున్నాడా యని యడుగ విభీషణుడు,

**ఆర్యపుత్రావతిక్రమ్య కస్మా త్పృచ్ఛసి మారుతిమ్ ।**
**నైవ రాజని సుగ్రీవే నాంగదే నాఽపి రాఘవే ।**
**ఆర్య సందర్శితస్నేహో యథా వాయుసుతే పరః ॥**

జాంబవంతునితో 'అయ్యా! రామలక్ష్మణుల విడిచి హనుమంతునిగూర్చి యడుగనేల? నీ రాజగు సుగ్రీవునందుగాని, యువరాజగు అంగదునియందు గాని, రామచంద్రునియందుగాని లేని స్నేహమును హనుమంతునియందు జూపనేల? యనెను. అందుకు జాంబవంతుడు విభీషణునితో–

**తస్మిన్ జీవతి వీరే తు హతమప్యహతం బలమ్ ।**
**హనూమత్యుజ్ఝితప్రాణే జీవంతోఽపి వయం హతాః ॥**

**ధరతే మారుతిస్తాత మారుతప్రతిమో యది ।**
**వైశ్వానరసమో వీర్యే జీవితాశా తతో భవేత్ ॥**

వీరుడగు హనుమంతు డొక్కడు జీవించియుండెనా మన సైన్య మంతయు హతమైనను నష్టములేదు. నాయనా! వాయుదేవునివంటి వాడేయగు హనుమంతుడు వీర్యమున అగ్నితుల్యుడై జీవించియుండిననే మాకు జీవితమం దాశకలుగును అనెను'. హనుమంతుడు జాంబవంతుని పాదములం బట్టుకొని నమస్కరించి 'నేను హనుమంతుడను' అని యభివాదము చేసినపుడు జాంబవంతుడు మరల తాను జన్మించినట్లెంచి హనుమంతునితో-

**గత్వా పరమమధ్వాన ముపర్యుపరి సాగరమ్ ।**
**హిమవంతం నగశ్రేష్ఠం హనుమన్ గంతు మర్హసి ॥**

**తతః కాంచనమత్యుచ్చ మృషభం పర్వతోత్తమమ్ ।**
**కైలాసశిఖరం చాపి ద్రక్ష్యస్యరినిషూదన ॥**

**తయోశ్శిఖరయో ర్మధ్యే ప్రదీప్తమతులప్రభమ్ ।**
**సర్వౌషధియుతం వీర ద్రక్ష్యస్యోషధిపర్వతమ్ ॥**

**మృతసంజీవనీం చైవ విశల్యకరణీమపి ।**
**సావర్ణ్యకరణీం చైవ సంధానకరణీం తథా ॥**

నీవు సముద్రముమీదుగా బహుదూరముపోయి హిమవంతమను పర్వత రాజ్యమునకుబొమ్ము. అచ్చట మిక్కిలి యున్నతమై, బంగారు మయమైన ఋషభపర్వతమును, కైలాసశిఖరమును జూతువు. వీరా! వానిమధ్య మిక్కిలి



కాంతితో వెలుగు సకలోషధులతో నిండిన ఓషధిపర్వతము జూతువు అందు వెలుగుతోగూడిన నాలుగోషధులుగలవు. అవి యేవియన 1. మృతసంజీవని, 2. విశల్యకరణి, 3. సావర్ణ్యకరణి, 4. సంధానకరణి. వీనిగొని నీవతిశీఘ్రముగ రావలె ననెను. అంజనేయు డట్లే ఓషధిపర్వమున వెదకెనుగాని యా మూలిక లగపడనందున ఆపర్వతమును పెల్లగించి విష్ణుదేవుడు చక్రాయుధము ధరించివచ్చు నట్లాపర్వతము గొనివచ్చెను. త్రికూటపర్వతమున వానరులమధ్య దాని నుంచి వానరులకు నమస్కరించి విభీషణుని కౌగిలించుకొనెను. ఆ యోషధులవాసన సోకినంతనె రామలక్ష్మణులు విశల్యులైరి. సంధానకరణి వలన నొప్పులు మాయమయ్యె. సావర్ణ్యకరణి వలన వర్ణభేదమైనను లేక నిద్ర లేచిన వారివలె నుండిరి. రాక్షసులు హతులైనవారి నప్పు డప్పుడు సముద్రమున ద్రోయుచుండినందున వారి కిట్టి లాభము గలుగలేదు. మరల హనుమంతు డా పర్వతమును హిమాలయమున జేర్చి రామునితో గలసికొనెను.

## ఇంద్రజిత్తుతో రెండవ యుద్ధము

రాముడు మకరాక్షుని వధించె నని వినిన రావణుడు ఇంద్రజిత్తును యుద్ధమునకు బోవ నాజ్ఞాపించినంతనే వాడు మరల ఆభిచారిక హోమము చేసి దాని వలన పొందిన అంతర్ధానశక్తితో గూడిన యుత్తమరథమును నాలుగశ్వములతోను, పెనువింటితోను, తీక్ష్ణములయిన వివిధబాణముల తోను గూడిన దాని నెక్కి వివిధబాణములతో రామలక్ష్మణులను మిక్కిలి నొప్పించుచు ఘోరయుద్ధము చేయుచుండ, వానరులు దిక్కుతోచక నలుదిక్కులకు చెదరి పోవుటను గని లక్ష్మణుడు కుపితుడై రామునితో–

**బ్రాహ్మమస్త్రం ప్రయోక్ష్యామి వధార్థం సర్వరక్షసామ్ ।**

'నే నిప్పుడు సకల రాక్షస వినాశము కొఱకు బ్రహ్మాస్త్రము ప్రయోగించెద' ననియె. అంత రామచంద్రుడు లక్ష్మణునితో–

**నైకస్య హేతో రక్షాంసి పృథివ్యాం హంతు మర్హసి ॥**

**అయుధ్యమానం ప్రచ్ఛన్నం ప్రాంజలిం శరణాగతమ్ ।**
**పలాయంతం ప్రమత్తం వా న త్వం హంతు మిహార్హసి ॥**

**అస్యైవ తు వధే యత్నం కరిష్యావో మహాబల ।**
**ఆదేక్ష్యావో మహావేగా నస్త్రానాశీవిషోపమాన్ ॥**

**తమేనం మాయినం క్షుద్ర మంతర్హితరథం బలాత్ ।**
**రాక్షసం నిహనిష్యంతి దృష్ట్వా వానరయూథపాః ॥**

**యద్యేష భూమిం విశతే దివం వా**
**రసాతలం వా పి నభస్థ్సలం వా।**
**ఏవం నిగూఢోఽపి మమాస్త్రదగ్ధః**
**పతిష్యతే భూమితలే గతాసుః॥**

'నాయనా! ఒకనికొఱకు లోకములోని రాక్షసులనందరిని వధింపరాదు. యుద్ధముచేయక ఊరకుండువానిని, యుద్ధమునకు భయపడి దాగియున్న వానిని, భయముచే అంజలిబద్ధు డగువానిని, నీవే నన్ను రక్షింపవలెనని శరణుజొచ్చిన వానిని, యుద్ధమునకు భయపడి దాగియున్న వానిని, భయముచే అంజలిబద్ధు డగువానిని, నీవే నన్ను రక్షింపవలెనని శరణు జొచ్చిన వానిని, యుద్ధము నుండి భయపడి పరుగెత్తువానిని, యేమఱు పాటుననున్న వానిని నీవు చంపరాదు. మహాబలుడా! ఈ యింద్రజిత్తునే వధింప ప్రయత్నింతము. క్రూరసర్పముల వంటి తీక్ష్ణబాణముల నితనిపై ప్రయోగింతము. మాయావి యగుట రథముతో నంతర్హితుడగు వీనిని వానరు లెట్లయినను గనిపెట్టి వధింతురు. ఈ రాక్షసుడు భూమిలోనికి జొచ్చినను, ఆకాశమున నంతర్హితు డైనను, పాతాళ లోకమునకు బోయినను, ఆకాశమున కెగసినను, ఇట్లెచ్చట దాగియున్నను నా బాణప్రయోగముచే నా బాణములకు గురియై నేల గూలును అనెను.

(ఇంద్రజిత్తుయొక్క యుద్ధవైఖరియు నతని మాయా యుద్ధకౌశలమును అతడు తండ్రిని మెప్పించువిధమును ఆశ్చర్యజనకములని చెప్పనేల? జాంబవంతుడు హనుమంతుని గుట్టునట్టు తెలిసి అతని ప్రభావ మసదృశమని విభీషణునితో జెప్పిన మాట ముమ్మాటికి సత్యమని ఇంద్రజిత్తు బాణములచే గొట్టుపడి మూర్ఛిల్లిన రామలక్ష్మణులను సంజీవపర్వతము దెచ్చి యెప్పటియట్ల తేజోవంతుల గావించుటయు నోషధుల గంధ మాఘ్రాణించినందున చచ్చిన వానరులు లేచుటయు గాయమునొందిన వారెల్లరు బాధతొలగి యుద్ధోత్సాహు లగుటయు వేనోళ్ళ జాటుచున్నవి. సర్వరాక్షసనిర్మూలము గావింప లక్ష్మణుడు బ్రహ్మాస్త్రము ప్రయోగించెదనని చెప్పినపుడు రాముడు నిషిద్ధముల వివరించి తమ్ము నాశ్వాసించుటయు జూడ ఆయా సమయానుకూలముగ పిన్న పెద్దలొకరి కొకరు హితము

బోధించుట అత్యావశ్యకమని తెలియుచున్నది. సీతాహరణ సమయమున ధర్మదేవత సాయము చేయలేదని యలిగి రామచంద్రుడు లోక వినాశకరమగు బాణప్రయోగము చేయ సిద్ధముగ నుండినపుడు లక్ష్మణు డతని నతివినయముతో శాంతింపజేసెను. అట్లే సముద్రుని మీద కోపము పూనిన రామచంద్రునికోపమును లక్ష్మణుడు శాంత మొనర్చెను. మానవమనోభావ మప్పటి కప్పుడు మార్పులు చెందుచుండునని గొప్ప ధీమంతులును ప్రమాదము గలిగింప సాహసింతురనియు అట్టి సమయమున, వారి యాగ్రహమును వారించి లోకహితము గలిగించువారే యుత్తములని విస్పష్ట మగుచున్నది.

మాయాసీతను తన ముందట నింద్రజిత్తు చంపెనని రామునితో హనమంతుడు చెప్పినపుడు రాముడు మూర్ఛిల్లెను. లక్ష్మణు డతనినెత్తి కౌగిలించుకొని సహేతుకముగా నతనితో–

**శుభే వర్త్మని తిష్ఠంతం త్వామార్య విజితేంద్రియమ్ ।**
**అనర్థేభ్యో న శక్నోతి త్రాతుం ధర్మో నిరర్థకః ॥**

ఆర్యా! పితృవాక్యపరిపాలనమను ధర్మమున దృఢముగ నిలిచి నీ చేతి కందిన రాజ్యమును బోగొట్టిన కైకేయీ దశరథుల విషయమున ఎట్టి కాలుష్యము చెందని నిర్మలమనుస్కుడ వగుటచే నీవు సకలేంద్రియముల జయించిన దిట్టవు. లోకమున కుందేటికొమ్మొకటి యుండునట్లు వ్యవహారమే కాని దానిం జూచిన వాడు లేడు. అనగా నట్టిది లోకమున నిజముగ లేదని తెలియుచున్నారు. అట్లే ధర్మమనున దొకటి యున్నట్లు లోకు లనుకొను చున్నారు. కాని నిజముగ ధర్మ మనునది లేదనియే చెప్పవలెను. అది నిజముగనే యున్నచో అది యేల నిన్నిట్టి సమయమున రక్షింపకున్నది?

**భూతానాం స్థావరాణాం చ జంగమానాం చ దర్శనమ్ ।**
**యథాఽస్తి న తథా ధర్మ స్తేన నాస్తీతి మే మతిః ॥**



ధర్మాధర్మములు లేవని యెట్లుచెప్పవచ్చును? ప్రత్యక్షమా? అనుమానమా? శబ్దమా? వీనిలో దేనిని ప్రమాణముగ గొని యిట్లు చెప్పుచున్నావందువా? వినుము. లోకమున జంగమస్థావర రూపమగు వస్తువులు కంటి కగపడుటచే నవి ప్రత్యక్షప్రమాణముచే నున్నవని చెప్పవచ్చును. ధర్మమును, అధర్మమును నిట్లు కనబడవు. కనుక నవి లేవనుట నా యభిప్రాయము.

**యద్యధర్మో భవేద్భూతో రావణో నరకం వ్రజేత్ ।**
**భవాంశ్చ ధర్మయుక్తో వై నైవం వ్యసనమాప్నుయాత్ ॥**

అనుమానముచే ధర్మాధర్మము లున్న వందుమా? అధర్మమునే యాచరించు రావణునకు దుఃఖమును, ధర్మమునే యాచరించు నీకు సుఖమును గలుగవలెనుగదా!

**తస్య చ వ్యసనాభావా ద్వ్యసనం చ గతే త్వయి ।**
**ధర్మో భవత్యధర్మశ్చ పరస్పరవిరోధినౌ ॥**

అధర్మ మాచరించువానికి వ్యసనము లేక సుఖము గలుగుటయు, ధర్మ మాచరించు నీకు దుఃఖము గలుగుటయు జూడ ధర్మాధర్మములకు విపరీత ఫలములు గలుగుటవలన ధర్మాధర్మఫలములు పరస్పర విరోధము గలిగియున్న వని తెలియుచున్నది.

**యస్మాదర్థా వివర్ధంతే యేష్వధర్మః ప్రతిష్ఠితః ।**
**క్లిశ్యంతే ధర్మశీలాశ్చ తస్మాదేతౌ నిరర్థకౌ ॥**

అధర్మ మనుసరించు వారి కర్థవృద్ధియగుచు సుఖము గలుగుటయు, ధర్మ మనుష్ఠించువారికి దుఃఖమే కలుగుచున్నది. ఇట్లు సుఖమును బట్టి ధర్మ మున్నదనియు, దుఃఖమునుబట్టి యధర్మమున్నదనియు నిర్ణయింప

వీలుకానందున అనుమానము చేతను ధర్మాధర్మనిర్ణయముచేయ వీలుకాదని తెలియుచున్నది.

**వధ్యంతే పాపకర్మాణో యద్యధర్మేణ రాఘవ ।**
**వధకర్మహతో ధర్మ స్స హతః కం వధిష్యతి ॥**

రాఘవా! పాపకార్యములు చేయువారు అధర్మముచే బాధింపబడుదు రనియు, పుణ్యకర్ములు ధర్మముచే సుఖింతు రనియు జెప్పినచో వధయను కర్మ రూపమగు అధర్మమును సుఖితరూపమగు ధర్మమును మూడు క్షణములే యుండి నశించునందురు. (శబ్దము, బుద్ధి, కర్మ మూడు క్షణములు మాత్ర ముండునని శాస్త్రము.) ఇట్టి క్షణికమగు ధర్మాధర్మము లెవరి కెట్టి ఫలమొసగ వని యేర్పడుటచే శబ్దప్రమాణమును సరికాదని నా మతము.

**అథవా విహితేనాయం హన్యతే హంతి వా పరమ్ ।**
**విధిరాలిప్యతే తేన న స పాపేన కర్మణా ॥**

కర్మములు క్షణమున నశించినను ఆ కర్మములచే నారాధింపబడుటయే ఫలమునిచ్చువంటివా? ఈ పురుషు డా దైవము బాధపడువాడుగను, బాధించు వాడుగను అగునందువా? పుణ్య పాపకర్మముల జేయించు దైవమేపాప ఫలమగు దుఃఖమును, పుణ్యఫలమగు సుఖమును బొందవలె గాని ఆ యా కర్మమును జేయువాడు పొందవలెననుట పొసగదు. రాజు చేయించుకార్యముల ఫలములు రాజును చెందునుగాని దానిని చేయు భటుని చేరవని చెప్పనగును. ధర్మాధర్మముల ఫలమగు సుఖదుఃఖముల నిచ్చునది దైవమే యనుటయు జెల్లదు.

(ఒకరాజు స్వతంత్రుడై లీలార్థము తానొక మర్యాదను విధించి దాని ననుసరించువారి ననుగ్రహించి, దాని నుల్లఘించువారిని నిగ్రహించునట్లే ఈశ్వరుడు తన యాజ్ఞయగు కర్మము ననుష్ఠించు వానిని అనుగ్రహించుచు



తనయాజ్ఞల నుల్లంఘించువానిని నిగ్రహించుచున్నాడు. అట్లుచేయుట స్వార్థమా? పరమార్థమా? అను ప్రశ్న పుట్టును. స్వార్థమనినచో అవాప్త సమస్తకామున కేది కోరదగినది? ఏదియు లేదు. కనుక స్వార్థమనుట యుక్తముగాదు, పరార్థమనిన ఒకనిని విరించునిని, మఱియొకనిని అకించనుని చేయదగునా? అట్లుచేయుటచే నీశ్వరునకు పక్షపాత నైర్ఘృణ్యదోషము లేర్పడును. ఈశ్వరుడు చేతనులకు వారి వారి కర్మానుగుణముగ సుఖదుఃఖఫలము లిచ్చునట్టి ధర్మాధర్మవర్తనమున ప్రవేశము గలిగించునందుమా? చేతనుల ధర్మము ననుష్ఠింప జేయక అధర్మము ననుష్ఠింపజేసిన నతనికి నిరయత్వదోష మంటగట్టినట్లగును. అట్లు గాక అనాదికాలముగ వచ్చుచుండు కర్మప్రవాహము వలన సదసత్కర్మలలో బ్రవేశింప జేయుననినచో ఒకనికి నియతముగా దుఃఖమును, ఒకనికి నియతముగా సుఖమును గలుగవలయును గదా? అట్టి నియమము కనబడలేదు.)

**అథవా దుర్బలః క్లీబో బలం ధర్మోఽనువర్తతే ।**
**దుర్బలో హృతమర్యాదో న సేవ్య ఇతి మే మతిః ॥**

పౌరుషముయొక్క సహాయ మపేక్షింపక స్వతంత్రించి ఫలమిచ్చు శక్తి లేని ధర్మము దుర్బల మగుటచే దానినే యనుసరించుట యుక్తముగాదని నాయభిప్రాయము.

**హర్షః కామశ్చ దర్పశ్చ ధర్మః క్రోధశ్శమో దమః ।**
**అర్థాదేతాని సర్వాణి ప్రవర్తంతే నరాధిప ॥**

రాజా! సంతోషము కామము గర్వము ధర్మము కోపము అంతరింద్రియ నిగ్రహము బహిరింద్రియ నిగ్రహము మొదలగునవి యన్నియు రెండవ పురుషార్థమగు అర్థమువలననే కలుగును.

**త్వయి ప్రవ్రాజితే వీర గురోశ్చ వచనే స్థితే ।**
**రక్షసాపహృతా భార్యా ప్రాణైః ప్రియతరా తవ ॥**

తండ్రిమాటను పాటించుటే ధర్మమని అర్థమునకు మూలకారణం బగు రాజ్యమును విడిచి వనమునకు వచ్చినందున నీ ప్రాణమున కంటె నీకు మిక్కిలి ప్రియురాలగు నీ భార్యను రాక్షసుడగు రావణు డపహరించెను.

**ఉత్తిష్ఠ నరశార్దూల దీర్ఘబాహో దృఢవ్రత ।**
**కిమాత్మానం మహాత్మాన మాత్మానం నావబుధ్యసే ॥**

పురుషతిలకా! ఆజానుబాహూ! దృఢవ్రతా! లెమ్ము. బుద్ధిమంతులలో నగ్రగణ్యుడవగు నీవు నిన్ను పరమాత్మయని యేల యెరుగకున్నావు?

**అయమనఘ తవోదితః ప్రియార్థం**
**జనకసుతానిధనం నిరీక్ష్య రుష్టః ।**
**సహయగజరథాం సరాక్షసేంద్రాం**
**భృశమిషుభిర్వినిపాతయామి లంకామ్ ॥**

అనఘా! నీకు ప్రియముచేయుకొఱకే జన్మించిన వాడనగు నే నిప్పుడే సీతాదేవి వధమును గూర్చి విని నీకు గలిగిన దుఃఖము వలన కుపితుడనై గుఱ్ఱములతోను, ఏనుగులతోను, రథములతోను, రాక్షసరాజగు రావణుని తోను గూడ నీ లంకను బాణసమూహములతో గూల్చెదను అనెను.

(ఇచ్చట లక్ష్మణుడు సర్వశేషియగు భగవంతునిప్రీతికొఱ కాతనియాజ్ఞ బొంది యతనికైంకర్యము చేయుటే చేతనుని (శేషభూతుని) స్వధర్మమని పరమ ధర్మమని, ఆదిశేషుడు తానే యగుటచే లోకములోని శేషభూతులకెల్ల నాదర్శప్రాయుడై తా నాచరించి, లోకుల నాచరింప జేయుటచే ఆచార్య స్థానము వహించి చేతనుల నుజ్జీవింప జేయుచున్నాడని గ్రహింపవలెను.)



ఇంతలో విభీషణు డచ్చటికి వచ్చి రాముని శోకమునకు గారణ మరసి రామునితో–

**యాచ్యమానస్సుబహుశో మయా హితచికీర్షుణా ।**
**వైదేహీముత్సృజస్వేతి న చ తత్కృతవాన్ వచ ః ॥**

**నైవ సామ్నా న దానేన న భేదేన కుతో యుధా ।**
**సా ద్రష్టుమపి శక్యేత నైవ చాన్యేన కేనచిత్ ॥**

రాజోత్తమా! హనుమంతునియెదుట జరిగిన దంతయు ఇంద్రజిత్తు యొక్క మాయాకార్యమేగాని అందెంతమాత్రము సత్యము గానరాదు. నేను రావణుని మేలుగోరినవాడనై వైదేహిని రామునకిచ్చివేయు మని యెన్ని విధముల వేడినను సమ్మతింపని వా డామెనెట్లు వధింపనెంచును? సామోపాయమునగాని, దానోపాయమునగాని, భేదోపాయమునగాని యామెను జూచుటకేని శక్యము కాదే. ఆమె నింద్రజిత్తు వధించుట కాత డెంతమాత్ర మంగీకరింపడు.

**తదియం త్యజ్యతాం చింతా శత్రుహర్షవివర్ధనీ ।**
**ఉద్యమః క్రియతాం వీర హర్షస్సముపసేవ్యతామ్ ॥**

రాఘవా! శత్రువులసంతోషము వృద్ధిపఱచి మన సైన్యమునకు దుఃఖము గలిగించు నీ శోకమును విడువుము. నీవు ఉత్సాహము పూని తగు ప్రయత్నము చేయుము.

**తేన వీరేణ తపసా వరదానాత్స్వయంభువః ।**
**అస్త్రం బ్రహ్మశిరః ప్రాప్తం కామగాశ్చ తురంగమా ః ॥**

**స ఏష సహ సైన్యేన ప్రాప్తః కిల నికుంభిలామ్ ।**
**యద్యుత్తిష్ఠేత్కృతం కర్మ హతాన్ సర్వాంశ్చ విద్ధి నః ॥**

ఇంద్రజిత్తు నికుంభిలాయాగము పూర్తిచేసి బ్రహ్మదేవుని వరముచే బ్రహ్మశిరోనామకాస్త్రము కామగమనములగు నశ్వములు రథము వీనితో మరలి వచ్చి నంతనే మనమందఱము చచ్చినవారమని తెలిసికొనుము.

**సాధ్వయం యాతు సౌమిత్రి ర్బలేన మహతా వృతః ।**
**నికుంభిలాయాం సంప్రాప్య హంతుం రావణిమాహవే ॥**

ఇంద్రజిత్తు హోమము పూర్తి చేయకమునుపే వానిని వధించునిమిత్తము గొప్ప సేనతో లక్ష్మణుని బంపుము అనెను. అంత రామునునుజ్ఞ గైకొని లక్ష్మణుడు వినయముతో–

**సోఽభివాద్య గురోః పాదౌ కృత్వా చాపి ప్రక్షిణమ్ ।**

అన్నకు ప్రదక్షిణముచేసి యతని పాదములకు నమస్కరించి బయలు వెడలెను. విభీషణు డచ్చట లక్ష్మణుని జూచి–

**జహి వీర దురాత్మానం మాయాపరమధార్మికమ్ ।**
**రావణిం క్రూరకర్మాణం సర్వలోకభయావహమ్ ॥**

'వీరా! దురాత్ముదును, మాయావియు, మిక్కిలి యధర్మము నాచరించు వాడును, గ్రూరస్వభావుడును, లోకమున కంతయు భయము గలిగించువాడు నగు ఇంద్రజిత్తును చంపుమనెను. తన గుట్టుమట్టులను శత్రువులకు జెప్పి తన్ను వధింపజేయ వచ్చిన విభీషణుని ఇంద్రజి త్తనేక విధములుగ దూషింప లక్ష్మణు డతనితో వీరాలాపములాడుచు బాణవర్షములచే వాని ననేక విధముల నొప్పించియు వాడు చావకుండినందున వాని గుఱ్ఱములను సారథిని రథమును నాశ మొందించెను. వాడు మరల వేరొక రథమునెక్కి వచ్చి ఘోరయుద్ధము చేయ లక్ష్మణుడు–

**ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది ।**
**పౌరుషే చాప్రతిద్వంద్వ శ్శరైనం జహి రావణిమ్ ॥**



బాణమా! దశరథమహారాజుయొక్క పుత్రుడగు రామచంద్రుడు ధర్మ స్వభావుడును, సత్యసంధుడును, పౌరుషమున సాటిలేనివాడునగునేని రావణుని కుమారుడగు ఈ ఇంద్రజిత్తును వధింపుము' అనినంతనె యా బాణ మింద్రజిత్తు శిరమును ఖండించి నేల బడద్రోసినది.

**అథాంతరిక్షే దేవానా మృషీణాం  చ మహాత్మనామ్ ।**
**అభిజజ్ఞే చ సన్నాదో గంధర్వాప్సరసామపి ॥**

ఇట్లింద్రజిత్తు మరణించినంతనే దేవతలు, ఋషులు మిక్కిలి హర్షించిరి. దేవదుందుభులు మ్రోగినవి. అప్సరసలు నాట్యమాడిరి, సకల లోకము సంతోషమందెను.

రామరావణ యుద్ధములో రావణునిచే ప్రయోగింపబడిన శక్త్యా యుధము రొమ్మున నాటుకొనుటచే లక్ష్మణుడు నేలబడి మూర్ఛిల్ల రామచంద్రుడు దుఃఖసాగరమున మునిగినవాడై–

**దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః ।**
**తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః ॥**

ఏ దేశమునకు వెళ్ళినను భార్యలనేకుల బడయనగును. దేశ దేశములలో బంధువు లనేకులు లభింతురు. కాని తోడబుట్టిన తమ్ముడు దొరకునట్టి దేశము మాత్ర మెచ్చటను గానరాదు.

(ఆలోచించిచూడగా నొకనికి భార్యయని చెప్పుకొన దగు కన్య లభించుట ఏ ప్రదేశమునైనను జూతుముగాని 'నా తల్లి, నా తండ్రి. నా యన్న, నా తమ్ముడు, నా అక్క, నా చెల్లెలని చెప్పుకొన దగిన వారినెందేని కాన గలమా? వివాహమైనంతనె భార్యయే ప్రపంచమని యెంచి తల్లిదండ్రులు, తో బుట్టువులు మున్నగువారి ననాదరణచేయువారి కింతకంటె సదుపదేశ మెందుగలదు?)

సుషేణుని పంపున హనుమంతు డోషధిపర్వతము తెచ్చినంత సుషేణుడు మూలికలను నలిపి రసమును లక్ష్మణుని ముక్కున పిడిచినంతనే లక్ష్మణుడు తెలివి పొంది లేచినపుడు రాము డతనిని ప్రేమమీఱ గట్టిగ కౌగిలించుగొని,

**దిష్ట్యా త్వాం వీర పశ్యామి మరణాత్ పునరాగతమ్ ।**
**న హి మే జీవితేనార్థస్సీతయా చాపి లక్ష్మణ ॥**

**కో హి మే విజయేనార్థస్త్వయి పంచత్వమాగతే ।**

వీరా! లక్ష్మణా! నా యదృష్టవశమున మరణించినట్టి నిన్ను పునర్జీవితునిగ జూచుచున్నాను. నీవు మరణించియుండినచో నేను బ్రతికియు ప్రయోజనము లేదు. సీత వలనను ప్రయోజనముండదు. నేను యుద్ధములో జయము పొందియు నేమి యుపయోగము? అని నంతనే లక్ష్మణు డన్నతో మాటలు తడబడ–

**అహం తు వధమిచ్ఛామి శీఘ్రమస్య దురాత్మనః ।**
**యావదస్తం న యాత్యేష కృతకర్మా దివాకరః ॥**

**యది వధమిచ్ఛసి రావణస్య సంఖ్యే**
**యది చ కృతాం త్వమిహేచ్ఛసి ప్రతిజ్ఞామ్ ।**
**యది తవ రాజవరాత్మజాభిలాషః**
**కురు చ వచో మమ శీఘ్రమద్య వీర ॥**

'అన్నా! ఈ దుర్మార్గు డగు రావణుని నీవు సూర్యాస్తమయమునకు మునుపే శీఘ్రముగ వధింపవలెనని నేను కోరుచున్నాను. వీరా! నీవు యుద్ధమున రావణుని వధింప గోరితివేని, నీవు విభీషణునకు జేసిన ప్రతిజ్ఞ నెఱవేర్ప నెంచితివేని, నీవు జనకమహారాజు కూతురగు సీతాదేవిని పొంద గోరుదువేని, శీఘ్రముగ నామాట పాటింపుము అనెను.



(లక్ష్మణుడు తనకెట్టి దురవస్థ సంప్రాప్తమైనను ప్రజ్ఞమాత్ర మున్నచో రామునిశ్రేయమునకు కీర్తికి సుఖమునకు తగు వచనములనే పలుకుననియు నట్టి కార్యములే చేయు ననియు నన్యచింత యతని మనసున నెప్పుడు ప్రవేశింప దనియు ముమ్మాటికి నొక్కి చెప్పవచ్చునని తెలియుచున్నది.)

రావణవధానంతరము సీతాదేవి రాముని సన్నిధానమునకు వచ్చినపు డత డామె ననేకవిధములుగ పరుషవాక్యములాడి మహాజనమధ్యమున నామె పాతివ్రత్యమును సందేహించి పలికిన ములుకుల వంటి పలుకులు విని సహింపలేక సీతాదేవి దీనుడై నిలుచున్న లక్ష్మణునివంక జూచి.

**చితాం మే కురు సౌమిత్రే వ్యసనస్యాస్య భేషజమ్ ।**
**మిథ్యోపఘాతోపహతా నాహం జీవితుముత్సహే ॥**

**అప్రీతస్య గుణైర్భర్తు స్త్యక్తాయా జనసంసది ।**
**యా క్షమా మే గతి ర్గంతుం ప్రవేక్ష్యే హవ్యవాహనమ్ ॥**

సుమిత్రానందనా! చితిని బేర్పుము. నా వ్యసనమున కిదియె మందు. వట్టి యపవాదముచే గొట్టువడిన నే నిక జీవింప నొల్లను. నా పాతివ్రత్యాది గుణముల సందేహించి మహాజనమధ్యమున నన్ను విడిచిన భర్తకు నమ్మిక గలిగింప గత్యంతరములేని నే నగ్నియందు ప్రవేశించెదను అని నంతనే లక్ష్మణుడు దుఃఖితుడై రామచంద్రుని ముఖము జూచి–

**స విజ్ఞాయ తతశ్ఛందం రామస్యాకారసూచితమ్ ।**
**చితాం చకార సౌమిత్రి ర్మతే రామస్య వీర్యవాన్ ॥**

ఆ ముఖకవళికల వలన రామునియభిమతము దెలిసికొని వీర్యవంతు డగు లక్ష్మణుడు చితి బేర్చెను.

(తాను తల్లియని భావించి, ప్రతిదిన మామెపాదములకు వందనము లర్పించి యామెయందు భక్తివినయములబాటించు లక్ష్మణు డామె

పాతివ్రత్యమహిమ నెరిగియు చేయునది లేక శ్రీరామనియమనమే, అభిమతమే తన కర్తవ్యమని దృఢమగునమ్మకము గలిగినవా డగుటచే నింగితములచే రామునియభిప్రాయము దెలిసి, యతని యభిమతము ననుసరించి సీతాదేవి యగ్నిప్రవేశము చేయవలసినంత పరిస్థితి యేర్పడినను దాసవృత్తి ననుసరించి రాముని సంకల్పము నెరవేర్చుటయె తన విధ్యుక్తధర్మమని వర్తించువాడు లక్ష్మణుడని తెలియనగును.)

అగ్నిదేవుడు సీత పరిశుద్ధురాలని రామున కామెను సమర్పింప వారెల్ల రయోధ్యకు బోయి పట్టాభిషేకము చేసికొనవలసిన సమయమున రాముడు లక్ష్మణుని జూచి–

**ఆతిష్ఠ ధర్మజ్ఞ మయా సహేమాం**
**గాం పూర్వరాజాధ్యుషితాం బలేన ।**
**తుల్యం మయా త్వం పితృభిర్ధృతా యా**
**త్వాం యౌవరాజ్యే ధురముద్వహస్వ ॥**

'ధర్మజ్ఞుడా! మన పూర్వులేలిన ఈ రాజ్యమును నాతో గలసి యువరాజుగ నుండి పాలింపుము అనెను.

(ఇచ్చట వయసు ననుసరించియు, పూర్వాచారము ననుసరించియు తండ్రివలన తన కియ్యబడిన దైనను జ్యేష్ఠుడే పాలించుట న్యాయమని చిత్రకూటమున రామచంద్రుని మరల్చి తెచ్చుటకు వీలుగా నపు డతని చరణములే శరణమని యతని పావల శిరసావహించి జటావల్కలముల ధరించి సకల భోగములను విడనాడి సర్వసంగపరిత్యాగియై శ్రీరాముని పునరాగమనమునే నిరీక్షించుచు పదునాలుగేండ్లు గడచి రామచంద్రుడు మరలివచ్చినపు డతనికి రాజ్యమును స్వాధీనముచేసి అతని కెల్ల విధముల పరతంత్రుడుగ వర్తించుచున్న భరతుని వదలి లక్ష్మణుని యువరాజుగ



నుండునట్లు రామచంద్రు డడుగుట యుక్తమా యను సంశయము గలుగవచ్చును, లక్ష్మణు డా బాల్య మొక్కక్షణమైనను రాముని విడిచి యుండలేదు. వనగమనసమయమున లక్ష్మణుడు రామచంద్రునితో నీటిలోని చేపను గట్టున బడవైచిన నది జీవింపలేని విధమున సీతవలె తాను నొక్క క్షణమైనను రామవియోగమును సహింప ననిన రాముని వెలుపలి ప్రాణమగు లక్ష్మణు నట్లడిగినను తప్పులేదు. దశరథుడు పట్టాభిషేకము చేయనెంచినపుడు

**సౌమిత్రే భుంక్ష్వ భోగాం స్త్వమిష్టాన్రాజ్యఫలాని చ ।**
**జీవితం చ హి రాజ్యం చ త్వదర్థమభికామయే ॥**

లక్ష్మణా! రాజ్యపాలనము వలన గలుగు సకల భోగ భాగ్యములను విరివిగ ననుభవింపుము. నా జీవితము, నా రాజ్యము, ఇతర భోగములు నీ కొఱకే నేను గోరెదను అని రామచంద్రుడు చెప్పెను. చిత్రకూటమున సేనాసమేతుడుగ వచ్చిన భరతునియందు దురుద్దేశమున్నట్లూహించి యతనిని చంపెదనని చెప్పినపుడు రామచంద్రు డతనితో

**ఉచ్యమానోఽపి భరతో మయా లక్ష్మణ తత్త్వతః।**
**రాజ్యమస్మై ప్రయచ్ఛేతి బాఢమిత్యేవ వక్ష్యతి॥**

లక్ష్మణా! నే నొక్క మాట 'లక్ష్మణుని కీరాజ్యమిమ్ము' అని చెప్పిన నతడు వెంటనే యిచ్చువాడని చెప్పెను.

**తథోక్తో ధర్మశీలేన భ్రాతా తస్య హితే రతః ॥**
**లక్ష్మణః ప్రవివేశేవ స్వాని గాత్రాణి లజ్జయా॥**

శ్రీరాముని హితమునందే బుద్ధిగలవాడగుట లక్ష్మణు డతనికేమి యాపదవచ్చునో యని సందేహించి యట్లు చెప్పినను, ధర్మస్వభావుడగు అన్న చెప్పిన మాటలకు లజ్జితుడై తన యంగములను ముడుచుకొని తలవంచుకొనెను.

**సర్వాత్మనా పర్యనునీయమానో**
**యదా న సౌమిత్రిరుపైతి యోగమ్ ।**
**నియుజ్యమానోఽపి చ యౌవరాజ్యే**
**తతోఽభ్యషించద్భరతం మహాత్మా ॥**

రామచంద్రుడు లక్ష్మణుని తాను నియమించినట్లు అనునయముగ నెంత యడుగుకొనినను అతడు యౌవరాజ్యము నంగీకరింపనందున భరతునకు యౌవరాజ్యాభిషేకము చేసెను.

(లక్ష్మణుడు ధర్మజ్ఞుడు. తన యందలి ప్రీత్యతిశయముచే రాముడెంత నొక్కి చెప్పినను యువరాజుగ నుండుట కిష్టపడలేదు. తనకు జ్యేష్ఠుడగు భరతుడే యందుకు తగినవాడని తెలిపెను. సర్వకాల సర్వావస్థలలోను రామచంద్రుని పాదారవిందములందే మనసు నిలిపి యతని కైంకర్యమే తనకు పరమ పురుషార్థమని దృఢమనస్కుడై శ్రీరామసేవా సంపదను వృద్ధి చేయుచుండెడి పరమయోగి లక్ష్మణుడు. నిష్కామకర్మాచరణమున లక్ష్మణుని కగ్రస్థానమియ్యక తప్పదు.)

భద్రుడను వాని మూలమున, రావణునింట చిరకాల ముండిన సీతను రాము డంగీకరించి తన యింటిలో చేర్చుకొన్నాడే! పాలకుడగు రాజెట్లు ప్రవర్తించునో లోకులు నట్లే వర్తింతురని జను లచ్చటచ్చట చెప్పుకొన్నారని తెలిసినంతనే రామచంద్రుడు లక్ష్మణునితో సీతను గంగాతీరమున నాశ్రమముల సమీపమున విడిచి రమ్మనియు అందుకెదురు మాటాడరా దనియు శాసింప లక్ష్మణు డట్లు చేయు సందర్భమున,

**శ్రేయో హి మరణం మేఽద్య మృత్యుర్వా యత్పరం భవేత్ ।**
**న చాస్మిన్నీదృశే కార్యే నియోజ్యో లోకనిందితే ॥**

'అహో! లోకము నిందింపదగిన నిట్టి కార్యమునకు నియమింపబడిన నాజన్మ మేల? నాకు మరణమే యిప్పుడు శ్రేయస్కరము' అని తన దురవస్థను



జూచి విసిగి లక్ష్మణు డిట్లు చెప్పెను. రామునాజ్ఞయని దానిని అతడు నిర్వర్తించెను.

రామచంద్రు డనేక యజ్ఞయాగాదులను శాస్త్రోక్తముగ నిర్వర్తించి ధర్మ పరిపాలనము చిరకాలము చేసిన పిదప నొకనాడు యమధర్మరాజు తాపసరూపమున వచ్చి రామచంద్రునితో సంభాషించుటకు బూర్వమే,

**ద్వంద్వే హి తత్ప్రవక్తవ్యం హితం వై యద్యపేక్షసే ॥**
**యశ్శృణోతి నిరీక్షేద్వా స వధ్యో భవితా తవ ।**

రామా! మన మిరువురము మాత్ర మిప్పుడు నీవు కోరిన మాటలు మాట్లాడవలెను. ఎవడు మన మాటలను వినునో లేక మనము మాటలాడునపుడు చూచునో వాడు నీచే తప్పక వధింపబడవలెనని చెప్పెను. రాము దందుకు సమ్మతించి లక్ష్మణుని ద్వారముకడ కాపుంచి యెట్టివారిని లోనికి విడువరాదని శాసించెను. ఇట్లుండ దుర్వాసు డచ్చటికి వచ్చి తన్ను వెంటనే లోనికి బోనీయ కుండిన నిన్ను నీ పురమును రాముని భరతుని శత్రుఘ్నుని శపించెద ననినంతనే లక్ష్మణుడు రామునాజ్ఞ నతిక్రమించి వేగముగ బోయి రామచంద్రునితో దుర్వాసుని మాటలు తెలియ జేసెను. రామచంద్రుడు తగు రీతిని దుర్వాసుని సంతుష్టుజేసి పంపెను. కాలునితో తాను జేసిన ప్రతిజ్ఞను జ్ఞప్తికి దెచ్చుకొని రామచంద్రుడు చింతాక్రాంతుడై యుండుటను గని లక్ష్మణు డతనితో,

**జహి మాం సౌమ్య విస్రబ్ధం ప్రతిజ్ఞాం పరిపాలయ।**
**హీనప్రతిజ్ఞాః కాకుత్స్థ ప్రయాంతి నరకం నరాః ॥**
**యది ప్రీతిర్మహారాజ యద్యనుగ్రాహ్యతా మయి ।**
**జహి మాం నిర్విశంకస్త్వం ధర్మం వర్ధయ రాఘవ ॥**

'సౌమ్యా! కకుత్థ్సవంశోద్భవా! ప్రతిజ్ఞా పాలనము చేయనివారు నరకమునకు బోదురు. కనుక అనివార్యమగు ప్రతిజ్ఞను బాలించు నిమిత్తము

నన్ను వధింపుము. మహారాజా! నాయందు నీ కమితమగు ప్రీతియు ననుగ్రహము నున్నచో గొంకు జంకు లేక నన్ను నీవు వధించి ప్రతిజ్ఞా పాలనమను ధర్మమును వృద్ధి చేయుము అనెను. అంత రామచంద్రుడు మంత్రులను పురోహితులను రప్పించి తన క్లిష్టపరిస్థితిని దెలిపినంత వసిష్ఠుడు.

**త్యజైనం బలవాన్కాలో మా ప్రతిజ్ఞా వృథా కృథాః ।**
**వినష్టాయాం ప్రతిజ్ఞాయాం ధర్మోఽపి విలయం వ్రజేత్ ॥**

**తతో ధర్మే వినష్టే తు త్రైలోక్యం సచరాచరమ్ ।**
**సదేవర్షిగణం సర్వం వినశ్యేత్తు న సంశయః ॥**

**న త్వం పురుషశార్దూల మేరుమందరసారవాన్ ।**
**త్రైలోక్యస్య హితార్థాయ లక్ష్మణం త్యక్తు మర్హసి ॥**

బలవంతుడగు కాలునకు జేసిన ప్రతిజ్ఞను వృథా చేయకుము. నీ ప్రతిజ్ఞ పొల్లగునేని ధర్మము నశించును. ధర్మము నాశమగునేని దేవర్షిగణముతో గూడిన చరాచరాత్మకమగు ముల్లోకములు నాశమగును. ఇందుకు సందేహము లేదు. పురుషపుంగవా! మేరు మందర పర్వతములతో సాటియగు నీవు ముల్లోకముల మేలుకొఱకు లక్ష్మణుని విడిచిపెట్టవలెను. ఇట్లు సభామధ్యమున ధర్మార్థసహితమగు గురువాక్యము వినినంతనే రామచంద్రుడు లక్ష్మణుని జూచి–

**విసర్జయే త్వాం సౌమిత్రే మా భూద్ధర్మవిపర్యయః ।**
**త్యాగో వధో వా విహిత స్సాధూనాం తు భయం సమమ్ ॥**

'సుమిత్రానందనా! నిన్ను విడిచిపెట్టుచున్నాను. ధర్మమునకు హాని కలుగకుండుగాక! సాధువుల విషయమున వధించుటో, విడిచిపెట్టుటో రెండు తుల్యములే అని నంతనే లక్ష్మణుడు నరయూతీరము చేరి నీటిని తాకి యంజలి బద్ధుడై.



**యత్తదక్షర మవ్యక్తం పరం బ్రహ్మ సనాతనమ్ ।**
**పదం తద్వాసుదేవాఖ్య మాత్మానం సోఽభ్యచింతయత్ ॥**

ఏది యక్షరమని యవ్యక్తమని పరబ్రహ్మమని సనాతనమని చెప్పబడుచున్నదో యట్టి వాసుదేవుని ధ్యానించుచు సరయూనదిలో ప్రాకృత శరీరమును త్యజించెను.

**ప్రగృహ్య లక్ష్మణం శక్ర స్త్రిదివం ప్రవివేశ హ ।**
**తతో విష్ణోశ్చతుర్భాగ మాగతం సురసత్తమాః ॥**

**దృష్ట్వా ప్రముదితాస్సర్వే పూజయన్నృషిభిస్సహ ॥**

వెంటనే దేవేంద్రుడు లక్ష్మణుని దేవలోకమునకు గొంపోయెను. ఇట్లు విష్ణువుయొక్క నాల్గవ యంశము వచ్చినందుకు దేవతలును ఋషులును మిక్కిలి కొనియాడి ఆనందించిరి.

లక్ష్మణుని చరిత్రమును సింహావలోకనము చేసిన నందు ముఖ్యముగ గుర్తింపవలసిన విషయములేవి యో పరిశీలింతము. 'బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః, రామస్య లోకరామస్య భ్రాతుర్జ్యేష్ఠస్య నిత్యశః ॥

లోకములను తన కల్యాణగుణములచే రంజింపజేయువాడును నలుగురిలో జ్యేష్ఠుడు నగు శ్రీరామునకు దాస్యమను సంపదను వృద్ధి చేయుచుండు వాడునగు లక్ష్మణుడు బాల్యము మొదలు నిత్యము మిక్కిలి స్నేహపాత్రుడుగ నుండెను. తులసిచెట్టునకు మొలకెత్తునప్పటి నుండి సువాసన యుండునట్లే లక్ష్మణునకు పుట్టుక నుండి రామకైంకర్యబుద్ధి నిండియుండెను. విశ్వామిత్రుని వెంటబోయినప్పటి నుండి రాము డేయే సత్కార్యములు చేసెనో ఆయాకార్యములలో లక్ష్మణునకు సమభాగమే కాదు; ఎక్కువభాగ ముండిన దనియు చెప్పవచ్చును, వనవాసగమనకాలమున పట్టాభిషేకభంగమునకు కారణభూతులని కైకేయిని దశరథుని దూషించి

నపుడు రామచంద్రు డతని కోపమునకు తనయందలి ప్రేమాతిశయమే కారణమని తెలిసి ధర్మయుక్తముగ నతని నాశ్వాసించెను. 'అహం సర్వం కరిష్యామి' అనిన మాటను పూర్ణముగ సార్థకపఱచినాడు లక్ష్మణుడు. చిత్రకూటమునను పంచవటియందును నతడు నిర్మించిన పర్ణశాలలు రాముని సర్వస్వదానమగు కౌగిలింతకు లక్ష్మణుని పాత్రునిగ జేసినవి. సీతాదేవి మారీచవధ జరిగినపుడు లక్ష్మణుని నిందించినపుడాతడెట్లు ఓదార్చెనో యది మిక్కిలి పొగడదగినది. దండకారణ్యమున సీతాన్వేషణము చేయుతఱి శ్రీరాముని యున్మత్త దశలో లక్ష్మణు డెట్లతని నోదార్చెనో వర్ణింప నలవికాదు. తొలుత హనుమంతునితో సంభాషించునపుడు 'గుణైర్దాస్య ముపాగతః' అని తన యన్న యొక్క కల్యాణ గుణము లతనికి తన్ను దాసునిగ జేసిన వనియు సర్వదేశ సర్వకాల సర్వావస్థోచిత సర్వవిధ కైంకర్యమే చేతనునికి కర్తవ్యమని సూచింపబడుచున్నది. వర్షాకాలమున సీతావియోగ దుఃఖములో మునుగుచుండు రామచంద్రు నోదార్చినవాడు లక్ష్మణుడే. శరదృతువు వచ్చినను సుగ్రీవుడు రామకార్యము నిర్వర్తింపలేదని రాము డలిగినపు డతని శాంతింప జేసియు, రాముని దైన్యము జూచి సహింపక తానలిగి కిష్కింధలో ప్రవేశించి సుగ్రీవుని రామసన్నిధికి రప్పించి కార్యము చేయించినాడు. సముద్రునిపై రాము డలిగి లోక వినాశము గలిగింపనుండు నప్పు డతనిని శాంతింప జేసినాడు. లక్ష్మణుని రామభక్తి యిట్టిదని సుమంత్రుడు మరలివచ్చి దశరథునితో జెప్పిన మాటల వలన దెలియునగును. అతనికి తల్లి, తండ్రి, గురువు, దైవము రాముడే యనుట కతని మాటలే సాక్షి; అతని కైంకర్యమే నిరూపణము. హనుమంతుడు అశోక వనమున సీతాదేవిని చూచినపుడు దుఃఖించును 'మాన్యా గురు వినీతస్య లక్ష్మణస్య గురుప్రియా' అనుటలో లక్ష్మణు డెట్టి గురుశిక్ష పొందనవాడని తెలియుటే గాక లక్ష్మణునకు జ్యేష్ఠుడే సర్వ శ్రేష్ఠుడు. గురూత్తముడని అతని భార్య యగుటచే నామెయు నతనికి పూజ్యురాలని



తెలియుచున్నది. లక్ష్మణుడు దీర్ఘదర్శియనుట నతడు మాయామృగము మారీచుడే యనుట వలన తెలియుచున్నది. 'నాహం జానామి కేయూరే' అను సందర్భమును బట్టియు గర్భవతియగు తన్నొకపరి చూడుమని సీతాదేవి వాల్మీక్యాశ్రమ ప్రాంతమున లక్ష్మణు డామెను వదలి వచ్చునపుడు చెప్పి నంత, లక్ష్మణు డామెతో 'దృష్టరూపం నతే రూపం పాదౌ దృష్టా మయానఘే। కథమత్ర హి పశ్యామి రామేణ రహితం వనే!' తల్లీ నీ రూపము నిదివర కెన్నడు నేను చూచియుండ లేదు. నీ పాదములు మాత్రము చూచియున్నాను. అట్లుండ రాముడు లేనపు డడవియందు నిన్నెట్లు చూతునని యామెకు నమస్కరించి మరలెను అనుట వలన లక్ష్మణుని జితేంద్రియత్వమును. నిత్య బ్రహ్మచర్య వ్రతదీక్షయు వెల్లడియగుచున్నవి. అరణ్యమునను, నిత్య బ్రహ్మచర్య వ్రతదీక్షయు వెల్లడియగుచున్నవి. అరణ్యమునను, మరలను రాము నెడబాయక యతని సేవా పరతంత్రుడైన లక్ష్మణుని దాస్యలక్షణ మిట్టిదని వెలయుచున్నది. రామచంద్రుడు తొలుత రాజ్యభోగములు విరివిగ ననుభవింపు మనినపుడుగాని, కడపట రాజ్యాభిషేక సమయమున యువరాజుగ నుండ నియమించినపుడుగాని లక్ష్మణుడు తన కైంకర్యమునకు భంగము గలిగించుట ఏ పదవియు తన కక్కరలే దనుటలో నతని స్వార్థత్యాగమును, వైరాగ్య భాగ్యమును తేట తెల్ల మగుచున్నవి. లక్ష్మణుడు నిష్కామకర్మయోగి యనుటను–

**'కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥**

అనగా శరీరము, మనోబుద్ధులు, వట్టి యింద్రియములచే ఫలాసక్తి వదలి ఆత్మ శుద్ధికై యోగులు యోగము చేయుచున్నారను గీతావాక్యము స్థాపించుచున్నది. ఇందువలన మూర్తీభవించిన శ్రీరామసేవయే లక్ష్మణమూర్తి యని తెలియచున్నది.)

## విభీషణాగమనము

రావణుడు మంత్రులను, సుహృత్తులనుగూడి సభలో నాలోచింప కుంభకర్ణుడు తొలుత అన్నను దూషించి మరల నతనికి యుద్ధమున దోడ్పడ నంగీకరించెను. మహాపార్శ్వుడు, ఇంద్రజిత్తు మొదలగువారు తమ పరాక్రమమున రాము నవలీలగ జయింతు మనిన విభీషణుడు వారల నడ్డగించి యింద్రజిత్తును జూచి యిట్లు నిందించెను.

**"పుత్రప్రవాదే న తు రావణస్య**
**త్వమింద్రజిన్మిత్రముఖోఽసి శత్రుః ।**
**యస్యేదృశ్యం రాఘవతో వినాశం**
**నిశమ్య మోహాదనుమన్యసే త్వమ్ ॥**

**త్వమేవ వధ్యశ్చ సుదుర్మతిశ్చ**
**సచాపి వధ్యో య ఇహాఽనయత్త్వామ్ ।**
**బాలం దృఢం సాహసికం చ యోఽద్య**
**ప్రావేశయ న్మంత్రకృతాం సమీపమ్ ।**
**మూఢః ప్రగల్భోఽవినయోపపన్న**
**స్తీక్ష్ణస్వభావోఽల్పమతిర్దురాత్మా ।**
**మూర్ఖస్త్వమత్యంతసుదుర్మతిశ్చ**
**త్వమింద్రజిద్బాలతయా బ్రవీషి ॥**

'ఓరీ! ఇంద్రజిత్తూ! నీవు కుమారుడవని పేరు పెట్టుకొని రావణునకు మిత్రునివలె నటించు శత్రుడ వగుదువు, రాముని వలన వినాశ మేర్పడునని నే నెంత చెప్పినను అజ్ఞానము వలన యుద్ధమున కంగీకరించుచున్నావు. అందుకు మిక్కిలి దుర్బుద్ధివగు నిన్ను వధింపవలెనా? ఓరీ ఇంద్రజిత్తూ! నీవు యుక్తా యుక్తములను తెలిసికొను వివేకవంతుడవు గావు. నీవు తెలిసిన



వాని వలె నటించు గర్వముతో గూడినవాడవు. క్రూర స్వభావుడవు. అల్పబుద్ధివి, దుష్టుడవు. ఆలోచించువాడవు గావు. (ప్రహస్తుడు దుర్మతి, మహాపార్శ్వుడు సుదుర్మతి) నీవత్యంత దుర్మతివి. బాల్యముచే ముందు వెనుకలు దెలియక వదరెదవు". విభీషణుడు రావణుని జూచి–

**ధనాని రత్నాని విభూషణాని వాసాంసి దివ్యాని మణీంశ్చ చిత్రాన్ ।**
**సీతాం చ రామాయ నివేద్య దేవీం వసేమ రాజన్నిహ వీతశోకాః ॥**

'రాజా! విశేషధనమును, రత్నములను, భూషణములను, దివ్యమైన వస్త్రములను, నానావిధరత్నములను సీతాదేవితో గూడ రామునకు సమర్పించి శోక ముడిగి మన మిచ్చట సుఖముగ వసింతము' అని హిత ముపదేశించెను.

(ఇచ్చట రావణు డెట్టివాడో మంత్రులును బంధువులు నట్టివారే యగుటచే,

**'పరస్య వీర్యం స్వబలం చ బుద్ధ్వా**
**స్థానం క్షయం చైవ తథైవ వృద్ధిమ్।**
**తథా స్వపక్షేప్యనుమృశ్య బుద్ధ్వా**
**వదేత్ క్షమం స్వామిహితం చ మంత్రీ'॥**

శత్రువుయొక్క బలమును తన రాజుయొక్క బలమును తెలిసికొని శత్రువునకు సంపదలో సామ్యమును, వృద్ధిని, క్షయమును నట్లే తన పక్షమున సామ్యవృద్ధి క్షయములను సూక్ష్మముగ నాలోచించి, యెట్టి యుపాయముచే జయము పొంద వచ్చునో దానిని రాజునకు మేలును గోరి యుక్తి యుక్తముగ సకాలమున రాజునకు జెప్పునట్టి మంత్రి లేడని తెలియుచున్నది. ఇప్పు డిచ్చట శత్రువగు రామచంద్రునకు వృద్ధియు, రావణునకు లంకాదహనము. అక్షయకుమారుని మరణము మున్నగువాని వలన క్షయమును కనబడుచున్నందున రామునకు సీతనిచ్చి సంధి చేసికొనుటయే యుత్తమమని

చెప్పునట్టి హితకరుడు విభీషణుడు తప్ప మఱి యొకడులేడని స్పష్టముగ దెలియుచున్నది. (ప్రియమునే పలికి రాజుకు వినాశము గలిగించు మంత్రులే బంధువులే యున్నారని వెల్లడి యగుచున్నది.)

**సునివిష్టం హితం వాక్య ముక్తవంతం విభీషణమ్।**
**అబ్రవీత్పరుషం వాక్యం రావణః కాలచోదితః ॥**

ఇట్లు చక్కగ నర్థమగునట్లు విశదముగ మేలొన గూర్చునట్టి మాటలు చెప్పిన విభీషణుని మెచ్చుకొని తా ననుతాపము చెందుటకు మాఱుగా మృత్యు ప్రేరితుడగు రావణు డతనితో నిట్టి పరుషవచనములు పలికెను.

**"వసేత్సహ సపత్నేన క్రుద్ధేనాశీవిషేణ వా ।**
**న తు మిత్రప్రవాదేన సంవసేచ్ఛత్రుసేవినా ॥**

శత్రువని బహిరంగముగ దెలిసిన వానితోను, మిక్కిలి కోపము గొని యున్న సర్పముతోను సహవాసము చేయవచ్చునుగాని శత్రుపక్షపాతియై మిత్రుని వలె నటించునట్టివానితో సహవాసము చేయరాదు.

**జానామి శీలం జ్ఞాతీనాం సర్వలోకేషు రాక్షస ।**
**హృష్యంతి వ్యసనేష్వేతే జ్ఞాతీనాం జ్ఞాతయస్సదా ॥**

రాక్షసా! లోకములోని జనులలో దాయాదుల స్వభావ మెట్టిదో నాకు దెలియును. వారు జ్ఞాతులకు దుఃఖము గలిగినపుడు సంతోషింతురు.

**ప్రధానం సాధనం వైద్యం ధర్మశీలం చ రాక్షస ।**
**జ్ఞాతయో హ్యవమన్యంతే శూరం పరిభవంతి చ ॥**

రాక్షసా! దాయాదులు తమ జాతిలో ముఖ్యుడగు వానిని, కార్యముల సాధించుటలో నిపుణుని, విద్వాంసుని, ధర్మస్వభావుడగు వానిని, శూరుడగు వానిని సమయము వచ్చినపు డవమానింతురు. పూర్వము పద్మవనమను



నొక యడవిలో తమ్ము పట్టుటకై పాశములు కొని తమజాతి యేనుగులను వెంట బెట్టుకొని వచ్చినవారిని జూచి యవి యిట్లు చెప్పినవి.

**'నాగ్నిర్నాన్యాని శస్త్రాణి న నః పాశా భయావహాః।**
**ఘోరాస్స్వార్థప్రయుక్తాస్తు జ్ఞాతయో నో భయావహాః ॥**
**ఉపాయమేతే వక్ష్యంతి గ్రహణే నాత్ర సంశయః ।**
**కృత్స్నాద్భయాద్జ్ఞాతిభయం సుకష్టం విదితం చ నః ॥**

'మాకు నిప్పు కాల్చునను భయములేదు. అంతకంటె శీఘ్రముగ నాశము చేయు నితరాయుధముల వలనను భయములేదు. వేటగాంద్ర చేతిలో మమ్ము బంధింపనుండు పాశముల వలనను భయములేదు కాని కేవలము తమ లాభమునే గోరుచుండు మనజ్ఞాతులగు ఏనుగుల వలననే భయమేర్పడుచున్నది. ఏలన మనల బట్టుట కుపాయ మిట్టిదని చెప్పునట్టివి యవియే. ఇందుకు సందేహము లేదు. అగ్ని మొదలగు వానియన్నిటి కంటెను జ్ఞాతులవలన గలుగునట్టి భయమే గొప్పది".

**యథా పుష్కరవర్ణేషు పతితాస్తోయబిందవః।**
**న శ్లేష ముపగచ్ఛంతి తథాऽనార్యేషు సంగతమ్ ॥**

**యథా శరది మేఘానాం సించతామపి గర్జతామ్ ।**
**న భవత్యంబుసంక్లేద స్తథాऽనార్యేషు సౌహృదమ్ ॥**

తామరాకు నీటిలో బుట్టినదే. దానిమీద బడిన నీటిబందువు లొకటితో నొకటి చేరునా? లేదుకదా! అట్లేదుష్టులతో నెంతకాలము మెలగినను స్నేహము పట్టువడదు. శరత్కాలమేఘములు గొప్పగ గర్జించినను వాటి నుండి పడునట్టి వానచినుకులు నేలను దడుపవు గదా! అట్లే దుష్టులతో నెంతకాలము స్నేహము చేసినను నిజముగ వారివలన నెట్టియుపకారమును గలుగదు. అట్లే నాకు నీతోడి చెలిమి గూడ.

**అన్యస్త్వేవంవిధం బ్రూయా ద్వాక్యమేత న్నిశాచర ।**
**అస్మిన్ముహూర్తే న భవే త్త్వాం తు ధిక్కులపాంసనమ్ ॥**

రాక్షసా! ఇట్టి మాటలు నీవుగాక యితరు డెవ్వడేని చెప్పియుండినచో వాడీక్షణముననే నాచే వధింపబడియుండును. కులమును జెఱుప బుట్టినవాడా! ఛీ! పొమ్మావలకు".

ఇట్టి కఠినోక్తులు సభామధ్యమున రావణు డాడినంతనే విభీషణుడు గత్యంతరము లేక నలుగురు గదాపాణులైన యనుచరులతో నంతరిక్షమున కెగసి కడపటిమాటగా నన్నయగు రావణుని జూచి–

**స త్వం భ్రాతాఽసి మే రాజన్ బ్రూహి మాం యద్యదిచ్ఛసి ।**
**జ్యేష్ఠో మాన్యః పితృసమో న చ ధర్మపథే స్థితః ।**
**ఇదం తు పరుషం వాక్యం న క్షమామ్యనృతం తవ ॥**

'రాజా! నేను నీ తమ్ముడను. నన్ను నీ వేమీచెప్పగోరుదువో చెప్పుము. నీవు నాకు పెద్దవాడవు. పూజ్యుడవు. తండ్రివంటివాడవే. కాని నీవు ధర్మ మార్గ మవలంబించువాడవు గావు. లేని నిందను నా మీద నారోపించి నన్ను నిండుసభలో నవమానించితివి' దీనిని నే నెంతమాత్రము సహింప జాలను.

**సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః ।**
**అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥**

రాజా! వినుట కింపుగనుండు మాటలాడువా రెందఱైనను దొరకుదురు గాని వినుట కప్రియముగ నున్నను హితమును గలిగించు నట్టి మాటలాడువారు లభింపరు. అట్టి వా రరుదు.

**దీప్తపావకసంకాశై శ్శితైః కాంచనభూషణై ః ।**
**న త్వా మిచ్ఛామ్యహం ద్రష్టుం రామేణ నిహతం శరైః ॥**



నిప్పువలె ప్రకాశించుచు బంగారుచే నలంకరింపబడిన తీక్ష్ణము లగు బాణములచే రాముడు నిన్ను గొట్టుచుండగా జూచుటకు నా మనసెంత మాత్ర మొప్పుకొనదు.

**ఆత్మానం సర్వదా రక్ష పురీం చేమాం సరాక్షసామ్ ।**
**స్వస్తి తేఽస్తు గమిష్యామి సుఖీ భవ మయా వినా ॥**

అన్నా! అన్ని విధముల నిన్ను రక్షించుకొనుము రాక్షసులతో గూడిన నీ లంకాపురమును రక్షించుకొనుము. నీకు శుభమగుగాక, నేను పోయెదను నేను పోయిన తరువాత నేను లేనని సుఖముగ నుండుము.

**నూనం న తే రావణకశ్చిదస్తి**
**రక్షోనికాయేషు సుహృత్సఖా వా।**
**హితోపదేశస్య సమంత్రవక్తా**
**యో వారయేత్త్వాం స్వయమేవ పాపాత్ ॥**

రావణా! ఈ రాక్షసకోటిలో నీకు హిత ముపదేశించి ఆపత్సమయము నకు తగు నాలోచన చెప్పి నిన్నీయాపదనుండి తప్పించు సుహృదుడు గాని, స్నేహితుడుగాని నీకు లేడనుట నిజము.

**నివార్యమాణస్య మయా హితైషిణా**
**న రోచతే తే వచనం నిశాచర ।**
**పరేతకల్పా హి గతాయుషో నరా**
**హితం న గృహ్ణంతి సుహృద్భిరీరితమ్ ॥**

రాక్షసా! నీ క్షేమము గోరి నిన్నీపాపకార్యమునుండి తప్పింప నెట్టి హితము పలికినను నా మాట నీవు వినిన వాడవు గావు. మృత్యువు సమీపించిన వారు చచ్చినవారే. మేలుగోరు హితు లెట్టి మంచిమాటలు చెప్పినను వారు వినరు. (నీవు నట్లే వినకున్నావు.)"

**ఇత్యుక్త్వా పరుషం వాక్యం రావణం రావణానుజః ।**
**ఆజగామ ముహూర్తేన యత్ర రామస్సలక్ష్మణః ॥**

ఇట్లు రావణుని తమ్ముడగు విభీషణుడు రావణునితో పరుష వచనములు లాడి యొక్కముహూర్తకాలమున రామలక్ష్మణు లున్నచోటికి వచ్చినవాడయ్యె. (ఇచ్చట గమనింపవలసిన మొదటివిషయమేమి? రావణుడు సీతాపహరణమను నకృత్యము చేసి రామునిచే వధింపబడవలసిన సమయము. రోగి తన కేది ప్రియమో దానిని గోరును గాని తన కేది మేలు చేయునో యట్టి ఔషధమును గోరడు. అందుకు దగిన పథ్యముండడు, అట్టి సమయమున నతనియాప్తులే యతనికి దగినట్టి యౌషధ మిప్పించి తగు రీతిగ పథ్యముండునట్లు చేసి వ్యాధి నిమ్మళించు మార్గము నవలంబింపవలెను గదా! అట్లే ప్రాణాపాయమున నున్న రావణుని మేలుదలచి యతనికి హితము గలిగించువా రెవరు? 'రావయతి రోదయతీతి రావణః' ఏడ్పించువా డగుటచే పరహింసాకరము లగు కార్యములే చేయువాడని తెలియుచున్నది. కాదేని 'రౌతీతి రావణః స ఏవ రావణః' ఏడ్చు వాడని యర్థము. కైలాసమును కదలించుట, వాలితో కలహించుట ఇత్యాది చేయరాని కార్యములు చేసి బాధపడి యేడ్చువాడనియు నర్థమగును. ఇట్టి వారి పుత్రు లెట్టివారైయుందురు? ఇట్టి వాని మంత్రులును, స్నేహితులును, బంధువులును వీనివంటివారే యగుటవలన వారివలన వీనికేమిలాభము? దూరముగ నుండు మరణమును దగ్గరకు రప్పించుటయే. వివేకము నశించిన వానికి మేలుకీ ళ్ళెట్లు తెలియును? వివేకవంతుడగు విభీషణు డెట్టి హితము నెన్ని పర్యాయము లెంత యుక్తియుక్తముగ బోధించినను ఆ హితము పనికి రాలేదు. దేహబలము, వరబలము, ఐశ్వర్యబలము, సంఖ్యాబలము గలదని మదాంధుడై నీతి నియమముల పాటింపనివానిగతి యెట్టిదో అట్టివాని కెంత హితమొనర్చినను



నిరర్థకమనియు దెలియును. లోకములో లోకమున కేది హితమో అది తెలిసినవారి సంఖ్య చాల తక్కువయని గుర్తింపవలెను. తమ లాభమునుగోరక సుఖమును గోరక, బహుజనుల కేది లాభమో, సుఖమో దానినిజేయ సంకల్పించి యెట్టివారెన్ని యిడుమలు గల్పించినను తమ హితబుద్ధిని విడువని ధీరులు విభీషణునివలె కోటి కొక్కరే యుందురని, అట్టివారు తమ కెన్ని కష్టములు సంభవించినను నిజమునే పలుకుదురనియు తెలియుచున్నది.)

# మంత్రాలోచన

రామలక్ష్మణు లున్నచోట గదాపాణులగు నలుగు రనుచరులతో వచ్చి యంతరిక్షమున నిలిచిన విభీషణుడు సుగ్రీవాది వానరుల జూచి–

**"రావణో నామ దుర్వృత్తో రాక్షసో రాక్షసేశ్వర ః ।**
**తస్యాహమనుజో భ్రాతా విభీషణ ఇతి శ్రుతః ॥**

**తేన సీతా జనస్థానా ధ్భృతా హత్వా జటాయుషమ్ ।**
**రుద్ధా చ వివశా దీనా రాక్షసీభిస్సురక్షితా ॥**

**త మహం హేతుభిర్వాక్యై ర్వివిధైశ్చ న్యదర్శయమ్ ।**
**సాధు నిర్యాత్యతాం సీతా రామాయేతి పునః పునః॥**

**స చ న ప్రతిజగ్రాహ రావణః కాలచోదిత ః।**
**ఉచ్యమానం హితం వాక్యం విపరీత ఇవౌషధమ్ ॥**

**సోஉహం పరుషితస్తేన దాసవచ్చావమానితః।**
**త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః ॥**

**సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే ।**
**నివేదయత మాం క్షిప్రం విభీషణ ముపస్థితమ్ ॥**

దురాత్ముడగు రాక్షసరాజైన రావణునకు నేను తమ్ముడను. నన్ను విభీషణు దందురు. గర్భవాసదుఃఖమునైన ననుభవింపని సీతాదేవిని జనస్థానము నుండి యపహరించి గొనిపోవుచు నడ్డుపడిన జటాయువును వధించి యా బిడ్డను రాక్షసస్త్రీల కఠినమగు కావలియం దుంచినాడు. నే ననేకపర్యాయము లామెను రామచంద్రున కిచ్చివేయుమని యుక్తి యుక్తములగు మాటలతో హితము చెప్పినను మృత్యు వాసన్నమైన వాడు ఔషధమును పుచ్చుకొనని విధమున కాలము సమీపించినందున నామాట



లతడు వినినవాడుగాడు. న న్నతడు సభామధ్యమున పరుషోక్తు లాడి సేవకుని వలె నవమానించినందున నేను నా భార్యాపుత్రులను విడిచి రామచంద్రుని శరణు జొచ్చుచున్నాను. రఘుకులతిలకుడును, మహాత్ము డును, సకలలోకములకు శరణ్యుడునగు రామచంద్రునకు విభీషణుడు వచ్చి యున్నాడని నా రాక నతనికి శీఘ్రముగ నెఱింగింపుడు" అనెను. అంత సుగ్రీవుడు శీఘ్రముగ బోయి లక్ష్మణుని యెదుట రామచంద్రునితో–

**రావణస్యానుజో భ్రాతా విభీషణ ఇతి శ్రుతః ।**
**చతుర్భిస్సహ రక్షోభి ర్భవంతం శరణం గతః ॥**

రావణుని తమ్ముడు విభీషణు డనువాడు నలుగురు రాక్షసులతో వచ్చి నిన్ను శరణు జొచ్చుచున్నాడు.

**ప్రణిధీ రాక్షసేంద్రస్య రావణస్య భవేదయమ్ ।**
**అనుప్రవిశ్య సోஉస్మాసు భేదం కుర్యాన్న సంశయః ॥**

**మిత్రాటవీబలం చైవ మౌలం భృత్యబలం తథా ।**
**సర్వమేతద్బలం గ్రాహ్యం వర్జయిత్వా ద్విషద్బలమ్ ॥**

**వధ్యతామేష తీవ్రేణ దండేన సచివైస్సహ ।**
**రావణస్య నృశంసస్య భ్రాతా హ్యేష విభీషణః ॥**

వీడు రాక్షసరాజగు రావణుని గూఢచారిగ నుండును. వీడు మనలో జేరి సమయముజూచి మనలో భేదము గలిగించును. ఇందు సందేహము లేదు. మిత్రులకు సంబంధించిన బలమును, ఆటవికుల బలమును, వంశపరంపరగనున్న బలమును, అప్పటి వేతనములు గ్రహించి జీవించు భటుల బలమును, గ్రహింప వచ్చునేగాని శత్రుసంబంధమగు బలమును నెప్పుడును గ్రహింపదగదు. వర్జించియే తీరవలెను. వీడు మిక్కిలి క్రూరుడును శత్రువునగు రావణుని తమ్ము డగుటచే వీనిని మంత్రులతో గూడ నతి

కఠినమగు విధమున వధింపవలెను అనెను. అప్పుడు రామచంద్రుడు సమీపమున నున్న హనుమదాదులను జూచి.

**యదుక్తం కపిరాజేన రావణావరజం ప్రతి ।**
**వాక్యం హేతుమదర్థ్యం చ భవద్భిరపి తచ్ఛ్రుతమ్ ॥**
**సుహృదా హ్యర్థకృచ్ఛ్రేషు యుక్తం బుద్ధిమతా సతా ।**
**సమర్థేనాపి సందేష్టుం శాశ్వతీం భూతిమిచ్ఛతా ॥**

విభీషణునిగూర్చి కపిరాజగు సుగ్రీవుడు యుక్తియుక్తముగను, అర్థవంతముగను జెప్పిన మాటలు మీరు వింటిరి గదా! కార్యసంకట సమయమున సుహృదులగువారు యుక్తాయుక్తముల విమర్శించి స్థిరమగు శుభమును గోరుచు తమతమ యభిప్రాయముల జెప్పుట యుక్తము. కనుక మీమీ యభిప్రాయముల జెప్పు డనెను.

అంత వానరులు వినయముతో–

**అజ్ఞాతం నాస్తి తే కించిత్త్రిషు లోకేషు రాఘవ ।**
**ఆత్మానం సూచయన్ జానన్ పృచ్ఛస్యస్మాన్ సుహృత్తయా ॥**
**త్వం హి సత్యవ్రతశ్శూరో ధార్మికో దృఢవిక్రమః ।**
**పరీక్ష్యకారీ స్మృతిమా న్నిసృష్టాత్మా సుహృత్సు చ ॥**
**తస్మాదేకైకశస్తావత్ బ్రువంతు సచివాస్తవ ।**
**హేతుతో మతిసంపన్నా స్సమర్థాశ్చ పున ః పునః ॥**

"రాఘవా! ముల్లోకములలో నీకు దెలియని విషయ మేదియు లేదు. నీవు మా యందు సుహృదయు డగుట వెల్లడి చేయుటకై మమ్మిట్లడుగు చున్నావు. నీవు నిత్యసత్యవ్రతుడవు. నీ యాశ్రితరక్షణమను ధర్మమునకు హాని కలిగిన దాని పరిహరింపదగిన శూరుడవు. ధర్మానుష్ఠానవరుడవు. అట్టి నీయనుష్ఠానమునకు భంగ మేర్పడు నట్లుండ దానిని సాధింపదగు



స్థిరమగు పరాక్రమము గలవాడవు. ఆశ్రిత పారతంత్ర్యమును నిర్వహించుటలో సర్వ శక్తుడ వైనను సహేతుకముగ విషయముల విమర్శించి కార్యమునకు గడంగు స్వభావము గల వాడవు. అయినను నీ సుహృద్భావముచే మా యభిప్రాయముల నడిగినందున మాలో నొక్క డొక్కడు తన సహేతుకమగు భావమును దెలుపునుగాక" యనిరి. అంత బుద్ధిమంతుడగు అంగదుడు–

**అర్థానర్థౌ వినిశ్చిత్య వ్యవసాయం భజేత హ ।**
**గుణతస్సంగ్రహం కుర్యా ద్దోషతస్తు వివర్జయేత్ ॥**
**యది దోషో మహాంస్తస్మిం స్త్యజ్యతామవిశంకితమ్ ।**
**గుణాన్వాపి బహూన్ జ్ఞాత్వా సంగ్రహః క్రియతాం నృప ॥**

'వీడు శత్రుపక్షమునుండి వచ్చుటచే సందేహింప దగువాడే. వీని గుణదోషములను తెలిసికొను ప్రయత్నముచేయవలెను. గుణమున్నదని తెలిసినచో నంగీకరింపవచ్చును. దోషమేయున్నట్లు తెలిసినచో విడిచిపెట్ట వలెను. లోకమున గుణముతో నిండిన వాడని. దోషముతో నిండినవాడని యెట్టివారిని నిర్ణయింప వీలుగాదు. కాని దోషములు తక్కువగను, గుణము లెక్కువగ నున్నచో గ్రహింపవచ్చును. గుణములు తక్కువగను, దోషములే యెక్కువగ నున్నచో విడిచిపెట్టవలెను" అనెను.

ఒకనిని వినియోగించుకొనకుండిన వాని గుణదోషములు దెలియవు. వెంటనే వినియోగించుకొనిన వానివలన హాని యేర్పడునుగాన నంగదునిమతము ననుసరింప సాధ్యముగాదని శరభు డిట్లనుచున్నాడు.

**క్షిప్రమస్మిన్నరవ్యాఘ్ర చారః ప్రతివిధీయతామ్ ।**
**ప్రణిధాయ హి చారేణ యథావత్సూక్ష్మబుద్ధినా ।**
**పరీక్ష్య చ తతః కార్యో యథాన్యాయ్యం పరిగ్రహః ॥**

'రాజకంఠీరవా! వీని గుట్టు మట్టును తెలిసికొనునిమిత్త మొక చారుని శీఘ్రముగ బంపుము. సూక్ష్మబుద్ధియగు చారునిచే నీతిశాస్త్రసమ్మతముగ వీని గుణదోషముల బరీక్షించి పిదప న్యాయముచొప్పున గుణమున్నదని తెలిసినచో వీనిని గ్రహింపవచ్చును.' అంత వయోవృద్ధుడును, జ్ఞానవృద్ధుడు నగు జాంబవంతుడు శాస్త్రబుద్ధిచే విమర్శించి రామునితో–

**బద్ధవైరాచ్చ పాపాచ్చ రాక్షసేంద్రాద్విభీషణః ।**
**ఆదేశకాలే సంప్రాప్త స్సర్వథా శంక్యతామయమ్ ॥**

'మనకు బద్ధవిరోధియగు పాపాత్ముడైన రాక్షసరాజగు రావణు నొద్ద నుండి వచ్చినవాడీ విభీషణుడు. వీడు వచ్చినదేశమునుబట్టి చూచినను కాలమునుబట్టి చూచినను వీడు సందేహింప దగినవాడే' (గ్రహింప దగినవాడు కాడు) అనెను.

న్యాయా న్యాయ పరిష్కారనిపుణుడును, తాను నిశ్చయించిన విషయము నుపపాదించుటలో సమర్థుడు నగు మైందుడు తనంత వచ్చిన మిత్రుని పోగొట్టుకొనకుండుట లాభకరమను మతముతో రామునిజూచి–

**వచనం నామ తస్యైష రావణస్య విభీషణః ।**
**పృచ్ఛ్యతాం మధురేణాయం శనైర్నరవరేశ్వర ॥**

**భావమస్య తు విజ్ఞాయ తత్త్వతస్త్వం కరిష్యసి ।**
**యది దుష్టో న దుష్టో వా బుద్ధిపూర్వం నరర్షభ ॥**

'రాజా! రావణుడు మనల గురించియే మనుచున్నాడో విభీషణుని నతనికి సందేహము గలుగని విధమున మెల్లగ మధురముగ మాటలాడు వానిని పంపి యడిగి తెలిసికొనవలెను. ఇట్లితడు దుష్టుడో కాడో తెలిసికొని నీ బుద్ధి ననుసరించి యెట్లుచితమో చేయుము' అనెను. అంత శాస్త్రాభ్యాసముచే సంస్కార సంపన్నుడును, సుగ్రీవుని మంత్రిసత్తముడు నగు హనుమంతుడు మధురముగ నర్థవంతముగ రామునితో–



**న భవంతం మతిశ్రేష్ఠం సమర్థం వదతాం వరమ్ ।**
**అతిశాయయితుం శక్తో బృహస్పతిరపి బ్రువన్ ॥**

**న వాదాన్నాపి సంఘర్షా న్నాధిక్యాన్న చ కామతః ।**
**వక్ష్యామి వచనం రాజన్ యథార్థం రామగౌరవాత్ ॥**

"బుద్ధిమంతులలో నుత్తముడును, సమర్థుడును, మాటలాడుటయందు నిపుణుడునగు నిన్ను బృహస్పతియు నతిశయింపజాలడు. వాదించుట యందు నందఱి కంటె నేనే మిన్నయను తలంపుతోను, బుద్ధిమంతుడ ననిగాని మాటల నేర్పరియని గాని, నేనే కోరుటచేగాని నే నిప్పుడు మాటలాడువాడను గాను, (సుగ్రీవుని జూచి) రాజా! 'నీమతము చెప్పుమని' రామచంద్రుడు నాయందు జూపిన గౌరవమునుబట్టి చెప్పుచున్నాడను.

**అర్థానర్థనిమిత్తం హి యదుక్తం సచివై స్తవ ।**
**తత్ర దోషం ప్రపశ్యామి క్రియా న హ్యుపపద్యతే ॥**

విభీషణుని గుణదోషముల గ్రహించుటకై నీ మంత్రులు చెప్పిన మాటలలో దోషము గనబడుచున్నది.

**ఋతే నియోగాత్సామర్థ్య మవబోద్ధుం న శక్యతే ।**
**సహసా వినియోగో హి దోషవాన్ప్రతిభాతి మా ॥**

మొదటిది (అంగదుని మాట): ఒకనిని రాజకార్యమున నియోగించి గుణదోషములు గ్రహింపవలెననియు, గుణదోషములు గ్రహించి పిదప నియోగింప వలెననియు చెప్పుటలో నన్యోన్యాశ్రయ ముండుటచే నీ వాదము చెల్లదు.

**చారప్రణిహితం యుక్తం యదుక్తం సచివై స్తవ ।**
**అర్థస్యాసంభవాత్తత్ర కారణం నోపపద్యతే ॥**

రెండవది (శరభుని మతము) : చారుని పంపి రహస్యముగ నతని విషయము దెలిసికొనునట్లు నీమంత్రులు చెప్పిరే. చారునిపంప వలసిన దెప్పుడు? దూరమున శత్రువుండిన నతనికి దెలియక చారుని పంపి రహస్యముగ నతని సంగతులు తెలిసికొనవలెను. కట్టెదుట సమీపమున నంతరిక్షమున నున్న వాని యొద్దకు చారుని పంపుట పొసగదు కనుక నా మతము దూష్యమే.

**అదేశకాలే సంప్రాప్త ఇత్యయం యద్విభీషణః ।**
**వివక్షా తత్ర మేఽస్తీయం తాం నిబోధ యథామతి ॥**

మూడవది (జాంబవంతునియభిప్రాయము): ఈ విభీషణుడు రావలసిన దేశము ఇది కాదు. అతడు వచ్చిన కాలమును యుక్తమైనదికాదని వాదించిరి గదా! అతడు రావలసిన దేశమును, కాలమును నిదియేయని నాయ భిప్రాయము. ఎట్లంటివా వినుము.

**పురుషాత్పురుషం ప్రాప్య తథా దోషగుణావపి ॥**

**దౌరాత్మ్యం రావణే దృష్ట్వా విక్రమం చ తథా త్వయి ।**
**యుక్తమాగమనం తస్య సదృశం తస్య బుద్ధితః ॥**

విభీషణుడు పురుషాధముడగు రావణుని పురుషోత్తముడవగు నిన్ను మనసులో చక్కగ నాలోచించి విమర్శించి మీమీ గుణదోషముల గ్రహించి పతివ్రతా తిలకమగు సీతాదేవిని ఒంటరిగా నుండునపుడు కపట వేషమున నపహరించుట అట్లు చేయుట దోషమని యామెను రామునకిచ్చి వేయుమని యెంత చెప్పినను వాడు వినకుండుటను ఇట్టి దుర్మార్గత్వమును, నీవు ఖర దూషణాదుల నొక్కడవే వధించుటను వాలిని జంపి సుగ్రీవునకు పట్టము



గట్టుట మున్నగు నీ పరాక్రమ చర్యలంజూచి చక్కగ నాలోచించి రావణుని విడుచుటయు, నిన్నాశ్రయించుటయు తగియున్నది.(ఈ విధమున ప్రతికూలుర యందలి దోషమును, ననుకూలురయందలి గుణమును ఎప్పు డెచ్చట దెలియునో యయ్యదియే తగిన దేశము, తగిన కాలము నగును. అందుచే నతడు వచ్చిన దేశకాలములలో ననౌచిత్య మెంత మాత్రము లేదు'.)

**అజ్ఞాతరూపైః పురుషై స్స రాజన్ పృచ్ఛ్యతా మితి ।**
**యదుక్తమత్ర మే ప్రేక్షా కాచిదస్తి సమీక్షితా ॥**

ఇక నాల్గవది (మైందునిమతము) విభీషణునకు దెలియని వానినొకని బంపి యతని మనోభావము దెలిసికొని రమ్మనుట యను మతమును యుక్తముగాదని చెప్పుచున్నాను. ఎట్లన.

**అశక్యస్సహసా రాజన్ భావో బోద్ధుం పరస్య వై ।**
**అంతస్స్వభావై ర్గీతైస్తై ర్నైపుణ్యం పశ్యతా భృశమ్ ॥**

అపరచితుడగువా డనేక ప్రశ్నలు వేయుటచే వినయముతో శరణని వచ్చిన నన్ను శత్రువని భావించిరే యని సందేహించి తన మర్మమును దాచి పెట్టునే గాని బయట పెట్టడు. ఇందువలన సులభముగ లభించు మిత్రుని బోగొట్టుకొనవలసి వచ్చును. ఇంతవఱకు హనుమంతు డంగదాదుల మతమును ఖండించి విభీషణుని సందేహింప నక్కరలేదని కొన్ని సూచనలను దెలుపుచున్నాడు.

**అశంకితమతిస్స్వస్థో న శఠః పరిసర్పతి ।**
**న చాస్య దుష్టవాక్చాపి తస్మాన్నా స్తీహ సంశయః ॥**

**ఆకారశ్ఛాద్యమానోఽపి న శక్యో వినిగూహితుమ్ ।**
**బలాద్ధి వివృణోత్యేవ భావమంతర్గతం నృణామ్ ॥**

**దేశకాలోపపన్నం చ కార్యం కార్యవిదాం వర ।**
**స్వఫలం కురుతే క్షిప్రం ప్రయోగేణాభిసంహితమ్ ॥**

**ఉద్యోగం తవ సంప్రేక్ష మిథ్యావృత్తం చ రావణమ్ ।**
**వాలినశ్చ వధం శ్రుత్వా సుగ్రీవం చాభిషేచితమ్ ॥**

**రాజ్యం ప్రార్థయమానశ్చ బుద్ధిపూర్వమిహాగతః ॥**

ఇతడు పలుమాటలు చెప్పుచున్నను దుష్టభావముతో వచ్చినాడనుట కెట్టి లక్షణమును కనపడలేదు. ఇతని ముఖమున నెట్టి చెడులక్షణము గానరాదు. ఇతని తొట్రుపాటును సూచించుట కితనికి చెమట పట్టినది కాదు. ఇతని మాటలలో నట్టి సూచనలు లేవు. అందుకు మాఱతని ముఖము ప్రశాంతముగ నున్నది. మాటలలో నెట్టి తొసగులు గాని లేవు. కుటిల స్వభావుడెంత తనభావమును దాచిపెట్టినను నయ్యది యతని ముఖమున గనబడకమానదు. రామచంద్రా! నీవు కార్యములు సఫలముజేయు వారిలో నుత్తముడవు. చేయదగిన కార్యమును చేయదగినచోట ననుకూలకాలమున ననుకూలురయందు ప్రయోగించినచో నది తప్పక ఫలించును. ఇతడు మాత్రము స్వప్రయోజనము గోరక మనకొఱకే వచ్చినా డనుటయు జెల్లదు. ఇతడు నీ వొక్కడవే ఖరదూషణాదుల వధించుట, వాలిని జంపుట, సుగ్రీవునకు పట్టము గట్టుట మొదలగు నీ ఘనకార్యముల జూచియు, రావణుని దుష్కృత్యమును జూచి యతని కుపదేశము నిరుపయోగ మనియు నతని సాంగత్యము తనకే హానికలిగించుననియు తెలిసి తన యన్నను నీవు చంపి యా రాజ్యమును దనకిత్తువను నమ్మకముతో బుద్ధిపూర్వకముగ రాజ్యము నపేక్షించియే వచ్చియున్నాడు.

**ఏతావత్తు పురస్కృత్య యుజ్యతే త్వస్య సంగ్రహః ॥**

**యథాశక్తి మయోక్తం తు రాక్షసస్యార్జవం ప్రతి ।**
**త్వం ప్రమాణం తు శేషస్య శ్రుత్వా బుద్ధిమతాం వర ॥**



వీడు రాక్షసుడని శత్రుపక్షము వాడనిమాత్రము గ్రహించియుండుట దెలిసి యితని ఋజుత్వమును గూర్చి నా శక్తికొలది చెప్పితిని. నీవు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవు. నామాట లన్నియు విని యున్నావు. నీ కితనియందు గుణమే తోచునో, దోషమే తోచునో యితనిని పరిగ్రహింప వచ్చునో, త్యజింప వలెనో నీవే నిర్ణయించుకొనవలెను అనెను.

## శరణాగతరక్షణము

ఇట్లు రాముడు హనుమంతుని యభిప్రాయము నెఱిగి సుగ్రీవుని యాక్షేపణను గూర్చి తన యభిప్రాయ మిట్టిదని చెప్పుచున్నాడు.

**మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన ।**
**దోషో యద్యపి తస్య స్యా త్సతామేతదగర్హితమ్ ॥**

శరణాగతుడయి వచ్చిన వానియం దెట్టి దోషము లున్నను వానిని దిగ విడువను. ఇట్లు చేయుట సత్పురుషులకు నిందింపదగనిది యగుటయే కాదు మిక్కిలి కొనియాడదగినది' అనినంతనె సుగ్రీవుడు స్వామి సేవాపరాయణు డగుటచే–

**సుదుష్టో వాఽప్యదుష్టో వా కిమేష రజనీచరః ।**
**ఈదృశం వ్యసనం ప్రాప్తం భ్రాతరం యః పరిత్యజేత్ ।**
**కో నామ స భవేత్తస్య యమేష న పరిత్యజేత్ ॥**

"ఈ రాక్షసుడు మిక్కిలి దుష్టుడైన నేమి? దుష్టుడు గాకున్ననేమి? ఇతనివలన మనకేమి ప్రయోజనము? అమరావతి వంటి లంకానగరము కాలి పోయెను. రావణునిపుత్రులు మడసిరి. శత్రువులావలిగట్టున సిద్ధముగ నున్నారు. ఇట్టి యాపత్సమయమున అన్నను విడిచి శత్రుపక్షము చేరి నట్టి కృతఘ్నుని ఏ మనవలయును? వీడిక నితరుల విడుచునని చెప్పనేల" యనెను. అప్పుడు రామచంద్రుడు,

**వానరాధిపతేర్వాక్యం శ్రుత్వా సర్వానుదీక్ష్య చ ।**
**ఈషదుత్స్మయమానస్తు లక్ష్మణం పుణ్యలక్షణమ్ ॥**

సుగ్రీవుని మాటలు విని యందఱిని జూచి (నాపరమశక్తియగు శరణాగత రక్షకత్వవ్రతమును తెలిసికొనక యేమో వదరుచున్నాడని)



యించుక చిఱునవ్వు నవ్వి యెట్టి యాపదయందును వ్యసనమునందును తన్ను విడువకుండు పుణ్యలక్షణములు గల లక్ష్మణునితో–

**అనధీత్య చ శాస్త్రాణి వృద్ధాననుపసేవ్య చ ।**
**న శక్యమీదృశం వక్తుం యదువాచ హరీశ్వరః ॥**

"పూర్ణముగ శాస్త్రార్థముల నెఱుగక వృద్ధులను సేవింపకుండు వాడిట్లు సుగ్రీవునివలె మాట్లాడుటకు వీలుకాదు.

**అపాపా స్తత్కులీనాశ్చ మానయంతి స్వకాన్హి తాన్ ।**
**ఏష ప్రాయో నరేంద్రాణాం శంకనీయస్తు శోభనః ॥**

పుణ్యాత్ములగు రాజులు కూడ లోకములో పాపము నిండియుండుటచే మంచి గుణవంతుడగు జ్ఞాతినిగూడ సందేహింపవలసివచ్చును. రావణుని వంటి పాపియగు రాజునకు జ్ఞాతి శంకనీయుడే యగును. విభీషణుడు తన్ను శంకించిన రావణునితో విరోధము పూనియే వచ్చియున్నాడు. శత్రుపక్షమువానిని చేర్చరాదంటివి. చేర్చవచ్చుననుటకు కొన్నికారణము లున్నవి. అవియు నీతిశాస్త్రము ననుసరించినవియే, ఎట్లందువా?

**న వయం తత్కులీనాశ్చ రాజ్యకాంక్షీ చ రాక్షసః ॥**

మన మతని కులమునకు జేరినవారము గాము. కనుక రాక్షస రాజ్యమును గ్రహింప ననర్హులము. అందుచే నితనికి రావణునియందు వలె మనయందు శత్రుత్వ మేర్పడుట కవకాశము లేదు. మన మితని కిరుగు పొరుగువారము గాము సమయము జూచి యితడు మనల ప్రహరింపడు. వీడు రాజ్యము పొందగోరి మనచే రావణుని చంపింప వచ్చినవాడు.

**అవ్యగ్రాశ్చ ప్రహృష్టాస్తే న భవిష్యంతి సంగతాః ।**
**ప్రవాదశ్చ మహానేష తతోఽస్య భయమాగతమ్ ।**
**ఇతి భేదం గమిష్యంతి తస్మాద్గ్రాహ్యో విభీషణః ॥**

జ్ఞాతు లెప్పుడు పరస్పరము కలత లేక సంతుష్టులయి యుందురు గాని యొకరితో నొకరు కలసిమెలసియుండరు. ఇతని కంఠధ్వనిని జూడగా నితడు రావణుని వలన మిక్కిలి భయము గలిగి వచ్చినవాడుగ నున్నాడు. ఆత్మరక్షణముగోరి వచ్చినందున నితని పరిగ్రహించుట ధర్మము. ఎట్లున్నను జ్యేష్ఠానువర్తనమే శ్లాఘ్యమందువా?

**న సర్వే భ్రాతరస్తాత భవంతి భరతోపమాః ।**
**మద్విధా వా పితుః పుత్రా స్సుహృదో వా భవద్విధాః ॥**

నాయనా! లోకమున తోబుట్టువు లందఱు భరతునివంటివారు గారు, తండ్రులకు కుమారు లెల్లరు నావంటివా రగుదురా? స్నేహితులైనంత మాత్రమున నెల్లరు నీవంటిస్నేహితులు గానేరరు". (అన్నను జంపియో చంపించియో రాజ్యమును గ్రహించునట్టి స్వార్థపరులగు సోదరులు వేనవేలుగ నున్నారుగాని సౌభ్రాత్రము పాటించుటలో భరతునివంటివారు లేరని సుగ్రీవునకు తన వృత్తాంత మెట్టిదో యోచించుకొనుట కవకాశము గల్పించినట్లును గ్రహింపనగును.)

అంత రామునియం దంతరంగప్రీతి గల సుగ్రీవుడు, లక్ష్మణుడును దానును లేచి వినయముతో–

**రావణేన ప్రణిహితం త మవేహి విభీషణమ్ ।**
**తస్యాహం నిగ్రహం మన్యే క్షమం క్షమవతాం వర ॥**

**రాక్షసో జిహ్మయా బుద్ధ్యా సందిష్టోఽయమిహాగతః ।**
**ప్రహర్తుం త్వయి విశ్వస్తే ప్రచ్ఛన్నో మయి వానఘ ॥**
**లక్ష్మణే వా మహాబాహో స వధ్యస్సచివై స్సహ ॥**

**రావణస్య నృశంసస్య భ్రాతా హ్యేష విభీషణః ।**



ఉచితకార్యములు చేయువారిలో నుత్తముడా! వీడు రావణునిచే రహస్యముగ పంపబడినవాడని తెలిసికొమ్ము. అతనిని నిగ్రహించుటే యుచితమని నాకు దోచుచున్నది. అనఘా! మహాబాహో! ఈ రాక్షసుడు కపటబుద్ధితో నిచ్చటి కిప్పుడు వచ్చియున్నాడు. మన మేమరుపాటున నున్నప్పుడు నన్నో, నిన్నో, లక్ష్మణునో, మన మంత్రులతో గూడ వధించును. ఎందుకంటివా, ఈ విభీషణుడు క్రూరుడగు రావణుని తమ్ముడు గదా! వీనిని నమ్మరాదు అనెను.

ఇట్లు సుగ్రీవుడు చెప్పగా ఆ మాటలను విమర్శించి రామచంద్రు డతనితో

**సుదుష్టో వాఽప్యదుష్టో వా కిమేష రజనీచరః ।**
**సూక్ష్మమప్యహితం కర్తుం మమాశక్తః కథంచన ॥**

**పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్ ।**
**అంగుళ్యగ్రేన తాన్ హన్యా మిచ్ఛన్ హరిగణేశ్వర ॥**

ఈ రాక్షసుడు దుష్టుడైన నేమి? కాకున్న నేమి? వీడు నాకు గాని, నన్నాశ్రయించిన వారికిగాని, సంబంధముగల వారితో సంబంధముగల వారికి గాని యెట్టికీడు చేయలేడు. వానరరాజా! ప్రపంచమున భయంకరమగు క్రూర మగు పిశాచములుగాని దానవులుగాని లోకములోని రాక్షసులందఱు గాని నామీది కెత్తివచ్చినచో నాకిష్టమున్న యెడల వారి నెల్లరను నావ్రేలికొనతో నవలీలగ హతమొందింతును. శరణాగతరక్షణ మెట్టిదో వివరించెద.

**శ్రూయతే హి కపోతేన శత్రుశ్శరణమాగతః ।**
**అర్చితశ్చ యథాన్యాయం స్వైశ్చ మాంసైర్నిమంత్రితః ।**

**స హి తం ప్రతిజగ్రాహ భార్యా హర్తారమాగతమ్ ।**
**కపోతో వానరశ్రేష్ఠ కిం పునర్మద్విధో జనః ॥**

పూర్వమొక పావురము తాను నివసించు చెట్టుక్రిందికి వచ్చిన బోయవానిని అతిథిగ నెంచి శరణు జొచ్చినట్లు భావించి యతని చలిబాధ పోగొట్టి తన మేనిమాంసముతో నతని యాకలి దీర్చి దేవతను పూజించినట్లు పూజించెను. 'అతిథిదేవోభవ' అను వేదవాక్యమును తెలిసినదికాదు. కేవల మొక పక్షి. తన కంటిముందర తన భార్యను జంపినట్టి ప్రత్యక్ష శత్రువును శత్రుత్వము మఱచి మిత్రత్వమే కాదు దేవత్వమును గల్పించి, ఉత్తమ శాస్త్రవేత్త వలె తన్ను రక్షించుమనిగాని, సాయమొనర్పుమనికాని యడుగని సహృదయు డగువాని నర్చించిన విధమును జూడ మానవులలో నుత్తమమగు సూర్యవంశమున బుట్టి తన శరీరమును కోసియిచ్చి శరణాగతుని రక్షించిన శిబిచక్రవర్తిపరంపరకు జెందిన వాడనగు నేనేమి చేయవలెనో యూహింపుము. మఱి యొక వృత్తాంతము వినుము:

**ఋషేః కణ్వస్య పుత్రేణ కందునా పరమర్షిణా ।**
**శృణు గాథాం పురా గీతాం ధర్మిష్ఠాం సత్యవాదినీమ్ ॥**

కణ్వమహర్షి యొక్క పుత్రుడు పరమ ఋషియు నగు కందుమహర్షి ధర్మయుక్తమును సత్యవాదిత్వమును ప్రకటించు శరణాగతధర్మమును వివరించు గాథ నిట్లు చెప్పినాడు.

**బద్ధాంజలిపుటం దీనం యాచంతం శరణాగతమ్ ।**
**న హన్యా దానృశంస్యార్థ మపి శత్రుం పరంతప ॥**

**అర్తో వా యది వా దృప్త ః పరేషాం శరణాగతః ।**
**అరిః ప్రాణాన్పరిత్యజ్య రక్షితవ్యః కృతాత్మనా ॥**



**నచేద్భయాద్వా మోహాద్వా కామాద్వాపి న రక్షతి ।**
**స్వయా శక్త్యా యథా సత్త్వం తత్పాపం లోకగర్హితమ్ ॥**

**వినష్టః పశ్యతస్తస్యా రక్షిణశ్శరణాగత ః ।**
**ఆదాయ సుకృతం తస్య సర్వం గచ్ఛేదరక్షితః ॥**

**ఏవం దోషో మహానత్ర ప్రపన్నానామరక్షణే ।**
**అస్వర్గ్యం చాయశస్యం చ బలవీర్యవినాశనమ్ ॥**

పరంతపా! క్రూరుడని లోకాపవాదము కలుగకుండుటకు చేమోడ్చి 'నేను శరణాగతుడనను వానిని శత్రువైనను జంపరాదు. గురువుచే సుశిక్షితు డగువారు శాస్త్రములను త్రికరణముల నమ్మువాడు తన ప్రాణము గోలు పోయి యైనను భయపడియున్నవానిని, భయపడినట్లు నటించువానిని, లోపల శత్రుత్వము నెంచి శరణని చెప్పి శరణాగతి చేసినవానిని రక్షింపవలెను, తన ప్రాణమునకు హాని వచ్చుననిగాని శాస్త్రార్థమిట్టిదని తెలియనందున గాని, వాని విరోధముచే తనకు లాభము గలుగుననిగాని తన యిష్టము చొప్పున ప్రవర్తింపవచ్చుననిగాని మఱి యే నెపముచేగాని తన శక్తికొలది శరణాగతుని రక్షింపనివానికి ప్రత్యవాయము గలుగును. లోకము అతని నిందించును. ఒకడు తన్ను రక్షింపుమని శరణు జొచ్చినపుడు తా నతని రక్షింప సమర్థు డయ్యు రక్షింపకుండుటచే శరణాగతుడు శత్రువుచే నాశమొందినచో ఆ రక్షింపనివాని చిరకాలార్జిత ఉత్తమలోకమును శరణాగతుడు పొందును. ఇట్లు శక్తుడగువాడు శరణాగతుని రక్షింపనిచో నరకము పొందును, లోకమున నపకీర్తి కలుగును. బలవీర్యములు నశించును. కనుక ఉత్తమోత్తమమగు కందుమహర్షి వచనము చొప్పున శరణాగతుని రక్షించెదను.

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥**

ఒక పర్యాయము శరణని వేడి శరణుజొచ్చి 'నేను నీ వాడను' (నీ దాసుడను) అని చెప్పి రక్షింపుమని యాచించు వానికి సకల ప్రాణులవలనను భయము గలుగకుండున ట్లభయమిత్తును. ఇది నా యొక్క వ్రతము.

**ఆనయైనం హరిశ్రేష్ఠ దత్త మస్యాభయం మయా ।**
**విభీషణో వా సుగ్రీవ యది వా రావణస్స్వయమ్ ॥**

వానరోత్తమా! ఇతడు 'నేను నీ వాడను' అనినపుడె నే నతని కభయ మిచ్చితిని. ఇతడు నిన్నే పురుషకారభూతుడుగ నమ్మియున్నాడు. ఇతడు విభీషణుడే యైనను సరే. లేక ఆ వేషములో నున్న రావణడేయైనను సరే. నిస్సంశయముగ నాతని గొనిరమ్ము' అని నంతనే సుగ్రీవు డనేక విధముల విభీషణుని త్యజింపవలెనని వాదించియుండినను శ్రీరాముని కల్యాణ గుణములలో నుత్తమమగు సౌహార్దమును జూచి యట్టి శత్రువునందును గనబఱచు సౌహార్దమే గాక తనయందలి సౌహార్దాతిశయముచే తన్నాతని గొనివచ్చు నట్లా జ్ఞాపించి నందున నినుమడించిన యాశ్చర్యముతో రాముని జూచి–

**కి మత్ర చిత్రం ధర్మజ్ఞ లోకనాథ సుఖావహ ।**
**యత్త్వమార్యం ప్రభాషేథాస్సత్త్వవాన్సత్పథే స్థితః ॥**

**మమ చాప్యంతరాత్మాఽయం శుద్ధం వేత్తి విభీషణమ్ ।**
**అనుమానాచ్చ భావాచ్చ సర్వతస్సుపరీక్షితః॥**

**తస్మాత్ క్షిప్రం సహాస్మాభి స్తుల్యో భవతు రాఘవ ।**
**విభీషణో మహాప్రాజ్ఞస్సఖిత్వం చాభ్యుపైతు నః ॥**

"ఆర్యా! సకల ధర్మముల నెఱుగుటే కాక యాచరించుచు సకల లోకములను రక్షించు స్వామివి, ఇతరులకు సుఖముగలిగింప నవతరించిన వాడవు. నీవు సర్వశక్తుడ వగుటచే ధర్మసంస్థాపనమను వ్రతమున స్థిరముగ నెలకొని యున్నవాడవు. నీ మాట సర్వసమంజసము. ఇందాశ్చర్య మేమున్నది? నీ యాజ్ఞయనిమాత్ర మీ కార్యమునకు గడంగుటకాదు. ఇప్పుడు నా మనసునను విభీషణుడు నిష్కపటుడు నిర్మల మనస్కుడనియే తెలియుచున్నది. హనుమంతుడును నీవును జెప్పిన విషయములను బట్టియు, ముఖలక్షణాదుల బట్టియు నితని యార్తధ్వనిచే వెల్లడియగు మృదుస్వభావమును బట్టియు, నే నితని వధింపవలె ననునపుడుగాని, నీ వితనిని దిగవిడువనని వాదించినప్పుడుగాని యితడెట్టి వికారమును బొందకుండుట బట్టియు నితనిని బాహ్యముగను నంతరంగముగను చక్కగ పరీక్షించియైనది. రాఘవా! మహాప్రాజ్ఞుడగు విభీషణుడు శీఘ్రముగ మాలో నొకడుగ నుండుగాక! మాకు స్నేహితుడగుగాక అనెను. అంత రామచంద్రుడు సుగ్రీవునిమాట విని తా నభయమిచ్చిన సంగతి విభీషణున కెఱిగించి కపిరాజాతని దోడ్కొని రాగా రామచంద్రుడు, దేవేంద్రుడు గరుత్మంతునితో వలె విభీషణునితో గలసికొనెను.

మహాప్రాజ్ఞుడగు విభీషణుడు తన యాంతరంగికులగు నలుగురు అనుచరులతో వానరులమధ్యనున్న స్థలమున దిగి రామునిచరణార విందముల బడి శరణాగతునకు దగిన విధమున మున్ను తన మాటలు కఠినములుగ దోచిన వానరుల కిప్పుడు మృదుమధురముగ నుండు నట్టి మాటలతో రాముని జూచి–

## విభీషణ శరణాగతి

**అనుజో రావణస్యాహం తేన చాప్యవమానితః ।**
**భవంతం సర్వభూతానాం శరణ్యం శరణాగతః ॥**

**పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ ।**
**భవద్గతం మే రాజ్యం చ జీవితం చ సుఖాని చ ॥**

నేను రావణుని తమ్ముడను. అతనిచే అవమానింపబడితిని. సకల భూతములకు రక్షకుడవగు నిన్ను శరణుజొచ్చుచున్నాను. నేను నా జన్మభూమియగు లంకను, మిత్రులను, ధనమును విడిచి నీవే పరమ గతియని నిశ్చయించి వచ్చితిని. ఇక నా రాజ్యమును, జీవితమును, సుఖమును నీ యధీనములు, ఇవన్నియు నీ కైంకర్యమున కీడుగావు అనెను.

లోకమున జీవాత్మలకు కోరదగినది నిత్యభగవదనుభవము. ఈ మర్త్య లోకమున దేహధారులకు మోక్ష మపేక్షణీయము. పునర్జన్మరాహిత్యమందుకు ప్రథమ సోపానము. ప్రకృతిపరిణామ మగు దేహమునందలి బద్ధజీవుడు అప్రాకృతస్థానవిశేషమును బొంది యప్రాకృత దివ్యరూపమును బొంది శ్రీమన్నారాయణునకు నిత్యకైంకర్యము చేయుచుండుటే నిత్య నిరతిశ యానందము.

'యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ' అనుటచే నట్టి దివ్య దేశము శ్రీవైకుంఠమని పరమపదమని యనబడును.

**"వైకుంఠే తు పరేలోకే శ్రియా సార్థం జగత్పతిః ।**
**ఆస్తే విష్ణురచింత్యాత్మా భక్తైర్భాగవతైస్సహ ॥"**

అని వైకుంఠలోకమున జగత్పతి యగు నారాయణుడు లక్ష్మీదేవితో గూడి నిత్యముక్తులగు భక్తులు భాగవతులు నగు వారితో వెలసియున్నాడు. అతనిని పొందుటకు అర్థపంచకజ్ఞాన మవసరము, అవే మనిన,

**ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః ।**
**ప్రాప్త్యుపాయం ఫలం చైవ తథా ప్రాప్తివిరోధి చ ॥**

1. ప్రాప్యమైన బ్రహ్మస్వరూపము; 2. పొంద బోయెడు జీవాత్మ స్వరూపము; 3. బ్రహ్మమును పొందుట కుపాయము; 4. అందు వలన లభించు ఫలము; 5. ఆ ఫలము లభింపకుండ జేయు విరోధి స్వరూపము.



విభీషణుని శరణాగతిలో నీ యైదు స్వరూపము లున్నవేమో పరిశీలిం తము. 1. రామచంద్రుని చేరవలెననుట విభీషణుని బ్రహ్మ జ్ఞానమును తెలుపును. 2. తాను సర్వవిధముల నశక్తుడను భావము జీవస్వరూపమును వెల్లడిచేయును. 3. బ్రహ్మమును(శ్రీరాముని) పొందుటకు సులభోపాయము శరణాగతియని యేర్పడుచున్నది. 4. అట్టి శరణాగతివలన లభించునది రామ కైంకర్యసంపద యని తెల్లమగుచున్నది. 5. కైంకర్య స్వరూప ఫలమునకు తన దేశము. తన భార్యాపుత్రాదులు, ధనము మొదలగునవి విరోధి వర్గమని స్పష్టమగుచున్నది. ఇట్టి అర్థపంచకజ్ఞానముతో జేసిన శరణాగతి సాంగముగ శాస్త్రీయముగ నున్నదేమో విచారింతము. మోక్షసాధనములు ముఖ్యముగ జ్ఞానయోగము, కర్మయోగము; భక్తియోగము. వీనిని విడిచి శరణాగతిని అనుష్ఠింపవచ్చునా యను సందేహము గలుగవచ్చును భక్తి సామాన్య మానవులకు సులభముగ పట్టు పడుట దుష్కరము, అందుకు అనర్హుడని తెలిసికొనిన మానవుడు గత్యంతరములేక శరణాగతి ననుసరించి తీరవలెను. అదెట్లనిన భగవంతుని 'రక్షకా! నేను ధర్మనిష్ఠ గలవాడను గాను, నా కాత్మజ్ఞాన మణుమాత్రము లేదు. నేను భక్తిశూన్యుడను. జ్ఞాన వైరాగ్యాదు లెట్టివో యెఱుగను. మోక్షోపాయములలో సులభ మనబడు భక్తి చేయుటకు నేను సర్వవిధముల నశక్తుడను. కావున నీవే నీ పరమకృపావిశేముచే భక్తి యోగానుష్ఠానమందు నిలిచి దాని ఫలమగు మోక్షమును నా కొసంగవలెను. ఇట్టి సోమరికి నేనెట్లు సహాయము చేయుదునందువా? నే నెట్టి యోగ్యతయు లేక కేవలము నిన్నే నమ్మి నీ పాదములనే ఆశ్రయించు వాడను. నాకేమియు చేతకాదు. నన్ను రక్షింప నీవుదప్ప నితరు లెవ్వరును లేరు అని తనయాత్మను భగవంతుని చరణములందు సమర్పించుటయే ప్రపత్తి. శరణాగతి, భరన్యాసమనబడును. అట్టి శరణాగతి స్వరూప మెట్టిదో వివరింతము.

**ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్ ।**
**రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణం తథా ।**
**ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః ॥**

1. ఆనుకూల్యసంకల్పము: శ్రీరామునకు ధనకనకరత్నాదులతో సీతా దేవిని సమర్పించి శరణు జొచ్చుట సర్వదోషపరిహారమని చెప్పి రావణుని యాపదను బోగొట్ట యత్నించుట ఆనుకూల్య సంకల్ప మగును.

2. ప్రాతికూల్యవర్జనము: అన్ని విధముల హితము చెప్పియు నిరుపయోగ మగుటయే కాక తన కవమానము సంప్రాప్తమయినందున గత్యంతరము లేక తనకు జ్యేష్ఠుదును, పితృసముదును, రాజు నగు రావణుని విడిచి పెట్టుట తన స్వరూపమునకు విరోధముగ నుండుదానిని వదలుట ప్రాతికూల్య వర్జన మగుచున్నది.

3. మహావిశ్వాసము: 'సర్వలోక శరణ్యాయ' అనుటచే సకల లోకములకు బరమగతియు, రక్షకుడునగు రామచంద్రుడు తన్ను తప్పక రక్షించునను మహావిశ్వాసము గలిగియుండుటను చాటుచున్నది.

4. గోప్తృత్వవరణము: 'రాఘవం శరణం గతః' అను ఉపాయవరణ వాక్యముచే శరణాగతుడగు తన్ను గాపాడవలెనని యడిగినట్లగుచున్నది.

5. ఆత్మనిక్షేపము: తన యాత్మను భగవంతుని చరణారవిందముల యందు సమర్పించుట. నిజముగ తనదిఅని చెప్పుకొనదగినది ఆత్మయే. శరీరమును గాని తత్సంబంధములగు వస్తుసముదాయమునుగాని రక్షించుటకంటె తన యాత్మ స్వరూపమెఱిగి దానిని పరమాత్మ లేక పరబ్రహ్మమున కర్పణము చేయుట ముఖ్యకృత్యము. దానినే ఆత్మనిక్షేపమని, ఆత్మ సమర్పణ మని, భరన్యాసమని చెప్పుదురు.



6. కార్పణ్యము: ఇందు రెండు విషయము లిమిడియున్నవి. 1. ఆకించిన్యము (తన శక్తి లేమి) ; రావణుని దుర్గ్రహము నుండి తప్పింప విశ్వప్రయత్నము చేసియు విఫల మగుటచే తన కార్యసాధనా శక్తి హీనత్వమును దెలుపును. స్వవిషయమునను తన్ను దాను రక్షించుకొనలేని దీనస్థితిని తెలుపుచున్నది. 2. అనన్యగతికత్వము; ఇతరు లెవరైన తన్ను కాపాడగలవా రున్నారా యని యడిగన లేరనియే చెప్పవలసియున్నది. లేక తానే తన్ను రక్షించుకొనవలదా యనిన అదియు నసాధ్యమే. కనుక కార్పణ్యమను నంగముతోను గూడినది విభీషణశరణాగతి యని స్పష్టమగుచున్నది. ఈ యాఱింటిలో నైదవదియగు ఆత్మనిక్షేపమనబడు శరణాగతి అంగి (ముఖ్య కర్తవ్యము); మిగిలిన యైదును దాని యంగము లగుటచే 'నాస్యః పంచాంగసంయుతః' అని చెప్పబడుచున్నది.

విభీషణశరణాగతి మూడు విధములు, 1. మానసికము, 2.వాచికము, 3. కాయికము. 1. తన హిత బోధను ఆదరింపక రావణుడు తన్ను తృణీకరించినపుడే శ్రీరాముని శరణు జొచ్చుటయే కర్తవ్యమని నిశ్చయించుటే మానసిక శరణాగతి. 2. సుగ్రీవాది వానరుల సమీపమున నంతరిక్షమున నలుగు రనుచరులతో నుండి గంభీరముగ–

**'సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే ।**
**నివేదయత మాం క్షిప్రం విభీషణముపస్థితమ్ ॥**

అనుట వాచికముగ శరణాగతి చేయుటను శ్రీరామున కెఱింగింప సుగ్రీవాదుల పురుషకారము గోరుట యగును. 3. సుగ్రీవాది వానరుల యాక్షేపము, హనుమంతుని యంగీకారము విని రామచంద్రుడు స్నేహభావముతో వచ్చిన వా డెట్టివా డైనను, వాడు తన కపకారమే చేయదలచినను, కపోతోపాఖ్యానము, కండుమహర్షివాక్యము చొప్పున

నంగీకరించి తన యందలి ప్రేమాతిశయముచే సత్యమును ధర్మమును నెఱుంగలేని సుగ్రీవునే పంపి విభీషణుని పిలుచుకొని రమ్మనినపుడు విభీషణుడు తన యనుచరులతో రాఘవుని చరణములందుబడి,

**'అనుజో రావణస్యాహం తేన చాప్యవమానితః ।**
**భవంతం సర్వభూతానాం శరణ్యం శరణాగతః॥**
**పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ ।**
**భవద్గతం మే రాజ్యం చ జీవితం చ సుఖాని చ ॥**

అనుట కాయికముగ శరణాగతిధర్మ మనుష్ఠించుట యగును.

శ్రీమద్రామాయణము సర్వశరణ్యుడగు భగవంతుని వశీకరింపజేయ గల పరమ హితమును పరమపురుషార్థసాధకమునగు నది శరణాగతి ధర్మమే యని యుపక్రమము నుండి చాటుచున్నది. దశరథుని యజ్ఞమున హవిర్భాగము గ్రహింప వచ్చిన బ్రహ్మాదిదేవతలు శంఖచక్రపీతాంబరధారియై విచ్చేసిన విష్ణుదేవుని రావణుని బాధనుండి తమ్ము తప్పించి కాపాడునట్లు 'సిద్ధ గంధర్వయక్షాశ్చ తతస్త్వాం శరణం గతాః ' అని చేసినది మొదటి శరణాగతి. 'భయం త్యజతి భద్రం వః' అని శ్రీమన్నారాయణుడు చేసిన మొదటి యభయప్రదానము నదియే. త్రిశంకుశునశ్శేఫాదుల వృత్తాంతము లలో విశ్వామిత్రాదుల వ్యాపారముల వలన శరణాగత రక్షణము పరమధర్మమని తెలియుచున్నది.

**'భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే ।**
**అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చ తే ॥**

అను లక్ష్మణుని వాక్యముచే సీతారాముల కైంకర్యము చేయగోరినట్లు చెప్పుటచే శరణాగతి మంత్ర విశేషమును. దాని ఫలమును జెప్పినట్లగు చున్నది. చిత్రకూటమున భరతుడు చేసిన శరణాగతికి వెంటనే ఫలము



లభింపకున్నను అప్పుడు శ్రీరామపాదములకు ప్రతినిధియగు పాదుకలు లభించుటచే సఫలత్వము చెప్పి శ్రీపుష్పకవిమానమున రాముడు మరలి వచ్చినపుడు శ్రీరామచరణకమలములే లభించుటచే నతని శరణాగతి పూర్ణఫలమును పొందినదనియే చెప్పనగును.

**'తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః ।**
**నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వర'॥**

'అరణ్యమున నున్నను వనమున నున్నను నీ రాజ్యమందలివార మగుటచే నీవు మమ్ము రక్షింపవలెనని' ఋషులు శరణాగతి చేసినందుకు రాక్షసుల వధించి ఋషులను రక్షించినఫల మిట్టిదని తెలియును.

ఇంద్రపుత్రుడగు జయంతుడు కాకిరూపమున సీతాదేవిపట్ల చేసిన మహాపచారమునకు రామునిచే ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రమతని తరుమగా ముల్లోకములలో నతనిని గాపాడువారు లేక తిరిగి తిరిగి, 'స పిత్రా చ పరిత్యక్త స్సురైశ్చ సమహర్షిభిః తండ్రి యగు వజ్రివలన, శచీదేవివంటి తల్లివలనను, దేవతలవలనను, ఋషులవలనను విడువబడి, 'బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాంతకో వా! ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్'॥ అప్పు డా కాకి. ('త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః') ముల్లోకములు తిరిగి రాముని పాదములపై బడెను.

**'స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్ ।**
**వధార్హమపి కాకుత్థః కృపయా పర్యపాలయత్ ' ॥**

ఇట్లు శరణాగతుడై నేలమీద బడియున్నవానిని వధార్హుడేయైనను కేవలము కృపావిశేషముచే రామచంద్రుడు రక్షించెను. ఇందుకు పురుషకార భూతయగు సీతాదేవి సమీపమున నుండుటయే ముఖ్యకారణము.

బ్రహ్మాస్త్రమున కాహుతిగ నతని కంటి నొక్కదాని నిచ్చునట్లు చేసెను. ఇట్లాద్రాపరాధి యగు వానిని శరణని యనిన సంరక్షించుట శరణ్యధర్మమని స్పష్టమగుచున్నది. రామచంద్రునితో సుగ్రీవుడు పెట్టిన గడువు తప్పినందున కోపావేశముతో వచ్చిన లక్ష్మణుని జూచి సన్మంత్రియగు హనుమంతుడు.

**'కృతాపరాధస్య హితే నాన్యత్పశ్యామ్యహం క్షమమ్ ।**
**అంతరేణాంజలిం బద్ధ్వా లక్ష్మణస్య ప్రసాదనాత్ ॥**

అని శరణు జొచ్చుటే లక్ష్మణుని శాంతింపజేయు సాధనమని సుగ్రీవునకు హిత ముపదేశింప నా వానరరాజును వల్లెయని–

**'యది కించిదతిక్రాంతం విశ్వాసాత్ప్రణయేన వా ।**
**ప్రేష్యస్య క్షమితవ్యం మే న కశ్చిన్నాపరాధ్యతి' ॥**

అని క్షమాపణ గోరుట జూడ భగవద్విషయమున నపచారపడినను భాగవతుల 'క్షమాపణ గోరుటచే భగవంతుడు శాంతించి యనుగ్రహించుటచే అపరాధియు నిరపరాధియై కైంకర్యయోగ్యు డగునని విశదమగుచున్నది.

**'యచ్చ శోకాభిభూతస్య శ్రుత్వా రామస్య భాషితమ్ ।**
**మయా త్వం పరుషాణ్యుక్తస్తచ్చ త్వం క్షంతుమర్హసి' ॥**

అను లక్ష్మణునివాక్యముచే శ్రీరాముని శోకతాపము సహింపక తానట్లు కఠినముగ మాటలాడినందుకు తన్ను క్షమించునట్లు సుగ్రీవుని కోరుటవలన అపరాధము చేసిన శ్రీవైష్ణవులు అనుతాపముచే ప్రాయశ్చిత్తము చేసికొనినవా రగుటచే నపరాధ సమయమున ననాదరణ చేసినందులకై క్షమాపణ గోరుట ధర్మమను శాస్త్రార్థము వెల్లడియగుచున్నది. ఇట్లు విభీషణ వృత్తాంతమునకు మునుపు శరణాగతిధర్మమున నీ ప్రబంధము పోయిన పోకడను వివరించితిమి. ఇక దాని యనంతరము జరిగిన విషయముల బరిశీలింతము.



'సముద్రం రాఘవో రాజా శరణం గంతు మర్హతి' అను విభీషణుని మాట చొప్పున రాముడు మూడు దినములు దర్భశయనమున నుండి చేసిన శరణాగతి ఫలింపలేదు. ఏల? అశక్తుడు శక్తుని విషయమున జేసిన శరణాగతి ఫలించునేగాని శక్తు దశక్తునియందు జేసిన శరణాగతి ఫలింపదని అల్పమతియు నల్పశక్తుడు నగు సముద్రుని వృత్తాంతమువలన విస్పష్టమగుచున్నది.

శరణాగతికి శ్రీ మహాలక్ష్మి యొక్క పురుషకారము ముఖ్యమని యీ క్రిందివాక్యము లుద్ఘోషించుచున్నవి. 'రిపూణామపి వత్సలః' అనబడు రామచంద్రుడు,

**'అరాక్షసమిమం లోకం కర్తాస్మి నిశితైశ్శరైః ।**
**న చేచ్ఛరణమభ్యేషి మాముపాదాయ మైథిలీమ్ ॥**

అనుటచే భగవంతుని శరణ్యునకు దగిన సర్వశక్తిత్వమును, పరమకారుణికత్వమును, హితప్రవర్తకత్వమును వెల్లడియగుచున్నవి. 'ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ' అను జనకుని వాక్యముచే శరణాగతరక్షణమను నీ స్వధర్మమును నిర్వహించుటలో ఈ నా కూతురగు సీతాదేవి నీ కన్నివిధముల తోడ్పడు నని చెప్పినట్లు గ్రహింపవలెను.

**'విదితస్సహి ధర్మజ్ఞః శరణాగతవత్సలః ।**
**తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి' ॥**

అనుటచే రావణుడు ప్రతికూలుడుగ నున్నను మాతృత్వ ప్రయుక్తమగు వాత్సల్యముచే నిట్లనుటవలన నీదంపతులు లోకహితములో సమానాభిప్రాయములు కలవారని తెలియుచున్నది.

**'భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః కిం వివక్షయా ।**
**రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితమ్ ॥**

**ప్రణిపాతప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా ।**
**అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్' ॥**

అని త్రిజట సీతను బెదరించిన రాక్షస స్త్రీలకు హితోపదేశము చేయుటచే సీత యొక్క ప్రభావమును ఆజ్ఞానులును తామసప్రకృతులు నగు రాక్షస స్త్రీలకు దెలుపుటలో నామెవురుషకారమహిమ యెట్టిదో వివరించినట్లగును రావణవధానంతరము హనుమంతుడు సీతతో ఆ రాక్షస స్త్రీలను దండింప గోరెదనని చెప్పినంత నామె,

**'పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ ।**
**కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి'॥**

"ఓ వానరా! మేలుగాని కీడుగాని చంపదగినవారినైనను దయతో గాపాడుట ఆర్యుల కర్తవ్యము. లోకములో 'అపరాధము చేయనివారు లేరు' అనుటలో సీతాదేవి శ్రీరామునికంటె శరణాగత రక్షణమున నుత్తమస్థాన మలంకరించినదని చెప్పవచ్చును. రామచంద్రు డొక్క పర్యాయమైనను 'నేను నీవాడ' ని చెప్పిన జాలుననెను. ఈమె తనకు ప్రత్యక్షముగ నపకారమే చేయుచుండు వారిపట్ల నిట్లని వారిని రక్షించెను. ఈ వృత్తాంతము ననుసంధించిన భట్టరు రామగోష్ఠి కనర్హులమగు మనకు సీతాదేవియొక్క ఆశ్రయమే పరమగతియని–

**మాత ర్మైథిలి రాక్షసీస్త్వయి తదైవార్ద్రాపరాధాస్త్వయా**
**రక్షంత్యా పవనాత్మజాల్లఘుతరా రామస్య గోష్ఠీకృతా ।**
**కాకం తం చ విభీషణం శరణమిత్యుక్తి క్షమౌ రక్షత**
**స్సా నస్సాంద్రమహాగసస్సుఖయతు క్షాంతి స్తవాకస్మికీ ॥**

ఇట్లు ఘోషించెను. ఇట్లాఱుకాండములలోను శరణాగతిధర్మమే చాటింపబడుచున్నది. ఉత్తరరామాయణమున రావణుని తాతలకాలమున



తమ్ము రక్షింప శరణాగతి చేసిన దేవతల కభయమిచ్చి యుద్ధములో లంకవైపు పాఱి పోవు రాక్షసులను దఱుమునట్టి సమయమున మాల్యవంతుడు,

**'నారాయణ న జానీషే క్షాత్రధర్మం పురాతనమ్ ।**
**అయుద్ధమనసో భీతా నస్మాన్ హంసి యథేతరః ॥**

అని యుద్ధము నుండి పాఱిపోవుచుండు మమ్ము తఱిమి చంపుట క్షత్రధర్మమునకు విరుద్ధమగునని తెలిసిన నీ విట్లు చేయదగునా? యని ప్రశ్నింప, సర్వేశ్వరుడు. 'మేము క్షత్రియులమైన గదా నీ మాట చెల్లును? నీ వాడినట్లు నేను నారాయణుడ నగుటచే నారాయణ ధర్మమగు శరణాగతరక్షణము చేయుచున్నాను.

**'యుష్మత్తో భయభీతానాం దేవానాం వై మయాభయమ్ ।**
**రాక్షసోత్సాదనం దత్తం తదేతదనుపాల్యతే ॥**

**ప్రాణైరపి ప్రియం కార్యం దేవానాం హి సదా మయా ।**
**సోఽహం వో నిహనిష్యామి రసాతలగతానపి' ॥**

మీ వలన ప్రాణభయము గలుగునని భయపడి దేవతలకు మిమ్ము జంపి రక్షించెదనని యభయమిచ్చినందున మీరు పాతాళమునకు బోయినను వధించెద ననియు గోవుల రక్షింప పులుల వెన్నంటి చంపునట్లే మిమ్ము చంపెద మనుటలో క్షత్రియధర్మము లన్నిటిలో శరణాగత రక్షణమే ముఖ్యముగ పాటింపదగినదని విశదమగుచున్నది. ఇట్లే సుగ్రీవుడును శరణాగతు డగుటచే నతని న్యాయమే వెల్లడియగుచున్నది.

ఇట్లు బ్రహ్మాదిదేవతలకును శరణ్యుడై పరమకారుణికుడగుటచే శ్రీరామపరతత్త్వమును చాటుటకై వేదోపబృంహణమగు శ్రీమద్రామాయణ మును రచించి శ్రీ వాల్మీకి భగవానుడు శరణాగతి వేదమును వివరించిన

వాడయ్యె, ఇందు నీ యభయప్రదాన ప్రకరణము సర్వరహస్యసారములను సుస్పష్టముగ వెల్లడించిన యుపనిషద్భాగము.

## అభయప్రదానము

లోకములో సత్త్వరజస్తమోగుణములు నర రాక్షస దేవగణములలో గుణభేదములను, తదనుగుణమగు వ్యాపారములను గల్పించి శుభా శుభకృత్యముల గావించుచున్న వనుట నిజము. తమోగుణపూర్ణుడగు కుంభకర్ణుడు తొలుత రావణుని సీతాపహరణము నిందించి బుద్ధి నిలుకడ లేనందున రావణుని బెదరింపునకు లొంగి వానియిష్టము చొప్పున యుద్ధము చేసి మరణించెను. రాజసగుణ ప్రధానుడగు దశకంఠుడు విభీషణుని పరమహితోపదేశమును పెడచెవిని బెట్టి దుర్మంత్రుల బోధనలు విని సమూలముగ నాశమొందెను. అట్లుగాక సత్త్వగుణనిధియగు విభీషణుడు 'పరమాపద్గతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్' అని యెట్టి యాపదలోను తనకు ధర్మమునందే బుద్ధి నిలచియుండవలెనని బ్రహ్మదేవునిచే వరము పొందినట్లే రావణుని యకృత్యముచే సర్వరాక్షసవినాశ మేర్పడినప్పుడు మహావివేకియై అత్యంతహితమగు మాటలు చెప్పియు విఫల మగుటచే సర్వలోక శరణ్యుడగు శ్రీరామునియందు శరణాగతి ధర్మము అనుష్ఠించి (యతనిచేతను అనుష్ఠింప జేయుటచే శరణాగతి పరమధర్మమనుటలో శిష్టాచారము నెత్తి చూపుచున్నాడు వాల్మీకి మహర్షి, విభీషణుడు శరణాగతుడై వచ్చినపుడు సుగ్రీవాది వానరులు విఘ్నము గావింప యత్నించినను శుద్ధమనస్కులై అనన్యులై వచ్చి యాశ్రయించినవారిని–

**'ప్రపత్తికాలాదారభ్య త్వాత్మలాభావసానికమ్ ।**
**యత్రావకాశో విఘ్నానాం విద్యతే న కదాచన'॥**

అనునట్లు భగవంతుని తానే విఘ్నము లన్నిటిని శమింపజేసి శరణాగతి రక్షణము గావించునని తెలియుచున్నది.



రావణాదులకు హితోపదేశము చేయుటవలనను దూతగ వచ్చిన ఆంజనేయుని దురాత్ముడగు రావణుడు చంప నాజ్ఞాపించినపుడు దానిని తప్పించుట చేతను, పుట్టుకతోడి బాంధవ్యమును, గొప్ప యైశ్వర్యమును పుత్రదారాదులను త్యజించుటచే ప్రాతికూల్యవర్జనము చేయుటయు శ్రీరాముడు సర్వలోకశరణ్యుడనుటచేతను, 'ఆజగామ మహూర్తేన యత్ర రామ స్సలక్ష్మణః' అని ప్రాణాపాయము గలుగవలసిన స్థలమును నిస్సంశయ ముగ తన్ను రక్షించువారుండు స్థలము గనుక తన కిదియే స్వస్థలమని భావించి వచ్చినా డనుటలో ఆనుకూల్య సంకల్పము, రక్షించునను మహావిశ్వాసమును వెల్లడియగుచున్నవి. 'రాఘవం శరణం గతః' అను ఉపాయవరణవాక్యముచే గోప్తృత్వవరణము చెప్పబడినది. శరణశబ్దముచే రక్షాభరసమర్పణమను నాత్మనిక్షేపమును–

**'సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే ।**
**నివేదయత మాం క్షిప్రం విభీషణముపస్థితమ్ ॥**

అని యంతరంగులగు వారిని పురుషకారము చేయునట్లు ప్రార్థించెనని విశదమగుచున్నది.

ఇచ్చట రామలక్ష్మణులు నితరులును వినునట్లు 'ప్రణాదశ్చమహానేషః ' అనునట్లు ఘోషించియడుగుటచే 'సఖ్యమాత్మనివేదనమ్ కిం కరోమ్మీతి చాత్మానం దేవాయైవం నివేదయేత్ 'నివేదయత మామ్' అనుటచే నన్ను శరణ్యునకు సమర్పింపుడని చెప్పినట్లు భావింపవలెను. 'రావణోనామ దుర్వృత్తః' అని ప్రారంభించి 'సోహం పరుషితస్తేన దాసవచ్చావమానితః' అనుటచే దురాత్ముడగు రావణునకు చేసిన హితోపదేశము నిరర్థకమని 'స్వరేణ మహితామహిక' అను నార్తస్వరము వలనను 'నివేదయత మాం క్షిప్రమ్' అను త్వరాతిశయము చేతను 'ప్రణాదశ్చ మహానేషః తతోఽస్య భయమాగతమ్ ' అను సర్వజ్ఞు డగు శరణ్యుని వాక్యముచేతను కార్పణ్యము

చెప్పబడినది. ఇట్లు ద్వయమంత్రమున పూర్వఖండముతో జెప్పబడు స్వరక్షాభరసమర్పణాత్మకమగు ప్రపత్తిని సర్వావస్థలలోను ధర్మసారముగ దృఢవ్రతుడగు శ్రీ విభీషణు డనుష్ఠించెను.

శ్రీవిభీషణుని శరణాగతికి శరణ్యుడగు భగవంతుని చరణారవిందము లందు కైంకర్యమే ప్రధానఫలము. అదెట్లనిన శరణాగతినుద్దేశించి 'త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః' అని యితరవిషయములం దతనికి గల నైరాశ్యము కంఠోక్తిగ స్పష్ట మగుటయు మరల శ్రీరామునితో విన్నపము చేయునపుడును–

**'పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ ।**
**భవద్గతం మే రాజ్యం చ జీవితం చ సుఖాని చ ' ॥**

అని సకల పురుషార్థములను మీ పాదసేవయే యనుటవలనను నిత దనన్య ప్రయోజనుడని సువ్యక్త మగుచున్నది.

అట్లయినచో 'రాజ్యం ప్రార్థయమానస్తు బుద్ధిపూర్వ మిహాగతః' అను హనుమంతుని వాక్యమును 'న వయం తత్కులీనాశ్చ రాజ్యకాంక్షీ చ రాఘవః ' అను భగవంతుని వాక్యమును విభీషణుడు రాజ్యకాంక్షచే వచ్చినాడనుట యెట్లు పొసగునను శంక కవకాశమున్నది.

**అహం హత్వా దశగ్రీవం సప్రహస్తం సబాంధవమ్ ।**
**రాజానం త్వాం కరిష్యామి సత్యమేతద్బ్రవీమి తే ॥**

దశకంఠుని ప్రహస్తాదులతోను, బంధుజనులతోను వధించి నిన్నులంకా రాజ్యమునకు రాజుఁగ జేసెదను. ఇందెంతమాత్రము సందేహములేదు. సత్యమునే పలుకుచున్నా ననుట యేల? 'శరీరారోగ్య మర్థంశ్చ భోగాన్ చైవానుషంగికాన్' దదాతి ధ్యాయినాం నిత్య మపవర్గప్రదో హరిః ॥ కాని



మోక్షప్రదాత యగు హరి ఆనుషంగికములగు దేహారోగ్యము. ధనము, భోగములనుగూడ నిచ్చునను న్యాయము ననుసరించి తనకైంకర్యమే ప్రధానఫలముగ నిచ్చుచు రాజ్యాభిషేకాదులైన ఆనుషంగికసుఖములను గూడ నిచ్చునని యెఱుఁగునది. విభీషణుడు–

**రాక్షసానాం వధే సాహ్యం లంకాయాశ్చ ప్రధర్షణే ।**
**కరిష్యామి యథాప్రాణం ప్రవేక్ష్యామి చ వాహినీమ్ ॥**

లంకను జయింప రాక్షసులను వధింప నేను నీసేవలోఁజేరి శక్తికొలఁది సహాయము చేసెదనని వాక్రుచ్చెను. ఇందువలన అనన్యప్రయోజనముగ సేవ చేయు హనుమంతుని వలె విభీషణుఁ డాయా సందర్భములకుఁ దగినరీతిని సేవ చేయుదు నని చెప్పెను.

ఇతడు ధార్మికత్వమును వరముగఁ గోరినప్పుడు మిక్కిలి ప్రీతుఁడగు బ్రహ్మ అమరత్వమునుగూడఁ ప్రసాదించునట్లు కైంకర్యమునేకోరిన శ్రీవిభీషణనకు భగవంతుఁడు కైంకర్యసూచకమగు ఐశ్వర్యమును గూడ ననుగ్రహించెను. కనుక శ్రీరామపాదుకలను ముందిడుకొని శ్రీ భరతుడు దేశములోని వారిని ఆజ్ఞాపించుచుండినట్లు ధర్మసంస్థాపనమునకై అవతరించిన భగవంతునిచే హతమొందని రాక్షసులను సన్మార్గమునకుఁ ద్రిప్పి పరిపాలించు నిమిత్తము నియమించుటచే నిది యాజ్ఞానుపాలమగు కైంకర్యమే యగును. అవతార సమాప్తికాలమున 'యావత్ప్ర జాధరిష్యంతి తావత్త్వం వై విభీషణ! రాక్షసేంద్ర మహావీర్య లంకాస్థ స్త్వం ధరిష్యసి! శాపిత స్త్వం సఖత్వేన కార్యం తే మమ శాసనమ్ ॥ ప్రజా సంరక్షధర్మేణ నోసి త్తరం వక్తు మర్హసి ॥ ఈ ప్రపంచముండు నంత కాలము నీవు మహావీర్యవంతుడవై లంకారాజ్యమును ధర్మమార్గమున పరిపాలింపుము. నీవు నా యాజ్ఞాపరిపాలనము గావించి తీరవలెను. ప్రజారక్షణ విషయమున

నీ వెట్టియాక్షేపము చేయఁదగదని శాసించెను అందుచే నితనికి తమ కులధనమగు శ్రీరంగనాథుని బహూకరించెను. 'మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన। అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥ స్నేహబుద్ధితో వచ్చిన నెట్టివానినిఁ గాని యెన్నడును విడువను, సర్వప్రాణుల కభయమిచ్చుచున్నాను. ఇదియే నా వ్రతమను భగవంతుని వాక్యముచే ప్రపత్తి యనునది సాధారణముగ మోక్షపర్యంత సకల పురుషార్థ సాధన మని యెఱుంగనగును. (విభీషణ శరణాగతిఘట్టము శ్రీమద్రా మాయణమున సారతమ మనుట నిర్వివాదాంశము. అందలియొక్కొక్క యంశము ననేకవిధములుగ ననేక పర్యాయములు విమర్శించి చూచినఁ గాని దాని మహిమ యిట్టిదని కనుఁగొన వీలుకాదు. రావణుఁ డనిన నేడ్పించువాడని, యేడ్చువాఁడనియు నర్థమేర్పడునట్లే విభీషణ శబ్దమునకు రెండర్థము లున్నవని చెప్పవచ్చును. ఎట్లనిన శత్రువులకు (భగద్విముఖులగు వారికి) విశేషభయమును గలిగించు వాఁడనియు, మిత్రులు (భగవదభి ముఖులగువారికి) భయమును బోఁగొట్టువా డనియు నేర్పడుచున్నది. టెంకాయచెట్టులో బుట్టిన టెంకాయ పూర్ణ ఫలమను పేరుతో భగవదర్పణము గావింపబడు మహాభాగ్యమును పొందియున్నది. ఆ చెట్టునుండి పుట్టునట్టి కల్లు దూష్యముగ నెంచఁబడి ఊరిలోపల నుండ ననర్హమని, యూరు బయటనుండి దాని నుపయోగించు వారి శరీరమును బుద్ధిని చెఱచి సంఘదూరులగు నట్లు చేయుట నెల్లరకుఁ దెలిసిన విషయమే. రావణకుంభకర్ణులట్టి రాజసతామస గుణములబొంది లోకనిందితమగు నీచకార్యములుచేసి చెడిరి. అ గర్భముననే జన్మించిన విభీషణు డతి వివేకముగలవాఁడై ధర్మమునే యనుసరించి తన్ను, నితర రాక్షసులను లంకారాజ్యమును గాపాడుటకై అన్నయగు రావణున కెంత మంచిమాట లెన్ని పర్యాయములు చెప్పినను నతఁడు వినకుండుటయే గాక తన్ను



సభలో నవమానపఱచినందున నిష్టములేకున్నను జ్యేష్ఠుని, తన జన్మభూమిని, భార్యాపుత్రాదులను, బంధుమిత్రులను, భోగభాగ్యములను విడిచిపెట్టవలసి వచ్చెను. అతడు వివేకియగుటచే శ్రీరాముని పరత్వమును గ్రహించి నిప్పు సమీపమున నుండువాడు చల్లని నీటితోనిండిన మడుగులో జొచ్చునట్లు నీలమేఘశ్యాము డగు రామచంద్రుని జేరెను. సారాసార విమర్శనము గావించి విభీషణుడు శ్రీరాముని శరణుజొచ్చుట. లోకమున నుండు వారల కెప్పటికి ఆదర్శప్రాయమగుసర్వోత్తమమగు, ధర్మమని చెప్పవలెను. వాలిచే తఱుమబడిన సుగ్రీవుని వలె విభీషణునకు ప్రాణతుల్యు లగు అనుచరులు నలుగురు. అతడేమి చెప్పినను, దేని ననుష్ఠించినను నవియెల్ల నతని యనుచరులకు నన్వయించును. అత డనుష్ఠించిన సాంగమగు శరణాగతియు వారు ననుష్ఠించినట్లే భావింపవలెను. శ్రీరామకైంకర్యమే యతని ముఖ్యోద్దేశము. 'సర్వలోక శరణ్యాయ, అనుటలో రామచంద్రుడు కులమును విద్యను' వృత్తిని గమనింపక శరణాగత రక్షణము చేయువాడని తెలియుచున్నది. ఇందులో శరణ్యుని సౌలభ్యపరత్వములు వెల్లడియగు చున్నవి. 'రాఘవాయ' అనుటచే రఘువంశమే శరణాగత రక్షణమునకు వాసికెక్కినది. ఇక రాముని విషయమై చెప్పనేల?

**'అహం తావన్మహారాజే పితృత్వం నోపలక్షయే ।**
**భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవ ః॥**

అని సోపాధికపితయగు దశరథుని త్యజించి నిరుపాధిక సకల విధబంధువగు రామునే సకలవిధ బంధువుగను, తండ్రిగను గయికొన్న లక్ష్మణునివలె విభీషణుడు స్వజనుల విడిచి రామునే సకలవిధ బంధువుగ భావించుట స్పష్టమగుచున్నది.

**'సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః ॥**

అని లక్ష్మణుడు రాముని శరణుజొచ్చినట్లే విభీషణుడు రామకైంకర్య ప్రాప్తి నుద్దేశించి శరణాగతి ననుష్ఠించెను. 'లక్ష్మణో లక్ష్మివర్ధనః' అని శ్రీరామసేవైశ్వర్యయుక్తుడగు లక్ష్మణు డన్నట్లు 'శ్రీమాన్' అనుటలో రామకైంకర్యమను సంపదతో గూడిన విభీషణుడని యర్థము. సుగ్రీవాది వానరులు తనకు ప్రతికూలురుగ నుండుటను జూచియు విభీషణుడు తనరాకను రామచంద్రున కెఱింగింప గోరుటచే నతడు పురుషకారము శరణాగతి ఫలించుటకు ముఖ్యమైన యంగమని భావించెనని విశదమగు చున్నది. 'ఉవాచ చ మహాప్రాజ్ఞ స్స్వరేణ మహతా మహాన్' మహాప్రాజ్ఞః' క్లిష్టపరిస్థితిలోను బుద్ధి చెదరక పుట్టు బాంధవ్యమునే ముఖ్యమని తలపక ఇంతకాలము తన్నుపెంచి పెద్దజేసినను ధర్మము నెత్తి బహువిధములుగ జెప్పియు నిష్ఫల మగుటచే రావణుని సంబంధము త్యాజ్యమని సర్వశక్తుడగు రామునిసంబంధమే తన కిహపరసాధక మని గ్రహించి శరణు జొచ్చుట విభీషణుని ప్రజ్ఞావిశేషమును దెలుపుచున్నది. 'స్వరేణమహతా' గొప్ప ఆర్తనాదముతో ననగా నింతకాలము తా నెవరి నాశ్రయించి యుండెనో యట్టి యాశ్రయ మింకలేదని చక్కగ నెఱిగి 'నివాసవృక్ష స్సాధూనాం ఆపన్నానాం పరాగతిః' అని ధర్మమార్గ మనుసరించు సాధుస్వభావులకు సర్వవిధముల నాధారభూతుడనియు, ఆపదలోనివారికి పరమగతి యనియు నెఱిగి శ్రీరాముని శరణు జొచ్చెను. గజేంద్రుని యార్తనాదము విని మహా విష్ణు వతివేగముగ వచ్చి రక్షించినట్లు తన స్వరము వినినంతనే రక్షించునను దృఢమైననమ్మకముతో రాళ్ళుసైతము కరగునట్టి ధ్వనితో తన యార్తి యిట్టిదని తెలియచేసినాడు. భగవంతునకు 'ఆ ర్తత్రాణపరాయణుడు' అను బిరుద ముండుటచే భక్తులయార్తనాదము వినినంతనే కాలతామస మొకింతలేక రక్షించుటయే ధర్మముగ భావించు వాడని యేర్పడుచున్నది. 'నివేదయత' తెలుపుడు. 'వాచా ధర్మమవాప్నుహి' ఈ మాట రామునితో



చెప్పినంతమాత్రమున గొప్ప యుపకారము చేసిన ఫలము మీ కగునని యర్థము. మీ జాతి వానరము చేసిన మహోపకార మెట్టిదో చెప్పెదను వినుడు. (ఒక యడవిమార్గమున నొక వృక్షముండెను. దానిలో నొక వానరము నివసించుచుండెను, ఒకనాడొకబాటసారి పులి తన్ను తరుముటచే నా చెట్టెక్కెను. వాడా వానరమును జూచి భయపడగా అది వాని కభయ మిచ్చెను. పులి వానరముతో 'ఆ మనుష్యుని త్రోసివేయుడు. నే నతనిం దిని పోయెదను. లేకున్న సమయము గనిపెట్టి వాడు నిన్ను జంపుననెను. వానర మందుకు సమ్మతింపలేదు. మరల నా వానరము నిద్రించునపుడు పులి వానితో 'నీవా కోతిని పడద్రోయుము, నేను దానిని తిని నాదారిని పోయెదను అనెను. ఆ నీచుడు కృతఘ్నుడై వానరమును ద్రోసెను. గాని అది యొక కొమ్మను బట్టుకొని చెట్టెక్కెను. అప్పటికిని వానర మతనికెట్టి కీడును చేయలేదు.) చూచితిరా? మీ జాతి యెట్టిదో! కనుక నా కింతమాత్ర ముపకారము మీరు చేయవలె ననెను. 'భవంతం శరణం గతః' నిన్నే రక్షకునిగ వరించితిని, 'గోపాయితా భవేత్యేవం గోప్తృత్వ వరణం తథా' 'నీవు రక్షకుడవు గమ్ము' అని శరణ్యుని వేడుటయగును. 'భవద్గతం మే రాజ్యంచ జీవితం చ సుఖాని వై' నా రాజ్యము, జీవితము, సుఖము నీ యందున్నవి అని ఫల సమర్పణము చేయుటచే 'ఫలే స్వామ్య వియుక్తతా! కేశవార్పణ పర్యంతా హ్యాత్మ నిక్షేప ఉచ్యతే. ఫలమునకు తాను స్వామి యగుట విడిచి దానిని విష్ణువునందే యర్పించుట ఆత్మనిక్షేప మనబడును. 'తేనచాస్మ్యవమానితః ' రావణునిచే అవమానింప బడుటచే దైన్యమునొంది కార్పణ్యమను నంగము ననుష్ఠించినట్లగును 'అహమ స్మ్యపరాధానా మాలయోఽకించనో గతిః నే నపరాధముల కాశ్రయమైన వాడను. నేనెట్టి శక్తిలేనివాడను. నాకు నీవేగతి, అన్యులెవరులేరు. త్వమేవోపాయ భూతో మే భవేతి ప్రార్థనామతిః' నీవే నా కుపాయస్థానమున నుండవలెను అనుటప్రార్థనామతి యనబడును. 'క్షిప్రమ్'

వెంటనే. ఆలస్యముగా కాదు. ఏల? 'చంచలం హి మనః' 'చలా హి ప్రాణినాం మతిః'- ప్రాణుల బుద్ధి నిలుకడలేనిది. ఏ క్షణ మెట్లయినను మారును. 'రాఘవాయ' అనుటచే శరణాగతరక్షణమునకు ప్రసిద్ధి చెందిన రఘువంశమును బొగడుట యగును. 'సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే' ఒక్క పర్యాయము నేను నీవాడ నని చెప్పినను రక్షించెద నని కంకణబద్ధుడైన రామునకు దెలుపుడు. 'మహాత్మనే' ఇచ్చట ఆత్మన్‌శబ్దము పరమాత్మవాచకము. త న్నీ రఘుకులమున నవతరింప జేసినవాడు తానే యగునట్టివాడు. 'అహం వేద్మి మహాత్మానం రామమ్' అని విశ్వామిత్రుడు చెప్పినపుడును పరమాత్మ యని భావించియే 'మహాత్మానం' అని ప్రయోగించినాడు. 'వేదాహ మేతం పురుషం మహాంతమ్' అను వేదవాక్యము పరమాత్మయనబడు మహాత్ముడైనవానినే చెప్పుచున్నది. ఆ భావమునే విశ్వామిత్రుడు 'మహాత్మానం' అని చెప్పి యట్టి పరమపురుషుని మహర్షుల వంటివారుదప్ప తక్కిన సామాన్యు లెంతటి పదవిలో నున్నను తెలిసి కొనలేరని చెప్పెను.

విభీషణుని యంగీకరింపరాదని 'ఎంగళ్ కురవినిల్ పుకుదలొట్టోమ్' (మా సంఘములో ప్రవేశింపనీయము) అని సుగ్రీవుడును అంగదాదులు నలుగురును పలువిధములుగ నాక్షేపించినపుడు రామచంద్రుడు సుమనస్కుడై వారి వారి యభిప్రాయముల దెలిసికొనుటయు, హనుమంతుని సహేతుకమగు ప్రతివాదమును విని విభీషణునియందు గుణమే గలదని యతనిని జేర్చుకొనవలెనను తన యభిప్రాయము దెలుపునపుడు సుగ్రీవాది ప్రతికూలుర యొక్క భావ మిద్దియని గ్రహించి తన యందలి ప్రేమాతిశయముచే తనకెట్టి హానియైనను సంభవించునని తలచి వారిట్లు వాదించిరని గ్రహించి తన సర్వశక్తిమత్వమును 'అంగుళ్యగ్రేణ' అని ప్రకటించి కపోత వానర వృత్తాంతములచే సామాన్య జంతువులు, పక్షులు సైతము



శరణాగతరక్షణము చేసినవని చెప్పుచు శాస్త్రప్రమాణము, శిష్టాచారము శరణాగత రక్షణ మవశ్యకర్తవ్యమని దాని ననుష్ఠింపకున్న ప్రత్యవాయ మని కండుమహర్షి గాథను విశదీకరించి వా రెల్లర మనసులలోని సంశయ ముల దీర్చి వారినెల్లరను తగురీతిని యొప్పించి తీవ్రముగ తొలుత మాటి మాటి కాక్షేపించిన సుగ్రీవుడే-

**'మమ చాప్యంతరాత్మాఽయం శుద్ధం వేత్తి విభీషణమ్,**
**అనుమానాచ్చ భావాచ్చ సర్వత స్సుపరీక్షితః ॥**
**తస్మాత్ క్షిప్రం సహాస్మాభిః తుల్యో భవతు రాఘవ ।**
**విభీషణో మహాప్రాజ్ఞ స్సఖిత్వం చాభ్యుపైతు నః ॥**

* రాఘవా! మహాప్రాజ్ఞుడగు విభీషణుని విషయమున నా యంతరాత్మ, యితడు పరిశుద్ధుడే యని చెప్పుటవలనను, నీవును హనుమంతుడును చెప్పిన విషయముల బట్టియు, వీనిని నేను జంపుమనినపుడుగాని నీవు మైత్రి పాటించి వాడు గనుక దిగవిడువనని చెప్పినపుడుగాని వీని ముఖలక్షణ మించుకైన మారకుండుటవలనను వీనిని లోపలను వెలుపలను జక్కగ పరీక్షించియైనది. ఒక్క క్షణమైన విలంబము లేక ఇతనిని మాలో నొక్కనిగ చేకొమ్ము' అని విభీషణునిపట్ల ద్వేషమును ప్రేమగ మాఱునట్లు చేసి యతనినే పురుషకారభూతునిగ గోరినట్లే విభీషణుని గొనిరమ్మని యంగీకరించుటలో శ్రీరాముని ధార్మిక బుద్ధియు, ననుచరుల గౌరవించు విధమును, భిన్నాభిప్రాయముల పరిష్కరించు విధానమును, నెవరి యభిప్రాయమును

---

**నష్టో మోహస్స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥**

అచ్యుతా! నీ యనుగ్రహమున నాకు విపరీతజ్ఞానము నశించినది. యథార్థ వస్తు తత్వజ్ఞానము కలిగెను. సందేహము తొలగినది. సంతోషము గలిగినది. నీ మాట చొప్పున వర్తించెదనని అర్జునుడు చెప్పినట్లే సుగ్రీవుడు చెప్పెననవచ్చును.

నిందింపకయే తన భావమును సప్రమాణముగ జెప్పి మంత్రాలోచన సభను నిర్వర్తించుట వేనోళ్ళ గొనియాడదగినది. అంజలి మైత్రిని సూచించును. ప్రేమను దెలుపును. వినయమును చాటును. అహంభావమమకారములు లేవని వెల్లడించును. గొప్ప శత్రువును రామాదులు బ్రహ్మాస్త్రముచే వధించినట్లు వింటిమి. అవ్యయుడును సర్వశక్తుడునగు భగవంతుని అంజలి ముద్రచే జయింపవచ్చునని యందలి శరణాగతిని తెలుపునని విశదమగుచున్నది. సీతాదేవి రావణునితో 'తేన మైత్రీభవతు తే' అని రామునితో చెలిమి ప్రాణము రక్షించు ననినట్లే 'మిత్రభావేన సంప్రాప్తమ్' అని రామచంద్రుడభయమిచ్చెను. ఒక్క యంజలి సమర్పించుటచే సాంగప్రపత్తి ననుష్ఠించినట్లు భగవంతుడు తలచి మనల రక్షింప సిద్ధముగ నున్నవాడని విస్పష్టమగుచున్నది. ప్రపత్తి ననుష్ఠించుటలో మూడు విధములు గలవు. 1. స్వనిష్ఠ 2. ఆచార్య నిష్ఠ, 3. ఉక్తి నిష్ఠ, 1. స్వనిష్ఠ: విద్యావినయ సంపన్నుడై ఆచార్యుని మూలమున తత్త్వహిత పురుషార్థములు, అర్థపంచక జ్ఞానము గలిగి ఐదంగములతో గూడిన శరణాగతి శాస్త్రమును చక్కగ నెఱిగి వర్ణాశ్రమ ధర్మ కర్మానుష్ఠానపరుడై నిర్వేదము గలిగి యూర్తి పుట్టిన శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠ గల యధికారి ద్వయమంత్రార్థవివరణతో భగవంతుని చరణారనిందములందు తన యాత్మను సమర్పించుట యగును. 2. ఆచార్యనిష్ఠ: శరణాగతుడు సదాచార్యునా నాశ్రయించి–

**'కార్పణ్యదోషోపహతస్వభావః**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**
**శిష్య స్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥**

'గురువర్యా! నేను కార్పణ్యమను దోషముచే స్వభావము చెడినవాడనై సమ్మోహమును బొంది యేమి చేయవలెనో తెలియక నిన్నడుగుచున్నాను.



ఏది మేలో నిశ్చయించి నాకు చెప్పుము. నేను నీ శిష్యుడను. నేను నిన్ను శరణు జొచ్చుచున్నాను. నన్ను శిక్షింపుము. (అనగా దేహాత్మభ్రమయు ఆత్మ పరమాత్మల స్వరూపము తెలియకుండుటయు నను నా లోపముల సవరించి నాకు బ్రహ్మజ్ఞానము గలిగింపుము' అని యడుగుట). ఇందుచే నాకు మోక్షము లభింప జేయు మనుట యగును. అందుల కాచార్యుడు తత్త్వహితపురుషార్థముల స్వరూపమును బోధించి యైదంగములతో ప్రపత్తి ననుష్ఠింపజేసి శిష్యునియాత్మను భగవంతుని చరణారవిందములందు శ్రీమహాలక్ష్మి పురుషకారముతో సమర్పించును. 3. ఉక్తి నిష్ఠ: శిష్యుడాచార్యసన్నిధానము చేరి ఆచార్యుని మూలమున నర్థ పంచకజ్ఞానమును బొంది తత్త్వహితపురుషార్థముల గ్రహించి ఆచార్యుడు చెప్పిన శరణాగతి మంత్రమును తన నోటితో నుచ్చరించి యాచార్యునిమూలమున భగవంతుని చరణారవిందములలో నాత్మభరసమర్పణము చేయుట, ఇట్టి శరణాగతి ననుష్ఠించునపు డుచ్చరింపవలసిన ముఖ్యమగు మంత్రములు రెండు, శ్రీమద్రామాయణమున విభీషణశరణాగతి సందర్భమున–

**'సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥**

అను మంత్రము నుచ్చరింపవలెను. అందులో 'తవాస్మి' నేను నీవాడను –– అనుట సారతమము, ఇట్లే భగవద్గీత శ్రీ కృష్ణుడు పార్థున కుపదేశించిన చరమశ్లోకము–

**'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

భగవంతుడు జీవాత్మను జూచి 'నీవు సకలధర్మముల విడిచిపెట్టినను 'నన్నొకనినే' శరణుజొచ్చుము. నేను నిన్ను సకల పాపముల నుండి

విడిపించెదను. నీవు శోకింపకుము. ఈ రెండును శరణాగతిని దెలుపు మహామంత్రము లని భావింపనగును.

**శ్రుతిస్మృతిర్మమైవాజ్ఞా యస్తాముల్లంఘ్య వర్తతే ।**
**అజ్ఞాచ్ఛేదీ మమ ద్రోహీ మద్భక్తో ౾పి న వైష్ణవః ॥**

శ్రుతిస్మృతులు నా యాజ్ఞలు, వానిలో విధించిన వర్ణాశ్రమధర్మకర్మములను (నిత్యనైమిత్తికములను) స్వరూపత్యాగము చేయక ఫలత్యాగము చేసి 'స్నానం సప్త విధం స్మృతమ్' అని యేడు విధములగు స్నానములును తుల్యమని చెప్పబడునట్లు ప్రపత్తియు భక్తియోగమునకు తుల్యమనుటయు నట్టి ప్రపత్తిపైన వివరించినట్లు మూడు విధము లనుటయు జెల్లును. విభీషణు డనుష్ఠించిన శరణాగతి తనకుమాత్రము గాదు, తనతో వచ్చిన నలుగురికిని కూడ నన్వయించునని గుర్తింపవలెను.

ప్రపన్ను లెన్ని తరగతులవారు? :

భగవద్గీతలో విజ్ఞానయోగమనబడు సప్తమో౾ధ్యాయమున శ్రీకృష్ణు డర్జునుని జూచి.

**న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।**
**మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥**

పాపులును, మూఢులును, నీచులును, మాయచేత జ్ఞానము నశించిన వారును, అసురస్వభావము గలవారు నగు మానవాధములు నన్ను శరణాగతి చేయరు. 1. మూఢులు: (వేదాంత విచారము లేనివారు). 2. నరాధములు: (వినియు తెలియనివారు). 3. మాయాపహృతజ్ఞానులు: (భగవద్విషయములు తెలిసియుండియు శాస్త్రమును నమ్మకుండువారు). 4. అసురస్వభావము గల వారు: (విని తెలిసికొనియు తాము నమ్మక అంతటితో విడువక ఆస్తికులను గూడ నమ్మవలదని బోధించువారు).



కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు మున్నగు వారును, రావణుడును అసురస్వభావముగల నీచులు.

'విభీషణస్తు ధర్మాత్మా న తు రాక్షసచేష్టితః, ధర్మాత్మా రక్షసాం శ్రేష్ఠః' అని స్వభావసిద్ధముగను, వరప్రసాదమునను మహాసాత్త్వికుడును, ధర్మమునే యనుష్ఠించువాడునగు విభీషణుడు మహాప్రాజ్ఞు డగుటచే నాత డనుష్ఠించిన శరణాగతి ఉత్తమశ్రేణికి జెందిన భక్తులనబడు నాల్గుతరగతులవారికి దగినట్టిదని నొక్కి వక్కాణింపదగును.

**'చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినో౾ర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥**

'ఓ అర్జునా! పుణ్యాత్ములగు నాలుగు తరగతులవారు నన్ను భజింతురు. వారెవ రందువా? ఆర్తుడు: (ఆపదలో నుండి నన్ను దలచువాడు). 2.జిజ్ఞాసువు; (జ్ఞానము గోరువాడు), 3. అర్థార్థి: (ప్రయోజనము నుద్దేశించి భజించువాడు), 4. జ్ఞాని: (ఎట్టి ప్రయోజనమును గోరక స్వయం పురుషార్థముగ నన్ను భజించువాడు). ఈ నాల్గు కారణములలో నొక్కదానికై శరణాగతి చేసిన చాలును గాని విభీషణునియందీ నాల్గు కారణములును చేరియుండుట మిక్కిలి యాశ్చర్యము.

**1. ఆర్తుడు:** గజేంద్రుడు మొసలిచే పట్టువడి అనేకదినములు దానితో పోరాడి యిక బ్రతుకు లే దనునట్టి దీనస్థితిలో జగత్కారణవస్తువును పిలిచెను. విభీషణున కట్టి ఆర్తి కలిగినదా యని ప్రశ్నింపవచ్చును. అచ్చట గజేంద్రునకు మొసలికిని దేహసంబంధమగు పోరాటము జరిగి దేహబల మడుగంటి మనసు దిగులుచెంది ఆపద్బంధువును, ఆర్తత్రాణపరాయణుడగు నారాయణుని శరణు వేడెను.

ఇచ్చట రావణునిదుర్మంత్రులతోను, రావణునితోను పలుమారు వాదించి విఫలమనోరథుడై నిండుసభలో నవమానము చెంది

'సంభావితస్యచాకీర్తి ర్మరణాదతిరిచ్యతే' గౌరవింపబడువానికి అపకీర్తి (సభామధ్యమున నవమానించబడుట) మరణముకంటె గొప్పదగుటచే యిక నాలసించిన స్వరూపనాశము, ఆత్మనాశము గలుగుట నిజమని యెంచ వలసిన దీనస్థితికి వచ్చినప్పుడె శ్రీరాముని శరణు వేడెను అనుటచే అతడు ప్రణతుడే, అతనిది యార్తియే. శ్రీరాముడు దానిని పరిహరించువాడే యని తెలిసి యార్తప్రపత్తి ననుష్ఠించినాడని చెప్పవచ్చును.

**2. జిజ్ఞాసువు:** 'జ్ఞాతుమిచ్ఛా జిజ్ఞాసా; బ్రహ్మణో జిజ్ఞాసా బ్రహ్మ జిజ్ఞాసా' బ్రహ్మమును తెలిసికొన గోరుట యని దీనియర్థము. బ్రహ్మశబ్దమున కర్థమేమి? స్వభావముచే అసంఖ్యేయ కల్యాణగుణ గణ పరిపూర్ణుడగు పురుషోత్తముడని తెలియుచున్నది. ఇప్పుడీ కాలమున నీ లోకమున మానవ స్వరూపమున నవతరించియుండు శ్రీరాముడే యట్టివాడని యిదివఱకు వినియున్నవాడు. ఇప్పుడు ప్రత్యక్షమున నతని సందర్శించి ప్రపత్తి ననుష్ఠించి మోక్షపర్యంత ఫలము ననుభవింప గోరినవాడే విభీషణుడు గనుక అతడు జిజ్ఞాసువని చెప్పక తప్పదు.

**3. అర్థార్థి:** ఒక సామాన్య ప్రకృతి సంబంధ భోగభాగ్య మను భవింపవలెనని కోరువాడని యర్థము. 'రాజ్య కాంక్షీ విభీషణః, అనుట చేతను. 'రాజ్యం ప్రార్థయమానశ్చ బుద్ధి పూర్వ మిహాగతః, అనుటచేతను విభీషణుడు జనస్థాన రాక్షస వినాశమును. వాలి వధయు, సుగ్రీవ పట్టాభిషేకమును గూర్చి విని తనకు నట్టి రాజ్యప్రాప్తి కలుగ నవకాశ మున్నదని, దీనిని ఆనుషంగిక లాభముగ నుద్దేశించియు వచ్చి శరణాగతి యనుష్ఠించుటచే నిత డర్థార్థియై వచ్చినాడనియు చెప్ప నొప్పును.

**4. జ్ఞాని:** భగవంతుడు జ్ఞానానందస్వరూపుడు; అతడే సర్వశేషి. ఎల్లర నాజ్ఞాపించువాడు.